
# బాబా అడుగుజాడల్లో

## ఆధ్యాత్మిక ప్రయాణం

## (బాబా తత్త్వ పరిశీలనా గ్రంథం)



ఆంగ్లమూలం

విన్నీ చిట్లూరి

తెలుగు అనువాదం

పీసపాటి రామమూర్తిశాస్త్రి

డాక్టరు ఓరుగంటి ప్రసాద్



23456789

**విషయసూచిక** **పేజి నెం**


ముందుమాట - 6

ధన్యవాదములు - 7

అవతారిక - 8

**మొదటి భాగం**

బాబా ఏకాదశ సూత్రాలు

లేక

పదకొండు వాగ్ధానాలు - 10

మొదటి వాగ్ధానం - 12

రెండవ వాగ్ధానం - 31

మూడవ వాగ్ధానం - 52

నాలుగవ వాగ్ధానం - 62

ఐదవ వాగ్ధానం - 69

ఆరవ వాగ్ధానం - 76

ఏడవ వాగ్ధానం - 84

ఎనిమిదవ వాగ్ధానం - 95

తొమ్మిదవ వాగ్ధానం -112

పదవ వాగ్ధానం -119

పదకొండవ వాగ్ధానం -133

మొదటి భాగం ముగింపు -139

**రెండవ భాగం**


బాబా జ్ఞాన సాగరంలో ఆణిముత్యాలు -140

1. బాబా చిలుం-ఇంద్రజాలం

2. గురుపుష్య అమృత యోగం రోజున దీక్షత్ బాబాను కలుసుకొనుట -143

3. రాధాకృష్ణమాయి తన దైవ సన్నిధానమైన షిరిడి చేరుకొనుట. – 146
4. సంగ్రహమైన ప్రేమ భక్తి స్వరూపమే రాధాకృష్ణమాయి. – 152
5. మనస్సును కఫినీ వస్త్రంలో బంధించుట. – 155
6. ఎంతో విలువైన బాబా ప్రసాదాన్ని బయట పారవెయ్యవద్దు. – 160
7. మనం పుట్టిన క్షణం నుండే బాబా సంరక్షణలో ఉంటాం. – 162
8. వామనరావు తన సద్గురువైన సాయినాథుని చేరుకోగలిగాడు. – 164
9. బాబా రవ్వకేసరి లాంటి దయ చూపెట్టారు. – 167
10. సర్వం ఖల్విదం బ్రహ్మ. – 169
11. సద్గురువును చేరాలంటే అది బాబా కృప వల్లనే సాధ్యపడుతుంది. – 172
12. మాయి ఆధ్యాత్మిక ఖజానాకు తాళం చెవి. – 175
13. మాయి తన ప్రాణశక్తిలో కొంత భాగాన్ని వామనరావుకు దారపోసింది. –177
14. వామనరావు ప్రతిజన్మనీ బాబా గమనిస్తున్నారు. – 180
15. సద్గురువుకు సేవ చెయ్యాలంటే అంకితభావం ఉండాలి. – 182
16. ద్వారకామాయి అంటే బాబాకు, మాయికి చాలా ఇష్టం. – 187
17. అన్ని వ్యవహారాల్లోనూ ఆరితేరిన మనిషి రాధాకృష్ణమాయి – 190
18. బాబా రాధాకృష్ణమాయి తమ కృపను వామరావుకు పంచి ఇచ్చారు. – 193
19. వామనరావు సందేహాలకు శక్తిపాతం ద్వారా సమాధానం చెప్పిన రాధాకృష్ణమాయి. – 195
20. బాబా ముగ్గురు సన్న్యాసుల రూపాల్లో ప్రత్యక్షమగుట. – 198
21. రహతాలో వామనరావుకు కల్గిన వింత అనుభవం. – 201
22. మాయి పరబ్రహ్మంలో లీనమయ్యింది. – 204
23. మాయి పాఠశాల – 208
24. సద్గురు సాయినాథ్ అనశ్వరమైన ఆత్మస్వరూపులు . – 216
25. ఈ విశ్వమంతటికీ కారణం ఓంకారం. – 219

వామనరావు, సాయినాథ్ అనగానే బాబా ప్రత్యక్షమయ్యారు. - 222
27. ఆత్మ సాక్షాత్కారం కోసం తపించేవాడే నిజమైన బ్రాహ్మణుడు. - 225
28. మీ ఆధ్యాత్మిక సంపద చుట్టూ ఒక దడి కట్టండి. - 229
29. భక్తులపైన గల బాబా ప్రేమకు ప్రతిఫలాపేక్షలేదు. - 232
30. పరబ్రహ్మ స్వరూపుడైన బాబాకు శరణాగతులవండి. - 234
31. నువ్వు ఎక్కడ నుండి వచ్చావు? - 236
32.సీతాఫలం - రామాఫలం - 240
33. బడేమియ్యా షిరిడీ పర్యటన - 245
34. బడేమియ్యా కుమార్తె వివాహం జరిగింది. - 248
35. బాబాపై మహాలికి గల వింతప్రేమ. - 250
36. బస్తాల కొద్దీ బంగారం - నీతి కథ. - 255
37. బాబా గోధుమల్ని పిండి చేసారు అనే లీల. - 257
38. గురువు యొక్క గొప్పతనం. - 274
రెండవ భాగం ముగింపు - 278



# ముందుమాట

బాబా చాలా తక్కువగా మాట్లాడుతూ ఉండేవారు. ఎప్పుడూ పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇవ్వడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. ఒకవేళ ఎప్పుడైనా మాట్లాడ వలసివస్తే, ఆ మాటలు మితంగాను, ఎంతోలోతైన ఆధ్యాత్మిక అర్థాలతోకూడుకొన్నవి గాను ఉంటూ ఉండేవి.

నేను చిన్నతనం నుండే బాబా హారతి పాటలు, ఏకాదశ సూత్రాలు (పదకొండు సూత్రాలు) పాడుతూ ఉండేదాన్ని. అప్పుడు వాటిలో గల అంతరార్థం నాకు తెలిసేది కాదు. కాని భావార్థం బోధపడకపోయినా ఆ భాష, శైలి నన్ను ఎంతో ఆకర్షించేవి. నిజానికి ఈ ఏకాదశ సూత్రాలు అన్నవి నాకు తెలిసి సుమారు 60 సంవత్సరాలకుపైనే నేను పాడుతూ ఉన్నాను. కాని మరాఠీ భాషలో వాటికి సంబంధించిన వ్యాసాలు చదివిన తరువాత, ఇంకా దిలీప్ పవార్ గారి ఉపన్యాసాలు విన్న తరువాత వాటికి గల గూడార్థం కొంతమేరకు అర్థం చేసుకో గలిగాను.

పవార్ బాబు అని ఆప్యాయంగా పిలువబడే దిలీప్ పవార్ గారు, బాబా ఏకాదశ సూత్రాలపైన ఉపన్యాసాలు ఇస్తూ ఉండేవారు. అటువంటి చాలా ఉపన్యాసాలు నేను విన్నాను. నిజానికి బాబా ఏకాదశ సూత్రాలపైన బాబా భక్తుల్లో మంచి అవగాహన కల్పించటం అన్నది పవార్ బాబుకు జీవిత లక్ష్యంగా మారింది. ఆ ఉపన్యాసాల సారాంశాన్ని ఇంగ్లీషులోకి అనువదించమని నన్ను పవార్‌బాబు కోరారు. అందుకు నా అంగీకారాన్ని వెంటనే తెలియపరిచాను.

ఈ పుస్తకం మొదటి భాగంలో బాబా ఏకాదశ సూత్రాల్ని ఇంగ్లీషులోకి అనువదించడానికి ప్రయత్నం జరిగింది. లోతైన ఆధ్యాత్మిక రహస్యాల్ని కొంతవరకూ పరిశీలించడం కూడా జరిగింది. ఇది ఒక ఆధ్యాత్మిక ప్రయాణం. ఈ ప్రయాణానికి సాధనాలుగా ఉన్నవి మనకు భగవంతుడు ప్రసాదించిన జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ, అంతఃకరణ చతుష్టయాలు. సాయి భక్తుడు చేరవలసిన గమ్యం షిరిడి అనుకొంటే ఆ ప్రయాణం ఆనందమయంగా సాగడానికి సాయి ఏకాదశ సూత్రాలు, సాయి లీలలు ఎంతో దోహదపడుతూ ఉంటాయి.

ఇంక రెండవ భాగంలో స్వామి సాయి శరణానంద గురించి వివరణ ఉంది. దీనిలో స్వామి శరణానంద షిరిడిలో గడిపిన కాలంలో, ఆయన జీవితంలో జరిగిన విశేషాలు చర్చించబడ్డాయి. బాబా మాటల్లో గల పరమార్థతత్త్వాన్ని స్వామీజీ బాగా ఆకళింపు చేసుకొని విడమరిచి చెప్పేవారు. శ్రీసాయి సచ్చరిత్రలో కూడ ఇటువంటి అనేక లీలలు వర్ణించబడ్డాయి. బాబాను అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానంగా విలువైన పారమార్థిక రహస్యాలు ఎన్నో బయటపడ్డాయి. ప్రతి మనిషి తనను తాను పరీక్షించుకొనుటకు గాను ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది. అందుకొరకు దీనిలో రత్నాల్లాంటి జ్ఞానసంబంధమైన విషయాలు, బాబా ఉపదేశాలు, బాబాతత్త్వం చర్చించబడ్డాయి. మనవ్యవహారిక జీవితంలో, ప్రతిదినం మనకు అవుసరమయ్యే విధానాలు ఎన్నో ఇందులో ఉన్నాయి. ఇవన్నీ మనల్ని సద్గురువు చెంతకు చేరడానికి తద్వారా ఆయన కృపకు పాత్రులమవటానికి దోహదపడతాయి. అందుచేత చదువరులందరూ శ్రద్ధగా ఈ సూత్రాలను పఠించి ధన్యులవ్వాలని నా యొక్క హృదయపూర్వకమైన ప్రార్థన.

## ధన్యవాదములు

సాయి భక్తులకు ఎంతో ఉపయోగకరమైన బాబా తత్త్వ పరిశీలనా గ్రంథం, బాబా ఏకాదశ సూత్రాల ఆధ్యాత్మిక విశ్లేషణ మరాఠీ భాష నుండి ఇంగ్లీషు భాషకు అనువదించడానికి నాకు కల్గించిన ఈ అవకాశానికి పవార్ బాబుకు ధన్యవాదములు.

అలాగే మోహిత్ సునేజా గారికి ఈ పుస్తకం యొక్క ముఖచిత్రం రూపొందించి నందుకుగాను ఎంతగానో ఋణపడి ఉన్నాను.

అలాగే ఈ పుస్తకం తయారీలో ఎంతో సహాయ సహకారాలు అందించిన ఎస్. మనుగుల గార్కి ధన్యవాదములు.

అలాగే ఎంతో మంది సాయి భక్తుల ఉపయోగార్థం ఈ పుస్తకాన్ని ప్రచురించిన స్టెర్లింగ్ పబ్లికేషన్స్‌కు చెందిన ఎస్.కె. గాయ్ గారికి ధన్యవాదములు.

విన్నీ చిట్లూరి.

# అవతారిక

షిరిడి సాయిబాబా సంస్థానంలో ప్రతిరోజు ఉదయం విష్ణుసహస్ర నామపారాయణ అవగానే, సాయి ఏకాదశ సూత్రాల రికార్డు వినిపిస్తూ ఉంటారు. బాబాకు సంబంధించిన అన్ని ఉత్సవ సమయాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సూత్రాల పారాయణ కూడా జరుగుతూ ఉంటుంది. ప్రతిరోజూ బాబాకు హారతి ఇవ్వడం పూర్తి అవగానే ఈ సూత్రాలు పఠిస్తూ ఉంటారు. అక్కడ భక్తులనెవ్వరిని అడిగినా ఈ సూత్రాలన్నీ కంఠోపాఠంగా చెప్పేస్తూ ఉంటారు. అందువల్ల ఈ సూత్రాలకున్న ప్రాధాన్యత ఎంతో మనకు బాగా తెలుస్తుంది. కాని ఒక విషయం మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. సూత్రాలు వల్లె వేసే వారిలో ఎంతమందికి వాటి అంతరార్థం తెలుసు?

ఈ సందర్భంలో నా గురించి నేను చెప్పుకోవాలి. సుమారు 60 సంవత్సరాల నుండి ఈ ఏకాదశ సూత్రాలు నేను పాడుతున్నాను. కాని నాకు వాటి తాత్పర్యం తెలిసింది ఎప్పుడంటే పవార్ బాబు ఉపన్యాసాలు విన్న తరువాతనే అని చెప్పవల్సి ఉంటుంది. ఇంతకు ముందు చెప్పినట్లుగానే పవార్ బాబు అని ఆప్యాయంగా పిలువబడే దిలీప్ పవార్ గారు బాబా ఏకాదశ సూత్రాల అంతరార్థంపై అనేక ఉపన్యాసాలు ఇచ్చారు. సాయి భక్తులందరికీ వాటి తాత్పర్యాన్ని బాగా తెలియ చేయటమే వారి జీవిత లక్ష్యంగా మారింది.

బాబా ఏకాదశ సూత్రాలకు పాడుకొనే బాణీని సమకూర్చిన ఘనత కేశవ్ మోనిరాజ్ పండిట్‌కు దక్కుతుంది. ఆయన సాయి భక్తులలో ప్రముఖులు. అంతేకాక మాల్గాంలో గవర్నమెంటు రెవెన్యూ అధికారిగా పనిచేసి రిటైరు అయిన వారు. అయితే వారు ఈ పాటలలు కూర్పు (Composing) ఖచ్చితంగా ఏ సంవత్సరంలో చేసారో చెప్పలేకపోతున్నాము. ఇంకో విషయం ఈ పాటల కూర్పుకు బాబా అనుమతి ఉన్నదా లేదా అన్నది కూడా తెలియదు. అయితే సుమారుగా 1923సం॥ తరువాత ఇది జరిగి ఉండవచ్చునేమో? ఎందుకనగా గోవింద్ R దభోల్కర్‌గారు శ్రీసాయి

సచ్చరిత్రను అప్పుడే వ్రాయడం జరిగింది. ఈ సచ్చరిత్ర శ్రీసాయిలీలా పత్రికలో ప్రచురించడం జరిగింది. పండిట్‌గారు సూత్రాల పాటల కూర్పు కొరకుగాను శ్రీ సాయి సచ్చరిత్రను బాగా అధ్యయనం చేసారు. ఈ సచ్చరిత్ర బాబా ఏకాదశ సూత్రాల పాటలకు ఒక సూచన గ్రంథంగా ఉండేది. ఈ సూత్రాలే బాబా భక్తులకు ప్రసాదించిన వాగ్దానాలని చెప్పుకుంటూ ఉంటారు. శ్రీ సాయి సంస్థానంలో గల ప్రచురణల విభాగానికి పండిట్ ఒక సభ్యుడుగా ఉండేవారు.

ఇంతేకాక పండిట్, చాలా ప్రముఖంగా పాడుకొనే సాయి నమస్కారాష్టకానికి కూడా పాటల కూర్పును సమకూర్చారు. మొదటి చరణం ఇలా ఉంటుంది.

**అనంతా తులాతె కసేరే స్తవావే**
**అనంతా తులాతె కసేరే నమావె**
**అనంతా ముఖాచా శిణే శేషగాతా**
**నమస్కార సాష్టాంగ శ్రీసాయినాథా!**

దీనికి తాత్పర్యం :

ఓ అనంతా! నిన్ను ఎట్లు స్తుతించవలెను. నీకు ఎట్లు నమస్కరించవలెను. నిన్ను స్తుతించుటకు ఆదిశేషునికే ముఖములు చాలలేదు కదా! ఓ సాయినాథా! నీకు సాష్టాంగ ప్రణామములు అర్పించుచున్నాను.

ఈ నమస్కారాష్టకం మధ్యాహ్న సాయంకాల హారతి సమయాల్లో పాడుతూ ఉంటారు.


# మొదటి భాగము
# బాబా ఏకాదశ సూత్రాలు
# లేక
# పదకొండు వాగ్ధానాలు

బాబా భక్తుల్లో ఎవ్వరికైనా సరే హృదయపూర్వకంగా ఆధ్యాత్మికాభావృద్ధి సాగించాలన్న కోరిక మాత్రం ఉన్నట్లయితే బాబా పదకొండు వాగ్ధానాలన్న టార్చిలైటు తప్పక చేత పట్టుకుని సాధనకు ఉపక్రమించవలసినదే. ఈ దీపపు కాంతి వారి మార్గాన్ని సుగమం చేస్తుంది. దాని ద్వారా వారు నీతి, న్యాయ, ధర్మ మార్గాల్లో జీవితాన్ని గడుపుతూ చివరకు మోక్షమార్గంలో ప్రవేశించి తద్వారా గమ్యాన్ని చేరుకోగలరు. ఆ పరంధామమే షిరిడి అనుకొంటే బాబా మొదటి వాగ్ధానాన్ని వారు స్వయంగా అనుభవంలోకి తెచ్చుకోగలరు. ఈ సాధనాక్రమంలో 11 మెట్లు, 11 దశలు, 11 నిబంధనలు లేక జీవిత గతిని మార్చి వేసే అర్హతలు ఉంటాయి. ఇవన్నీ బాబా పలుకుల్లో దాగి ఉన్న రహస్య ఆధ్యాత్మిక సిద్ధాంతాల్ని బయటపెడతాయి.

ఇక్కడ ఎవ్వరికైనా ఒక ప్రశ్న ఉదయించవచ్చు. బాబా 11 వాగ్ధానాల్నే ఎందుకు చేసారు. అవి 9 గానైనా ఉండవచ్చు లేదా ఇంకో సంఖ్యగానైనా ఉండవచ్చు కదా, బహుసా బాబా దృష్టిలో 5 జ్ఞానేంద్రియాలు 5 కర్మేంద్రియాలు, అంతఃకరణ చతుష్టయ మంతా కల్పి ఒకటిగా చూస్తే అవన్నీ మొత్తం 11 అయ్యాయి. ఏ సాధకుడి సాధనకైనా ఇవే కదా కావాలి. వీటి సహాయంతోటే అతడు తన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రారంభిస్తాడు. అంతఃకరణ చతుష్టయంలో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారమని నాలుగు విభాగా లుంటాయి. అలాగే 5 జ్ఞానేంద్రియాలంటే చెవులు, చర్మం, చూపు, నాలుక మరియు ముక్కు వీటి సహాయంతోటే శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలు అనబడే విషయాల్ని మనిషి గ్రహించగలుగుతాడు. అలాగే 5 కర్మేంద్రియాలు అంటే కాళ్ళు, చేతులు, నోరు, మూత్ర ద్వారం, మరియు పురీషద్వారం. ఎవ్వరికైనా వీటి సహాయంతోనే జీవన యాత్ర సాగుతూ

ఉంటుంది.

బాబా 11వాగ్ధానాలలోని ఆధ్యాత్మిక రహస్యాల్ని తెలుసుకోకుండా ఒక్క పదాల అర్థాన్ని మాత్రం పఠిస్తూ ఉంటే ఎటువంటి ఫలితం ఉండదు సరికదా ఆధ్యాత్మిక ప్రయాణం అనుకొన్నది అసత్యమైపోతుంది. అందుచేత ప్రతి సాధకుడు జాగ్రత్తగా బాబా వాగ్ధానాలపై ఏకాగ్రతతో ధ్యానం చేసి, వాటి అంతరార్థాన్ని గ్రహించడానికి, పదాల భావాలను విడమర్చి పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడు మాత్రమే వాటిని మన జీవన విధానంలో భాగస్వాములుగా చేసుకోగలుగుతాము.



# మొదటి వాగ్ధానం

## షిరిడీశ జ్యాచె లాగతీల పాయె

## తలతీ అపాయ సర్వాత్యాచె!!

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ మొదటి వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది. **"షిరిడీ ప్రవేశమే సర్వదుఃఖపరిహారము"**. దీనినే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. ఎప్పుడైతే సాధకుడి పాదం షిరిడీ నేలను తాకుతుందో అప్పుడే ఆతడి బాధలన్నీ ఫలితంలేనివి అవుతాయి. అనగా బాధానుభవం ఉండదు. అనగా బాధలు లేనివాడవుతాడు. సాధారణంగా తీర్థయాత్రకు వెళ్ళినప్పుడు ఆ స్థలాధి దేవత పాదాలకు ప్రణతులర్పించటం పరిపాటి. అలాగే షిరిడిసాయి పాదాలకు కూడా మ్రొక్కుతాము. భగవత్ స్వరూపమైన ఆమూర్తి పాదాలు పవిత్రతకు, ఆధ్యాత్మికతకు, దైవత్వానికి చిహ్నంగా ఉంటాయి. కాని మన పాదాలకు ఆ అర్హత ఉండదు. ఆ క్షణంలో మనం మంత్ర ముగ్ధులమవుతాము. మన శక్తి యుక్తులన్నీ బాబా పరమౌతాయి. అపురూపమైన ఆ గుణాల వెలితి మన హృదయంలో కనపడుతూ ఉంటుంది. దానికి కారణం మన షిరిడీయాత్రలోని లక్ష్యమే. అనగా ఏవో కోరికల పుట్టలతో మన యాత్ర మొదలవుతుంది. వాటినన్నింటినీ తీర్చే బాధ్యత మనం బాబాపై పెడుతూ ఉంటాము. షిరిడీకి వచ్చే భక్తుల్లో ఏ కొద్దిమందో ఇలా అంటారు, బాబా! నేను అన్నిటా తృప్తి కల్గిఉన్నాను. ఇప్పుడు నాకున్నది చాలు. ఇప్పుడు నేను షిరిడికి వచ్చినది నీ దర్శన భాగ్యానికి మాత్రమే. నీకు జరుగుతున్న సేవలను తిలకించడానికి మాత్రమే. నాకు తెలుసు వేలాది మంది భక్తులు నిన్ను అనేకం కోరుకుంటూ ఉంటారు. నేనూ ఇంతకు ముందు అలాగే కోరుకుంటూ ఉండేవాడిని.

కాబట్టి ఇప్పుడు మనం షిరిడి గురించి చాలా తెలుసుకోవల్సి ఉంది. మనం బాబాను సచ్చిదానందమూర్తి అని ప్రార్థిస్తాము. ఆ విధంగా సత్, చిత్, ఆనంద స్వరూపమైన సాయినాథుడు ఒక్క షిరిడీకే పరిమితమా లేక సర్వ జగత్తును వ్యాపించి ఉన్నాడా? ఎలా తెలుస్తుంది ఈ విషయం? షిరిడీ యొక్క అర్థాన్ని లోతుగా విచారణ చేయవల్సి ఉంది. అప్పుడే మన ఆధ్యాత్మిక ప్రయాణపు గమ్యం ఏమిటో మనకి

బోధపడుతుంది.

చాలా సంవత్సరాల క్రిందట ఇది ఒక చిన్న గ్రామం. అప్పుడు దీన్ని 'షిలాధి' అని కాని 'షిధ్ధి' అని కాని పిలుస్తూ ఉండేవారు. కాలక్రమేణ ప్రజల నోటివెంట ఈ గ్రామం పేరు పలు రకాలుగా మారబడుతూ ఉండేది. కొంతకాలం 'షిధ్ధి' అని, మరికొంత కాలానికి 'షిరాడి' అని పిలుస్తూ రాగా చివరికి ఈ గ్రామం పేరు 'షిరిడి'గా మారింది. శ్రీపాద వల్లభ చరిత్రలో ఈ గ్రామం పేరుని 'ధిషిలానగర్' అని, ఇంకా 'షిలాధి' అని పేర్కొనడం జరిగింది. శ్రీపాదవల్లభ చరిత్ర అనబడే మత ధార్మిక గ్రంథం 1320సం॥లో శంకర్‌భట్ గారిచే రచించబడింది. పైన చెప్పబడిన పేర్లలో 'షిలాధి' అన్నదానికి ఒక ప్రత్యేకమైన అర్ధం చెప్పుకుంటారు. షిలా లేక శిల అంటే కొండ అని లేక కొండ యొక్క గుణాలు కల్గినదని చెప్పవచ్చు. కొండ లేక పర్వతం చాలా గొప్ప విశేషాలు కల్గి ఉంటుంది. అది శాంతికి చిహ్నం. దాని వాతావరణం ప్రశాంతతకి మారుపేరు. అలాగే ధైర్యానికి, బలానికి, ధర్మానికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ కాలంలో కూడా పర్వతాల్ని, పర్వత ప్రదేశాల్ని ఎంతో గొప్పగా కీర్తిస్తూ ఉంటారు. అవి ఇహపరాలకు వారధిలాంటివి. అలాగే జ్ఞానానికి, స్థిరత్వానికి కంచుకోటల్లాంటివి. మందగమనం, కఠినం మొదలైన లక్షణాలు కల్గిన ఆధ్యాత్మిక పురోగతికి పర్వతాలు ఎంతో సహాయకారులుగా ఉంటాయి.

ఇంక 'షిలాధి' అన్న పేరులో 'ధి' అన్న అక్షరం యొక్క అర్థాన్ని విశ్లేషించు కుందాం. సంస్కృతంలో 'ధిః' అంటే బుద్ధి అని అర్ధం. ఇది మనిషికి భగవంతుడు ప్రసాదించిన వరం. బుద్ధిని ఉపయోగించుకొని ప్రతిసాధకుడు మంచి గుణాలను అలవరుచుకోవాలి. ఇంద్రధనస్సు లాంటి శాంతి, ప్రశాంతత, బలము, ధైర్యము, ధార్మికమైన నడవడిక, జ్ఞానము మరియు స్థిరత్వము కల్గి సద్గురువు మార్గదర్శకత్వంలో ఆధ్యాత్మిక ప్రయాణాన్ని సాగించాలి. ఇంత చక్కటి గుణాల సమ్మేళనాన్ని లేక నైతిక విలువలు కల్గిన ప్రవర్తనే సాధకుడిని మిగతా వారి నుండి వేరు చేసి మట్టిలోని మాణిక్యంలా సమాజానికి అందిస్తుంది.

కాబట్టి 'శిల' అన్నపదంలో దాగి ఉన్న ఇంత లోతైన అర్థాన్ని, బుద్ధికి సంబంధించిన

అమోఘమైన గుణాల కలయిక వల్ల దానికి వచ్చిన గొప్పతనాన్ని మనం పదే పదే మననం చేసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. ఇటువంటి మననశీలుడైన సాధకుడు మాత్రమే కఠినమైన ఆధ్యాత్మిక ప్రయాణానికి అనగా షిరిడి ప్రయాణానికి అర్హుడౌతున్నాడు. అందుచేత 'శిలా' అన్న పదమూ, 'ధీ' అన్న పదమూ కలిపి చూస్తే ఇలా ఉంటుంది. అటువంటి సాధకుడు తృప్తి, శాంతి, ప్రశాంతతలను సంపూర్ణంగా అనుభవిస్తూ ఉంటాడు. అంతేకాక చక్కటి గుణగణాలు కల్గినవాడై మంచి చెడులను సులభంగా వేరు చేసి చూడగల్గిన అర్హతను సంపాదిస్తాడు. దీనికి తోడు ఈ సాధకుడికి అపారమైన భక్తి విశ్వాశాలు కూడా ఉండి అద్భుతమైన సాయినాధుని లీలలపై ఆసక్తి ఉన్నట్లయితే, అప్పుడు అతడే తన మార్గాన్ని సుగమం చేసుకోగలడు. అటువంటి సాధకుడే కఠినమైన షిరిడీ ప్రయాణాన్ని (ఆధ్యాత్మిక గమ్యాన్ని) పూర్తి చేయుట కొరకై తగినవాడు అగుతున్నాడు.

**'లాగతీలపాయె'** అనగా ఎవ్వరైతే పై విధంగా ప్రయాణం చేసి వచ్చి పవిత్రమైన షిరిడి నేల మీద పాదం మోపుతారో, అతడి ఆత్మ ప్రేరేపింపబడినదై సత్యాసత్యములను విడదీసి చూడగలిగినదగుతుంది. అప్పుడతడికి అనగా ఆ సాధకుడికి తన సాధనా మార్గానికి కావల్సిన ఆధ్యాత్మిక సామగ్రి లభ్యమౌతుంది. ఈ విధంగాకాక అనగా సాధకుడు గాకుండా ఒక సామాన్య షిరిడీ యాత్రికుడికి దుఃఖ పరిహారం అనుభవానికి వస్తుందా? అది అంత సులభం కాదేమో? సాయినాధుని దయకు పాత్రులవ్వాలంటే, ఏ మనిషైనా నియమ నిబంధనలకు కట్టుబడి తన ప్రవర్తనను సాయికి అనుగుణంగా మార్చుకొనవల్సి ఉంటుంది. ఇలాకాక మనలో ఏ మార్పునకు మనం ఇష్టపడక ఊరకే షిరిడి ప్రయాణం చేసిన వారికి మాత్రం యాత్రాఫలితం శూన్యమే అవుతుంది. మనలోని దుష్టస్వభావాలు ఎప్పటిలాగే ఏ మార్పూ లేకుండా ఉంటాయి. కాబట్టి బాబా మొదటి వాగ్ధానం ఏ ఫలితాన్ని చూపెట్టదు. ఒక్క విషయం గుర్తుపెట్టుకోవాలి. సాయినాధుని కృప సులభంగా దొరికేది కాదు. దానికొర్కై మనం శ్రమించాలి. ఆ శ్రమ ఎలా ఉండాలో 'షిలాధీ' అన్న పదార్ధంలో విపులంగా చెప్పడం జరిగింది. ఆ విధంగా శ్రమించగలిగితేనే సాయినాధుని కృపకు మనం పాత్రులం

కాగలం. అప్పుడదే మన ఆధ్యాత్మిక ప్రయాణానికి నాంది (మొదలు) కాగలదు.

అమెరికాలో మెడికల్ ప్రాక్టీస్ నుండి రిటైరు అయిన తరువాత 1994లో నేను ఇండియాకు తిరిగివచ్చేద్దామని నిర్ణయించుకొన్నాను. అయితే ఇండియాలో నా శేష జీవితాన్ని ఎక్కడ గడపాలి అన్న ప్రశ్న వచ్చింది. నా వరకూ షిరిడీలోనే ఉండాలని అనుకున్నాను. కాని ఇదంతా షిరిడి సాయినాథుని కృప మీద ఆధారపడి ఉందని నాకు తెలుసు. ఏది ఏమైనప్పటికీ నా నిర్ణయాన్ని స్నేహితులతోను, బంధువులతోను పంచుకున్నప్పుడు వారి అభిప్రాయాలు నన్ను చాలా ఆశ్చర్యపరచాయి. మా అమ్మ కూడా షిరిడి సాయి భక్తురాలు. కాని నా అభిప్రాయాన్ని ఆమె ఒప్పుకోలేదు. షిరిడిలో నేను ఉంటే అనేక ఇబ్బందులుపడవలసి వస్తుందని ఆమె అనుమానం. నా స్నేహితులు చాలా మంది నా నిర్ణయానికి ఆశ్చర్యపోయారు. ఇంకా నవ్వుకున్నారు కూడా. అలా అయితే ఒక సంవత్సరం లోపలే నేను మళ్ళీ అమెరికాకు తిరిగి వచ్చేస్తానని కూడా అన్నారు. కాని నా నిర్ణయం మారలేదు. నేను షిరిడిలో ఉండడానికే నిశ్చయించుకున్నాను. కానీ అక్కడి పరిస్థితులు నాకు అనుకూలంగా ఉంటాయా? ఉండవా? అన్న అనుమానం మాత్రం కొంత ఇబ్బందిపెట్టేది. అన్నింటికీమించి నేను షిరిడి ప్రవేశానికి అర్హురాలను ఔనా? కాదా? నా యొక్క ఆధ్యాత్మిక తపన నిజంగా విలువ కలిగినదేనా? అన్న ప్రశ్నలు నన్ను కలవరపెట్టేవి. ఏది ఎలా ఉన్నా షిరిడీ వంటి పవిత్ర భూభాగాన్ని తాకి ఆ భూమిపై నడిచే అర్హత కొరకుగాను నేను తీవ్ర ప్రయత్నం చెయ్యాలని అనుకొన్నాను. ఆ నేల ఎటువంటిది? దివ్యమైన షిరిడిసాయినాథుని పాదధూళిచే పవిత్రం చెయ్యబడింది. అందుచేత 1995లో షిరిడీలో నా సాధనా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను. ఆ ప్రణాళికలో భాగంగా ఒక లక్షా ఇరువది ఐదువేల ప్రదక్షణలు, శ్రీసాయి సచ్చరిత్ర తొమ్మిది వారాలు పారాయణ చెయ్యడం, బాబా నామ జపం చెయ్యడం దీక్షగా పెట్టుకున్నాను. ప్రదక్షణలు పూర్తి కావడానికి నాకు తొమ్మిది నెలలు సమయం పట్టింది. ముఖ్యంగా రాత్రిపూట ఈ ప్రదక్షణలు చేస్తూ ఉండే దానిని. దానివల్ల పగటిపూట నిద్రపోవలసివస్తూ ఉండేది. రాత్రిపూట ఇచ్చే సేజ్ హారతి తరువాత నా ప్రదక్షణలు కొనసాగుతూ ఉండేవి. ఎందుకంటే ఆ సమయం ఎంతో

ప్రశాంతంగా చల్లగా ఉండేది. బాబా దయవల్ల ఇంకా కొంతమంది దేవతల్లాంటి వారు నాకు తోడుగా ఉండేవారు. శ్రీమతి గోండకర్ నేను ఉండడానికి ఆమెకు చెందిన హోటల్లో ఒక గదిని ఇచ్చారు. అప్పటికింకా నేను తీసుకున్న అపార్టమెంటు సిద్ధం కాలేదు. ఆమె సహృదయంతో నాకు భోజనం కూడా పెట్టేవారు. ఆమె హోటల్ పని వాళ్ళని కూడా నాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని హెచ్చరించేవారు. నేను మధ్యాహ్నం పూట పడుకొని ఉండగా వచ్చి నా మంచం ప్రక్కన బల్లమీద భోజనం పెట్టి వెళ్తూ ఉండేవారు. ఒక్కోసారి ఆమె నాకు గదిని కేటాయించలేని పక్షంలో నేను శ్రీమతి జార్జ్ గదిలో ఉండేదాన్ని అలాగే ఇంకోసారి కూడా శివనేశన్ అనే స్వామి, పోస్ట్‌మాష్టారి గారి ఇంట్లో ఉండమనేవారు.

శ్రీసాయి సచ్చరిత్ర పారాయణ జరిగేటప్పుడు ఇద్దరు స్నేహితులు కలిశారు. మా ముగ్గురికీ హోటల్ నుండి భోజనం వచ్చేది. ఆ రోజుకి పారాయణ ముగియగానే మేము నామ జపం మొదలుపెట్టేవాళ్ళం. కనీసం రోజుకి బాబా నామాన్ని 5000 సార్లు ఉచ్చరిస్తూ ఉండేవాళ్ళం. అందునిమిత్తం 5000 పూసలు తెచ్చుకొనేవాళ్ళం. అలాగే బాబాకి జరిగే అన్ని హారతులకు హాజరయ్యేవాళ్ళం. ఇలా ఒక సంవత్సరం గడిచింది. తరువాత నా స్నేహితులు నన్ను వదిలి వెళ్ళవలసి వచ్చింది.

నేను షిరిడిలో ఉందామని నిశ్చయించుకొన్నప్పుడే నాకు అది ఒక కఠిన నిర్ణయమని, రెండంచుల కత్తిపై నడక లాంటిదని తెలుసును. ఎందుకంటే ఒక తీర్థయాత్రా స్థలంలో నివశించడంలో ఉపయోగాలూ ఉన్నాయి, అలాగే ఇబ్బందులు కూడా ఉన్నాయి. నీతి నిజాయితీతో సాధన చెయ్యవల్సి ఉంటుంది. దీన్నే ఇరుకైన మార్గం గుండా చేసే ప్రయాణమని బైబిలు వర్ణించింది. ఒక చిన్న అబద్ధం పలికినా దాని పర్యవసానం చాలా పెద్దదిగా ఉంటుంది. అలాగే అక్కడ మనం చేసే చిన్న దానం కూడా అతిపెద్ద ఆధ్యాత్మిక ఫలితాన్ని కట్టపెడుతుంది.

1996లో నేను తీసుకున్న అపార్టుమెంటు సిద్ధమయ్యింది. అంతవరకూ నేను చాలా ఇబ్బందులు పడవల్సి వచ్చింది. నీరు సరిగా దొరికేది కాదు. అలాగే కరెంటు

కూడా తరుచుగా పోతూ ఉండేది. ఒక్కోసారి రోజుల తరబడి ఉండేదికాదు. పని మనిషి దొరకడం చాలా కష్టంగా ఉండేది. క్రొత్త క్రొత్త హోటళ్ళు రావడం చేత పనివారు అక్కడ పని చెయ్యడానికి పోతూ ఉండేవారు అన్నింటికంటే ఎక్కువ ఇబ్బంది డాక్టరు అందుబాటులో లేకపోవడం. నేను మధుమేహ వ్యాధిగ్రస్తురాలిని. దానివల్ల డాక్టరు అవుసరం నాకు చాలా ఉంది. మధుమేహం అన్నది. ఒక దీర్ఘకాలిక వ్యాధి. దానికి తరుచుగా రక్త పరీక్షలు జరుగుతూ ఉండాలి. ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే అది అనేక ఇతర వ్యాధులకు దారి చూపుతుంది. దానికి సంబంధించిన మందులు తెచ్చుకోవడం ఒక పెద్ద ఇబ్బంది. అలాగే భుజం అప్పుడప్పుడు గడ్డ కట్టినట్లు అయ్యేది. అందు నిమిత్తం ఒక ఫిజియోథెరపిష్టు అవుసరం తరచూ కలిగేది. ఈ అవుసరాల కొరకు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'లోనీ' అన్నపేరు గల ఊరికివెళ్ళవలసి వచ్చేది. ఇంతే కాకుండా నాకు సంబంధించిన కిరాణా సరుకులు ఓట్సు, ఆలివ్ ఆయిలు మొదలైనవి కూడా దొరికేవి కావు. 1996 సంవత్సరం చివరి భాగంలో ఇంక నేను షిరిడి వదిలి వెళ్ళిపోదామా అన్న ఆలోచన కూడా వచ్చింది. దాని ప్రకారం నేను సిద్ధపడుతూ ఉండగా, ఆ రోజు ఎందుకో నాకు చెప్పలేని ఆనందం ఇక్కడే ఉందనిపించింది. ఆరోజు సాయం కాలానికి నా హృదయం శాంతిమయం అయ్యింది. నాకు నిద్ర ముంచుకొచ్చింది. ఒక దుంగవలె నిద్రపోయాను. దగ్గరలో ఉన్న మంగళ కార్యాలయం నుండి వినబడుతున్న సంగీతం కూడా నాకు నిద్రాభంగం కల్గించలేదు. ఆ తరువాత బాబా పంపించిన దేవదూత లాంటి తోడు దొరికింది. ఆమె పేరు సదా. ఆమె నాకు అన్ని పనులు చేసిపెట్టేది. ఇంకా నాలో ఎటువంటి అలజడి లేదు. అంతా సద్దుకుంది. ఇప్పుడు నాకు ఇంకొక చోటికి వెళ్ళి ఉందామన్న ఆలోచన కూడా లేకుండా పోయింది.

ఇదంతా నేను ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, ఈ రోజుల్లో చాలా మంది షిరిడి యాత్రికులు యాంత్రికంగా ప్రవర్తిస్తున్నారు. వారికందరికీ ఈ యాత్ర సెలవులు గడపటానికి గాను అన్నట్లుంది. కాని అది చాలా తప్పు అని వారికి తెలియటం లేదు. షిరిడి ఒక విహారయాత్రా స్థలం కాదు. అలాగే సముద్రపు ఒడ్డున కనపడే విడిదిలాంటిది కాదు. నాకు చాలా బాధ అనిపించే సన్నివేశాలను

నేను షిరిడీలో చూస్తున్నాను. చాలామంది పెద్దవారు, యువకులు, ఇంకా ఆడపిల్లలు చావడి, లెండి బాగ్ మొదలైన ప్రదేశాల్లో నిలబడి అనేక భంగిమల్లో ఫోటోలు తీసుకుంటూ ఉంటారు. అటువంటి పనులకు షిరిడి ఒక కేంద్రం కాకూడదు. అలాగే చాలామంది భగవంతుడి సన్నిధానానికి వచ్చినప్పుడు ఎటువంటి దుస్తులు ధరించాలన్న విషయం గుర్తుంచుకోరు. ఈ మానవ శరీరాన్ని ఎలా అందంగా మలుచుకోవాలి అన్న తపన ఉన్నవారికి షిరిడి ఒక స్థలం కాదు.

నా గురించి నేను పైన చెప్పిన దానికి ఇదంతా ఒక కారణం అయితే ఇకముందు చెప్పబోయేది రెండవ కారణంగా ఉంటుంది. షిరిడీలో ప్రస్తుత పరిస్థితులు ఇలా ఉన్నాయి. కాబట్టి నన్ను ఇలా వ్రాయమని మా గురువు ఆజ్ఞాపించారు. ఆమె కూడా భక్తుల ప్రవర్తనకు ఎంతో నొచ్చుకుంటూ ఉండేవారు. మనందరి సద్గురువు ఆ సాయి నాథుడే, కాబట్టి ఆయన కృపకు మనం పాత్రులం కావాలంటే అందుకు తగిన అర్హతలను మనం కష్టపడి సంపాదించవలసి ఉంటుంది. ఇక్కడ 'కష్టపడి' అన్న మాటకుఎంతో వివరణ ఉంది. 1) బాబా తత్త్వాన్ని బాగా పరిశీలించాలి అనగా అధ్యయనం చెయ్యాలి. 2) ఈ మానవ శరీరానికి విపరీతమైన పోషణ మంచిదికాదు. ఇది ఒక అస్థిపంజరం మాత్రమే అన్న దృష్టి బలపడాలి. శరీరంలో రక్తం పలుచనై నీటి గుణాన్ని పొందిందా అన్నట్లు భావనా వైరాగ్యం పెంపొందించుకోవాలి. అప్పుడు గురు కృప మీపై ప్రసరించడం మొదలవుతుంది. అదే కష్టతరమైన ఆధ్యాత్మిక ప్రయాణానికి మనం సిద్ధపడి ఉన్నాం అన్నదానికి సూచన. ఇటువంటి సాధనా రహస్యాలు మనం మహల్సాపతి నుండి బాగా తెలుసుకోవచ్చు.

నిజంగా మహల్సాపతి గురించి వ్రాయడం చాలా కష్టమైనపని. ఎందుకంటే అతడు సాధారణ భక్తుడు కాదు. అతడు యోగ సంపన్నుడు. బాబాకు తనను తాను అర్పించుకొన్న ధీశాలి. మహల్సాపతి షిరిడి నివాశి, కాని షిరిడి గ్రామ దేవత అయిన ఖండోబాను అర్చించి తిన్ననైన, ఇరుకైన సాధనా మార్గంలో పయనించి ఆ కష్టాన్ని ఖండోబా అర్చన ద్వారా అధిగమించినవాడు. ఖండోబా మందిరంలో మహల్సాపతి ఒక పూజారి. సాంప్రదాయబద్ధమైన పూజా పురస్కారాలు ఒకప్రక్కన క్రమం

తప్పకుండా కొనసాగిస్తూ రోజూ మహల్సాపతి పురాణాన్ని చదవడం మానేవాడు కాదు. ఖండోబా దేవుడి యొక్క చరిత్రే మహల్సాపతి పురాణం. ఆ కారణంచేత ఖండోబాని కూడా మహల్సాపతి అని పిలవడం పరిపాటి అయిపోయింది. ఆ విధంగా పూజారిని కూడా మహల్సాపతి అనేవారు. ఆయన క్రమం తప్పక ఖండోబా ఉపాసన చేస్తూ ప్రతి సంవత్సరం ఒక పల్లకిలో పవిత్ర గోదావరి జలాల్ని ఉంచి భక్తులు వెంటరాగా 'జేజూరి' అనే గ్రామానికి యాత్ర చేసేవాడు.

షిరిడికి వచ్చే సాధుపుంగవులతో సత్‌సంగం చేసే ముగ్గురు ప్రముఖ వ్యక్తులు 1) కాశీరాంషింపి 2) అప్పా జాగ్‌లె 3) మహల్సాపతి. వీరు ముగ్గురూ కలిసికట్టుగా ఉంటూ ముఖ్యమైన సాధువులు దేవిదాస్, జానకీదాస్ మరియు గంగాగిర్ మహరాజ్‌లకు శిష్యులై వారి నుండి ఆధ్యాత్మిక పాఠాలు నేర్చుకుంటూ ఉండేవారు. మహల్సాపతి ఎప్పుడూ హిందూ, ముస్లిం భేదం చూపెట్టేవాడు కాదు. తన సేవల్ని ఇరు వర్గాల వారికి సమానంగా పంచిపెట్టేవాడు. ముఖ్యంగా ఆ కాలంలో కావలసిన హిందూ ముస్లిం సఖ్యత విషయంలో మహల్సాపతి చాలా ముందు చూపు ప్రదర్శించే వాడు. మహల్సాపతికి షిరిడీలో కొంతభూమి ఉండేది. కాని అది వ్యవసాయానికి పనికి వచ్చేది కాదు. చాలా మట్టుకు బీడు ప్రాంతంగా ఉండేది. కాబట్టి అతని కుటుంబ పోషణకు సరిపడిన ఆదాయం ఆ భూమి నుండి వచ్చేదికాదు. షిరిడి కూడా చిన్న గ్రామం అవడం చేత మహల్సాపతి కులవృత్తి అయిన స్వర్ణకార్యం వల్ల కూడా ఆదాయం సరిగా వచ్చేది కాదు. కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ మహల్సాపతి బెదిరిపోయేవాడు కాదు. ఒక్కోసారి భోజనానికి కూడా లేక బాధపడవల్సి వచ్చేది. ఆధ్మాత్మిక సాధనకు ఐశ్వర్యం ఒక అడ్డంకి అని మహల్సాపతి భావన. అందుచేత అతడు బీదరికాన్నే ప్రేమించేవాడు.

ఈ సందర్భంలో నాకు సెయింట్ ఫ్రానిక్స్ ఆఫ్ అస్సిసి గుర్తుకు వస్తున్నాడు. ఇతడు ఇటలీదేశానికి చెందిన తత్త్వవేత్త మరియు ప్రచారకుడు. ఇతడికి ఇతని అనుచరులకు బీదరికం చుట్టంలాంటిది. బీదతనం అంటే వారికి పండుగ. నిరుపేదలు, పశుపక్ష్యాదులు అతడికి బంధువులు. మహల్సాపతి పరిస్థితి కూడా

సుమారు ఇలాగే ఉండేది. ఇతడు కూడా ఎప్పుడూ ధనాన్ని కాని వస్తువులను కాని ఎవ్వరి నుండి ఆశించేవాడు కాదు. అలా తీసుకుంటే అది తన యొక్క దైవ చింతనకు ఆటంకమని భావించేవాడు. ఇంకో విషయం ఏమిటంటే ఎవ్వరి దగ్గరనుంచైనా ఏదైనా తీసుకుంటే తన దైవీ సపంద తరిగి పోతుందని ఆయన భావిస్తూ ఉండేవాడు.

ఇంక సాయిబాబా విషయానికి వస్తే ఆయన తొలినాళ్ళలో అనగా యువకుడిగా ఉన్నప్పుడు అక్కడ గ్రామస్థులకు అర్థంకాకుండా ప్రవర్తిస్తూ ఉండేవారు. అందుచేత వారందరికీ ఆయన ఒక వెర్రి ఫకీరులాగ కనపడేవారు. కాని మహల్సాపతి మాత్రం సాయిని అలా చూసేవాడు కాదు. ఎందుకంటే అతడికి ఉన్మత్త సిద్ధులైన కొంతమంది సాధువుల గురించి అవగాహన ఉంది. అందుచేత బాబా అంటే అతడికి గొప్ప గౌరవభావం. బాబాకు ఉన్న దివ్యత్వం మహల్సాపతి గుర్తించాడు. అందుకే రోజులో ఎక్కువ భాగం బాబాతో గడిపేవాడు. ద్వారకామాయిలో బాబాతో బాటు నిద్రిస్తూ ఉండేవాడు. బాబాకు అంత దగ్గరగా ఉండడం తనకు కల్గిన అదృష్టంగా భావించేవాడు. ఆ కారణం చేతనే ఎవ్వరూ చెయ్యలేని కొన్ని పనులను బాబా మహల్సాపతికి అప్పచెప్పేవారు. ఉదాహరణకి బాబా, మహల్సాపతితో చేసిన ఈ సంభాషణ చూడండి. "నువ్వు కూర్చొని ఉండు. నిద్రలోకి జారవద్దు. నీ అరచేతిని నా గుండెల మీద పెట్టు. నా గుండె కొట్టుకోవడం జాగ్రత్తగా గమనించు. నేను అల్లాను గుర్తు తెచ్చుకుంటున్నాను. దానితోబాటు నామజపాన్ని చేస్తున్నాను. నా గుండె కొట్టుకొనే విధానం ద్వారా నామజపం చక్కగా జరుగుతున్నట్లు నువ్వు గమనించవచ్చు. అది కాని ఒకవేళ తప్పినట్లు, నేను నిద్రకు జారుకుంటున్నట్లు నీకు అనిపిస్తే వెంటనే నన్ను లేపు." అనేవారు. ఇంతవరకూ బాగుంది. అయితే ఇప్పుడు జరిగింది ఏమిటో గమనించండి. బాబా అలా చెప్పగానే సరే నేను సిద్ధం అని మహల్సాపతి బాబా గుండెలపై చేయిపెట్టి బాబా నామజపం గమనించడం మొదలుపెట్టేడు. కొంతసేపటికి అతడి అరచెయ్యి బరువెక్కడం మొదలుపెట్టింది. ఎంత ఆపుకుందామన్నా ఆగక నిద్రముంచుకొచ్చేది. నెమ్మదిగా నిద్రలోకి జారుకునేవాడు. అది గమనించిన బాబా లేచి కూర్చొని ఆతడిని నిద్రలేపేవారు. ఈ ప్రకారం అటు, బాబా కాని ఇటు మహల్సాపతి గాని రాత్రి పడుకొనేవారు

కాదు. బాబా, అల్లా జ్ఞాపకాలతో ఎంతోమంది భక్తులకు సేవలందించే వారు. అలాగే మహల్సాపతి గూడా బాబా యొక్క అల్లా జ్ఞాపకాలను గమనిస్తూ తాను ధన్యుడై ఇతరులను కూడా ధన్యులను చేస్తూ ఉండేవాడు. మహల్సాపతి యొక్క తపశ్చర్య సుమారుగా బాబా యొక్క తపశ్చర్యను పోలి ఉండేది. అందువల్ల ఆ తపఃఫలాలను తన యొక్క నైతిక ఆధ్యాత్మిక జీవన వికాసానికి వాడుకుంటూ ఉండేవాడు. బాబా ఎప్పుడైతే షిరిడీలో నివశించడం మొదలు పెట్టారో ఆ క్షణం నుండి మహల్సాపతి బాబాతో బాటే గడపడం మొదలుపెట్టాడు.

మహల్సాపతి జితేంద్రియుడయ్యాడు. అనగా తన జ్ఞానేంద్రియాల్ని, కర్మేంద్రి యాల్ని, అంతఃకరణ చతుష్టయాన్ని తన అదుపులో పెట్టుకున్న వాడయ్యాడు. ఒక్కొక్కప్పుడు తన ఆకలిని కూడా తన చెప్పుచేతల్లో ఉంచుకొనేవాడు. పక్షం రోజులు ఏమీ తినకుండా గడిపేవాడు. ఇదంతా అత్యున్నతమైన మానసిక స్థిరత్వం వల్ల సాధించినదే అని చెప్పాలి. ఒక సాంప్రదాయబద్ధమైన బ్రాహ్మణుడిగా, ఉపవాస ప్రక్రియ సాధన చేస్తూ ఉండేవాడు. ఇంకా దీనివల్ల అతడి దైవీసంపద వృద్ధి చెందుతుందని ఆతడి ప్రగాఢ విశ్వాసం. ఆతడి ఈ చర్యల మూలంగా అతడి కుటుంబం చాలా ఇబ్బందులు పడవల్సి వచ్చేది. కొంత కాలానికి అతడి కులవృత్తిని పూర్తిగా వదిలిపెట్టి బిక్షాటనపైనే గడపడం మొదలుపెట్టాడు.

ఒక సన్యాసి మాదిరి మహల్సాపతి కూడా సంసారపక్షమైన కామాన్ని జయించిన వాడయ్యాడు. తాత్యాపాటిల్‌తో కల్సి ద్వారకామాయిలో బాబా చెంతనే నిద్రించేవాడు. మానసికంగా, శారీరకంగా సంసారాన్ని త్యజించిన వాడు కాబట్టి ఇంట్లో నిద్రించేవాడు కాదు. ఇంట్లో ఉంటే ఇంటి వ్యాపారాలతోనే సమయం అంతా గడపాలని భయపడేవాడు. 1886లో అతడి ఒక్కగానొక్క కొడుకు మరణించాడు. అతడికి ఇంకా ముగ్గురు కుమార్తెలు కూడా ఉన్నారు. అప్పుడు బాబా ఇలా అన్నారు “అరె!భగత్! ఈ ఫకీరు మాట విను. ఇది ఎంతో సత్యం, నువ్వు ఇల్లు వదిలిపెట్టి ఇక్కడకు వచ్చి పడుకుంటున్నావు. ఇప్పుడు నీకు ఆడపిల్లలు మాత్రమే ఉన్నారు. ఆడపిల్లలు చింతపండు లాంటి వారు. కాని కొడుకు మాత్రం మామిడి పండులాంటి వాడు. నువ్వు ఇంటికి

వెళ్ళు. నీకు తప్పకుండా కొడుకు దొరుకుతాడు. నా మాటలు ఎప్పుడూ అబద్దాలు అవవు. బాబా ఇంతలా చెప్పినా మహల్సాపతికి ఇంటికి పోవడానికి ఇష్టంలేదు. కాని కాశిరాం బలవంతంగా అతడిని ఇంటి దగ్గర దిగబెట్టి వచ్చాడు. అప్పటి నుండి మహల్సాపతి ఇంటికి వెళ్ళడం ప్రారంభించాడు. 1887వ సంవత్సరం జన్మాష్టమి నాడు అతడికి కొడుకుపుట్టాడు. ఇంక కొడుకు పుట్టాక అతడు పూర్వంలాగే ఇంటి వ్యవహారాలు పట్టించుకోవడం మానివేశాడు. ఆ విధంగా మహల్సాపతి కష్టమైన ఆధ్యాత్మిక షిరిడి ప్రయాణాన్ని పూర్తి చేసి గమ్యాన్ని చేరుకోగలిగాడు.

(ఇదంతా నరశింహస్వామి గారు వ్రాసిన సాయిబాబా జీవిత చరిత్ర నుండి గ్రహించబడింది).

ఇటువంటి మహల్సాపతి జీవిత విశేషాలు మనకొక ఉదాహరణగా కనపడుతున్నప్పటికీ ఈ ప్రయాణానికి నిర్ణయించబడ్డ మార్గం చాలా కష్ట సాధ్యమైనదిగా నాకు అనిపిస్తుంది. ఇంతకుముందు చెప్పినట్లుగా గత 60సం॥ల నుండి నేను బాబా ఏకాదశ సూత్రాలు (11 వాగ్ధానాలు) పాడుతున్నాను. మొదట్లో ఆ వాగ్ధానాల అంతరార్థం నాకు బోధపడేది కాదు. షిరిడిలో ఉంటేనే నా బాధలన్నీ పోతాయి అని గాఢంగా నమ్మేదాన్ని. 1996లో నా క్రొత్త అపార్టుమెంటులో ప్రవేశించాను. చాలా ఆనందంగాను, తృప్తిగాను ఉండేది. కాని సంవత్సరం చివర్లో నా ఆరోగ్యం పాడైంది. బాగా అలసట అనుభవించేదాన్ని పరీక్షలు చేయించుకున్నాక మధుమేహ వ్యాధి, బాగా కొలస్ట్రాల్ ఉందని తెల్సింది. నాకు ఆశ్చర్యం వేసింది. మా కుటుంబంలో ఎవ్వరికీ మధుమేహం లేదు. కాబట్టి అందరూ వేరు నేను వేరు అన్న భావం తొంగి చూచేది. చాలా బాధ అనిపించేది. దానికి తోడు సుగర్‌ఫ్రీ వస్తువులు దొరికేవి కావు. అలాగే దానికి సంబంధించిన చిరు ధాన్యాలు కాని, కూరగాయలు కాని ఉండేవి కావు. అందువల్ల నేను కావల్సిన వస్తువుల్ని నాసిక్ నుండి కాని పూనే నుండి కాని తెప్పించు కొనేదాన్ని. కాని బాధ కల్గించే విషయం ఏమిటంటే బాబా ప్రసాదంలో తీపి ఉండేది. అది తినడానికి భయం వేసి తీసుకునేదాన్ని కాదు. ఎవ్వరైనా నా భుజం తట్టి ప్రసాదం ఇస్తే వద్దు అనడాన్ని తప్పుగా భావించేదాన్ని. అంతకు పూర్వం అదే ప్రసాదం కోసం బార్లుతీరి నిలబడే భక్తుల మధ్య నేనూ ఉండి ప్రసాదం స్వీకరించేదాన్ని. ఇప్పుడు పరిస్థితి మారింది. "బాబా ప్రసాదం ముట్టుకోవడానికి అర్హతను కోల్పోయానా?"

అని అనిపించేది. ఈ బాధపడలేక చివరిగా ద్వారకామాయికి పోయి ఏడిచేదాన్ని. 'బాబా! కర్మఫలం అనుభవించక తప్పదని నాకు తెలుసు. కాని ఈ మధుమేహ వ్యాధి షిరిడీలో ఉన్నప్పుడే నాకు ఎందుకు రావాలి? ఇంతకుముందున్న పూనేలో కాని ఇంకొక దగ్గర కాని ఇది ఎందుకు రాలేదు? ఇప్పుడు చెప్పండి. మీ ప్రసాదం విషయంలో నేను ఏమి చెయ్యాలి. ఆ ప్రసాదాన్ని వద్దు అనడానికి నాకు మనసు రావడం లేదు. కాని మీకు తెలుసు డాక్టరు చెప్పినట్లు నడుచుకోవాలని.' కాబట్టి బాబా! ఇప్పుడు చెప్పండి నేను ఎలా నడుచుకోవాలి. మశీదులో ఒక మూల కూర్చుని బాధపడుతూ ఉండగా ఒక వెలుగు నా మీదపడి ప్రసాదం తీసుకోవడం మానవద్దు అని చెప్పినట్లు అయింది. దాన్ని నేను ఈ విధంగా అర్థం చేసుకొన్నాను. ఎవ్వరైనా ప్రసాదం ఇస్తే 'వద్దు' అనవద్దు. తీసుకుని ఆ తరువాత ఎవ్వరైనా పిల్లలకు గాని, బిచ్చగాళ్ళకు గాని, ఏదైనా కుక్కకు గాని పెడితే మంచిది అనిపించింది. ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే మొదట్లో బాబా మొదటి వాగ్ధానాన్ని వాక్యార్థం మేరకే అర్థం చేసుకొనే దాన్ని.

ఈ విషయం కొద్దిగా ఆలోచించండి. మీరు ఒక్కసారి శారీరకంగా షిరిడీని దర్శించి మీ బాధల్ని పోగొట్టుకోగలిగితే, అప్పుడు వేలాదిగా షిరిడి వస్తున్న యాత్రికులందరూ వారి వారి బాధల్ని, కష్టాల్ని పోగొట్టుకోవాలి గదా! ఈ కాలంలో వందల కొద్దీ బస్సులు, రైళ్ళు, కార్లు యాత్రికులను తీసుకుని షిరిడీకి వస్తున్నాయి. అయితే అందరు భక్తులూ వారి వారి కష్టాల్ని తొలగించుకొని ఉండాలి కదా! బస్సు డ్రైవరు, కారు డ్రైవరు, ఆర్టీసి టికట్ కలెక్టరు వారి వారి ఉద్యోగరీత్యా షిరిడీకి రోజూ వస్తూనే ఉంటారు. కానీ వారి వారి కర్మఫలాల్ని వారు అనుభవించక తప్పదు కదా! అలాగే ఎందరో దొంగలు, హంతకులు, మోసగాళ్ళు, ఆడవారిని హింసించే వారు, విపరీత ప్రవర్తన గల వారందరూ షిరిడీకి వస్తూ ఉంటారు. వారందరికీ ఉన్న బాధలు కష్టాలు పోతాయా? మనసులో ద్రోహచింతన గల వారికి, గర్వం, కోపం, స్వార్థం గల వారికి షిరిడి ప్రవేశం ఏదైనా లాభం చేకూరుస్తుందా? ఎప్పటికీ కాదు, లేదు అన్న సమాధానమే వస్తుంది. ఎందుచేత? బుద్ధి పరిపక్వత చెంది సాయి చెప్పిన బాటలో ప్రయాణం చేసి వచ్చినవారికి మాత్రమే సాయి కృప కల్గుతుంది.

ఒక్కోసారి షిరిడి యాత్ర ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్తూ ఉండగా ఘోర ప్రమాదాలు సంభవించి చాలా మంది చనిపోతూ ఉంటారు. బ్రతికిన వారికి కూడా జీవితంలో సరికొత్త కష్టాలు మొదలవుతాయి. వీటన్నింటికి సమాధానం దొరకదు.

శ్రీసాయి సచ్చరిత్ర 13వ అధ్యాయం 11వ పేరాలో ఇలా ఉంది. పరిశుద్ధ ఆత్మస్వరూపులు మరియు పాపరాశి నాశనం కావించబడినవారు నన్ను సత్యంగా ఆరాధించగలరు మరియు నన్ను గుర్తించగలరు.

ఏ సాధకుడైతే బాబా ఆరాధన హృదయపూర్వకంగా చేయగలడో, అట్టివాడు మాత్రమే నిజమైన షిరిడి ప్రయాణానికి అర్హుడౌతాడు. అటువంటి సాధకుల్లో చెప్పుకో దగినవాడు శ్రీధర్ జనార్ధన్ ధిగే. ఆయన ముంబాయి నివాశి. ఒకసారి అతడు తన బాబాయి ఇంటికి వెళ్ళడం జరిగింది. అక్కడ బాబా చిత్ర పటాన్ని చూసి చెప్పలేని ఆనందానుభూతిని పొందాడు. ఆ తరువాత బాబా గురించి చాలా విషయాలు అడిగేవాడు. అతని బాబాయి, బాబా గురించి తనకు తెలిసిన విషయాలన్నింటినీ చెప్పాడు. బాబా యొక్క దైవీ సంపద ఎంతటిదో విడమరిచి బోధించాడు. ధిగేకు ఆధ్యాత్మిక విషయాలు అంటే ఎంతో ఆసక్తి. అందువల్ల తన బాబాయి చెప్పి బాబా సంగతులు అతడి మనస్సులో బాగా నాటుకున్నాయి. ఆ తరువాత అతడు తన గ్రామానికి తిరిగి వచ్చి ఒక పెద్ద ఔదుంబర వృక్షం క్రింద కూర్చుని బాబాకి ఒక ఒక ఉత్తరం వ్రాసాడు. ఆ ఉత్తరంలో తన షిరిడి ప్రయాణం గురించి, బాబాను దర్శించి సాష్టాంగ నమస్కారం చెయ్యాలన్న ఆశ గురించి వ్రాసాడు. ఆ తరువాత అతడు ఆ ఉత్తరాన్ని చక్కగా మడచిపెట్టి భూమిలో పాతిపెట్టాడు. ఆ క్షణం నుండి క్రమం తప్పకుండా బాబా నామ జపం ప్రారంభించాడు. ప్రతిరోజు ఉదయం ఆ చెట్టు క్రింద కూర్చొని బాబాను ధ్యానిస్తూ తన షిరిడి యాత్ర కోరిక సఫలం చెయ్యమని ప్రార్థిస్తూ ఉండేవాడు. కొన్ని రోజులు గడచిన తరువాత అతడి బాబాయి వచ్చి తాను షిరిడికి వెళ్తున్నానని చెప్పి ధిగేను కూడా తనతో బాటుగా తీసుకువెళతాను రమ్మనమని పిలిచాడు. దానికి ధిగేకు చెప్పలేని ఆనందం కలిగింది. వెంటనే బాబాయితో కలిసి షిరిడికి ప్రయాణమయ్యాడు. వారిద్దరూ అలా ద్వారకామాయి చేరుకోగానే బాబా, ధిగే బాబాయిని చూస్తూ నువ్వు నా కొడుకును నీతో తీసుకొని

వచ్చావా? అని అడిగారు. ధిగేకు అర్ధమైంది. తాను వ్రాసిన ఉత్తరం సంగతి బాబాకు తెలిసే ఉంటుంది అనుకుని ఆనంద బాష్పాలు కంటి నుండి రాలుతుండగా బాబా పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసాడు.

ధిగే పవిత్రమైన హృదయంతో తన గురువును దర్శించాలని కోరుకున్నాడు. అదే విధంగా గురువు కూడా అందుకు తగిన అవకాశాన్ని కల్పించడం జరిగింది.

(ఇది సాయిప్రసాద్ పత్రిక 1988 దీపావళి సంచిక నుండి గ్రహించబడింది)

ఇంక మనకి కావలసిన ఒక ముఖ్య సమాధానం “షిరిడి ఎక్కడ ఉంది?” అన్న ప్రశ్నకు తెలియవలసి ఉంది. శ్రీసాయి సచ్చరిత్ర అధ్యాయం 35లో 218, 219 పాదాల్లో సమాధానం దొరుకుతుంది. “సచ్చరిత్ర మార్గము చాలా సులభమైనది, సూటిగా అర్థాన్ని వివరించేది అయి ఉంది. ఈ సచ్చరిత్ర యొక్క పారాయణ ఎక్కడ జరుగుతుందో అక్కడే ద్వారకామాయి ఉంటుందని గ్రహించండి. అలాగే శ్రీసాయి బాబా కూడా అక్కడే ఉంటారు అనడం అతిశయోక్తి కాదు. మరి ద్వారకామాయి ఉండి, సాయి కూడా అక్కడే ఉంటే పవిత్ర గోదావరీ తీరం కూడా అక్కడే ఉంటుంది. అటువంటప్పుడు పవిత్ర భూమి అయిన షిరిడి దానికి దగ్గరలోనే ఉందని చెప్పాలి. ఇన్ని ఉన్నప్పుడు శ్రీసాయిబాబా తనయొక్క పవిత్ర ధుని ప్రభావంతో ఆ ప్రదేశంలో కలిగే విపత్తులను కేవలం తన యొక్క నామస్మరణ మాత్రం చేత పారద్రోల గలుగుతారు.”

ఇటువంటి ఆశ్చర్యకరమైన, అమోఘమైన లీల ఒక దగ్గర జరిగింది. అక్కడ అప్పుడే శ్రీసాయి సచ్చరిత్ర అఖండ పారాయణ ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. నా స్నేహితురాలు మంజుల బెంగుళూరులోని మల్లేశ్వరం సాయిబాబా ఆలయానికి చాలా సంవత్సరాల నుండి వెళ్ళి వస్తూ ఉండేది. ఆమె ఆలయంలో జరిగే అన్ని ఉత్సవాల్లో శ్రద్ధగా వెళ్ళి పాల్గొనేది. 2013వ సంవత్సరంలో విజయదశమి రోజున శ్రీసాయి సచ్చరిత్ర అఖండ పారాయణం చేద్దామని నిశ్చయించుకున్నారు. అక్కడున్న భక్తుందరినీ ఆ పారాయణ నిమిత్తం సిద్ధపరచి ఎవరెవరు ఏఏ అధ్యాయాలు ఎలా చదవాలో జాగ్రర్తగా ఆ పనులు చేసే బాధ్యతను మంజులకు అప్పజెప్పారు. మంజుల నన్ను

అడిగి షిరిడిసాయి అఖండ పారాయణం విధి విధానాలను తెల్సుకుంది. ఎందుకంటే షిరిడీలో జరిగే విధంగానే అక్కడ కూడా జరిపిద్దామని ఆమె అభిప్రాయం. నేను ఆమెకు అన్ని విషయాలు విపులంగా చెప్పాను. అంతేకాక మరాఠీ భాషలో ఉన్న శ్రీసాయి సచ్చరిత్ర 35వ అధ్యాయంలోని మూడు పాదాలు 218, 219, 220 పారాయణ మొదలుపెట్టడానికి ముందుగా చదువమని చెప్పాను. అందుకు మంజుల కూడా అంగీకరించింది. ఆమె అడిగినట్లుగా షిరిడీలో అఖండ పారాయణం ఎలా జరుగుతుందో ఆ విధంగా అక్కడ కూడా జరిగేటట్లుగా అన్ని విషయాలు వ్రాసి ఇచ్చాను. (అవే విషయాలు ఈ అధ్యాయంలో కూడా భక్తుల సౌకర్యార్థం “అఖండ పారాయణ నిమిత్తం ఇవ్వబడిన కొన్ని నిజాలు” అన్న పేరున ఇవ్వబడ్డాయి.)

ఆ ప్రకారం విజయదశమి రోజున మల్లేశ్వరం ఆలయంలో అఖండ పారాయణ జరిగింది. ఊది పేకట్లు, దక్షిణ, భక్తులకు భోజన చీటీలుతోబాటు అందేటట్లు చూద్దామని మంజుల ప్రయత్నిస్తున్న సమయంలో మా ఇద్దరి మధ్య గులాల్ విషయంలో ఒక సంభాషణ జరిగింది. సాయికి సంబంధించిన ఏ ఉత్సవంలోనూ గులాల్ వాడవద్దని నేను చెప్పాను. గులాల్ అంటే సింధూరం గుండ. మహరాష్ట్రంలోని శుభ సందర్భాల్లో ఈ సింధూరం నుదుటన పెట్టుకునే ఆచారం ఉంది. కొంతమంది ఉత్సాహం కొద్దీ ఒకరి మీద ఒకరు దీన్ని జల్లుకుంటూ ఉంటారు. సాయి చరిత్రలో దీనికి సంబంధించిన ఒక ఘటన ఉంది. ఒకసారి శ్రీరామనవమి రోజున సాయి పాల్గొన్న ఉత్సవంలో భక్తులు ఈ గులాల్ జల్లుకుంటూ ఉండగా అది ఎగిరి సాయి కళ్ళల్లో పడింది. ఈ లీల 6వ అధ్యాయంలో ఉంది. బాబాకి చాలా కోపం వచ్చింది. ఎందుకంటే భక్తిపేరుతో ఆడంబరాలకు పోవడం ఒక ప్రదర్శనే అవుతుందని వారి అభిప్రాయం. నేను చెప్పినట్లుగానే ఆ పారాయణ సందర్భంలో గులాల్ ఉపయోగించము అని మంజుల నాకు చెప్పింది.

ఇంక ఆ పారాయణ రోజున జరిగిన సాయి లీల ఇక్కడ చెప్పుకుందాం. ఆ పారాయణ రోజున మంజుల ఒక క్రొత్త నేత చీర కట్టుకుంది. అయితే అక్కడ వెలుగుతున్న దీపాల వల్ల ఆమె చీర వెనక భాగం అంటుకుంది. మంజుల అది ఏ

మాత్రం గమనించలేదు. ఇంతలో అక్కడున్న ఇద్దరు భక్తులు అది చూసి వెంటనే వారి ఉత్త చేతులతో ఆ మంటను ఆర్పడానికి ప్రయత్నం చేసారు. దానితో పెద్ద ప్రమాదం తప్పింది. కాని చీర చాలా భాగం కాలిపోయింది. అక్కడ సాయిలీల ఎలా పనిచేసిందో చూడండి. అంత పెద్ద మంట చీరకు అంటుకున్నా మంజులకు ఏ మాత్రం ప్రమాదం జరగలేదు.

అలాగే ఉత్త చేతుల్తో మంటనార్పిన ఇద్దరి భక్తులకూ చేతులు ఏమాత్రం కాలలేదు. మంజుల ఏమాత్రం భయపడక బాబాపై భారం వేసి ప్రశాంతంగా ఉంది. ఎక్కడ శ్రీసాయి సచ్చరిత్ర పారాయణ చెయ్యబడుతుందో అక్కడ సాయి ఉండి ఎవ్వరికీ ఏ ప్రమాదం జరగకుండా రక్షిస్తారని ఆమెకున్న ప్రగాఢ విశ్వాసం నిజమైంది. ఇంకొక విషయం, ఆ సమయంలో ఆమె చేతిలో ఊది పేకెట్టు ఉంది. ఆ ఊదీనే సాయి రక్షగా భావిస్తూ ఉంటారు. సచ్చరిత్ర 33వ అధ్యాయం, 23వ పాదంలో ఇలా ఉంది. రక్ష, విభూది, ఊది ఇవి మూడు రకాల మాటల వలె కనపడినా వాటికున్న అర్థం మాత్రం ఒక్కటే, బాబా ఎప్పుడూ ఈ విభూదినే ప్రసాదంగా భక్తులకు ఎక్కువుగా పంచిపెడుతూ ఉండేవారు.

ఆ సంఘటన జరిగిన వెంటనే మంజుల ఒక పేకెట్టు విభూదిని తన నోట్లో వేసుకుంది. అప్పుడు ఆ విభూది ఆమెకు తియ్యగా పంచదారలా అనిపించింది. ఆమె కట్టుకున్న చీర పాడైన కారణంగా ఆలయ అధికారులు ఆమెకు మరొక క్రొత్త చీరను అందజేసారు. ఈ సంఘటన వల్ల సచ్చరిత్ర పారాయణకు ఎటువంటి ఆటంకం కలుగలేదు. అందరూ ఎంతగానో సంతోషించారు. ఆ ఘటన చూసిన వారందరూ మంజుల ప్రశాంత ప్రవర్తన గురించి ప్రశ్నించారు. ఇంతకుముందు ఒకసారి మంజుల తల్లికి గూడ ఇలాగే అగ్నిప్రమాదంలో గాయాలు అయ్యాయి. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంజుల 35వ అధ్యాయంలో గల మూడు పాదాలు చదివి వినిపించింది. అందుచేత అక్కడ ఉన్న వారందరికీ బాబాయే సచ్చరిత్ర పారాయణ జరిగిన స్థలంలో ఉండి ఆపదల నుండి రక్షిస్తున్నారని తెలిసింది.

## అఖండ పారాయణ నిమిత్తం ఇవ్వబడిన కొన్ని నిజాలు

షిరిడీలో అఖండ పారాయణ జరగడానికి ఒక రోజు ముందుగా అందులో పాల్గొన్న భక్తులు వారి పేర్లను చీటీలపై వ్రాసి ఇస్తారు. ఆ చీటీలన్నీ ఒక పెట్టెలో వేస్తారు. తరువాత ఒక పిల్లవాడు కాని, ఒక భక్తుడు కాని ఆ పెట్టెలో ఉన్న చీట్లలో నుండి 53+5 గా తీసి పెడతారు. 53 చీట్లు 53 అధ్యాయాలకి సంబంధించినవి. మిగతా 5 చీట్లు ఎవ్వరైనా పారాయణకు హాజరు కాని పక్షంలో ఉపయోగపడడానికి ఉంచుతారు. ఆ ప్రకారం 53 మంది భక్తులు వారికి తగిన అధ్యాయాలను చదువవలసి ఉంటుంది. సంస్థానం కార్యాలయం, మిగతా ప్రదేశాల్లోను భక్తుల పేర్లు, అధ్యాయం సంఖ్య తెలిపే గోడ పత్రికలను ఏర్పాటు చేస్తారు. అంతేకాక ముందు రోజు సాయంకాల హారతి తరువాత వారి పేర్లను లౌడు స్పీకర్‌లో కూడా చదువుతారు.

ఇంక పారాయణ రోజున తెల్లవారుజామున సుమారు 6గం॥లకు సమాధి మందిరం నుండి సచ్చరిత్ర గ్రంథము, బాబా చిత్ర పటం, ఒక వీణ తీసుకువస్తారు. దానికి ముందు బాబా మందిరంలో ప్రత్యేకమైన నమస్కార కీర్తన పఠిస్తారు. "శ్రీమత్ శ్రీ గురుదేవ దత్తా..." అని సాగుతుంది ఆ కీర్తన. తరువాత భక్తులందరూ నుదుటన గులాల్ అద్దుకుంటారు. అక్కడ నుండి అందరూ ఆనందోత్సహాలతో సచ్చరిత్ర గ్రంథాన్ని ద్వారకామాయికి తీసుకువస్తారు. ఆ ఊరేగింపు మార్గం ఇలా ఉంటుంది. సమాధి మందిరం దగ్గర నంది స్థలం గుండా బయటకు వచ్చి, మందిరం వారగా గురుస్థానం చేరుతారు. అక్కడ కాసేపు ఆగి దీక్షిత్‌వాడా ముందు భాగానికి వస్తారు. అక్కడ సచ్చరిత్రను పట్టుకొస్తున్న భక్తుడికి, అలాగే వీణను పట్టుకొస్తున్న భక్తుడికి పాదపూజ నిర్వహిస్తారు. ఆ తరువాత బాబా చిత్రపటం పూలమాలతో అలంకరించి పూజలు చేస్తారు. తరువాత అనుచర బృందం, మారుతీ మందిరం ముందునుండి సాగి చివరకు ద్వారకామాయి చేరుతుంది. దీని ద్వారా పవిత్ర స్థలాలకు ప్రదక్షణ కూడా పూర్తి అయినట్లు భావించవచ్చు. ఊరేగింపు దారి పొడువునా సాయి హారతి పాట "షిరిడి మాజే పండరి పురా..." సంగీత వాయిద్యాల మధ్య పాడుతూ ఉంటారు.

ద్వారకామాయి ముఖద్వారం దగ్గర అరటి చెట్లు కట్టి అలంకరిస్తారు. పారాయణ చేసే చోట వెండిరేకుతో చేయబడిన ఫ్రేమ్ ఉంది, అక్కడే బాబా చిత్రపటం ఉంచుతారు. వెండిఫ్రేమ్‌కు రెండు ప్రక్కలా కూడా చిన్న అరటి చెట్లు నిలబెడతారు. అక్కడ పూజారి కూర్చొనడానికి ఒక బల్ల ఉంటుంది. ఇంక పారాయణ చేసే భక్తులు కూర్చొనడానికి చిన్న చిన్న పీటలుంటాయి. అప్పుడు ఊరేగింపు సాయి కీర్తనలు పాడుకుంటూ ద్వారకామాయి గర్భాలయం చేరుకుంటుంది. బాబా చిత్ర పటాన్ని వెండి ఫ్రేమ్ మధ్యన నిలబెడతారు. ఆ పటాన్ని పూలతో అలంకరించి లాల్‌కారి పఠిస్తారు. ఆ తరువాత హారతి "షిరిడి మాజే పండరిపురా..." పాట పాడుతారు. ఈ రోజుల్లో వీణను ద్వారకామాయి దగ్గర గల చిత్రపటం వద్ద ఉంచుతున్నారు. కాని పూర్వపు రోజుల్లో మాత్రం వీణ చేతబట్టుకున్న భక్తుడు సభామండపం మధ్య స్టేజి మీద నిలబడేవాడు. అతడి చుట్టూ పారాయణ చేసే భక్తులందరూ నిలబడి నృత్యం చేస్తూ కీర్తనలు పాడేవారు. ఎంతో మనోహరంగా ఉండే ఈ సాంప్రదాయాన్ని 'పహారా' అనేవారు. కాని ఈ రోజుల్లో ఇటువంటి కార్యక్రమం జరగడం లేదు. బాబా పూర్వపు చరిత్ర కనుమరుగవకుండా ఉండేందుకుగాను ఈ విషయాన్ని ప్రత్యేకంగా ఇక్కడ వ్రాయడమైంది.

ఇక్కడ 'పహారా' అన్న మాటకు కావలి కాయుట అన్న అర్థం వస్తుంది. అయితే ఈ కావలికాయుట దేనికి? అని ప్రశ్నించుకుంటే దానికి గల లోతైన అర్థం ఈ విధంగా ఉంటుంది. శ్రీసాయి సచ్చరిత్రను పారాయణ చేసే సాధకుడు తనయొక్క అంతఃకరణ చతుష్టయం పనిచేసే తీరును గమనించడం అని చెప్పవచ్చు. మనలో చెడు తలంపులు రాకుండా ఉండడానికి ఈ పారాయణం దోహదం చేస్తుంది. బాబా కూడా ఆ ప్రదేశంలో అంతర్యామిగా ఉంటూ భక్తుల మనోభావాలకు కావలి కాసి శుద్ధి చేస్తూ ఉంటారు. కాబట్టి సచ్చరిత్ర పారాయణ అన్నది యాంత్రికంగా చేసేది కాదు. ఇది ఆధ్యాత్మిక ప్రయాణానికి ఒక మార్గదర్శిలాంటిది. ఇది చదవడానికి సులువు అనిపించినా అభ్యాసానికి కఠినమైంది అని గుర్తుపెట్టుకోవాలి.

ఒక భక్తుడు తనకు కేటాయించిన అధ్యాయం చదువగానే, అతడికి ఒక

కొబ్బరికాయ ఇస్తారు. ఆ తరువాత వరుసలోని భక్తుడు వచ్చి అతడి స్థానంలో కూర్చుని పారాయణ మొదలుపెడతాడు. ఈ విధంగా పారాయణా కార్యక్రమం కొనసాగుతుంది. ఆ రోజు రాత్రంతా ద్వారకామాయి తలుపులు తెరచే ఉంటాయి. ఆ మరునాడు ఉదయం తిరిగి బాబా చిత్రపటం, సచ్చరిత్ర గ్రంథం, వీణ తీసుకువచ్చి సమాధి మందిరంలో ఉంచుతారు. ఆ విధంగా తీసుకువస్తున్నప్పుడు అనుచర బృందమంతా ద్వారకామాయి నుండి బయటకు వచ్చి, గురుస్థానం దగ్గర ఉన్న ఇనుప తలుపులు దాటి ప్రధాన ముఖద్వారం గుండా సమాధి మందిరంలో ప్రవేశిస్తారు.

శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణ చేయడమన్నది ఒక తపస్సులాంటిది. ఇంకా అది బాబాను కొలిచే ఒక ప్రత్యేకమైన పూజా కార్యక్రమం. అమితమైన విశ్వాసంతో బాబా యొక్క కీర్తనలు ఆలపిస్తూ పారాయణ పూర్తి చేయబడిన ఆ స్థలం ప్రపంచంలో ఏ మూలనైనా ఉండవచ్చు. అక్కడ బాబా నామసంకీర్తన జరుగుతుంది. బాబా లీలలు కథలు కథలుగా చెప్పుకోబడతాయి లేక పాడబడతాయి. అటువంటి స్థలం ఎక్కడున్నా సరే దాని పేరే ద్వారకామాయి. దానికి అతి దగ్గరగా ఉన్న ప్రదేశమంతా షిరిడి అని ఎంచబడుతుంది. ఇంక అటువంటి స్థానంలో, బాబా ప్రతిష్ఠితమై ఉంటారు అనడంలో ఎటువంటి సందేహం ఉండనక్కరలేదు. ఆయన తప్పక బాధల్ని, కష్టాల్ని పోగొడతారు. బాబాయే తలుచుకుంటారు కాబట్టి ఆ బాధలు, కష్టాలు కనుమరుగవుతాయి. సాధకుడు ఒకవేళ పూర్వ జన్మల దుష్కృతం వలన పాపాలు మూట గట్టుకున్న వాడైనా సరే ఏమి భయం? ఇప్పుడు సరైన మార్గంలో షిరిడి యాత్రకు పూనుకున్నాడు కదా! ఇప్పుడతడు పవిత్రమైన ఆధ్యాత్మిక మార్గం కష్టమైనదైనప్పటికీ వెనుదిరగడు. అందువల్ల, అనగా అంతటి స్థిర నిశ్చయం ఉండడం వల్ల అతడి జీవితం ప్రశాంతంగాను, నిర్మలంగాను, ధర్మబద్ధంగాను ఉండి అతడి సాధన సులువుగా సాగడానికి తోడ్పడుతుంది.

# రెండవ వాగ్ధానం

**మాజా సమాధిచి పాయరీ సహేలా**
**దుఃఖహే హరేలా సర్వా త్యాచె!**

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ రెండవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది. **"ఆర్తులైననేమి నిరుపేదలైన నేమి ద్వారకామాయి ప్రవేశమొన రించునంతనే సుఖసంపదలంద గలరు."** దీనినే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. ఎవరైతే నా సమాధి మందిరం యొక్క మెట్లు ఎక్కుతారో వారు దుఃఖములను జయించిన వారవుతారు.

భాషాపరంగా దీని వాక్యార్థమే అన్ని ఫలితాలనూ ఇస్తుందనుకుంటే కొన్ని లక్షల మంది భక్తులు షిరిడీకి పరుగులుపెట్టి సమాధి మందిరం మెట్లను ఎక్కడానికి క్రింద మీద పడేవారు. దీనివల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయి. కొట్లాటలు, త్రొక్కిస లాటలు మొదలైనవి జరిగి ఎంతోమంది ప్రాణాలకే ముప్పువాటిల్లుతుంది. ఇలాంటి ప్రమాదమే 2005లో జరిగింది. అదే, మంధరాదేవి ఆలయంలో జరిగిన త్రొక్కిసలాట. అప్పుడు చాలా మంది చనిపోవడం జరిగింది. (ఈ మంధరాదేవి ఆలయం సతారా జిల్లా, మహారాష్ట్రలో సముద్రమట్టానికి సుమారు 4500 అడుగులు ఎత్తులో ఉన్న పర్వత ప్రాంతంపై ఉంది).

బాబా శారీరకంగా అందరి మధ్యా తిరుగుతున్నప్పుడు ఏ రకమైన ఉన్మత్తస్థితిలో గాని సమాధి స్థితిలో గాని ఉంటూ ఉండేవారు కాదు. ఈ విషయం గురించి బ్రిటిష్ రచయిత ఆర్థర్ ఓస్‌బార్న్ తన పుస్తకం "ది ఇంక్రెడిబిల్ సాయిబాబా" 1956లో ఇలా వ్రాసారు.

"సాయిబాబాకు ఇతర సాధువులకు మధ్య ఒక చెప్పుకోదగ్గ విషయం నాకు కనపడింది. నేను చాలా మంది సాధువులను చూసాను. వారందరూ చాలాసేపు సమాధి స్థితిలో ఉండి, అప్పుడప్పుడు బాహ్య ప్రపంచంలోకి వస్తూ ఉండేవారు. అలా

వచ్చినప్పుడు తనను కలిసిన వారి మనసులో ఏముందో చెప్పి, అడిగిన ప్రశ్నలకు సమాధానం చెపుతూ ఉండేవారు. కాని సాయిబాబా అలాకాదు. ఆయనకు ఏదైనా విషయం దీర్ఘంగా ఆలోచించడానికి గాని, దేనినైనా అనగా ఇంద్రియాతీతమైన గొప్ప జ్ఞానం సంపాదించడానికి గాని సమాధిలోకి వెళ్ళవలసిన అవుసరం ఉండేది కాదు. జాగ్రదవస్థలోనే ఆయనకు రెండు రకాల ఎరుకలు పనిచేస్తూ ఉండేవి. అనగా ప్రపంచం గురించి బాహ్యంగాను, పరమాత్మ గురించి అంతరంగంలోను సంపూర్ణమైన ఎరుక కనబరచేవారు. మిగతా సాధువులు లోపలికి బయటకు వస్తూపోతూ ఉండేవారు. వారికి లోపలి చూపు సమాధి. బయట చూపు ప్రపంచం. కాని బాబా మాత్రం లోపలా బయటా ఒకే రకమైన చూపు ప్రదర్శించేవారు.

కాబట్టి దీనివల్ల మనకు అర్థమైన విషయం ఏమిటంటే బాబా ఎప్పుడూ కూడా సమాధి స్థితిలోకి వెళ్ళడం జరుగలేదు. దీనికి నిదర్శనం ఆయన 5వ వాగ్దానంలో ఉంది. నేను అమరుడను అని ప్రకటించారు. ఇది ఒక నగ్న సత్యమైన మాట. అంతేకాక ఈ అమరత్వం యొక్క అనుభూతి సాధనకు అందే విషయమే అని కూడా ప్రకటించారు.

అయితే మరి 'నా సమాధి మందిరం మెట్లు ఎక్కండని' ఎందుకన్నట్లు? దాని అర్థం ఆధ్యాత్మిక పరంగా చూస్తే బాబా నామ జపం విడవకుండా చేయడమని తెలుస్తుంది. ఆయన నామంపై ధ్యానం అనగా సర్వకాల సర్వావస్థల యందు ఆ నామాన్ని గుర్తెరిగి ఉండడమే. నవ విధ భక్తి మార్గాల్లో ఈ రకమైన స్థిరమైన భక్తి మాత్రమే మొదటి స్థానంలో ఉంటుంది. బాబా చెప్పిన నవవిధ భక్తి మార్గాలు ఇలా ఉంటాయి. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనం. వీటిలో ముఖ్యమైనవి శ్రవణం, కీర్తనం, స్మరణం, వీటి గురించి ఇంకా విపులంగా తెలుసుకుందాం.

**శ్రవణం:**

ఈ శ్రవణం గురించి బాబా సచ్చరిత్ర యొక్క రెండవ అధ్యాయం 198

పాదంలో బాగా వివరించారు. శ్రవణమంటే బాబా సచ్చరిత్రను ఎవ్వరైనా గట్టిగా చదువుతూ ఉంటే శ్రద్ధగా వినడమే. దబోల్కర్ ఇలా చెప్పేవారు. "సాయి యొక్క కృపవల్లనే ఎవరైనా గట్టిగా సచ్చరిత్రను చదువుతున్నప్పుడు మనం వినగల్గుతున్నాం. దీనినే శ్రవణభక్తి అంటారు. ఈ ఒక్క శ్రవణభక్తి వలన మాత్రమే భయంకరమైన సంసార తాపత్రయం నుండి తప్పించబడతాము. ఇంకా క్రూరమైన పాప పంకిలంతో కూడిన కోరికలు రేకెత్తించే ఈ కలియుగపు చేష్టలు నాశనమవడానికి సచ్చరిత్ర శ్రవణమే సాధనము. (ఈ కలియుగం యుగాల వరుసలో నాల్గవది. ఇది ఇనుపయుగం. ఇంకా దుష్ట సాంప్రదాయాలకు విపరీతమైన చెడు అలవాట్లకు నిలయమైంది.)

మనం మన జీవితాలను సమతాభావనతో గడపటం లేదు. ఏం చేస్తున్నామంటే ఎప్పుడూ భయాందోళనలతో మనం జీవిస్తున్నాం. ప్రతి రోజు దుఃఖము, భయము మనలను పీడిస్తున్నాయి. చిన్నచిన్న విషయాలు సైతం ఒక్కొక్కసారి పెద్ద పెద్ద సమస్యలై మనలను కృంగదీస్తూ ఉన్నాయి. ఉదయం నుండి రాత్రి వరకూ మనం ఇటువంటి గడబిడ ఆలోచనలతోటే కాలక్షేపం చేస్తున్నాం. నేను ఎప్పుడు ఒక టి.వి. కొనుక్కుంటాను? నేనెప్పుడు ఒక కారు కొనగలను? నా కొడుకు బాగా చదువుకొని డిగ్రీ పాసై ఇంకా పెద్ద చదువులకు గొప్ప కాలేజీల్లో చేరగలడా? నా కూతురుకి మంచి పెళ్ళి కొడుకు దొరుకుతాడా? వైభవంగా మా పిల్ల పెళ్ళి నేను చేయగలనా? నాకు ఉద్యోగంలో ప్రొమోషన్ ఎప్పుడు వస్తుంది? నేను బాగా డబ్బు సంపాదించగలనా? ఎప్పటికైనా నేను ఒక బంగళా కొనగలనా? ఇవన్నీ ఇలా ఉంటే చివరికి ఒక పిరికి ఆలోచన కూడా వచ్చి మనసుని ఇలా దొలిచివేస్తుంది. నాకు ముసలితనం వస్తే నా పిల్లలు నన్ను ఆదుకుంటారా? లేదా?

మన మనస్సే మనల్ని భయపెడుతూ ఉంటుంది. ఎందుకంటే ఇటువంటి పనికిమాలిన ఆలోచనల్లకు అది కేంద్రమై కూర్చొంది. ఇక్కడ ఒక ముఖ్య విషయం గుర్తుపెట్టుకోవాలి. మనకు ఒక సద్గురువు లభించి మన జీవితాన్ని ఆయన చేతుల్లోకి తీసుకున్నప్పుడు, మనకిక భయమెందుకు? మనం చెయ్యవలసిందేమిటంటే మన జీవితంలోకి సద్గురువును ఆహ్వానించడమే. అలా మనలో ప్రవేశించిన సద్గురువు మన

మనస్సును తన ఆధీనంలోకి తీసుకుంటాడు. అప్పుడు మనకి వేరే ఆలోచన్లు రాకుండా ఒక్క సద్గురువునే ఎప్పుడూ ధ్యానిస్తూ ఉంటాం. దానివలన పిచ్చిపిచ్చి ఆలోచన్లకు స్థలం దొరకక పలాయనమవుతాయి. సద్గురువు యొక్క వెలుగు మన ఇంట్లో ప్రవేశించగానే చీకటికి ఇక తావెక్కడుంటుంది. అదే విధంగా మన అందరి జీవితాలు సద్గురువనే కాంతితో నిండిపోతాయి.

ఒక్క విషయం బాగా గుర్తుపెట్టుకోవాలి. సద్గురు సాయినాథుని కృప మనపై ప్రసరించాలంటే సాయి సచ్చరిత్ర తప్పక చదవడం అన్నది ఒక తప్పనిసరి కార్యక్రమం. అప్పుడే మనందరం భవబంధ భయం నుండి బయటపడగలం. అదే ఈ కలియుగంలో మనచే చేయబడిన పాప పంకిలాన్ని నాశనం చెయ్యగలదు. అందుచేత సచ్చరిత్ర పారాయణే ఒక తపస్సుగా భావించాలి.

సాయి సచ్చరిత్ర మనసులో చదువుకోకుండా గట్టిగా బయటకు వినపడేటట్లు చదవడం అన్నదానికి చాలా ప్రాముఖ్యత ఉందని సాయి ఉద్దేశ్యం. షిరిడిలో ప్రతిరోజు ఎవరో ఒకరు సత్‌గ్రంథాలు, ప్రముఖ మత గ్రంథాలు ఏదో ఒక సమయంలో చదువుతూ ఉంటారు. అదే ప్రకారం బాబా జోగ్‌ను సంత్ 'జ్ఞానేశ్వరి'ని చదువమని చెబుతూ ఉండేవారు. అలాగే జోగ్ ప్రతిరోజు ఉదయం జ్ఞానేశ్వరిలో ఒక అధ్యాయం చదువుతూ ఉండేవాడు. ప్రతిరోజు ఉదయం పూట జోగ్, అతని భార్య ద్వారకామాయికి వెళ్ళి బాబాకు ఫలహారం ఇచ్చేవారు. ఆ ఫలహారం బాబా తినిన తరువాత జోగ్ ఇంటికి తిరిగివచ్చి ఆ రోజుకు సంబంధించిన 'జ్ఞానేశ్వరి' అధ్యాయాన్ని చదివేవాడు. ఒకసారి 'పన్సారె' అనే పేరుగల భక్తుడు షిరిడికి వచ్చాడు. జోగ్, పన్సారె స్నేహితులయ్యారు. ఒకరోజు జోగ్ పన్సారేని, తను జ్ఞానేశ్వరిని చదువుతుండగా వినమన్నాడు. కాని పన్సారేకు అది నచ్చక, వెళ్ళి ద్వారకామాయిలో కూర్చొన్నాడు. అప్పుడు బాబా అన్నారు "నువ్వు జోగ్ చదువుతున్న జ్ఞానేశ్వరివి వినవు. పోనీ నువ్వైనా చదువుతున్నావా? అంటే లేదు. అందుచేత పోయి జోగ్ దగ్గరకెళ్ళి కూర్చో." ఇలా బాబా అనగానే చేసేది లేక పన్సారె బాబా చెప్పినట్లే చెయ్యవలసి వచ్చింది.

అలాగే దీక్షిత్ కూడా ప్రతిరోజు రాత్రి క్రమం తప్పకుండా రామాయణం చదివేవాడు. అది వినడానికి భాటే, కపర్థే, భీష్మ, ఉపాసని ఇంకా చాలామంది ఇతర భక్తులు వచ్చేవారు. సాయంకాలం పూట భీష్మ మరియు ఉపాసని 'వేదాంత పంచదశి' అనే గ్రంథం చదివేవారు. ఏ కారణం చేతనైనా కపర్థే ఈ కార్యక్రమానికి రాకపోతే బాబాకు నచ్చేదికాదు. ఈ విషయం కపర్థే తన డైరీలో వ్రాసుకున్నాడు. సాయంకాలం పూట 'పరమామృతం' చదివే విషయానికి సంబంధించిన తరగతులు జరిగేవి. అప్పుడు ఉపాసని దానిపై చర్చా కార్యక్రమం నిర్వహించేవాడని కపర్థే తన డైరీలో వ్రాసుకున్నాడు.

ఇంకా దీక్షిత్ పగటిపూట 'ఏకనాథ భాగవతాన్ని', రాత్రిపూట బావార్థ రామాయణాన్ని తప్పకుండా చదివేవాడు. ఒక రోజు శ్రీరాముని శక్తిని పరీక్షించడానికి హనుమంతుని ప్రయత్నం అన్న కథని గట్టిగా చెప్పుకుంటున్నారు. శ్రీరాముని బాణానికి గల పక్షివెంట్రుకలను తాకిన గాలి మహాశక్తి గలదై ఒక కొరడావలె హనుమంతుణ్ణి ఆకాశంలో సుడులు త్రిప్పింది. ఆ దెబ్బకి హనుమంతుడికి ఊపిరి ఆడలేదు. అది గ్రహించిన హనుమంతుడి తండ్రియైన వాయుదేవుడు పరిస్థితి విషమించకుండా ఉండేందుకు శ్రీరాముని పాదములపై బడి శరణు వేడమన్నాడు. హనుమంతుడు తన తప్పు తాను తెలుసుకుని శ్రీరాముణ్ని శరణువేడాడు. ఆ కథ వింటున్న వారిలో దబోల్కర్ ఒకరు. కథ వింటున్న వారందరూ ఎటువంటి శబ్దం చెయ్యకుండా నిష్ఠగా వింటున్నారు. అదే సమయంలో దబోల్కర్ తన భుజంపై వేసుకున్న కండువా మీద ఒక విషపూరితమైన తేలు నిలబడి ఉండటం చూసాడు. ఆ తేలు కూడా ఎక్కడా చలనం లేకుండా కథని వింటున్నట్లుగా దీక్షిత్ వైపు చూస్తోంది. కాని అది కదలకుండా ఉన్నప్పటికీ తేలు కాబట్టి తనను ఎప్పుడైనా కుట్టవచ్చునని భావించి దబోల్కర్ నెమ్మదిగా కండువా క్రింది భాగం మడిచి తేలుని దానిలో బంధించి తీసుకువెళ్ళి బయట పారవేసాడు. కాబట్టి సత్‌గ్రంథపఠనం మనుష్యులనే కాక క్రిమికీటకాదులు, జంతువులను కూడా తరించేటట్లు చేస్తుందని తెలుస్తున్నాది.

ఇంకొక విషయం.. రామచంద్ర ఎ.దేశ్‌ముఖ్ అని షిరిడీ నివాశి ఒకరున్నారు.

కాని అతడికి బాబాపై నమ్మకం లేదు. ఒకసారి అతని కూతురికి బాగా జబ్బు చేసింది. విపరీతమైన జ్వరంతో బాధపడుతూ గోండ్‌కర్ ఆసుపత్రిలో చేరింది. రక్తపరీక్షలు, మూత్ర పరీక్షలు చేయగా అది టైఫాయిడ్ జ్వరమని తేలింది. ఆమెకు మంచి మందులే ఇచ్చారు. కావల్సిన యాంటీబయోటిక్స్ అన్నీ వాడారు. ఆ విధంగా సుమారు 45రోజులు ఆమె ఆసుపత్రిలోనే ఉండిపోయింది. దేశ్‌ముఖ్ పిల్ల పరిస్థితి వల్ల బాగా ఆందోళనకు గురైయ్యాడు. దేశ్‌ముఖ్ భార్యకు బాబాపై అమితమైన భక్తి విశ్వాసాలు ఉన్నాయి. అందుచేత ఆమె బాబా విభూదిని నీళ్ళల్లో కలిపి పిల్ల చేత త్రాగించింది. దాంతో అమ్మాయి నెమ్మదిగా కోలుకోవడం ప్రారంభించింది. దేశ్‌ముఖ్‌కి బాబాపై విశ్వాసం కుదరడానికి ఈ సంఘటన తోడ్పడింది. ఆ మరునాడే శ్రీసాయి సచ్చరిత్ర పుస్తకం ఒకటి కొని తెచ్చుకుని చదవడం ప్రారంభించాడు. ఆయన అలా చదువు తుండగానే ఒక పెద్ద కప్ప వచ్చి ఆయన ముందు కూర్చుంది. అదే ప్రకారం దేశ్‌ముఖ్ పారాయణ ప్రారంభించగానే ఆ కప్ప రావడం, ఆయన ముందు కూర్చొని పారాయణ వినడం చేసేది. అలాగే ప్రతి అధ్యాయమూ వచ్చి వినేది. పారాయణ అయిపోగానే నెమ్మదిగా అక్కడ నుండి వెళ్ళిపోయేది. వారం చివరి రోజున దేశ్‌ముఖ్ పారాయణం ముగించాడు. అది కూడా ఆ కప్పవిని వెళ్ళింది. తరువాత మరి కన్పించలేదు.

(ఇది రామలింగస్వామి రచించిన అంబ్రోసియా ఇన్ షిరిడీ అనే గ్రంథం నుండి గ్రహింపబడింది.)

ఇలాంటిదే ఇంకొక సంఘటన. గత రెండు సంవత్సరాల నుండి విక్రమ్ అనే ఆయన నాకు మరాఠీ భాష నేర్పుతున్నాడు. ప్రతిరోజు సాయంకాలం మా అపార్ట్‌మెంటు క్రింది భాగంలో సమావేశమయ్యేవాళ్ళం. అప్పుడు ఆయన దిలీప్ పవార్ గారు రచించిన శ్రీసాయి సచ్చరిత్ర యొక్క భావార్థం గట్టిగా నాకు వినపడేలా చదివేవాడు. విక్రమ్ చాలా మత గ్రంథాలు చదివాడు. ఆయనకు వాటిపై ఎక్కువ అవగాహన ఉండేది. ఎంతో ఓపికగా నాకు మరాఠీ భాషలోని సచ్చరిత్రను చదివి వినిపించేవాడు. ఆ అపార్ట్‌మెంటు క్రింది భాగంలో గోధుమరంగు కుక్క ఒకటి ఉండేది. దాన్ని నేను లాలి అని పిలిచేదాన్ని. విచిత్రం ఏమిటంటే మా సచ్చరిత్ర తరగతులు మొదలుపెట్టిన రోజు మొదలుకుని, లాలి గూడ వచ్చి నా ప్రక్కన కూర్చొనేది.

అప్పుడప్పుడు అది నా మీదకు వంగి, దాని ముక్కు నా తొడపై పెట్టి సచ్చరిత్ర ఏ అధ్యాయం చదువుతున్నారో దాన్ని దీక్షగా వింటున్నట్లు ఉండేది. ఇంక ఆ రోజుకు సంబంధించిన భాగం పూర్తి అవ్వగానే బయటకు పరుగెట్టేది. లాలి చేస్తున్న ఈ పని గురించి నేను విక్రమ్‌కు చెప్పాను. కాని అతడు మొదట నమ్మలేదు. మీరు దానికి ఏదైనా తిండి పెడతారని మీ దగ్గరకు వస్తున్నాది అనేవాడు. నిజమే కాని నేను కొన్ని వీధి కుక్కలకి ఉదయం పూట తినడానికి ఏదో ఒకటి తెచ్చిపెడుతూ ఉండేదాన్ని. ఇది ఇలా ఉండగా... ఒక రోజు లాలికి బాగా జ్వరం వచ్చింది. నేను 'యాంటి పైరెటిక్' అన్న మందును పాలల్లో కలిపి పెట్టేను కాని అది తాగలేదు. ఆ రోజు మేము సచ్చరిత్ర 15వ అధ్యాయం చదువుతున్నాము. ఇది సంకట మోచన అనే అధ్యాయం. అనగా ఇది వింటే బాధలు, కష్టాలు పోతాయని అర్థం. లాలి కూడా ఈ అధ్యాయం పూర్తిగా విన్నది. మరి దానికి జ్వరం తగ్గిందేమో? రోజులాగే చకచకా పరుగెట్టింది. ఆశ్చర్యం ఏమిటంటే ఆ మరుసటి రోజునే అది చనిపోయింది. అది బ్రతికి ఉండగా సాయి సచ్చరిత్రను వినే అదృష్టం దానికి దక్కింది. ముఖ్యంగా సచ్చరిత్ర 15వ అధ్యాయం లాలికి తిరిగి ఒక మంచి జన్మనిస్తుందని నేను అనుకుంటున్నాను. నాకు నమ్మకం ఉంది. షిరిడిలోనే తిరిగి జన్మించి ఒక మంచి సాయి భక్తుడుగా ఉంటుంది.

ఇలాంటిదే ఇంకొక విషయం. నా స్నేహితురాలు మంజుల దగ్గర ఒక పెంపుడు కుక్క ఉంది. దాని పేరు రూబీ. 14 సంవత్సరాల నుండి అది మంజులతోనే ఉంది. మంజుల బాబా పూజ చేస్తున్నప్పుడు గాని, హారతి పాటలు చదువుతున్నప్పుడు గానీ రూబీ కూడా వచ్చి ఆమె దగ్గర కూర్చుంటూ ఉండేది. రూబీ జీవితం ముగిసే రోజుల్లో అది బాగా జబ్బున పడింది. అప్పుడు ఒక మంచి పశువుల డాక్టరు దానికి చికిత్స చేసేవారు. కొద్ది రోజులకి రూబీకి కిడ్నీలు పాడయ్యాయి. ఇంక అది నడవలేకపోయేది. అది పడుతున్న బాధ భయంకరంగా ఉండేది. అందుచేత ఇంక Euthanasia (సానుభూతితో చంపడం)దానికి ఇవ్వవలసి ఉంటుందని డాక్టరు అభిప్రాయపడ్డారు. అప్పుడు మంజుల రూబీని తిరిగి ఇంటికి తీసుకుని వచ్చి బాబా విభూదిని నీటిలో కలిపి ఇవ్వడం, సచ్చరిత్ర గట్టిగా దానికి వినబడేటట్లు చదవడం

చేసేది. రాత్రిపూట దానికి ఏదైనా అవుసరం వస్తుందేమోనని మంజుల కూడా దాని ప్రక్కనే నేల మీద పడుకుంటూ ఉండేది. ఇంక రూబీ చనిపోవడానికి ఒక రోజు ముందు రూబీ ఎలాగో ప్రాకుతూ గుమ్మం దగ్గరకు వెళ్ళింది. ఆ రోజు సాయంకాలం మంజుల సచ్చరిత్రలోని 42వ అధ్యాయం గట్టిగ చదివింది. ఈ అధ్యాయం బాబా నిర్యాణ దశకు సంబంధించింది. అనగా బాబా తన భౌతిక శరీరాన్ని వదిలి వేసే సంఘటన. ఆ రాత్రి రూబీ ఎలాగో ఒకలాగ బాబా చిత్ర పటం వరకూ ప్రాకుతూ వెళ్ళింది. ఇంకా ఆ మరుసటి రోజు ఉదయమే అది చనిపోయిందని తెలుసుకుంది. బాబాకు సాష్టాంగ నమస్కారం చేస్తున్న భంగిమలో అది చనిపోయింది. అది ఎంతో అదృష్టం చేసుకుంది. అందుకే బాబా మహానిర్యాణ విషయమైన 42వ అధ్యాయం అది వినగల్గింది. ఆ విధంగా బాబాకు నమస్కరిస్తూ దాని చివరి శ్వాసను విడిచింది.

పైన చెప్పబడిన సాయిలీలలు, సచ్చరిత్ర యొక్క శ్రవణ మహిమను తెలియ చేస్తున్నాయి.

**కీర్తనం:**

కీర్తనలకు ఎనలేని ఆధ్యాత్మిక శక్తి ఉంది. వాటి యొక్క ప్రభావం కీర్తనలు పాడేవారిపైనే కాకుండా కీర్తనలు వినవారిపై కూడా ఉంటుంది. ఇప్పుడు చెప్పబోయే సాయి లీలలు కీర్తన శక్తి సామర్థ్యాలను 'కళ్ళకు కట్టినట్లు చూపెడతాయి.' దాసగణు అనే సాయి భక్తుడు షిరిడికి తరచూ వస్తూ ఉండేవాడు. అలా ఒకసారి వచ్చినప్పుడు ప్రక్కగ్రామంలో కీర్తనా కార్యక్రమాన్ని అతడు నిర్వహించవలసి వచ్చింది. అదే సమయంలో జ్యోతీంద్ర తార్కడ్ అనే భక్తుడు కూడా షిరిడిలో ఉన్నాడు. అనుకున్న ప్రకారం దాసగణు ప్రక్క గ్రామానికి వెళ్ళడానికి సిద్ధపడగానే తార్కడ్ ద్వారకామాయికి వచ్చి తాను గూడ దాసగణు కార్యక్రమానికి వెళ్ళడానికి గాను సాయి అనుమతిని కోరాడు. అందుకు సాయి అంగీకరించి "గణూ బహూని కూడా నీతో తీసుకుని వెళ్ళు" అన్నారు. సాయి తార్కడ్‌ని బహూ అని పిలుస్తూ ఉంటారు. అయితే తార్కడ్ సాయంకాలం పూట మశీదులో దీపాలు వెలిగిస్తూ ఉంటాడు కాబట్టి, ఆ పని అతనికి ఉండగా తాను

ఎలా అతడిని తీసుకువెళ్ళగలడు? అన్న సందేహం దాసగణుకు కల్గింది. కాని సాయి ఆజ్ఞను పాటించాలి కదా! అనుకుని తార్కడ్‌ని కూడా తనతో కీర్తనా కార్యక్రమానికి తీసుకుని వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. ఇద్దరూ ప్రక్క గ్రామానికి బయలుదేరారు. అక్కడకు వెళ్ళిన తరువాత కార్యక్రమం జరిగే స్థలంలో లాంతర్లు పెట్టి వెలుగు బాగా ఉండేటట్లు చేశారు. క్రింద అందరూ కూర్చొని పాటలు వినడానికి చాపలు పరచారు. కార్యక్రమానికి ముందుగా దాసగణు ఒక బల్లమీద బాబా చిత్రపటాన్ని పెట్టి అగరవత్తులు వెలిగించి పూజ చేసాడు. సాధారణంగా ఇటువంటి కీర్తనలకు పెద్దగా జనం గుమిగూడుతారు. అందువల్ల ఆ స్థలంలో గాలి కూడా సరిగా వీచక ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిగా ఉంటుంది. కాని అందరూ చాలా శ్రద్ధగా కీర్తనలు వింటున్నారు. ఆ విధంగా ఒక గంట సమయం గడచిన తరువాత సుమారు పదిహేను మంది మనుష్యులు ఒక పాడె మీద శవాన్ని ఉంచి శ్మశానానికి తీసుకువెళుతూ అక్కడికి వచ్చారు. వారందరూ భిల్లు జాతికి చెందినవారు. నల్లగా ఉన్నారు. కేకలు పెడుతున్నారు. ఆ బృందంలో పెద్దవాడొకడు దాసగణు దగ్గరకు వచ్చి బాబా చిత్రపటాన్ని చూసి "ఎవరితడు?" అని అడిగాడు. వెంటనే దాసగణు బాబాకున్న దైవత్వాన్ని వివరించి, కొన్ని లీలలు చెప్పి, అందరూ ఆయన్ను గురువుగా, దేముడుగా ఎలా కొలుస్తూ ఉంటారో చెప్పాడు. వెంటనే ఆ పెద్దమనిషి తన వారితో పాడెను క్రిందకు దించవల్సిందిగా ఆజ్ఞాపించాడు. అలాగే శవాన్ని క్రిందకు దించారు. అప్పుడతడు దాసగణు వైపునకు తిరిగి 'మీ బాబా దేముడైతే ఈ శవాన్ని తిరిగి ప్రాణం ఉన్న మనిషిగా చెయ్యమను. అలాకాకపోతే మిమ్మల్నందరినీ మేము చంపేస్తాం అని బెదిరించాడు. దాసగణు భయపడిపోయాడు. ప్రక్కనే ఉన్న జ్యోతింద్రతో ఇప్పుడు మనం ఏంచేద్దాం అని అడిగాడు. ఇదంతా బాబా చేస్తున్న లీలే అయివుంటుందని జ్యోతింద్ర అనుకున్నాడు. కాబట్టి ఆ పరిస్థితుల్లో వారిని బాబాయే కాపాడగలరని మనసులో ఆయన్నే శరణు వేడుకున్నారు. వెంటనే ఇద్దరూ చర్చించుకుని ప్రముఖమైన బాబా హారతి పాట "సాయి రహము నజరు కరనా, బచ్చోంకా పాలన కరనా" పాడి ఆ సమస్యకు పరిష్కారాన్ని చూపే బాధ్యతను బాబాపైనే ఉంచారు. అప్పుడు దాసగణు వారందరినీ కొద్దిసేపు అక్కడ కూర్చొనమని ప్రార్థించాడు. అప్పుడు ఆ హారతి పాటను హృదయపూర్వక ప్రార్థనతో పాడడం ప్రారంభించాడు. ఆ

పాటతో దాసగణు ఉన్మత్తుడయ్యాడు. లేచి నిలబడి నృత్యం చెయ్యడం మొదలుపెట్టాడు. అక్కడి జనమంతా మాటాపలుకు లేకుండా ఆ పాటను తన్మయత్వంతో ఆలకిస్తున్నారు. జ్యోతింద్ర మాత్రం తదేక దృష్టితో ఆ శవం వైపు చూస్తున్నాడు. ఒక గంట గడిచింది. శవం వైపు చూస్తున్న జ్యోతింద్రకు ఆశ్చర్యం వేసింది. శవంలో ప్రాణం ఆడడం మొదలు పెట్టింది. దానివల్ల కదలిక నెమ్మదిగా కనపడ సాగింది. కాసేపటికి అది శవం కాదు శివం అయ్యింది. జ్యోతింద్ర ఆనందంతో తప్పట్లు కొట్టాడు. దాసగణు పాట తన్మయత్వం నుండి ఇంకా తేరుకోలేదు. అతడికి పరిసరాలు, అక్కడి శవం గురించి ఇంకా ఆలోచన రాలేదు. అప్పుడు జ్యోతింద్ర దాసగణు వద్దకు వెళ్ళి అతడి చేయి పట్టుకుని కుదిపి “మహరాజ్ బాబా మనల్ని కాపాడడానికి వచ్చారు. చనిపోయిన మనిషి బ్రతికాడు. ఇప్పుడు మన ప్రాణాలకి వచ్చిన ముప్పు ఏదీ లేదు అన్నాడు. భిల్లు నాయకుడు బ్రతికిన మనిషిని చేయిపట్టుకుని లేపి దాసగణు మహరాజ్‌కి నమస్కారం చెయ్యమన్నాడు. అప్పుడు షిరిడి గురించి బాబా గురించి మరికొన్ని విషయాలు అడిగి తెలుసుకున్నాడు. తప్పక మేమందరం షిరిడి వచ్చి బాబా దర్శనం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేసాడు.

(ఇది వీరేంద్ర తార్కడ్‌చే రచింపబడిన ‘షిరిడి సాయిబాబాతో తార్కడ్ కుటుంబానికి కలిగిన నిజమైన అనుభవాలు’ అన్న పుస్తకం నుండి గ్రహించినది)

**స్మరణం:**

బాబా ఎక్కడా సమాధిలో ఉన్నట్లు లేదు. అయితే ఈ రోజు వరకూ ముఖ్యమైన విషయంగా భావించబడుతున్నదేమిటంటే ఆయన ఉదహరించే సమాధి స్థితి ఎటువంటిదై ఉంటుంది. దానికి సమాధానం ఇలా చెప్పుకోవచ్చు. బాబా నామస్మరణే ఆ సమాధి స్థితి. ఈ స్థితికి మనం చేరుకోగలిగితే అదే మన సాధనలో మొదటి మెట్టు అవుతుంది. దీన్నే మొదటి ఆధ్యాత్మిక దశగా కూడా చెప్పవచ్చు. దీనికి ఈ క్రింద చెప్పబడిన ఘటన ఒక ఉదాహరణగా ఉంటుంది.

బాబాకు, శ్యామాకు మధ్య గల సంబంధం చాలా గాఢమైంది. ఇది ఎవ్వరికీ అంతుపట్టనిది. శ్యామా ఎప్పుడూ బాబా ప్రక్కనే ఉంటూ ఉండేవాడు. ఇంకా చెప్పాలంటే

బాబాలో కలిసిపోయి ఉండేవాడు. శ్యామా అసలు పేరు మాధవరావు దేశపాండే. "షిరిడి డైరీ" అనే పుస్తకం వ్రాసిన గణేష్ ఎస్. కపర్దే ఈ క్రింది విషయాల్ని ఇలా వివరించారు. 8-12-1911న మాధవరావు దేశపాండే ఇక్కడ ఉన్నాడు. ఒక రోజు అతను పడుకుని ఉండగా నేను చూడడం తటస్థించింది. నా కళ్ళతో చూసింది, నా చెవులతో విన్నదే కాని నాకెప్పుడూ ఇటువంటి అనుభవం కలుగలేదు. మాధవ రావు దేశపాండే తీసుకుంటున్న ప్రతి ఊపిరి శబ్దం, అలాగే బయటకు వదులుతున్న ప్రతి ఊపిరి శబ్ధం 'సాయినాథ్ మహరాజ్, సాయినాథ్ బాబా' అని వినబడుతూ ఉండేది. అంతేకాక అతను కాస్త గురక పెడుతున్న సమయంలో ఇవే మాటలు బిగ్గరగా కొంచెం దూరంలో ఉన్న వారికి సైతం వినబడేటట్లు ఉండేవి. ఇది ఒక విచిత్రమైన విషయం.

కాబట్టి అందరూ తెలుసుకోవలసినదేమిటంటే యాంత్రికంగా షిరిడికి పరుగెట్టి సమాధి మందిరం మెట్లు ఎక్కడానికి మాత్రమే అన్నట్లు గుంపులు గుంపులుగా అందరూ త్రోసుకుంటూ పోతే అది వారికీ, వారి ప్రక్కన ఉన్నవారికీ కూడా అపాయాన్ని కొనితెచ్చుకున్నట్లు అవుతుంది. సాయిబాబా రెండవ వాగ్ధానం యొక్క ఉద్దేశ్యం ఇదికాదు. మరేమిటి? అని ప్రశ్నించుకుంటే సమాధానం ఇలా ఉంటుంది. సాయి నామాన్ని మనం సతతం స్మరించుకుంటూ ఉండాలి. ఇంకా ఆ నామంపై మనసు నిల్పి ధ్యానించాలి. అలా చేస్తూ చేస్తూ సమాధిలోకి వెళ్ళ గలగాలి. అప్పుడు మన బాధలన్నీ జయించ గలిగిన వాళ్ళమవుతాము. బాబా చెప్పింది కూడా అదే 'మీ బాధలన్నీ ఓడిపోతాయి' అంటున్నారు. అంతేకాని తుడిచిపెట్టుకు పోతాయని గాని, నాశనమవుతాయని గాని అనలేదు. బాబా చాలా ప్రత్యేకమైన పదజాలాన్ని ఇక్కడ వాడారు.

తరువాత, సచ్చరిత్ర అధ్యాయం 27లో 'రామదాసి బువా మరియు విష్ణు సహస్ర నామం' గురించి ఒక లీల చెప్పబడింది. ఈ రామదాసి అనబడే వ్యక్తి ఒకసారి షిరిడి వచ్చాడు. ప్రతిరోజు ఉదయం పూట కాషాయరంగు బట్ట కట్టుకుని బాబా ముందు కూర్చొని విష్ణు సహస్ర నామం, ఆధ్యాత్మ రామాయణం చదువుతూ ఉండేవాడు.

అయితే శ్యామా కూడా ఈ విష్ణు సహస్ర నామం చదివితే బాగుంటుందని బాబాకు ఒకసారి ఆలోచన వచ్చింది. ఆ విష్ణు సహస్ర నామ పుస్తకం రామదాసి దగ్గర ఉంది. వెంటనే బాబా ఏం చేసారంటే రామదాసిని ఏదో ఒక నెపంతో బయటకు పంపిద్దామని అతడిని పిలిచి తనకు కడుపు నొప్పిగా ఉందని సెన్నా ఆకులు గుండను తెమ్మనమని చెప్పి పంపించారు. (ఈ సెన్నా ఆకుల్ని సునాముఖి ఆకులని, తంగేడు ఆకులని కూడా అంటారు). సరే అని చెప్పి రామదాసి బయలుదేరాడు. వెంటనే బాబా లేచి వెళ్ళి రామదాసి బువా చదివే విష్ణు సహస్రనామ పుస్తకం తీసుకొచ్చి శ్యామాకు బహుకరించారు. ఆ రామదాసి పుస్తకం తీసుకుందుకు శ్యామాకు ఇష్టంగా లేదు. అందుకు తనను క్షమించమని బాబాను వేడుకున్నాడు. అప్పుడు బాబా అతడికి విష్ణు సహస్రనామం యొక్క గొప్పతనాన్ని, ఆ నామాలను జపించడం వల్ల కలిగే లాభాల్ని తనకు తానుగా అనుభవించిన మహిమల్ని శ్యామాకు వివరించారు. అధ్యాయం 27, పాదాలు 85 నుండి 91 వరకూ బాబా శ్యామాకు విష్ణుసహస్ర నామ విషయంలో ఇచ్చిన వివరణ ఈ క్రింది విధంగా ఉంది.

పరమాత్మ నామం కొండల వంటి పాపాలను సైతం కొట్టి వేయగలదు. ఆ నామమే జీవుడిని ప్రకృతి బంధం నుండి తప్పించగలదు. అదే నామం కోటానుకోట్ల జన్మల నుండి వెంటాడుతున్న దుష్ట వాసనలను, గుణాలను తుడిచిపెట్టగలదు. ఇంకా నామ జపానికున్న శక్తి ఎటువంటిదంటే, అది మృత్యువు యొక్క కుత్తికను సైతం కత్తిరించగలదు. అంతేకాక జీవుడిని జనన మరణ చక్రం నుండి కాపాడి పునర్జన్మ లేకుండా చేయగలదు.

నామాన్ని తదేక దీక్షతో జపించటమన్నది ఒక అద్భుతమైన ప్రక్రియ. అయితే అటువంటి తదేక దీక్ష లేకుండా చేసిన నామజపం కూడా చెడ్డదేమీ కాదు. అది కూడా ఎంతో కొంత సత్ఫలితాన్ని ఇస్తుంది. అనుకోకుండా జరిగిన భగవన్నామ ఉచ్ఛరణ సైతం ఎంతో శక్తిని ప్రకటిస్తూ ఉంటుంది.

మనస్సును నిర్మలంగా ఉంచడానికి భగవన్నామ జపం కంటే మించిన

సాధనం మరొకటి లేదు. అది నాలుకకు అలంకారం వంటిది. నామం ఆధ్యాత్మిక జీవనానికి పుష్టిని చేకూరుస్తుంది. నామ జపానికి మడి ఆచారము అవుసరం లేదు. ఇంకా దానికెటువంటి నియమ నిబంధనలూ ఏ శాస్త్రమూ విధించలేదు. పాపరాశిని ధ్వంసం చేసే శక్తి నామాని కుంది. భగవన్నామమంటేనే పవిత్రమైనదని అర్థం. భగవంతుడే స్వయంగా చెపుతున్నాడు. తైల దారవలె ఎడతెగని నా నామస్మరణ నిన్ను భవసాగరం నుండి తరింప చేయగలదు. ఇంక ఇతరత్రా సాధనలు నీకు అనవుసరం. ఎందుకంటే ఒక్క నామస్మరణ మాత్రం చేతనే నువ్వు మోక్షాన్ని అనుభవంలోకి తెచ్చుకోగలవు. ఎవ్వరైతే నా నామజపాన్ని విడువక చేస్తూ ఉంటారో వారి వారి పాపాలు కూడా అట్లే కను మరుగవుతాయి. నామస్మరణ చేసే మనిషి అత్యంత ప్రజ్ఞాపాటవాలు కల్గినవాడుగా నేను భావిస్తాను. అతడు ఇతర అద్భుతమైన వ్యక్తుల కంటే అధికుడని పించుకుంటాడు.

ఇంతవరకూ నామ జప మహిమ గురించి బాబా సూక్తులు విన్నాం. బాబా నామ జపం వల్ల మనందరం బాబాకు అత్యంత సన్నిహితులుగా మారడానికి అవకాశం ఉంటుంది. చాలాసార్లు ఈ నామజపం గురించి బాబా చెప్పడం జరిగింది. బాబా నామాన్ని మనం వదలకుండా స్మరించినట్లయితే మన బరువు బాధ్యతల్ని ఆయనే భరిస్తారు. మన యొక్క భౌతిక, ఆధ్యాత్మిక పురోగతి బాబా పర్యవేక్షణలో జరుగుతుంది. నామ జపం యొక్క మరికొన్ని విశేషాలు ఈ క్రింద వివరించబడ్డాయి.

ఈ కలియుగంలో మనకు సద్గురు నామస్మరణ మాత్రమే శరణ్యంగా ఉంది. అదే మనకు సులువైన మార్గం. అందుకొరకు ప్రత్యేకమైన యోగ సాధనలు గాని, ఆచార వ్యవహారాలు గాని లేవు. అది ఎవ్వరి చేతనైనా, ఎప్పుడైనా చేయగల్గిందై ఉంది. ఆడ, మగ, చిన్న పిల్లలు అన్న తేడా లేకుండా ఎవ్వరైనా చేయవచ్చు. మన వృత్తి వ్యవహారాలు, ఇంటి పనులు లేక ఇతర కర్తవ్య నిర్వహణలేవైనా చేయడానికి ఈ నామస్మరణ ఏ మాత్రం అడ్డుగా ఉండదు. ఈ కలియుగంలో మనం భగవదవతారాన్ని దర్శించలేకపోవచ్చుగాక, కాని నామ స్మరణకు ఎంతో అవకాశం ఉన్నది. బెల్లం పెట్టి చీమలను మనం ఆహ్వానించనవసరం లేదు. అదే విధంగా నామజపం చేస్తే చాలు

మనం ఆహ్వానించకపోయినా సద్గురువే తనంతతాను ఏదో ఒక రూపంలో వచ్చి మనల్ని ఆదుకుంటాడు. అంతేకాక నామస్మరణ అన్నది చాలా సులువైన పని. ఒక దగ్గర స్థిరంగా కూర్చొని మనం జపం కొనసాగిండచం కష్టమైనదిగా ఉండవచ్చు. కాని మన పని మనం చేసుకొంటూ యధాలాపంగా నామాన్ని ఉచ్ఛరించడానికి ఏ కష్టమూ ఉండదు. ఇంకా అది బ్యాంకులో దాచుకొన్న ధనం లాంటిదవుతుంది. దానిపైన వచ్చే వడ్డీ లాంటి భగవత్కృపను మనం హాయిగా వాడుకోవచ్చు. భగవన్నామ స్మరణ మనకి మరొక మంచి అవకాశాన్ని కల్గిస్తోంది. దానివల్ల మన అహంకారం, టెంపరితనం కనపడకుండాపోతాయి. అంతేకాక బాబాపై మనకున్న భక్తి, ప్రేమలు ఇనుమడిస్తాయి. ఇంకా ఈ కలియుగంలో మనం చేస్తున్న పాపాలు ముఖ్యంగా మన మాటల వల్ల కలిగే దోషాలు పోగొట్టుకోవడానికి బాబా నామజపం కంటే మించిన సాధనం ఇంకొకటి లేదు.

ఈ క్రింద చెప్పబడిన రెండు లీలలు నామజపం యొక్క మహత్యాన్ని తెలియజేస్తున్నాయి. స్వామి సాయి శరణానందకి బాబా నామ జపానికున్న శక్తి బాగా తెలుసు. 1911వ సంవత్సరంలో ఆయన బాబానే ఇలా అడిగాడు "నేను నామజపం ఏ పేరు మీద చెయ్యాలి? దానికి సమాధానంగా 'సాయినాథ్' అని చెయ్యి అని బాబా చెప్పారుట. ఇంక ఆ మరుక్షణం నుండి సాయి శరణానంద్ సాయినాథ్ అన్న నామాన్ని ఎక్కడా ఆగకుండా జపించడం మొదలు పెట్టాడు. ఆయన అన్ని వేళలా ఆ జపాన్ని చేస్తూనే ఉండేవాడు. అందుచేత ఆయన పడుకున్నప్పుడు కూడా నామజపం జరుగుతూనే ఉండేది. ఒకసారి సభా మండపం ముఖద్వారం వద్ద నిలబడి అతి బిగ్గరగా 'సాయినాథ్' అని పలికాడు. అంత బిగ్గరగా పిలిచిన కారణం కూడా ప్రత్యేకంగా ఏమీలేదు. అతని మానసిక స్థితి బాగులేకపోవడం గాని, లేక అతనికి ఏదైనా ఒక కష్టం కలుగడం కాని జరగలేదు. అప్పుడు బాబా తన భక్తులతో కలసి ద్వారకామాయిలో కూర్చొని ఉన్నారు. కొంతసేపటికి బాబా లేచి నిలబడి తులసివనం వరకూ నడుచుకుంటూ వెళ్ళేరు. అక్కడ సాయి శరణానంద వైపు ఒకసారి చూసి తిరిగి ద్వారకామాయికి వచ్చి కూర్చొన్నారు. స్వామి సాయి

శరణానంద ఒకసారి ఆయన స్వంత గ్రామమైన 'మతోగామ్'కు వెళ్ళాడు. ఒక రోజు ఉదయం 9గం॥ల ప్రాంతంలో ఆయన తన ఇంట్లో వరండాలో ఉన్న ఊయలపై కూర్చొని ఎదురుగా కనపడుతున్న ఆ వీధిలోకి చూసాడు. ఆ సమయంలో వీధంతా నిర్మానుష్యంగా ఉంది. ఎందుకో బాబా గురించి ఒక ఆలోచన వచ్చింది. బాబాను చూడాలని పించింది. మరుక్షణంలో అతని నోటి నుండి 'సాయినాథ్' అన్న పిలుపు వచ్చింది. వెంటనే ఆ వీధిలో ఒక ఫకీరు ప్రత్యక్షమయ్యాడు. అతడు బిక్ష అడుగుతున్నాడు. స్వామి సాయి శరణానంద్ ఆశ్చర్యానికి అంతులేదు. బాబా నామానికున్న అపరిమిత శక్తి ఆయనకు బాగా అర్థమైంది. బాబా నామాన్ని జపానికి స్వీకరించడం వల్ల, పిలిచిన వెంటనే బాబా భౌతికంగా ప్రత్యక్షమవ్వవలసి వచ్చింది. అప్పుడు సాయి శరణానంద్‌కు ఒక ఆలోచన వచ్చి యిలా అనుకున్నాడు. "నేను బాబా చేస్తున్న మంచి కార్యక్రమాలకి, ఆయన మౌనంగా తన భక్తులకు ఇచ్చే ఉపదేశాలకు ఒక ఆటంకంగా తయారయ్యాను." అప్పటి నుండి తాను బాబా నామాన్ని అవుసరం ఉన్నాలేకపోయినా, లేక మంచి కారణం లేకపోయినా పలకడం మానివేసాడు. కేవలం ఆ నామాన్ని ఒక మంత్రంగా మాత్రమే మనసులో ధ్యానించుకొనేవాడు.

కాబట్టి **'దుఃఖహేహారేలి'** (దుఃఖములు ఓడింపబడతాయి) అంటే అర్థమేమిటి? సుఖదుఃఖాల పట్ల అనురక్తిగాని ఆవేదన గాని చెందడం అన్నది తగ్గుతుంది. అందుచేత వాటి బంధం నుండి బయటపడి గుణాతీత స్థితికి నువ్వు చేరుకుంటావు. అదే నిశ్చల తత్వాన్ని, శాంతిని కల్గిస్తుంది. దానివల్ల సుఖదుఃఖాలన్నవి గాలి బుడగల్లాగ కంటికి కనపడినా సరే క్షణభంగురాలవుతాయి. నిన్ను అవి కనీసం తాకనైనా తాకవు. అందువల్ల సుఖానికి పొంగిపోవడం, దుఃఖానికి కృంగిపోవడం అన్నది జరగదు. ఇంక ప్రారబ్ధం అన్నది అనుభవిస్తే గాని అంతరించదు అన్న శాస్త్ర వాక్యం నిజమైనప్పటికీ దాన్ని యథాలాపంగా స్వీకరించగలుగుతావు. సుఖదుఃఖాలను ఎదుర్కొనే ధైర్య సాహసాలు కర్మయోగికి చాలా సులువుగా అబ్బుతాయి. స్థిరచిత్తంతో వాటిని అనుభవంచి ఫలితానికి తాను బంధీకాకుండా చూసుకుంటాడు.

సచ్చరిత్ర 20వ అధ్యాయంలో దీక్షిత్ ఇంటిలో పనిచేసే పనిమనిషి గురించి

చెప్పబడింది. ఈ ఉదంతం ఈశావాస్యోపనిషత్తు సారాంశం. ఈ విషయంలో ఆ పని మనిషి ప్రవర్తనే ఒక బోధ క్రింద గ్రహింపబడింది. ఒకసారి దాసగణు ఈశావాస్యో పనిషత్తు గురించి వ్యాఖ్యానం వ్రాస్తున్నాడు. అయితే ఆ సందర్భంలో అతడికి కొన్ని మంత్రాల విషయంలో సందేహాలు ఏర్పడ్డాయి. అందుచేత అతడు షిరిడి వచ్చినప్పుడు బాబాను ఆ సందేహం గురించి అడిగాడు. "బాబా! ఈ పుస్తకం వ్రాసే విషయంలో నా ప్రయత్నాలన్నీ వ్యర్థమవుతున్నాయి. నా సందేహాలు తీరితే తప్ప ఈశావాస్యోపనిషత్తు యొక్క లోతైన అంతరార్థం నాకు బోధపడదు." అందుకు బాబా వెంటనే సమాధానం ఇచ్చారు. కాకా సాహెబ్ దీక్షిత్ పనిమనిషి నీ సందేహాలను తీర్చగలదు అన్నారు. అప్పుడు అక్కడున్న మిగతా భక్తులందరూ బాబా హాస్యానికి అలా అంటున్నారు అనుకున్నారు. కాని దాసగణు మాత్రం బాబా మాటల్ని శ్రద్ధగా విన్నాడు. బాబా పలుకులు ఎప్పుడూ నిజాన్నే సూచిస్తూ ఉంటాయని అతని నమ్మకం.

ఆ కారణం చేత దాసగణు తన తిరుగు ప్రయాణంలో విల్లేపార్లేలో గల దీక్షిత్ ఇంట్లో బస చేసాడు. ఆ మరుసటి రోజు ఉదయాన్నే అతను ఇంకా ప్రక్కమీద నుండి లేవకుండానే ఒక చక్కటి సంగీత పరమైన పాట వినపడింది. సాయిలీలను విశదపరచే ఆ పాట ఒక రైతు బిడ్డ శ్రావ్యమైన కంఠంతో పాడుతోంది. ఆ పాట యొక్క భావం అతడిని కట్టివేసింది. ఆ అమ్మాయి ఒక నారింజపండు రంగు చీర గురించి పాడుతోంది. "చక్కటి బంగారు జరీ అంచుగల ఆ చీర చూడ ముచ్చటగా ఉంది. దానితో సమానంగా ఉన్న చీర నేత గూడ ఎంతో అందంగా సున్నితంగా కనపడుతోంది." వెంటనే దాసగణు గది బయటకు వచ్చి పాటపాడే ఆ అమ్మాయిని చూసి ఆశ్చర్య పోయాడు. ఆమె కట్టుకున్న చీర చిరిగిపోయి ఆమె యొక్క పేదరికాన్ని స్పష్టపరుస్తున్నాది. అయినప్పటికీ ఆమె ఖరీదైన నారింజ పండు రంగు గల చీర గురించి, ఆ చీర ఎవరో ధరించగా చూసిన గొప్ప భావాన్ని గురించి తెలియ చేసే పాటను ఆనందంగా పాడుతున్నాది. ఆమె స్థితిని చూసి దాసగణు చలించిపోయాడు. అప్పుడు అక్కడే ఉన్నటువంటి ఇంకొక సాయిభక్తుడు కేశవరావు ప్రధాన్‌ను ఒక క్రొత్త చీరను కొని ఆమెకు ఇవ్వమని కోరాడు. దాసగణు అడిగినట్లుగానే ప్రధాన్ ఆ మరుసటి రోజున

ఒక క్రొత్తచీరను తీసుకువచ్చి ఆ అమ్మాయికిచ్చాడు. ఆమె ఎంతో ఆనందపడింది. ఆ క్రొత్త చీర కట్టుకుని మరునాడు ఆమె పనికి వచ్చి సంతోషంతో నృత్యం చేసింది. తరువాత ఇంటికి వెళ్ళి ఆ క్రొత్త చీరను జాగ్రర్తగా దాచిపెట్టి, ఎప్పటిలాగే చిరిగి పోయిన చీరను కట్టుకుని వచ్చింది. ఆమె ప్రవర్తనలో ఎటువంటి మార్పులేదు. క్రొత్త చీర కట్టుకున్నప్పుడు యధాలాపంగా సంతోషాన్ని వ్యక్తపరిచింది. తిరిగి పాత చీర కట్టుకున్నప్పుడు ఏ మాత్రం బాధ పడక ఆమె స్వస్థితిలో ఏమార్పునూ ప్రదర్శించ లేదు.

ఆ విధంగా సుఖదుఃఖాల పట్ల ఏర్పడే సమభావ స్థితిని అనగా ద్వంద్వాతీత స్థితిని వర్ణించే ఈశావాస్యోపనిషత్తు సారాంశాన్ని దాసగణు బాగా అర్థం చేసుకోగలిగాడు. ఆ పనిపిల్ల చిరిగిన బట్టలు కట్టుకోవడం అన్నది ఆమె నిస్సహాయ స్థితివల్లనే అని దాసగణు భావించాడు. ఇంకా క్రొత్త బట్టలు కొనుక్కోలేని పరిస్థితిని కూడా అంచనా వేయగలిగాడు. కాని ఆమె ప్రవర్తనలో ఉన్న సమభావస్థితి గొప్పది. అందువల్లనే పేదరికాన్ని సైతం సంతోషంగా స్వీకరించ గలిగింది. అందరికీ ఇదొక పాఠంగా దాసగణు భావించాడు. ఎవ్వరైనా తమ జీవితాలలోని హెచ్చు తగ్గులను హృదయపూర్వకంగా అంగీకరించినట్లయితే వారి వారి భావనల్లో సమతుల్యం చెక్కు చెదరదు. తద్వారా గడ్డు రోజుల్ని సైతం సులభంగా, ఆనందంగా గడపగలుగుతారు. ఎటువంటి అలజడులు లేని జీవన గమనం వారికి అలవాటవుతుంది. ఖరీదైన దుస్తులు వేసుకొనగలిగే స్తోమత ఉన్నప్పటికీ, సాదాసీదా బట్టలు కట్టుకునే అలవాటు ఉన్నట్లయితే అది మనిషికి మరింత శోభను చేకూరుస్తుంది. అంతేకాక అతడి జీవితం మిగతావారికి ఆదర్శప్రాయంగా కూడా ఉంటుంది. నీ యొక్క సంపదను, ఐశ్వర్యాన్ని ప్రదర్శించకపోవడం అన్నది నీ గొప్పదనాన్ని సూచిస్తుంది అని తెలుసు కోవాలి.

ఇంక దాసగణుకు అర్థమైన ఈశావాస్యంలోని రెండవ భాగం ఏమిటంటే ఆ ఉపనిషత్తు మొదటి మంత్రం యొక్క తాత్పర్యమే. ఈ సృష్టి అంతా పరమాత్మ చేత ఆవరించబడి ఉంది. ఇందులో పరమాత్మ లేనటువంటిది ఏ కొంచం కూడా లేదు. తరువాత ఈ ఉపనిషత్తు యొక్క సారాంశాన్ని ప్రముఖమైన శాంతిమంత్రం యొక్క

తాత్పర్యంగా తెలుసుకున్నాడు. అదేమిటంటే మనకు కనపడని ఆ పరబ్రహ్మ స్వరూపం పరిపూర్ణమైనది. ఇంక మనకు కనపడే ఈ సృష్టి అంతా కూడా పరిపూర్ణమే. ఆ పూర్ణం నుండి ఈ పూర్ణం ఉద్భవించినట్లుగా అర్థం చేసుకోవాలి. ఈ విధంగా ఆ పూర్ణం నుండి ఈ పూర్ణం ఉద్భవించినా మిగిలేది కూడా పరిపూర్ణమే.

కాకా సాహెబ్ దీక్షిత్ పనిపిల్ల విషయంలో ఆమె యొక్క బీదతనం అన్నది దైవ నిర్ణయం. అలాగే ఆమె కట్టుకున్న చినిగిన చీర కూడా ఆ కోవకే చెందుతుంది. ఈ సందర్భంలో  ఆధ్యాత్మిక త్రిపుటి చెప్పుకోదగిందై ఉన్నది. ఏదైనా ఒక వస్తువు ఇచ్చేవాడు కాని, ఇవ్వడం అన్న క్రియ కాని, ఇవ్వబడే వస్తువు కాని, ఈ మూడు స్థితులనూ కల్పి త్రిపుటి అంటారు. ఇదంతా ఒకే ఒక బ్రహ్మ పదార్థంగా ఉంది. అదే శాస్త్రం చెప్పిన 'ఏకమేవా2ద్వితీయం బ్రహ్మ'. సాధారణ మాటల్లో చెప్పుకుంటే ఒకే దైవానికి చెందినది. ఈ దేహమే నేను అనుకుంటే అదే అహంకారమనబడుతుంది. కాబట్టి ఆత్మజ్ఞాన శూన్యుడైన మనిషి ఇటువంటి అహంకారాన్ని కల్గి ఉంటాడు. ఈ శరీరంతో తాదాత్మ్యం చెంది నేనంటే ఈ శరీరమే అన్న భావనతో ఉంటాడు. అలాగే శరీరానికి బయట కనపడేదంతా నాది అనుకుంటాడు. కాబట్టి ఈ "నేను – నాది" అన్నవి వదిలించుకొంటే తప్ప అహంకార మన్నది వదలదు. భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తి చెంది, త్యాగంతో దాన్ని అనుభవించడం మన ముఖ్య కర్తవ్యం. చివరగా ఇతరుల సంపదను గాని, ఇతరుల వస్తువులను గాని ఆశించవద్దు అన్నది ముఖ్యమైన విషయంగా భావించాలి. ఇవన్నీ దాసగణుకు కల్గిన సందేహాలకు సమాధానాలు. ఇంకా ఈ విషయాలన్నీ సచ్చరిత్ర 20వ అధ్యాయం 94 నుండి 97 పాదాలలో వర్ణించబడ్డాయి. కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్లను ఒక ముఖ్య పాత్రధారిగా తీసుకొని బాబాయే దాసగణుకు సందేహనివృత్తి చేసారు.

అతి మనోహరంగా కనపడే ఈ భౌతిక ప్రపంచమంతా ఒక భ్రమ, అదే తన మాయాశక్తితో మనిషిని దారి మళ్ళించి తప్పుత్రోవలో నడిపిస్తూ ఉంటుంది. కాని ఎవరైతే ఈ భ్రమ కల్పించే మాయలో పడక తప్పించుకొంటారో అప్పుడదే వారికి దుఃఖ నివృత్తికి సంబంధించిన మార్గాన్ని కూడా చూపెడుతుంది. దానివల్ల ఏ

దుఃఖమైనా ఓటమిని అంగీకరించవలసిందే. ఇటువంటి దుఃఖ నివృత్తి కారణంగా మనో నిశ్చలత, విషయ పరిజ్ఞానం కలుగుతాయి. సంపదల్ని ప్రోగు చేసుకోవడం, బంధువర్గాలంటూ వెంపర్లాడడం వంటి స్వార్థపూరిత చర్యలన్నీ తాత్కాలికమనీ, వాటికున్న అస్థిత్వం నీటి బుడగల్లాంటిదనీ, జీవితమంతా ఒక నాటక రంగమనీ, ఇదంతా మాయామయమైన భగవంతుని శక్తి ప్రభావమనీ, భ్రమతో కూడిన భగవంతుని లీలలో ఒక భాగమనీ అర్థమవుతుంది. ఈ భ్రమకు ఉదాహరణగా సూర్యోదయ, సూర్యాస్తమయాలను చెప్పుకోవచ్చు. ప్రతిరోజు అందరం అనుకుంటూ ఉంటాం. సూర్యుడు ఉదయించాడు, సూర్యుడు అస్తమించాడు అని. ఇది నిజమా? అబద్దమా? కాస్త ఆలోచిస్తే మనకే తెలుస్తుంది. సూర్యగోళానికి ఉదయమేమిటి? అస్తమానమేమిటి? అది సర్వావస్థలందు వెలుగుతూనే ఉంటుంది. ఇదంతా భ్రమ కాదా? అయినప్పటికీ వాతావరణ వార్తల దగ్గర నుండి, జ్యోతిషం, జాతక నిర్ణయాల వరకూ లెక్కలన్నీ సూర్యోదయ, సూర్యాస్తమానాలపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ విషయాలపై మనకు సూక్ష్మమైన అవగాహన ఉన్నట్లయితే మరి వాటివల్ల మనకు కలిగే బాధలు కాని కష్టాలు కాని సత్యం కాదని తెలుస్తుంది.

అందుచేత మనందరం మేఘా అనబడే సాయి భక్తుడులాగ బాబా దయవల్ల భ్రమకు లొంగిపోకుండా ఉండగలం. నిస్వార్థపూరిత సేవ, శ్రద్ధా విశ్వాసాలు, సాయినాధునిపై ప్రదర్శించిన భక్తి ప్రభావం చేత మేఘా భ్రమను జయించ గలిగాడు. అటువంటి స్థితే మనల్ని సాయినాధుని భక్తి సౌధానికి చేర్చే మొదటిమెట్టు అవుతుంది. శ్రీసాయి సచ్చరిత్రలో 28వ అధ్యాయం మేఘాకథను అత్యద్భుతంగా తీర్చిదిద్దింది. ఇందులో మేఘాకు సంబంధించిన వివరణ, అతడి అకుంటిత భక్తి భావం, అతడి శరణాగతి తత్త్వం చెప్పబడింది.

హరి వినాయక్ సాథే, ఖేడా జిల్లాలో పనిచేస్తున్నాడు. అక్కడ అతడు మేఘాను చూసాడు. మేఘా ఒక గుజరాతి బ్రాహ్మణుడు. మేఘాతో బాగా పరిచయం ఏర్పడిన తరువాత సాథే అతడిని ఒకసారి షిరిడీకి వెళ్ళమని చెప్పేడు. అలావెళ్తే మేఘాకు మంచి పారమార్థిక చింతన కలుగుతుందని సాథే భావించాడు. కాని మేఘా ఆలోచన

వేరు. తాను బ్రాహ్మణుడనని, బాబా ముస్లిమ్ అని, అందుచేత ఒక ముస్లిమ్‌ను కలిసి ఆయనకు నమస్కరిస్తే నరకానికి పోవల్సి వస్తుందని అతడి అనుమానం. అయనప్పటికీ సాథే ప్రోద్బలం వల్ల మేఘా షిరిడీకి వెళ్ళవలసి వచ్చింది. ద్వారకామాయిలో ప్రవేశించగానే బాబా అతడిని చూసి కోపంతో ఊగిపోయారు. ఇంకా లేచి కొట్టబోయి నంత పనిచేసి బయటకు పొమ్మనమని అరిచారు. ఎందుకోమరి మేఘాకు మాత్రం అక్కడి నుండి కదల బుద్ధి పుట్టలేదు. అక్కడే కొంతసేపు గడిపి మారుమాట్లాడక బాబాకు సేవలందించాడు.

ఆ తరువాత మేఘా షిరిడి వదిలి వెళ్ళి కొంతకాలం గడిచిన తరువాత తిరిగి వచ్చాడు. ఇప్పుడు మేఘాకు బాబాపై మంచి విశ్వాసం కుదిరింది. బాబాను అపర శివావతారంగా భావించేవాడు. ఉదయం నిద్రలేచినప్పటి నుండి, రాత్రి మరల పడుకొనే వరకూ ఎక్కడా ఆగకుండా 'సాయిశంకర్' అనే నామాన్ని జపిస్తూ ఉండేవాడు. చిన్నపిల్లవాడి మనస్తత్త్వంతో ఎంతో అమాయకంగా శంకరుణ్ని ఆరాధించేవాడు. శంకరుడికి బిల్వదళం ఎంతో ప్రీతిపాత్రం కనుక, మేఘా బిల్వదళాలను కోసుకొని వచ్చి, తనకు ప్రత్యక్షంగా కనపడుతున్న 'సాయి శంకరుణ్ని' ఆ బిల్వ దళాలతో అభిషేకం చేసేవాడు. షిరిడీలో బిల్వ వృక్షాలు ఉండేవి కావు. అందుచేత మూడు, నాలుగు మైళ్ళ దూరం నడిచివెళ్ళి అడవి నుండి బిల్వ పత్రాలను తీసుకొని వచ్చేవాడు. వాటితో బాటు బాబాకు ఇష్టమైన కొన్ని అడవి పువ్వులను కూడా ఏరుకొని వచ్చి షిరిడి గ్రామంలో ఉన్న దేవతామూర్తులను సేవించి, తరువాత ద్వారకామాయికి చేరుకొని ఆచారం ప్రకారం బాబా పూజను నిర్వహించే వాడు.


ఇంకా బాబాకు మధ్యాహ్న హారతి కార్యక్రమాన్ని కూడా నిర్వర్తించేవాడు. హారతి పళ్ళాన్ని కుడిచేతితో పట్టుకుని, ఎడమ చేతితో గంటను మ్రోగించేవాడు. బాబా కూడా ప్రత్యక్షంగా అతడి పూజా విధానాన్ని ఇష్టపడుతూ ఉండేవారు. ఒక్కోసారి మేఘా రావడం ఆలస్యమయితే, హారతి కార్యక్రమాన్ని మొదలు పెట్టకుండా ఆగమని చెప్పేవారు. ఇలాగే ఒకసారి మేఘాకు బాగా జ్వరం తగిలి హారతి కార్యక్రమానికి బాగా ఆలస్యంగా రావడం జరిగింది. అంత ఆలస్యమైనా బాబా ఓపికగా అతడి కొరకు

ఎదురు చూస్తూ గడిపారు కాని హారతి మొదలుపెట్ట నివ్వలేదు.

ఇలా ఉండగా మకర సంక్రాంతి పండగ వచ్చింది. అది మేఘాకు చాలా సుదినం. ఆ రోజు పవిత్ర గోదావరి జలాలు తెచ్చి తనదైవమైన 'సాయిశంకర్'ను అభిషేకించాలని అతడి కోరిక. అందుకు బాబా అనుమతిని అర్థించాడు. బాబా సరే అన్నారు. ఇంక మేఘా తిరిగి చూడలేదు. ఒక కుండను తీసుకున్నాడు. పాదరక్షలు కూడా లేకుండా బయలుదేరాడు. ఎంత దూరం నడవాలి అన్న ఆలోచన కూడా అతడికి రాలేదు. రానుపోను పదహారు మైళ్ళు నడవవల్సి ఉంది. ఆ రోజుల్లో కోపర్గామ్ రోడ్డు ధారుణంగా ఉండేది. గోతులు, గాతలు, మట్టి దిబ్బలు, ఎగుడు దిగుళ్ళతో రాక పోకలకు ఏ మాత్రం సరిపోయేది కాదు. అంతేకాకుండా దారిపొడుగునా ఏమీ కనపడనీయకుండా పెద్దపెద్ద వృక్షాలు పరుచుకుని ఉండేవి. ఆ గుబుళ్ళ మధ్య బందిపోట్లు కాచుకొని, యాత్రికులను దోచుకుంటూ ఉండేవారు. కాని మేఘాకు ఈ కష్టనష్టాలు స్ఫురణకు వచ్చేవి కావు. అతడి హృదయమంతా భక్తి రసామృతంతో నిండి ఉండి ఆనంద డోలికల్లో తేలుతూ ఉండేది. దీన్నే స్వార్థ రహిత ఆరాధన అంటారు. బాబా పట్ల ఇటువంటి ఆరాధన ఉన్నవారు ఆధ్యాత్మిక ప్రయాణంలో మొదటి మెట్టును సులువుగా ఎక్కగలుగుతారు.

అందుచేత మన దినసరి ప్రార్థన ఈ విధంగా ఉండాలి. "బాబా మమ్మల్ని అనుగ్రహించండి. అలాగైతేనే మేము మేఘా అడుగుజాడల్లో నడవగలం. తద్వారా మిమ్మల్ని అమితంగా ఆరాధించగలం. మీ యొక్క నామాన్ని జపిస్తూ మా దిన చర్య ప్రారంభింపగలం. దానితోబాటే నిస్వార్థపూరిత సేవకు అంకితం కాగలం. ఈ విధంగా ఏదో ఒక రోజున మేఘావలె నియమపాలనతో కూడి ఆతడు ఎక్కిన భక్తి అనబడే మెట్టును ఎక్కగలం. అంతేకాక మేఘా సాధించిన సమాధి స్థితిని అందుకొనే శక్తి సామర్థ్యాలను మాకు ప్రసాదించండి. తైలధారవలె మీ నామ జపాన్ని చేస్తూ బాధల నుండి కష్టాల నుండి తప్పించుకొనగలం. అప్పుడు ఆ బాధలు, కష్టాలు ఓటమిని అంగీకరించక తప్పదు.

# మూడవ వాగ్ధానం



**జరీహె శరీర గ్యేలోమీ తాకూనా**

**తరీమీ ధావేనా భక్తా సాతే!**

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ మూడవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది.

**"ఈ భౌతిక దేహానంతర సహితము నేను అప్రమత్తుడనే"** దీన్నే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. ఈ భౌతిక శరీరాన్ని నేను వదిలివేసినప్పటికీ, నేను నా భక్తులను పరుగెట్టుకుంటూ వచ్చి ఆదుకుంటాను. ఇంతకు ముందు చెప్పబడిన రెండు వాగ్ధానాలు వల్ల భక్తుడికి బాబాయొక్క సగుణ రూపంపై విశ్వాసం కుదురుతుంది. ఇక నుండి బాబా యొక్క నిర్గుణ రూపం అనగా అవ్యక్తంగా, నిరాకారంగా కనపడని రూపం, ఇంకా ఆకాశం వలె సర్వత్రా వ్యాపించిన రూపం, సత్యం, జ్ఞానం అనంతమైన రూపం యొక్క అనుభవం కోసం తపన ప్రారంభమవుతుంది. అదే అతడికి ఆధ్యాత్మిక ప్రయాణంలో తరువాత మెట్టు ఎక్కడానికి సహాయపడుతుంది. బాబా యొక్క ఈ వాగ్ధానమే అతి ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. ఇదే భక్తి మార్గాన్ని సుగమం చేస్తుంది. బాబా యొక్క సర్వవ్యాపకత్వాన్ని ఇది సూచిస్తుంది. బాబా అవ్యక్తంగా అంతటా నిండి ఉన్నారు. జీవ నిర్జీవ పదార్థాలన్నిటా స్థితి కల్గి ఉన్నారు. బాబా యొక్క ఆధ్యాత్మిక శక్తి ప్రసరణ ఆవాహన చేసుకొనే ప్రక్రియ ఇక్కడ నుండే మొదలవుతుంది.

ఈ వాగ్ధానంలో బాబా చెప్పినట్లుగా 'నేను ఈ భౌతిక శరీరం వదిలిపెట్టినప్పటికీ' అన్న మాట ఈ శరీరం యొక్క తాత్కాలిక స్థితిని సూచిస్తోంది. ఇది అశాశ్వితం అనీ ఎప్పటికైనా పోయేదే అనీ తెలుస్తోంది. ఇంకొక ముఖ్య విషయం, బాబా వంటి యోగులు శరీరాన్ని తమ ఇష్టప్రకారంగానే వదిలిపెట్టగలరని కూడా తెలుస్తోంది. అంతేకాక అవసరాన్ని బట్టి ఇంకొక శరీరాన్ని కూడా ధరించగలరు. అందుకే బాబా అన్నారు, "నేను సగుణరూపంలో గాని నిర్గుణ రూపంలో గాని భక్తుల ఎదుట సాక్షాత్కారించి వారి వారి దైవ సంబంధమైన అవసరాలను తీర్చగలను."

నాకు దేశ, కాల, స్థితిగతులతో సంబంధంలేదు. ఎక్కడైతే అనిర్వచనీయమైన భక్తి భావన వెల్లి విరుస్తుందో, ఎక్కడైతే అటువంటి భక్తి భావన నన్ను ఆవాహన చేస్తుందో, అక్కడ వెంటనే సగుణరూపంతో ప్రత్యక్షం కాగలను.

1918వ సంవత్సరానికి ముందు భక్తులు ప్రతి నిత్యం బాబా యొక్క భౌతిక శరీరాన్ని తమ కళ్ళతో దర్శించే ఉన్నారు. అయితే బాబా తన శరీరాన్ని వదిలిపెట్టిన తరువాత, ఆయన యొక్క భౌతిక శరీరం కంటికి కనపడకుండాపోయింది. కాని బాబా ఎప్పటికీ శాశ్వితులే. అనగా అప్పుడూ ఉన్నారు. ఇప్పుడూ ఉన్నారు. ఎప్పటికీ ఉంటారు. ఇదే ఆయన అవ్యక్త రూపాన్ని ఆరాధించడంలో గల మొదటిమెట్టు. ఇది ఒకింత కష్ట సాధ్యమైనప్పటికీ, అలాగే దీనిపై సంపూర్ణ అవగాహనకు చాలా కాలం పట్టినప్పటికీ, మనం ఎప్పటికైనా దీనినే సాధించి తీరాలి.

బాబా ఇలా అంటూ ఉండేవారు. “విగ్రహ రూపంలో ఉన్న నన్ను ఎప్పుడూ అర్చిస్తూ మీ జీవిత కాలాన్ని వృధా చెయ్యకండి. విశ్వవ్యాపకమైన, అన్ని జీవరాశు ల్లోనూ నిండి ఉన్న, అవ్యక్త రూపమైన నా దివ్యత్వాన్ని గ్రహించండి.” అందుచేత మీరందరూ బాబా యొక్క దివ్య ప్రకాశాన్ని గుర్తించండి. ఈ జగత్తునంతా వ్యాపించిన ఆధ్యాత్మిక శక్తిగా తలచండి. శ్రీసాయి సచ్చరిత్ర 44వ అధ్యాయం 101వ పాదంలో ఇలా చెప్పబడింది. సాయి అనగా శక్తివంతమైన సత్‌చిత్ రూపం. అందుచేతనే సత్‌చిత్ కానిది, లేనిది అంటూ ఎక్కడా ఉండదు. అదే లేదంటే జగత్తే లేదు. అప్పుడు ఆ జగత్తును ఆవరించుకొని ఉన్న పది దిశలూ లేనివే అవుతాయి. అందుచేత జీవ నిర్జీవ పదార్థాలన్నిటా అదే ఉందని గ్రహించాలి.

ఆ ప్రకారంగా బాబా తన భౌతిక రూపాన్ని దాటి విశ్వవ్యాప్తమై ఉన్నట్లుగా 44వ అధ్యాయంలో వర్ణించబడి ఉంది. గోవింద రఘునాథ్ అనబడే మేమాధిపంత్, సాయి సచ్చరిత్రలో ఇలా వ్రాసారు. “సుమారు $5^{1/2}$ అడుగుల పొడువున్న ఈ శరీరమనబడే బండి, మాంసము, ఎముకలతో కూడిఉన్న అస్థిపంజరమా సాయి

అంటే? కానేకాదు. ఈ భ్రమను మీరు పోగొట్టుకోండి."

భక్తిమార్గంలో ఇదొక ముఖ్యమైన మెట్టు. ఇది హైస్కూలు చదువు పూర్తి చేసి డిగ్రీ చదువులో ప్రవేశించడం లాంటిది. డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణుడవడం కష్టమే. కాని సాధించాలి. అలాగే ఆధ్యాత్మిక ప్రయాణం కూడా సాగించాలి. ఈ స్థాయికి చేరిన సాధకుడు ఇంక విగ్రహారాధన స్థితి నుండి బయటపడి విశ్వవ్యాప్తమైన, అస్థి భాతిగా మనస్సుకు గోచరించే దైవీ శక్తిగానున్న సాయిని ధ్యానించాలి. ఈ స్థితి సాధకుణ్ని, ప్రతి పదార్థంలోనూ సాయి యొక్క అస్థిత్వాన్ని చూపే దిశగా తీసుకుని వెళ్తుంది. ఎవ్వరైతే సాయిని దేవాలయంలో విగ్రహరూపంగా దర్శిస్తున్నారో, ఆ దేవతామూర్తే వారి హృదయంలోనూ ఇంకా అన్ని ఇతర పదార్థాల్లోనూ అంతర్యామిగా ఉన్నట్లు గ్రహించాలి.

తన యొక్క విశ్వవ్యాప్త స్థితిని, అంతటా ఆవరించుకొని ఉన్న తనదైవీశక్తిని, అనుభవానికి తెచ్చుకొనుటకుగాను బాబా తన భక్తులను మూడు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గం సాధకుణ్ని షిరిడి వదిలిపెట్టి వెళ్ళమనేవారు. రెండవ వర్గం సాధకుణ్ని షిరిడీలోనే ఉంటూ విగ్రహారాధన చెయ్యమనేవారు. ఇంక మూడవ వర్గం సాధకుణ్ని తాను చెప్పిన మత గ్రంథాల్ని చదవమనేవారు. ఈ రకమైన విధానం యొక్క ఉద్దేశ్యమేమిటంటే సాధకుడు సంవత్సరాల తరబడి చేసిన అధ్యయనం మూలంగా బాబాయొక్క అవ్యక్త స్వభావం అనుభవానికి రావడం కోసం తపించడం మొదలుపెడతాడు. ఏది తినుచున్నా త్రాగుచున్నా, కూర్చొని ఉన్నా లేక నిలుచొని ఉన్నా బాబా యొక్క అస్థిత్వాన్ని గ్రహించగలడు.

బాబా అప్పుడప్పుడు అంటూ ఉండేవారు. భౌతికమైన ఈ దేహం ఎప్పటికైనా నశించేదే. కాబట్టి నిజమైన సాధకుడు అశాశ్వితమైన శరీరమనే ఉపాధి కొరకు చింతించడం మాని శాశ్వితమైనది, నశించనిది, మొదలు తుది లేనిది అయిన అవ్యక్తం పై తన మనస్సును కేంద్రీకరించవలసి ఉంటుంది. భగవంతుడనగా ఆ అవ్యక్త స్వరూపమే అన్న నిర్ధారణకు రావల్సి ఉంటుంది. మనముందు, పరుచుకొని కనబడుతున్న ఈ సృష్టి

అంతా నామ రూప సహితమై భ్రమ కల్పించే అవ్యక్తమైన భగవంతుని యొక్క వ్యక్తమైన శక్తి స్వరూపమే. సృష్టి స్థితి లయములనబడే చక్రభ్రమణంలో అవ్యక్తమే కొంతమేర వ్యక్తంగా గోచరిస్తూ భ్రమ కొల్పి తిరిగి అవ్యక్తంలో విలీనమవుతూ ఉంటుంది. ఈ విషయాలన్నీ సచ్చరిత్ర 11వ అధ్యాయం 19 నుండి 22వ పాదం వరకూ చర్చించబడ్డాయి.

తాను ఈ శరీరమనే చట్రంలో బంధీనికానని, అంతటా ఉన్నానని చెప్పడం కోసమే అన్నట్లుగా బాబా ఒకే కాలంలో వేరువేరు స్థలాల్లో అప్పుడప్పుడు ప్రత్యక్ష మవుతూ ఉండేవారు. అంతేకాక స్వయంగా తన భక్తులకు ఈ విషయాన్ని నొక్కి చెప్పేవారు. ఈ క్రింద చెప్పబడే లీలలు దీన్నే ధృవీకరిస్తున్నాయి.

బలరాం మాన్కర్ అనే భక్తుడి విషయం సచ్చరిత్ర 31వ అధ్యాయంలో చెప్పబడింది. ఇతడు బొంబాయి నగరం బాంద్రా ప్రాంతంలో నివశించేవాడు. బాగా ధనవంతుడు, వ్యాపారవేత్త. కాని అతని భార్య మరణించింది. అది అతడిని చాలా బాధపెట్టింది. వ్యాపారంపై దృష్టిని పెట్టలేక వివశుడైపోయి ఉన్నాడు. తన కొడుక్కి వ్యాపారమంతా అప్పజెప్పి బాబా పాదాలను ఆశ్రయించాడు. పూర్వజన్మలలోని సుకర్మల ఫలితమే అతడిని షిరిడీకి రప్పించింది. షిరిడీలో బాబాకు సేవలందిస్తూ కాలం గడుపుతున్నాడు. అయితే దైవ సన్నిధానంలో నివసిస్తున్న అతడి మనస్సు కలవర పాటుకు గురి అవుతూనే ఉండేది. బాబా అతడి పరిస్థితి గమనించారు. ఆయనకు దయ కల్గింది. అతడితో ఇలా అన్నారు. “ఇక నువ్వు షిరిడీలో ఉండనవుసరం లేదు. ఈ పన్నెండు రూపాయలు ఇస్తున్నా తీసుకో. నీకు దారి ఖర్చులకు సరిపోతాయి. నువ్వు మశ్చీంద్రఘడ్‌కు వెళ్ళు. అక్కడ తపస్సు ధ్యానం చేస్తూ కాలం గడుపు.” మశ్చీంద్రఘడ్ లో ఒక కోట ఉంది. ఇది ఒక చిన్న పర్వతంపై కట్టబడింది. మరాఠీలో ఘడ్ అంటే కోట లేక దుర్గం. మహారాష్ట్రలో ఇస్లాంపూర్ తాలూకాలోని సింగలి ప్రాంతానికి చెందింది. మశ్చీంద్రనాథ్ అనే పేరు గల యోగి యొక్క సమాధి ఇక్కడ ఉంది. ఇంకా ఇక్కడ గోరఖ్‌నాథ్ ఆలయం ఉంది. ఇదంతా చూడముచ్చటైన విహార యాత్రా స్థలం.

ఇంతకుముందు బలరాం మాన్కర్‌కు బాబా 12 రూపాయలు ఇచ్చినట్లు

చెప్పబడింది. అయితే ఈ 12 రూపాయల యొక్క ప్రత్యేకత తెలుసుకుందాం. బాబా అక్కడకు వెళ్ళి తపస్సు ప్రారంభించు అని చెప్పారు. అనగా మనం ఇలా అర్థం చేసుకోవచ్చు. 12 మానసిక శక్తులు మనలో అంతర్లీనంగా ఉన్నాయి.

1) వివేకం – మంచి చెడుల విశ్లేషణా సామర్థ్యం. ఆత్మానాత్మల విచారం.

2) వైరాగ్యం – కోరికలు లేనిస్థితి. దేనినీ ప్రత్యేకంగా ఆశించకుండా మెలగటం.

3) నిస్వార్థం – స్వార్థం లేకుండా బ్రతకటం.

4) శమం – మనస్సును అదుపులో ఉంచుకొనటం.

5) దమం – ఇంద్రియ నిగ్రహం.

6)ఉపరతి – అన్ని బంధనాలు, బాంధవ్యాలు నుండి విరమించుకోవడం.

7) తితిక్ష – ఓర్పు వహించడం. ద్వందాలకు అతీతంగా ఉండడం.

8) సమాధానం – మనస్సును ఆత్మవైపు మళ్ళించటం లేక ఆత్మ జ్ఞానాన్ని ఆపేక్షించటం.

9) శ్రద్ధ – గురువునందు శాస్త్రమునందు విశ్వాసం కల్గి ఉండడం.

10) సత్సంగం – దైవ సంబంధమైన విషయాల పట్ల ఆసక్తి కలిగిన వారితో కూడి చర్చలు జరపడం.

11) మౌనం – మాట్లాడడం మానివేసి మనస్సును దైవ చింతనయందుంచటం.

12) ఏకాంత ధ్యానం – ఒంటరిగా తపస్సును ఆచరించి ధ్యానమగ్నులవడం.

అన్నింటికీమించి గురు కృపను పొందటం అన్నది చాలా ముఖ్యమైన విషయంగా ఉంది. ఇది లోపిస్తే పైన చెప్పబడిన మానసిక శక్తులను సాధించడం అసాధ్యం అవుతుంది.

మొదట్లో బలరాంకు షిరిడి వదిలి రావడం ఇష్టంగాలేదు. కాని బాబా ఆజ్ఞను ధిక్కరించడం గురువును ఎదిరించడమవుతుంది. కాబట్టి గురు ఆజ్ఞ ప్రకారం మశ్చీంద్ర ఘడ్‌కు బయలుదేరి వెళ్ళాడు. మశ్చీంద్రఘడ్ చాలా అందమైన ప్రదేశం. అక్కడ

ప్రశాంతత, నిర్మలత్వం వెల్లివిరుస్తూ ఉంటాయి. ఆ విధంగా మశ్చీంద్రఘడ్ చేరుకున్న బలరాం ఏకాంతంగా కూర్చొని ధ్యానం ప్రారంభించాడు. అతడిలో ఏదో తెలియని ఆనందం చోటు చేసుకుంది. ధ్యానం పూర్తి అయి కళ్ళు తెరవగానే బాబా అతడి ఎదుట ప్రత్యక్షమై అతడి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. "ఇక్కడకు నిన్ను పంపించినది నీ భక్తి భావాన్ని విస్తృతపరుచుకొనడానికే. షిరిడీలో ఉండగా నువ్వే మనుకొనేవాడివి? నేను భౌతికంగా ఒక శరీరానికి మాత్రమే చెందినవాడినని అనుకొంటూ నా యొక్క విశ్వవ్యాప్త స్థితిని, అంతర్యామిత్వాన్ని గ్రహించలేకపోయేవాడివి. ఇప్పుడు చూడు అదే నేను ఇక్కడ గోచరిస్తున్నాను. అక్కడ ఏ సాయిని నువ్వు ఆరాధించావో ఆ సాయిని నేనే" అని మాయమయ్యారు. ఇలాగే బలరాంకు ఒకసారి బాబా దాదర్ స్టేషనులో ఒక రైతుగా కనపడి తన దగ్గరనున్న రైల్వే టిక్కెట్టును బలరాంకు ఇచ్చి తను ఇంటికి వెళ్ళేటట్లు చేసారు. ఇదే విధంగా చంద్రా భాయి బ్రోకర్ ఎదుట ప్రత్యక్షమై ఆమెకు మూడు రైల్వే టిక్కట్లను ఇచ్చి ఆమె భర్త డూండ్ దగ్గర తన కోసం ఎదురు చూస్తున్నాడని చెప్పి అదృశ్యమయ్యారు.

ఇంక ఇప్పుడు చెప్పబోయే లీల చాలా ఆశ్చర్యకరమైంది. ఎందుకంటే అది బాబా యొక్క మహానిర్యాణానికి ముందు, తరువాత జరిగిన విశేషాలను వివరిస్తుంది. దీనిలో బాబా తన భౌతిక శరీర సరిహద్దులను దాటి చూపెట్టిన పారదర్శక స్వరూపం గురించి తెలుస్తుంది. ఇక్కడ ప్రస్థావించిబడ్డ భక్తుడు అనామకంగా ఉండ దలచినవాడు. అయితే తనను తాను ఆములెట్ అని తెలియచేస్తూ ఉండేవాడు. ఈ 'ఆములెట్' బొంబాయి నగరంలో ఉండేవాడు. బాబాకు నమ్మకమైన భక్తుడు. బాబా అతనికి ఎన్నో సందర్భాల్లో ఎన్నో అనుభవాలను కల్గించారు. అయితే ఈ ఆములెట్ అనే భక్తుడు మాధిబువా అనబడే ఒక సాధువును కూడా కలుస్తూ ఉండేవాడు. ఆ సాధువు బొంబాయిలోని ఫోర్జెట్ వీధిలో ఉంటూ ఉండేవాడు. ఆములెట్ ఆ సాధువును ఉదయం పూట కల్సి మధ్యాహ్నం వరకూ అక్కడ గడిపి ఇంటికి బయలుదేరాడు. దారిలో ఒక భోజనశాల దగ్గర ఆగాడు. అతడు కూర్చున్న స్థలానికి ఎదురుగానున్న గోడపై బాబా చిత్రపటం

వ్రేలాడుతోంది. కొంతసేపట్లో అతడి భోజనం వచ్చింది. అప్పుడతడు బాబా ఫోటోను చూస్తు ఇలా అనుకున్నాడు. "బాబా! నా జీవితం ఎంతో దౌర్భాగ్యమైంది. నేను బ్రహ్మచారిని కాబట్టి ఇక్కడా అక్కడా భోజనాలు తింటూ గడపవలసి వస్తోంది. నాకు భార్యలేదు. ఉన్నట్లయితే ఆమె వండిన వంటను చక్కగా నీకు నైవేద్యంగా సమర్పించి ఉండేవాడిని. కాని ఇలా ఒంటరి జీవితం గడుపుతూ బ్రతుకుతున్నాను" అని బాధపడుతూ కళ్ళ నుండి నీరు కారి బుగ్గలపై జారిపడేలా రోధించసాగాడు.

సరే ఇంక భోజనం చెయ్యడానికి ఉపక్రమిస్తున్న సమయంలో ఆములెట్ ఎందుకో చుట్టూ ఒకసారి కలయజూసాడు .అతడికి ఒక్కసారి ఊపిరి ఆగినంత పనైంది. ఎందుకంటే బాబా, మాధిబువా కాస్త దూరంలో ఉన్న టేబులు దగ్గర కూర్చుని భోజనం చేస్తున్నారు. అది చూసి అతడి హృదయం ఆనందంతో నిండిపోయింది. కంటిలో నీళ్లు అదేపనిగా రావడం వల్ల అవి మూతపడ్డాయి. తనలో తాను ఇలా అనుకున్నాడు, "బాబా! నేనొక పాపిని. ఎందుకూ పనికి రాని వాడిని, మీరు ఎదురుగా కూర్చొని భోజనం చేస్తున్నా సరే మీ యొక్క దివ్యరూపాన్ని చూడలేకపోతున్నాను. ఇలా తాను అనుకుంటూ ఉండగానే, బాబా మాధిబువా అక్కడ నుండి అదృశ్యమయ్యారు. కాసేపటికి ఆములెట్ భోజనశాల నుండి బయటకు వచ్చాడు. బాబా మాధిబువా నిజంగా ఆ బోజశాలకు వచ్చారా? లేదా? అని తెలుసుకోవాలన్న ఆసక్తి అతడిలో మొదలైంది.

కొన్ని రోజుల తరువాత అతడు మాధిబువాను కలిసి ఆనాడు అతని అనుభవాన్ని లీలగా వివరించి చెప్పాడు. ఆరోజు బాబాతో కలసి భోజనశాలకు వచ్చారా? అని అడిగాడు. దానికి మాధిబువా ఒప్పుకున్నారు. అవును నీ శ్రద్ధ, అచంచల విశ్వాశమే బాబాను నీకక్కడ ప్రత్యక్షమయ్యేటట్లు చేసింది. అనగానే, ఆములెట్ మాధిబువా సంగతి అడిగాడు. మాధిబువా చెపుతున్నారు. నేను నా భౌతిక శరీరంతో అక్కడికి రాలేదు. బాబాకున్న అద్వితీయశక్తితో ఆయనే రెండు రూపాల్లో నీకు అక్కడ కనపడ్డారు. అందువల్లనే బాబాను నన్ను ఒకే కాలంలో నువ్వు చూడగలిగావు.

ఆ సందర్భంలోనే మాధిబువా బాబాకు సంబంధించిన ఇంకొక లీలను చెప్పసాగాడు. బొంబాయి చీరా బజారులో డబ్బుగల ఒక వ్యాపారి ఉన్నాడు. అతడికి చెడు తిరుగుళ్ళు తిరిగే ఒక కొడుకున్నాడు. తండ్రి సంపాదన దూబరా చెయ్యడం కొడుక్కి వ్యసనమైపోయింది. అంతేకాక ఎక్కువ వడ్డీకి అప్పులు కూడా చేసేవాడు. ముందూ వెనకా చూసుకోకుండా అప్పు పత్రాలు (Promissory Notes) వ్రాసి యిచ్చేవాడు. దాన్ని అలుసుగా తీసుకుని వడ్డీ వ్యాపారులు, ఇచ్చిన డబ్బుకంటే ఎక్కువ మొత్తాలకు పత్రాలు వ్రాయించుకొనేవారు. ఆవిధంగా అతడి జీవితం నాశనం అయ్యింది. అప్పుడు కొంతమంది స్నేహితులు అతడిని షిరిడికి వెళ్ళి బాబాను శరణువేడమని సలహా యిచ్చారు. బాబా నీ విషయంలో కల్పించుకొని నీ జీవితాన్ని సరిదిద్దగలరని, అంతేకాక డబ్బుపరంగా నువ్వు పొందే దివాళాస్థితిని చక్కబెట్టగలరని బోధించారు. దాంతో అతడు షిరిడీకి ప్రయాణమయ్యాడు. కాని బాబాకు అతడిని చూడగానే తెగ కోపం వచ్చింది. అతడికి ధన సహాయం చేయడమటుంచి, ఒక కర్ర పట్టుకొని అతడి వెనకపడి కొట్టినంత పని చేసారు. విపరీతమైన కోపంతో "సాగలే పైసా పనీత్ తాకలే" (నీ ధనమంతా నీళ్ళపాలు చేసావా?) అయితే ఇప్పుడు తిరిగి బొంబాయి పో. నేను నీకు అక్కడ కనపడతానులే అని గట్టిగా అరిచి అతని వెళ్ళగొట్టారు.

ఆ యువకుడు చేసేది లేక ఆశ నిరాశను చేసుకొని దిగులుగా బొంబాయి చేరుకున్నాడు. ఇంటికి చేరుకున్నంతలో అక్కడ కనపడిన దృశ్యం చూసి నమ్మలేక పోయాడు. అతడికి అప్పు యిచ్చినవాడొకడు అక్కడున్నాడు. వాడికి ఎదురుగా బాబా నిలుచుని మాట్లాడుతున్నారు. నువ్వు మళ్ళీ ఇక్కడకు వచ్చావా నీ పీక నులిమేస్తాను జాగ్రర్త. నీకు ఆ కుర్రవాడిచ్చిన ఋణ పత్రాలన్నీ తిరిగి యిచ్చెయ్యి. అలాగే తాకట్టు పెట్టిన బంగారు నగలు అన్నీ తిరిగి యిచ్చెయ్యి. అంతేకాకుండా నీ అప్పంతా తీరిపోయిందని ఒక పత్రం గూడాయ్యి. దివాలా తీసిన ఆ యువకుడికి బాబా స్పష్టంగా కనపడుతున్నారు. కాని అప్పు వసూలు చేసుకుందికి వచ్చిన వడ్డీ వ్యాపారికి మాత్రం బాబా ఒక దెయ్యంలా కనపడుతున్నారు. దాంతో ఆ వ్యాపారికి ముచ్చెమటలు

పోసాయి. ఆ దెయ్యం చంపేస్తుందేమోనని భయంతో వణికిపోతూ బాబా చెప్పినట్లే ఆయువకుడి దగ్గర తీసుకున్న పత్రాలు, నగలు అన్నీ ఇచ్చీసాడు. ఇంకా అప్పు తీరినట్లు పత్రం గూడ ఇచ్చివేసాడు. అప్పుడు బాబా ఆయువకుడి వైపు తిరిగి, నేను నీకు సహాయం చెయ్యకుండా విడిచిపెట్టేననుకున్నావు కదా! కాని నన్ను శరణువేడిన వారిని నేనెప్పుడూ విడిచిపెట్టను అన్నారు.

(ఇది శ్రీసాయి సచ్చరిత్ర పత్రిక, ఏప్రియల్ 1950, వాల్యూమ్ 10, పార్ట్ 11 నుండి గ్రహించబడింది)


పైన చెప్పబడిన బాబా లీలను బట్టి మనం అర్థం చేసుకోగల్గిన విషయం ఒకటుంది. బాబా శరీరమన్నది ఆయన చేతిలోని ఒక ఆట బొమ్మలాంటిది. బాబా భౌతికంగా ఒక శరీరాన్ని ధరించి వున్నారా? లేక మహానిర్యాణం (శరీరాన్ని విడిచిపెట్టడం) పొందారా? అన్నది ప్రక్కన పెడితే, భక్తులను రక్షించటంలో ఆయన పరుగుపరుగున వచ్చి చేయూత ఇస్తారు అనడంలో ఎట్టి సందేహం లేదు. చాలామంది భక్తులు ఇలా అనడం మనం వింటూ ఉంటాం. మాకు బాబాపై చాలా భక్తి ఉంది. గత 40, 50 సంవత్సరాలుగా మేము బాబా విగ్రహాన్ని పూజిస్తూనే ఉన్నాం. ఐతే ఇది చెప్పమనండి. ఇలా ఎన్ని జన్మలు అటువంటి విగ్రహారాధన చేస్తూ ఉంటారు? మీ ఆధ్యాత్మిక పురోగతి విషయంలో మరోమెట్టు మీరు ఎప్పుడు ఎక్కుతారు? బాబా యొక్క విశ్వవ్యాపకత్వాన్ని మీరు ఎప్పటికి తెలుసుకుంటారు?

సచ్చరిత్ర 11వ అధ్యాయం 23, 24 పాదాల్లో బాబా యొక్క విశ్వవ్యాపకత్వం వర్ణించబడి ఉంది. ఈసృష్టి యావత్తూ అనగా చతుర్ముఖ బ్రహ్మ మొదలు చిన్న గడ్డిపరక వరకూ వ్యష్టిరూపంగా కాని సమిష్టి రూపంగా కాని తమ తమ అస్థిత్వాలను కల్గి ఉన్నట్లు గోచరించినప్పటికీ, సృష్టి స్థితి లయములనే సూత్రం ప్రకారం ఏ పరబ్రహ్మ స్వరూపం నుండి ఇదంతా ఉద్భవించినట్లుగా కనపడుతున్నదో, ఆ స్వరూపంలోనే లయమవుతున్నాది.

ఈ కారణంచేత మరణం అన్నది ఎవ్వరికీ కలుగదు. మరి బాబా మరణించారు

అన్నది మాత్రం ఎలా నిజమవుతుంది. శ్రీసాయిబాబా పరిశుద్ధస్వరూపులు. ఆది మధ్యాంత రహితులు, మూర్తీభవించిన జ్ఞాన స్వరూపంగా అవతరించిన వారు. ఆకాశం వలె విశ్వవ్యాప్తమై ఉన్నవారు.

అంతటా నిండి ఉన్న శ్రీసాయి ఆత్మ స్వరూపం భక్తుల మొరలు ఆలకించి, వారి రక్షణ కొరకు అన్ని సమయాల్లోనూ సిద్ధంగా ఉంటుంది అనడంలో ఎట్టి సందేహం లేదు. భక్తులను ఆపద సమయాల్లో పరుగెత్తుకుంటూ వచ్చి సాయి ఆదుకుంటారు అనడంలోని అంతరార్థం కూడా ఇదే.



## నాలుగవ వాగ్దానం
### నవసాసా సమాధి పావేలా సమాధి
### ధరా దృఢ బుద్ధి మాజాతాయె!

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ నాలుగవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది.

**"నా భక్తుల రక్షణము నా సమాధి నుండియే వెలువడును."** దీనినే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. నా సమాధియే మీ అభీష్టములను నెరవేర్చును. నా యందు అపరిమితమైన, అచంచలమైన, దృఢమైన విశ్వాసాన్ని కలిగి ఉండండి.

ఈ వాగ్ధానం బాబా యొక్క హామీని లేక ఆయన సమాధి యొక్క ప్రతిజ్ఞను వివరిస్తోంది. భక్తుల కోరికలు తీర్చడమే బాబా కర్తవ్యంగా చెపుతోంది. అదే ప్రకారం బాబాకి కూడా ఒక కోరిక ఉంది. అదేమిటంటే తన వాగ్ధానానికి ధీటుగా భక్తులు కూడా చెక్కుచెదరని విశ్వాసాన్ని, ఏకైక దీక్షా సంకల్పాన్ని కలిగి ఉండాలి.

నిజానికి ఇలాంటి హామీల గురించి కాస్త ఆలోచిస్తే మనకేమనిపిస్తుంది. నేను ఇది ఇస్తాను కాబట్టి నువ్వు నాకు అది ఇస్తావా అన్న బేరం పెట్టుకుంటున్నట్లు ఉన్నది కదా! ఇదేనా నిజమైన భక్తి? ఇదేదో వస్తుమార్పిడి వ్యాపారంలాగ ఉంటుంది. ఈ విధానంలో భక్తుడు భగవంతుణ్ని తన కోరిక ముందు తీర్చమంటాడు. అలా తన కోరిక తీరిన తరువాత ముడుపు చెల్లించుకుంటాడు. ఇదేమైనా తప్పుడు పద్ధతా అంటే కాదనే సమాధానం కూడా వస్తుంది. నూటికి తొంబై మంది భక్తులు దీన్నే ఆచరిస్తున్నారు. చాలా మంది భక్తులు వారి స్నేహితులకు కూడా ఇలాంటి సలహాలే ఇస్తూ ఉంటారు. ఆ స్నేహితుడుకి బాబా గురించి అసలు తెలియకపోవచ్చుగాక, కాని తన స్నేహితుడు చెప్పాడు కదా అన్న నమ్మకం చేత గాని, తను ఎదుర్కొంటున్న ఇబ్బందువల్ల గాని, బాబాకు మ్రొక్కుకుంటాడు. ఇక్కడ బాబా కూడ అతడి విశ్వాసాన్ని వమ్ము చెయ్యరు. అతడి కోరిక నెరవేర్చి, ఇబ్బందిని తొలగిస్తారు. అదుగో, ఆక్షణంలోనే అతడిలో భక్తి అనే విత్తనం మొలకెత్తడం ప్రారంభిస్తుంది. బాబా ప్రేరణచేత

అది మొగ్గలు తొడిగి విస్తరిస్తుంది. ప్రాపంచిక లేక సంసార సంబంధమైన విషయాల్లో బాబాను ఆశ్రయించడం అన్నది భక్తుడి ఆధ్యాత్మిక ప్రయాణంలో మొదటి మెట్టుగా ఉంటుంది. భక్తుడు తన కోరిక సఫలీకృతమవగానే బాబాపై ఎనలేని విశ్వాసాన్ని కనబరుస్తూ ఉంటాడు. అటు తరువాత బాబా గురించి ఎక్కువగా తెలుసుకోవడానికి లేక బాబా సచ్చరిత్రను చదవటానికి ప్రయత్నిస్తాడు. ఇది అతడి భక్తిని మరింత ముందుకు తీసుకునిపోతుంది. అలా పోయిపోయి ఇంక అవధులులేని అనగా అంతులేని స్థితికి చేరుకుంటుంది.

బాబా దేహంతో ఉన్నప్పుడు ఒకసారి ఒక భక్తుడు అక్కడ ఉన్న జనాన్ని ఉద్దేశించి ఇలా అన్నాడు. మీరందరూ అనేక రకాలైన కోరికలతో ఇక్కడకు రావద్దు. ఉద్యోగం నిమిత్తం, డబ్బుకోసం, పిల్లలు పుట్టాలని ఇంకా అనేక వ్యాధులు నయం కావాలని వస్తున్నారు. అలా బాబాను మీరు ఇబ్బందిపెడుతున్నారు అన్నాడు. ఆ మాటలు విన్న బాబా అతడిని మందలించారు. "నా భక్తులు, ముందు నన్ను అడిగేది వారి కోరికలు తీరుట కొరకే. అవి తీరిన తరువాత వారు జీవితంలో స్థిరపడతారు. అప్పుడిక నన్ను ఇబ్బంది పెట్టరు. నాదారిన నడుస్తూ భక్తి భావన మార్గంలో అభివృద్ధి చెందుతారు.

నా భక్తులు ఎక్కడ ఉన్నా సరే త్రాడుతో కట్టబడిన పక్షిని దగ్గరగా లాగుకొన్నట్లు వారిని నా దగ్గరగా లాగుకుంటాను అన్నారు. ఈ భూమి మీద బాబా ఒక సాకార రూపాన్ని ధరించి వచ్చినది భక్తులను సన్మార్గులుగా చేయుట కొరకే అని గ్రహించాలి. ఆ కారణం చేత బాబా ముందుగా భక్తుల ప్రాపంచిక విషయాల్లో వారి వారి అభీష్టాలను నెరవేరుస్తూ ఉంటారు. వారికి కలిగే కష్టాలను, బాధలను తొలగించి వారికి ఉపశమనం కలిగేటట్లు చూస్తూ ఉంటారు. ఈ విధంగా భక్తుడు బాబా తత్త్వంతో సంబంధమేర్పరుచుకొని కొన్నాళ్ళకు ప్రాపంచిక సుఖాల పట్ల విరక్తుడవుతాడు. కోరికలు, అనుభవాలలోని క్షణికత్వాన్ని గ్రహించగల్గుతాడు. దాని తరువాత భోగభాగ్యాలు అశాశ్వితమని, వాటిని పొందుదామన్న తపన అర్థం

లేనిదని రూఢి చేసుకుంటాడు. ఆ పరిస్థితుల్లో మ్రొక్కులు, ముడుపులు మొదలైన జంఝాటములన్నీ వాటికవే ప్రక్కదారిపడతాయి. అప్పుడు నాలుగవ వాగ్దానం యొక్క అసలు రహస్యం అవగాహనకు వస్తుంది. నా సమాధి నుండియే భక్తులకు కావల్సిన రక్షణ దొరుకుతుంది అన్నమాట అర్థమవుతుంది. ఆ రక్షణ ఎప్పుడు ఎలా దొరుకుతుంది అన్న ప్రశ్న వస్తే సమాధానం ఇలా ఉంటుంది. ఎప్పుడైతే భక్తుడు బాబా నామ జపాన్ని ఎక్కడా ఆగకుండా చేస్తూ ఉంటాడో అప్పుడు అదే అతడి అసలు స్వభావంగా మారి భక్తిని, విశ్వాసాన్ని చెక్కు చెదరనీయకుండా చేస్తుంది. బాబాయే అతడికి ప్రాణం. ఆ ప్రాణం వల్లనే ఉచ్వాసనిశ్వాసాలు నిరాటంకంగా జరుగుతున్నట్లు భావిస్తాడు.

ప్రార్థనలు స్వలాభానికని కాక, పరోపకారం నిమిత్తంగా చేస్తూ ఉంటే బాబాకు ప్రీతిపాత్రంగా ఉంటుంది. బాబా ఆ ప్రార్థనలను తప్పక నెరవేరుస్తారు. వరదలు, కాటకాలు వచ్చినప్పుడు గ్రామాలు కాని, పట్టణాలు కాని కష్టకాలంలో ఉన్నప్పుడు బాబా భక్తుల ప్రార్థనలు మన్నించి ఆదుకుంటూ ఉంటారు. అటువంటి ప్రార్థనల వెనుక స్వలాభాపేక్ష ఉండదు. ఇంకా తాడిత పీడిత ప్రజలకు చేసే సహాయం నిమిత్తం చేయబడినవి కనుక బాబా తక్షణం స్పందిస్తూ ఉంటారు. ఈ రకమైన బాబా అనుగ్రహ చర్యలు ఈ క్రింద చెప్పబడిన లీలల్లో కనపడతాయి.

నా స్నేహితురాలు మంజుల కొద్దిరోజుల క్రిందట యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వారి ఇంటర్నెల్ ఆడిట్ బ్రాంచికి బదిలీ చెయ్యబడింది. ఆ కారణం చేత ఆమెకు ఉద్యోగరీత్యా చాలా నగరాలకు, పట్టణాలకు వెళ్ళే అవకాశం వచ్చింది. దానిలో భాగంగా 7-9-2014న ఆమె బృందం జమ్మూకి వెళ్ళవలసి ఉంది. అప్పుడు అక్కడ విపరీతంగా వర్షాలు పడుతున్నాయి. ఆ ప్రాంతమంతా వరదనీటిలో మునిగిపోయింది. నేను టి.వి.లో ఆ వరద దృశ్యాల్ని చూస్తున్నాను. ఆ రోజు అనగా 6-9-2014న నేను మంజులకు సందేశం పంపించాను. జమ్మూ ప్రాంతంలో వరద గురించి చెప్పాను. కాబట్టి వాళ్ళు బయలుదేరేముందు జమ్ము పరిస్థితి గమనించి

నిర్ణయం తీసుకొనమని చెప్పాను. నా సందేశం వచ్చిన సమయంలో మంజుల మల్లేశ్వరం బాబా గుడిలో ఉంది. ఆ రోజు నేను మంజులతో ఫోనులో మాట్లాడి అక్కడికి వెళ్ళవద్దని చెప్పాను. ఆ మరుసటి రోజు నేను యధాప్రకారం ప్రదక్షణలు చెయ్యడం కోసం లెండిభాగ్‌కు వెళ్ళాను. ప్రదక్షణలు చేస్తూ మంజుల ప్రయాణం గురించే ఆలోచిస్తున్నాను. బాబాను ప్రార్థించాను. మంజుల బృందానికి రక్షణ కల్పించమని వేడుకొన్నాను. మంజుల బృందం క్షేమంగా జమ్ముకెళ్ళి తిరిగి బెంగళూరు చేరుకొనేటట్లు చేయమని అందుకుగాను వారు ఇల్లు చేరగానే లెండిభాగ్‌లో బాబా కోసం ఒక వారం రోజులు దీపం వెలిగిస్తానని మ్రొక్కుకున్నాను. నిజానికి ఇది చాలా స్వల్పమైన మ్రొక్కు. కాని నాకు అప్పటికి అదే తోచింది. అంతకుమించి ఇంకొక ఆలోచన రాలేదు.

7-9-2014న అనుకున్న ప్రకారం మంజుల బృందం జమ్ముకి ప్రయాణ మయ్యారు. కాని మంజులకు మాత్రం అది కొంతవరకు చికాకు పరిచే ప్రయాణం అనిపించింది. బాబాను ఏ చర్య తీసుకోవాలో చెప్పమని చీటీల ద్వారా ప్రార్థించింది. దాని ప్రకారం బాబా చెప్పినది శ్రీపాద శ్రీవల్లభ చరిత్రలో 51వ అధ్యాయం చదవమని వచ్చింది. అది వరదలో మునక నుండి, ఇతర బాధల నుండి రక్షణ కల్పిస్తుంది. మంజుల ఆ అధ్యాయాన్ని ఒక కాగితంపై వ్రాసి పెట్టుకుని, అదే రక్షిస్తుంది అని నమ్మి ప్రయాణమయ్యింది.

వారందరూ జమ్ము చేరేసరికి మధ్యాహ్నం రెండు గంటలయ్యింది. ఆ ఉదయం 10గం॥ల నుండి అక్కడున్న వంతెనలన్నీ నీళ్ళల్లో మునిగిపోయి ఉన్నాయని వారికి తెలిసింది. ఇండియన్ ఆర్మీ సహాయక చర్యలు చేపట్టింది. నీటి మట్టం రానురాను మూడు అంతస్థులంత ఎత్తు పెరిగిందని అందరూ చెప్పుకుంటున్నారు. అక్కడున్న 'రావి' నది పొంగి ప్రమాద సూచికలను దాటి ప్రవహిస్తోంది. ప్రజలందరూ 'రావి' నదిని శాంతించమని ప్రార్థనలు చేస్తున్నారు. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మంజుల బృందం వారి కార్యాలయానికి క్షేమంగానే చేరుకున్నారు. వారి దారిలో గల వంతెనల దగ్గర నదీ ప్రవాహం తగ్గుముఖం పట్టింది. దానివల్ల

రద్దీ తగ్గి సులువుగా రాకపోకలు మొదలయ్యాయి. ఆర్మీవారు వంతెనలపై రాక పోకలకు అనుమతి ఇచ్చారు. బాబా దయవల్ల మంజుల బృందం వారంతా వారి బాధ్యతలను నిర్వహించి సకాలంలోనే బెంగుళూరుకు చేరుకున్నారు.

ఇక్కడ షిరిడీలో ఉన్న నేను నా స్నేహితురాలి కొరకు గాను చేసిన ప్రార్థన ఫలించింది. బాబా నా కోరిక తీర్చారు. ఒక్క మంజుల బృందాన్నే రక్షించడం కాకుండా, రావినది ఉధృతిని కట్టడి చేసి జమ్ము ప్రజలందరినీ సురక్షితులను చేసారు. అందువల్ల అక్కడి ప్రజలందరూ వారి వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవడం జరిగింది. అంతేకాకుండా ఇదంతా నన్ను అభిమానించే అనేకమంది స్నేహితుల సామూహిక ప్రార్థనలు ఫలితమే అయ్యుంటుందని నా అభిప్రాయం.

ఇక రెండవదిగా చెప్పబడుతున్న ఈ లీల కూడ సామూహిక ప్రార్థనల వల్ల ఒక భజన మండలి సభ్యుడిని బాబా ఎలా రక్షించారో తెలుపుతుంది. నా స్నేహితుడు నాగరాజు ఈ బాబా లీలను నాకు చెప్పాడు. కొద్ది సంవత్సరాల క్రిందట బెంగుళూరులో కామత్ అనబడే వ్యక్తి, అతని భార్య వందన ఒక భజన మండలిని మొదలుపెట్టారు. ప్రతి ఆదివారం భజన కార్యక్రమం ఉండేది. క్రమంగా వారి మండలి విస్తరించి సభ్యులు సంఖ్య పెరిగింది. నాగరాజు, అతడి స్నేహితుడు తేజకుమార్ కూడా ప్రతి భజన కార్యక్రమానికి హాజరు అయ్యేవారు. ఇలా ఉండగా ఒక రోజు తేజకుమార్‌కు పెద్ద ప్రమాదం జరిగి ఆసుపత్రిలో చేరాడు. అతడి పరిస్థితి చాలా విషమంగా ఉంది. తలకు పెద్ద గాయం అయింది. న్యూరోసర్జను కూడా సందేహం వ్యక్తపరిచాడు. మొత్తం భజన బృందమంతా ఆసుపత్రి బయట గుమిగూడి బాబాను శరణు వేడడమే మార్గమని నిశ్చయించుకొన్నారు. అప్పుడు వారందరూ వందన ఇంటికి చేరి సామూహిక ప్రార్థనలు చేయటం మొదలుపెట్టారు. ఆ సందర్భంలో నాగరాజు చెప్పింది ఇలా ఉంది.

ఆ రోజు రాత్రి వందన బాబాకు సేజ్‌హారతి సమర్పించి దోమతెర వేసి బయటకు వచ్చింది. మేమందరం వందన యింటికి చేరుకున్నాం. మా ఆతృత

వల్ల దోమతెరను తీసివేసి బాబాను అక్షరాలా నిదురలేపాము. తరువాత అందరం కల్సి తేజకుమార్ కోలుకునేటందుకు ప్రార్థనలు చేసాము. చివరకు ఒక్కొక్కరు ఒక్కో విధమైన మ్రొక్కులు చేసాము. పాదరక్షలు లేకుండా కోపార్గం నుండి షిరిడీకి నడచి వస్తామని ఒకరు, 108 ప్రదక్షణలు చేస్తామని ఇంకొకరు, సచ్చరిత్ర పారాయణ చేస్తామని మరొకరు ఇలా తలోవిధంగా మ్రొక్కుకున్నాము.

అక్కడ ఆసుపత్రిలో సర్జను, తేజకుమార్‌ను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్ళాడు. ఆ పరిస్థితిలో రక్తం బాగాపోతూ ఉండడంతో, 4 లేక 5 సీసాల రక్తం కావల్సి వచ్చింది. అయితే అతడి బ్లడ్ గ్రూప్ B నెగటివ్ అవడంతో, ఆ రకం రక్తం దొరకడం కష్టమైపోయింది. అప్పుడే బాబా లీల పనిచెయ్యడం మొదలు పెట్టింది. ఒక ముస్లిం యువకుడు అంతవరకూ ఆసుపత్రి గుమ్మం దగ్గర నిలబడ్డవాడు, తనంతతానుగా ఆపరేషన్ థియేటర్ వద్దకు వచ్చి తన రక్తం తీసుకోండని అభ్యర్థించాడు. ఆశ్చర్యకరంగా ఆయువకుడిది కూడా B నెగటివ్ రక్తం అయ్యింది. తేజ్‌కుమార్ ఆపరేషను ఫలించింది. అతడు ప్రాణాపాయ స్థితి నుండి తప్పించుకొన్నాడు. అతడి మెదడు దెబ్బ తినకుండా ఉంటే బాగుండునని అందరం అనుకున్నాము. చాలాకాలం వరకూ అతడు ఆసుపత్రిలో ఉండాలని చెప్పారు.

ఇలా ఉండగా ఒకనాడు తేజ్‌కుమార్‌కి బాబా కలలో కన్పడ్డారు. ఆ కలలో అతడు సాయి సమాధి మందిరం చూద్దామని వెళ్ళాడు. కాని ఆ మందిరం ఇప్పుడు ఉన్నట్లుగా లేదు. అది ఒక సమాధి మాత్రమే. ఇంకా అది సమాధి యొక్క చిత్రపటం లాగ ఉంది. మ్యూజియంలో ఒక బొమ్మ మాదిరి ఉంది. సమాధి మీద బాబా విగ్రహం లేదు. కాని సమాధిలో బాబా కూర్చొని ఉన్నారు. తేజ్ ఆ సమాధి దగ్గరకు వెళ్ళాడు. బాబా భుజంపై ఒక జోళి వ్రేలాడుతోంది. బాబా మీ దగ్గరున్న ఆ జోళిలో ఏముందని అడిగాడు. అప్పుడు బాబా అన్నారు, మీరందరూ నా సచ్చరిత్ర చదువుతారు కదా! అలాగే నేను కూడా నా భక్తులకు సంబంధించిన ప్రతి ఒక్కరి చరిత్రా నా జోళిలో ఉంచుకున్నాను. అప్పుడప్పుడు వాటిని బయటకు తీసి చూస్తూ ఉంటాను. ఈ

విధంగా బాబాలీలను నాగరాజు చెప్పి ముగించాడు.


ఆసుపత్రిలో ఉన్న తేజ్‌కుమార్ మెదడుకు సంబంధించిన జబ్బు నుండి తేరుకున్నాడు. తరువాత సంతోషంగా జీవితం గడుపుతున్నాడు. పై లీల నుండి మనం గ్రహించవలసినదేమిటంటే, ఆపద సమయంలో బాబాకు మ్రొక్కిన మ్రొక్కులు, ఇంకా సామూహికంగా చేసిన ప్రార్థనలు తేజ్‌కుమార్‌ను మరణ ద్వారం నుండి వెనక్కు తీసుకువచ్చాయి. పరోపకారం నిమిత్తం చేసిన ప్రార్థనలకు, మ్రొక్కుబడులకు ఇంతశక్తి ఉంది.

అయితే దీనికి విరుద్ధంగా చేసే దుష్ట ఆలోచనలకు గాని, నేరపూరిత మ్రొక్కులకు గాని బాబా అభయం ఉండదుగాక ఉండదు. బాబా! వాళ్ళని నాశనం చెయ్యి. నీకు నేను 5 కేజీల దూద్‌పేడా సమర్పించుకుంటాను అని మ్రొక్కితే బాబా అటువంటి నీచమైన మ్రొక్కులకు స్పందిస్తారా? లేదు. నీ ప్రార్థన పవిత్రమైనది అయ్యుండాలి. పరోపకారార్ధం అయ్యుండాలి. అంతేకాని నువ్వు షిరిడీకి వెళ్ళి బాబా సమాధి దగ్గర నిల్చొని "బాబా! నాకు అదియ్యి, ఇదియ్యి, కాని నన్ను మాత్రం ఏమీ అడగకు" అంటే బాబా నీ ప్రార్థన ఆలకిస్తారు అనుకుంటున్నావా? నువ్వే నిర్ణయించుకో.

# ఐదవ వాగ్దానం

## నిత్యామీ జీవన్తా జానా హే చీ సత్యా

## నిత్యా ఝ్యా ప్రచీతా అణూ భావే!



మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ ఐదవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది.

**"నా సమాధి నుండియే నేను సర్వకార్యములు నిర్వహింతును."** దీన్నే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. నేను అమరుడను అనగా మరణం లేనివాడను. ఈ సత్యం తెలుసుకో. తరువాత నా అమరత్వం యొక్క అనుభవాలను ఎప్పటికీ తెలుసుకుంటూ ఉండు.

"నేను ఎప్పుడూ నిత్యుడనే. ఈ జగత్తులో ప్రతి ప్రాణి నా నుండే ప్రాణశక్తిని గ్రహిస్తోంది" అంటారు బాబా. కాబట్టి ఈ సృష్టి మొత్తానికి ఉన్నటువంటి వెలుగు, శక్తి ఆయనే అయి ఉన్నారు. ఇది బాబా యొక్క దివ్యశక్తిని వ్యక్త పరచే ఐదవ మెట్టు. దీన్నే బాబా సోదాహరణంగా శ్రీమతి తార్కడ్‌కు చేసి చూపెట్టారు. శ్రీమతి తార్కడ్ ఒక సారి ఆకలిగొన్న ఒక కుక్కకు, ఒక పందికి అన్నం పెట్టింది. దాంతో బాబాకు కడుపు నిండింది. బాబాకు ఆకలి తీరింది. అందుకు నిదర్శనంగా ఆయనకు త్రేనుపు కూడా వచ్చింది. శ్రీమతి తార్కడ్ ఒకసారి ద్వారకామాయి వచ్చినపుడు బాబా ఇలా అన్నారు. ఒక్కోసారి నేనే ఒక కుక్కను. అలాగే ఇంకోసారి ఒక పందిని, అలాగే ఒక ఆవును, పిల్లిని, చీమను, దోమను, నీటిపురుగును. ఈ ప్రపంచంలో నేను అనేక రూపాల్లో తిరుగుతూ ఉంటాను." ఇప్పుడు ఈ క్రింద చెప్పబోయే లీల ఈ విషయాన్నే మరింత విశదపరుస్తుంది.

హంసరాజ్ వాణి అనబడే వ్యక్తికి ఆస్తమా వ్యాధి ఉంది. రాత్రి పగలు ఆ వ్యాధితో సతమతమవుతూ విపరీతంగా బాధపడుతున్నాడు. అప్పుడు నాసిక్‌కు చెందిన నరశింగ బాబామహరాజ్, హంసరాజ్‌ను బాబాపాదాలను ఆశ్రయించి శరణు

వేడమని సలహా ఇచ్చాడు. దాని ప్రకారం అతను, అతని భార్య షిరిడికి వచ్చి అక్కడే నివశించడం మొదలు పెట్టారు. బాబా అతడిని చూసి, పెరుగు తినవద్దని చెప్పారు. అలాగే ఆమ్ల పదార్థాలను కాని, ఘాటు పదార్థాలను కాని కూడా తినవద్దని చెప్పారు. అయితే హంసరాజ్‌కి పెరుగు ఎంతో ఇష్టమైన పదార్థం. అదిగాని లేకపోతే అతడికి భోజనం పూర్తి అయినట్లు కాదు. ఒక దశలో పెరుగు అన్నం లేకపోతే బ్రతుకు వ్యర్థం అని కూడా భావించేవాడు. అందుచేత రోజూ పెరుగు చెయ్యమని భార్యను బలవంతం చేసేవాడు. మధ్యాహ్న భోజనానికి అతడికి పెరుగు అవసరం ఉండేది. సాధారణంగా బాబాకు మధ్యాహ్న హారతి ఇచ్చిన తరువాత వాళ్ళు భోజనానికి కూర్చొనడం అలవాటు. ఒకరోజు ఈ విధంగా వాళ్ళు భోజనానికి సిద్ధపడుతూ ఉండగా ఒక పిల్లి వచ్చి అక్కడ ఉంచిన పెరుగును తినివేసింది. చేసేది లేక హంసరాజ్ ఆ రోజుకు పెరుగు లేకుండానే భోజనం పూర్తి చేసాడు.

పిల్లి బాధను తప్పించుకొందుకై అతడు పెరుగు గిన్నెను ఉట్టిమీద పెట్టి వ్రేలాడదియ్యమని భార్యకు సలహా ఇచ్చాడు. అలా చేసినా కూడా పిల్లి ఎలాగో ఒకలాగ పెరుగును చేజిక్కుంచుకొని తినివెయ్యడం చేసేది. ఇంక పిల్లిని ఎలాగైనా పెరుగు తినేటప్పుడు పట్టుకుని కొడదామని హంసరాజ్ నిశ్చయించుకున్నాడు. ఒక కర్ర పట్టుకుని చాటుగా నిలబడి చూస్తున్నాడు. పిల్లి నెమ్మదిగా వచ్చి మీదకెక్కి పెరుగు గిన్నె ఖాళీ చేసేసింది. పని అయిన తరువాత నెమ్మదిగా క్రిందికి దిగింది. ఇదే అదనుగా హంసరాజ్ పిల్లిని కర్రతో బాదాడు.

ఆ సాయంత్రం హంసరాజ్ యధాప్రకారం ద్వారకామాయికి వెళ్లాడు. బాబా భక్తులతో కలసి కూర్చొని ఉన్నారు. హంసరాజ్‌ను చూసి ఇలా అన్నారు. ఒక అవివేకి ఉన్నాడు. అతడు పులుపు పదార్థాలు తిని వ్యాధిని ముదర పెట్టుకొని ప్రాణాలు పోగొట్టుకోవడానికి కూడా సిద్ధపడుతున్నాడు . కాని నేను దానికి ఒప్పుకోను. నేను అతడి ఇంటికి ఒక పిల్లి రూపంలో వెళ్ళాను. అతడు తినబోతున్న పెరుగును నేనే తిన్నాను. నేను అతడ్ని పెరుగు తినకుండా చేసినందులకుగాను నన్ను కర్రతో కొట్టాడు.

ఇదుగో చూడండి నా వీపు మీద అతడు కొట్టిన దెబ్బలు" అంటూ అందరికీ తన వీపు భాగాన్ని బాబా చూపెట్టారు. వీపు మీద ఎర్రటి చారలు ఉన్నాయి. అవి హంసరాజ్ పిల్లిని కొట్టిన దెబ్బలు (ఇది నరశింహ స్వామీజీ వ్రాసిన శ్రీ సాయిబాబాకు సంబంధించిన భక్తుల అనుభవాలు అన్న పుస్తకం నుండి గ్రహించ బడింది) శ్రీసాయి సచ్చరిత్ర 3వ అధ్యాయం పాదం 81లో బాబా ఇలా అంటారు. "ధిక్కార ధోరణితో ఎవ్వరినీ తిప్పికొట్టడం కాని, వదులుకోవటం గాని చేయవద్దు. అది ఒక పందిగాని, కుక్క గాని, ఈగ కాని, దోమ కాని అవచ్చు. ఎవ్వరైనా మన దగ్గరకు వచ్చారంటే దాని అర్థం, ఆ వచ్చిన వారికి మీకు ఏదో గత జన్మల అనుబంధం ఉండి ఉంటుందని తెలుసుకోండి." ఈ క్రింద చెప్పబడిన లీలలు బాబా మాటలకు అద్దం పడుతున్నాయి.

ఒక రోజు సాయంత్రం జబ్బుతో ఉన్న ఒక ఆడ కుక్క మహల్సాపతి దగ్గరగా వచ్చి తోక ఆడిస్తోంది. అది 'మాంగె' అనబడే ఒక రకమైన చర్మవ్యాధితో బాధపడుతోంది. దాని నోటి వెంట చొంగ కారుతోంది. అది చూసి మహల్సాపతి ఒక రాయి విసిరి దాన్ని బయటకు తరిమివేసాడు. ఆ రాతి దెబ్బకు అరుస్తూ పరుగు పెట్టింది. ఆ తరువాత మహల్సాపతి ద్వారకామాయికి వెళ్ళడం జరిగింది. అతడు అలా కూర్చోగానే బాబా అన్నారు, నేను ఏదో తినడానికి పెడతాడనుకొని భగత్ దగ్గరకు (మహల్సాపతి) వెళ్ళాను. కాని అతడు ఒక రాయితో నన్ను కొట్టాడు.

బాబా ఈ మాటలు అన్న మరో రెండు గంటలకి వాడాలో దీక్షిత్, అతడు స్నేహితులు కూర్చొని ఉండగా ఒక కుక్క వచ్చి దగ్గరలో ఉన్న మెట్లపై కూర్చొంది. దీక్షిత్ (కాకా) ఆ కుక్కను తరమి వేసాడు.ఆ కుక్క పారిపోయి అతడికి ఎదురుగా ఉన్న ఇంకో మెట్టు మీద కూర్చొంది. అలా కూర్చొన్న దాన్ని ఎవరో రాయితో కొట్టారు. అది అరుచుకుంటూ పరుగెత్తింది. అప్పుడు కాకా, ద్వారకామాయిలో బాబా అన్న మాటలు గుర్తు తెచ్చుకున్నాడు. అయ్యో ! అనుకుని బాధపడి, నేను ఆ కుక్కకు ఇంత రొట్టిముక్క పెట్టి ఉంటే బాగుండేది. దెబ్బలు తినకుండా ఉండేది. నేను దాన్ని తరిమి వెయ్యడం వల్లే ఆ దెబ్బలు తిన్నది అని మథన పడ్డాడు.

ఆ సాయం కాలమే దాసుగణు కీర్తనలకు కాకా హాజరు అయ్యాడు. ఆ కీర్తనల్లో నామదేవుడి గురించి పాడుతున్నారు. ఒకసారి నామదేవుడు విఠలనాథుని విగ్రహం దగ్గర తాను వండుకున్న ఆహారం పెట్టి నైవేధ్యంగా సమర్పిద్దామని సిద్ధపడుతున్నాడు. ఇంతలో ఒక కుక్క వచ్చి దాంట్లో పెద్దగా కనపడుతున్న 'బక్రి' అనబడే రొట్టెలాంటి దాన్ని నోట కరుచుకొని పరుగెట్టింది. అది చూసిన నామదేవుడు ఇలా అన్నాడు. ప్రభూ! వట్టి భక్రీని తినవద్దు. కాస్త నెయ్యి వేసుకొని తినండి, అంటూ నేతి గిన్నె పట్టుకుని ఆ కుక్క వెనక పరుగెట్టాడు.

ఇంక ఆ రోజు రాత్రి మారుతి మందిరంలో మాధవరావు అద్కర్ 'భక్త లీలామృతం' అనబడే గ్రంథాన్ని అందరూ వినేటట్లుగా గట్టిగా చదువుతున్నాడు. నామదేవుడి భక్తికి సంబంధించిన కథాభాగం వచ్చింది. దానిలో కుక్క వచ్చి రొట్టెముక్కను ఎత్తుకొనిపోవడం గురించి కూడా ఉంది. ఈ విధంగా బాబా ఉదయం పూట ఏ విషయాలు చెప్పారో అదే విషయాలు కీర్తనల్లోనూ, గ్రంథ పఠనంలోనూ కూడా సందర్భోచితంగా వచ్చేటట్లు తన లీలను ప్రకటించేవారు.

(ఇది 1923 సం॥లో సాయిలీల అనే పత్రిక నుండి గ్రహించబడింది)

ఇంక కాకా దీక్షిత్ విషయానికొస్తే అతడికి అన్ని ప్రాణుల పట్ల దయ, జాలి ఉండేవి. సమస్త జీవ రాశుల్లోనూ సాయి అంతర్యామిత్వాన్ని అతను గ్రహించగలిగాడు. కాబట్టే విల్లేపార్లెలో గల అతని యింట్లో ఎన్నో పెంపుడు జంతువులు (కుక్కలు, పిల్లులు మొ॥) ఉంటూ ఉండేవి. షిరిడీలో ఉన్న సమయాల్లో సైతం అతను భోజనానికి కూర్చునే ముందు, పిల్లులు వచ్చేవి. వాటికి వెన్న కలిపిన అన్నం పెట్టేవాడు. అతడికి ఆ సమయంలో భగవంతుడే ఆ రూపంలో వచ్చి తను పెట్టిన ఆహారాన్ని స్వీకరిస్తున్నాడు అన్న భావన ఉండేది. ఆయన తేళ్ళని కాని, చీమలని కాని నల్లులను కాని, ఈగలను కాని చంపేవాడు కాదు. అతను, ఇంకా ఇతర భక్తులు, రాత్రిపూట దీక్షిత్ వాడాలో పడుకొని ఉండగా నల్లులు వచ్చి కుడుతూ ఉండేవి. కాకా మట్టుకు హాయిగా నిద్రపోయేవాడు. మిగతా వారికి మాత్రం నిద్ర ఉండేది కాదు. అప్పుడు వాళ్ళు

పురుగుల మందును వారి ప్రక్కల చుట్టూ చల్లుకుని పడుకొనేవారు. కాని కాకా మాత్రం తన ప్రక్కచుట్టూ చల్లనిచ్చేవాడు కాదు. ఇంకా, మనిషి రక్తం అన్నది నల్లులికి ప్రకృతి సహజంగా లభించే ఆహారం మహా అయితే ఒక అర ఔన్సు రక్తం త్రాగుతాయి. కాని నా శరీరం ఆ నష్టాన్ని సులభంగానే తిరిగి పొందగల్గుతుంది. మనలో ఉన్న పరమాత్మ వాటిలో కూడా ఉన్నాడు కదా, అంటూ వుండేవాడు.

(ఇది నరసింహ స్వామీజీ వ్రాసిన శ్రీ సాయిబాబా జీవితం అన్న పుస్తకం నుండి గ్రహించబడింది)

భగవంతుని గురించి మనం చేసే అన్వేషణను వర్ణిస్తూ ఒక మరాఠీ పాట ఉంది. “మనం సాధారణంగా ఆలయాల్లోనూ, భజన మందిరాల్లోనూ భగవంతుని కోసం వెదుకుతూ ఉంటాం. కాని భగవంతుడు మనందరి హృదయాల్లో నివస్తున్నాడు.” ఈ ఐదవ వాగ్దానం నుండి మనం తెలుసుకోవలసినదేమిటంటే భగవంతుడన్నవాడు ప్రతి జీవిలోనూ అంతర్యామిగా వెలుగుతూ ఉన్నాడు. ప్రతి జీవికి దివ్యశక్తి రూపంలో, దివ్యస్ఫురణ రూపంలో అగోచరంగా ఉన్నాడు. ఈ రకమైన జ్ఞానం భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని, సర్వాంతర్యామిత్వాన్ని సూచన ప్రాయంగా మనకు తెలియజేస్తుంది. అంతేకాక ఈ జ్ఞానం మన దివ్యజీవన మార్గంలో ఒక ముఖ్యమైన మెట్టుగా ఉపయోగపడుతుంది. ఆ దారిలో నడుస్తున్నప్పుడు మనం మన యొక్క స్వస్వరూపాన్ని తెలుసుకుందికి ప్రయత్నం చేస్తూ ఉంటాం.

అదే ఆధ్యాత్మిక రంగంలో ప్రతి సాధకునకు కలిగే సందేహానికి గాని, సమస్యకుగాని ప్రతి రూపమై మనస్సును దొలిచివేసే “నేను ఎవరిని?” అన్న ప్రశ్న. దీనికి దొరికిన సమాధానమే ‘ఆత్మ’ లేక స్వస్వరూపం. ఇది ఎల్లవేళలా అంతటా, అందరిలోనూ ప్రకాశించే వస్తువే. అదే భగవంతుడు. కాని మనం చేసే పిచ్చి పని ఏమిటంటే దానిని మన లోపల వెదకకుండా బయట వెదుకుతూ ఉంటాం. కాబట్టి ఎవరికి వారు తమ స్వరూపాన్ని (Self) గుర్తు పట్టగలిగితే, భగవంతునియొక్క సర్వ వ్యాపకత్వం అనుభవానికి వస్తుంది. అంతేకాక బాహ్య ప్రపంచంలో జరిగే పరిణామాలనన్నింటినీ సాక్షిగా గమనించేది కూడా ఆ స్వరూపమే అన్న అవగాహన

స్థిరపడుతుంది. ఈ ప్రక్రియ అనాది కాలం నుండి నడుస్తున్నదే. అందుకే భగవంతుణ్ని ఆది మధ్యాంత రహితుడు అంటారు. ఈ సందర్భమే బాబా చేసిన వాగ్దానానికి అర్థవంతమైన ఉదాహరణ. అందుకే బాబా నేను శాశ్వితుడును, నిత్యుడను అంటూ ఉంటారు. ఈ సత్యాన్ని గ్రహించమని చెపుతారు. ఈ క్రింద చెప్పబడిన లీల బాబా యొక్క నిత్యత్వాన్ని నిరూపిస్తుంది.

చునిలాల్ ఆత్మారాం భవసార్ 4-9-1898న పాత బరోడా రాష్ట్రంలోని సవాలి అనే గ్రామంలో జన్మించారు. ఆయన తదనంతర కాలంలో శ్రీమోటా బాబాగా ప్రసిద్ధికెక్కారు. శ్రీసాయిబాబా మహాసమాధి జరిగిన సుమారు 20 సంవత్సరాల తరువాత చునిలాల్, బాబా యొక్క అనుగ్రహానికి పాత్రులయ్యారు. ఆ సమయంలో ఆయన కరాచీలో ఉన్నారు. ఒక రోజు సముద్రపు ఒడ్డున నిలబడి ఉండగా శ్రీసాయిబాబా ఆయన ముందు ప్రత్యక్షమై తనతోబాటుగా సముద్రంలోకి నడిచి రమ్మన్నారు. వెంటనే చునిలాల్ ఇంకొక ఆలోచన రానివ్వక, సాయి వెంటనడుచుకుంటూ సముద్రంలోకి వెళ్ళారు. తలకాయి మునిగే వరకూ నడచారు. ఆ తరువాత అతనికి తెలివి తప్పింది. అయితే తిరిగి తెలివి తెచ్చుకుని చూసే సరికి, ఆయన నడిచిన ప్రాంతం కాక వేరే గట్టున ఉన్నట్లు తెలిసింది. ఇంకా ఆయన బట్టలు కూడా తడిసినవి కాక పొడిగా ఉన్నాయి. ఆ తరువాత సాయిబాబా కొన్ని యోగ ప్రక్రియల్ని చునిలాల్‌కు ఉపదేశించారు. అంతే కాకుండా ఇంద్రియాతీత దూరదృష్టిని ప్రసాదించారు. 1939వ సంవత్సరం మార్చిలో శ్రీరామనవమి రోజున శ్రీసాయిబాబా, చునిలాల్‌కు అద్వైతానుభవాన్ని కల్గించి, ఎప్పటికీ తన స్వరూపాన్ని గుర్తు పెట్టుకోగలిగే ఆత్మజ్ఞానాన్ని కూడా ప్రసాదించారు. 15 సంవత్సరాల తక్కువ కాలంలో మోటాబాబా అనబడే చునీలాల్ ఇదంతా బాబా దయవల్ల సాధించగలిగారు.

శ్రీసాయిబాబా గురించి ఆయన ఇలా అన్నారు. ఆయన నాయొక్క ఆధ్యాత్మిక అభివృద్ధికి చివరి మెరుగులు దిద్దారు. అంతేకాకుండా శ్రీసాయిని కీర్తిస్తూ, ఆయన కొన్ని శ్లోకాలను ప్రచురించారు. అదే 'సాయి సత్త్వం'. దీనిలో 17 చరణాలు గుజరాతి

భాషలో ఉన్నాయి. దీనిబట్టి మనకు తెలిసిందేమిటంటే, బాబా భౌతిక శరీరంతో ఉండగానే మోటా బాబాతో సంబంధం కల్గి ఉన్నారని, అందుచేతనే ఆయన మోటాబాబాకు యోగ విజ్ఞానం నేర్పించి, ఆత్మజ్ఞాన నిష్ఠులుగా చేయగలిగారని అర్థం చేసుకోవచ్చు.

శ్రీసాయి సచ్చరిత్ర 43వ అధ్యాయంలో బాబా మహా నిర్యాణం తరువాతి ఘటనలు వర్ణించబడ్డాయి. మహానిర్యాణం మరునాడే ఆయన, లక్ష్మణ్ రత్నా పార్కీకి కలలో కనపడి "రా! రా! వేగరం లేచిరా! బాపుసాహెబ్ ఈ రోజు రాడు. ఎందుకంటే అతడు నేను చనిపోయానని అనుకుంటున్నాడు. అందుచేత నువ్వు వచ్చి నాకు కాకడ హారతి సమర్పించు." వెంటనే లక్ష్మణ్, బాబా ఆజ్ఞను పాటించాడు. అందుచేత అతడికి బాబా యొక్క నిత్యత్వంపై మంచి అనుభవం కల్గింది.

బాబా ఇలా అన్నారు. ఈ సమస్త జీవరాశుల్లోనూ నన్ను చూడ గల్గిన వ్యక్తిని నేను ఇష్టపడుతాను. అందుచేత సాపేక్షతా దృష్టిని విడనాడి, వికల్పాలు లేని నిర్వికల్ప స్థితిని గమనించండి. అటువంటి వానికి మాత్రమే అంతటా అన్యంగా చూడక అనన్యంగా చూడడం అలవాటవుతుంది. ఇదే నన్ను ఆరాధించటమంటే. ఇదే నాకు మీరు చేసే పూజ.

బాబా యొక్క కృపకు, బాబా యొక్క నిత్యత్వానికి  నిదర్శనంగా నిలిచేవి ఇవే. ఈ సృష్టిలో జీవిస్తున్న సకల జీవరాశులు, అలాగే ఈ సృష్టిలో ఉన్నటువంటి సకల నిర్జీవ పదార్థాలు, వాటి మధ్యన జరుగుతున్నట్లు కనపడే సకల వ్యవహారాలు, మీ హృదయాల నుండి ఎడ తెగక వెలువడే ఆలోచనా తరంగాలు, అలాగే పుట్టినప్పటి నుండి అన్ని జీవరాశులు తీసుకొనే ప్రతి ఊపిరి, ఈ సృష్టి మొత్తం నిండి ఉన్న మహాశక్తి వలయం, ఇంకా ఆ మహాశక్తిని వ్యష్టిరూపంగా అనుభవానికి తెచ్చుకోగలుగుతున్న మీ సాక్షీ స్వభావం, బాబా యొక్క కృపకు నిత్యత్వానికి నిదర్శనాలే అని గ్రహించండి.

## ఆరవ వాగ్ధానం

**శరణ మజాలా ఆణీవాయ గేలా**

**ధాకవా ధాకవా అయిసా కోణీ !**

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ ఆరవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది.

**"నా సమాధి నుండియే నామానుష శరీరము మాట్లాడును."** దీన్నే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. "నాకు చూపండి. నన్ను శరణు వేడి నా అభయమును పొందని వారిని ఎవరినైనా నాకు చూపండి."

ఇంతకు ముందే మనం తెలుసుకున్నాం. అదేమిటంటే తీవ్రమైన అధ్యయనం ద్వారా మరియు ధ్యానం ద్వారా బాబాయొక్క సర్వవ్యాపకత్వానికి సంబంధించిన జ్ఞానాన్ని భక్తుడు తెలుసుకోగలుగుతున్నాడు. శ్రీసాయి సచ్చరిత్ర 19వ అధ్యాయం, 213వ పాదంలో బాబా యొక్క పరివ్యాప్తమైన ఉనికి వర్ణించబడింది. ఆయన అంటారు, నీటిలో నేనంతటా ఉన్నాను. అంటే మహా సముద్రాల దగ్గర నుండి మొదలు పెట్టి నదులు, ఏరులు, వాగులు, వంకలు అన్నీవస్తాయి. ఇంకా భూమి మీద నేను లేనిచోటు లేదు. అలాగే ప్రకాశవంతమైన ఆకాశాన్నంతా ఆవరించుకొని ఉన్నాను. అలాగే అడవులు, వృక్షాలు మొదలైన వాటిలోను, ఇంకా ఎండిపోయిన ఒక చిన్న కొమ్మలోనూ కూడా నేనున్నాను. ఎడారి ప్రదేశాలతో సహా ఈ భూమి మీద నుండే రకరకాల జీవరాశుల్లోనూ, ప్రపంచంలో గుర్తింపు పొందిన అరణ్య జంతుజాలాల్లోనూ నా ఉనికి ఉంది. ఈ దేశమే కాదు, పరాయిదేశం కూడా నాదేశమే అయి ఉంది. అందుచేత నేను ఏదో ఒక దేశానికే చెందినవాడనుకాదు. దీనిబట్టి తెలుస్తున్నదేమిటంటే ఇదే బాబా యొక్క సర్వసాక్షిస్వరూపం అనగా సృష్టినంతా ఆవరించుకొని ఉన్న అసలు స్వరూపం. అదే సృష్టిలో జరుగుతున్న అన్ని పరిణామాలను, సంఘటనలను గమనిస్తున్నది.

ఇదంతా ఇప్పుడు మనం అర్థం చేసుకున్న తరువాత ఆధ్యాత్మిక ప్రయాణంలో

ఇంకోమెట్టు ఎక్కి ముందుకు సాగే తరుణం ఆసన్నమైందని తెలుసుకోవాలి. బాబాకు శరణాగతి చేసి, మన మనస్సును, అహంకారాన్ని గర్వాన్ని మరియు మన ఆత్మను (జీవాత్మను) ఆయనకు సమర్పణ చేసే సమయం ఇదే అన్న నిర్ణయానికి రావాలి. ఈ పద్ధతి, చెప్పినంత సులువుకాదు. ఇంత కష్టమైన ఆత్మ సమర్పణ సిద్ధాంతానికి మారు పేరుగా దాసగణు నిలిచాడు.

దాసగణు బాబాతో చాలాకాలం కలిసి ఉన్న మనిషి. అంతేకాక బాబా యొక్క దివ్యత్వాన్ని అనేకానేక లీలల ద్వారా తాను అనుభవానికి తెచ్చుకుని ఇతరులకు కూడా వాటిని ఋజువు పరచగలిగేటట్లు ప్రవర్తించిన మహానుబావుడు. ఇంత జరిగినప్పటికీ బాబాయే తన గురువుగా దాసగణు చెప్పలేకపోయేవాడు. దానికి కారణం దాసగణుకు శివ మంత్ర దీక్షను ఉపదేశించిన గురువు వమన్ శశి ఇస్లామ్ పుర్కార్.

1919వ సంవత్సరంలో దాసగణు ఒక ప్రముఖమైన యోగిని కలిసి, ఆయనకు దగ్గరయ్యాడు. అనేకసార్లు ఆ యోగితో అనేక విషయాలు చర్చిస్తూ ఉండేవాడు. కాని ఆ యోగి మాత్రం దాసగణును తనకు సాష్టాంగ నమస్కారం చేయనిచ్చేవాడు కాదు. ఈవిధంగా మూడు సార్లు జరిగిన తరువాత ఆ యోగి కోసం కొంత ఆహారాన్ని పంపించాడు. దాసగణు పంపిన ఆహారం అతను స్వీకరించాడు. ఆమరునాడు యోగి దగ్గరకు వెళ్ళి తనను ఎందుకు సాష్టాంగ నమస్కారం చేయవద్దని అన్నారు అని అడిగాడు. దానికి ఆ యోగి ఇలా సమాధానం చెప్పాడు. నువ్వు భక్తి సంబంధమైన పాటలు పాడే ఒక గాయకుడినని చెప్పుకుంటున్నావు. కాని నీలో అహంకారం, గర్వం ఉబ్బి ఉన్నాయి. (ఇక్కడ అహంకారమనగా ఈ దేహమే నేను అనే భావన అని తెలుసుకోవాలి) ఆ యోగి అన్న మాటలకి దాసగణు ఈవిధంగా బదులు చెపుతున్నాడు. అయ్యా! ప్రతి మనిషికి ఈ అహంకారమన్నది పుట్టుకతోనే వస్తున్నది. ఇంక దానివల్ల జరిగే ప్రతి కర్మలోను అది అంతర్లీనంగా కనపడుతూనే ఉంటుంది. అయితే ఈ అహంకారం యొక్క విజృంభణాన్ని మాత్రం అరికట్టవలసి ఉంది. ఇక దాసగణు చెప్పినదాన్ని విన్న యోగి, దాసగణును పూర్తిగా అహంకార

రహితుడవగుమని బోధించాడు. అంతేకాక శ్రీసాయి బాబా పాదాల చెంత నుండి వచ్చిన గంగా జలంతో నువ్వు పవిత్రుడవు అవలేదా? అని ఈ గంగా జలాన్ని నువ్వు ఎలా ఉపయోగించావు? అని అడిగాడు. ఆ నీటిని నా తలపై జుల్లుకున్నాను అని దాసుగణు చెప్పగానే, ఔను, నువ్వు బ్రహ్మణ కుటుంబంలో పుట్టినవాడు కదా! బాబాను ఒక ముస్లిమ్ యోగిగా చూస్తున్నావు. అందుకనే నువ్వు బాబా పాదాల వద్దనున్న గంగని త్రాగలేకపోయావు, అని ఆ యోగి తీవ్రంగానే పలికాడు.

దీని బట్టి మనకు అర్థమయ్యేదేమిటంటే, సతతమూ బాబా చెంతనే ఉండే దాసగణుకే ఈ శరణాగతి తత్త్వం కష్టంగా ఉంటే, మనబోటి సాధారణ భక్తులకు ఇంకెంత కష్టంగా ఉంటుందో ఊహించండి.

ఇక భగవంతుని స్వరూపం ఎలా ఉంటుందో తెలుసుకోవాలి. సాధారణంగా భగవంతుడు మనందరి హృదయాల్లో స్థిరనివాశం ఏర్పరుచుకొన్నాడని, అలాగే మిగతా జీవరాశుల్లో కూడా ఆత్మ రూపంగా వెలసిల్లుతున్నాడని అనుకుంటూ ఉంటాం. కాని ఇక్కడే అనేక ప్రశ్నలు పుడుతూ ఉంటాయి. ప్రతి జీవరాశిలోనూ ఆత్మ రూపంగా ఉన్నాడని అనుకుంటున్న ఆ భగవంతుడు ఎవరు? ఎలా ఉంటాడు? మనందరికీ ముఖ్యమైన వ్యవస్థ, మన అంతఃకరణ చతుష్టయం (మనస్సు బుద్ధి చిత్తము అహం కారము). ఈ అంతఃకరణ చతుష్టయాన్ని ఏ రూపంలో ఉండి నడిపిస్తున్నాడు? అతడిని ఎలా పట్టుకోగలం? అదీకాక అతి ముఖ్యమైన భాగంగా ఉన్న ఈ అంతఃకరణ చతుష్టయం అంటే ఏమిటి? ఈ విధంగా మనల్ని మనమే ప్రశ్నించుకోవచ్చు. కాని కేవలం మత గ్రంథాలు మాత్రమే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేవు మనలో మనమే ఈ విషయంపై విచారణ కొనసాగించాలి. దీన్నే ధ్యానం అని అనుకోవచ్చు. ఆ విధంగా ఒక రకమైన పరిశోధన ఈ ఆరవ వాగ్ధానంతో మొదలవుతుంది.

మనస్సు బుద్ధి చిత్తము అహంకారము అనబడే నాలుగు రకాలైన భాగాలతో కూడి ఉంది మన ఆలోచనా వ్యవస్థ. వీటన్నింటిలో అహంకారమన్నది ఆత్మశోధనకు

ముఖద్వారం లాంటిది. అదే నేను, నన్ను, నా యొక్క అనే భావాలకు విపరీతార్థాలను కల్పించి మాయ అనబడే విషవలయంలోకి ఈడుస్తున్నది. అందుచేత నేను, నన్ను, నా యొక్క అనేమాటలకు గల సత్య స్వరూపం మరుగునపడి, దాని స్థానంలో మిథ్యా స్వరూపమైన దేహభావన రాజ్యం చేస్తోంది. అనేక జన్మల నుండి నడుస్తున్న ఈ ఆభాస లేక మిథ్యాస్వరూప తతంగం మనిషిని సంసార బంధంలో చిక్కుకునేటట్లు చేసి జన్మపరంపరలకు కారణభూతమై కూర్చొంది. అందుచేత ఈ దేహంతో తాదాత్మ్యం చెంది అనగా ఈ దేహమే నేను అనుకొని ప్రవర్తించడం చేతనే మన నోటి వెంట ఇలాంటి మాటలు పల్కుతూ ఉంటాం. "నేను ఇది చేసాను. నేను అది చేసాను. నాకు డబ్బు ఉంది కాబట్టి దానం చేస్తాను. ఇతడు నాకు బంధువు. ఇతడు నా కొడుకు. ఇంత అందమైన ఇంటిని నేను కొన్నాను. నన్ను చూసి నేర్చుకోండి. నా యొక్క అదృష్టం అంతా ఇంతా కాదు. ఇది నా వల్లనే జరిగింది. నేను లేకపోతే ఆ పని జరగదు."

కొర్హాలె అనబడే గ్రామంలో ఒక బాబా ఆలయం ఉంది. అది చాలా చిన్నది. విచిత్ర మేమిటంటే అక్కడ 'నేను' అన్న భావన ఎక్కడా కనపడదు. ఏపని ఎవరు చేసినా, ఏమాట ఎవరు మాట్లాడినా బాబా చేస్తున్నట్లే ఉంటుంది. బాబా మాట్లాడినట్లే ఉంటుంది. ఆ ఆలయం మట్టితో కట్టి ఉంది. దానిపై టిన్‌రేకులతో కప్పు ఉంటుంది. ఆలయం చిన్నదైనప్పటికీ వచ్చే యాత్రికులకు వసతి నిమిత్తం పెద్ద హాలు ఉంది . దాని పేరు రాధా కృష్ణమాయి హాల్, అక్కడున్న సిద్ధాంతమేమిటంటే యాత్రికులకు సేవ చెయ్యడమే. వచ్చిన వారందరికీ శుభ్రమైన మంచినీరు ఇస్తారు. దానితోపాటు కాస్త ఫలహారం పెట్టి టీ కూడా ఇస్తారు. ఈ సేవ రాత్రి పగలు అనక అన్ని సమయాల్లోనూ ఉంటుంది. మధ్యాహ్నంగాని, సాయంకాలంగాని వచ్చిన వారికి స్వల్ప భోజనం పెడతారు. రాత్రి పూట ఉండాలనుకుంటే పడుకుందికి దుప్పట్లు ఇస్తారు. ఉదయం స్నానానికి నీరు ఇచ్చి, ఫలహారం పెడతారు. నిజానికి ఆ ఆలయంలో నివాసం ఉన్నవారు ఇద్దరే వ్యక్తులు. మిగతా పనివారంతా స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవ్వరైనా బాబాకు బహుమతులు ఇచ్చినట్లయితే, వాటిని మిగతా వస్తువులతో కల్పి ఉపయోగిస్తారు. అంతేకాని ఫలానా వారు ఇవి ఇచ్చారు అని ఎక్కడా వ్రాయడం కాని, చెప్పడం

కాని ఉండదు. దీని వెనుక ఉద్దేశ్యం ఏమిటంటే అక్కడ ఉన్నదంతా బాబాదే అన్న భావన. అంతేకాక అంతా బాబాయిచ్చినదే తిరిగి వారికే సమర్పిస్తున్నాం అన్న సిద్ధాంతం ప్రతి భక్తుడూ ఆచరణలో పెడుతూ ఉంటాడు. అంతకంటే గొప్ప విషయం తన దేహాన్ని బాబా సేవకు అంకితం చేద్దాం అనే భావన అక్కడున్న ప్రతి ఒక్కరూ కల్గి ఉండడం. ఇక్కడ బాబా సేవ అంటే అర్థం భక్తులకు సేవ చెయ్యడమే అని గుర్తు పెట్టుకోవాలి. దాన్నే అందరూ 'మానవ సేవే మాధవసేవ' అంటూ ఉంటారు.

అయితే నేను, నన్ను అన్న భావనలే మనిషిని భ్రమకు గురిచేస్తున్నాయని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. ఈ ఊహాకల్పితమైన భావనా పరంపరను అర్థం చేసుకొన్న క్షణంలో, మనలో నివసిస్తున్న భగవంతుణ్ని మనం పట్టుకోగలం. ఇదే ఆరవ వాగ్ధానాన్ని అర్థం చేసుకొనే సాధనం. అప్పుడిక మనం రోజువారీ దినచర్యలో పలుకుతున్న నేను, నన్ను, నాది అన్న మాటలు దేహాన్ని దృష్టిలో పెట్టుకుని అంటున్నవి తప్ప ఆత్మను దృష్టిలో పెట్టుకుని అంటున్నవి కావని నిదానంగా అర్థమవుతూ వస్తుంది. నిజానికి ఆత్మపరంగా చూస్తే ఆ మాటలు పలుకవలసిన అవసరం కూడా లేదు. అప్పుడు అదే మౌనం, అదే సమాధి అవుతుంది. ఆధ్యాత్మిక రహస్యాన్ని ఛేదించే ప్రశ్న 'నేను ఎవరు?' అన్నది. దీన్నే విచారణ చెయ్యగా, చెయ్యగా తెలిసేది ఏమిటంటే నేను చిన్న అణువుని, సర్వాంతర్యామి అయిన బాబాలో నేను అతి చిన్న భాగాన్ని అని తెలుస్తుంది. భగవంతుడు మహా తెలివితో ఈ మొత్తం భూమిని ఒక రంగస్థలంగా మలిచాడు. మనందరం ఆ రంగస్థలం మీద జరిగే జీవన నాటకంలో పాత్రదారులం. భగవంతుడు ఎంతో చతురతతో మనలందర్ని మట్టి బొమ్మలుగా చేసి, ఆ బొమ్మల్లో తన స్వరూపం యొక్క అతి చిన్న భాగాన్ని అమర్చి ఈ భూమ్మీదకు పంపాడు. ఇంక మనవంతు పనిగా మనం పుట్టగానే అనగా మొదటి శ్వాస తీసుకోగానే మాయాశక్తి వలలో చిక్కుకున్నాం. మన కోసం కొన్ని జీవితపు విలువల్ని, కట్టుబాట్లను కూడా ఏర్పరచాడు భగవంతుడు. అదే కర్మ సిద్ధాంతంగా ప్రాచుర్యం పొంది ఉంది. దీనిలోనే కర్మ, కర్మయోగం, కర్మఫలం అన్న భాగాలున్నాయి. కర్మ అన్నపదం 'కురు' అన్న బీజపదం నుండి వచ్చింది. కురు

అనగా పని చెయ్యి అని అర్ధం. జీవిత లక్ష్యాలను చేరుకొనుటకు గాను చెయ్యవలసిన పనులన్నీ అనగా మనసా వాచా కర్మణా, మనస్సుతోను, వాక్కుతోనూ, శరీరంతోనూ చేసే పనులన్నీ కర్మలనే అనిపించుకుంటాయి. ఈ కర్మలలో సాత్విక కర్మలు ప్రముఖంగా చెప్పవచ్చు. ఇవి ధర్మబద్ధమైయుండి ఎవ్వరికీ హానిగాని బాధగాని కల్గించవు. వీటికి విరుద్ధంగా ధర్మబద్ధంగాని కర్మలున్నాయి. ఇవి చెడు కర్మలనిపించుకుంటాయి. కర్మఫలాన్ని ఆశించే కర్మలన్నీ కామ్యకర్మలనిపించుకుంటాయి. ఈ కర్మల వల్ల కలిగిన ఫలితాన్ని అనుభవించటం ద్వారా మనిషి కర్మబంధాల్లో చిక్కుపడి జన్మపరంపరలను ఎదుర్కోవలసి వస్తుంది. ఇంక సంచిత కర్మ అనగా అనేక జన్మల నుండి ప్రోగుపడిన కర్మఫలాల మూట. దీనిలో కొంతభాగాన్ని అనుభవించటానికే జన్మ కలుగుతూ ఉంటుంది. దాన్నే ప్రారబ్ధమని పిలుస్తారు. దీనికే ఇంకోపేరు విధి.

అనేక జన్మ పరంపరలను కల్గించే ఈ కర్మబంధం అన్నది మనం పుట్టక ముందు నుండే ఎప్పుడో ఎక్కడో మొదలైంది. ఈ జన్మలో ఈ కర్మ బంధం మనిషి బాల్యావస్థ నుండే అనుభవించడం మొదలు పెడతాడు. ఒక ప్రక్క సంచిత కర్మ ఫలాన్ని అనుభవిస్తూ , విధి నిర్ణయించిన నాలుగు ఆశ్రమాల ద్వారా క్రొత్త కర్మలు చేస్తూ ఉంటాడు. యవ్వనంలో వివాహ బంధం ద్వారా క్రొత్త క్రొత్త బాధ్యతల మధ్య చిక్కుబడి కుటుంబ పోషణ కొరకు తాపత్రయపడుతూ ఉంటాడు.

ఈ రకంగా జన్మ కర్మ జన్మ చక్రంలో తిరుగుతూ మాయకు వశుడై జీవిస్తూ ఉంటాడు. అందుచేతనే ఈ చక్రబంధం నుండి విడివడాలంటే భగవంతుణ్ని ఆశ్రయించక తప్పదు. ఇది అంత సులువైన పనేమీ కాదు. దీనికొరకుగాను భగవదనుగ్రహం సంపాదించవలసి ఉంటుంది. శ్రీసాయినాథ్ మహరాజ్‌కు శరణాగతి చేసి మనల్ని మనం అర్పించుకొనుటే దీనికి మార్గం. మన అంతఃకరణ చతుష్టయమైన మనస్సు, బుద్ధి చిత్తము, అహంకారము శ్రీసాయి చరణార విందముల పైనుంచి, లేశమాత్రమైనా నేను, నాకు అనబడే దేహాభిమాన మరకలు లేకుండా తుడిచి పెట్టుకోగలిగితే అదృష్టవంతులమే. అటువంటి సంపూర్ణశరణాగతి వలన మాత్రమే


మనలో ఆత్మ స్వరూపుడుగా ఉన్న శ్రీ సాయినాధుని మనం గుర్తించగలం.

ఆ విధంగా ఈ దేహమే నేను అనబడే భ్రమ నుండి నెమ్మదిగా తప్పించుకుని, గొప్పదైన ఆత్మ స్వరూపమే అసలు నేను అని గ్రహించ గలిగే శక్తిని పుంజుకొని ఇక దానితో వ్యవహరించడం అలవాటు చేసుకుంటాం. ఈ పరిణామం వలన మనం సద్గురువును హృదయ పూర్వకంగా, ఈ విధంగా ప్రార్ధించ గలుగుతాం. "ఓ సాయినాథ్ ప్రభూ ! నేను నీ వాడిని. ఇంకా చెప్పాలంటే నువ్వే నేను, నేనే నువ్వు. మనిద్దరి మధ్య ఏ మాత్రం బేధం లేదు. అయితే నువ్వు బ్రహ్మాండము నేను పిండాండము అయి ఉన్నాము. ప్రభూ! ఇహపరాలలో నా కర్తవ్యాకర్తవ్యములను పరీక్షించి నన్ను సరైన మార్గంలో నడిపించే బాధ్యత నీ చేతుల్లో పెడుతున్నాను. నాపై దయ ఉంచి నన్ను ఆదరించుము. ఈ క్షణం నుండే ఈ బాధ్యతను స్వీకరించి నా ఆలోచనా సరళిని, నాజీవిత గమ్యాన్ని నీవే నిర్దేశింపుము. నాచే చేయబడు వివిధ కర్మలు, నాచే పోషించబడు వివిధ పాత్రలు, రాత్రి గాని, పగలు గాని నాచే నిర్వహించబడు ఎటువంటి జీవన విధానమైనా సరే నీ ఇచ్ఛప్రకారమే జరుగవలెనని నా కోరిక. కాబట్టి ప్రభూ! నా అంతఃకరణ చతుష్టయాన్ని సరిదిద్ది నీ అదుపు ఆజ్ఞలలో ఉండేటట్లు అనుగ్రహింపుము. నా మొత్తం జీవితమంతా నీ చేతుల్లోనే ఉంది. నేను ఒక మనిషిగా కనపడుతున్నప్పటికీ, నీచే సృష్టించబడిన ఒక యంత్ర పరికరాన్ని మాత్రమే. అందుచేత నన్ను నడిపించే భారం నీ చేతుల్లోనే ఉంది. ఎందుకంటే నేను ఈ ప్రపంచమనే నాటక రంగంపై నువ్వు ఆడించే ఒక బొమ్మను మాత్రమే. ప్రభూ! మరల చెపుతున్నాను. నువ్వు నేను వేరు వేరుగా లేము. అయితే నేను నా అస్థిత్వాన్ని నీలో ఏకం చేసే ప్రక్రియలో ఇంకా ప్రాధమిక దశలోనే ఉన్నానా అని అనిపిస్తూ ఉంటుంది. కాని నాకు తెలుసును ఈ దశ మొదలయ్యే ఉంది. ఎందుకనగా నేను నీకు శరణాగతి చేసిన వాడనైయున్నాను."

ఇప్పుడు ఇక భయం లేదు. బాబా పాదాల వద్ద శరణాగతుడువైన తరువాత, బాబా నిన్ను తన భక్తుడుగా స్వీకరించిన తరువాత నీ భక్తి, వృదాపోదు. ఒక సారి ఇలా బాబాతో ఐక్యత సాధిస్తే, ఇక బాబా విడిచిపెడతారేమో అన్న ప్రశ్న ఉదయించదు.

నది ప్రవహించి, ప్రవహించి చివరికి సముద్రంలో కల్సిన తరువాత, ఆ నది నదికాదు. అది సముద్రమే అయి పోతుంది. అలాగే జీవాత్మ పరిణతి చెంది పరమాత్మలో లీనం అయిన తరువాత దానికిక ప్రత్యేకమైన అస్థిత్వం ఎక్కడుంటుంది. ఒక ఉప్పుబొమ్మ సముద్రంలో పడిపోయింది. అలాపడగానే తన ఉపాధిని కోల్పోయి సముద్రంలోనే కలిసిపోయిన రీతిగా మనం కూడా మన ఉపాదితో సంబంధం మానసికంగా త్రెంచుకుని బాబా తత్త్వంతో అనుసంధానం చెంది చివరకు బాబాలోనే కలిసిపోవాలి.

ఇదే మన ప్రయాణం. ఈ ప్రయాణం బాబాకు శరణాగతుడవయ్యేంత వరకూ సాగుతుంది. అప్పుడిక బాబాకు వేరుగా ఉన్నాను అన్నదే ఉండదు. అందుకే బాబా ఇలా అంటారు. "నాకు చూపండి. నన్ను శరణు వేడి నా అభయమునుపొందని వారిని ఎవరినైనా నాకు చూపండి."



# ఏడవ వాగ్ధానం

**జోజో మజ భజే జైస జైస భావే**
**తైస తైస పావె మీ హీ త్యాసె॥**

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ ఏడవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది.

**"నన్ను ఆశ్రయించిన వారిని, నన్ను శరణు జొచ్చిన వారిని నిరంతరమూ రక్షించుటయే నా కర్తవ్యము."** దీన్నే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. భక్తుడి ప్రార్థన యొక్క తీవ్రత, అభిరుచి మరియు భావోద్వేగముల స్థాయికి సమానంగానే నేను కూడా స్పందిస్తాను. నా అనుగ్రహాన్ని పంచి ఇస్తాను.

ఈ వాగ్ధానంలో బాబా సూచించిన, 'భావే' అన్న మాట భక్తుడి ఆధ్యాత్మిక భావనలను, అతడి ఉత్సాహాన్ని, సద్గురువు లేక భగవంతుడి పట్ల అతడికి ఉండే తపనను సూచిస్తుంది. భావే అన్నది భావము యొక్క ఉచ్ఛస్థితి. దీన్ని కొలవటానికి పరికరం లేదు. ఎందుకంటే ఇది కొలతకు దొరకని, రూపము లేని అస్థిత్వం. అందుకే దీని లోతు తెలుసుకోవడం కష్టం. కాబట్టి ఇది ఒక అనుభవంగా (జ్ఞానంగా)నే పరిగణించాలి. చాలామంది భక్తులు, మేము బాబాకు అత్యంత ప్రియమైన వారమని ప్రకటించుకుంటూ ఉంటారు. కాని వారి వెనుక నిలబడివున్న ఇతర భక్తుల కంటే గొప్పవారమని తమను తాము చరుచుకొని చెప్పగలరా? ఈ భక్తి భావన లెక్క కట్ట లేనిది. ఇంకా ఇది, ఇంత అంత అని చెప్పలేనది. ఏ భక్తుడికి ఆభక్తుడు స్వయంగా గ్రహించవలసిన విషయం.

ఈ భావే అన్నది ప్రేమకు చిహ్నం. అది బాబా పట్ల భక్తుడుకి ఉండే శ్రద్ధ విశ్వాసాలను సూచిస్తుంది. ఇటువంటి ప్రేమ తత్వం హృదయాలను వెచ్చపరుస్తుంది. ఇది మాటల్లో చెప్పలేని ఒకానొక అనిర్వచనీయమైన అనుభవం. అయితే దీన్ని అష్ట భావనా పరంపరలో ఏదో ఒకదాని క్రింద చూడవచ్చు. ఈ అష్టభావనలు అన్నవి మన

మస్సును, దేహాన్ని పట్టి కుదిపివేయగల శక్తివంతమైన పారవశ్యపు లోతులు. ఇవి ఈ విధంగా ఉంటాయి. 1) పట్టలేనంత శరీరపు కదలికలు 2)అపారమైన స్వేదం (చెమట) విడుదల 3)పారవశ్యంతో కూడిన నవ్వు, కరతాళ ధ్వనులు చేయడం 4)ఎడతెగని దుఃఖం, కన్నీళ్ళు కార్చటం 5) శరీరమంతా వెంట్రుకలు నిక్కబొడుచు కోవటం 6) చర్మం పాలిపోవటం, మనిషి కొయ్య బారిపోవటం 7)మాటలు తడబడడం. 8) తెలివి తప్పటం. ఆ సాధకుడు ఈ ఎనిమిదింటిలో ఏదో ఒక దానిని బహిర్గతపరుస్తూ ఉంటాడు. సాధకుడు ఎటువంటి భక్తిభావన లేకుండా భగవంతుని కృపను ఎలా పొందగలడు? భగవంతుణ్ని సంతోష పెట్టడం అంత సులభమైన పనేమీ కాదు. మన మహర్షులు ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకుని ఇలా అనేవారు. దేవతలకు ఈ భావోద్వేగం తప్ప మిగతావన్నీ ఉన్నాయి. అందుచేతనే వారు భక్తిని వ్యక్తం చేయలేని వారయ్యారు. కాబట్టి వారు భక్తికి, భావానికి ఎంతో విలువనిచ్చి ఆసక్తి చూపేవారు. అందుకే భక్తి భావనల పట్ల దేవతలకు ఆకలి ఎక్కువ అన్నమాట నానుడిగా మారింది. ఈ రకమైన భావం రెండు ముఖ్య భాగాలుగా విడగొట్ట బడింది. 1) సేవాభావం 2) భక్తిభావం.

అయితే ఇప్పుడు ఒక ప్రశ్న వచ్చింది. అదే భక్తి అనగానేమి? అన్న ప్రశ్న. ఎవరిపట్లనైనా మనం భక్తి చెయ్యాలంటే అది ఎలా చేస్తాం? శిల్పి దగ్గర కెళ్ళి, బాబా విగ్రహాన్ని తెచ్చి, దానికి అన్ని రకాల ఆరతులు సమర్పించి తరువాత, బాబా! నాకు అదియ్యి, నాకు యిదియ్యి అని కోరికల చిట్టా బయటపెడితే, అది భక్తి అనిపించు కుంటుందా? కాదు అన్న సమాధానం వస్తుంది. కానీ నీకున్న భక్తి భావన, పైన చెప్పిన ఎనిమిది భావనారీతుల్లో ఏ ఒక్క దానికైనా సరిపడితే, ఇంకా నీలో సేవాభావం ఏకాస్త అయినా ఉండ కల్గితే దాన్ని నిజమైన భక్తిగా పరిగణించవచ్చు. ఇది నిజం అన్నది ఎందుకంటే, సేవ మరియు భక్తి ఎప్పుడూ ఒకదానితోనొకటి పెనవేసుకుని నడుస్తూ ఉంటాయి. ఇంకోమాటలో చెప్పాలంటే భక్తి అన్నది నిరాకారం, కనబడనిది. కాని దాని సంబంధీకురాలైన సేవ మాత్రం సాకారం కనబడేదిగా ఉంటుంది. అంటే భక్తి అవ్యక్తం,

సేవ వ్యక్తం అని అర్థం చేసుకోవాలి. ప్రపంచంలో లెక్కలేనంత మంది ప్రజలు, ప్రారబ్ధవశాన బీదరికంతో, దుర్భర జీవితాలను గడుపుతున్నారు. వారిలో చాలా మందికి రోగాలతో ఉన్న పిల్లలున్నారు. వారికి మంచినీరు, ఆహారం అనే కనీస అవసరాలు కూడా ఉండటం లేదు. అయితే పైన చెప్పబడిన సేవాభావం అనే ప్రక్రియ ఇటువంటి వారికి అందినట్లయితే అది ఎంతో శుభపరిణామంగా మారుతుంది.

దిబూజీ జింగ్రాజీ జనోర్కర్, మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో గల పెంగామ్‌లో పుట్టారు. ఆతడి తల్లి దండ్రులు బాగా ధనవంతులు, భూకామందులు. చాలా ఎకరాల పంట పొలాలు, పశు సంపద వారికున్నాయి.

దిబూజీకి చిన్నతనం నుంచి పాడిపశువులంటే ఇష్టంగా ఉండేది. ఎందుకంటే అతడు శాకాహారిగా పెరిగినవాడు. ఆయన పెద్దవాడై గాడ్గే మహరాజ్‌గా మంచిపేరు ప్రఖ్యాతులు గడించాడు. జంతు వధ, ముఖ్యంగా ఆవులను చంపడం అతడు ఒప్పుకొనే వాడు కాదు.

శ్రీపాద వల్లభ చరిత్రలో గాడ్గే మహరాజ్‌కు సంబంధించిన ఒక విషయం ఉంది. శ్రీపాదులకు తిరుమల దాస్ అనబడే ఒక ముఖ్య భక్తుడు ఉన్నాడు. ఒకసారి శ్రీపాదులు ఆ తిరుమలదాస్‌ను దీవించి, నువ్వు మహారాష్ట్రలో గాడ్గె మహరాజ్‌గా ఒక చాకలి కులంలో జన్మిస్తావని అన్నారు. ఇంకా నువ్వు భగవద్భక్తుడుగా ఉంటూ పేద తాడిత పీడిత జనానీకానికి సేవలు అందిస్తావు. నేను (శ్రీ పాద శ్రీవల్లభులు) షిలాడీ గ్రామంలో సమర్థ సద్గురు సాయి బాబాగా అవతారం దాల్చి, ఒక ముస్లిం వేషంలో అక్కడ ఉంటాను. అప్పుడు కూడా నీకు నా అనుగ్రహం దొరుకుతుంది. నువ్వు గాడ్గె మహరాజ్‌గా ప్రపంచానికి సేవలు అందిస్తావు. ఇది నీకు నేను ఇచ్చే వరం, వాగ్ధానం అన్నారు. ఆ విధంగా దిబూజీ, గాడ్గె మహరాజ్‌గా మారిపోయారు. తన కుటుంబం నుండి విడిపోయి స్వచ్ఛందంగా పేదలతో కలసి మెలసి తిరుగుతూ పేద జీవితాన్ని గడిపేవారు. ఆయన్ను గాడ్గె మహరాజ్ అని పిలువటానికి కారణం, ఆయన ఎప్పుడూ

తనతో బాటుగా ఒక కుండను పట్టుకుని తిరిగేవారు. మరాఠీ భాషలో కుండను గాడ్గె అంటారు.

గాడ్గె మహరాజ్ కీర్తనలు పాడడం ఒక ప్రచార సాధనంగా ఎంచుకొన్నారు. కీర్తనల ద్వారా ప్రజల్ని విద్యావంతులుగా చెయ్యడం, వారిలో ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టడం చేసేవారు. అతని ప్రచారానికి వచ్చిన నిధుల ద్వారా యాత్రా స్థలాల్లో ఈశ్వర జ్ఞానానికి సంబంధించిన పాఠశాలలు, స్వచ్ఛంద విశ్రాంతి గృహాలు నెలకోల్పేవారు. అలాగే గాడ్గె మహరాజ్ పేదరికంతో బ్రతుకుతున్న గ్రామాల ప్రజలకు విద్యా వైద్య సహాయం అందించే విషయంలో ఎక్కువ ఆసక్తి, శ్రద్ధ కనపరచేవారు. దానికొరకుగాను ప్రాథమిక వైద్యశాలలు ప్రతిగ్రామంలోనూ నెలకొల్పి, ఉచితంగా మందులు పంపిణీ చేసేవారు. మహారాష్ట్ర అంతా అనేక అనాధ శరణాలయాలు స్థాపించారు. వాటిలోనే ఒక బడి, ఒక చికిత్సా కేంద్రం కూడా ఉండేవి. అన్నింటికీ మించి అతడికి బాగా యిష్టమైన పని ఏమిటంటే, ఆదివాసీ కుటుంబాల్లో ఆడపిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని స్థాపించిన అనేక విద్యాలయాలు, వాటి నిర్వహణా కార్యక్రమం.

అలాగే ఆయన అతి ఉత్సాహంతో చేపట్టిన సేవా కార్యక్రమం ఇంకొకటి ఉంది. కుష్టు వ్యాధిని పడిన అభాగ్యులను చేరదీసి, అంటరాని వారని అందరిచే తిరస్కరించబడ్డ కుష్టు వ్యాధి గ్రస్తులను స్వయంగా తాకి, వారి చెడిపోయిన శరీర భాగాలను శుభ్రం చేసి, వారందరికి తగిన వసతి భోజన సౌకర్యాలను కల్పించి, బిచ్చమెత్తుకుని జీవించే అవసరం లేకుండా చేసేవారు. మానవ సేవే మాధవసేవ అనబడే ప్రముఖ సూత్రాన్ని ఆచరణలో చూపెట్టిన మహానుభావుడు గాడ్గె మహరాజ్. పరిసరాల పరిశుభ్రతే పరమాత్మ పట్ల భక్తికి తార్కాణమని అతని విశ్వాసం. అతడు ఎక్కడికి వెళ్ళినా ముందుగా అక్కడి రహదారుల్ని, వాటికి అనుబంధంగా ఉండే వీధుల్ని శుభ్రం చెయ్యడమే పనిగా పెట్టుకొనేవాడు. చేతిలో ఒక చీపురు పట్టుకుని, శ్రావ్యమైన కంఠంతో పాటలు పాడుకొంటూ తుడిచేవాడు. గ్రామస్తులకు చెప్పే

పాఠాల్లో ముఖ్యమైనది ఆరోగ్యం, పరిశుభ్రత. మురికి ఎక్కడ ఉంటే వ్యాధి అక్కడ ఉంటుందని బోధించేవాడు. కాబట్టి ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకొంటే అదే ఆరోగ్యాన్ని కాపాడుతుందని చెప్పేవాడు. ఆయన చేపట్టిన అన్ని కార్యక్రమాలకు అనేక మంది ధన సహాయం చేస్తూ ఉండేవారు. విరాళాలు భారీగా అందడం వల్ల సేవా కార్యక్రమాలు కూడా అందుకు తగినట్లుగా భారీ ప్రణాలికలతో అమలు చేస్తూ ఉండేవారు.

అదే ప్రకారంగా చాలా మంది సాయి భక్తులు కూడా తమ తమ కష్టార్జితంలో కొంత భాగాన్ని కూడబెట్టి, చక్కటి సేవా కార్యక్రమాలు మానవాళి అభ్యుదయానికి గాను ఖర్చు చేస్తున్నారు. ఈ క్రింద చెప్పబడిన లీల అటువంటి దానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

గిరీష్ భాయ్ అనే సాయి భక్తుడు లండను నగరంలో ఉండేవాడు. అతడికి 50 సం॥ల వయస్సులో పిల్లలు ఇద్దరూ లండనులోనే ఉద్యోగాలు చేస్తూ ఉండడం వల్ల, ఇండియాకు తిరిగి వచ్చేద్దామని నిర్ణయించుకున్నాడు. ఆ ప్రకారం అతను, అతని భార్య ఇండియాకు తిరిగి వచ్చి అహ్మదాబాద్‌లో స్థిరనివాశం ఏర్పరుచుకొన్నారు. సాయి భక్తుడు కావటం చేత గిరీష్ భాయ్ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్ణయించుకొన్నాడు. అతని స్నేహితులు కొందరితో కల్సి తన ఆలోచనకు కార్యరూపం ఇచ్చాడు. వెంటనే వారున్న ప్రాంతమంతా తిరిగి, కూలిపని చేసుకొనే కొన్ని పేదకుటుంబాలను ఎంచుకున్నారు. వారంతా నిరుపేదలు, రెండుపూటలా తిండికి కూడా కటకట లాడేవారు. ఒక్కోసారి రాత్రిపూట తిండిలేక పస్తులు ఉండేవారు. గిరీష్‌భాయ్ బృందమంతా చందాలు వేసుకొని కొంతడబ్బు కూడబెట్టారు. కొన్ని కిరాణా దుకాణదారులను కూడ వారి సంఘంలో సభ్యులుగా చేర్చుకున్నారు. పథకం ప్రకారం ప్రతి పేద కుటుంబానికి ఒక జాబు ఇచ్చేవారు. దానిలో పాడవకుండా ఉండే సరుకుల సమాచారం ఉండేది. జాబు చూపెడితే దుకాణదారు వారికి సరుకులు ఇచ్చేవాడు. ఈ విధంగా ఆ పేదవారికి కడుపునిండా భోజనం దొరికినట్లు అయ్యేది. దుకాణదారుకు సంఘం

వారు డబ్బు చెల్లించేవారు. సంఘం వారు ఇచ్చిన జాబులో సంఘ సభ్యుల పేర్లు ఉండేవి కావు. అంతా సాయి కరుణ వల్ల జరుగుతున్న కార్యక్రమం కాబట్టి సాయి భరోసా అని వ్రాయబడి ఉండేది.

గిరీష్ భాయ్ బృందం లాంటి ఇతర బృందాలు కూడా అనేకం ఉండేవి. వారందరూ వేరువేరు కార్యక్రమాలు చేస్తూ వారి కాలాన్ని, ధనాన్ని సద్వినియోగం చేసుకొనేవారు. ఇదే భక్తి, ఇదే సేవగా అందరూ భావిస్తూ ఉండేవారు.

ఇక్కడ సాయి భక్తులకు ఒక సూచన ఇవ్వబడుతోంది. ఆధ్యాత్మిక పురోగతి, భక్తి భావన, ప్రాథమిక దశలో ఉన్నప్పుడు సాయిని విగ్రహరూపంలో పూజించడం తప్పనిసరి. కాని సాధన ఇంకా ముందుకుపోతున్న తరుణంలో మాత్రం, అంతవరకూ పాటిస్తున్న ఆరాధనా పద్ధతులు మారవలసి ఉంటుంది. అందుకే బాబా ఇలా అనేవారు. భక్తుడు నన్ను ఎంత తీవ్రతో ప్రార్థిస్తే నేను కూడా అంత తీవ్రతతో అతడిపై నా అనుగ్రహాన్ని కురిపిస్తాను.

శ్రీసాయి సచ్చరిత్ర 9వ అధ్యాయంలో బాబా, సీతాభాయి తార్కడ్‌ను ఎంతగానో మెచ్చుకున్నారు. ఆమె ఆకలితో నున్న ఒక కుక్కకు, ఒక పందికి ఇంత అన్నం పెట్టి వాటి ఆకలి బాధను తీర్చింది. దానివల్ల జరిగిన వింత ఏమిటంటే బాబా ఆకలి నొప్పులు తగ్గిపోయి ఆయన కడుపు నిండినట్లయింది. దీనిబట్టి, ఆకలితో నున్న ప్రాణులకు అన్నం పెట్టి ఆ ఆకలి తీరిస్తే, అదే బాబాకు చేసే ఆరాధన లేక పూజ అవుతున్నదని గ్రహించాలి. బాబా ఇలా అంటారు. ఎవ్వరైతే సకల ప్రాణుల్లోనూ నన్ను చూడగలరో, వారినే నేను ప్రేమిస్తాను. అందుచేత అంతటా బాబా అస్థిత్వమే నిండి ఉందని గ్రహించి, భేద భావాన్ని దగ్గరకు రానీయకండి. ఇదే మీరు నాకు చేసే పూజ. ఎప్పుడూ ఇతరుల పట్ల దయ గల్గి ఉండండి. ఈ రహస్యం మీ హృదయంలో దాచుకోండి

బాబా సీతాభాయికి తన సర్వవ్యాపకమైన రూపాన్ని సంగ్రహంగా చూపెట్టారు. ఆ ప్రకారం కొన్ని సమయాల్లో ఆయనే కుక్కగాను, పందిగాను, ఆవుగాను, పిల్లిగాను,

చీమగాను, ఈగ గాను, నీటిలో బ్రతికే క్రిమిగాను ఉంటూ, ఇలా అనేక రూపాల్లో ప్రపంచం అంతటా తిరుగుతూ ఉంటారు.

ఈ సర్వవ్యాపకమైన రూపమే బాబా యొక్క అసలు స్వరూపం. కాబట్టి ఈ అసలు స్వరూపాన్ని తెలుసుకుందుకు ప్రయత్నించండి. అందువల్లనే మీలో దైవ భక్తి పెల్లుబికి, అన్ని జీవుల ఎడల దయ జాలి కలిగి ఉండడానికి, వాటికి సేవ చెయ్యడానికి ప్రోత్సాహం లభిస్తుంది. ఈ సేవ వల్లనే మీలో అష్టభావ పరంపరలలో ఏదో ఒకటి మొదలై కార్యరూపం దాలుస్తుంది. ఇదే పరిస్థితి సీతాభాయికి కల్గింది. బాబా మాటలు వినగానే ఆమెలో భావోద్రేకం ఉదయించింది. గొంతు బొంగురు పోయింది. కన్నీళ్ళతో కళ్లు నిండిపోయాయి. అవే ఆనంద భాష్పాలుగా రాలాయి.

మానవులందరూ రెండు రకాల విధులకులోబడి జీవితం గడుపుతూ ఉంటారు. ఒకటి సృష్టి యొక్క నియమం. రెండు పరమాత్మ యొక్క నియమం. దీనికి తోడు మానవ సమాజం కూడా కొన్ని నియమ నిబంధనలను ఏర్పరుస్తుంది. ఇవి మనిషి మనుగడకు పనికి వస్తాయి. ఒక సమాజంలో ఉన్న మనిషి తనకు, తన కుటుంబానికి సరిపడా డబ్బు సంపాదించవలసి ఉంది. అందుకొరకు గాను ఆదర్శంగా ఉంటూ తన ఉద్యోగాన్ని నీతి నిజాయితీలతో కూడి ఆచరిస్తూ ఉండాలి. కాని తన కుటుంబంతో పెన వేసుకొన్న సంబంధ బాంధవ్యాల వల్ల, ఇంకా పెరుగుతున్న కోరికల మూలంగా, ఉద్యోగంలో నీతి నిజాయితీలకు అప్పుడప్పుడు కళంకం ఏర్పడుతూ ఉంటుంది. ఇదే లంచం రూపంలో ప్రత్యక్షమవుతుంది. తన అంతరంగంలో చేసేది తప్పు అని తెలిసినప్పటికీ, తనకు తానే క్షమాపణలు చెప్పుకొని, తనను తాను సమర్థించుకుంటూ ఉంటాడు. బాబా భక్తుడికి ఇటువంటి పరిస్థితి ఎదురైనప్పుడు, తనను తాను కఠినంగా ప్రశ్నించుకోక తప్పదు. ఇటువంటి పనుల వల్ల బాబా సంతోషిస్తారా అని అనుకోవాలి. ఆ విధంగా మన భావనే మనం చేసే చెడ్డ పనులకు అడ్డు కట్టు వేస్తుంది. దానివల్ల దొంగతనం గాని, మోసం గాని, లంచం తీసుకోవడం గాని జరగకుండా ఉండడానికి అవకాశం ఏర్పడుతుంది.

కాకా సాహెబ్ దీక్షిత్ మంచి పేరున్న వకీలు. అతడికి తన గొప్పతనంతోబాటు ఐశ్వర్యం కూడా పెరిగింది. కాని తను కొన్ని నిజాలను కప్పిపుచ్చి కేసులు గెలుస్తున్నాడా? అని తన అంతరంగమే అడుగుతున్న భావన అతడికి అప్పుడప్పుడు కలుగుతోంది. అతను చేసేది లేక బాబానే ఈ విషయం గురించి అడిగాడు. బాబా చాలా దృఢంగా సమాధానం చెప్పారు. ఎప్పటికీ నిజమే మాట్లాడు . నిజం తప్ప వేరేదీ మాట్లాడకు, అంతే దీక్షిత్ బాబా ఆజ్ఞను శిరసావహించాడు. తన న్యాయవాద వృత్తికే స్వస్తి పలికాడు. దీనివల్ల తనకు ఆదాయం తగ్గిపోయినా తన నిర్ణయానికే కట్టుబడిపోయాడు.

కొంతమంది రెండో రకం మనుష్యులంటారు. వారు తమ జీవితాల్ని ఇతరుల సేవ కొరకు మాత్రమే అంకితం చేస్తారు. ఆధ్యాత్మికత అంటే ఇదే అని వారి భావన. అమెరికాలో "హేబిటాట్ ఫర్ హ్యూమానిటీ ఫౌండేషన్" అనే సంస్థ పేదలకు ఇళ్ళు కట్టించి ఇస్తుంది. అంతేకాకుండా వాటిని మరమ్మతులు చేయడం, బాగా పాడైన వాటిని తిరిగి నిర్మించడం కూడా చేస్తూ ఉంటుంది. దాని వల్ల ఆ కుటుంబాల వారు నివశించడానికి చక్కటి ఇళ్ళు సమకూరుతాయి. యుద్ధాల్లో ఇళ్ళు కోల్పోయిన వారికి, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇళ్ళు కోల్పోయిన వారికి కూడా ఈ సంస్థ ఇళ్ళు నిర్మించి సహాయం చేస్తూ ఉంటుంది. ఇంకా ఈ సంస్థ వారికి అనుబంధంగా అనేక సంస్థలు ఎన్నో దేశాల్లో వాటి వాటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. దానివల్ల పేద ప్రజలు మురికివాడల్లో నివసించే బాధ తగ్గుతుంది. ఈ రకమైన సేవా కార్యక్రమానికి కుల మత భేదాలు లేవు. ఈ పనులన్నీ స్వచ్ఛంద సేవా కార్యకర్తలు నిర్వర్తిస్తూ ఉంటారు. కాబట్టి వారందరూ ఆధ్యాత్మిక జీవితం గడిపే వారిగానే ఉన్నారు.

పైన చెప్పబడిన ఇళ్ళు నిర్మించే సంస్థ చాలా పెద్దది. ఎంతో మంది సాధారణ వ్యక్తులు, చాలా అసాధారణమైన పనులు చేస్తూ ఉంటారు. దీనికి కారణం వారి అంతరాత్మ ప్రబోధమే. ఇలాగే దాసుగణు అంతరాత్మ ప్రబోధం వల్ల ఉత్తేజితుడై దామోదర్ అటవాలేకు ఆహారం, వసతి కల్పించాడు. అంతకు ముందు జరిగిన కథ ఇలా ఉంది. దాసుగణు ఎప్పుడు పూణె వెళ్ళినా, జాగేశ్వరి వీధిలో వామనరావు


పోద్వార్ వద్దనే బస చేసేవాడు. ఒకసారి దాసుగణు అక్కడ కిటికీ వద్ద నిలబడి బయటకు చూస్తున్నాడు.

అతడికి ఒక దృశ్యం కనపడింది. తొమ్మిది సంవత్సరాల వయసున్న ఒక కుఱ్ఱవాడు గట్టిగా ఏడుస్తున్నాడు. ఆ కుఱ్ఱవాడు వేద విద్యార్థి. అతడు కొంతమంది ఇళ్ళలో బిక్ష (భోజనం) తెచ్చుకుని తింటూ తన చదువు సాగిస్తున్నాడు. ఆరోజు అతను యధాప్రకారంగా బిక్ష తీసుకుని  వస్తూ ఉండగా, ప్రక్క నుండి పోతున్న ఒక టాంగా నడిపేవాడు, ఆ కుఱ్ఱవాడిని ఆప్యాయంగానే భుజం మీద చెయ్యి వేసాడు. దాంతో ఆ కుఱ్ఱవాడు మైలపడినానని, ఇంక ఆ రోజుకు భోజనం తినడం అవదని బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టాడు. అది చూసిన దాసుగణు ఆ కుఱ్ఱవాడిని చేరదీసి భోజనం, వసతి కల్పించాడు. అతడి పేరే దామోదర్ అటవాలె. ఇతడు పూణె రాకముందు కొంకణ్ ప్రాంతంలో గుహార్ అనే గ్రామంలో ఉండేవాడు. వేద విద్య అభ్యసిద్దామని పూణె వచ్చాడు. పూణెలో అతడి అన్న ఉన్నాడు. ఆ అన్నకి రంపం మిల్లు ఉంది. కాని అటవాలె చదువు గురించి పట్టించుకొనేవాడు కాదు. అలాగే మిగతా అవుసరాలు కూడా చూసేవాడు కాదు. ఇంక చేసేదిలేక ఆ కుఱ్ఱవాడు కొంతమంది ఇళ్ళల్లో బిక్ష చేసుకుని చదువుకుంటున్నాడు. దాసుగణు ఆ విద్యార్థికి భోజనం పెట్టడమేకాక వసతి కూడా కల్పించాడు. ఇంకోరకంగా చెప్పాలంటే ఆ కుఱ్ఱవాణ్ని దాసుగణు దత్తత తీసుకున్నాడు.

మనం లక్షల రూపాయలు ఖర్చుచేసి ఒక దేవాలయం కట్టి దాంట్లో ఒక విగ్రహం స్థాపించి పూజలు చేయటమన్నది భక్తి యొక్క ప్రాధమిక దశ. అయితే ఇలా జీవితమంతా విగ్రహానికి గంధం పూస్తూ, అగరుబత్తి వెలిగిస్తూ కాలమంతా గడిపేస్తూ ఉంటామా? అలాగైతే భక్తిభావనలో రెండో దశకు ఎప్పుడు చేరుకుంటాం. మనకున్న భక్తి భావం, సేవాభావం క్రిందకి ఎప్పుడు మారుతుంది. భక్తి అన్నది లోపల ఉంటుంది. సేవ అన్నది బయటకు కనబడుతుంది. శరణార్థులకు చేసే సహాయం, భగవంతుడికి చేసే భక్తికి సమానంగా ఉంటుంది. కాబట్టి సేవ అన్నది ఒక సాధారణమైన

పని క్రిందకు రాదు. ఆ సేవ వెనుక మనిషి హృదయస్పందన అనుభవానికి వస్తుంది. ఆ స్పందనలోనే దయ, జాలితో కూడిన వినయం స్పష్టంగా కనబడుతుంది. బడుగు బలహీన వర్గాలకు సేవచేసే అవకాశం వచ్చినందుకు మనం సంతోషపడతున్నామా, లేదా అన్నది చాలా ముఖ్యమైన విషయం. కాబట్టి సేవ వెనుకనున్న భావం చాలా గొప్పదై ఉండాలి. కొన్ని సంవత్సరాల క్రిందట షిరిడీలో చాలా గోశాలలు ఉండేవి. వాటిల్లో చాలామంది స్వచ్చంద సేవా కార్యకర్తలు ఉండేవారు. ఈ గోశాలలు వట్టిపోయిన ఆవులకు, జబ్బు పడిన ఆవులకు మంచి సంరక్షణ కల్పించే స్వర్గధామాలుగా పేరు బడ్డాయి. సాధారణంగా పాలు ఇవ్వని ఆవులను వధశాలకు పంపించేస్తూ ఉంటారు. కాని ఈ గోశాలలు ఎటువంటి ఆవులనైనా పోషిస్తాయి. గోవులు సహజంగా మరణించేంత వరకూ అక్కడ వాటికి సంరక్షణ దొరుకుతుంది. ఇక్కడ కార్యకర్తలందరూ ఆనందంగా పని చేస్తూ ఉంటారు. ఈ పనిని వాళ్ళు తమ ఇష్ట ప్రకారంగానే ఎంచుకున్నారు కాబట్టి ఏ లోపం రాకుండా చూసుకుంటారు. సేవ అన్న విషయానికి ఇంతకంటే మంచి ఉదాహరణ ఎక్కడుంటుంది. దురదృష్టవశాత్తు ఇప్పుడు చాలా గోశాలలు మూసివేసారు. షిరిడీకి దక్షిణాన ఒక గోశాల మాత్రమే నడుస్తోంది. ఇలాగే అనేక మంది స్వచ్ఛందంగా పనిచేస్తూ ఉంటారు. వారి సేవా భావం నిజంగా భక్తి భావమే కాని వేరు కాదు. కాబట్టే బాబా కూడా వారికి తన అనుగ్రహాన్ని చూపెడుతూ ఉంటారు.

ప్రపంచంలో కొంతమంది మంచి మనష్యులుంటారు. వారు ఏనాడూ నుదుట గంధం పూసుకోరు. అలాగే ఏ దేవాలయానికి వెళ్ళరు. భగవంతుని నామ జపం చేయరు. కాని వారి హృదయం చాలా మెత్తనిది. అది దయ, జాలి, కరుణలతో నిండి ఉండి, ఆర్తులను ఆదుకోవడానికి ఉత్సాహం చూపెడుతుంది. అటువంటి వారు సంఘాలుగా ఏర్పడి కావల్సిన సేవలు అందిస్తూ ఉంటారు. ఉదాహరణకి యుధిష్టర్ సొసైటీ అని ఒకటుంది. అది కుక్కలను కాపాడి సంరక్షిస్తూ ఉంటుంది. వీధి కుక్కల దగ్గర నుంచి, కొన్ని పెంపుడు కుక్కలకు కూడా రక్షణ కల్పిస్తోంది. వాటి యజమానులు



ఊరు వదలిపోవడం వల్ల అవి అనాథలుగా తయారవుతాయి. అటువంటి కుక్కలను ఈ సంఘం వారు చేరదీస్తారు. ఈ సంఘ సభ్యులు మూగజీవాలకు చేసే సేవ భగవంతుడికి చేసే పూజ అవుతుంది. ఎందుకంటే పరమాత్మ అంతర్యామి రూపంలో అన్ని జీవుల్లోనూ ఉన్నాడని మన శాస్త్రాలు చెప్తున్నాయి. ఇటువంటి కార్యకర్తలు బాహ్యంగా భగవంతుణ్ని ఉపాశించకపోయినా, భగవంతుడి దృష్టిలో వారు భక్తుల క్రిందకే వస్తారు. నిజానికి అటువంటి వారే భగవంతుడికి ప్రియమైన వారు. సమాజం కూడా వారి సేవల్ని ఎప్పుడూ కొనియాడుతూ ఉంటుంది.

ఇన్ని విషయాలు విన్న తరువాత మనం అర్థం చేసుకోవల్సింది ఏమిటంటే, భగవంతుడైన సాయినాథుని సేవా కార్యక్రమాల్లో మనం పాలు పంచుకొన్నట్లయితే మనది నిజమైన భక్తి అనిపించుకొంటుంది. సమస్త ప్రాణికోటిలోనూ ఉన్నటువంటి బాబా దివ్యశక్తిని మనం గుర్తెరిగితే, అలాగే ఆర్తులందరికీ సేవ చెయ్యగలిగితే అదే నిజమైన భక్తి. అప్పుడు మన భక్తికి సమానంగా బాబా అనుగ్రహం కూడా మనకు కలుగుతుంది.

# ఎనిమిదవ వాగ్ధానం

**తుము సామీ భారవాహీనా సర్వాదా**

**నవేహే అన్యా ధా వచనా మాఙే॥**

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఎనిమిదవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది.

**"నా యందు ఎవరికి దృష్టి కలదో వారి యందే నా కటాక్షము గలదు."** దీన్నే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. ఎంతకాలమైనా నేను మీ జీవన భారాన్ని మోయ గలను. అనగా మీకు మోక్షం కలిగే వరకూ మోయగలను. అలా కాని పక్షంలో నా వాగ్ధానం అసత్యమనిపించుకుంటుంది.

ఇంతకు ముందు వాగ్ధానం భక్తిని, భక్తి భావనను మరియు భక్తిని కనబరిచే అనేక విధాలైన అంశాలను వాటి కోణాలను విమర్శనాత్మకంగా చర్చించింది. సేవ, సేవకు సంబంధించిన విషయాలను మనం క్షుణ్ణంగా పరిశీలించి అర్థం చేసుకో గలిగితే, సాయి భక్తి మార్గంలోనే మనం నడుస్తున్నట్లు లేక సాయినాధుని యొక్క నిజమైన భక్తులమనిపించుకొన్నట్లు రూఢి అవుతుంది. ఒకసారి బాబా మన భక్తిని అంగీకరించినట్లయితే, మనకి ఆయన పాదాల చెంత ఆశ్రయం దొరకినట్లే లెక్క. అప్పుడు మనం మనకు నిర్ధేశించిన గమ్యాన్ని చేరుకోగలం. మన భావనలు, భక్తి, సేవల తీవ్రతను బట్టి మనం బాబా పెట్టిన పరీక్షలలో నెగ్గామా లేదా అన్నది తెలుస్తుంది. ఇదే శ్రద్ధ, సబూరిల యొక్క అర్థం. అయితే ఈ ఉత్తీర్ణతకు ఎక్కువ కాలం పట్టిందా లేక తక్కువ కాలమే పట్టిందా అన్నది, మన జీవితంలో గల రెండు కోణాల మీద ఆధారపడి ఉంది. ఒకటి మన ప్రారబ్ధము. రెండు మనపై బాబాకు గల దయ, అనుగ్రహం. మనం సాధారణ మనుష్యులం కాబట్టి వీటిపై మనకు అదుపు ఉండదు. కాని ఒక విషయం ధైర్యంగా చెప్పుకోగలం. బాబా భక్తులమైన మనం, ఒక ప్రక్క ప్రారబ్ధం అనుభవిస్తూ (తప్పదు కాబట్టి), భక్తి మార్గాన్ని వదిలిపెట్టకుండా,

స్వార్థరహితులమై తాడిత పీడిత జనానికి సేవలందించవచ్చు. మనం చెయ్యవలసింది, వచ్చిన దానితో సంతృప్తి చెందడమే. ఎందుకంటే మనకి బాగా తెలుసు ఈ వచ్చింది కూడా తాత్కాలికం, ఎంతోకాలం ఉండేది కాదు అని.

చివరగా ఒక విషయం ధైర్యంగా అర్థం చేసుకోవలసి ఉంటుంది. జీవితమంతా భక్తి భావన కల్గిన మనిషికి సేవా భావాన్ని కూడా తన వెంట నడిపించుకొనే శక్తి ఉండాలి. ఇదే అసలు సిసలు భక్తి అని గుర్తెరగాలి. అణగారిన ప్రజల పట్ల దయ జాలి కల్గి వారికి చేసే సేవే తన తక్షణ కర్తవ్యంగా, ధర్మంగా భావించాలి. ఇది ఒక రకమైన కర్మకాండ. దీనికి సంబంధించిన కర్మఫలం ఎప్పుడొస్తుంది అన్న విషయం తెలీదు. కాని అంతవరకూ ఊపిరి బిగబట్టి కర్తవ్యాన్ని వదిలి పెట్టకుండా ఉండగలగాలి.

అప్పుడు ఆ  మనిషి పరిస్థితి కూడా దయనీయంగా మారవచ్చు. ఆకలితో అలమటించ వలసిన సమయాలు అనుభవానికి రావచ్చు. ఎదురుగుండా పంచభక్ష్య పరమాన్నాలు ఉన్నప్పటికీ చేతులు రెండు కట్టివేయడం వల్ల ఒక్క ముద్దగూడ నోటికి అందని అనూహ్యమైన స్థితి దాపురించ వచ్చు. ఇదంతా బాబా పెట్టే పరీక్ష అనుకొని మానసిక ధైర్యం తెచ్చుకోవాలి. ఈ ధైర్యాన్ని సడలించకుండా ప్రయాణం చేయగలనా? లేక వదిలి పెట్టవలసి ఉంటుందా? అనే విపరీత ఆలోచనలు ముసురుకుంటాయి. కాని బాబాపైన భక్తి అజేయమైంది. దానివల్ల మనం భగవంతుణ్ని తప్పక పొందగలం కాని ఈ స్థితిని చెక్కు చెదరనీయక భగవంతుణ్ని ఎప్పటికీ మన దగ్గరే ఉండేలా చెయ్యడమన్నదే బ్రహ్మ విద్య. ఇంక ఆ అమోఘమైన స్థితినే బ్రహ్మీస్థితి అని మన శాస్త్రాలు వర్ణించాయి. ఈ స్థితి కొరకే ప్రతిమనిషి కఠినమైన కృషి చెయ్యవలసి ఉంటుంది.

కాకాసాహెబ్ దీక్షిత్‌కు ప్రతిరోజు ఉదయం ధ్యానం చేసే అలవాటుంది. ఆ విధంగా ఒకరోజు అతడికి భగవంతుడైన పండరి విఠల్ దర్శనమైంది. తరువాత అతడు ద్వారకామాయికి పోయి బాబా పాదాల ముందు సాష్టాంగ నమస్కారం చేసాడు. బాబా దీక్షిత్ కళ్ళల్లోకి తిన్నగా చూస్తూ, ఏమయ్యా! ఈరోజు నీ దగ్గరకొచ్చిన

విఠల్ పాటిల్‌ను కలుసుకున్నావా? కాని జాగ్రత్త విఠల్ అంతుచిక్కని వాడు . అతడు రాగానే గట్టిగా పట్టుకో. వదిలి పెట్టకు. బలవంతంగా ఏదో ఒక దగ్గర స్థిరంగా ఉండేటట్లు చెయ్యి. నువ్వు ఒక క్షణం ఏమరు పాటుగా ఉన్నా సరే, అతడు తప్పించుకు పోతాడు. దీక్షిత్‌కు బాబా ఇచ్చిన సలహా పాఠకులకు అర్థమయ్యే ఉండాలి. బాబా చెపుతున్నారు, చెపుతున్నారు అనేకంటే హెచ్చరిస్తున్నారు అంటే ఇంకా బాగుంటుంది. భగవంతుడ్ని తన దెసకు త్రిప్పుకోగల్గటంలో ఉండే కష్టంపై బాబా మర్మగర్భంగా హెచ్చరిస్తున్నారు. ఇక్కడ దీక్షిత్‌దే బాధ్యత. అతడికి విఠల్ దర్శనమైంది. ఇంక ఆ దర్శన భాగ్యం అలా కలకాలం నిలవాలంటే అతడి భక్తి పరాకాష్టకు చేరాలి. ఇంకా దానిలో నుండి సేవాభావం పెల్లుబకాలి. అప్పుడే అతడు భగవంతుణ్ని సర్వదా! తన దగ్గరుంచుకొన్న వాడవుతాడు.

అయితే ప్రయాణించే దారి మాత్రం క్లిష్టమైంది. చాలా గోతులు, గాతలతో నిండి ఉంది. కాని భయం లేదు. బాబా అండ మనకుంది. ఆయనకున్న అపార కరుణారసంతో, దయతో మన ప్రారబ్ధాలను సైతం అవలీలగా అధిగమించి ముందుకు సాగే బలాన్ని ఆయన మనకివ్వగలరు. చివరకు, మనం కాని శక్తిని కోల్పోయి, మన ప్రారబ్ధాన్ని అధిగమించ లేని పరిస్థితి వచ్చి, ఇక జీవితంలో ఓటమిని చూడవలసిన క్షణం మీదపడితే, బాబా రంగప్రవేశం చేస్తారు. మనల్ని ఓడనివ్వరు. ప్రారబ్ధాన్ని ఒకేసారి మీద పడకుండా యాతనల్ని, కష్టాల్ని వేరువేరుగా విభజించి వాటి బరువుని తగ్గిస్తారు. అలాచేసి వాటిలోని కొంత భాగాన్ని మాత్రమే మన అనుభవానికి వచ్చేటట్లు చేస్తారు. ఇదే ప్రయోగం డాక్టరు పిళ్ళై విషయంలో జరిగింది. శ్రీసాయి సచ్చరిత్ర 34వ అధ్యాయంలో ఒక ప్రత్యేకతతో కూడిన, ప్రియమైన సంబంధం డాక్టరు పిళ్ళై మరియు బాబాల మధ్య ఉన్నదని చెప్పబడింది. బాబా ప్రేమతో పిళ్ళైని 'బాపూ' అని పిలిచేవారు. కావాలని తన ప్రక్కనే కూర్చో బెట్టుకొనేవారు. అంతేకాక ఇద్దరూ కలిసి కట్టుగా చిలుము త్రాగేవారు. పిళ్ళై గురించి అన్ని విషయాలు, అవి చిన్నవి కాని పెద్దవికాని అడిగి తెలుసుకొనేవారు.

ఒకసారి పిళ్ళై గునియా పురుగులతో కూడిన పుండు వల్ల బాధపడుతున్నాడు. దానితో విపరీతమైన నొప్పి కలిగేది. శరీరంలో సుమారు ఏడు గునియా పురుగులుండి బాధను తీవ్రతరం చేసాయి. దానివల్ల మంచానికే పరిమితమయ్యాడు. అంత బాధలో కూడా బాబా నామజపం చేస్తూనే ఉన్నాడు. బాధ అంతకంతకూ ఎక్కువైపోయింది. పిళ్ళై ఇక భరించలేక చనిపోతే బాగుండును అనుకున్నాడు. ఆ కబురు బాబాకు తెలిసింది. బాబాతో ఇలా మొరపెట్టుకున్నాడు. బాబా దేహమంతా గునియా పుళ్ళు ఉన్నాయి. ఆ బాధ భరించ లేకపోతున్నాను. నాకున్న బలమంతా క్షీణించింది. ఈ పుళ్ళ బాధ మరణబాధలాగే వుంది. బాబా! నిజంగా దీనిని భరించే శక్తి నాకు లేదు. ఇక మరణమే శరణ్యం. ఈ ప్రారబ్ధం ఇంతటితో తీరకపోతే మిగిలింది వచ్చే జన్మలో అనుభవిస్తాను. నాకు తెలుసు, ప్రారబ్ధమన్నది అనుభవస్తేగాని పోయేది కాదు. దీని కోసం ఎన్ని జన్మలైనా ఎత్తవలసి ఉంటుంది . దీన్ని ఎట్టి పరిస్థితులలోనూ వదలలేము. నా కర్మఫలం ప్రకారం ఎన్ని జన్మలైనా నేను సంతోషంతో స్వీకరిస్తాను. మిమ్మల్ని కోరేది ఒక్కటే నేనీబాధను భరించలేక పోతున్నాను. కాబట్టి నాకు మరణం ప్రసాదించండి.

ఆ సమాచారం విన్న బాబా పిళ్ళైతో ఇలా చెప్పమన్నారు. నీ మనస్సులో నుంచి ముందు భయాన్ని పోగొట్టుకో. ఎందుకు ఈ భాధను మళ్ళీ వచ్చే పదిజన్మల వరకూ సాగదీస్తావు. దానికి బదులు పది రోజుల వరకూ ఈ బాధని ఉండనియ్యి. దీన్ని మనిద్దరం పంచుకొని అనుభవిద్దాం. బాబా అలా చెప్పిన తరువాత పిళ్ళైని ద్వారకామాయికి తీసుకు వచ్చారు. బాబాకి కుడి ప్రక్కన కూర్చోబెట్టారు. బాబా అతనికి ఒక తలగడ ఇచ్చి దానిపై ఆనుకుని కూర్చోమన్నారు. అప్పుడు బాబా ఇలా అన్నారు. “ఎంత మొత్తం అనుభవించవలసిన విధి ఉందో, అది పూర్తిగా అనుభవించ వలసిందే కాని కొంత వదిలి పెట్టేది కాదు. మంచి చెడు, సుఖం దుఖం, అమృతం విషం మొదలైన ద్వంద్వాలతో కూడిన మాత్రాస్పర్శలు(విషయాలు వాటి అనుభవాలు) సంచిత కర్మఫలం నుండి ప్రాప్తిస్తూ ఉంటాయి. వాటిని సహిస్తూ ఉండవల్సిందే.

సంతోషాన్ని కాని దుఃఖాన్ని కాని పొందవద్దు. ఒక కాకి వచ్చి నీ పుండుని పొడుస్తుంది. దానితో నీ బాధ తీరుతుంది." బాబా అలా చెప్పిన కాస్సేపటికి, ద్వారకామాయిలో సాయంత్రం దీపాలు వెలిగించే బాబా భక్తుడు, సేవకుడు అయిన అబ్దుల్లా వచ్చేరు. అతడు నల్లగా ఉంటాడు. (బాబా మర్మగర్భంగా చెప్పిన, కాకి ఇతడే) అబ్దుల్లా దీపాలు వెలిగించే పనిలో ఉండగా, చూసుకోకుండా గునియా కురుపున్న పిళ్ళై కాలు మీద అడుగేసాడు. ఆ వత్తిడికి కురుపు చితికి దాన్లో నుండి గునియా పురుగులు బయట పడ్డాయి. ఆ దెబ్బకి పిళ్ళై అంతవరకూ పడిన బాధ తగ్గుముఖం పట్టింది. అక్కడ నుండి పది రోజుల కాలం ఆ కురుపుపై బాబాఊది పెట్టడం, కాస్త నీళ్ళల్లో కలుపుకుని త్రాగడం చేసేవాడు. ఆ చికిత్సతో అతని గునియా కురుపుల బాధ పూర్తిగా తగ్గింది. కాని ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. బాబా తనకున్న దివ్యశక్తిని కొంత మేరకు ఈ విషయంలో వెచ్చించారు అని చెప్పవచ్చు. అందుకే పిళ్ళై బాధ కొన్ని జన్మలు పట్టేది. కేవలం పది రోజుల్లో తగ్గింది.

తరువాత చెప్పబోయే లీలల్లో కూడా బాబా తన భక్తుల అనారోగ్యాన్ని తాను అనుభవించి వారిని రోగ విముక్తులను చేసిన ఘటన చూడవచ్చు. బాబా లక్ష్మీభాయితో ఇలా అన్నారు. ఆకాశం మేఘాలతో నల్లబారడం సహజం. కాని వాన కురిసిన తరువాత అదే ఆకాశం నిర్మలంగా కనపడడం కూడా ఒక సహజమైన చర్యే. అయితే దీనికి మనం భయపడతామా? శ్రీమతి కపర్దే కొడుకు బల్వంత్ బుబోనిక్, ప్లేగు వ్యాధితో బాధపడేవాడు. అప్పుడు బాబా తన చొక్కాను బయటకు లాగి, ఆ కుర్రవాడి శరీరం మీద నున్న పొంగులను తన శరీరం మీదికి ఎలా తీసుకొన్నారో చూపెట్టారు. ఆ విధంగా అతడి వ్యాధిని తాను అనుభవించి అతడికి స్వస్థత చేకూర్చారు. ఇలాంటిదే ఇంకో లీల ఉంది.

దినబెన్ ఇలావియా అనే ఒక పార్శీ వనిత ఉంది. వారి కుటుంబమంతా సాయి భక్తులే. ఆమెకున్న ముగ్గురు పిల్లలకీ ఒకరి తరువాత మరొకరికి తట్టువ్యాధి (Measles) సోకింది. దానికి సంబంధించిన జ్వర తీవ్రత చాలా పెద్దది . దానివల్ల ఆమెకు ఏమిచేసి పిల్లల్ని రక్షించు కోవాలో తెలియక అయోమయ అవస్థలో పడింది.

బాబా భక్తురాలు కాబట్టి బాబానే ప్రార్థిస్తూ కూర్చొంది. ఆమె కొరకే అన్నట్లుగా ఒక గొప్ప వెలుగు ఆమె ముందు ప్రత్యక్షమై, ఆ వెలుగులో బాబా లీలగా కనపడ్డారు. చాలా దయతో కూడిన కంఠస్వరంతో ఇలా అన్నారు. బిడ్డా! నువ్వు బాధపడకు. నీ పిల్లలు వేగిరంగానే కోలుకుంటారు. ఆ మాటలు తరువాత ఆమెకు బాబా రూపం మరింత స్పష్టంగా గోచరించింది. బాబా ఆ విధంగా దర్శనమివ్వడంలో అమితమైన ఆశ్చర్యానికి గురైంది. అప్పుడు బాబా తన దేహాన్ని చూపెట్టారు. ఆయన శరీరం మొత్తం, ఆ పిల్లలకి వచ్చిన ప్రాణాంతకమైన తట్టు వ్యాధి లక్షణాలు కల్గి ఉంది. అది జరిగిన రోజు సాయంత్రానికి పిల్లలకు జ్వరం తగ్గడం ప్రారంభించింది. తరువాత వాళ్ళు పూర్తిగా కోలుకున్నారు. ఈ ఘటన జరిగిన తరువాత దినబెన్‌కు బాబాపై భక్తి కుప్ప తిప్పలుగా పెరిగిపోయింది.

కాబట్టి బాబా అనగా ఏమి? అన్న ప్రశ్నకు సమాధానమే 8వ వాగ్దానం యొక్క సారాంశము. ఒకసారి మనం బాబాకు వశమైతే, అలాగే మన భక్తి కూడా స్థిరమైనదైతే, ఆ క్షణం నుండే బాబా మన యోగ క్షేమాల్ని గమనిస్తూ మనల్ని రక్షిస్తూ ఉంటారు. అందుకే బాబా ఇలా అంటారు. మీ జీవితపు బరువు బాధ్యతలను నేను వహిస్తాను. దీని అర్థం ఈ జన్మలోనే కాదు, ఇలా అనేక జన్మల్లోనూ చూసుకొంటాను. ఇంకా మీ జన్మ పరంపర తెగి జన్మరాహిత్యం (మోక్షం) కల్గేంతవరకూ నాదే బాధ్యత అని బాబా అభయం ఇస్తున్నారు. ఇదే దాని అంతరార్థం కాబట్టి మీకెందుకు భయం అని కూడా అడుగుతున్నారు. దీనంతటికీ మనం చెయ్యవలసిన పనేమిటంటే మనం ఎప్పటికీ బాబాకు చెందినవారమే అన్న విశ్వాశాన్ని మరువకుండా ఉండాలి. ఎప్పటికీ ఆయన పాదాలను వదలకుండా ఉండాలి. ఇంకా ముందు రాబోయే లీలల్లో బాబా ఏ విధంగా భక్తుల ఆధ్యాత్మికోన్నతి, కాలవ్యవధి లేకుండా ముందుకు సాగడానికి తనవంతు కృషి చేస్తారో వర్ణించబడింది.

దాదాకేల్కర్ మేనల్లుడి పేరు బాబు. ఇతడు రెవెన్యూ డిపార్ట్‌మెంటులో మదింపుదారు (Assessor) గా పని చేస్తున్నాడు. బాబాకు చాలా ప్రియమైన భక్తుడు. అయితే బాబాపై నున్న భక్తి వలన, అతని ఉద్యోగ బాధ్యతలు సరిగా నిర్వర్తించక, తరచుగా

షిరిడీకి వచ్చేస్తూ ఉండేవాడు. ఇతడు హరి వినాయక్ సాథేకు బావమరిది కూడా అవుతాడు. అప్పుడు బాబుకు పైన ఉన్న అధికారి ఒకరు సాథే దగ్గరకు వచ్చి బాబు గైర్హాజరు గురించి ఫిర్యాదు చేశాడు. అదివిన్న సాథే బాబుతో మాట్లాడాడు. అయినప్పటికీ బాబు షిరిడీ వచ్చి బాబాను కలుస్తూ, ఉద్యోగ బాధ్యతలు విస్మరిస్తూ వచ్చాడు. ఇక చేసేది లేక సాథే ఈ విషయాన్ని బాబా దృష్టికి తీసుకువచ్చాడు. అప్పుడు బాబా ఇలా అన్నారు. "ఉద్యోగం పోతేపోనీ. అతడు ఇప్పుడు నన్ను సేవించడమే మంచిది." ఇది సుమారు 1910వ సంవత్సరంలో జరిగింది. తరువాత కొన్నాళ్ళకు బాబు విపరీతమైన జ్వరంతో బాబా దగ్గరకు వచ్చాడు. బాబాకు ఏం జరుగుతుందో అన్నీ తెలుసు. అందుకే ఉద్యోగం పోతేపోనీ అన్నారు. బాబా అనుకున్నట్లు గానే బాబు ఆ జ్వరంతో కన్ను మూసాడు. అప్పటికి అతని వయస్సు 22 సంవత్సరాలు. భార్య కూడా ఉంది. పిల్లలు కలుగలేదు. దీని బట్టి బాబా సర్వజ్ఞులు అన్న విషయం మనకి బాగా అర్థమవుతుంది.

1910వ సంవత్సరం మే నెలలో మోరేశ్వర్ ప్రధాన్, అతని భార్య, వదినగారు షిరిడికి వచ్చారు. వాళ్లందరూ ద్వారకామాయికి వచ్చి బాబా పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసారు. బాబా ప్రధాన్ భార్యను చూసి ఇలా అన్నారు. "ఈమె మా బాబు కేల్కర్‌కు తల్లి అవుతారు." అప్పుడు అక్కడనే ఉన్న శ్యామా అది విని, ఈ ఆడమనిషా? అన్నాడు. బాబా ప్రధాన్ వదినగారిని చూసి అలా అన్నారేమో అని శ్యామా భావించాడు. ఎందుకంటే ప్రధాన్ వదినగారు ఆ సమయానికి నెలలు నిండిన గర్భంతో ఉన్నారు. కాని శ్యామా అనుకున్నట్లు కాక, బాబా తిరిగి ప్రధాన్ భార్యనే చూపెడుతూ, ఈ ఆడమనిషే మా బాబుకు తల్లి అవుతారని నొక్కి చెప్పారు. అంతే కాకుండా ఒక కథని చెప్పడం మొదలు పెట్టారు.

ఒకప్పుడు షిరిడిలో ఒక ముసలి మనిషి ఉండేవాడు. అతను చాలా దైవభక్తి కల్గినవాడు. షిరిడిలో సుమారు పన్నెండు సంవత్సర కాలం నివసించాడు. అతని భార్య, మగపిల్లలు జాల్నాలోఉండేవారు. వాళ్ళ వత్తిడి వల్ల అతను షిరిడి వదిలి పెట్టి జాల్నా వెళ్ళిపోయాడు. కాని, కొంత కాలం తరువాత ఆముసలివాడు తన మేనకోడలిని పెళ్ళి

చేసుకోవలసి వచ్చింది. అప్పుడు వారిద్దరికీ ఒక కొడుకు పుట్టాడు. ఆ కుర్రవాడికి ఆరు సంవత్సరాల వయస్సు వచ్చింది. ఈ మధ్యకాలంలోనే ముసలి మనిషి మరణించాడు. అయితే ఆరు సంవత్సరాల వయసున్న ఆపిల్లవాడ్ని కూడా కొంతమంది ఉద్యమకార్లు విషం పెట్టి చంపి వేసారు. ఆ తరువాత ఆ పిల్లాడే దాదా కేల్కర్‌కు మేనల్లుడుగా పుట్టి బాబు అని పిలవబడినాడు. ఈ బాబే రెవెన్యూలో పనిచేస్తూ 22సం॥ వయస్సులో 1910లో చనిపోయాడు. ఇతడే తిరిగి మరుసటి జన్మలో బొంబాయి నివాశి అయిన ఈ మోరేశ్వర్ ప్రధాన్‌కు కొడుకుగా పుడుతాడు." అని చెప్పి కథ ముగించారు.

దీనినిబట్టి మనకు అర్థమయ్యిందేమిటంటే బాబును అనేక జన్మల నుండి బాబా గమనిస్తూ అతడి బాగోగులు చూస్తున్నారు. ఇది జరిగిన 12 నెలల తరువాత శ్రీమతి ప్రధాన్‌కు కొడుకు పుట్టాడు. బాబా నుండి బాబు పుడుతాడని తెలుసుకున్నవారు కాబట్టి ఆ పిల్లాడిని బాబు అనే పిలుచుకున్నారు. పిల్లలు పుట్టడానికి ఒక రోజు ముందు, ఇక్కడ షిరిడిలో బాబాకు క్రింద కడుపులో పురిటి నొప్పులు వంటి నొప్పులు ప్రారంభ మయ్యాయి. అప్పుడు బాబా అన్నారు, శ్రీమతి ప్రధాన్‌కు కవల పిల్లలు పుడుతారు. కాని ఒకడు చనిపోతాడు. ఆయన చెప్పినట్లుగానే జరిగింది.

అక్కడ బొంబాయిలో శ్రీమతి ప్రధాన్‌కు బాబు పుట్టడం వల్ల అందరూ సంతోషించారు. అప్పుడు ఆమె బాబానే తన ఇష్ట దైవంగా ఎంచుకుని పూజించింది. ఆమె మామగారు కూడా బాబానే పూజించేవారు. ఆచారం ప్రకారం రెండు నెలల పిల్లాడిని తీసుకుని బాబాకు చూపెడదామని షిరిడి వచ్చారు.

బాబాకు బహుమతులు సమర్పించుకొన్నారు. బాబా సంతోషంగా వాటిని స్వీకరించారు. వారు దూద్‌పెడా కొని అందరికీ పంచిపెట్టారు. అప్పుడు బాబా, బాబును తన చేతిలోనికి తీసుకొని ప్రేమగా చూస్తూ ఇలా అన్నారు. "బాబూ! నువ్వు ఎక్కడికెళ్ళావు. తిరిగి తిరిగి అలసిపోయావా. ఇంక ఇప్పుడు షిరిడీకి వస్తూ ఉంటావా." ఇలా బాబా అడుగుతూ ఉంటే ఆ పిల్లాడు బాబా కళ్ళల్లోకి చూస్తూ "హుహూ" అన్నాడు.

ఇటువంటిదే ఇంకొక లీల జరిగింది. అది రఘువీర్ బి.పురందరె, అతని కొడుకు విషయంలో, వారికి బాబాతో ఉన్నటువంటి ఘాఢమైన అనుబంధం గురించి చర్చించబడింది.

ఒకసారి రఘువీర్, అతని తల్లితో షిరిడి వచ్చాడు. అప్పుడు ఆమె బాబాతో తన కొడుకును కాస్త గమనిస్తూ ఉండండి అని కోరింది. దానికి బాబా అన్నారు, అమ్మా! నీ కెందుకు భయం. నాకు నీ కొడుకు గురించి అనేక జన్మల నుండి తెలుసు. అతడిని చిన్నపిల్లవాడుగా ఉన్నప్పటి నుండి అన్ని ప్రక్కల నుంచీ రక్షిస్తున్నాను. ఇంకో విషయం అతడు లేకుండా నేనేమీ తినను. అలాగే భవిషత్తులో కూడా చేస్తాను. నిజమే నువ్వు అతడి తల్లివి. కానీ నువ్వే అతడిని పెంచేవా? కాదు. మరెవరు పెంచారు? అల్లాయే పెంచాడు. కాబట్టి అల్లాయే అతడి బాగోగులు చూసుకుంటాడు.

ఇలాగే ఒకసారి రఘువీర్ పురందరె కొడుకు ఏడుమాసాల పిల్లాడుగా ఉన్నప్పుడు, కుటుంబంతో కల్సి షిరిడికి వచ్చాడు. ఆ పిల్లాడిని ఎత్తుకుని బాబా తన తొడపై కూర్చోబెట్టుకున్నారు. పిల్లడిని నిమురుతూ ఈ బావూ నా కోసం వెదుకుతున్నాడు. చాలా కాలమైంది. ఇప్పటికి నన్ను చూసాడు. అలా అంటూ బాబా ఆ పిల్లాడి కడుపు పట్టుకున్నారు. అలాగే పిల్లాడు కూడా బాబా కడుపు పట్టుకున్నాడు. ఇద్దరూ సంతోషంగా నవ్వుకున్నారు. ఎన్నోజన్మల నుండి ఉన్నవారి పరిచయం బాబాకు ఒక్కరికే తెలుసు.

ఇక రాబోయే లీలలో, తన భక్తుల కోసం బాబా కొన్ని సూత్రాలను పొందుపరిచారు. (ఈ లీల సచ్చరిత్ర 27వ అధ్యాయంలో అందంగా చెప్పబడింది. ఇంకా షిరిడి డైరీలో కూడా వ్రాయబడింది.) లక్ష్మీభాయి జి.కపర్దెకు, బాబాకు మధ్యగల కర్మ సంబంధాలు చాలా ముఖ్యమైనవి ఉన్నాయి. 1912లో లక్ష్మీభాయి కుటుంబం షిరిడికి వచ్చి చాలా కాలం వరకూ ఉన్నారు. ఆమె బాబాకు, మంచి మధ్యాహ్న భోజనం తయారు చేసి పెట్టేది. బాబా భోజనానికి కూర్చొని, తిన్న తరువాతనే ఆమె తిరిగి యింటికి వెళ్ళి తాను భోజనం చేసేది. ఆ రోజు 4-3-1912,

లక్ష్మీభాయి భోజనం తేవడం ఆలస్యమైంది. కాని ఆమెపై నున్న ప్రేమవల్ల, ఆమెకున్న భక్తి ప్రపత్తుల వల్ల బాబా ద్వారకామాయిలో ఉన్న కొన్ని నియమాల్ని సడచించారు. సాధారణంగా ద్వారకామాయి లోపలి భాగంలో ఉన్న తెరను వేసిన తరువాత ఆడువారిని అనుమతించరు. బాబా, లక్ష్మీబాయిని ఇంకా ఆమె తెచ్చిన ఆహారాన్ని లోనికి అనుమతించి, ఎంతో ఆకలితో భోజనం చేసారు. అంతేకాక ఆయన పాదాలు వత్తడానికి కూడా అనుమతి ఇచ్చారు. అలాగే ఆయన కూడా ఆమె చేతులను వత్తి, కాస్త ముందుకు వంగి నెమ్మదిగా మంత్రోపదేశం చేస్తున్నట్లుగా 'రాజారామ్, రాజారామ్' అని పునరావృతం చేయమన్నారు.

దగ్గర నుండి వదలకుండా చూస్తున్న శ్యామా, బాబాను ఇదంతా ఏమిటని అడిగాడు. బాబా అప్పుడు లక్ష్మీభాయి యొక్క పూర్వ జన్మల గురించి చెప్పారు. ప్రతి జన్మలోను బాబాతో ఆమెకు గాఢమైన అనుబంధం కల్గి ఉంది. ఇప్పుడు ఆమె తెచ్చిన భోజనం యొక్క గొప్పతనాన్ని నేను ఎలా చెప్పగలను. గతజన్మల్లో ఆమె ఎక్కువగా పాలిచ్చే ఆవు" అది ఒక వ్యాపారస్థుడి దగ్గర ఉండేది. దాని తరువాత జన్మలో ఒక తోటమాలికి పుట్టింది. తరువాత క్షత్రియ కులంలో పుట్టింది. ఆ తరువాత ఒక వ్యాపారస్థుడి భార్య అయింది. ఇప్పటి జన్మలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టింది. చాలా కాలం తరువాత నేను ఆమెను చూడగలిగాను. ముందు నన్ను ఆమె తెచ్చిన భోజనం తిననీ అన్నారు.

పైన చెప్పిన లీలలో చాలా ఆసక్తికరమైన విషయాలున్నాయి. క్రితం జన్మల్లో లక్ష్మీభాయితో ఆయనకు అనేక కర్మబంధాలు ఏర్పడ్డాయి. అన్ని జన్మల్లోనూ బాబా పట్ల ఆమెకు గల భక్తి భావనకు ఫలితంగా ఇప్పుడు ఆమె ఇచ్చిన ప్రసాదాన్ని ఎంతో ఆతురుతతో ఆరగించారు. అంతేకాకుండా ఆమెకు పాదసేవాభాగ్యాన్ని కల్గించారు. తానుకూడ ఆమె చేతులను వత్తారు. ఈ విషయం గురించి వివరణ ఇస్తూ స్వామి సాయి శరణానంద ఈవిధంగా అన్నారు. బాబా స్పర్శ భక్తులకు అనుభవానికి వచ్చేది ఎప్పుడంటే ఆయన తన చేతులతో విభూది ఇచ్చినప్పుడుగాని, తన పాదాలను

తాకనిచ్చినప్పుడుగాని లేక తన పాదాలను వత్తమని చెపినప్పుడు గాని కలుగుతూ ఉంటుంది. అలా అని చెప్పి అందరినీ తన కాళ్ళు పట్టమని చెప్పేవారు కాదు. అలాగే తాను కూడా ఎవరి చేతులు పట్టుకునే వారు కాదు. అయితే భక్తిభావం యొక్క తీవ్రతను బట్టి కొంతమంది భక్తులను మాత్రం తన పాదాలు వత్తమని ఆజ్ఞాపించేవారు. ఇక్కడ జరిగిందేమిటంటే లక్ష్మీభాయిని తన పాదాలు వత్తమన్నారు. అలాగే ఆయన కూడా ఆమె చేతుల్ని వత్తారు. వెనువెంటనే ఆమెకు శక్తిపాతాన్ని కలిగించారు. శక్తి పాతమంటే గురువు నుండి శిష్యుడికి జరిగే శక్తి మార్పిడి.  ఆ మార్పిడి స్పర్శవల్లగాని, మాటవల్లగాని, చూపువల్లగాని కూడా జరుగుతూ ఉంటుంది. లక్ష్మీభాయి విషయంలో చాలా జన్మల నుండి ఆమె బాగోగులు బాబా చూస్తున్నారు. ఈ జన్మలో ఆమెకు మంత్రోపదేశం చేసి శక్తిపాతం కల్గించారు.

తరువాత వచ్చే లీలలో బాబా మన యొక్క ఆధ్యాత్మిక పురోగతిలో ఎదురయ్యే ఇబ్బందుల్ని ఏవిధంగా తొలగిస్తున్నారో తెలుస్తుంది. బాబా, తాయ్‌భాయ్‌జోన్ అనే భక్తురాలిని ప్రేమతోను, గౌరవంతోను చూసేవారు. ఇంకా ఆమెను అమ్మా! అంటూ పిలిచేవారు. ఆమెకు కూడా బాబా పట్ల విపరీతమైన భక్తి ఉండేది. బాబా ఏ ప్రసాదం చెయమంటే దాన్ని ఆమె తయారు చేసి ఇస్తూ ఉండేది. ఆమె ఇంటికి పంపించిన బాబా భక్తుల్ని కూడా ఆమె ఎంతో ఆదరించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించేది.

ఒక రోజు ఉదయం ఫలహారం తీసుకుని ఆమె ద్వారకామాయికి వచ్చింది. అప్పుడు ఆమెతో బాబా ఇలా అన్నారు. “అమ్మా! నువ్వు ఈ మారు కొన్ని పూర్ణ పోలీలు తయారు చెయ్యి (పూర్ణ పోలీ అంటే చపాతిలాంటిదే (బొబ్బట్టు) దాంట్లో ఉడికిన పప్పు, బెల్లం, ఏలకుల మిశ్రమం కలిపి ఉంటుంది) ఆ పూర్ణ పోలీలకు బాగా వెన్న పట్టించి ఒక గేదెకు పెట్టు అన్నారు. తాయ్ భాయ్ అలాగే తప్పక పెడతాను. కాని నేను ఆ గేదె ఎక్కడ ఉంటుందో ఎలా ఉంటుందో తెలుసుకోవాలి గదా అని అంది. బాబా అన్నారు. “నువ్వు బాధపడకు. నువ్వు వంటకాన్ని తయారు చేసి, సిద్ధం చేయగానే గేదె నీ యింటి ముందు తలుపు దగ్గరకు వచ్చి నిలబడుతుంది.” దానికి ఆశ్చర్యపోయిన తాయ్, బాబా! నా

యింటికి రెండు ద్వారాలున్నాయి. ప్రతి రోజు చాలా గేదెలు మేతకు పోతూ ఇంటి ముందు వచ్చి ఒకసారి ఆగి, నేను ఏదైనా పెడుతానేమో అని చూస్తూ ఉంటాయి అంది. ఆమె అలా అనడంతో బాబా సావధానంగా ఇలా చెప్పారు. అమ్మా! నువ్వు దేని గురించీ బాధపడకు. నువ్వు పూర్ణ పోలీలు తయారు చేసి ఉంచగానే నేను చెప్పిన గేదె నీ యింటి దగ్గరకొచ్చి నీ కోసం ఎదురు చూస్తూ నిలబడుతుంది. ఇంక తాయ్ ఏమీ మాట్లాడలేదు. అలాగే అని చెప్పి యింటికి వెళ్ళిపోయింది. ఎంతో జాగ్రత్తగా బాబా చెప్పిన ప్రకారం పూర్ణ పోలీలు తయారు చేసి, వెన్న రుద్దింది. అంతా సిద్ధమయిన తరువాత గుమ్మం దగ్గర కెళ్ళి చూసింది. ఆశ్చర్యంగా తలుపు దగ్గర ఒక పెద్ద గేదె వచ్చి నిలబడి చూస్తోంది. బాబా చెప్పిన మాట నిజమైందని తాయ్ ఎంతో సంతోషించి, లోపలికి పోయి దొంతరలుగా పెట్టిన పూర్ణ పోలీలను ఆ గేదె ముందు పెట్టింది. వెంటనే ఆ గేదె అన్నింటినీ తిని వేసింది. ఇలా తినడం పూర్తి అయ్యిందోలేదో కాని, ఆ గేదె, తాయ్ ముందే ఒక్కసారిగా క్రిందపడి చచ్చిపోయింది. ఆ దృశ్యం చూసి తాయ్ భయపడిపోయింది. ఈ అనుకోని సంఘటనకు ఆమె మనస్సు కకలావికలమై పోయింది. వెంటనే లోపలికి పోయి ఏదైనవిషపదార్థం ఆ పూర్ణపోలీల్లో కలిసిందేమోనని వెతికి చూసింది. కాని వంట దగ్గర ఏ తప్పు జరగలేదు.

ఆమె వర్ణనాతీతమైన బాధ అనుభవించింది. ఇది ఎలా జరిగిందని తన్ను తానే ప్రశ్నించు కుంది. నా వల్ల ఈ గేదె మరణించకపోయినా సరే, ఈ ఘటనకు నేనే బాధ్యురాలిని అవుతాను. ఆ గేదె యజమాని వచ్చి అడిగితే ఏమని చెప్పాలి. దాని ఖరీదు నన్ను ఇవ్వమని అడుగు తాడేమో? లేక నాపై నేరం ఆరోపించి ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాడేమో? పరిస్థితి ఎలా మారుతుందో, అని పరిపరి విధాల ఆలోచనల్లతో బాబా దగ్గరకు పరుగెట్టింది.

బాబా ఆమె చెప్పిన సంగతంతా నిదానంగా విన్నారు. బిగ్గరగా ఒక నవ్వు నవ్వేరు. అమ్మా! భయం లేదు. నిన్ను ఎవ్వరూ ఏమీ చెయ్యరు. ఎందుకంటే ఆ గేదె ఈ రోజు ఎట్లయినా మరణించేదే. పాతజన్మల ప్రకారం దానికి ఒక తీరని కోరిక

ఉండిపోయింది. అదే పూర్ణ పోలీలు తినాలనే కోరిక. కాబట్టి దాని ఆశను తీర్చమని నేను నిన్ను అడిగాను. నువ్వు పూర్ణపోలీలు పెట్టగానే అది తిన్నది. దాని కోరిక తీరింది. వెంటనే చచ్చిపోయింది. ఆ కోరిక, కిందటి జన్మలో తీరక ఆ జీవుడి ఆధ్యాత్మిక ప్రయాణం ఆగిపోయింది. ఇంక బాధలేదు. అది, కోరిక అనబడే బంధం నుంచి విముక్తురాలైంది. ఇకముందు మంచి జన్మ కల్గుతుంది. ఈ కార్యక్రమంలో నువ్వొక పనిముట్టువు మాత్రమే. దాని కోరిక తీర్చడంతోనే నీ బాధ్యత తీరిపోయింది. కాబట్టి నువ్వు భయపడనవసరం లేదు అన్నారు.

(ఇది 1926 సాయిలీల పత్రిక, భాగం 11,12, సం॥ల నుండి గ్రహింపబడింది)

పైన చెప్పిన ఘటన గురించి కాస్త ఆలోచిస్తే ఇలాంటి ప్రశ్నలుంటాయి. ఒక గేదెకు కూడా తీరని కోరిక అన్నది ఉంటుందా? పూర్ణపోలీలు తినాలని దానికెందుకు అనిపించింది. అయితే బాబా చెప్పిన దాని ప్రకారం ఇలా అర్థం చేసుకోవచ్చు. ఈ గేదె జన్మ అన్నది, దాని పూర్వ జన్మల కర్మ ఫలితంగా ఏర్పడింది. ప్రారబ్ధం తీరే వరకూ అది గేదెగా జీవించవలసిందే. అయితే పూర్ణ పోలీలు తిందామన్న కోరిక దానికి ఎలా కలిగింది? అనుకొంటే, ఆ కోరిక గేదె జన్మలో కల్గింది కాదని చెప్పవల్సివస్తుంది. అంతకు పూర్వం అది మనిషిగానే పుట్టింది. ఆ మనిషి గానే దానికి ఆ ఆశ కల్గింది. కాని అది తీరకుండానే మరణం వచ్చింది. కాని దాని కర్మకొద్దీ ఆ జీవుడు గేదె అయి పుట్టాడు. తీరని కోరిక ఏదైనా మరణంతో తీరేది కాదు. కాబట్టి గేదె జన్మలో కూడా ఆ కోరిక అలాగే ఉండి పోయింది. దానివల్ల ఆ జీవుడికి ఆధ్యాత్మికంగా ఎదగడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. కాని బాబా దయ కల్గిన జీవుడు కాబట్టి, ఈ గేదె జన్మలోనే తన ఆశను నెరవేర్చుకొని, ఆశా బంధం నుండి విముక్తుడయ్యాడు.

గొప్ప గొప్ప యోగులకు సైతం వారి సాధనా మార్గంలో, తీరని కోరికలనబడే అడ్డంకులుంటాయి. వాటిని ఏదో ఒక విధంగా తొలగించుకొంటే తప్ప ముందుకు సాగలేరు. ఉదాహరణగా బాబాజీ అనబడే ఒక మహాయోగికి శిష్యుడైన లహరీ మహాశయుడికి ఒక తీరని కోరిక ఉంది. అది ఒక రాజ్యానికి రాజు అవాలనే కోరిక.

అది తెలుసుకున్న బాబాజీ, హిమాలయాల్లోనే ఒక గొప్ప కోటను సృష్టించి లహరి మహాశయుడిని సింహాసనం మీద కూర్చోబెట్టారు.

ఇక షిరిడీసాయి విషయానికొస్తే, బాబా దయ మనకు ఈ జన్మలోనే కాకుండా ముందు వెనకా అనేక జన్మల వరకూ సాగుతూనే ఉంటుంది. మన మార్గంలో ఆయన మన చెయ్యి పట్టుకుని నడుస్తూ మనకు రక్షకుడుగా ఉంటారు. అది ఎలాగో మనకి ఈ క్రింద చెప్పబడిన లీల ద్వారా తెలుస్తుంది. తార్కడ్ కుటుంబంపై బాబాకు ఎనలేని ప్రేమ ఉంది. వారందరిపై ఆయన యొక్క కృపావర్షం ఎప్పుడూ కురుస్తూనే ఉంటుంది. అందులో జ్యోతింద్ర ఆయనకు ముఖ్యుడు. ఆ అబ్బాయి షిరిడికి వచ్చినప్పటికి, 14 సం॥ పిల్లవాడు. కాని, అతడికున్న అమితమైన భక్తి, విశ్వాశాల మూలంగా, బాబా హృదయంలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నాడు.

జ్యోతీంద్ర చాలాసార్లు షిరిడికి వచ్చాడు. కాని 1918లో అతడి షిరిడి యాత్రకు ఒక ప్రత్యేకత ఉంది. దసరా ఉత్సవ సమయంలో అతడు వచ్చాడు. దసరా పండుగ అనగా దశమినాడు బాబా మహానిర్యాణం జరిగింది. అంతకుముందు జ్యోతింద్ర బాబాను చూసాడు. అప్పుడు బాబా చాలా నీరశంగా ఉన్నారు. అలసిపోయినట్లు కనపడ్డారు. బాబాకు కాళ్ళు వత్తి సేవ చేస్తానని కూడా అడిగాడు. బాబా అతడి కోరికను అనుమతించారు. జ్యోతింద్ర బాబా కాళ్ళ దగ్గర కూర్చొని ఎంతో ప్రేమతో కాళ్ళు వత్తడం ప్రారంభించాడు. కాసేపటికి బాబా అతని వైపు చూస్తూ, బావూ! ఇదే మన చివరి సమావేశం. తిరిగి మళ్లీ కలవలేము. కాబట్టి ఏదైనా కోరిక ఉంటే చెప్పు ఇస్తాను. మిగతా భక్తుల మాదిరి, ధనం కావాలని, సంపదలు కావాలని, సంతానం కావాలని నువ్వు ఎప్పుడూ అడగలేదు. ఇంక మనం ఇలా కలుసుకోవడం ఉండదు. కాబట్టి నువ్వు ఏది కోరుకుంటే అదియిస్తాను కోరుకో అన్నారు.


బాబా అలా అడిగినా జ్యోతీంద్ర అది కావాలి, ఇది కావాలి అని అడగలేదు. బాబా దయ, ఆశీర్వాదం ఉంటే చాలు అని అన్నాడు. అంతేకాక ఒకే ఒక్క కోరిక

కోరాడు. అదేమిటంటే తను ఎన్నటికీ బాబాను మరచిపోకుండా, ఎప్పుడూ బాబా తనకు గుర్తు ఉండేటట్లు వరం ఇమ్మనమని అడిగాడు. దానికి బాబా ఇలా అన్నారు. నేను నీకు వాగ్ధానం చేస్తున్నాను. నా భక్తుడవైన నువ్వు ఏది కోరావో, అదే జరుగుతుంది. నేను చేసిన ఈ వాగ్ధానం ఎప్పటికీ సత్యంగానే ఉంటుంది. కాని జ్యోతింద్రా! మళ్ళీ అడుగుతున్నాను. నీకు స్వంతంగా లాభం చేకూర్చే దేదైనా అడుగు, ఎందుకంటే మనిషై పుట్టినవాడు ఈ జనన మరణ చక్రం నుండి బయట పడాలని, దాని కొరకు బాహ్యంగా ఏదైనా సహాయం దొరకాలని ఆశిస్తూ ఉంటాడు అన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని జ్యోతీంద్ర అనుకొన్నాడు. బాబా ! మీరు నాకు ఉపయోగపడే స్వంత కోరిక తీరుస్తానన్నారు. కాబట్టి మరొకసారి వాగ్ధానం చెయ్యండి. నేను ఏది అడిగినా ఇస్తానని, అలాగైతే అడుగుతాను అన్నాడు. అతడు అడిగినట్లుగానే తన కోరిక తీరుస్తానన్నారు బాబా. అప్పుడు జ్యోతింద్ర ఇలా అడుగుతున్నాడు. బాబా! మీరు నన్ను ఎన్ని జన్మలైనా ఎత్తనివ్వండి. కాని ప్రతిజన్మలోనూ నేను మీ పాదాలను చూస్తూ ఉండాలి. మీరు నా కోరిక తీరుస్తారని అనుకుంటున్నాను. నేను బాధపడేట్లు మీరు చెయ్యరని నమ్ముతున్నాను. దీనికి బాబా కాసేపు మౌనంగా ఉండిపోయారు. బావూ! ఇది నేను తీర్చలేను. ఎందుకుంటే, నీ కోరికతో నన్ను బంధించుదామనుకుంటున్నావు. కాని దీనికి పరమాత్మ నుండి నాకు అనుమతి లేదు. అయినప్పటికీ నువ్వు విచార పడవల్సిన అవుసరం లేదు. ఇప్పుడే నీకు అభయం ఇస్తున్నాను. వచ్చే జన్మలో మనం కలుసుకుందాం. అప్పుడు మనిద్దరం పది సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు, కలిసి ఒక దగ్గర కూర్చుందాం, కలిసి భోజనం ఒకే పళ్ళెంలో చేద్దాం. బాబా ఇలా అనగానే జ్యోతీంద్ర ఎంతో సంతోషించాడు. వచ్చే జన్మలో కూడా బాబాతో కలిసి ఉంటున్నందుకు ఆనందించాడు. తరువాత బాబా అతడిని ఆశీర్వదించి, పిడికెడు ఊది ఇచ్చారు. ఆ ఊది జాగ్రర్తగా దాచుకోమని, దానికి మహత్తర శక్తి ఉందని చెప్పారు. ఇంకా అది ప్రాణం పోయే వాడికి తిరిగి ప్రాణాన్ని ఇస్తుందని చెప్పారు. జ్యోతీంద్రని బొంబాయి వెళ్ళి పొమ్మనమని ఆజ్ఞాపించారు. తరువాత దసరా రోజున మహానిర్యాణాన్ని పొందారు.

జ్యోతింద్ర, బాబా కనుసన్నలలో మెలుగుతూ ఒక మంచి ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపాడు. అతడి ప్రతి అవుసరాన్ని తీరుస్తూ ఉండేవారు. కొన్ని సంవత్సరాల తరువాత అతను లక్ష్మీదేవికెల్లాకర్‌ను వివాహం చేసుకొన్నాడు. అతడికి స్వంతంగా ఒక బంగ్లా ఉండేది. జీవితానికి కావల్సిన అన్ని సదుపాయాలు అతడికి ఉండేవి. అతనికి మంచి ఆరోగ్యం ఉండేది. అలాగే అతడి చివరి రోజుల్లో కూడా అద్భుతమైన మరణం సంభవించింది. 1965 జూలై నెలలో జ్యోతీంద్రకు జబ్బు చేసింది. తీవ్రమైన ఆస్తమా వ్యాధితో బాధపడేవాడు. దానికి తోడు వెన్నెముక క్రింది భాగంలో నొప్పితో మంచం పట్టాడు. భార్య మీద, కొడుకు వీరేంద్ర మీద ఆధారపడి బ్రతుకుతున్నందుకు బాధ పడేవాడు. వీరేంద్ర తండ్రి సేవ చేస్తూ నడుం నొప్పికి తగిన ఆయింట్‌మెంట్లు, అలాగే ఆయుర్వేదం మందైన 'మహా నారాయణ తైలం' మర్దనా చేసేవాడు. డాక్టరు గారు ఇంటికి వచ్చి వైద్యం చేసేవారు. కాని చెప్పుకోదగినంత మార్పు కనబడేది కాదు. అప్పుడు బొంబాయిలోని నానావతి ఆసుపత్రిలో చేర్పించారు.

ఆగస్టు 16వ తారీఖు మధ్యాహ్నం భార్య లక్ష్మీదేవి, భర్తకు టీ పట్టుకుని వచ్చింది. టీ త్రాగిన తరువాత తన కంటి ముందు ఎవరో కనపడుతున్నారని భార్యకు చెప్పాడు. అలాగే కావాలని చెప్పి ఇంకొక కప్పు టీ త్రాగాడు. తనకు కనపడే వారి కోసం వెతుకుతున్నాడు. భార్య చెప్పింది, ఆ గదిలో తను, కొడుకు తప్ప ఇంకెవ్వరూ లేరని. అప్పుడు ఆమె బాబా ఊదిని జ్యోతీంద్ర నుదుటన రాసింది. జపమాల అతని చేతికిచ్చి బాబా నామాన్ని జపించమంది. కొంత సేపటికి జ్యోతింద్ర, తనకు కనిపించే మనిషి తనను రమ్మనమని పిలుస్తున్నాడని అన్నాడు. వెంటనే అతడి ముఖం కాంతివంతమైంది. తన శరీర బాధలన్నీ ఒక్కసారి పోయినట్లయింది. గట్టిగా అరచాడు. బాబా! మీ ఆలో అంటున్నాడు. అంటే బాబా! నేను మీ దగ్గరకు వస్తున్నాను. అలా అనడంతోటే అతని ఊపిరి ఆగిపోయింది. జ్యోతీంద్ర చాలా స్పష్టంగా తన సద్గురువును చూడగలిగాడు. తన స్వస్థానాన్ని బాబా పాదాల వద్ద దర్శించ గలిగాడు. అది ఒక అత్యద్భుతమైన ప్రయాణం. చివరకు సద్గురువు పాదాల వద్దకు చేరుకున్నాడు.

(ఇది తార్కడ్ కుటుంబానికి శ్రీ సాయి వల్ల కలిగిన ప్రత్యక్ష అనుభవాలు అనే గ్రంథం నుండి గ్రహించబడింది).



సృష్టి కర్త, సృష్టి రక్షకుడు మనకు అండగానున్నప్పుడు, మన యోగక్షేమాలను చూసుకొనేటప్పుడు ఏ సమయంలోనైనా మానసిక భయం ఎందుకు? మనం చేయవలసిందేమిటంటే సద్గురువు వల్ల మనకు లభించిన గొప్ప గుణాలను వదలకుండా కాపాడుకోవడమే. అయితే ఇది కఠినమైన పనిగా కనపడవచ్చు. ఇంకా ఈ దారిలో అనేక ఇబ్బందులు కలుగవచ్చు. కాని వాటినన్నింటినీ అధిగమించి ముందుకు సాగడమే దీక్షగా పెట్టుకోవాలి. బాబా ఆశీర్వాదం మన కెప్పుడూ ఉంటుంది. అందుకే బాబా ఇలా అంటారు. “ఎప్పటికీ మీ జీవితపు బరువు బాధ్యతలను నేను మోయగలను. ఇందులో మీకు ఎటువంటి సందేహం ఉండనవసరం లేదు.” కాని ఒక్కటి మాత్రం మనం గుర్తు పెట్టుకోవాలి. బాబా వాగ్ధానంలో మనకి రవ్వంత అనుమానం ఉన్నా సరే బాబా సూత్రం పని చెయ్యదు. అంతేకాక మన దుర్గతికి ఆ అనుమానమే కారణం అవ్వడానికి అవకాశముంది.

# తొమ్మిదవ వాగ్ధానం

**జానా యేతే ఆహె సహాయా సర్వాసా**
**మాగే జెజె ధ్యాసా తేతే లాబె!**

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ తొమ్మిదవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది. **"మీ భారములను నా పై బడవేయుడు నేను మోసెదను."** దీన్నే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. ఈ విషయం ఒకటి తెలుసుకోండి. ఎవరైతే నా సహాయాన్ని అర్థిస్తున్నారో వారికది పుష్కలంగా లభిస్తుంది. ఎవరెవరు ఏమి కావాలని కోరుకుంటున్నారో వారు దానిని పొందగలరు.

చాలా మంది భక్తులు షిరిడికి వచ్చి అనేక కోరికలు తీర్చమని ప్రార్థిస్తూ ఉంటారు. వాటిలో మంచి ఉద్యోగం, అందమైన భార్య, ఒక కారు, ఒక బంగళా, మంచి కొడుకు, మంచి అల్లుడు కావాలని కోరుకుంటూ ఉంటారు. కాని ఇవన్నీ భౌతికమైన కోరికలు. వీటి వల్ల మనుష్యులు మరింత లోతుకి సంసార కూపంలో దిగబడి పోతారు. మాయా ప్రభావంలో చిక్కుబడతారు. ఇటువంటి కోరికలు శాశ్వితత్వాన్ని ఇవ్వవని కొద్ది మందికే తెలుస్తుంది. అందుకే బాబా ఇలా అంటారు. మీరు పీలిక గుడ్డలు ఇమ్మనమని అడుగుతున్నారు. కాని మంచి అందమైన షాలువాలు ఇద్దామని నేను అనుకొంటున్నాను.

బాబా ఉద్దేశ్యం ఇలా ఉన్నప్పటికీ, భక్తులు దాన్ని లోతుగా విచారించకుండా ఇంకా ఇలా అంటూ ఉంటారు. బాబా నాకిదియ్యి, నాకదియ్యి నువ్వు ఇస్తే నేను దూద్‌పేడా అందరికీ పంచిపెడుతాను లేదా నీ సమాధి మీద బంగారు అంచు కలిగిన షాలు కప్పుతాను. ఇంకో రకం భక్తులంటారు, బాబా! నాకు పది లక్షల రూపాయల లాటరీ వచ్చేటట్లు చెయ్యి, నీ హుండీలో నేను వెయ్యి రూపాయలు వేస్తాను. ఏ కోరికలు లేకుండా ఇలా అనే భక్తులు ఎంత మంది ఉంటారు. "బాబా! నిన్ను చూడకుండా ఉండలేక షిరిడీకి వచ్చాను. అంతకు మించి నాకు ఎటువంటి కోరికాలేదు సుమా!

బాబా! మీ ఆరోగ్యం బాగుందా. ఎలా ఉన్నారు. మీ గురించి తెలుసు కుందామని, కొద్ది రోజులు మీ దగ్గర ఉందామని వచ్చాను."

ఈ ప్రపంచంలో రెండు రకాల మనుష్యులుంటారు. ఒకరు ప్రాపంచిక వస్తువుల్ని, సంపదను కోరుకుంటూ ఉంటారు. ఇలాంటి కోరికలకు అంతు వుండదు. రెండవవారు భక్తి భావనతో పులకించేవారు, తత్త్వ విచారణ యందు ఆసక్తి కలవారు, ఆధ్యాత్మికోన్నతికి పాటుపడేవారు, అందునిమిత్తం బాబాని అర్థించే వారై యుంటారు. అందుచేత ఇక మనల్ని మనమే పరీక్షించుకోవల్సి ఉంటుంది. ఏమని? పై రెండు తరగతుల్లో, ఏతరగతి గదిలో మనం కూర్చొని ఉన్నామని? మనుష్యుల మనోభావాలు ఇలా విరుద్ధంగా ఉన్నప్పటికీ బాబా మనందరికి తండ్రి కాబట్టి అందరిపైనా తన దయారసం కురిపిద్దామని చూస్తూ ఉంటారు. మన కోరికలు తీరుద్దామనే, మనం ఆనందంగా ఉండాలని అనుకుంటూ ఉంటారు. కాబట్టి బాబా నుండి మనం పొందే వరాలు ఎలా ఉండాలో మనమే నిశ్చయించుకోవాలి.

మహానుభావుడైన సంత్‌జ్ఞానేశ్వర్ తాను జీవిత సమాధిలోకి ప్రవేశించడానికి ముందుగా, ఈ ప్రపంచంలో గల మానవాళినంతటిపై దయ చూపెట్టవలసిందిగా భగవంతుణ్ని వేడుకొన్నారు. ఆయన మరాఠీ భాషలో చేసిన ప్రార్థనను 'పసయాదన్' అంటారు. దాని అర్థం ఇలా ఉంటుంది. "ఈ ప్రపంచం మొత్తానికి ప్రభువైన ఓ దేవా! సమస్త మానవాళికి నీపై భక్తి విశ్వాసాలు మిక్కుటంగా కలిగేటట్లు వరం ప్రసాదించుము. దుష్టులనిపించుకున్నవారు కూడా, తమ దుష్ట స్వభావాలను పోగొట్టుకొనేలా దయ చూపుము. వారిలో వెలుగుతున్న జ్ఞాన దీపం, వారికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా ఉండేటట్లు, తద్వారా వారు శుభకార్యాలు చేసేటట్లు చూడుము."

వామనరావుపాయ్ అనే సాయిభక్తుడు ఉండేవాడు. అతడి ప్రార్థనంతా ఎప్పుడూ పరోపకారాన్ని అశించే చేస్తూ ఉండేవాడు. ఈ ప్రపంచంలో ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో సుఖంగా జీవించాలని కోరుకుంటూ ఉండేవాడు. ప్రజలందరూ మంచి స్వభావంతో మెలగాలని, వారందరకూ భగవంతుడు రక్షకుడిగా ఉండాలని ఆకాక్షించే

వాడు. ఎంతమంది ఈ రకంగా బాబాను వేడుకుంటున్నారు? అని మనల్ని మనం ప్రశ్నించుకొంటే, సమాధానం దొరకడం కష్టమే. కాని బాబాకు అందరూ బిడ్డలే. ఎవరికి ఏది కావాలన్నా దానిని ఇస్తారు. అది తన స్వంతానికా, తన స్నేహితులు చుట్టాలు మొదలైన వారికా లేక ప్రపంచం మొత్తానికా అన్న భేద భావం చూపెట్టరు. అందుచేత ఏమడుగుతున్నాను అన్న ఆలోచన భక్తుడికే ఉండాలి. బాబా ఇస్తూనే ఉంటారు. ఎంత వరకూ ఇస్తారంటే, నేను లేనిపోనివి అన్నీ అడుగుతున్నాను, అశాశ్వతమైనవి, మోక్షానికి పనికిరానివి అడుగుతున్నాను అన్న తెలివి భక్తుడికి కల్గే వరకూ బాబా ఇస్తారు.

'ది ఇంక్రెడిబుల్ సాయి బాబా' అనే పుస్తకంలో, రచయిత ఆర్థర్ ఓస్ బోర్న్ ఈ వాగ్దానం గురించి చక్కగా వివరించారు. దాంట్లో బాబా ఇలా అంటారు. 'నేను నా భక్తులు కోరినవన్నీ ఇస్తాను. కొంతకాలానికి నాకు ఏది కావాలో దానినే వారు కోరుకుంటారు. దీనిబట్టి తెలిసిందేమిటంటే, అర్ధరహితమైన, ఆశాశ్వతమైన వాటిని ఇక కోరనంతవరకు బాబా ఇస్తూనే ఉంటారు. అప్పటికి భక్తుడిలో జ్ఞానోదయం కల్గుతుంది. వేటినీ ఆశించని స్థితి ఏర్పడుతుంది. ఇంక మోక్షమే పరమ పురుషార్ధమన్న సంగతి బాగా అర్థమవుతుంది. శ్రీసాయి సచ్చరిత్ర 32వ అధ్యాయంలో దీనికి సంబంధించిన వివరణ ఉంది. బాబా అంటారు, జీవిత లక్ష్యాన్ని తెలుసుకొనే స్థితిని భక్తులకు ప్రసాదిస్తాను అని. అలాగే 161 నుండి 162 పాదాల వరకూ బాబా చెప్పింది ఏమిటంటే "నా ప్రభువు యొక్క ఖజానా ఆధ్యాత్మిక రత్నరాశులతో పొంగి పొరలుతోంది. ఇటువంటి అమూల్యమైన సంపదను తీసుకొని పోవటానికి బండ్లు కట్టించుకొని రావచ్చు. కాని ఎవరూ దీని సంగతే పట్టించుకోవడం లేదు. ఇంకా ఆ నిధిని త్రవ్వడానికి రండి అని పిలిచినా ఎవ్వరూ ప్రయత్నం చెయ్యటం లేదు. నేను మళ్ళీ చెపుతున్నాను. ఆ నిధిని త్రవ్వండి. అలా త్రవ్విన దానిని బండ్ల కెత్తుకుని పట్టుకుపొండి. ఒక తల్లికి నిజంగా పుట్టిన వాడెవడుంటాడో వాడే ఈ నిధిని పట్టుకెళ్ళగలడు. అనగా జన్మ సార్ధకం చేసుకొన్నవాడు మాత్రమే ఆధ్యాత్మిక నిధిని పొందడానికి అర్హుడవుతాడని అర్ధం. బాబా

నుండి పొందిన వరాలను, తాత్కాలికమైన వస్తు సపంద కోసం గాని, అశాశ్వితమైన భోగాల కోసం గాని, ఉపయోగించినట్లయితే, అదంతా శుష్క దండగ క్రిందనే జమ కట్టవలసి వస్తుంది. ఇంకా అమూల్యమైన బాబా యొక్క కృపను వ్యర్థపరచిన వారవుతారు. దీనిబట్టి తెలుస్తున్నదేమిటంటే మనిషికి నిజంగా కావల్సిన వస్తువు ఏదో తెలియనట్లే లెక్క. ఆ వస్తువే ఆత్మ స్వరూపం లేక ఆత్మ జ్ఞానం. ఎన్నిసార్లు సచ్చరిత్ర పారాయణ చేసినప్పటికీ, ఎవరైతే బాబా యొక్క తత్వాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారో, వారు బాబా దగ్గరనున్న ఆధ్యాత్మిక నిధిని సరైన మార్గంలో పొందకుండా ఆ నిధిని నిరుపయోగమైన దానిగా విడిచిపెడుతున్నారని చెప్పవచ్చు. అయితే మనం చెయ్య వలసిందేమిటో సచ్చరిత్రే చెపుతోంది. తాతాల్కికమైన ఆనందం కోసం, అశాశ్వితమైన ధన కనక వస్తు వాహనాల కోసం పరుగులు పెట్టకుండా, శాశ్వితమైన పరమపదాన్ని అందుకోవటం కోసం ప్రయత్నించడమే మనం చెయ్యవలసిన అసలు సిసలు పని. దీన్నే ఆధ్యాత్మికాభివృద్ధికి పాటు పడడం అని అంటారు. బాబా బోధలోని రహస్యం ఇదే.

ఇక్కడ బాబా చేసిన ఒక లీలను ఉదహరిస్తున్నారు. ఇది జ్యోతింద్ర తార్కడ్‌కు బాబా పెట్టిన పరీక్ష. అప్పుడు జ్యోతింద్ర చిన్న పిల్లాడు స్కూల్కో చదువుకుంటున్నాడు. అదృష్టం కొద్దీ అతడొకసారి బాబాను కలిసాడు. ఇంక అక్కడ నుండి అతడు చాలాసార్లు బాబాను కలియడం జరిగింది. చలికాలంలో ఒకరోజు జ్యోతింద్ర ద్వారకామాయిలో సాయి దగ్గర కూర్చొన్నాడు. సాయంకాలం అవుతుండగా బాబా అతనిని తీసుకుని లెండీబాగ్‌కు వెళ్ళారు. జ్యోతింద్రకు ఆశ్చర్యమేసింది. ఎందుకంటే ఆ సమయంలో బాబా ద్వారకామాయిని వదలి ఎక్కడకూ వెళ్ళరు. అయితే బాబాతో కొంతసేపు గడపటానికి జ్యోతింద్ర ఎంతో ఉబలాట పడ్డాడు. లెండీబాగ్ దగ్గరున్న ఒక చిన్న కాలువ ఒడ్డున ఇద్దరూ కూర్చొన్నారు. అప్పుడు బాబా అక్కడున్న ఇసుకలో ఒక గొయ్యిచేసి, ఆ గోతిలో ఏమి కనపడుతున్నాదో చూసి చెప్పమని జ్యోతీంద్రను అడిగారు. జ్యోతీంద్ర చూసి అక్కడ ఇసుక మాత్రమే కనపడుతున్నాదని చెప్పాడు. బాబా ఆ గొయ్యను మరింత

లోతుగా చేసారు. ఇప్పుడు గూడా జ్యోతింద్ర అదే సమాధానం ఇచ్చాడు. బాబా అతడి తల వెనకభాగం తట్టి, తిరిగి లోపలికి చూడమన్నారు. జ్యోతింద్రకు బంగారంలా మెరిసిపోతున్నది ఒకటి కనపడింది. బాబా అన్నారు, భావూ! అది బంగారమే, నీకు ఎంత కావాలో అంత తీసుకో.

వెంటనే జ్యోతీంద్ర అన్నాడు, బాబా! నాకు ఇదేమీ వద్దు. మీ దయవల్ల మాకు అన్నీ ఉన్నాయి. నేను షిరిడికి వచ్చింది. ఇటువంటి వస్తువుల కోసంగాదు బాబా! అన్నాడు. ఇది లక్ష్మీదేవిరా నాయనా! నువ్వు ఇప్పుడు దీన్ని వద్దు అన్నావంటె ఇక నీజన్మలో మళ్ళీ నీదగ్గరకు రాదు చూసుకో అన్నారు. వెంటనే జ్యోతింద్రకు బాబా తన్ను పరీక్షిస్తున్నారని తెలిసింది. బాబా! మీరు నన్ను పరీక్షిస్తున్నారని నాకు తెలుసు. నేను ఈ మాయకు లొంగను. మీ దయవల్ల నేను ప్రశాంతంగా బ్రతుకుతున్నాను. ఈ మాయ వలలో పడను అన్నాడు. జ్యోతింద్ర అలా అనగానే బాబా నవ్వుతూ ఆ ఇసుక గొయ్యను కప్పివేసారు. ఇద్దరూ కలిసి ద్వారకామాయికి చేరుకున్నారు.

(ఇది తార్కడ్ కుటుంబానికి శ్రీ సాయిబాబాతో కల్గిన ప్రత్యక్ష అనుభవాలు అన్న పుస్తకం నుండి గ్రహింపబడింది)

ఈ రకమైన భక్తిభావనా స్థితికి చేరాలంటే మనం ఎంతో కఠినమైన, ఇరుకైన మార్గం గుండా ప్రయాణించవలసి ఉంటుంది. ఆ స్థితిలోనే చిన్న చిన్న అతీంద్రియ శక్తులు మనకు కల్గినట్లు కూడా తెలుస్తూ ఉంటుంది. వీటినే సిద్ధులు అని అంటారు. ఇప్పుడే బాబా ఆశీర్వచనం మనకున్నట్లయితే, మనకు కొంత వాక్సుద్ధి కూడా లభిస్తుంది. దాంతో రాబోయే, జరగబోయే విషయాల పట్లు జోస్యం చెప్పే శక్తి కలుగుతుంది. ఈ పరిస్థితుల్లో సాధకుడి జీవితం ఒక క్రొత్త మలుపు తిరుగుతుంది. సాదకుడిగా ఉన్నది విద్యార్థి దశ అనుకొంటే, ఆ దశ గడిచి ఒక ప్రవక్త దశకు సాధకుడు చేరుకుంటాడు. ఇక్కడ జాగ్రత్తగా మసులుకోవడం అవుసరం. మన సాధన, మోక్షం కోసం అన్నమాట మరచిపోకూడదు. కాని దారి మధ్యలో జ్యోతిషం చెప్పే సిద్ధి కలగడం మనల్ను

పరీక్షించడానికే అని తెలుసుకోవాలి. ఈ సిద్ధి ఉన్న వ్యక్తులు సమాజంలో పేరు గడిస్తూ ఉంటారు. అనేకమంది కోరికలతో ఆవ్యక్తి చుట్టూ చేరి అతడిని ఒక మహారాజుగా కూడా పిలుస్తూ ఉంటారు. కాని దీనివల్ల ఆ వ్యక్తికున్న ఆధ్యాత్మిక శక్తి యుక్తులు తగ్గడం ప్రారంభిస్తాయి. ఫలితంగా ఆ దిశలో జరిగే అభివృద్ధి కుంటుపడుతుంది. ఈ కాలంలో ఇటువంటి గురువులు మనకు చాలా చోట్ల కనపడుతూ ఉంటారు. వారు ఆధ్యాత్మికజ్ఞానాన్ని కోల్పోవడం వల్ల పతనమవుతారు. చివరికి చిన్న చిన్న వ్యాపారాల్లో దిగి, షాంపూ పేకెట్లు, అగరుబత్తులు మొదలైన వాటి మీద తమ ఫోటోలు అతికించుకుని రోడ్డునపడతారు. దీనివల్ల తెలిసిందేమిటంటే ఈ సిద్ధులు మంచికి వాడుకోకపోతే చెడును పోషిస్తూ సాధకుడి పతనానికి కారణమవుతాయి. కాబట్టి బాబా తన ప్రియమైన భక్తులను, ఈ సిద్ధుల వలలో పడవద్దని హెచ్చరిస్తూ ఉంటారు. ఒకవేళ బాబా కంటికి అటువంటివారు కనపబడితే వ్యంగ్యంగా ఇలా అనేవారు. "ఓహో! నువ్వు నీ వ్యభిచారి ఏం చేస్తున్నారు? అంటే బాబా ఉద్దేశ్యంలో సిద్ధుల్నే వ్యభిచార్లుగా చెపుతున్నారు. ఎందుకంటే బాబాకు బాగా తెలుసు, సిద్ధులన్నవి సాధకుడిని తప్పుదారి పట్టించి భ్రష్టుడిని చేస్తాయి. దాంతో అతడు అంతవరకూ కష్టపడి సాధించుకున్న ఆధ్యాత్మిక శక్తి నాశనమవుతుంది.

ఈ పరిస్థితిని గమనించిన వాడు కాబట్టే భక్త తుకారాం భగవంతుణ్ని ఈ విధంగా వేడుకున్నాడు. ఓ ప్రభూ ! నీ దైవత్వాన్ని నీ దగ్గరనే పదిలంగా ఉండునియ్యి. కాని నన్ను మాత్రం నీ దాసుడుగానే కొనసాగనియ్యి. మనిద్దరి మధ్య ఉన్న ఈ సంబంధం చెక్కుచెదరక అనంత కాలం నిలిచేటట్లుగా ఉండేందుకు, ఏది చెయ్యాలో దానినే చెయ్యి. ఇంకొక విషయం, దేవా! నువ్వు చేసే పనిని మాత్రం నాకు తెలియ నియ్యకు. నాకు స్వర్గ సుఖాలపై ఆశలేదు. ఎందుకంటావా! అవన్నీ అశాశ్వితాలు, మాయా కల్పితాలు. కాబట్టి ఎప్పటికైనా ఈ సంసార బంధం నుండి నన్ను విముక్తుడిని చేసి నీ పాదాల చెంత శాశ్విత స్థానాన్ని నాకు కల్గించు. అయితే భక్తతుకారాం ఆశించిన స్థానాన్ని చేరుకోవాలంటే కావల్సినవి, భగవంతునిపై అచంచలమైన భక్తి విశ్వాసాలు, నిస్వార్థ

జీవన విధానం, పరోపకార పరిణతి. అంతేకాని చిత్తశుద్ధి లేకుండా చేసేవి పూజలు కావు అని తెలుసుకోవాలి.

ప్రతి సాయి భక్తుడికి ఇదే లక్ష్యంగా ఉండాలి. దీని కొరకే సాధన చేస్తూ సాయినాథుని కృపాకటాక్షాలను పొందగలగాలి. ముక్తిని పొందటానికి జీవితాన్ని అంతం చేసుకోవల్సిన అవసరంలేదు. అలాగే ఘోర తపస్సులు కూడా ఆచరించ వలసిన పనిలేదు. సంసారిక లేక ప్రాపంచిక విషయాల పట్ల విముఖత కల్గి ఉండడం ఒక ముఖ్య షరతు. వ్యవహారంలో జీవన క్రియలు సాగుతున్నా మానసికంగా బాబాను దృష్టిలో పెట్టుకున్నట్లయితే ఆ క్రియలు మిమ్మల్ని బంధించవు. ఎప్పుడైతే కర్మబంధం తొలగిందో, జన్మ బంధం కూడా విడిపోతూ ఉంటుంది. అటువంటి బంధం నుండి బయటపడడమే ముక్తికి మార్గం. మన ఋషులు, సాధుపుంగవులు మొదలైనవారందరూ ఇటువంటి బంధవిముక్తిని అన్నివేళలా అనుభవానికి తెచ్చుకుంటూ ఉండేవారు. ఈ స్థితిని నాలుగు రకాల దశల్లో పొందుతూ ఉంటారు. అవే సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం. వీటినే మరింత వివరంగా ఇక్కడ తెలుసుకుందాం.

సాకారంగా కనపడుతున్న భగవంతుని రూపాన్ని అర్థం చేసుకొని ఆరాధించే విధానమే సాలోక్యం అనబడుతుంది. ఇంక సామీప్యమనగా తన కళ్ళ ఎదుట కనపడుతున్న రూపాన్ని మనస్సులో ప్రతిష్టించు కొని, భగవంతుడి సన్నిధానానికి దగ్గరవుతూ నామ సంకీర్తనలు మొదలైనవి చెయ్యడం. తరువాత సారూప్యమంటే భగవదనుభవాన్ని బాహ్య వస్తువులతో సమన్వయించి, భగవంతుని యొక్క సర్వవ్యాపక స్థితిని గుర్తెరగటం. ఇంక చివరగా సాయుజ్యంలో భక్తుడు భగవంతునితో ఏకమవుతాడు. అప్పుడు అతడిలో ద్వైత భావం నశిస్తుంది.

వరుసగా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ చేసే ఆధ్యాత్మిక ప్రయాణంలో పైన చెప్పబడిన నాలుగు దశలు అనుభవానికి వస్తునే ఉంటాయి. ఇదంతా స్వార్ధరహితమైన భక్తి భావనతోనే సాధ్యపడుతుంది. ఈ ప్రయాణంలో భక్తుడు తను కూడబెట్టుకున్న ఆధ్యాత్మిక శక్తిని జాగ్రర్తగా వాడుకుంటూ ఉండాలి. ఎప్పటికైనా నశించే స్వభావం కల్గిన ప్రాపంచిక వస్తువుల పట్ల, విషయాల పట్ల విముఖత కల్గి ఉంటేనే ఆధ్యాత్మికశక్తి అంతకంతకూ బలపడుతూ ఉంటుంది.

# పదవ వాగ్ధానం

**మాజా జో జాహలా కాయా వాచామణి**
**దయాచా మీరుణీ సర్వాకాలా॥**

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ పదవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది. **"నా సహాయమును గాని, సలహాను గాని కోరిన తక్షణమే ఒసంగెదను."** దీన్నే ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. ఎవరైతే త్రికరణ శుద్ధిగాను, అనగా మనస్సు వాక్కు కర్మ ద్వారాను, ఇంకా సంపూర్ణమైన జ్ఞానం ద్వారాను నాకు శరణాగతుడౌతాడో, అతడికి ఎప్పటికీ నేను ఋణపడి వుంటాను. మీరుణీ అనగా ఋణపడి వుంటాను అని అర్థం. ఒక రకంగా ఇది మనకు అర్థం కాని మాటే. ఎవరికైనా సరే బాబా ఋణపడి ఉండవల్సిన అవసరం ఏమిటి? అనిపిస్తుంది. ఆయన ఎవరి దగ్గర నుండి ఏమీ తీసుకోరు కదా! ఇంకా ఎవరికీ అప్పుపడరు కదా! ఇంకా మనమే వారిని అనేక వరాలు కోరుతూ ఉంటాము. ఆయన నుండి పొందిన వరాల వల్ల మన భక్తి బాగా పండుతుంది. భక్తి భావన వెల్లివిరుస్తుంది. అందుకు బాబా మనకి ఋణపడి ఉండనవసరం లేదు కదా! బాబాపై మనకు భక్తి కలుగడం ద్వారా మన మార్గం సుగమం అవుతుంది. అది లక్ష్య సాధనకు తోడ్పడుతుంది. ఆ పరిస్థితుల్లో మనమే సంపూర్ణ శరణాగతి చేస్తాము. అనగా మన మనస్సు వాక్కు కర్మ, ఇంకా మనజ్ఞానం బాబా పరమవుతాయి. ఇదంతా మన జీవాత్మ ఉద్ధరణకు సహాయపడుతుంది. ఇలా మనల్ని మనం సమర్పించుకొన్నందుకు గాను బాబా మనకు ఋణపడి ఉంటున్నారా?

అలాగే మనమందరం బాబా నామజపం చేస్తూ ఉంటాం. ఆయన చరిత్ర చదువుతూ ఉంటాం. ఆయన్ను ధ్యానం చేస్తూ ఉంటాం. ఇంకా ఆయన గొప్పతనాన్ని కీర్తిస్తూ ఉంటాం. ఇదంతా ఎవరికోసం చేస్తున్నాం? మనకోసమే కదా! అయితే బాబా మనకి ఋణపడి ఉండడమేమిటి.

మహల్సాపతి ప్రతిరోజు, ప్రతి క్షణం బాబాతోటే గడుపుతారు. ఇంకా అతడికి

బాబాతో  చాలా దగ్గర సంబంధం ఉండేది. 1886 సంవత్సరం డిశంబరు నెలలో ఒకరోజు రాత్రి 10గంటలకు బాబాకు విపరీతమైన ఆస్తమా పోటు తగిలింది. అప్పుడు బాబా మూడు రోజులు సమాధిలో ఉండిపోయారు. బాబా ప్రక్కనే కూర్చొని ఉన్న మహల్సాపతిని చూసి అన్నారు, భగత్ ఈ రోజు నేను నా ప్రాణాన్ని బ్రహ్మాండంలోకి పంపించి మూడు రోజులు ఉంచుతాను. అంతవరకూ నా దేహాన్ని కాపాడు. దీన్ని వదిలిపెట్టకుండా ఉండు. నా తలను భూమికి తాకించకుండా చూడు. ఇలా చెప్పి వెంటనే బాబా ఊపిరి ఆపి వేసి, ప్రాణం లేని శరీరం అక్కడ ఉంచి వెళ్ళిపోయారు. బాబా చెప్పినట్లుగానే మహల్సాపతి బాబా తలను తన ఒళ్ళో పెట్టుకుని ఉండిపోయాడు. ఆ మరునాడు బాబాకు ఊపిరి తిరిగి రాకపోవడంతో అక్కడి ముస్లిం పెద్దలు ముల్లాస్ మరియు మౌల్వీస్, బాబా చనిపోయారని నిర్ణయించారు. మూడవ రోజు పరిస్థితులు ఇంకా విషమించాయి. ముస్లింలు హిందువులు దెబ్బలాడుకోవడం ప్రారంభించారు. ఇద్దరూ బాబా శరీరం మాదంటే మాదని గొడవలు చేస్తున్నారు. ముస్లింలు దర్గా కడతామంటారు. హిందువులు సన్యాసులకు, సాధువులకు చేసే అంతిమ సంస్కారం చేస్తామంటారు. శ్యామా కూడా మహల్సాపతిని చూసి బాబా చనిపోయి ఉంటారని చెప్పి, తల క్రిందపెట్టమని చెప్పాడు. కాని మహల్సాపతి ఒప్పుకోలేదు. బాబా మనల్ని వదిలి వెళ్ళలేదు. ఎలా వెళ్తారు అని శ్యామాకు సమాధానం చెప్పాడు.

ఇలా ఉండగా హిందూ ముస్లిం గొడవలు తారస్థాయికి చేరాయి. కోపర్గాం కోర్టు ఈ విషయంలో కల్గించుకోవల్సివచ్చింది. ఇరు పక్షాల మధ్య వాదనలు విన్న తరువాత తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఇంతలో నెమ్మదిగా బాబా ఊపిరి తీసుకోవడం ప్రారంభించారు. ప్రాణం కదలిక సాధారణ స్థాయికి చేరుకుందనడానికి గుర్తుగా, అవయవాలు నెమ్మదిగా కదలడం మొదలు పెట్టాయి. బాబా కళ్ళు తెరచారు. అటూ ఇటూ చూసి ఇలా అన్నారు. అరె! ఎవర్రా నా దేహాన్ని అడుగుతున్నది. ఎవరు దీనికి అంత్యక్రియలు జరిపిస్తామని అంటున్నది. నేను ఎలా వచ్చానో అలాగే వెళ్తాను. నేను ఈ దేహాన్ని ఇక్కడ వదిలి పెట్టినప్పుడు, దానికి తగిన జాగర్తలన్నీ తీసుకున్నాను.

అలాగే నా ఆఖరి ప్రయాణానికి కూడా నాదే బాధ్యత. ఈ విషయంలో మీరు మీరు గొడవలు పడనవసరం లేదు.

ఇక్కడ గుర్తుంచుకోవల్సిన ముఖ్య విషయం ఏమిటంటే మహల్సాపతి బాబా ఆజ్ఞ ప్రకారం బాబా తలని క్రింద పెట్టుకుండా తన ఒళ్ళో పెట్టుకుని కాపాడాడు. ఒక వేళ మహల్సాపతి ఆ విధంగా చెయ్యకపోతే, భక్తులకు 30 సంవత్సరాల కాలం పాటు జరిగిన బాబా లీలలు దొరకకుండా పోయేవి. మహల్సాపతి, ఇటు హిందూ భక్తులు, అటు ముస్లిం భక్తుల ఒత్తిడికి లొంగకుండా కూర్చొన్నాడు. శారీరకంగా తనకు కల్గిన ఇబ్బందిని కూడా తట్టుకుని ఉన్నాడు. నిజానికి మనిషన్న వాడికి మూడు రోజులు కదలకుండా ఉండడం చాలా కఠినతరమైన విషయం. కాని మహల్సాపతి మాత్రం శరీరంలో చిన్న కదలిక కూడా లేకుండా కూర్చున్నాడు. అలా కాకపోతే బాబాకు చాలా ఇబ్బంది ఉండేది. ఆ మూడు రోజులు మహల్సాపతి ఏమీ తినలేదు, త్రాగలేదు. కనీసం లఘుశంకకు కూడా లేవలేదు. నిజంగా మహల్సాపతి చాలా గొప్ప భక్తుడు. కాని అతడు హఠయోగం గాని, ఇతరత్రా యోగంగాని ఏదీ నేర్చుకోలేదు. మరి మూడు రోజుల పాటు అలా కదలకుండా ఎలా ఉండగలిగాడు. బాబా తల అతని తొడలపై ఉన్నప్పుడు బహుసా బాబా నుండి అతడికి కొంత దివ్యశక్తి సరఫరా అయుండవచ్చు. అప్పుడతడు సహజ సమాధి స్థితిలోకి వెళ్ళాడు. దానివల్లనే అతడికి మనస్సును నిశ్చలం చేసుకొనే శక్తి అబ్బి ఉంటుంది. అది సంపూర్ణంగా అమనస్కమయింది. అందుచేత ఇంద్రియాలన్నీ వాటి వాటి క్రియలు చేయక మూతపడ్డాయి. కాని ఆత్మ చైతన్యం ప్రకాశవంతంగా ఉండడం వల్ల చుట్టు ప్రక్కల ఏం జరుగుతున్నదీ తెలుస్తూ ఉంటుంది.

మనం కూడా మన ఆధ్యాత్మిక ప్రయాణంలో కొంతవరకు శ్రద్ధ, సబూరిలను పెంచుకుంటూ పోతాము. చాలా మంది శ్రద్ధ అనగా భక్తి అని సబూరి అనగా సహనమని అనుకుంటారు. అయితే సచ్చరిత్ర 19వ అధ్యాయంలో బాబా స్వయంగా ఈ శ్రద్ధ సబూరిల గురించి రాధాభాయ్ దేశ్‌ముఖ్‌కు వివరించారు. ఇదంతా 53 నుండి 57 పాదాల మధ్య ఉంది.

బాబా ఇలా అంటారు. సబూరి అంటే ధైర్యం. మనుషులకు ధైర్యం చాలా ముఖ్యం ఎప్పుడూ దేనికి అధైర్య పడవద్దు. ధైర్యం అన్నది పట్టుదలకు, ఓర్పుకు, శాంతికి మరియు గౌరవానికి చిహ్నం. మనం జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కుంటూ ఉంటాం. కాని ధైర్యం వల్ల వాటినన్నింటిని మనం ధీటుగా దాట గలుగుతాం. సబూరి అన్నది మనష్యత్వంలోని సారంగా మనం గ్రహించాలి. ఇంకా సబూరి పాపాలను పోగొడుతుంది. ఆ విధంగా పాపి అయినవాడు విమోచనాన్ని పొందగలడు. దానివల్ల జీవితంలో ఒత్తిడి తగ్గుముఖం పడుతుంది. సంసారిక బాధల నుండి మనిషి తప్పించుకొని స్వతంత్రుడవుతాడు. బాధల నుండి, ప్రతికూలతల నుండి ధైర్యమూ సహనమూ మనల్ని రక్షిస్తూ ఉంటాయి. అంతేకాక ధైర్యం మనల్ని ప్రతికూల పరిస్థితుల నుండి, విపత్తుల నుండి తప్పిస్తూ ఉంటుంది. ఇంకా అది భయంకర ప్రమాదాల నుండి కూడా తప్పించి, మనలోని పిరికితనాన్ని, భయాన్ని పోగొట్టి సంసార బంధ విముక్తి కల్గిస్తుంది. ధైర్యమే విజయాన్ని చేకూరుస్తుంది. నిజం చెప్పాలంటే విజయానికి మూలకారణం ధైర్యమే. ధైర్యస్తుడికెప్పుడూ చెడు తలంపులు రావు. ఇంకా చెప్పాలంటే అతడు చక్కటి ఆలోచనా పరుడిగా ఉండి, ప్రణాలిక ప్రకారం మంచి మంచి పనులు చేస్తూ ఉంటాడు. ధైర్యం నిండిన మనిషి ఎప్పుడూ ధర్మవంతుడిగా ఉంటాడు. అంతేకాక అతడు ఒక పర్వతమంత ధర్మాల రాశిగా కనపడతాడు. గొప్ప నీతివంతమైన వ్యక్తిత్వమే ధైర్యానికి గల ముఖ్య లక్షణంగా చెప్పవచ్చు. అదే శక్తిగా మారి బయటకు ప్రసరిస్తూ ఉంటుంది. ఇంకా ఇది, ధర్మానికి నియమావళికి, పరిశీలనాత్మక దృష్టికి, ఆలోచనా శక్తికి, విచక్షణకు గని వంటిది. శ్రద్ధ అనేది సబూరి లేకుండా ఉండదు. అలాగే సబూరి కూడా శ్రద్ధ లేకుండా ఉండదు. ఇవి ఒకే నాణానికి గల రెండు పార్శ్వాలు. ఇంకా చెప్పాలంటే ఒకే ప్రాణం కలిగిన ఇద్దరు కవల పిల్లలు. ధైర్యము, ఓర్పులేని మనిషి జీవితం చాలా దయనీయంగా ఉంటుంది. అతడు మహాపండితుడు కావచ్చు లేక మహాపురుషుడని పించుకోవచ్చు కాని అతడికి ధైర్యం లేనట్లయితే అతడి జీవితం వ్యర్థమనిపించుకొంటుంది. ఒక గురువు అయినవాడు బాగా శక్తిమంతుడుగా ఉండవచ్చుగాక, కాని అతడు మాత్రం తన శిష్యుడిలో ఈ లక్షణాలు ఉండాలని కోరుకుంటాడు. అవే, బాగా చొచ్చుకుపోగల్గిన

లోచూపు, చెక్కు చెదరని విశ్వాసం, ధైర్య సాహసాలతో కూడిన శాంత స్వభావం.

రచయిత శ్రీపవార్ కాకా, ఈ వాగ్ధానం చాలా పెద్దది, కఠినమైనది అనుకొనే వారు. ఆయన ఉద్దేశ్యంలో కూడా బాబా మనకు ఋణపడి ఉండడమేమిటన్నది ఒక ప్రశ్నే. అందుకని ఆయన ఇలా అన్నారు. బాబా దయవల్ల చివరకు ఈ ప్రశ్నకు సమాధానం దొరికింది. అది ఏమిటంటే... ఈ వాగ్ధానం ఒక రకంగా భక్తిమార్గంలో చివరది అనవచ్చు. ఎందుకంటే నవవిధభక్తి మార్గాల్లో చివరిది ఆత్మ నివేదనం కదా! ఆత్మ నివేదనం అనగా సర్వమూ బాబాకు శరణాగతి చెయ్యడమే. ఈ చివరి స్థితి మనకున్న చదువుల్లో పి.జి. (పోస్ట్ గ్రాడ్యుయేషన్) లాంటిది. సర్వ శరణాగతికి మనం సిద్ధపడాలి. ఇది ఎటువంటి దంటే, నేనన్నది ఏమీలేనిది. ఎందుచేత? ఈ నేను బాబాలో పూర్తిగా కల్సిపోయింది.

అందుచేత ఇంత కాలం నేను అనబడే దేహభావన ఇప్పుడు కనబడటం లేదు అని అర్ధం అవుతుంది. అదే అహంకార రహితస్థితి లేక విడుదల. ఇది ఒక అద్భుతమైన సమాధి. దీని నుండి సరిక్రొత్త ఆలోచన బాబా పరంగా కల్గుతుంది. అదే, ఓ దేవా! ఇక నుండి ఈ దేహాన్ని నేను కాదు. కాబట్టి ఇప్పుడు నేను అనగా నువ్వే. దీనికి ఉదాహరణ నాకు నేనే చెప్పుకుంటున్నాను. అనగా నువ్వునాకే చెపుతున్నావు. ఇది ఎలా ఉందంటే పాలు, పంచదార ఇంతవరకూ విడివిడిగా కనపడ్డాయి. కాని కాసేపటికి చూస్తే అవి రెండూ కల్సి ఒకటే అయిపోయాయి. అలాగే ఉప్పుగల్లు నీళ్ళలో కలిసి ఒకటే అయిపోయింది. సాకారంగా మనకు కనపడే బాబాకు తన నిరాకార వ్యాపకత్వం బాగా తెలుసు. బాబా మన యొక్క మనస్థితిని గమనిస్తున్నారు. ఎన్నో కష్టాలకోర్చి తనను చేరిన భక్తునికి హృదయపూర్వకంగా ఋణపడి ఉన్నానని వాగ్ధానం చేసారు. పరుగు పరుగునవచ్చి చేయూత ఇచ్చి పైకి లేపారు. తనలోనే కలుపుకున్నారు. ఋణం తీర్చుకున్నారు. ఇది ఒక రకమైన అపరోక్షానుభూతి. ఈ విధంగా ఆత్మ సమర్పణ చేసిన భక్తుల కధలు చదివిన వారు తమ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని సుగమం చేసుకుందికి ప్రయత్నించిన వారగుతున్నారు.

సహజంగా బాబా మరాఠీ భాష మాట్లాడుతారు కాబట్టి ఈ వాగ్ధానం గూడ మరాఠీలోనే వ్రాయబడింది. దాని తాత్పర్యం గూడ మరాఠీలోనే ఇవ్వబడింది. కాని ఇతర భాషల్లోకి తర్జుమా చేయడంతో దాని అందాన్ని కోల్పోయింది. ఒక విద్యుత్ బల్బు వెలగాలంటే, ఆ పరికరం యొక్క విద్యుత్ వలయం పూర్తి చేయవలసి ఉంటుంది. ఆ వలయంలో ధనధృవం, ఋణధృవం ఏర్పాటు అయి ఉండాలి. అప్పుడే ఆ వలయం పూర్తి అయిందని చెప్పవచ్చు. అప్పుడు మాత్రమే విద్యుత్‌శక్తి దానిలో ప్రవేశించి ఆ బల్బును వెలిగిస్తుంది. ఇటువంటి శక్తి వలయాన్ని కాకాసాహెబ్ దీక్షిత్, బాబాతో తనకు కల్గిన సంబంధం ద్వారా పూర్తి చెయ్యగలిగాడు. అది ఆయనకు పరమశాంతితో కూడిన, అమోఘమైన మరణాన్ని ప్రసాదించింది.

దీక్షిత్, బాబాను కలసిన దగ్గర నుండి, బాబా దీక్షిత్‌కు సద్గతిని కల్గిస్తానని చెపుతూ వచ్చారు. అంతేకాకుండా బాబా దీక్షిత్‌ని పైకి విమానంలో తీసుకువెడతానని కూడా వాగ్ధానం చేసారు. దీక్షిత్ మొదటి నుండి ఏకాదశి రోజున మరణిస్తానని చెప్పుకుంటూ వచ్చాడు. ఆ విషయం సాయి సచ్చరిత్రకు వ్రాసిన ముందు మాటలో దీక్షిత్ స్వయంగా వ్రాసాడు. ఇది 1923లో సాయిలీలా పత్రికలో ప్రచురించబడింది. దాని క్రింద దీక్షిత్ సంతకం కూడా చేసాడు. అతడు అన్న మాటలు ఇలా ఉన్నాయి. ఒక విషయం నిజం. ఏమిటంటే హరిభక్తుడు మాత్రం హరికి యిష్టమైన ఏకాదశి రోజున మరణిస్తాడు. బాబా కూడా అలాగే కొందరు హరిభక్తులకు మరణం ప్రసాదించారు. వారిలో కాశీరాం, అప్పా జాగలా మొదలైన వారున్నారు.

మొదటి నుండి దీక్షిత్‌కు ఒక అలవాటు ఉంది. అదే ఏకాదశి ఉపవాసం చెయ్యడం. దానివల్ల భగవంతుని పట్ల దీక్ష ఎక్కువగా చెయ్యడానికి వీలుపడుతుంది. అంతేకాకుండా భాగవత గ్రంథాలు చదవడం, ధ్యానం, భజనలు చెయ్యడం చేసేవాడు. ఆ ప్రకారంగానే దీక్షిత్ 5-7-1962 ఏకాదశి రోజున మరణించాడు. అతడి మరణానికి ముందురోజు, అతడి రోజువారీ అధ్యయనంలో భాగంగా ఏకనాధుని బావార్ధ రామాయణం నడుస్తోంది. ఆ రోజున గజేంద్ర మోక్షఘట్టం పూర్తి చేసాడు. మొసలి బారినపడిన

ఏనుగు (గజేంద్రుడు) తనశక్తినంతా కోల్పోయి చివర్న శ్రీహరిని ప్రార్థించి మోక్షాన్ని పొందగలిగాడు. తరువాత రోజు (మరణించిన రోజున) ఉదయం అష్టమహాసిద్ధులను గురించి చదివాడు. ఆయన చదివిన భాగం ఇలా ఉంది. "ఒక సిద్ధుడు తన దేహం వదిలిపెట్టి వేరొక ప్రాణి దేహంలో ప్రవేశిద్దామని తలచినప్పుడు, ఆ క్రియ స్థూలదేహాన్ని విడిచి, సూక్ష్మదేహం ద్వారా చేయబడుతుంది. ఉదాహరణకు ఒక ఆకు పురుగు, ముందు ఆకును వదలి వేరొక ఆకును పట్టుకొని ప్రాకినట్లు, ఒక తుమ్మెద ఒక పువ్వును వదిలి వేరొక పువ్వు పైకి ఎగిరినట్లు ఉంటుంది. దీక్షిత్ ఈ భాగాన్ని ఎంతో తెలివితోను, హృదయ పూర్వకంగాను, భక్తిపూర్వకంగాను చదివాడు. అలాగే దీక్షిత్ కూడా ఒక తుమ్మెదలాగ తన దేహాన్ని వదిలిపెట్టి వేరొక దేహాన్ని చేరాడు. ఇదంతా బాబా వాగ్ధానం ప్రకారం, బాబా దయవల్లనే జరిగింది. ఆరోజు దీక్షిత్ దబోల్కర్‌తో కలిసి చాలాసేపు గడిపాడు. వారిద్దరూ భక్తి పాటలు పాడుకుని, రామాయణం చదువుకుని కాలం గడిపారు. ఆ ప్రకారం దీక్షిత్ మరణ సమయంలో హరిభజనతో కాలం గడిపి తరించాడు.

ఆరోజు అతడు డా॥దేశ్‌ముఖ్ వైద్యశాలకు పోయి, అక్కడ చికిత్స పొందుతున్న అతని కొడుకు రామకృష్ణను కలవడానికి దబోల్కర్, తెండుల్కర్‌తో సహా ఇంటి నుండి బయలుదేరాడు. వాళ్ళందరూ స్టేషనుకు వచ్చేసరికి ఆలస్యమైంది. అనుకోకుండా అప్పుడు రావలసిన రైలు కూడా ఆలస్యమైంది. అందుచేత వాళ్ళందరూ ఎక్కగలిగారు. దీక్షత్ దబోల్కర్‌కు ఎదురుగుండా కూర్చొన్నాడు. అన్నాసాహెబ్! చూసావా బాబాలీల. ఆయన మనకి కాలం వృధాకాకుండా వచ్చిన వెంటనే రైలు దొరికేలాగ చేసారు. రైలుని కాస్త ఆలస్యం చేసి మనందరం దాన్ని అందుకోనేలాగ చేసారు. లేకపోతే అందరం స్టేషనులో ఉండిపోవలసి వచ్చేది. ఇదంతా బాబా యొక్క చలువే అని చెప్పి మనస్సులో బాబాకు కృతజ్ఞతలు తెలియచేసుకొన్నాడు. వెంటనే కళ్ళు మూసుకొన్నాడు. దబోల్కర్ అది చూసి దీక్షిత్‌కు కాస్త నిద్ర వచ్చిందేమో అనుకొని, అతడి ప్రక్కకు వచ్చి కూర్చొని తలను తన భుజానికి ఆనించి ఉంచాడు. కొంతసేపైన తరువాత కాకా! నిదుర పోతున్నావా అని అడిగాడు. దీక్షిత్ జవాబు చెప్పలేదు. దీక్షిత్‌కు మూర్ఛలాంటిది

వచ్చిందేమో అనుకొని, దబోల్కర్ ఆతడిని మొత్తం సీటులో పడుకోబెట్టి తలను మాత్రం తన తొడ మీద పెట్టుకున్నాడు. అలాగే తెండుల్కర్‌తో మాట్లాడి, రైలు గార్డుకు చెప్పి ఒక డాక్టరును ఏర్పాటు చెయ్య మన్నాడు.

చివరకు వాళ్ళందరూ రైలు దిగి దీక్షిత్ దేహాన్ని ప్లాట్‌ఫారం పైకి తీసుకువచ్చారు. అప్పుడు తెలుసుకున్నాడు దీక్షిత్ మరణించాడని, దీక్షిత్ చివరిసారిగ బాబాకు కృతజ్ఞతలు చెప్పుకుని ప్రాణాలు వదిలిపెట్టాడు. చివరి క్షణంలో మనం ఎవర్ని తలుచుకొంటామో, మనజీవాత్మ కూడా అక్కడికే చేరుతుందని అంటారు. అలాగే దీక్షిత్ కూడా తన సద్గురువును తలచుకొని, ఆయన పాదాల చెంతకే చేరగలిగాడు.

ఏ మనిషికైనా మరణమన్నది జీవితంలో ఒక భయంకరమైన అనుభవం. కాని మహల్సాపతి విషయంలో వేరుగా జరిగింది. మహాభారతంలో భీష్మపితామహుడి లాగ మహల్సాపతికి ఇచ్ఛామరణం సంభవించింది. అది మంగళవారం ఏకాదశి తిథి, 12 సెప్టెంబరు 1922. ఈ మహాభక్తుడు దేహం విడిచిపెట్టేసాడు. అంతకు రెండు రోజులు ముందు మహల్సాపతి, దీక్షిత్‌కు, దబోల్కర్‌కు ఇంకా పురందరెకు ఒక లేఖ పంపించాడు. వెంటనే షిరిడీకి రండి అని పిలిచాడు. సోమవారం నాడు మహల్సాపతి తండ్రి ఆబ్దీకం కార్యక్రమం జరిగింది. దానికి బంధువులందరూ ఇంటికి వచ్చారు. ఆ కార్యక్రమం జరుగుతుండుగా మహల్సాపతి ఉన్నట్లుండి తన కొడుకు మార్తాండ్‌ను పిలిచాడు. ఈ రోజే నేను చనిపోవడానికి సిద్ధంగా ఉన్నాను. కాబట్టి శ్రాద్ధ కార్యక్రమం తొందరగా ముగించడం మంచిది, అన్నాడు. బంధువులందరికి భోజనాలు పెట్టండి అన్నాడు. అలాగే అందరూ భోజనం చేసారు. మహల్సాపతి మాత్రం తిన లేదు. అన్నం వడ్డించిన ఒక పళ్ళాన్ని ముక్కు దగ్గరగా పెట్టి వాసన చూసి వదిలి పెట్టాడు. ఒక తెల్ల దోవతి తీసుకుని, రెండు ముక్కలు చేశాడు. ఒక ముక్క తన నడుం చుట్టూ కట్టుకున్నాడు. ఇంకొక ముక్క దీక్షా వస్త్రంలాగ చుట్టుకున్నాడు. ఆ విధంగా చేసి, ఇప్పుడు నేను దీక్ష తీసుకున్నాను. నా ఆఖరు ఊపిరి బాబాకు అంకితం చేసి ఈ దేహాన్ని వదిలి పెట్టదలచాను అన్నాడు. ఒకరకంగా మహల్సాపతి, మనిషి జీవితంలో 16వదైన

ఆఖరి దహన సంస్కారానికి సిద్ధపడ్డాడని అర్థం.

అక్కడకు చేరిన మనుషులందరూ భక్తి గీతాలను పాడడం ప్రారంభించారు. ఇంకొంతమంది బాబా నామ జపం మొదలుపెట్టారు. మహల్సాపతి మాత్రం నెమ్మదిగా సమాధి స్థితిలోకి జారుకున్నాడు. ఆ స్థితిలో ఉండగానే కొడుకు మార్తాండ్ తండ్రికిలా చెప్పాడు. దీక్షిత్ వేరే ఊరు వెళ్లడం వల్ల ఆరోజు అక్కడికి రాలేకపోతున్నాడని చెప్పాడు. అదివిన్న మహల్సాపతి, సరే అయితే రేపే నేను అంతిమ యాత్రకు ప్రయాణ మవుతాను అన్నాడు. ఆ మరుసటి రోజు ఉదయం, మల్హరీ మహాత్మ్యం చదవమని చెప్పాడు. అలాగే బాలాజీ గౌరవ్ పారాయణ చేయడం ప్రారంభించాడు. మహల్సాపతి శ్రద్ధగా దాన్ని విన్నాడు. పారాయణ 21వ అధ్యాయం వరకూ రాగానే ఇంక ఆపు అన్నాడు. మిగిలిన అధ్యాయాలు రేపు వింటాను అన్నాడు. మార్తాండ్‌కు ఆశ్చర్యమేసింది. ఈ రోజే అంతిమయాత్ర అన్నప్పుడు మిగిలిన భాగం మర్నాడు ఎలా వినగలవు అని అడిగాడు. దానికి మహల్సాపతి సమాధానం ఇలా ఉంది. “అది నీకు ఎప్పటికే తెలియదు. అంతే అని ఊరుకున్నాడు.”

ఇంక ఆరోజు సాయంకాలం నాలుగు గంటల సమయంలో అందరూ భజనలు చేస్తూ మైమరచి ఉన్నారు. మార్తాండ్ తండ్రినే చూస్తున్నాడు. మహల్సాపతి ఊపిరి సన్నగిల్లడం ప్రారంభించింది, చివరకు ఒక దగ్గర పూర్తిగా ఆగిపోయింది. మహల్సాపతి మరణాన్ని ఒక ఉదాహరణగా తీసుకుని, ఆధ్యాత్మికపరంగా ఆలోచిస్తే ఇలా ఉంటుంది. ఒక విద్యుత్ బల్బు వెలగాలంటే ధన ధృవం (Positive pole), ఋణ ధృవం (Negative pole) కల్పిన విద్యుత్ వలయం ఏర్పడవలసి ఉంటుంది. ఇక్కడ భక్తుడి ఆత్మనివేదన దశ అనగా నవవిధ భక్తి మార్గాల్లో చివరది, ధనధృవ పాత్రను పోషిస్తుంది. కాని ఋణధృవ పాత్రను పోషించేది చాలా ముఖ్యమైంది. అదే సద్గురువు యొక్క కృప మరియు ఆశీర్వచనం. మన భక్తి తత్పరత ఎంత పెద్దదైనప్పటికీ సద్గురువు ఆశీస్సులు దొరకకపోతే ఆత్మ కళావిహీనమవుతుంది. పారవశ్యానికి నోచుకోదు. ఒక సారి సద్గురు కృప లభించినట్లయితే విద్యుత్ వలయం పూర్తి అయి ఆత్మ దీపం ప్రకాశిస్తుంది.

అందుకే బాబా పదేపదే చెప్తూ ఉంటారు. నాకు శరణాగతి చెయ్యండి. ఏ విధంగానంటే మీ మనస్సును, మీ వాక్కును మీ కళలనూ నాకర్పించండి. అప్పుడే మీకు నేను ఋణ పడినడినట్లు అర్థం. ఇది ఏదో ఒకసారి కాదు, ఎళ్ళవేళలా, ఎప్పుడూ కూడా. అప్పుడే ఈ ఆత్మ ఆనందంగా ప్రకాశిస్తుంది. దీనిలో మీకు ఎటువంటి అనుమానం కలుగనవుసరం లేదు. నేను మీ జీవితాన్ని ఉద్దరించగలను.

తరువాత ఇంకొక లీల చెప్పబడుతోంది. ఇది బాబాపై గల అమితమైన ప్రేమకు సంభందించిన విషయం. ఒక భక్తుడున్నాడు. అతడికి బాబాని తప్ప ఇంకొకరిని చూడాలనిపించదు. ఇంకో మాటలో చెప్పాలంటే పిచ్చి ప్రేమ. ఒకానొక స్థితిలో ఇది భరించలేనంతగా ఉంటుంది. ఏ విధంగా శరీరం మీద పుండు పుట్టి సలుపు, బాధ ఎక్కువై ఎంతగా భరించలేనట్లు ఉంటుందో అలా ఉంటుంది. శరీరం మీద పుట్టిన పుండుకైతే చికిత్స చేస్తే, సలుపు బాధపోతుంది. కాని ఈ ప్రేమకు చికిత్స ఎలాగ? కేశవ్ ఆర్. ప్రధాన్ అనే భక్తుడు సంగతి ఇలా ఉంది. బాబా అతడికి ఎంత ఎక్కువగా ఋణపడి ఉన్నారంటే, ఒక పరిస్థితిలో ఆయనే వెళ్ళి ప్రధాన్ ఇంట్లో ఉండవల్సి వచ్చింది. ఇంత ఆశ్చర్యకరమైన లీల ఎలా జరిగిందో చూడండి.

మొదట్లో కేశవ్ ఆర్. ప్రధాన్ అన్న వ్యక్తి కరడుగట్టిన నాస్తికస్వభావం గల మనిషి. అయితే ఇతనికొక స్నేహితుడున్నాడు. అతడేమో బాబాకి పరమభక్తుడు. ప్రధాన్‌కు బాబాల మీద సన్యాసుల మీద అసలు నమ్మకం లేదు. ఇతడు బొంబాయిలో ఒక ఏజన్సీలో పనిచేసేవాడు ఆ పని మీద ఇతడికి, మన్మాడ్, నాసిక్, కోపర్గాంలకు వెళ్ళవలసి వచ్చేది. బాబా భక్తుడైన అతడి స్నేహితుడికి ప్రధాన్‌ను ఎలాగైనా ఒకసారి షిరిడికి తీసుకొని వెళ్ళాలని ఉండేది. ఎన్నిసార్లు చెప్పినా ప్రధాన్ అతడి స్నేహితుడి కోరికను మన్నించలేదు . కాని ఆ స్నేహితుడు తన ప్రయత్నం మట్టుకు మానలేదు. చివరకి బలవంతం చేసి నచ్చజెప్పి ఒప్పించాడు. అలా ప్రధాన్, అతని స్నేహితుడు షిరిడీకి బయలు దేరారు. వస్తాను కాని బాబా పాదాలకు వంగి నమస్కరించను అని ప్రధాన్ ముందే చెప్పాడు. అలాగే బాబా పాదాలు కడిగిన జలాన్ని త్రాగను అని కూడా

చెప్పాడు. అలా పాదాలు కడిగిన నీళ్ళు త్రాగమంటేనే అతడి ఒళ్ళు జలదరిస్తుంది అని చెప్పుకొచ్చాడు.

స్నేహితులిద్దరూ షిరిడీ చేరారు. అప్పటికి ద్వారాకామాయి నిండా జనం ఉన్నారు. అందువల్ల ప్రధాన్ సంతోషపడి నేను దూరంగా ఒక మూల కూర్చుంటాను అనిచెప్పి, బాబా ఉండే ముఖ్యమైన స్థలానికి దూరంగా కూర్చొన్నాడు. అతడి స్నేహితుడు మాత్రం బాబా దగ్గరకెళ్ళి పూజ చేశాడు.

అప్పుడు బాబా దూరంగా కూర్చొన్న ప్రధాన్‌వైపు చూస్తూ "ఆ బాధ్యత తెలియనివాణ్ని, ధిక్కారంతో కళ్ళుమూసుకుపోయినవాణ్ని, దుష్టుడిని ఇలా తీసుకురండి" అని గట్టిగా అరిచారు. వెంటనే అతడి స్నేహితుడు ప్రధాన్‌ను బాబా దగ్గరకు పట్టుకుని వచ్చాడు. వెంటనే బాబా ప్రధాన్ జీవితాన్ని కాచి వడబోచినట్లు, ఉన్నది ఉన్నట్లు, ఇంకా అతడికి సాధువుల పట్ల సన్యాసుల పట్ల ఉన్న ద్వేషభావాన్ని చెప్పుకుంటూ వచ్చారు. దాంతో ప్రధాన్‌కు బాబా యొక్క విశ్వ వ్యాపకత్వం కళ్ళకు కట్టినట్లు కనపడింది. అంతేకాక ప్రతి ఆలోచననూ కనిపెట్ట గలిగిన శక్తి బాబాకుందని గ్రహించాడు. ఒక్కసారి ప్రధాన్ అంతరాత్మను బాబా పట్టుకున్నట్లయింది. సాధువుల పట్ల, సన్యాసుల పట్ల అతడి కుండే ద్వేషభావం ఒక్కక్షణంలో పటాపంచలయిపోయింది. ఆ క్షణం నుండే ప్రధాన్ బాబాకు భక్తుడిగా మారాడు.

ఒకసారి ప్రధాన్ తన ఉద్యోగరీత్యా బిల్లులు సేకరించి 2,500/- రూపాయలు తన రెండు జేబుల్లోనూ కుక్కుకుని వచ్చాడు. బాబా అది చూసి ఆ రెండు జేబులు ఖాళీ చెయ్యమన్నారు. వెంటనే ప్రధాన్ ఆ డబ్బును బాబా ముందు పెట్టి నిల్చున్నాడు. వెంటనే నువ్వు షిరిడీ వదిలి పెట్టిపో అన్నారు. ప్రధాన్ దగ్గర ప్రయాణపు ఖర్చులకు కూడా డబ్బులేదు. ఏదైతేనేమి, బాబా చెప్పినట్లుగానే షిరిడి వదిలి కోపర్గాంకు బయలుదేరాడు. కోపర్గాం చేరగానే, మంచి బట్టలు వేసుకున్న ఒక పెద్దమనిషి కనపడి తను ప్రయాణించిన టాంగా డ్రైవరుకు డబ్బు ఇచ్చాడు. అంతేకాక రైలు ప్రయాణానికి

తిరుగు టిక్కెట్టు కూడా కొని తన ప్రక్కనే రైల్లో కూర్చొన్నాడు. ఆ పెద్దమనిషి చేసిన సహాయానికి ప్రధాన్ ఎంతగానో సంతోషించి కృతజ్ఞతలు చెప్పాడు. అంతేకాక యింటికి చేరిన తరువాత, అతను ఖర్చు పెట్టిన డబ్బును తిరిగి ఇస్తానని చెప్పాడు.

ప్రధాన్ పెద్ద ధనవంతుడేమీ కాదు. అందువల్ల తను వసూలు చేసిన సొమ్ము ఏజెన్సీ వారికి ఎలా చెల్లించాలో అతనికి అర్థం కాలేదు. కాబట్టి తనకు ఒంట్లో బాగోలేదని, అందుచేత చాలాకాలం వరకూ ఆఫీసుకు రాలేనని కబురు పెట్టాడు. అప్పుడు అతని పై అధికారి వచ్చి, బాధ పడవద్దని చెప్పి హెడ్ ఆఫీసువారికి ప్రధాన్ వసూలు చేసిన డబ్బుకు రెండింతలు వచ్చి చేరిందని, ప్రధాన్ పని చేసిన విధానాన్ని మెచ్చుకుని వెళ్ళాడు. ఇంతకంటే ఇంకో విచిత్రమేమిటంటే, రైల్లో కలిసిన పెద్ద మనిషికి పంపిన మనీ ఆర్డరు తిరిగి వెనక్కు రావటం. కారణం ఏమిటంటే అటువంటి పేరు గల ఆసామీ ఎవరూ లేరని తపాలా శాఖ వారు వ్రాసారు. ఈ సంఘటనతో ప్రధాన్‌కు బాబాపై గల విశ్వాసం ధృడమైపోయింది.

రోజులు గడుస్తున్న కొద్దీ ప్రధాన్ యొక్క ఆర్థిక పరిస్థితి అంతకంతకు మెరుగవుతోంది. అటు మానసికంగా ఎంతో శాంతి లభించింది. తరచు షిరిడి వెళ్ళి వస్తూ ఉండేవాడు. వెళ్ళినప్పుడల్లా బాబాను భీవపురికి రమ్మనమని చెప్పేవాడు. ప్రధాన్ అలా చెప్పగా కొన్నాళ్లకు బాబా తప్పక వస్తాను అని అన్నారు. ప్రధాన్ స్వభావ సిద్ధంగా కొంతమొండి పట్టుదల గల మనిషి. అందుకని బాబాని ఎప్పుడొస్తారు, ఎప్పుడొస్తారు అని అడుగుతూనే ఉన్నాడు. ఇంకా చెప్పాలంటే వత్తిడి చేస్తున్నాడు. కాని ఇదంతా బాబాపైన అతనికి గల అపార ప్రేమ, భక్తి వల్లనే అని తెలుసుకోవాలి.

1916లో ఒకసారి ప్రధాన్ షిరిడి వచ్చినప్పుడు ఇంతకాలం నుండి అతడు కోరుకున్నది దొరికింది. బాబా ప్రధాన్‌కు, చెక్కబడి ఉన్న తన ప్రతి రూపాన్ని ఒకదానిని ఇచ్చి, ఇదిగో ఇది తీసుకో, మీ ఇంట్లో పెట్టుకో, నిజంగా నమ్ము ఇదే నేను. కాబట్టి ఇంక నువ్వు షిరిడి రావలసిన పనిలేదు అన్నారు. ప్రధాన్ బాబా చెప్పినట్లుగానే

ఆ ప్రతిమను తీసుకుని ఇంటికి వచ్చాడు.

కొన్నాళ్ళ తరువాత ప్రధాన్ తిరిగి షిరిడి వచ్చాడు. అతడు ద్వారాకామాయికి రాగానే బాబా, నేను నీ ఇంట్లో ఉన్నాను కదా! అందుచేత మళ్ళీ షిరిడీకి రావద్దు. నువ్వు భీవపురి వెళ్ళు. అక్కడ నా ప్రతిమను పెట్టి ఒక దేవాలయం కట్టు. అక్కడే అన్ని పూజలు చెయ్యి. నువ్వు మళ్ళీ షిరిడికి రావద్దు. ఎందుకంటే అదే నీ షిరిడి అనుకో. నేను అక్కడే ఉంటా. వెంటనే వెళ్ళిపో అని నొక్కి చెప్పారు. ఇక అప్పటి నుండి ప్రధాన్ షిరిడీకి వెళ్ళలేదు. బాబా ఆజ్ఞాపించిన ప్రకారం భీవపురీకి పోయి, తన యింటికి దగ్గరగా ఒక దేవాలయం నిర్మించాడు. ఒక రోజు అర్ధరాత్రి, ఆ దేవాలయం ద్వారం తెరిచినచప్పుడు విన్నాడు. ఎవరు తెరిచారో అనుకుంటూ వెళ్ళి చూసాడు. ఒక్కసారి అతని నోటి నుండి మాట రాలేదు. చూసి ఆశ్చర్యానికి గురైనాడు. బాబా స్వయంగా వచ్చి తలుపులు తెరిచి లోపలికి వెళ్ళి, వెనక నుండి తిరిగి తలుపులు మూసారు. ప్రధాన్ అక్కడే ఉండి చూస్తున్నాడు. తెల్లవారు జామున 3 గంటల వెళ్ళిపోయారు. మరునాడు బంధువులకు, స్నేహితులకు ఈ సంఘటన గురించి చెప్పాడు.

ప్రధాన్ బాబాపట్ల ఎనలేని విశ్వాసాన్ని కనబరిచేవాడు. అతని కోరికలన్నీ మన్నిస్తారని అనుకుంటూ ఉండేవాడు. తెల్లవారు జామునే లేచి బాబాకు చెయ్యవలసిన పూజా కార్యక్రమాలన్నింటిని పూర్తి చేసేవాడు. ఒక రోజు బాబా విగ్రహం ముందు నిలబడి ఇలా అన్నాడు. బాబా! మీరు ఇక్కడకు వచ్చి ఉందామనుకున్నారు. మరి మీకు పూజ చేయ్యడానికి అందమైన పూలతోట ఉండాలి కదా! రోజూ మంచి మంచి పూలతో మీకు అర్చన చేస్తాను. అందుచేత మీరు అందమైన, సువాసన కల్గిన పువ్వులను ఇక్కడ ఏర్పరచవచ్చుకదా? అని తనే అనేక రకాలైన పూల మొక్కలను తెచ్చి అక్కడ ఒక తోట ఏర్పరచాడు. "ఆ తోట బాగా పెరిగి పెద్ద పెద్ద పూలచెట్లుతో రకరకాల పువ్వులను ఇచ్చింది. అవన్నీ బాబా పూజకు ఉపయోగించేవాడు.

ఇలాగే ఇంకొక సారి ప్రధాన్ బాబా విగ్రహం ముందు నిలబడి, బాబా! మీకు తెలుసు గదా ఇక్కడ నది చాలా దూరంగా ఉంది. మీకు అభిషేకం చెయ్యడానికి

మంచి నీరు కావాలి గదా! మరి నేను అంత దూరం నడిచి వెళ్ళి నీరు తీసుకు రావడం మీకు ఇష్టమేనా? కాబట్టి బాబా! దగ్గరలోనే నీటి సదుపాయం ఉంటే బాగుంటుందని మీకు అనిపించలేదా? ఆవిధంగా విషయాలన్నీ బాబాకు విన్నవించి ప్రధాన్ ఒక నుయ్యి త్రవ్వడం ప్రారంభించాడు. బాబా ఇదంతా గమనిస్తున్నారు. ఒక పెద్ద పాత్ర నిండా ప్రతిరోజూ నీరు దొరికేటట్లు చేసారు. ఇలాగా ప్రధాన్ ఇబ్బందులు ఎదుర్కొనే సమయాల్లో బాబా ప్రధాన్‌కు అండగా నిలుస్తూ ఉండేవారు. ఈ లీలల వల్ల మనకు తెలిసేదేమిటంటే, బాబా తన ప్రియమైన భక్తులకు ఎప్పుడూ ఋణపడి ఉంటారు.

సద్గురువు యొక్క కటాక్షం పొందిన భక్తుడు చాలా అదృష్టవంతుడు. అతడిక బ్రహ్మజ్ఞానం పొందటానికి ఒక్క మెట్టు మాత్రమే ఎక్కవల్సి ఉంటుంది. బ్రహ్మజ్ఞానం పొందడమంటే అర్థం బ్రహ్మ స్వరూపానుభవాన్ని పొందటమే. దాన్నే 'అహం బ్రహ్మస్మి' అనే మహా వాక్యం శాస్త్రం ద్వారా విశదీకరిస్తుంది. ఈ బ్రహ్మజ్ఞానం గురించి బాబా చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి . ఎంత మేధా సంపత్తి ఉన్నప్పటికీ ఆత్మ యొక్క నిజస్వరూపం అర్థం కాదు. సాధువులకు, సంత్‌లకు, సద్గురువుకు సేవలు చేసి వారి అనుగ్రహ ఫలం చేత మాత్రమే బ్రహ్మజ్ఞానం గురించి అర్థం చేసుకొనే అవకాశం కలుగుతుంది. మత గ్రంథాలు, బ్రహ్మజ్ఞానానికి సంబంధించిన విషయాలను సంగ్రహంగా చెపుతూనే ఉంటాయి. కాని సద్గురువు యొక్క కృప పొందనంత కాలం, ఎంత ప్రయత్నం చేసినా, ఎంతకాలమైనా, చివరకు ప్రపంచ వినాశన సమయానికి కూడా ఏ ఒక్కడూ బ్రహ్మజ్ఞాన స్థితిని పొందలేడు. ఇదే విషయం సచ్చరిత్ర 16వ అధ్యాయంలో 158, 159 పాదాల్లో విపులంగా చర్చించబడింది.

కాబట్టి బాబా కృపవల్ల. ఇంకా నిస్వార్థ సేవా కార్యక్రమాల వల్ల భక్తి, ప్రేమల వల్ల మాత్రమే బాబా మనకు ఋణపడి ఉండేస్థితికి చేరుకోగలం. మనం ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తున్నాం అన్నదానికి నిదర్శనం ఇదే.

# పదకొండవ వాగ్ధానం

**సాయి మహ్నేతోచి తోచి జాలా ధన్యా**
**జాలాజో అనన్యా మాజ్యాపాయే॥**

మరాఠీ భాషలో ఉన్నటువంటి ఈ పదకొండవ వాగ్ధానం తెలుగులో ఇలా వ్రాయబడి ఉంది. **"నా భక్తుల గృహాములందు లేమి అను శబ్దము పొడసూపదు."** దీన్నే ఈవిధంగా కూడా చెప్పుకోవచ్చు. ఎవరైతే అమితమైన భక్తియోగాన్ని సాధన చేస్తారో, ఎవరికైతే నాపాదాల దగ్గర చెక్కుచెదరని విశ్వాసాన్ని స్థిరపరుచుకొనే బుద్ధి ఉంటుందో, ఎవరు ఎడతెగని సాయి నామ జపం చేస్తారో, ఎవరిలో ఇసుమంతైనా భేద భావం కనపడక నాతో ఏకత్వాన్ని సాధించే సంకల్పం కలుగుతుందో, అట్టివారు నా యొక్క సంపూర్ణ కృపను, ఆశీస్సులను పొందిన వారగుతున్నారు.

మరాఠీ భాషలో ఉన్న వాగ్ధానం మొదటిలైనులో, ఎవరైతే సాయినామం జపిస్తారో వారు దీవనలను పొందగలరు అని ఉంది. మరాఠీ భాష నుండి ఆంగ్లానికి అనువాదం చాలా కష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఆ భాషలోని వాక్యంలో గల పదాలు తిన్నగా ఒక అర్థాన్ని ఇవ్వవు. దానిలోని మాటలు, సామెతలు సందర్భానుసారం వేరు వేరు అర్థాలను ఇస్తూఉంటాయి. ఉదాహరణకి, 'సాయిమహ్నే' అంటే సాయి చెప్పారు అని ఒక అర్థం ఉంది. అదే ఇంకొక అర్థంలో సాయి నామం జపిస్తే అన్నది గూడ వస్తుంది. సాధారణంగా ప్రతి సాయి భక్తుడు హారతి పాటలను చాలా ఉత్సాహంగా పాడుతూ ఉంటాడు. కాకడ హారతిలోనూ, అలాగే ఉదయం పూట జరిగే హారతిలోనూ ఈ మాట మనకు వినపడుతూఉంటుంది. అదే తుకామహ్నే, నామా మహ్నే. అలాగే ప్రముఖంగా అందరూ పాడుకొనే ఈ హారతి పాటలో కూడా, అంటే 'షిరిడి మాజె పండరిపూర'లో కూడా ఆఖరి పాదంలో 'గణు మహ్నే బాబా సాయి ధావె పావమాజె ఆయి'. దీని అర్థం దాసగణు ఇలా అన్నాడు, బాబా సాయి పరుగున వచ్చి మాకు దీవెనలు అందచెయ్యి. మా తల్లి గూడ నీ దీవెనలే మాకిచ్చును."

మరాఠీ భాషలో అభంగాలు (స్తోత్రాలు) రచించినప్పుడు, పాడినప్పుడు, ఎవరైతే

ఆ అభంగాలను వ్రాసారో, వారి పేరు చెప్పి పాడడం అన్నది ఒక సాంప్రదాయంగా వస్తోంది. ఉదాహరణకు జ్ఞానా అన్నారు అనగా సంత్‌జ్ఞానేశ్వర్ వ్రాసారు అని అర్థం. అలాగే తుకా అన్నారు అనగా సంత్‌తుకారాం వ్రాసారు అని అర్థం. అలాగే గణు అన్నారు అనగా దాసగణు వ్రాసారు అని అర్థం వస్తూ ఉంటుంది.

కాని పైన చెప్పిన వాగ్దానంలో సాయి మహ్నే అనగా సాయి అన్నారు అని కాదు, ఇక్కడ సందర్భం ప్రకారం, భక్తుడు సాయి, సాయి అని ఎడతెగక చేసే నామజపం వల్ల అతడు భక్తి భావనాపరంగా ఉన్నతస్థితికి తీసుకువెళ్ళబడుతాడు, ఇంకా సాయి దీవెనలు అందుకుంటాడు అన్న అర్థం వస్తుంది.

బైబిలు ప్రకారం, ఆ కాలంలో అబ్రహం, భగవంతుని పట్ల స్థిరమైన విశ్వాసం కల్గిన ఒక అపురూపమైన భక్తుడు. అంతే కాకుండా భగవంతుని ఆజ్ఞపాలించడానికి గాను తనకు లేక లేక కల్గిన కొడుకు ఇసాక్‌ను చంపడానికి కూడా సిద్ధమయ్యాడు.

అలాగే బాబా కాలంలో కాకాసాహెబ్ దీక్షిత్ కూడ బైబిలు కాలంనాటి అబ్రహంతో పోల్చదగిన వ్యక్తి. నిజం చెప్పాలంటే దీక్షిత్‌లాంటి భక్తుడు ఇంకొకరు ఉండరు. శ్రీ సాయి సచ్చరిత్ర 23వ అధ్యాయంలో ఒక బక్కచిక్కిన గొర్రి కథ ఉంది. అది ఏదో రోగంతో బాధపడుతోంది. అలాంటి గొర్రిని ఎవరో ద్వారకామాయి సభా మండపంలో వదిలిపోయారు. బాబా, బడే బాబాను పిలిచి, రోగంతో ఉన్న ఆ గొర్రెను చంపివేసి అది పడుతున్న బాధనుండి విముక్తి కల్గించమన్నారు. కాని బడే బాబా అలా చెయ్యడానికి ఇష్టపడలేదు. అప్పుడు బాబా, శ్యామాకు చెప్పారు. కాని శ్యామా కూడా ఆపనికి ఒప్పుకోక అక్కడ నుండి వెళ్ళి పోయాడు. చివరకు బాబా, అక్కడనే ఉన్న దీక్షిత్‌ను ఆపని చెయ్యమన్నారు. బాబా తన ముఖ్య భక్తులలో గల గొప్పదనాన్ని తెలుసుకోవాలని అనుకున్నారు.

ఇప్పుడు దీక్షిత్ వంతు వచ్చింది. ఆయన ఒక నాగర బ్రాహ్మణ కులానికి చెందిన వాడు. ఎన్నడూ హింసకు పాల్పడనని ప్రతిజ్ఞపూనినవాడు. అలాగే జంతువుల పట్ల దయ జాలి గల్గినవాడు. జంతువులను హింసించటం అస్సలు అతనికి ఇష్టంలేని

పని. దీక్షిత్ యొక్క అంతఃకరణం ఎప్పుడూ దయ జాలితో నిండి ఉంటుంది. ఎప్పుడూ కూడా ఎవరిపట్లా దురుసుగా ప్రవర్తించడం అలవాటు లేనివాడు. కనీసం ఒక ఈగను కూడా ఎన్నడూ చంపలేదు. ఒకసారి దీక్షిత్ మిగతా భక్తులతో కలిసి కూర్చొని ఉన్నప్పుడు, ఒక నల్లని తేలు వారి మధ్యకు వచ్చింది. దాన్ని చూసి ఒక భక్తుడు కొట్టి చంపడానికి కాలి చెప్పును పట్టుకు వచ్చాడు. దీక్షిత్ అతడిని వారించి, ఒక పొడవాటి కర్రపుల్ల తీసుకు వచ్చి, దాంతో ఆ తేలును పట్టుకొని బయటకు పోయి దూరంగా ఉన్న చెట్ల దగ్గర క్షేమంగా వదిలిపెట్టి వచ్చాడు.

అయితే ఇప్పుడు తన గురువైన బాబా చెపుతున్నారు, ఆ గొర్రిని చంపమని దీక్షిత్‌కు బాగా తెలిసిన విషయమేమిటంటే గురువు ఆజ్ఞను పాటించకపోతే మహాపాపం చుట్టుకొంటుంది. దానికింక నిష్కృతిలేదు. ఇప్పుడు గురువు ఆజ్ఞను పాటించడంలో ఏమాత్రం ఆలస్యంచేసినా, అతడు ఇంతవరకూ కూడబెట్టిన పుణ్యం కాస్తా పోవడం ఖాయం. అందుచేత దీక్షిత్ వెంటనే ఒక కత్తిని తీసుకొని ఆగొర్రిని చంపడానికి చెయ్యిఎత్తేడు. ఇంతలో ఆశ్చర్యంగా బాబాయే ఆగు అని అరిచారు. కాకా ఏమిటిది? నీకు హృదయం లేదా? నువ్వు ఒక సద్బ్రాహ్మణుడివైయుండి కూడ ఒక మూగ జీవిని చంపుదామనుకున్నావా. నీ హృదయంలో దీని గురించి విచారణచేసావా?

బాబా అలా అనడంతో దీక్షిత్ ఇలా సమాధానం చెపుతున్నాడు. గురువు యొక్క ఆజ్ఞను తలదాల్చటం అన్నది శిష్యుడి యొక్క కనీస ధర్మం. (ఇది శిష్యుడికి హింధూమత సాంప్రదాయాన్ననుసరించిగాని, సామాజిక, నైతిక సిద్ధాంతాలనను సరించికాని, అనాది కాలం నుండీ వస్తున్న ఒక గురుతరమైన బాధ్యత) అందుచేత ఇంత కంటె గొప్ప ధర్మం ఇంకొకటిలేదని మన కందరకూ తెలిసిన విషయమే. నా దృష్టిలో మతమంటే గురువు ఆజ్ఞను శిరసావహించడమే. దీనివల్ల మననెవరూ చిన్న చూపు చూడరు, అవమానించరు. నిజం చెప్పాలంటే గురువు ఆజ్ఞను పాటించడంలోనే, ఒక శిష్యుడి యొక్క అసలు సిసలు శిష్యత్వం బయటపడుతుంది. దానికి విరుద్ధంగా గురువు ఆజ్ఞను ధిక్కరిస్తే, అది శిష్యుడికి మాయని మచ్చగా మిగిలిపోయి, నెత్తిన

పిడుగు పడినట్లవుతుంది. తత్ఫలితంగా అతడి పురోగతి దెబ్బ తింటుంది. ఇంక మన విషయానికొస్తే, మనకు తెలిసిందల్లా ఒకటే. అదే బాబా నామం ఎప్పటికీ మనలో గుర్తుండిపోవడం. అలాగే బాబారూపం మన కళ్ళల్లో ప్రతిబింబించడం. ఇంకా బాబా మాటకు కట్టుబడి ఉండడం. మనకి హింస, అహింసల గురించి చర్చ అనవసరం, ఎందుకంటే అదంతా సద్గురువు చూసుకుంటారు. ఆయనే మనకు రక్షకుడు. మనం గురువు ఆజ్ఞ గురించి ఆలోచించడం గాని ప్రశ్నించడం గాని చెయ్యకూడదు. మన ప్రాణాలు పోయినా కూడా ఆయన మాటను జవదాటకూడదు. ఒక్క విషయం గుర్తుపెట్టుకోవాలి. గురువు మాటను పెడ చెవిని పెట్టడమంటే అర్థం గురు కృపకు దూరమవడమే. కాబట్టి బాబా! మీ ఆజ్ఞకు మేము ఎప్పుడూ బద్ధులమే. ఇది మంచిదా కాదా అని అడిగే హక్కు మాకులేదు. అవసరమైతే మా ప్రాణాలను సైతం సమర్పించుకుంటాం కాని మీ మాటను ధిక్కరించం.

(ఇదంతా శ్రీసాయి సచ్చరిత్ర 23వ అధ్యాయంలో ఉంది.)

బాబాకు దయ జాలితోబాటు అమితమైన వినయం ఉంది. ఎప్పుడైనా ఏదైన శుభం జరిగినప్పుడు మాత్రం, అల్లా చాలా గొప్పవాడు. ప్రపంచంలో జరిగే ప్రతిపని అతని ఇచ్ఛ వల్లనే జరుగుతూ ఉంటుంది అనేవారు.

ఆ విధంగా అల్లాకి ఎప్పుడూ ఉన్నత స్థానాన్ని ఇస్తూ ఉండేవారు. సాయిభక్తుడు మాత్రం, సాయికృప వల్లనే అన్ని వింతలూ, విశేషాలు జరుగుతున్నాయని భావిస్తూ ఉంటాడు. కాని బాబా ఆ మహత్మ్యాన్ని అల్లాకు అప్ప చెప్పుతారు. సచ్చరిత్ర 34వ అధ్యాయంలో బాబా యొక్క వినయపూర్వకమైన లక్షణాల గురించి వర్ణన ఉంది.

షిరిడీకి దగ్గరలో శాల్వీ విహార్ అనబడే గ్రామం ఒకటుంది. ఆ గ్రామంలో శ్యామాకు చిన్న తమ్ముడైన బాపాజీ నివశిస్తున్నాడు. ఒకసారి బాపాజీ భార్యకు పెద్ద జ్వరం తగిలింది. దానితోబాటు మొల భాగంలో చర్మంపై బుడగలు వ్యాపించాయి. అదేకాలంలో మహారాష్ట్ర అంతా చర్మంపై బుడగలతో కూడుకొన్న ప్లేగు వ్యాధి

ప్రబలంగా ఉంది. అదే జబ్బు ఆమెకు కూడా సోకినట్లుంది. బాపాజీ షిరిడీకి పరుగెట్టి అన్న శ్యామాకు ఈ విషయం చెప్పాడు. అలవాటు ప్రకారం శ్యామా బాబాకు శరణాగతి చేసి ఈ విషయం వెల్లడించాడు. బాబా అది విని శ్యామాను మరునాడు చూసి రమ్మనమని చెప్పారు. ఇంకా ఆమె కొరకు ఊదిని బాపాజీకిచ్చి పంపించారు. బాబా చెప్పినట్లే బాపాజీ ఆమె శరీరానికి ఊది రాసి, కొంత భాగం నీళ్ళల్లో కలిపి త్రాగించాడు. దాని తరువాత ఆమెకు నిద్ర పట్టింది. మరునాడు ఉదయానికల్లా ఆ భయంకర వ్యాధి ఆమె నుండి తొలగిపోయింది. ఉదయం శ్యామా వచ్చేసరికి ఆమె మామ్మూలుగా పొయ్యి దగ్గర కూర్చుని టీ పెడుతోంది. శ్యామాకు చాలా సంతోషమనిపించింది. ఆమెను చూసిన తరువాత షిరిడికి తిరిగి వచ్చాడు.

అలా తిరిగి రాగానే బాబాను కల్సి ఇలా అన్నాడు. బాబా! మీరే మా మనస్సుల్లో అల్లకల్లోలం సృష్టిస్తున్నారు. అలా ఒక సుడిగుండం కల్పించి, తిరిగి మీరే దాన్ని శాంతపరుస్తున్నారు. దానికి సమాధానంగా బాబా ఏమన్నారంటే, నేను ఏదీ చేయటం లేదు, చేయించటం లేదు. అయితే అన్ని క్రియలకూ సంబంధించిన శక్తి మాత్రం నా ద్వారానే వస్తోంది. విధి వ్రాత ప్రకారం జరగవలసిన, జరుగుతున్న అన్ని కర్మలకూ నేను సాక్షిగా ఉంటాను. అన్ని కర్మలనూ చేసేవాడు, చేయించేవాడు పరమాత్మ ఒక్కడే. నేను భగవంతుణ్ని కాదు, ఆ పరమాత్మనూ కాదు. నేను యాదే హాక్ అంటే ఎల్లప్పుడూ భగవంతుణ్ని గుర్తు పెట్టుకొనే వాడిని. ఇంకా అల్లాకు నేనొక వినయపూర్వకమైన బానిసను. ( ఇదంతా 34వ అధ్యాయం , 128 నుండి 130 పాదాల్లో ఉంది).

అలాగే అధ్యాయం 2 పాదం 68, 69లో బాబా, నేను ఒక బిచ్చగాణ్ని అన్నారు. ఇంటింటికీ తిరిగి బిక్షను అడుక్కుంటూ, కూరలు ఉన్నా లేకపోయినా రొట్టిపై ఆధారపడి జీవించేవాడిని. ఆ విధంగా బ్రతుకుతున్న నా జీవిత చరిత్ర వ్రాస్తానంటావేమిటి? అని దబోల్కర్‌నుద్దేశించి బాబా అడిగారు. ఎందుకంటే అతడు శ్యామాను ప్రక్కన పెట్టుకుని బాబా దగ్గరకొచ్చి, మీ జీవిత చరిత్ర వ్రాస్తాను,

అనుమతించండి అని అడిగాడు.

మహారాష్ట్రలోని పల్లెటూర్లలో జనం అలవాటుగా మాజాపాయి లేక త్యాన్చాపాయీ అంటూ ఉంటారు. ఏదైనా సంఘటన జరిగితే దానికి కనబడే కారణం చూపెడుతూ ప్రజలు నోటివెంట ఈ మాటలు వస్తాయి. అంటే ఆ సంఘటనకు కనబడే కారణం నేనేనా అవచ్చు లేదా అతడేనా అవచ్చు. అనగా నేను కాని అతడు కాని పనిముట్ల వంటి వారిమే (నిమిత్త మాత్రులమే) అని అర్ధం. అంటే మేము అసలు కారణం కాదని దాని అంతరార్ధం.

అలాగే బాబా కూడా ఎంతో వినయంతో మాజాపాయీ అంటూ ఉంటారు. అనగా భగవంతుడైన అల్లాకు మీ భక్తి భావనను చేరవేసే ఒక పనిముట్టును లేక మధ్యవర్తిని మాత్రమే అని దాని అర్ధం. అంతేకాక ఆ అల్లాయే మీకు దీవెనలు అందిస్తాడని కూడా అంటూ ఉంటారు.

దీనిబట్టి బాబా ఎంత వినయపూర్వకంగా ఉండేవారో అర్ధమవుతుంది. అందుచేతనే స్వయంగా ఆయన కృపవల్ల లాభపడిన భక్తుల ధన్యవాదాలను కూడా ఆయన స్వీకరించడానికి ఇష్టపడే వారు కాదు. కాని బాబాపట్ల మనకు గల అపరిమితమైన భయభక్తుల వల్ల, ఇప్పుడు బాబా చెప్పే మాటలు జీర్ణించుకో లేకపోతున్నాం. మనం నిత్యం ఆయన పాదాలను శరణువేడుతూ ఉంటాం. మన ప్రార్థన ఇలా ఉండాలి. బాబా! మిమ్మల్ని కోరుతున్నాను, మీ పాదాల వద్ద నన్ను శరణార్ధిగా ఉండనివ్వండి . అప్పుడు మాత్రమే నన్ను మీరు కరుణించారని నేను అనుకొంటాను. ఇంకా నేను నా భక్తిని స్థిరపరుచుకోవటం కోసం ప్రయత్నిస్తూ ఉంటాను. ఎప్పటికీ మీరే నా దైవం. ఇదే మాట మళ్ళీ చెపుతున్నాను. మీరే నా దైవం. అందుచేత నా ప్రార్థన వినండి. నన్ను మీ నుండి ఒక్క క్షణం కూడా దూరం చెయ్యకండి. మిమ్మల్ని సదా గుర్తుపెట్టుకోవడం కోసం నేను ప్రయత్నం చేస్తూనే ఉంటాను. నా ప్రయత్నం సఫలమై ఉండేటట్లు నన్ను దీవించండి. బాబా! దయచేసి నన్ను క్షమించండి. అనేక తప్పులు చేసి నా జన్మను సార్ధకం చేసుకోలేని బలహీనుణ్ని. మీ పాదాల వద్ద శాశ్వితంగా చోటు కల్పించి

నన్ను రక్షించండి. మీ అభయ హస్తాన్ని నా తలపై పెట్టండి. మీ పాదాల చెంతకే నేను చేరేటట్లు అనుగ్రహించండి.

## మొదటి భాగం–ముగింపు

ఇంతవరకూ చెప్పినదంతా, బాబా చేసిన పదకొండు వాగ్ధానాల యొక్క గూఢార్ధ విశేషాలు. ఇదే ఇంకోమాటలో చెప్పాలంటే ప్రతి భక్తుడు కష్టపడి సాధించవలసిన ఆధ్యాత్మిక ప్రయాణం. దీని గమ్యం షిరిడి అని గుర్తుపెట్టుకోవాలి. ఆ ప్రకారంగా మొదటి వాగ్ధానంతో ఈ ప్రయాణం కూడా మొదలవుతుంది. ఆ వాగ్ధానంలో చెప్పినట్లుగా, మీ పాదాలు ఎప్పుడైతే షిరిడి నేలకు తాకుతాయో, అప్పుడే మీ బాధలన్నీ పోగొట్టబడతాయి. అయితే ఈ ప్రయాణం ముగిసేది ఎప్పుడు? ఎక్కడ? అనుకొంటే, బాబా అనుగ్రహం పొందినప్పుడు ముగుస్తుంది, ఇంకా బాబా పాదాల చెంత స్థానం సంపాదించగల్గినప్పుడు ముగుస్తుంది అని భావన చెయ్యాలి.

బాబా వాగ్ధానాలను ఆసరాగా చేసుకొని భక్తుడు ముముక్షువై (మోక్షాన్ని ఆశించేవాడై), ఇక్కడ చెప్పబోయే పరివర్తన సిద్ధాంతాలను ఆకళింపు చేసుకొని, ఆచరణలో పెట్టాలి. స్థిరమైన భక్తియోగ సాధనలతో, బాబాతో ఐక్యత చెందడమే ఈ పదకొండు వాగ్ధానాల సారాంశము. దీన్ని బోధించడానికే పదకొండు వాగ్ధానాలలోనూ బాబా ప్రయత్నం చేస్తూ వచ్చారు. అందుచేత పైపైని కనపడే బాహ్యార్థాన్ని మాత్రమే అర్థం చేసుకొంటే చాలదని గ్రహించాలి. ధ్యానం చేసి వాటి లోతైన తాత్పర్యాన్ని అందుకోవడం కోసం కృషి చెయ్యాలి. చివరగా నేను ఎంతో ఉత్సాహంగా ఆశించేది ఏమిటంటే, ప్రతి సాధకుడు ఈ రకమైన ఆధ్యాత్మిక ప్రయాణానికి నడుంబిగించి, బాబా పాదాల వద్ద చోటు సంపాదించాలి.

# రెండవ భాగం

## బాబా జ్ఞాన సాగరంలో ఆణిముత్యాలు

## ①

## బాబా చిలుం-ఇంద్రజాలం

ఇది, దాదర్ ముంబాయిలో నివశిస్తున్న శంకర్రావు నేరూర్కర్ అనే భక్తుడు చెప్పిన కథ.

మా కుటుంబం అంతా బాబాకు భక్తులమే. అటువంటి బాబా భక్తుల కుటుంబంలో పుట్టడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. మా నాన్నగారు బాబా భక్తుడు. ఆయన 94 సంవత్సరాలు జీవించి, 2003లో మరణించారు. మానాన్నగారికి భగవంతుడంటూ ఎవరైనా ఉంటే అది బాబాయే అని చెప్పాలి. ఆయన ఉదయం లేచింది మొదలు బాబా నామ జపం చేస్తూఉండే వారు. ఏది మాట్లాడినా బాబా గురించే మాట్లాడే వారు. ప్రతి రోజు సచ్చరిత్ర చదివేవారు. ఆ విధంగా మా ఇల్లు ఆధ్యాత్మిక శక్తితో నిండి ఉండేది. నాకు పిల్లనిచ్చిన మామగారు మనోహర్ దివాద్కర్ కూడా బాబా భక్తులే. ఆయనకు చిన్నతనంలో 4 సం॥రాల వయస్సున్నప్పుడు షిరిడి వెళ్ళి బాబాను చూసినట్లు చెపుతారు. ఇంక ఆయన తండ్రి రావు బహదూర్ దివాద్కర్ కూడా బాబాకు భక్తులేకాకుండా, బాబాతో సన్నిహితంగా మెలిగిన వారు. 1910 నుండి బాబా మహాసమాధి చెందిన 1918వ సంవత్సరం వరకూ ఆయనకు బాబాతో సంబంధం ప్రత్యక్షంగా ఉండేది. ఆ కాలంలో ఆయన తరచూ షిరిడికి వెళ్ళి వస్తూ ఉండేవారు. అక్కడ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు.

ఆయన సున్నితమైన మాట స్వభావం గల మనిషి. అలాగే దయాగుణం, పరోపకారం చేసే లక్షణం కల్గిన వారు. నిజం చెప్పాలంటే బాబాకు ఇష్టమైన రీతిలో ఆయన జీవితం సాగుతూ ఉండేది. ఆయనకు బాబాయే సద్గురువు. ఆయనే

దేముడు. ఉదయం నామ జపంతో మొదలై, రాత్రి బాబాకు ధన్యవాదాలు చెప్పుకొని పడుకొనేవారు.

ఒకసారి రావు బహుదూర్, అత్యంత ఆశ్చర్యకరమైన బాబాలీలను చెప్పుకుంటూ వచ్చారు. అవి ఆయన షిరిడిలో ఉండే రోజులు. ఆరోజుల్లో ద్వారకామాయి బాగా పాతబడిన కట్టడం. క్రింద భాగం మట్టినేల. ఆవుపేడతో అలికి ఉండేది. దానికి గర్భగుడిలా ఉండే స్థలంలో, రైలింగ్ ప్రక్కన బాబా కూర్చుంటూ ఉండేవారు. చుట్టూ భక్తులు కూర్చునేవారు. శ్యామా, మహల్సాపతి బాబా ప్రక్కనే కూర్చునేవారు. ఇంక దీక్షిత్, నిమోన్కర్, డెంగ్లే బాబాకు ఎదురుగా కూర్చునేవారు. ఎవరో ఒక భక్తుడు ప్రేమతో బాబా పాదాలు వత్తుతూ ఉండేవాడు. ఇంకొకరు బాబా వీపు భాగం వత్తేవాడు. ఆ సమయంలో రావు బహదూర్ ద్వారకామాయిలో అడుగుపెట్టి బాబాకు ఎదురుగా కూర్చున్నారు. అప్పుడు ఆయన ఒడిలో పిల్లవాడైన మనోహర్ ఉన్నాడు.

బాబా భక్తులతో మాట్లాడుతున్నారు. అదే సమయంలో శ్యామా బాబాకు చిలుము త్రాగడానికి అందించాడు. బాబా ఒకసారి అది పీల్చి ఇంకొక భక్తుడి కిచ్చారు. వారు తిరిగి గౌరవంగా అది బాబాకే ఇచ్చారు. మరొకసారి బాబా చిలుము పీల్చి, మిగతావారి కోసం ఇచ్చేవారు. కొంత సేపటికి బాబాకు బాగా దగ్గువచ్చింది. అది తీవ్రంగా ఉంది. అందుచేత రావు బహదుర్ చాలా బాధ పడ్డాడు. అలా అయినా కూడా బాబా చిలుం పీలుస్తూనే దగ్గుతున్నారు. అది చూడలేక రావు బహదుర్ కల్గించుకుని, బాబా! మీరు పొగ ఎక్కువగా త్రాగుతున్నారు. మీకు కడుపు నొప్పి పెట్టటంలేదా? అని అడిగాడు. అలా అడిగినందుకు బాబా కోపంతో అరుస్తారేమో అనుకున్నాడు. కాని బాబా ఒక నవ్వు నవ్వి, అరె! నువ్వుకూడా ఇలా వచ్చి ఈ చిలుం పీల్చు. ఇదుగో తీసుకో అన్నారు. కాని ఇంతకు ముందెన్నడూ చిలుం పొగత్రాగలేదు. అందుచేత, బాబా! నాకు పొగత్రాగడం అలవాటులేదు. కాబట్టి నేనిప్పుడు త్రాగలేను అన్నాడు. కాని బాబా ఊరుకోలేదు. బలవంతంగా త్రాగమని చిలుము చేతిలోపెట్టారు. రావుబహదుర్‌కి ఏమి చెయ్యాలో అర్థంకాలేదు. తిరిగి

బాబాయే, తీసుకో ఒకటి రెండు సార్లు పీల్చి ఏం జరుగుతుందో చూడు అన్నారు. ఇంక ఏమి చెయ్యలేక పోయాడు. గురువు ఆజ్ఞను పాటించకపోతే మహాపాపం చుట్టు కుంటుందని అతనికి తెలుసు. ఇప్పుడు అతను కాదనలేదు. ఒకవేళ కాదంటే ఇంతవరకూ సంపాదించిన దైవీ సంపద పోగొట్టుకోవల్సి వస్తుంది.

రావుబహదుర్, వణికే చేతుల్తో చిలుము తనపెదాల దగ్గర పెట్టుకుని ఒకసారి పీల్చేడు. తరువాత ఇంకొసారి అయ్యింది. బాబా ఉత్సాహపరుస్తున్నారు. మళ్ళీమళ్ళీ త్రాగమని. దానికి రావుబహదుర్ సరే అన్నాడు. కొంతసేపటికి మరొకసారి అలా పీల్చగానే, అదే చిలుమునుండి అమృతపు చుక్కలు నోట్లో పడుతున్నాయి. అవి కొంచం దళసరిగా, తియ్యగా, మంచి సువాసనతో చిలుము గొట్టం నుండి జారుతున్నాయి. రావుబహదుర్ వాటి రుచికి పరవశించిపోయాడు. అది చూసి బాబా లోలోపల నవ్వుకుంటున్నారు. అమృతపు బిందువులు అలా జాలు వారుతుండగా, రావుబహుదుర్ ఇక ఉండలేక, అదంతా బాబా కృప కాబట్టి, తన ఒడిలో కూర్చున్న చిన్నపిల్లడు మనోహర్ నోట్లో కూడా పెట్టాడు. తరువాత ఆ చిలుమును మిగతా భక్తులకు కూడా అందచేసాడు. ఎందుకంటే బాబా అనుగ్రహం అందరూ పొందాలని ఆ క్షణంలో అతను భావించాడు.

జరుగుతున్న తతంగమంతా బాబా చిరునవ్వుతో గమనిస్తున్నారు. అప్పుడు బాబా ఒకసారిపైకి చూసారు. అది ఎలా ఉందంటే బాబా స్వర్గలోకం వైపు చూస్తున్నారా? అన్నట్లుంది. అప్పుడు, అల్లామాలిక్, అల్లామాలిక్ అని రెండుసార్లు అన్నారు.

ఈ విధంగా బాబా భక్తుల ప్రారబ్ధాలను దహించివేసారు. అలా దహించగా మిగిలిన బూడిదను కూడా ఉండనివ్వకుండా ఊదిపారవేసారు. ఈ లీలతో భక్తులకు తన యొక్క అమృతపు కృపను పంచిపెట్టారు.

(ఇది శ్రీ సాయి ప్రసాద్ పత్రిక, దత్తజయంతి ప్రచురణ, 2004 నుండి గ్రహించబడింది)

## ②
## గురుపుష్య అమృత యోగం రోజున దీక్షిత్ బాబాను కలుసుకొనుట.

కాకాసాహెబ్ దీక్షిత్‌ను, కాకా అని, హరి సీతారాం దీక్షిత్ అని కూడా పిలుస్తూ ఉంటారు. అతడు ఒక గొప్ప ధనవంతుడు. ఇంకా పేరు పొందిన లాయరు. అతని కాలంలో ఎన్నో సంచలనాత్మకమైన వ్యాజ్యాలను గెలిచినవాడు. వాటిలో పెద్దవి, భావనగర్ బహిర్గతం వ్యాజ్యం, అలాగే దేశ ద్రోహానికి సంబంధించి వ్యాజ్యాలు అనేకం ఉన్నాయి. దీక్షిత్ స్వతహాగా మంచి ఉత్సాహవంతుడు, ఎన్నో ప్రజోపయోగమైన, రాజకీయమైన, సామాజికమైన, ఇంకా పురపాలక సంబంధమైన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజాసేవ చేసేవాడు. అతడికున్న చతురత మూలంగా, త్వరితగతిని జీవితంలో పురోగమించి గౌరవప్రదమైన ఉన్నత స్థానాలకు చేరుకున్నవాడు. ఇంకా అతడు తన వృత్తిలోనే కొనసాగి ఉంటే, దేశగౌరవానికి, ప్రతిష్టకు సంబంధించిన అనేక సత్కారాలను ఉదాహరణకు 'నైట్‌హుడ్' లాంటివి అనగా వీరత్వానికి, శూరత్వానికి లేక ప్రజాసేవకు మెచ్చుకుని ప్రభుత్వం వారు ఇచ్చే బిరుదులు, సత్కారాలను పొంది ఉండేవాడు. కాని యోగం అతడిని ఆధ్యాత్మికం వైపుకు, సాయిబాబా వైపుకు లాగుకొని వెళ్ళింది.

1906వ సంవత్సరంలో దీక్షిత్ చదువు నిమిత్తం ఇంగ్లాండు వెళ్ళాడు. అక్కడున్నప్పుడు ఒక ప్రమాదం జరిగి కాలుకి గాయం అయింది. ఆ గాయం ఎంత మంచి చికిత్స చేసినా పోలేదు. అందువల్ల అతను కాస్త కుంటుతూ నడవవల్సి వచ్చేది. ఇంకా నడుస్తున్నప్పుడు వచ్చే నొప్పి వల్ల ఎక్కువ దూరం నడవలేకపోయేవాడు. అది బయటకు తిరగడానికి ఇబ్బందిగానే కాకుండా, వైకల్యంగా కూడా కనపడడం వల్ల జీవితంలో కొన్ని ముఖ్యమైన పనుల్లో పాల్గోలేకపోయేవాడు. ఆ కారణంగా అతడికిష్టమైన అనేక రంగాల్లో ఉత్సాహంగా తిరగలేకపోయేవాడు. ఒకసారి నానా సాహెబ్ చందోర్కర్, దీక్షిత్‌ను కల్సి, షిరిడివెళ్ళి సాయిబాబాను దర్శించమని, ఆయన

దీక్షిత్ కాలుకున్న కుంటిని పోగొట్టగలరని చెప్పాడు. చందోర్కర్ చెప్పినట్లుగానే, దీక్షిత్ షిరిడి వెళ్ళి 1909లో బాబాను కలిశాడు.

శ్రీసాయి సచ్చరిత్ర, అధ్యాయం 4, పాదం 153లో కాకాసాహెబ్ దీక్షిత్, సాయిబాబాను కలవడం గురించి చాలా రమ్యంగా చెప్పబడింది. హేమాధిపంత్ దబోల్కర్ ఇలా వ్రాసారు. అదృష్టం కొద్దీ దీక్షిత్‌కు అటువంటి శుభదినం ఒకటి కలసి వచ్చింది. బాబాను దీక్షిత్ కలిసిన ఆ దినం నిజంగా అతడి జీవితంలో అమోఘమైంది. అది అంతకు పూర్వం దీక్షిత్ చేసుకున్న సుకృతం వల్ల ఫలించింది. దీక్షిత్ గొప్ప దైవ భక్తి పరాయణుడు. ఎన్నో యాత్రలు చేసి ఎన్నో తీర్థాలను దర్శించిన పుణ్యాత్ముడు. ఇదంతా అతడి పూర్వజన్మల పుణ్యఫలమని చెప్పవచ్చు. అదే ఇప్పుడతడిని షిరిడికి తీసుకుని వచ్చింది. నిజం చెప్పాలంటే దీక్షిత్ జ్ఞానసంపన్నుడు. అతడికి బాగా తెలుసు, ఈ దేహమన్నది క్షణికమని, ఎప్పటికైనా నశించేదే అని. అందువల్ల ఈ దేహానికి కల్గిన వైకల్యం (కుంటినడక) గురించి బాధపడడం అనవుసరమని కూడా తెలుసు. అయితే ఇంతకంటె, బాబా బాగుచెయ్యవలసింది ఇంకొకటి ఉందని అతని కోరిక. అదే అతడి మనసుకుండే కుంటితనం. ఇంతటి గొప్ప భావన దీక్షిత్‌కు కలగడానికి కూడా అతడి పూర్వజన్మలు పుణ్య ఫలితమే అని చెప్పవలసి ఉంటుంది.

ఈ గురుపుష్య యోగం గురించి వివరాలు ఇక్కడ చెప్పబడ్డాయి. ఇది ఒకశుభ సందర్భం, పవిత్రదినం, ఇది ఎప్పుడు కలుగుతుందంటే, గురు గ్రహం, పుష్యమి నక్షత్రంతో చక్కటి అమరికతో ఉన్నప్పుడు కలుగుతుంది. ఆరోజు సూర్యుడు ఉదయించడంతో మొదలై, ఆ రాత్రి సుమారు 10 గం॥ 30ని॥ల వరకూ ఉంటుంది. ఈ మధ్య కాలంలో అంటే మధ్యాహ్నం 12గం॥50 నిముషాల నుండి, 1 గం॥ 30 నిముషాల వరకూ ఉన్న సమయం చాలా శక్తివంతమైంది. భక్తుడు ఈ కాలంలో జరిపే పూజ కాని, ఉపాసన కాని అతడికి వందల రెట్లు ఫలితాన్నిస్తుంది. ఇంకా దాన ధర్మాలు చెయ్యడానికి కూడా చాలా మంచి కాలం. ఈ రోజున ఏ వస్తువైనా,

పసుపు రంగులో ఉన్నది దానమిస్తే శుభఫలితాలు సుమకూరుతాయని అంటారు. ఇంకా ఈ రంగులోనున్న పదార్థాలని ఇలా చెపుతూ ఉంటారు. అవి బంగారు నగలు, వస్త్రాలు, పప్పుదినుసులు, ఇంకా ఆ రంగులో ఉండే తీపి పదార్థాలు, జిలేబీ, లడ్డూ, బర్ఫీ మొదలైనవి. ఇంకొక విషయమేమిటంటే, పై వస్తువులు 12 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఇస్తే ఇంకా మంచిదంటారు. ఎందుకంటే అటువంటి పిల్లలందరూ భగవాన్ దత్తాత్రేయుల వారి ప్రతి రూపాలని, భగవాన్ దత్తాత్రేయులే అందరికీ సద్గురువుగా ఉన్నారని కూడా చెపుతారు.

కాబట్టి సాయిబాబా భక్తులందరూ ఇటువంటి పవిత్ర దినం వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచిది. ఆ కాలంలో సాయినామ జపం ఉత్తమమైన చర్య.

అయితే, కాకాసాహెబ్ దీక్షిత్ ఇంత మంచి యోగప్రదమైన రోజున బాబాను మొదటిసారిగ కలవడం జరిగింది. ఆరోజున బాబా దీక్షిత్‌ను చూసి ఇలా ఆశీర్వదించారు. దీక్షిత్! నువ్వెందుకు బాధపడుతున్నావు? ఎందుకు ఆత్రుతతో ఉన్నావు? ఇక నుంచి నీ బాధలు, ఆత్రుతలూ నావి. బాబా అన్న ఈ మాటలతో దీక్షిత్‌కు స్వస్థత కల్గింది. తన జీవిత కాలాన్నంతా బాబా సేవకే వినియోగించాడు. బాబాకు అత్యంత ప్రియమైన భక్తుడయ్యాడు. అతడి ఉపాసనకు మెచ్చిన బాబా దీక్షిత్‌తో ఇలా అన్నారు. దీక్షిత్! ఈనాటి నుండి నీకు మరణ భయముండదు. నిన్ను నేను విమానంలో తీసుకుని వెడతాను. “ఆ విధంగా బాబా దీక్షిత్‌కు అభయప్రధానం చేసి, మోక్షాన్ని కూడా ఇస్తానని ఒప్పకున్నారు. చివరకు బాబా చెప్పినట్లుగానే అంతా జరిగింది.

గమనిక: ఒక భక్తుడు సద్గురువు కోసం ఆరాటపడుతూ ఉంటే, అదిగమనించిన సదుర్గువే దానికి తగిన శుభ సమయాన్ని కల్పించి, ఆ భక్తుడిని తనవాడిగా చేసుకుంటాడు.

(ఇదంతా మరాఠీ భాషలో గోవింద్ రఘునాథ్ దభోల్కర్ వ్రాసిన శ్రీసాయి సచ్చరిత్రలో ఉంది)

# ③
# రాధాకృష్ణమాయి తనదైవ సన్నిధానమైన షిరిడి చేరుకొనుట

రాధాకృష్ణమాయి తన గురించి తాను చాలా తక్కువగా మాట్లాడుతుంది. అయినప్పటికీ, ఆమె వామనరావు అనే పేరుగల సాయి శరణానందకు ఈ విధంగా చెప్పుకుంది. నాకు చిన్నతనంలోనే పెళ్ళి అయింది. కాని పెళ్ళి అయిన వారం రోజుల్లోనే నా భర్త చనిపోయాడు. ఆ కాలంలోనే నేను సాయిబాబా దివ్యత్వం గురించి విన్నాను. నా భర్త పోయిన తరువాత నేను పండరిపురంలోగల నా మేనమామ ఇంటికి వెళ్ళవలసి వచ్చింది. నా మేనమామ పండరిపురంలో న్యాయవాద వృత్తిలో ఉండేవాడు. అక్కడ నేను ధర్మగ్రంథాలు, మత గ్రంథాలు చదువుకుంటూ, భగవంతుని కీర్తనలు పాడుకుంటూ కాలక్షేపం చేసేదాన్ని. మధ్యాహ్న సమయాల్లో, రద్దీ లేనప్పుడు పండరిపురంలో విఠల్ మందిరానికి వెళ్ళేదాన్ని.

ఇంకా షిరిడిసాయిబాబా అన్నా కూడా ఎక్కువ భక్తి ఉండేది. మనస్సులోనే బాబాను ధ్యానించేదాన్ని. ఒకసారి భోజనం ఎక్కువగా తినడం వల్ల నాకు పొత్తికడుపు నొప్పి మొదలైంది. అది ఎంత బాధ పెట్టిందంటే, అది భరించలేక నేను ఉండలు చుట్టుకొని నేల మీద పడి దొర్లి ఏడిచాను. ఆ క్షణంలో నాకు బాబా గుర్తుకు వచ్చారు. సాయిబాబా, సాయిబాబా అని గట్టిగా పిలుస్తూ ఏడిచాను. ఆశ్చర్యంగా, కడుపు నొప్పి మాయమైంది. ఇది జరిగిన కొన్ని రోజుల తరువాత నా జీవితాన్ని మలుపు త్రిప్పే ఒక కల వచ్చింది. దానితో ఇక నాకు ఈ భౌతిక ప్రపంచ విషయాల నుండి మానసికంగా, సంపూర్ణంగా విడుదల లభించింది. (ఇక్కడ ఒక ముఖ్య విషయం మాత్రం ఆమె చెప్పలేదు. అదే ఆమెకు వచ్చిన కల గురించి వివరాలు)

మరునాడు ఉదయం లేవగానే కల ప్రభావం బాగా కనిపించింది. నా ఒంటి మీద ఉండే నగలు అన్నీ తీసిపారవేసాను. అంతేకాక నేను అప్పుడు ఉండే ఇంటి నుండి బయటపడాలన్న నిర్ణయానికి కూడా వచ్చాను. మా బంధువులందరూ

నన్ను ఆపాలని చూసారు. చాలాసేపు అందరూ నాతో మాట్లాడి నా నిర్ణయాన్ని వెనక్కు తీసుకోమని బలవంతం చేసారు. కాని నేను మారలేదు. ఆ సమయంలోనే నేను ముందుగా చార్‌ధామ్ యాత్ర చేయాలనుకున్నాను. (ఇక్కడ చార్‌ధామ్ అంటే భారతదేశంలో గల ప్రముఖమైన నాలుగు పుణ్యక్షేత్రాలు బదరీనాథ్, పూరీ జగన్నాథ్, ద్వారక, రామేశ్వరాల గురించి చెప్పబడింది). ఈ యాత్రను నేను నా బంధువుల దగ్గర నుండి ఏ సహాయం ఆశించకుండా మొదలుపెట్టాను. ఇంటి నుండి నాకు కావల్సిన బట్టలను మాత్రం పట్టుకున్నాను. ఆ యాత్రా కాలంలో ఒక్కోసారి భోజనం కూడా లేకుండా పస్తులు ఉండవల్సి వచ్చేది. ఇంకా ఒకసారి ఆకలి తట్టుకోలేక ఆవు పేడను తిని ఊరుకొనే దాన్ని. డబ్బు ముట్టుకుందికి ఇష్టపడే దాన్ని కాదు. ఆ కారణం చేత నా దగ్గర డబ్బు ఏమీ ఉండేదికాదు. అలాగే విలువైనవేవీ కూడ ఉండేవికాదు. ఇంకా ఎవ్వరైన ఎదురుపడి నాకు సహాయం చెయ్యడానికి ముందుకు వస్తే, నేను అక్కడ నుండి వెళ్ళబోయే ఇంకో స్థలానికి ప్రయాణపు టిక్కట్టు మాత్రం కొనమని అడిగేదాన్ని. భగవంతుడైన విఠల్ నాథుడు నన్ను ఈ విదంగా కఠినమైన తపస్సు ఆచరిస్తూ తీర్థయాత్ర పూర్తి చెయ్యమని ఆజ్ఞాపించాడు. ఆ విధంగా నేను తీర్థయాత్ర ముగించుకొని షిరిడికి చేరాను. ఇక్కడ బాబా ఎదుట భక్త తుకారాం 'అభంగాలను' గానం చేస్తూ కాలం గడుపుతున్నాను. ఆ తరువాత రాధా కృష్ణమాయి, సాయి శరణనాందతో కొన్ని ఇతర విషయాలు కూడా మాట్లాడింది. వాటిలో బాలాజీ పాఠిల్ నెవస్కార్ చేసే నిస్వార్థమైన, త్యాగంతో కూడుకున్న బాబా సేవా కార్యక్రమాలు కూడా ఉన్నాయి.

మాయి ఇంకా చెబుతోంది, ఆ కాలంలో నెవస్కార్ ఒక ఉత్సాహవంతుడైన భక్తుడు. అతడు బాబా నడిచేదారి అంతా, లెండిభాగ్ వరకు చక్కగా తుడిచి ఉంచేవాడు. ఎంతో శ్రద్ధతో రోజూ తెల్లవారకుండగానే లేచి ఉండేవాడు. ఒక చీపురు పట్టుకుని, చావడి ముందు స్థలం, ద్వారకామాయి ఎదురుగా ఉన్నదారి, అలాగే బాబా లెండిభాగ్‌కు వెళ్ళేదారి, ఈ మొత్తమంతా తుడిచి ఉంచేవాడు. అక్కడున్న గ్రామస్తులందరూ, ఆ

దారిని చెత్తతో అపరిశుభ్రంగా చేస్తూ ఉండేవారు. అదేకాకుండా దారి పొడువునా వారందరూ మలమూత్ర విసర్జన చేసి పాడు చేసేవారు. నెవస్కార్ మాత్రం ఏమీ సంకోచించకుండా గ్రామస్తులు పాడుచేసిన వీధుల్ని ఎంతో ఉల్లాసంగా శుభ్రపరుస్తూ ఉండేవాడు. అతడి దృష్టికి అంతా బాబా మయంగానే కనుపించేది. నిజం చెప్పాలంటే బ్రహ్మవేత్తలకుండే సమత్వ భావన అతడు అలవాటు చేసుకున్నాడు. దాంతో ఈ దేహమే నేను అన్న సంకుచిత దృష్టి అతడికి లేకుండా పోయింది. బాబా సత్‌చిత్ ఆనంద స్వరూపాన్ని అంతటా దర్శించగలిగే స్థాయికి ఎదిగాడు. అందువల్ల దేహసంబంధమైన నేను, నాకు, నాది అన్న మాటలు అతడిని విడిచి పెట్టిపోయాయి. అతడి పరిస్థితి అంతా నేను గమనించేదాన్ని. నెమ్మదిగా, అతనికి సహాయపడుతూ, అతడి పనుల్ని నేను స్వాధీన పరుచుకున్నాను. కొంతకాలానికి నెవస్కార్ దేహాన్ని వదిలిపెట్టిపోయాడు. దాంతో ఆ పనులన్నీ ఆనందంగా నేను చేస్తూ ఉండేదాన్ని ఎంత చెత్త ఎవరెవరు పోస్తున్నారు అన్న ప్రశ్న నాలో పుట్టేది కాదు. ఏది ఎలా ఉన్నా అంతా శుభ్రం చెయ్యడమే పనిగా పెట్టుకున్నాను. (ఇది దాస్య భక్తికి ఒక మంచి ఉదాహరణ. దీనిలో ఆనందంతో సేవ చెయ్యడమే ముఖ్య కర్తవ్యం. ఒక సద్గురువుకు సేవకుడుగా ఉండడం అన్నది దాస్య భక్తికి పరాకాష్ట)

నిజంగా నెవస్కార్ దాస్యభక్తికి ఉదాహరణగా నిలిచినవాడు. అతడి జీవితం అందరికీ ఆదర్శప్రాయం. ఎన్నో పాఠాలు మనకందరకూ బోధిస్తుంది. నెవస్కార్ ఒక ధనవంతుడైన రైతు. భార్య, పిల్లలతో కలిసి పొలంలో నివశిస్తూ ఉండేవాడు. ప్రతి సంవత్సరం పంటదిగుబడి రాగానే, దాన్ని ద్వారకామాయికి తీసుకువచ్చి బాబా ముందు పెట్టేవాడు. ఆ పంటలో నుండి బాబా ఇచ్చిన దాన్ని ఆనందంగా తీసుకుని వెళ్ళేవాడు. దాంతోటే అతడి కుటుంబ పోషణ జరిగేది. ఆఖరుకు కట్టుకునే బట్టలు గురించి కూడా బాబా సలహా అడిగి, ఆయన చెప్పినట్లుగానే చేసేవాడు. ఇలా ఉండగా ఒకసారి అతడు భార్య పిల్లల్ని వదిలి పెట్టి బాబాతో ఉండడానికి నిర్ణయించుకుని షిరిడీకి వచ్చేసాడు. కాని బాబా అతడిని వారించి తిరిగి ఇంటికి

పంపించారు. ఇంకొకసారి భోజనం మానివేసి ఉపవాసాలు ప్రారంభించాడు. దాన్ని అడ్డుకోవడానికి బాబా తను తీసుకునే భక్రీని ప్రసాదంగా పంపించి తినమన్నారు. ఇంక అతడు త్రాగే మంచినీళ్ళు ఏమిటంటే, బాబా పాదాలు కడిగిన పవిత్ర జలాలు. ఇవి తప్పవేరే నీళ్ళు త్రాగేవాడుకాదు. అలాగే అతడు స్నానం చేసే నీళ్ళు కూడా బాబా స్నానం చెయ్యగా క్రిందపారిన నీళ్ళను సేకరించి తన స్నానానికి వాడుకొనేవాడు.

ఆటువంటి నెవాస్కర్ చాలా ప్రశాంతంగా దేహాన్ని వదిలిపెట్టిపోయాడు. భగవద్గీతలోని 8వ అధ్యాయంలో 13వ శ్లోకం యొక్క అర్థం, నెవాస్కర్ జీవితానికి సరిపోతుంది. ఆ శ్లోకం ఇలా ఉంటుంది.

**“ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామను స్మరన్।**
**యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాం గతిమ్॥”**

దీని తాత్పర్యం: ఎవడైతే పరబ్రహ్మ స్వరూపమైన ప్రణవాన్ని అనగా ఓం అనబడే ఏకాక్షరాన్ని ఉచ్చరిస్తూ, అదే సమయంలో నన్ను (ఆత్మ స్వరూపంగా ఉన్న నన్ను) స్మరిస్తూ ఉంటాడో, అతడు దేహమును విడిచిన వెంటనే పరమపదమును చేరును (అనగా బ్రహ్మమునందే లీనమగును). నెవాస్కర్ విషయంలో కూడ ఇలాగే జరిగింది. అతడు తన పార్థివదేహాన్ని వదిలిపెట్టి సద్గురు పాదాల చెంతకు చేరాడు. అదే అతడి పరంధామం. అతడి ఆత్మ అనంతాత్మలో లీనమయ్యింది. అనగా జన్మరాహిత్యాన్ని పొందగలిగాడు. రాధాకృష్ణమాయి చెప్పిన ఈ నెవాస్కర్ కథను బట్టి చూస్తే, నెవాస్కర్ పట్ల ఆమెకుండే గౌరవాభిమానాలు ఏపాటివో అర్థమవుతున్నాయి. నిజానికి ఆమెకు కూడా నెవాస్కర్‌తో సమానంగా గురు కృప లభించింది. అయినప్పటికీ నెవాస్కర్ నడిచిన మార్గంలో తనూ నడవాలని, తన జీవితాన్ని కూడా అతడి జీవితం మాదిరి ధన్యం చేసుకోవాలని ఆకాంక్షించింది.

మాయి ఇంకా తన కథని ఇలా చెపుతోంది. ఆ కాలంలోనే నేను ఒక పాఠశాల భవనంలో నివశించే దాన్ని. ఆ ఇంటి చుట్టూ అనేక తులసి మొక్కలు పెరిగి అదంతా ఒక వనంలా తయారైంది. అక్కడి గ్రామస్తులందరూ ఆ ప్రదేశాన్ని బృందావనం

అని పిలుస్తూ ఉండేవారు.

నేను మాత్రం నా కర్తవ్యాన్ని మౌనంగా పాటిస్తూ అప్పుడప్పుడు బాబాను దర్శించడానికి పోతూ ఉండేదానిని. ఇలా ఉండగా ఒకరోజు నాకు చాలా జ్వరం వచ్చింది. దాంతో నా ఆరోగ్యం పాడైంది. నా గదిలోకి పోయి పడుకుని ఉన్నాను. ఇంతలో బాబా స్వయంగా నా గదికి వచ్చి, నా నుదుటన ఊది రాసారు. మాయీ! నువ్వు ఎక్కువగా పని చేయవద్దు. ఇప్పుడు బాగా విశ్రాంతి తీసుకో అన్నారు. బాబా అలా వచ్చి వెళ్ళిన తరువాత నా జ్వరం తగ్గడం ప్రారంభించింది. కొద్దిరోజుల్లోనే నేను మళ్ళీ మామూలు స్థితికి వచ్చాను.

రేగే అనే భక్తుడొకరు ఇలా అన్నాడు. నేను మొదటిసారి షిరిడి వెళ్ళి బాబా దర్శనం చేసుకున్నప్పుడు మాష్టరు (బాబా)నాతో, అమ్మ దగ్గరకు వెళ్ళు అన్నారు. ఇక్కడ అమ్మ అంటే రాధా కృష్ణమాయి అని బాబా ఉద్దేశ్యం. బాబా మాయిని అమ్మ అని పిలుస్తూ ఉంటారు. నిజంగా ఆవిడ బాబాకు అమ్మే. నాకు కూడా అమ్మే. 1914వ సంవత్సరంలో గురుపూర్ణిమ పండగ వచ్చింది. అయితే ఆ పండుగకు నేను వెళ్ళగలనా లేదా అనుకునే వాడిని. ఆ పండుగనాడు అందరకూ కావల్సిన ఆహారం అమ్మ ఇంట్లోనే తయారు చెయ్యవలసి వచ్చింది. అమ్మ ఇలా అన్నారు. నువ్వు ఇక్కడకు రాకపోతే మాత్రం ఇంతపెద్ద వంట వేరే చోట చెయ్యవలసి వచ్చేది. ఆ గురుపూర్ణిమ రోజున అమ్మ ఇంటికి బాబాకు వచ్చిన బిక్ష నుండి పెద్దమొత్తంలో సంబారాలు వంట నిమిత్తం పంపబడ్డాయి. నేను వస్తున్నాను అని తెలిసిన తరువాత అమ్మ వంట చెయ్యడం మొదలు పెట్టారు. ఆ సమయంలో మసాలా దినుసులు దంచడానికి ఒకరాయి కావల్సి వచ్చింది. అప్పుడు అమ్మ ఇంటి గుమ్మంలో ఉన్న రాతి మెట్లు బాగా పనికి వచ్చాయి. అమ్మ, నేను కల్సి కష్టం మీద ఒక రాయిని కదిలించాము. పురందరే కాడా మాకు సహాయపడడానికి వచ్చారు. రాయిపైకి ఎత్తుతూ ఉంటే ప్రమాదవశాత్తు అది తిరగబడింది. ఒకరకంగా అయితే నా చెయ్యి నలిగిపోయి ఉండేది. కాని అమ్మ, నాకు దెబ్బ తగలకోడదని, రాతిని తన వైపు లాక్కుంది. దాంతో ఆమె చూపుడు వ్రేలు

మీద ఆ రాయి పడి, వ్రేలు నలిగిపోయింది. వెంటనే అమ్మ ఒక గుడ్డముక్కను నూనెలో తడిపి ఆ వ్రేలుకి చుట్టుకుంది. వంట యధాప్రకారం జరిగింది. అంతపనీ అయిన తరువాత అమ్మ నన్ను పిలిచి, తన వ్రేలు నలిగిపోయి విపరీతమైన సలుపు పెడుతోందని, దాన్ని తట్టుకోడానికి దగ్గరలోనే ఉన్న అడవికి పోయి గట్టిగా ఏడిచి వస్తాను అంది. అప్పుడు అమ్మతో నేనూ అడవికి వెళ్ళాను. అమ్మ ఆ వ్రేలు బాధకి గంట సేపు ఏడిచింది. తరువాత ఇంటికి తిరిగి వచ్చి, మిగతా పనంతా చేసాము.

ఇదంతా చూస్తూ ఉంటే ఎలా ఉంది? సద్గురు సేవలో ఉన్న భక్తులకు సుఖం గాని, దుఃఖంగాని ఏ రకమైన తేడా లేకుండానే అనుభవానికి వస్తూ ఉంటాయి. సద్గురువే భక్తులకు అండగా ఉండి, సుఖదుఃఖానుభవాల్ని అధిగమించే శక్తిని ప్రసాదిస్తారు.

ఇక్కడ అర్థం చేసుకోవలసిన ముఖ్య విషయం మరొకటి ఉంది. నెవాస్కర్‌గాని, రాధా కృష్ణమాయి గాని చేసిన పని ఏమిటంటే, బాహ్యంగా మనకు కనపడేది, వాళ్ళు వీధుల్ని శుభ్రం చెయ్యడం, మల మూత్రాలు విసర్జించిన ప్రదేశాల్ని కూడా తుడవడం కడగడం, బాబా నడిచే మార్గాన్ని పవిత్రంగా ఉంచడం మాత్రమే. వాళ్ళు చేసేది, మనకి కనపడనిది అయిన ఇంకొక కార్యక్రమం ఉంది. అదేమిటంటే వారి సద్గురువైన శ్రీసాయిబాబా నివశించే వారి అంతరంగాన్ని కూడా శుభ్రంగా, మలినరహితంగా ఉంచుకోవడమనే ప్రక్రియ. దాని అర్థం బయట చేసే మానవసేవే అంతరంగంలో మాధవసేవగా మారిపోతూ ఉంటుంది. ఇదే విధంగా మనం కూడా మన సద్గురువు నివశించే బాహ్యాన్ని, మన అంతరంగాన్ని కూడా పవిత్రంగా ఉంచుకోవాలి. దానివల్లనే మన అంతఃకరణ చతుష్టయం కూడా శుభ్రపడుతుంది. ఈ పవిత్ర కార్యక్రమమే సద్గురువును చేరడానికి తగిన మార్గాన్ని మనకి సూచిస్తుంది. మన హృదయంలో ప్రతిష్టితుడైయున్న సాయినాధుని ఆరాధించడానికి ముందుగా ఆ హృదయాన్ని పవిత్రంగా ఉంచుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉండాలి. సమర్థ సద్గురు సాయినాథ మహరాజ్‌కీ జై.

(ఇదంతా స్వామి సాయి శరణానంద రచించిన 'సాయి శరణం' అనే పుస్తకంలో ఉంది)

# 4
# సంగ్రహమైన ప్రేమభక్తి స్వరూపమే రాధా కృష్ణమాయి

నిస్వార్థమైన రాధాకృష్ణమాయి సేవలకు దీక్షిత్ చలించిపోయాడు. సద్గురువు పట్ల ఆమెకుండే భక్తి విశ్వాసాలే ఆమె సేవలకు రక్షణగా నిలిచాయి కాబట్టి దీక్షిత్‌కు మాయి అంటే ఎనలేని గౌరవభావం ఉండేది. మరాఠీలో ఉన్నటువంటి శ్రీసాయి సచ్చరిత్రకు ముందుమాట వ్రాస్తూ దీక్షిత్ ఇలా అంటాడు. రాధాకృష్ణమాయి అసలు పేరు సుంద్రా భాయి క్షీర్‌సాగర్. నిజంగా మాయి, మధుర భక్తికి ఒక మంచి ఉదాహరణ. అది ఎటువంటిదంటే శ్రీకృష్ణపరమాత్మ పట్ల గోపిలకుండే ప్రేమభక్తిలాంటిది. రాధా కృష్ణమాయి వద్ద భౌతిక సంపద ఏదీ లేదు. కానీ ఆమె, తన మనశ్శరీర ప్రాణాలను భగవంతుని సేవకు అంకితం చేసిన మహనీయురాలు. మాయి, షిరిడికి వచ్చిన భక్తులందరినీ, బాబా ఉపయోగించటానికి, ఇతరత్రా సేవలనిమిత్తం ఉపయోగపడటానికి రకరకాల వెండి పాత్రలు బహుకరించమని చెప్తూ ఉండేది. ఆ రకంగా ఆమె షిరిడీ సంస్థానానికి వ్యవస్థాపక సభ్యురాలైంది. కాని దురదృష్టం కొద్ది చిన్న వయసులోనే అనగా 35సంవత్సరాలకే మరణించింది. షిరిడీలో ఆమె నివసించిన కాలం 8 లేక 9 సంవత్సరాలు మాత్రమే. కానీ ఆమె సాధించిన ఆధ్యాత్మిక ప్రగతి మాత్రం ఇంకొక సాధకుడికి కనీసం 25 సంవత్సరాలు పడుతుంది.

ఒకసారి వామరావును ఆమె 250 రూపాయలు ఇమ్మనమని అడిగింది. ఆ మొత్తం ఇస్తే ద్వారకామాయి ప్రవేశ ద్వారం వద్ద ఒక పెద్ద దీపమాల ఏర్పాటు చేస్తానని చెప్పింది. దీపమాల అంటే పొడుగాటి సిమెంటు కట్టడం. దానికి రకరకాల వెడల్పులు గల మెట్లు ఉంటాయి. ఈ మెట్లు క్రింది భాగంలో ఎక్కువ వెడల్పుతో ఉండి పైకి పోతున్న కొద్దీ చిన్నవిగా ఉండి, చూడడానికి అదంతా త్రికోణాకారంలో ఉంటుంది. మెట్లు ప్రదేశంలో గోతులు ఏర్పరిచి, నూనె వత్తులు వేసి వెలిగిస్తారు.

మొత్తం లెక్కపెడితే, 108 దీపాలు పెట్టడానికి సరిపోతుంది. కాని పాపం వామనరావు దగ్గర 250 రూపాయలు లేవు. అందుచేత మాయికి డబ్బులు ఇవ్వలేక పోయాడు. ఈ కథ ఇలా ఉండగా కొన్నాళ్ళకు మాయి మరణించింది. అప్పుడు వామనరావు బాబా దగ్గరకు వచ్చి మాయి అనుకున్న దీపమాల నిర్మించడానికి అనుమతి కోరాడు. కాని బాబా దాని అవసరం ఇప్పుడు లేదని అన్నారు.

బాబా అలా అనగానే వామనరావు చాలా పశ్చాత్తాప పడ్డాడు. ఇంకా బాధపడ్డాడు. అప్పుడు మాయికి తను 250 రూపాయలు ఇచ్చి ఉంటే ఆమె కోరిక తీరి ఉండేది కదా! అనుకున్నాడు. తన దగ్గర డబ్బులేని కారణం చేత మాయి అనుకున్నది అవలేదు. కాని ఇప్పుడు డబ్బులు ఉన్నప్పటికీ బాబా వద్దని అంటున్నారు. అప్పుడే మాయి, బాబా అనుమతిని పొంది ఉంటే, దీపమాల నిర్మించడానికి అవకాశం ఉండేది. ఆలోచిస్తే, ఇక్కడ డబ్బు ప్రధానం కాదని బాబా అనుమతే ప్రధానమని తెలుస్తోంది. మాయి పలికిన మాటలు, ఆమె ఆలోచనలు బాబా మాటలతో సమానంగా ఉన్నాయని వామనరావు గుర్తుపట్టాడు. ఇది జరిగిన తరువాత ఒక సంవత్సరానికి బాబా మహాసమాధి తీసుకున్నారు. అప్పుడు వామనరావుకు ఒక విషయం అర్థమైంది. బాబా మహాసమాధి చెందుతున్నారు కాబట్టి. దీపమాల అవసరం లేదన్నారు. అప్పుడు కూడా రాధాకృష్ణమాయి మరణించబోతున్నది కాబట్టి దీపమాల కట్టడం కుదరలేదు. ఏది ఏమైనా బాబా అనుమతి పొందలేదు కాబట్టి దీపమాల కట్టడం ఎప్పటికీ అవలేదు.

సమర్థ సద్గురు సాయినాథులు సర్వవ్యాపకులు, సర్వశక్తిమంతులు, సర్వజ్ఞులు. అంతేకాక పరబ్రహ్మ స్వరూపులు. మన పూర్వజన్మల పుణ్యఫలం చేతమాత్రమే, ఏ కొద్దిగానైనా ఆయన యొక్క సేవ చేసుకోగలుగుతున్నాము. ఇది పరమ సత్యమని గ్రహించాలి.

ఈ కథ సారాంశంగా ఈ క్రింది విషయం చెప్పుకోవచ్చు. రాధా కృష్ణమాయి దీపమాలను కట్టడం కోసం వామనరావును 250 రూపాయలు అడిగింది. ఇక్కడ 250 రూపాయల అంతరార్థం చెపుతున్నారు. ఇది దేన్ని సూచిస్తోంది? రాధాకృష్ణమాయి ద్వారా బాబా ఇలా చెపుతున్నారు. ఆధ్యాత్మిక సాధకుడికి ముందుగా ఉండవల్సినవి ఈ రెండు ముఖ్య లక్షణాలు. ఒకటి ఆత్మానాత్మవివేకం రెండు వైరాగ్య భావన. ఈ శరీరం పాంచభౌతిక మైనది కాబట్టి 5 పంచ భూతాలను, అలాగే 5 ప్రాణాలను, అలాగే 5 ఇంద్రియాలను పరిగణలోనికి  తీసుకొంటే దీనిలో 5సంఖ్య యొక్క ప్రాముఖ్యత తెలుస్తోంది. తరువాత దేహభావనకు ప్రతీక అయిన అహంకారం, ఈ దేహమే నేను అనే భ్రమను కల్పిస్తోంది. కాబట్టి దాని విలువను సున్నాగా పరిగణించాలి. ఆ విధంగా 250 సంఖ్యను అర్థం చేసుకొంటే, 108 దీపాలు కల్గిన దీపమాల 250ను ఉపయోగించి కట్టవచ్చని తెలుస్తుంది. ఇంక దీపాలు వెలగడానికి కావల్సిన మూడు వస్తువులు, ఒకటి వత్తులు అదే నిస్వార్ధ సేవకు సూచికలు, రెండు నూని భక్తికి సూచిక మూడు దీపం వెలగడానికి కావల్సిన అగ్ని కణం సద్గురు కృప. అదే 108 దీపాలను వెలిగించి తద్వారా సాధకుడిలో జ్ఞానజ్యోతిని ఆవిష్కరిస్తుంది. ఇక్కడ ఇంకొక విషయం చెపుతున్నారు. అదే జీవ బ్రహ్మ ఐక్యం. జీవాత్మ పరంబ్రహ్మంతో ఐక్యమవడానికి సూచనగా 9 అంకెను ఈ విధంగా చూపెడుతున్నారు. 9=1+0+8

(ఇదంతా స్వామి సాయిశరణానంద  రచించిన 'సాయిశరణం' అనే పుస్తకంలో ఉంది)

## ⑤
## మనస్సును కఫినీ వస్త్రంలో బంధించుట

ఇప్పుడు చెప్పబోయే వాటిలో చాలా లీలలు, స్వామి సాయి శరణానంద గురించి చెపుతూ ఉంటాయి. ఎందుకంటే ఆయన జీవితమే మనకందరికీ ఎన్నో ముఖ్యమైన విలవులు కల్గిన పాఠాలను నేర్పుతుంది. రాధా కృష్ణమాయి, బాబా అడుగుజాడల్లో పయనించి స్వామి సాయి శరణానంద ఎన్నో ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించారు. మాయి, బాబా ఇద్దరూ కూడా ఒకేమాట, ఒకే బాటగా పనిచేసారు. వారిద్దరినీ చూసి స్వామి సాయి శరణానంద అదే మార్గంలో సాధన చేసి ఆధ్యాత్మిక గమ్యాన్ని చేరుకున్నారు.

స్వామి సాయి శరణానంద పూర్వ నామం వామనరావు ప్రాణ గోవింద పటేల్. ఇతడు 5-4-1889లో ధనవంతులైన, విద్యావంతులైన బ్రహ్మణ కుటుంబంలో పుట్టాడు. వీరి గ్రామం మోతాగాం. ఇది గుజరాత్‌లోని సూరత్ జిల్లా, బార్డోలీ తాలూకాలో ఉంది. 10-12-1911న వామనరావు మొదటిసారిగ షిరిడీ వచ్చాడు. నానాసాహెబ్ చందోర్కర్ నుండి ఒక పరిచయ పత్రం పట్టుకొచ్చాడు. అది అతని తండ్రి, వామనరావు షిరిడి వెళ్ళేముందు ఇచ్చింది. అప్పుడు వామనరావుతో బాటు, అతని స్నేహితుడు ఒక మార్వాడీ గూడ వచ్చాడు. ఇద్దరూ కల్సి టాంగాలో బాబాను చూడడానికి వచ్చారు. అదే సమయంలో బాబా లెండీ వనానికి వెళ్తున్నారు. అది చూసి టాంగా నడిపే మనిషి, చూడండి బాబా లెండీబాగ్‌కు వెడుతున్నారు అన్నాడు. వెంటనే వామనరావు, అతని మార్వాడీ స్నేహితుడు క్రిందికి దిగి బాబా ముందర సాష్టాంగం పడ్డారు. బాబా కోపంతో ఊగిపోయారు. వారిద్దరినీ అక్కడ నుండి తరిమి కొట్టారు. అయితే మధ్యాహ్న ఆరతికి ఇంకా చాలా సమయం ఉందని, కాబట్టి బాబాకి ముఖ్యమైన భక్తురాలు రాధాకృష్ణమాయిని చూద్దామని మార్వాడీ స్నేహితుడు చెప్పగా వారిద్దరూ బయలు దేరారు.

రాధాకృష్ణమాయి యింటికి వచ్చారు. అక్కడ ఆమె నేల మీద పద్మాసనంలో కూర్చొని ఉంది. ఎదురుగా చిన్న బల్ల మీద ఒక చిన్న ఇత్తడి ప్రతిమ, శ్రీకృష్ణునిది పెట్టబడి ఉంది. ఆమె తన జుట్టును క్రిందకు వదులుగా వేసుకుని కళ్లు మూసుకుని ఉంది. చేతిలో ఒక జపమాల పట్టుకుని భగవన్నామాన్ని జపిస్తోంది. వాళ్ళిద్దరూ ఆమెకు సాష్టాంగ నమస్కారం చేసి వెళ్ళిపోయారు. ఆ తరువాత వామనరావు రాదాకృష్ణమాయి గురించి వివరాలు కొంతమందిని అడిగి తెలుసుకున్నాడు. ఆమె ఆరాధించే కృష్ణుడి విగ్రహాన్ని ప్రేమతో చబ్బీ అని పిలుస్తూ ఉంటుంది. చబ్బీ అంటే ఆమెకు అమితమైన భక్తి. చబ్బీని ఆమె తన పిల్లడుగా ఊహించుకుంటుంది. ఆమె ఎక్కడికెళ్ళినా చబ్బీని కూడా పట్టుకుని వెళ్ళేది. చబ్బీని వదిలిపెట్టి క్షణమైనా ఉండేది కాదు. ఇలాగే రాత్రి పగలు గడిచేది. చబ్బీకి ప్రసాదం నైవేద్యంగా సమర్పించకుండా తను ఒక్క ముద్ద అయినా నోట్లో పెట్టుకొనేది కాదు. ఆ కారణం చేతనే కాబోలు ఊర్లో జనం అందరూ ఆమెను రాదా కృష్ణమాయి అని పిలుస్తూ ఉంటారు. బాబా కూడా ఆమెను 'రామకృష్ణి' అని పిలుస్తూ ఉండేవారు. అటువంటి రాధాకృష్ణమాయిని కలవాలని వామనరావు తహతహలాడేవాడు. అప్పటికి రాధాకృష్ణమాయి గురించి అతడికి తెలిసింది చాలా తక్కువ. బాబాకు, మాయికి మధ్య చక్కటి ఆద్యాత్మిక సంబంధం ఏర్పడి అది రాను రాను బాగా పెరుగుతుందని, తరువాత బాబాకు మాయి చాలా ముఖ్యమైన భక్తురాలుగా మారుతుందని వామనరావు ఊహించలేదు.

ఇంక వామనరావు విషయానికి వస్తే, అనేక జన్మల నుండి కర్మఫలం ఆధారం చేసుకొని, అతడికి రాధా కృష్ణమాయితో లోతైన ఋణానుబంధం ఉంది. అందుకే ఆయన పుస్తకాల్లో ఇలా ఉంది. నాకు మాయి ఎన్నో జన్మల నుండి తెలిసే ఉండి ఉండాలి. ఎందుకంటే నేను ఆమెను చూసిన మొదటి క్షణం నుండి, ఆమె నాకు అమ్మగా గోచరించేది. అంతేకాక నాకు కావల్సినవన్నీ చేసిపెట్టేది.

ఒకరోజు ఏం జరిగిందంటే, నన్ను చూసి వామన్యా! నువ్వు వేసుకున్న కఫినీ బాగా మాసిపోయి ఉంది చూసావా. అది నేను ఉతికి ఆరవేస్తాను ఇలా ఇచ్చి, నువ్వు

ఈ లోపున స్నానం చేసి రా అన్నది. నాకు ఆశ్చర్యం వేసింది. నేను స్నానం చేసి వచ్చే లోపల బట్టను ఉతికి ఎలా ఆరబెడుతుంది అనుకున్నాను. ఆ బట్ట రెండు పొరలతో ఉండి చాలా దళసరిగా ఉంటుంది. అందుకే అన్నాను, అమ్మా! ఇంత తక్కువ సమయంలో అంత ముతక చొక్కా ఎలా ఉతికి, ఆరవేస్తావు? ఒక ప్రక్క ఆరతికి సమయం అవుతోంది కదా! అంటే మాయి, నువ్వేం దిగులుపడక స్నానం చేసిరా! అని హామీ ఇచ్చింది. పది నిముషాల్లో వామనరావు స్నానం ముగించుకొని వచ్చి ఒళ్ళు తుడుచుకుంటున్నాడు. ఇంతలో మాయి తెల్లగా ఉతికి ఆరిన కఫినీ పట్టుకొని, వామన్యా! ఇదిగో నీ కఫినీ, ఇది వేసుకొని ఆరతికి వెళ్ళు అంది. వామనరావు ఆశ్చర్యానికి అంతులేదు. ఇంత తక్కువ సమయంలో దాన్ని ఎలా ఉతికి ఆరబెట్టిందో తెలీలేదు. అప్పుడు అతడికి ఒక విషయం అర్ధమయ్యింది. రాధాకృష్ణమాయి ఆధ్యాత్మికంగా బాగా ఎదిగిన మనిషే కాక కొన్ని సిద్ధులు (అతీంద్రియ శక్తులు) కూడా ఆమె కలిగి ఉందని.

ఆ రోజు మధ్యాహ్నం వామనరావు ద్వారకామాయికి వెళ్ళాడు. అక్కడ బాబా ఒక పాతబడిన ధోవతిని తీసుకుని చిన్న చిన్న ముక్కల క్రింద చించుతున్నారు. ఆ ముక్కలు సుమారు రెండు అంగుళాల వెడల్పు ఉంటాయి. అవి ఒక దర్జీవాడికి ఇచ్చి టేపుల్లాగ కుట్టనున్నారు. అలాగే దర్జీవాడిని, తలకి చుట్టుకొనే బట్టను కొని తెమ్మనమని చెప్పారు. ఆ గుడ్డ సుమారు 5 అడుగుల పొడవు $2^{1/2}$అడుగుల వెడల్పు కల్గి ఉంటుంది. దానితో బాటు 18 గజాలున్న మంజారపత్ అనబడే కాస్త ముతక నేత బట్టను కొనమన్నారు. దాంతో కఫినీ కుడతారు. ఆ కఫినీ రెండు పొరలు కల్గి ఉంటుంది. వామనరావు ఇలా వ్రాస్తున్నాడు. మొదట్లో నేను తెలియక పలుచగా ఉండే బట్టను వేసుకొనే వాడిని. అది చూసి జనం నవ్వేవారు. చనిపోయిన వాడిని పెట్టేపాడెకు అది కడతారు. అది తెలిసిన తరువాత, ముతకది, దళసరిగా ఉండి రెండు పొరలతో ఉండే కఫినీ తొడగడం ప్రారంభించాను.

ఒక ఆసక్తికరమైనని విషయం ఏమిటంటే, బాబా దేన్నీ కూడా వృధా చేసేవారు

కాదు. ఆయన దగ్గర ఒక కిటుకు ఉంది. ఏమిటంటే పనికిరానిదేనైనా పనికొచ్చే రకంగా మార్చుకోవటం. పాత దోవతిని చింపి ముక్కలుగా చేసి, వాటితో త్రాళ్ళు తయారు చేసేవారు. మద్యాహ్న వేళల్లో కూర్చోని, పాతబడిన కఫినీలను చింపి, పలుచటి గుడ్డ ముక్కలుగా చేసి, ఆ గుడ్డముక్కలు చుట్టి దీపపు వత్తులుగా తయారు చేసేవారు.

ఇప్పుడు కఫిని గురించి కొంత తెలుసుకుందాం. కఫిని అన్నది ఒక ప్రత్యేకమైన పొడవాటి చొక్కా. సర్వ సంగపరిత్యాగులు మాత్రమే దీన్ని ధరిస్తూ ఉంటారు. కాని కొద్దిమంది గృహస్తులు, భార్య పిల్లలు బంధువులతో కలిసి ఉన్నప్పటికీ మానసికంగా వారితో సంబంధం లేకుండా ఉంటారు. అటువంటి మానసిక సన్యాసులు కూడా కఫినీ కట్టుకుంటారు . మానసికంగా సన్యశించామని చెప్పి బరువు బాధ్యతల నుండి తప్పించుకోరు. తమ గృహస్థ ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటారు. దయ, జాలి కల్గి తమ సామాజిక కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉంటారు. కఫినీని ధరించిన మనిషిని దైవ సంబంధమైన వ్యక్తిగా సమాజం గుర్తిస్తుంది. అతడు ఎప్పుడూ ఋజు ప్రవర్తన కలిగి ఉంటాడు. అటువంటి వ్యక్తి చనిపోతే, ఎవరైతే ఆ దేహం మీద కఫినీని కప్పి ఉంచుతారో, అది చాలా గౌరవప్రదమైన చర్య అని అనుకుంటారు.

ఇంకొక సందర్భంలో మాయి, వామనరావు చావడికి ఎదురుగా ఉండే స్థలంలో ఆరతి కార్యక్రమానికి హాజరు అయ్యారు. మాయి వున్న స్థలానికి సుమారు ఆరు అడుగుల దూరంలో వామనరావు నిలబడి ఉన్నాడు. మాయి తన కుడి చేతితో శ్రీకృష్ణుని చిన్ని ప్రతిమను (చబ్బీని) పట్టుకుని నిల్చుంది. ఇంతలో వామనరావు మోచేతికి ఒకరకమైన వేడి తగలడం ప్రారంభించింది. ఆ చెయ్యి అంతా కాలి బొబ్బ లెక్కుతుందేమోనని భయపడ్డాడు. వామనరావు, అంతవేడి ఎక్కడ నుండి వస్తున్నదని చుట్టూ కలయ చూసాడు. అప్పుడతడికి అర్థమయ్యింది. మాయి నిల్చున్న దగ్గర నుండి వేడి పుడుతోందని. ఇంకొంచెం జాగ్రర్తగా పరిశీలించాడు. ఆశ్చర్యమేసింది మాయి చేతిలో ఉన్న శ్రీ కృష్ణుని ప్రతిమ ఎర్రగా కాల్తూ అప్పుడే కొలిమిలో నుండి బయటకు తీసినట్లుంది. కాని మాయి మాత్రం ఎటువంటి చలనం లేకుండా నిలబడి ఉంది.

ఆమెకు ఏ వేడి తగిలినట్లులేదు.

దీనికి సారాంశం ఈ విధంగా చెప్పుకోవచ్చు. సర్వసంగ పరిత్యాగియే కఫినీని ధరిస్తాడు. ఇంకా చెప్పాలంటే ఎటువంటి బంధాలు లేనివాడై ఒక చచ్చిన మనిషిలాగ ఉంటాడు. కాని ప్రాణం అన్నది ఉంది కాబట్టి నలుగురిలోనూ కలిసిమెలిసి తిరుగుతూ ఉంటాడు. అతడిలో ఈ బంధరాహిత్యం అంతకంతకూ పెరుగుతూ ఉంటుంది. చివరకు తనకు ఏ బంధాలు లేవు అన్న విషయం కూడా గుర్తులేని స్థితికి చేరుకుంటాడు. అందుచేత కఫినీ అన్నది ఒక్క బాహ్యానికి సంబంధించిన విషయమే కాదు. అది సాధనా రహస్యంతో నిండిన ఒక ముసుగు అనుకొంటే, అప్పుడు మన మనస్సు అనే పరికరం ఆ ముసుగులో కనపడకుండా మూసుకు పోయినట్లు భావన చెయ్యాలి. దాంతో అది ఇంక బాహ్య విషయాల పట్ల ఆశక్తిని వీడి జితేంద్రియ స్థితికి చేరుకుంటుంది. దీన్నే అమనస్కయోగం అని కూడ అంటారు. అటువంటి యోగికి పాడెతో ఇంక పనిలేదు. ఇక్కడ పాడె అన్నమాట దేన్ని సూచిస్తుందంటే, సంసార మయమైన ప్రపంచాన్ని సూచిస్తుంది. ఇది అరిషడ్వర్గాలతో కలిసి జీవిస్తుంది. ఇవే కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు. వీటినే ఆరు అంతర్గత శత్రువు లంటారు. మనం వీటి బారి నుండి బయట పడడానికే ప్రయత్నం చెయ్యాలి. సంసారిక విషయాల పట్ల మనం చచ్చిన మనిషిలా ఉండాలి. అప్పుడే మన సాధన ఫలించినట్లు లెక్క. అప్పుడే బాబా చూపిన మార్గంలో మనం ప్రయాణం సాగించగలం. రెండు పొరలు కల్గిన బట్టతో కుట్టిన బాబా కఫినీయే మనకు శ్రీరామరక్షగా నిలుస్తుంది.

(ఇదంతా స్వామి సాయి శరణానంద రచించిన 'సాయిశరణం' అనే పుస్తకంలో ఉంది)

# ⑥
# ఎంతో విలువైన బాబా ప్రసాదాన్ని బయట పారవెయ్యవద్దు

వామనరావు సనాతన బ్రాహ్మణ కుటుంబానికి చెందిన మనిషి. అందువల్లనే అతడి ఆహారపు అలవాట్లు చాలా కఠినంగా ఉంటాయి. ఏకాదశి రోజున అతను ఉల్లిపాయను అస్సలు ముట్టుకోడు. 1911లో వామనరావు మొదటిసారిగ షిరిడీ రావడం జరిగింది. అప్పుడు అతని తండ్రి ఒక మంచి సలహా ఇచ్చాడు. బాబా ఏదైనా ప్రసాదం నీకు యిచ్చినట్లయితే, అది ఏదైనా కాని, నువ్వు దాన్ని బయట పారవెయ్యకు. ఒకవేళ బాబా ఇచ్చిన ప్రసాదంలో చిన్న మాంసపు ముక్కలుగాని ఉన్నా, దాన్ని నువ్వు భద్రంగా దాచు అన్నాడు. వామనరావుకి ఆశ్చర్యమేసింది. ఎంతో సనాతన బ్రాహ్మణ కులంలో పుట్టిన తన తండ్రేనా ఈ మాటలు చెపుతున్నది అనుకొన్నాడు. తండ్రి చెప్పిన మాట అక్షరాలా పాఠిస్తానని చెప్పి షిరిడీకి బయలు దేరాడు.

దానికి సంబంధించిన లీల ఒకటి ఇక్కడ చెపుతున్నారు.

ఒకసారి ఇలాగే సనాతన బ్రాహ్మణ కులంలో పుట్టిన వ్యక్తి బాబాను దర్శించాలని వచ్చాడు. అతడు చాలా పేదవాడు. భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. వారిని పోషించటానికి కూడా అతని దగ్గర డబ్బు లేదు. అతడి పేదరికాన్ని చూసి బాబా చలించిపోయారు. అప్పుడు బాబా అతడిని దగ్గరకు పిలిచి నాలుగు మాంసపు ముక్కలు ప్రసాదంగా యిచ్చి, ఇది నీ నలుగురు కొడుకులకు సరిపోతుంది తీసుకొని వెళ్ళు అన్నారు. ఆ బ్రాహ్మణుడు తన ఉత్తరీయంలో నాలుగు మాంసపు ముక్కలను కట్టుకుని బయటకు వచ్చాడు. చాలా దూరం వచ్చి, తను ఎవ్వరికీ కనపడ లేదు కదా! అని చూసుకొని ఇలా అనుకున్నాడు. బ్రాహ్మణుడనైన నాకు బాబా ఈ విధంగా మాంసపు ముక్కలు ప్రసాదంగా ఇవ్వడమేమిటని అసహ్యించుకొన్నాడు. తొందరగా వెళ్ళి అక్కడకు దగ్గరలో ఉన్న ఒక కాలువకు వచ్చాడు. కాలువలో నీరు పారుతోంది. ఆ ప్రసాదాన్ని

కాలువలో పారవేసి ఉత్తరీయం కడుగు కుందామనుకొని కూర్చున్నాడు. కాని ఆ ఉత్తరీయంలో ఏదో ఒకటి ఉండిపోయినట్లు అనిపించింది. అదేదో ఎముక ముక్క అనుకొన్నాడు. గట్టిగా ఉత్తరీయం దులిపాడు. ఆశ్చర్యంగా దానిలో నుండి ఒక బంగారు ముక్క 12 గ్రాములు బరువు కలిగింది బయటపడింది. అయ్యో! ఎంత తప్పు చేసానని మిగతా ముక్కల కోసం వెదికాడు. కాని నీటిలో పడిపోయిన మూడు ముక్కలు కొట్టుకుపోయాయి.

వామనరావు చెపుతున్నాడు. అందుకే మా నాన్నగారు బాబా యిచ్చిన ఏ ప్రసాదాన్నైనా పారవెయ్యవద్దని అన్నారు. బహుసా ఈ సాయిలీల ఆయన బాబాజీ బాబూజీ జగతాప్ నుండి విని ఉంటారు. జగతాప్ చాలా కాలం షిరిడిలో నివశించారు.

దీని సారాంశాన్ని ఈ విధంగా చెప్పుకోవచ్చు. మనకందరకూ జీవితావసరాల నిమిత్తం డబ్బు కావాలి. దీన్నే శాస్త్రంలో అర్ధం అని అంటారు. అయితే దాన్ని నీతి నిజాయితీగా సంపాదించవలసి ఉంటుంది. ధర్మాన్ని పాటిస్తూ, అర్ధాన్ని పొందమని శాస్త్రం చెపుతుంది. మనం మన కోరికలు తీరడం కోసం ధర్మం ప్రకారం ధనాన్ని సంపాదించాలి. చివరన ఏ రకమైన కోరిక లేకుండా బాబాను ప్రార్థించాలి. దాని ద్వారా మోక్షాన్ని పొందటానికి అర్హత పొందుతాము. బాబా ఎంతో దయతో మన చేత పురుషార్ధ సాధన చేయించాలని తపనపడుతూ ఉంటారు. అనగా ధర్మ అర్ధ కామ మోక్షాల్ని వరుసక్రమంలో పొందడానికి గాను తగిన సాధన చేయిద్దామని అనుకొన్నా మనం అవివేకంతో ఒక్క డబ్బు సంపాదన మీదనే దృష్టి పెడుతూ ఉంటాము. మిగతా మూడు పురుషార్ధాలపట్ల శ్రద్ధ కనబరచం. ఈ లీల ద్వారా మనం తెలుసుకోవల్సింది అదే. ఆ మూడు అనగా ధర్మ, కామ, మోక్షాల్ని బయటకు నెట్టి ఒక్క అర్థాన్ని అంటే డబ్బును దగ్గర పెట్టుకోవడమే అవివేక చర్య. అందుకే వామనరావు తండ్రి బాబా ప్రసాదాన్ని భద్రంగా దాచమని సలహా ఇచ్చారు.

(ఇదంతా స్వామిసాయిశరణానంద రచించిన సాయిశరణం పుస్తకం నుండి గ్రహించ బడింది)

# 7

## మనం పుటిన క్షణం నుండే బాబా సంరక్షణలో ఉంటాం

బాబా వామనరావును బాబు అని పిలుస్తూ ఉంటారు. ఒక సారి బాబా తన రెండు అరచేతులను దొన్నె ఆకారంలో పెట్టి ఇలా అన్నారు. బాబును చిన్నతనం నుండే, ఎంత చిన్నతనమంటే అతడు ఒక ఎలుకపిల్ల అంత చిన్నగా ఉన్నప్పటి నుండి నేను ఎరుగుదును. అప్పటి నుండి అతడి సంరక్షణ నేనే చూసుకుంటున్నాను. బాబా మాటలు విన్న వామనరావు, ఇది నిజమేనా అని తన తల్లిని అడిగాడు. ఆవిడ నిజమే అని చెప్పి దానికి సంబంధించిన ఒక లీలను చెప్పసాగింది.

అప్పుడు వామనరావు వయస్సు 5 సంవత్సరాలు. అతని తండ్రి ధరాసనా ఉప్పు డిపోలో ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబం ఒక గుడారంలో ఉండేవారు. చిన్నపిల్లడైన వామనరావుకు జబ్బు చేసింది. కడుపులో ప్రేగులకు సంబంధించిన వ్యాధి వచ్చింది. విరోచనాలు, వాంతులు అవుతూ ఉండేవి. పరిస్థితి అంతకంతకూ విషమిస్తోంది. దానితో తల్లిదండ్రులు పిల్లాడింక బ్రతకడన్న నిశ్చయానికి వచ్చారు. అలాంటి పరిస్థితిలో ఒక మధ్యాహ్నం తల్లి, పిల్లడిని వొళ్ళో కూర్చోబెట్టుకుని, గుడారం బయట కూర్చుంది. పిల్లడి ఆరోగ్యం కుదుట పడాలని భగవంతుణ్ణి అదేపనిగా ప్రార్థిస్తోంది. ఇంతలో అకస్మాత్తుగా ఒక ఫకీరు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. వారిద్దరి మధ్యా సంభాషణ ఈ రకంగా జరిగింది.

ఫకీరు:– నీ పిల్లడు మంచి అదృష్టవంతుడుమ్మా. మణిగౌరి (వామనరావు తల్లి): అయ్యా! ఈ పిల్లడినా మీరు అదృష్టవంతుడంటున్నారు. ఎడతెరపి లేకుండా విరోచనాలు, వాంతులతో బాధపడుతున్నాడు. వీడు బ్రతుకుతాడని మాకు నమ్మకం లేదు. ఫకీరు: అలాగ అనకమ్మా! ఈ కుర్రవాడు చాలా అదృష్టవంతుడే. వీడికి కుడి చెయ్యి చంక భాగంలో ఒకపుట్టు మచ్చ ఉంది. అలాగే ఇంకొక మచ్చ నడుముకు కుడి ప్రక్క కూడా ఉంది. వీడు చాలా కాలం బ్రతుకుతాడని నేను అనుకుంటున్నాను.

మణిగౌరి ఆ ఫకీరు మాటలు విని పిల్లవాడి చొక్కా ఎత్తి చూసింది. ఫకీరు చెప్పినట్లుగానే రెండు ప్రదేశాల్లో రెండు పుట్టు మచ్చలున్నాయి. కాని ఇలా అంది. నేను భయపడుతున్నాను. అతడి పరిస్థితి క్షణక్షణం దిగజారుతోంది. ఇంక బ్రతకడేమో అనిపిస్తోంది.

ఫకీరు : ఈ విభూది తీసుకో. కాస్త ఆ పిల్లడి నోటిలో వెయ్యి అంతా సర్దుకుంటుంది అని ఒక విభూది పేకెట్టు ఇచ్చి వెళ్ళిపోయాడు.

మణిగౌరి, ఆ ఫకీరు చెపినట్లే చేసింది. వామనరావు పరిస్థితి మెరుగుపడడం ప్రారంభించింది. కొద్ది రోజులకే అతడు ఆరోగ్యవంతుడయ్యాడు.

అలాగే వామనరావుకు ఏడు సంవత్సరాల వయస్సున్నప్పుడు, తండ్రికి బదిలీ అయింది. ఆ ఊరు పేరు ఖేడా. అక్కడే అతడు చదువుకుందికి స్కూలుకు వెళ్ళి వస్తూ వుండేవాడు. ఒకసారి వామనరావుకు తల్లిదండ్రులు, చెల్లితో కలిసి గుజరాత్‌లోని సోమానాథ్ దేవాలయం సందర్శన భాగ్యం కల్గింది. ఆశ్చర్యంగా అతడికి సోమనాథ్ లింగంలో ఒక ఫకీరు రూపం దర్శనమిచ్చింది. ఆ సంఘటన తరువాత కూడా వామనరావు స్కూలుకు వెళ్ళినప్పుడు ఆ ఫకీరు తారసపడుతూ, చిలిపి చేష్టలతో వెంటపడుతూ ఉండేవాడు. ఆ విధంగా అతడు ఫకీరును చాలాసార్లు చూడడం జరిగింది. ఆ తరువాత 1911లో వామనరావు షిరిడి వచ్చినప్పుడు బాబాను చూసి గుర్తు పట్టాడు. చిన్న తనంలో ఖేడాలో తనను అల్లరి పెట్టిన ఫకీరు ఇతడే అని నిర్ధారణకు వచ్చాడు.

ఈ కథ సారాంశమేమిటంటే, బాబా మన అందరినీ అల్లరిపెడుతూ, మనతో ఆటలాడుతూ, కొన్ని కష్టాలు కల్గిస్తూ మనల్ని పరీక్షిస్తూ ఉంటారు. కాని ఒకటి మాత్రం నిజం. ఆటపట్టించడంలో అంతరార్థం, బాబా మన వెనకనే ఉండి మనకు రక్షకుడుగా ఉంటున్నారని తెలుసుకోవాలి. ఇది ఎప్పటి నుండి జరుగుతున్నది అనుకుంటే, మనం జన్మించిన దగ్గర నుండీ అని వెనక ఎవరో నిలబడి సమాధానం చెప్పినట్లు ఉంటుంది.

(ఇదంతా స్వామిసాయి శరణానంద రచించిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)

## ⑧

## వామనరావు తన సద్గురువైన సాయినాధుని చేరుకోగలిగాడు.

వామనరావుకు చిన్నతనం నుండీ ఇంట్లో భక్తి సంబంధమైన వాతావరణం ఉండేది. ఆ కారణంగా అతడి మనస్సు కూడా భగవంతుడు, భక్తి, మతం అనే విషయాల్లోనే తిరుగుతూ ఉండేది. అలాగే చిన్నప్పుడు అనేక స్తోత్రాలు చదువుతూ ఉండేవాడు. అవే శ్రీ రామరక్షా స్తోత్రం, విష్ణు సహస్రనామావళి, ఆదిత్య హృదయం మొదలైనవి.

అయితే అతడు కాలేజీ చదువుల్లో ప్రవేశించగానే, ఎందువలనో అతడికి పూజలు, స్తోత్ర పారాయణలు నచ్చలేదు. అందుచేత అవన్నీ చేయడం మానుకున్నాడు. కాని దానివల్ల అతడి మనస్సు కకలావికలం అయింది. మనశ్శాంతి లేకుండా పోయింది. ఎందుకైనా మంచిదని తిరిగి ఆ స్తోత్రాలు, స్నానం చేస్తున్నప్పుడు, రాత్రి పడుకొనే ముందు చదవడం ప్రారంభించాడు. అదేపనిగా భగవద్గీతను కూడా చదివేవాడు. దానితో అతడి మనస్సు గందరగోళం నుంచి తప్పుకుని శాంతించింది. అలాగే అనేక గ్రంథాలు చదవడం మొదలు పెట్టేడు. అప్పుడు అతడికి ఒక విషయం అర్థమయ్యింది. భగవదనుభూతి కలగాలంటే నిత్యానిత్య వస్తు వివేకం తప్పనిసరి అని గ్రహించాడు. అనిత్య వస్తువుల్ని వదులుకుంటేనే భగవంతుడి నిజస్వరూపాన్ని అవగాహనకు తెచ్చుకోగలమన్న నిర్ణయానికి వచ్చాడు.

వామనరావు  బాగా తెలివైన విద్యార్థి. ఇంటర్ ఆర్ట్సు పరీక్షల్లో అత్యధికమైన మార్కులతో పాసై డిగ్రీ పరీక్ష పూర్తి చేశాడు. డిగ్రీలో అతడి పాఠ్యాంశాలుగా, తర్కం, నైతిక తత్త్వ శాస్త్రం ఉండేవి. అతడు చదువుకున్న కాలేజీ పేరు ఎల్ఫిన్ స్టోన్ కాలేజీ దాంట్లో ఆర్.ఎస్. మార్స్ అతనికి ప్రొఫెసర్‌గా ఉండేవాడు. ఈ ప్రొఫెసర్ జర్మన్, గ్రీకు భాషల్లో మహాపండితుడు. జర్మన్ తత్త్వవేత్త 'ఇమ్మాన్యుల్ కాంట్' సిద్ధాంతాన్ని

బాగా ఆకళింపు చేసుకున్నవాడు. విద్యార్థులందరికీ అతడంటే చాలా గౌరవం. వామన రావు చాలా శ్రద్ధగా కాంట్ సిద్ధాంతాన్ని అధ్యయనం చేసాడు. కాని ఇదంతా అతడి మనస్సును నిలకడగా ఉంచలేకపోయింది. అతడు అనుకొనేవాడు, భగవంతు డన్నవాడు నిజంగా ఉన్నాడా? లేక ఉన్నాడని అనుకోవడం కట్టుకథా? అలాగే ఈ సృష్టి అన్నది చైతన్య మహాశక్తి చేత భరించబడి ఉన్నదా లేక దాని అంతట అది అనుకోకుండా ఏర్పడిందా?

వామనరావుకు పైన చెప్పబడిన ప్రశ్నలు అంతులేని ఆందోళనను కలుగ చేసాయి. ఎప్పుడూ వాటి గురించే ఆలోచించేవాడు. ఆ విషయంపై ఆలోచించే కొద్దీ, సృష్టి రహస్యంపై ఆసక్తి కూడా అదే మోతాదులో పెరుగుతూవచ్చేది. శ్రీ రామకృష్ణ పరమహంసకు ముఖ్య శిష్యుడైన స్వామివివేకానందకు మొదట్లో ఇటువంటి ప్రశ్నలే ఉదయించేవి. ఎలాగైనా భగవంతుణ్ని దర్శించాలని ఉబలాటం ఉండేది. వామన రావు తండ్రి, కొడుకు యొక్క ఆతృత గమనించి, బాలకృష్ణ మహరాజ్ అనబడే గురువు వద్దకు తీసుకుని వెళ్ళాడు. ఈయన స్వామి సమర్ధ దగ్గర శిష్యరికం చేసారు. ఇది జరిగింది 1910 సంవత్సరంలో కాని వామనరావు తండ్రి చేసిన ఈ ప్రయత్నం ఫలించలేదు. ఆ సందర్భంలో వామనరావు చెప్పినమాట ఇలా ఉంది. ఎవరైతే నాకు భగవంతుణ్ని, ఇదిగో ఇలా ఉంటాడు అని చెప్పగలరో వారినే నేను గురువుగా స్వీకరిస్తాను అనేవాడు. వామనరావు తండ్రి రెండు పుస్తకాలను పట్టుకు వచ్చి బాలకృష్ణ మహరాజ్ చేతుల్లో పెట్టాడు. ఆయన ఆ పుస్తకాలను ఆశీర్వచన పూర్వకంగా వామనరావుకిచ్చి చదవమని చెప్పారు. ఆ రెండు పుస్తకాల్లో ఒకటి ఏకనాథ భాగవతం, రెండవది స్వామి సమర్ధ జీవిత చరిత్ర. ఆ తరువాత వామనరావు ఎంతో ఆసక్తితో స్వామి సమర్ధ జీవిత చరిత్రను చదివాడు. స్వామి సమర్ధ యొక్క దివ్యత్వం వామనరావును కదిలించి వేసింది. అలాగే స్వామి సమర్ధ శిష్యగణం పొందిన అనేక అనుభవాలు కూడా వామనరావుపై ప్రభావం చూపెట్టాయి. ఇది ఇలా ఉండగానే భగవంతుడి గురించి తనకున్న సందేహాల్ని

నివృత్తి చేయగల యోగిపుంగవడు ఎక్కడ దొరుకుతాడన్న ప్రశ్న వామనరావును వేధిస్తూ ఉండేది. భగవంతుడున్న వాడు మనిషి కల్పన కాదని, ఇదిగో ఇలా ఉంటాడని ఆ యోగి పుంగవుడే చెప్పగలడని విశ్వసిస్తూ ఉండేవాడు. అటువంటి పరిస్థితుల్లోనే, వామనరావు తండ్రి. అతడిని షిరిడికి పంపించడం జరిగింది. చివరకు తండ్రి ద్వారానే వామనరావుకు చిక్కుముడి విడివడే అవకాశం దొరికింది. అదే షిరిడి సాయిబాబా ద్వారా, వామనరావు జీవితంలో కల్గిన జ్ఞానమార్గపు మలుపు అని చెప్పవచ్చు.

దీని సారాంశం ఇలా ఉటుంది. ఒక సద్గురువు తనకు కావల్సిన శిష్యుడి కోసం చూస్తూ ఉంటాడు. అలాగే శిష్యుడు కూడా అదే సద్గురువు కోసం ఆరాటపడుతూ తిరుగుతూ ఉంటాడు. శిష్యుడు అలా తిరగడం అన్నది కూడా సద్గురువు యొక్క దివ్యప్రణాలికలో ఒక భాగమే అయి ఉంటుంది. అప్పుడు మాత్రమే శిష్యుడు, తన సద్గురువును చేరడానికి తగిన అర్హత సంపాదించుకోగలుగుతాడు. ఇక్కడ చెప్పబడిన 'అర్హత' అనేమాట శిష్యుడి యొక్క తపనకు సూచనగా ఉంటుంది. ఎప్పుడైతే శిష్యుడిలో ఈ తపన పక్వానికి వచ్చిందో, అప్పుడే సద్గురువు కూడా శిష్యాగమనం కోసం ఎదురుచూస్తూ, అతడు రాగానే ఇక ఎటువంటి షరతులు లేకుండా శిష్యుడిని స్వీకరిస్తాడు.

కాబట్టి మనందరం బాబా శిష్యులం, బాబా కోసం పరితపిస్తూ ఉండేవాళ్ళం. బాబా ఏర్పరచిన ముందస్తు షరతుల్ని విధేయతతో పాటించి బాబాకు ప్రీతిపాత్రుల మవడానికి కృషి చేద్దాం.

(ఇదంతా స్వామి సాయి శరణానంద రచించిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)

## ⑨

## బాబా రవ్వకేసరి లాంటి దయ చూపెట్టారు.

1911వ సంవత్సరం మే నెలలో ప్రాణ్ గోవింద లాల్‌భాయ్ పటేల్ (వామన రావు తండ్రి) అతడి స్నేహితుడు శేఖర్‌లాల్ కేశవ్‌భట్‌తో కల్సి షిరిడికి వచ్చాడు. వారిద్దరూ అంతకు పూర్వమే బాబా దివ్యత్వం గురించి విన్నవారు. శిష్యులపై బాబాకు గల ప్రేమ, అనేక లీలల ద్వారా వ్యక్తమవడం గురించి కూడా తెలుసుకుని, బాబాను ఎలాగైనా కలవాలి అన్న పట్టుదలతో వచ్చారు. షిరిడి ప్రయాణానికి ముందు ప్రాణ గోవింద్‌కు నోటిలో పళ్ళు ఇబ్బంది వల్ల, అన్నింటినీ తీసివేయవలసి వచ్చింది. ఆ కారణం చేత చిగుళ్ళు బాధపెట్టడం మొదలైంది. పళ్ళ డాక్టరు కూడా కట్టుడు పళ్ళు పెట్టడం ఆలస్యం చేశాడు.

అనుకున్నట్లుగా బాబా దర్శనం అయింది. జోగ్ వారిద్దరినీ మధ్యాహ్న భోజనం నిమిత్తం అతడింటికి తీసుకుని వెళ్ళాడు. భోజనానికి కూర్చున్నారు. అరిటాకులు పరిచారు. ఇంక వడ్డన మొదలవ్వాలి. అప్పుడు అక్కడున్న పదార్థాలని ప్రాణగోవింద్ చూసాడు. అన్నీ చపాతీలే ఉన్నాయి. దానిలోకి కాయగూరలతో వండిన వంటకాలు ఉన్నాయి. అయ్యో! నాకు నమలడానికి పళ్ళు లేవే? ఏం చెయ్యాలి అనుకుని బాధపడ్డాడు. ఇంటి దగ్గరే ఉంటే భార్య రవ్వకేసరి చేసేది. అదైతే తినడానికి సులువు కదా అని పరిపరి విధాల ఆలోచనల్తో సతమతమవుతున్నాడు.

ప్రాణగోవింద్ ఈ విధంగా ఆలోచిస్తూ ఉండగా జోగ్ ఇంటి ముందు బాబా పంపించిన మనిషి ఒకడు వచ్చి నిలబడి, బాబా ఇలా చెపుతున్నారు వినండి. ఈ క్షణంలోనే రవ్వకేసరి వండి ఉంచండి. ఆ రవ్వకేసరి భోజనానికి కూర్చున్నవాళ్ళందరూ తినవలసింది. ఎవ్వరూ కూడా రవ్వకేసరి తినకుండా లేవకూడదు. ఇది బాబా ప్రసాదమని గుర్తుంచుకోండి అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ కబురుతో ప్రాణగోవింద్‌కు మనస్సు స్థిమితపడింది. బాబా సర్వజ్ఞత్వానికి అనగా భూత భవిష్యత్ వర్తమానాలను

పసిగట్ట గలిగిన దివ్య శక్తికి మనసులోనే జోహార్లు సమర్పించుకున్నాడు. ప్రాణగోవింద్‌లాగే శేఖర్‌లాల్ గూడ బాబా యొక్క దివ్యత్వ అనుభూతిని పొందాడు.

ఇక్కడ శేఖర్‌లాల్‌కు ప్రత్యక్షంగా జరిగిన అనుభవాన్ని వివరిస్తున్నారు. అతడికి చాలా కాలం నుండే ఒక కాలుకు కుంటితనం ఉండేది. ఆ కారణం చేత అతడు అందరి లాగే సరిగా నడవలేకపోయేవాడు. అప్పుడప్పుడు అదుపు తప్పి క్రిందపడిపోతూ ఉండేవాడు. షిరిడీ నుండి ఇద్దరు స్నేహితులూ తిరిగి ఇంటికి ప్రయాణమయ్యారు. దారిలో వారు కోపర్గాం చేరుకున్నారు. ఆ సమయంలో నడుస్తున్న శేఖర్‌లాల్ అదుపు తప్పి ఒక్కసారిగా క్రిందపడ్డాడు. తరువాత నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. తనకే ఆశ్చర్య మేసింది. ఎందుకంటే ఇంతకుముందు వరకూ తనకున్న కుంటితనం ఇప్పుడు కనబడటం లేదు. తను ఇప్పుడు సరిగా నడవగలుతున్నాడు. ఇదంతా బాబా దయ అని తలచుకుని బాబాకు మనస్సులో కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఇటువంటి దివ్య మహిమలు కల్గిన బాబాను దర్శించుకు రమ్మనమని ప్రాణగోవింద్ తన కొడుకు వామనరావుకు నచ్చ చెప్పాడు. తండ్రి మాట ప్రకారం వామనరావు 10-12-1911న షిరిడీకి వచ్చి బాబాను కలుసుకున్నాడు.

దీని సారాంశాన్ని ఈ విధంగా చెప్పుకోవచ్చు. సమర్ధ సద్గురువైన బాబా తన దయ అనబడే అమృతాన్ని, రవ్వకేసరి రూపంలో అందరినీ సేవించమన్నారు. ఎవ్వరికైనా కుంటితనం ఉన్నప్పుడు కాలు అదుపుతప్పడం సహజం. అలాగే ఈ అదుపు తప్పే ప్రక్రియ జ్ఞానార్జనా మార్గంలో అందరకూ సహజంగానే కలుగుతూ ఉంటుంది. దీనికి కారణం మనలో ఉన్న అజ్ఞానమనే కుంటితనం. ఈ రకమైన కుంటితనం వల్ల మనమందరం సరైన ఆధ్యాత్మిక మార్గంలో నడవక అదుపు తప్పి భోగసంబంధమైన లోక వ్యవహారాల్లో తలమునకలై ప్రవర్తిస్తూ ఉంటాము. ఆ సమయంలో బాబా దయ మనల్ని క్రిందపడనివ్వకుండా రక్షిస్తుంది. మన కుంటితనాన్ని శాశ్వితంగా పోగొడుతుంది. అప్పుడు బాబా దయవల్ల కల్గిన జ్ఞానోదయం మనల్ని సరైన మార్గంలో నడిపిస్తుంది.

(ఇదంతా స్వామిసాయి శరణానంద రచించిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

# 10

## సర్వం ఖల్విదం బ్రహ్మ

ఒకరోజు వామనరావు రైలులో ముంబాయి వెళ్తున్నాడు. ఆ రైలు శాంతాక్రజ్ నుండి కదలబోతోంది. అదే క్షణంలో ఒక ముసలాయన గబగబా ఆయాసపడుతూ వచ్చి రైలు ఎక్కాడు. అతడి చేతిలో కిరాణా సామాన్లు కల్గిన ఒక సంచి ఉంది. ముందు ఆ సంచిని రైల్లోకి త్రోసి, తరువాత అతను ఎక్కాడు. వచ్చి వామనరావుకు ఎదురుగా కూర్చున్నాడు. వామనరావు ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే ఆ ముసలాయన అచ్చు సాయిబాబాలాగానే ఉన్నాడు. చిన్న తేడా ఏమిటంటే అతడు బాబా కన్న కాస్త నల్లగా ఉన్నాడు. అతడు అలా వచ్చి కూర్చోగానే, భగవంతుడి దయవల్ల నేను బ్రతికాను లేకపోతే రైలు పట్టాలపై పడి చచ్చేవాడిని, అంతా భగవంతుడు చేసేపనే అన్నాడు. తరువాత వచ్చే స్టేషనులో అతను దిగిపోయాడు. అప్పుడు వామనరావు ఆశ్చర్యపోయి ఇలా అనుకున్నాడు. బాబాయే ప్రత్యక్షమై నాకు బోధ చేసారు. భగవంతుడే ఈ సృష్టిలో అన్ని పనులకూ కర్తగానున్నాడు అని తెలుసుకున్నట్లయింది.

తరువాత కొంతకాలానికి వామనరావు షిరిడికి బయలుదేరాడు. కోపర్గాం నుండి మిగతా ప్రయాణీకులతో బాటు టాంగాలో వచ్చాడు. టాంగా ఎక్కినవారిలో ఒక మార్వాడీ ఉన్నాడు. అలాగే ఒక వ్యభిచారిణి కూడా ఉంది. టాంగా లెండిభాగ్ చేరుకోగానే వారికి బాబా కనపడ్డారు. వెంటనే వామనరావు టాంగా నుండి క్రిందకు దిగి బాబాకు సాష్టాంగపడ్డాడు. అప్పుడు బాబా అన్నారు, భగవంతుడన్నవాడు ఉన్నాడు. నువ్వెందుకు లేడని అంటావు. ఇప్పుడు నువ్వు వెళ్ళవచ్చు. ఈ విధంగా సమయం వచ్చినప్పుడుల్లా బాబా భగవంతుని ఉనికి గురించి స్థిరపరుస్తూనే వచ్చారు.

బాబా లెండీభాగ్ నుండి తిరిగిరాగానే వామనరావు కూడా ద్వారకామాయికి చేరుకున్నాడు. తనతోపాటు టాంగాలో ప్రయాణించిన వ్యభిచారిణి గూడ అక్కడ ఉంది. ఆమె బాబా ప్రక్కనే కూర్చొని ఉండడం చూసాడు. ఆమె బాబాతో, తన వ్యాపారం ఈ మధ్య బాగా తగ్గిందని, చాలామంది ఖాతాదార్లు ఆమె దగ్గరకు రావడం మానివేసారని

చెపుతోంది. దానికి బాబా, నువ్వు మంచి మంచి బట్టలు తొడుక్కో, అలాగే అలంకారాలు చేసుకో, అలాగైతే పురుషులు తప్పక నీ దగ్గరకొస్తారు. భగవంతుడు నిన్ను చల్లగా చూస్తాడు అన్నారు.

వామనరావు, బాలబాబూ (వామనరావుకు ఆతిధ్యమిచ్చిన వ్యక్తి) బాబా పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసారు. బాబా వారిద్దరితో చాలాదయతో మాట్లాడారు. వామనరావు తాను తెచ్చిన పళ్ళను, మిఠాయిలను బాబాకు సమర్పించాడు. అప్పుడు బాబా నోటివెంట ఒకే ఒక్క మాట వచ్చింది. "దక్ష" అన్నారు. అనగా సర్వం ఖల్విదం బ్రహ్మ అని సంస్కృతంలోనున్న ఉపనిషద్వాక్యం. దాని అర్ధమేమిటంటే ఇక్కడ ఉన్న సర్వస్వము నిజంగా బ్రహ్మమే. ఆ మాట విన్న వామనరావు కాసేపు దాని అర్ధంపై విచారణ చేసాడు. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అన్నది చాంద్యోగ ఉపనిషత్తులోని మహావాక్యం. అలాగే ఈశావాస్యోపనిషత్తులోని మొదటి మంత్రం ఇలా చెపుతుంది. ఈశావాస్యమిదగం సర్వం. అనగా ఈ సృష్టి మొత్తమంతా పరమాత్మచేత ఆవరింపబడి ఉంది. కాబట్టి మనం తెలుసుకోవల్సింది ఏమిటంటే, ఈ సృష్టిలోని సకల జీవరాశుల్లోనూ పరమాత్మ అంతర్యామిగా ఉన్నాడు. అందువల్ల భగవంతుని స్వరూపమే అంతటా నిండుకొన్నందు వల్ల ఆ భగవంతుని పట్ల మనం కృతజ్ఞతాభావంతో ఉండడమేకాక మనకు తారసపడే వారికి మనవంతు సహయ సహకారాలు అందిస్తూ సంఘ జీవనం గడపాలి. ఇదే నిజమైన సాధనా రహస్యం. ఈ రకం సాధన వల్లనే మనస్సు నిర్మలమవుతుంది. ఆ కారణం చేతనే స్వామి వివేకానంద త్యాగం, సేవ అనే మాటలకు ప్రాముఖ్యతనిచ్చేరు. ఈ రెండు క్రియల వల్ల మనస్సు పరిశుభ్రపడడమేకాకుండా, స్వార్ధరహితంగా మారుతుంది.

వామనరావు ఇలా అనుకుంటున్నాడు. నేను షిరిడీకి చాలా అన్యమనస్కంగా వచ్చాను. నా ఆలోచనంతా భగవంతుని ఉనికి గురించే ఉండేది. బాబా ద్వారా నేను ఎన్నో అనుభవాల్ని చవిచూసాను. ప్రతి అనుభవంలోనూ భగవంతుని ఉనికిని నేను గ్రహించగలిగాను. అంతేకాకుండా బాబాయే స్వయంగా తాను పరబ్రహ్మ స్వరూపుడుగా నాకు దర్శనమిచ్చారు. నిజంగా బాబా సర్వాంతర్యామి, సర్వశక్తి సమన్వితులు, ఇంకా సర్వజ్ఞులు. బాబా ప్రతిజీవిలోను నివశించే పరమాత్మ స్వరూపులు. ఒక వ్యభిచారిణిలో

గూడా బాబా రూపాన్ని నేను స్పష్టంగా చూడగలిగాను. అంతేకాక స్వయంగా నా అంతరాత్మ బాబాయే అని నా మనస్సు పసిగట్టగలిగింది. కాబట్టే, అతి సునాయాసంగా బాబా బ్రహ్మ జ్ఞానాన్ని అర్హులందరికీ పంచిపెట్టగలిగారు.

దీని సారాంశాన్ని ఈ విధంగా చెప్పుకోవచ్చు. మనకి ఒక సదుర్గువు యొక్క ఆశ్రయం లభిస్తే మనమెంతో అదృష్టవంతులమని చెప్పాలి. ఎందుకంటే ఎప్పుడైనా ఒక సద్గురువు మనల్ని మాయలో పడి మరణించకుండా కాపాడుతారు. ఏదైనా, ఎక్కడైనా జరగాలంటే అది సద్గురువు యొక్క కనుసన్నలలోనే జరుగుతూ ఉంటుంది. ఈ విషయం బాబా ఎన్నోసార్లు ఋజువు చేసారు. ఈ ప్రాపంచిక విషయలోలత్వంలో మనం మన జీవితాలను చపలత్వం అనే పిశాచికి గాని, అరిషడ్వర్గాలనే కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్యాలకు గాని ఫణంగా పెట్టుకుని గడుపుతున్నాం. ఇటువంటి కఠిన పరిస్థితుల్లో మన వ్యాపార వ్యవహారాలను ఎలా పండించుకోగలం. ఇక్కడ వ్యాపారమంటే జీవన పోరాటం. ఇంక వ్యవహారమంటే మనశ్శాంతికై ఆరాటం. బాబా వ్యభిచారిణికి చెప్పిన సలహా మనకి చెప్పినట్లే. మంచి మంచి దుస్తులు, అలంకారాలు అంటే, పవిత్రత శ్రద్ధ, సబూరి, పరిశుభ్రత, మధురమైన సంభాషణ, క్రియ మొదలైనవన్నీ ఆ కోవ క్రిందకే వస్తాయి. దేహాభిమానమనే పిశాచికి ఆత్మను అమ్ముకోవద్దు. హృదయ పవిత్రతను పాడు చెయ్యవద్దు. అప్పుడు మాత్రమే ఆత్మసాక్షాత్కారానికి అవకాశం ఉంటుంది. మనం మంచి సాధనా సామగ్రిని ప్రోగు చేసుకొంటే సద్గురువు కృప దానంత అదే మన దగ్గరకొస్తుంది.

ఇంక బ్రహ్మం అంటే శంకరుల సిద్ధాంతం ప్రకారం అన్నింటికన్నా పెద్దది అని అర్థం. ఇది బ్రహ్ అనే ధాతువు నుండి పుట్టింది. ఆకాశం మొదలుకొని సమస్త ప్రకృతినీ తన గర్భంలో ఇముడ్చుకొనేది కాబట్టి బ్రహ్మమైంది. దీన్నే శుద్ధ చైతన్యమనీ, ప్రజ్ఞాన ఘనమనీ ఉపనిషత్తులు వర్ణించాయి. అండపిండ బ్రహ్మాండాలతో నిండివున్న అనంతమైన ఈసృష్టియావత్తూ ఆ బ్రహ్మమే అయి ఉంది. మనకు కనపడుతున్న సృష్టి స్థితిలయాలకు బ్రహ్మమే ఆధారభూతమై ఉంది. అందుకే ఉపనిషత్తులు సర్వం ఖల్విదం బ్రహ్మ అన్నాయి.

(ఇదంతా స్వామిసాయి శరణానంద రచించిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)

# 11

## సద్గురువును చేరాలంటే అది బాబా కృప వల్లనే సాధ్యపడుతుంది.

1911 సంవత్సరం డిశంబరు నెలలో కాంగ్రెస్‌పార్టీ ముంబాయిలో సమావేశ మయ్యింది. క్రిస్‌మస్ సెలవులు రావడంతో కోర్టుమూత పడింది. అందువల్ల కాకా సాహెబ్ దీక్షిత్ షిరిడీకి బయలుదేరాడు. వామనరావు, దీక్షిత్ ద్వారా బాబాకు ఒక కబురు పంపించాడు. క్రిస్‌మస్ సెలవులు కాబట్టి తనను కూడా షిరిడికి రమ్మనమంటారా లేక ఇక్కడ జరిగే కాంగ్రెస్ సభలకు వెళ్ళమంటారా అని ప్రశ్నవేసాడు. నిజానికి ఈ ప్రశ్న చిన్నదిగా కనపడుతున్నప్పటికీ, వామనరావుకు మాత్రం చాలా ముఖ్యమైందిగా ఉంది. ఎందుకంటే అతడి ఆలోచన స్థిరంగాలేదు. తన జీవితాన్ని రాజకీయంగా నడిపించాలా లేక ఆధ్యాత్మిక మార్గంలో నడిపించాలా అనే మీమాంశలో ఉన్నాడు.

దీక్షిత్ వెళ్ళి బాబాను అడిగాడు. వెంటనే బాబా దీక్షిత్‌తో వామనరావుకు ఉత్తరం వ్రాయించారు. క్రిస్‌మస్ సెలవలకు నువ్వు షిరిడీకే రావాలని దాని సారాంశం. బాబా ఆజ్ఞను వామనరావు పాటించి షిరిడీకి బయలుదేరాడు. షిరిడీకి వెళ్ళేముందు అతడు రెండు పుస్తకాలను చదవడం పూర్తి చేసాడు. వాటిలో మొదటి పుస్తకం పరమానంద భారతి వ్రాసిన 'ది లైట్ ఆన్ లైఫ్'. రెండవది శ్రీరామకృష్ణ పరమహంస బోధవచనాలు.

ఒక రోజు రాత్రి వామనరావుకు కల వచ్చింది. బాబా స్పష్టంగా కనపడుతున్నారు. ఇంకా ఇలా అంటున్నారు. అరే! ఘోడా, ఘోడా మనత్‌జా. ఘోడావెర్ బస్తా ఆలా పాయ్ జే! దీన్నే తెలుగులో వ్రాస్తే సుమారుగా ఇలా ఉంటుంది. ఒరే! గుర్రం, గుర్రం అని అంటూ ఉండు. ఎందుకంటే నువ్వు ఆ గుర్రం మీదనే స్వారీ చెయ్యాల్సి ఉంది. 'అహం బ్రహ్మాస్మి'. నేను కోపర్గాంలో కూడా ఉన్నాను. నా భౌతిక రూపాలు చాలా ఉన్నాయి. వాటినే నేను ధ్యానిస్తూ ఉంటాను.

'అహం బ్రహ్మాస్మి' అన్న మహావాక్యం యజుర్ వేదం నుండి గ్రహించబడింది. దాని అర్థం 'నేను బ్రహ్మమునై యున్నాను'. వామనరావు చాలాకాలం నుండీ ఇదే కోణంలో ఆలోచిస్తూ ఉన్నాడు. అందుచేతనే బాబా తనని ఆ మహావాక్యమననం చెయ్యమని పదేపదే గుర్తు చేస్తున్నారు. కలలో చెప్పిన గుర్రం అంటే ఇదే అని వామనరావుకు అర్థమయ్యింది. అయితే తన ఉద్దేశ్యం నిజమా కాదా అని బాబాను అడగమని దీక్షిత్‌ను వేడుకొన్నాడు. దీక్షిత్ ఏమి చెపుతాడో అని ఎదురు చూసాడు. వామనరావు ఉద్దేశ్యం నిజమైనదే అని దీక్షిత్ నుండి కబురు వచ్చింది. వామనరావు, మహానంద భరితుడయ్యాడు. 'అహంబ్రహ్మాస్మి' మంత్ర జపం మొదలుపెట్టాడు. ఇంతవరకూ మాత్రం, వామనరావు బాబా వ్యక్తరూపాన్నే ధ్యానిస్తూ వచ్చాడు. కాని 'అహంబ్రహ్మాస్మి' మంత్రోపదేశం అయిన తరువాత బాబా అవ్యక్తరూపాన్ని అనగా నిర్గుణరూపం లేక సర్వవ్యాపకమైన అనంత రూపాన్ని ధ్యానం చెయ్యడం ప్రారంభించాడు.

క్రిస్మస్ సెలవు దినాల్లో ఒకరోజు బాబా దగ్గర కూర్చొని ఉన్నాడు. కొంతమంది భక్తులు వచ్చి బాబాకు జామికాయలు ఇచ్చారు. అవి పచ్చిగా ఉన్నాయి. బాబా ఆ పచ్చి జామకాయ ముక్క ఒకటి వామనరావుకి ఇచ్చి, చూడ్డానికి పచ్చిగా ఉన్నా కూడా తియ్యగానే ఉంటుంది తిను అన్నారు. నిజంగా బాబా చెప్పినట్లుగానే అవి పచ్చిగా ఉన్నా కూడా తియ్యగా ఉన్నాయి. వామనరావుకు దాని అంతరార్థం అర్థమయ్యింది. నిర్గుణతత్త్వంపై తనకున్న ధ్యానాభ్యాసాన్ని బాబా ఎత్తి చూపెడుతున్నారని తెలుసుకున్నాడు. మొదట్లో ధ్యానాభ్యాసమన్నది ఎవ్వరికైనా పచ్చిగానే ఉంటుంది. వెంటనేపండదు. కాని చేస్తున్న కొద్దీ దాని తియ్యదనం బయటపడి ప్రశాంతత అనుభవానికి వస్తుందన్నది దానిలోని రహస్యం.

వామనరావు ఒకసారి మహల్సాపతిని కలిసాడు. మహల్సాపతి ద్వారా తనకున్న ఆత్మజ్ఞానం యొక్క స్థితిగతుల్ని పరీక్షించుకుందామని అతడి కోరిక. మహల్సాపతి మహానుభావుడని, బాబాకు అతి దగ్గరగా మసులుకుంటూ బాబా కృపను సంపూర్ణంగా

పొందినవాడని వామనరావుకు తెలుసు. జామికాయల విషయంలో బాబా అన్నమాటలు, వాటిని తాను ఏవిధంగా ఆత్మజ్ఞాన నిష్టకు సమన్వయం చేసుకున్న విషయాన్ని పూస గ్రుచ్చినట్లుగా చెప్పాడు. మహల్సాపతి అంతా విన్నాడు. వామనరావు చేసిన సమన్వయం సరిగ్గా సరిపోయిందని చెప్పాడు. మహల్సాపతి అన్న మాటలు బాబా అన్నవిగానే గ్రహించి సంతోషించాడు వామనరావు. అప్పటి నుండి మరింత శ్రద్ధగా 'అహంబ్రహ్మాస్మి' మంత్రంపై ధ్యానం కొనసాగించాడు. ఈ ప్రకారం అతడి అభ్యాసం జరిగిన కొన్నాళ్ళకు, అతడి అనుభవం ఎలా ఉందో చెపుతున్నాడు. నేను ఆకాశంలో బాబాను దర్శించాను. అంతేకాదు వాయువులో, అగ్నిలో, నీటిలో, ఇంకా ఈ భూమి మీద నివసించే ప్రతి ప్రాణిలో బాబాను దర్శిస్తున్నాను. బాబా సర్వాంతర్యామి అని తెలుసుకోగలిగాను.

దీని సారాంశాన్ని ఈ విధంగా చెప్పుకోవచ్చు. మనమనస్సు చాలా చంచలమై ఉంటుంది. స్థిరంగా ఉండలేదు. ఒక గుర్రం మాదిరి పరుగెడుతూ ఉంటుంది. అందుకే బాబా ధ్యానం చెయ్యమని చెపుతూ ఉంటారు. ధ్యానం చేస్తూ ఉంటే మనస్సును నిలకడగా ఉంచవచ్చు. ఎప్పుడైతే మనం మన మనస్సును అదుపులో ఉంచుకోగలమో, అప్పుడే ఆత్మ జ్ఞానానికై మనంపడే తపన ఫలిస్తుంది. ఆకాశంలో ఈ అండపిండ బ్రహ్మాండాలన్నీ ఉన్నట్లుగా, అలాగే వాటన్నింటిలోనూ ఆకాశం ఉన్నట్లుగా, ఆత్మ స్వరూపంలోనే మనమున్నామని, అలాగే మనలో ఆత్మ స్వరూపం కూడా ఉన్నదన్న అపరోక్షానుభూతిని మనం పొందగల్గుతాం.

ఒక్కముక్కలో చెప్పాలంటే సద్గురు కృపవల్లనే ఆత్మసాక్షాత్కారం జరుగుతుంది.

(ఇదంతా స్వామి సాయి శరణానంద రచించిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది.)

# 12

## మాయి ఆధ్యాత్మిక ఖజానాకు తాళం చెవి

స్వామి సాయి శరణానంద ఇలా అంటున్నారు. నేను షిరిడీలో ఉండే గది రాధాకృష్ణమాయి ఇంటి ప్రక్కనే ఉంది. నేను ఒకరోజు ఆమెకు ఒక ఇతిహాసం చదివి విన్పిస్తున్నాను. దానిలో అనేక మంది యోగుల చరిత్రలున్నాయి. అలా చదువుతున్నప్పుడు ఒక యోగి చరిత్ర ఆమెను బాగా ఆకట్టుకుంది. ఆమె కళ్ళ వెంబడి ఆపుకోవడానికి వీలులేనంతగా కంటినీరు కారుతోంది. దానితోబాటు బోరుమని ఒక్కసారిగా ఏడవడం మొదలుపెట్టింది. ఆ గదిలో అప్పుడు చీకటిగా ఉంది. అకస్మాత్తుగా ఒక పెద్ద కాంతి కిరణం, ఆకాశంలో మెరుపులాంటిది ఆమె ముందు ప్రత్యక్షమయ్యింది. దాంతో మాయికి నోట మాట రాక పడుకుండిపోయింది. మాయికి పుస్తకాలు చదవడమంటే మక్కువ ఎక్కువ. చాలా పుస్తకాలు నా దగ్గర నుండి, ఇతర భక్తుల దగ్గర నుండి తీసుకుని చదువుతూ ఉండేది. ఆమెకు తుకారాం గాధ అనే పుస్తకం చాలా ఇష్టంగా ఉండేది. దాన్లో చాలా అభంగాలు (శ్లోకాల్లాంటివి) ఉన్నాయి. వాటిని ఆమె చక్కని కంఠస్వరంతో పాడుతూ ఉండేది. మాయి చాలాసార్లు ఇలా చెప్పేది. ఆమె షిరిడీకి వచ్చిన క్రొత్తలో బాబా ఎదుట కూర్చొని భక్తతుకారాం వ్రాసిన అభంగాలను పాడేదాన్ని అని చెప్పేది. అంతేకాక బాబా కూడా ఈ అభంగాలను ఎంతగానో ఇష్టపడేవారు. ఇదేవిధంగా మాయికి చాలామంది ఇతర యోగులు వ్రాసిన అభంగాలు ఎన్నోవచ్చు. దయ, జాలి అనే విషయంపై వ్రాసిన అభంగాలను ఆమె ఎక్కువగా ఇష్టపడేది. తుకారాం గాధను భక్తులకు వినిపిస్తూ ఉండేది. అదే సమయంలో అనేక అభంగాలను పాడుతూ ఉండేది.

ఒకరోజు సాయంకాలం వామనరావు ఏకనాథ్ భాగవతాన్ని పట్టుకొచ్చాడు. దాన్లో ఉన్న ఒక శ్లోకంపై మాయి చాలాపెద్ద వివరణ ఇచ్చింది. ఆ శ్లోకం ఇలా మొదలవుతుంది. "కాయేనవాచా మనసేంద్రియైర్వా...." ఇది సంపూర్ణ శరణాగతికి సంబంధించింది. శ్రీమన్నారాయణుడికి భక్తుడు శారీరకంగా, వాచకంగా, మానసికంగా, తన బుద్ధిని, తన జీవిత సర్వస్వాన్ని దారపోసి శరణాగతుడవుతున్నాడు. ఇదే రకమైన

శరణాగతి తత్త్వం భగవద్గీతలోని 18వ అధ్యాయం మోక్షసన్యాస యోగంలో కనపడుతుంది (18-66). దీన్ని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలని మాయి చెపుతోంది.

అలాగే మాయికి ఇష్టమైన ఇంకొక గ్రంథం భక్త జయదేవుడు వ్రాసిన 'గోపికా గీతాలు'. ఆ పాటలను మాయి అనేక రాగాల్లో పాడుతూ ఉండేది. సాయంత్రం సమయాల్లో మాయి గోపికాగీతాలు పాడుతూండగా, డాక్టరు పిళ్ళై సితార వాయించే వాడు.

అలాగే రామదాస స్వామి వ్రాసిన దాసబోధ అనే గ్రంథం చదివి వినిపిస్తూ ఉండేది. ఇంకా దానికి సంబంధించిన వ్యాఖ్యానాలు కూడా చేస్తూ ఉండేది. ఆ సమయంలో నా అదృష్టం కొద్దీ ఆమె ఎదుట నేను కూర్చుంటూ ఉండేవాడిని. శ్రీరామకృష్ణ పరమహంస బోధామృతం గూడ మాయికి చాలా ఇష్టమైన గ్రంథం. దీన్ని నేను చదివి మాయికి వినిపిస్తూ ఉండేవాడిని.

ఇలా కొన్నిరోజులు గడచిన తరువాత జోగ్ వచ్చి ఇలా అన్నాడు. వామనరావు! నువ్వు ఈ రకంగా గొప్పగొప్ప పుస్తకాలను మాయి ముందు కూర్చొని చదవడం వల్ల నీకు జ్ఞానమేమీ రాదు. నువ్వు ఏం చెయ్యాలంటే మాయి చెప్పే కథలను, విషయాలను జాగ్రత్తగా విని ఆకళింపు చేసుకోవాలి. జోగ్ ఇలా అనడంతో, నేను మాయి దగ్గర కూర్చొని గ్రంథాలు చదవడం మానుకున్నాను. అప్పుడు మాయి, శ్రీరామకృష్ణ పరమహంస బోధామృతం గురించి చెప్పడం మొదలుపెట్టింది. జగన్మాయను ఛేదించడానికి పనికి వచ్చే అమోఘమైన పరికరం ఈ బోధామృతమనీ, మనం ఎటువంటి జీవితం గడుపుతున్నా, సంతృప్తి అన్నది ఎలా పొందాలో అది బోధిస్తుందని మాయి చెప్ప సాగింది.

దీని సారాంశం ఈ విధంగా చెప్పుకోవచ్చు. మాయి బోధించే విషయాలు ఒక తాళం చెవి లాంటివి. దీనితో ఆమె ఆధ్యాత్మిక ఖజానాను మనం తెరచి చూడవచ్చు. శరణాగతి తత్త్వం గురించి ఆమె చెప్పిన శ్లోకం మనల్ని సద్గురువు చెంతకు చేరుస్తుంది.

(ఇదంతా స్వామి సాయి శరణానంద, శ్రీ సాయిలీలా పత్రిక వాల్యూమ్ 64 నెం. 12, మార్చి 1986లో వ్రాసిన వ్యాసంలో ఉంది.)

# 13
## మాయి తన ప్రాణశక్తిలో కొంతభాగాన్ని వామనరావుకు ధారపోసింది.

ఒకరోజు సాయంకాలం దీక్షిత్, వామనరావు ద్వారకామాయికి బయలుదేరారు. అయితే దీక్షిత్ మారుతీ మందిరం ముందున గల దారిగుండా వెళ్ళాడు. వామనరావు బూటీవాడ మీదుగా బయలుదేరాడు. ఆ సమయంలో బూటీవాడ నిర్మాణపు పనులు జరుగుతున్నాయి. వామనరావు పనులు జరుగుతున్న స్థలం దగ్గరకు వచ్చే సరికి అకస్మాత్తుగా ఒకపెద్ద బండరాయి అతని తలపైబడి భుజాన్ని రాసుకుంటూ క్రింద పడింది. ఆ దెబ్బకి వామనరావు, క్రింద చతికిలబడి తెలివి కోల్పోయాడు. కొంతసేపటికి తెలివి వచ్చింది. బాబామాటలు వినబడుతున్నాయి. ఇదిగో ఇలాగే మనుష్యులు చనిపోతారు అన్నారు. దీక్షిత్ కూడా వామనరావును ఉద్దేశించి, నేను నిన్ను నాతో రమ్మన మన్నానా? నువ్వు వచ్చి ఉంటే మారుతీ మందిరం మీదుగా ఇద్దరం వెళ్ళేవాళ్ళం. నీకు దెబ్బ తగిలి ఉండేది కాదు. నా హెచ్చరికను నువ్వు పట్టించుకోలేదు అన్నాడు.

వామనరావు తలకి, భుజానికి దెబ్బ తగిలింది. బాబా ఊదీ ముద్దను పంపించారు. అది తెచ్చిన భక్తుడు, ఆ ఊదీ ముద్దను వామనరావు గాయాలకు తల దగ్గర, భుజం దగ్గర పూసాడు. ఆ ఊదీ ముద్ద గాయాన్ని బాగా కప్పింది. గాయానికి గాలి చొరకుండా చేసి, గాయం మానేటట్టు చేసింది. నొప్పి కూడా తగ్గడం ప్రారంభించింది. కొద్ది రోజుల్లోనే ఇంక ఏ ఇతర చికిత్సలు అవుసరం లేకుండానే వామనరావు గాయాలు పూర్తిగా నయమయాయి.

ఈ ప్రమాదం జరగడానికి ముందు ఒకసారి వామనరావు ద్వారకామాయికి వెళ్ళాడు. బాబాకు సాష్టాంగం చేసిన తరువాత, వామనరావు కూర్చున్న ఆసనాన్ని బాబా పైకి ఎత్తి చూపెట్టారు. అది చూసి వామనరావు ఆశ్చర్యపోయాడు. ఆ ఆసనం క్రింద కొన్ని అడుగులోతు కల్గిన ఒక పెద్ద గొయ్యి ఉంది. దాని అర్థమేమిటన్న ఆలోచనలో పడ్డాడు వామనరావు. ఒకవేళ నాకు ముందు ముందు రాబోయే ఏదైనా ప్రమాదం

గురించి గాని మరణం గురించి గాని ఇది సూచిస్తోందా? అని అతడికి అనిపించింది. ఆ తరువాత అతడు బూటీవాడా దగ్గరకు వెళ్ళి దాని దక్షిణంగోడకు ఆనుకుని కూర్చొని, భగవద్గీతను చదవడం మొదలుపెట్టాడు. అప్పుడక్కడికి దీక్షిత్ వచ్చి వామనరావు ఆరోగ్యం గురించి వాకబు చేసి బాబాకు అదే విషయం నివేదించాడు. బాబా సలహా మేరకు వామనరావు మౌనాన్ని పాటించాడు. ఆ రోజు సాయంకాలం రాధాకృష్ణ మాయి వచ్చి తన దగ్గరున్న ఉన్ని శాలువా ఇచ్చి వాడుకోమని చెప్పింది. ఆ రాత్రి కూడా మాయి రెండుసార్లు వచ్చి ఎంతో ఆదరంతో చూసివెళ్ళింది. అంతేకాక వామనరావును చూసి, వామనరావు! ఇప్పుడర్థమయిందా, బాబా తరచు నీ గురించి వాకబు చేసి కనుక్కుంటున్నారు. ఆయన చాలా చిరాకుగా కూడా కనపడుతున్నారు. ఎవరో భక్తులు ఆయన్ను చూడడానికి వస్తే వారిమీద చిరాకు పడి చెయ్యి కూడా చేసుకున్నారు. బహుసా, నీకు ముంచుకొచ్చే ప్రమాదాన్ని కాని, మరణాన్ని కాని, ఆయన బయటకు త్రిప్పి పంపించే ప్రయత్నంలో ఉన్నట్లుంది. బూటీవాడా దగ్గర వామనరావు తలపై పెద్ద రాయి పడినప్పుడు అతడు బాబా నామాన్ని జపిస్తున్నాడు. కొంతసేపు తెలివితప్పి, మళ్ళీ తెలివి రాగానే, తిరిగి నామ జపం కొనసాగింది. ఇప్పుడు అతడు ఇలా అనుకుంటున్నాడు. నేను బాబా నామజపం చేస్తూ చేస్తూ చనిపోవడం అన్నది చాలా గొప్ప విషయం. అయితే బాబా ఊది మిశ్రమం నన్ను రక్షించింది. నాకు నిజంగా బాధలేనట్లుగా చేసింది. గాయం పూర్తిగా మాన్పి నన్ను తిరిగి మామ్మూలు మనిషిని చేసింది.

ఇంకా వామనరావు ఆలోచన ఇలా సాగింది. కొద్దిరోజులు క్రిందట మాయి వచ్చి నా ఎదుటన కూర్చొంది. నాకు అపానవాయువు ఊర్ధ్వప్రాణాయామం నేర్పింది. ఇది ఒక అపూర్వమైన శ్వాశప్రక్రియ. ఈ అభ్యాసం వల్ల అన్నకోశానికి, పేగులకు సంబంధించిన ఇబ్బందులన్నీ తొలగిపోతాయి. అంతేకాక ఇది పేగుల్లో పేరుకున్న విషపూరితమైన వాయు సంబంధిత పదార్థాల్ని బయటకు పంపించి స్వస్థత చేకూరుస్తుంది. ఈ రకమైన ప్రాణాయామం మాయి నాకు నేర్పిస్తున్న సమయంలో

ఒక వింత జరిగింది. అదే మా యిద్దరిలో గల ప్రాణశక్తులు ఒకటిగా మారడం. పది నిముషాల కాలం ఆమె ప్రాణశక్తి నా ప్రాణశక్తితో కలిసి ముడిపడింది. ఆ విధంగా రెండు ప్రాణశక్తులు ఒక్కటి అయిన తరువాత, ఆమె చేసిన యోగ క్రియ ఏమిటంటే తన ప్రాణశక్తిలో కొంతమేర నా ప్రాణశక్తిలో లీనం చెయ్యడం. దానివల్ల ఆరిపోబోయే నా ప్రాణశక్తి తిరిగి పుంజుకుంది అని స్పష్టంగా నాకు తెలిసింది.

బాబా అప్పుడప్పుడు కడా కషాయం తయారు చేస్తూ ఉంటారు. దీంట్లో కొంత తియ్యదనం ఉండి, అల్లం, నల్లమిరియాల పొడి, కొన్ని మూలికలు, ఇంకా కాస్త మసాలా సంబంధమైనవి ఉంటాయి. వామనరావు తలకి గాయం అయిన తరువాత బాబా సోనాముఖి గింజలతో కల్పి కడా కషాయం త్రాగమని చెప్పారు. ఆ కషాయం వామనరావుకు బాగా ఉత్తేజపరచేదిగా ఉంది. అది తప్ప ఇతరత్రా మందులేవీ అతను తీసుకోలేదు. ఇంకా గాయానికి ఆయింట్‌మెంటు కూడా ఏదీ రాయలేదు. కాని బాబా ఊదీ మిశ్రమం తోటి, కషాయంతోటి పూర్తిగా కోలుకున్నాడు.

ఈ రకమైన లీల ద్వారా గురుకులంలో బాబా బోధ జరుగుతూ ఉండేది. ఆ బోధలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

నామ జపం మరియు ఊదీ యొక్క శక్తి. అలాగే శ్రద్ధ యొక్క శక్తి. సద్గురువు యొక్క కర్తవ్యం సమీప గురువు ద్వారా నిర్వహించడం. (ఇక్కడ సద్గురువు బాబా అని, సమీప గురువు రాధాకృష్ణమాయి అని తెలుసుకోవాలి) బాబాకు కాలపురుషుడు లేక మృత్యుదేవతపై గల సంపూర్ణమైన అదుపు. గురువు ప్రాణశక్తిని బదిలీ చేసే ప్రక్రియ. దానిద్వారా మనం సద్గురువులో ఐక్యమవడం. (ఈ ప్రక్రియ ఎటువంటిదంటే ఒకతల్లి తన ప్రాణశక్తిని బిడ్డకు పంచియిచ్చి, ఆ బిడ్డ దేహరూపాన్ని దాల్చేటట్లు చేయడం వంటిది) సంపూర్ణ శరణాగతి ద్వారా, సద్గురువు మనలను రక్షణ కవచంతో కప్పి ఉంచుతారు.

(ఇదంతా శ్రీసాయి లీలా పత్రిక వాల్యూమ్ 65 నెం.8, అక్టోబరు 1986లో స్వామి సాయి శరణానంద వ్రాసిన వ్యాసంలో ఉంది)

## 14

## వామనరావు ప్రతి జన్మనీ బాబా గమనిస్తున్నారు.

ఒకసారి బాబా ఇలా అన్నారు. కొన్ని జన్మలకు ముందు బాబు(వామనరావు), బాలక్‌రాం, నేనూ, కఠినమైన తపస్సులు ఆచరించడానికి పర్వతాల్లో ఎదురెదురు గుహల్లో ఉంటూ ఉండేవాళ్ళం. ఈ విషయాన్ని బాబా, వామనరావు బాలక్‌రాం ద్వారకామాయిలో తన దగ్గర కూర్చున్నప్పుడు చెప్పారు. దీనివల్ల మనకు తెలిసిందేమిటంటే చాలా జన్మల నుండీ బాబాకు వామనరావుకు దగ్గర సంబంధాలు ఉండి ఉంటాయని.

అప్పుడు వామనరావు ఇలా చెప్పుకుంటూ వచ్చాడు. ఒక విచిత్రమైన కల వచ్చింది. అప్పుడు నేను పొడవాటి గుహలో కూర్చొని తపస్సు చేస్తున్నాను. ఆ రాత్రి ఒక స్త్రీ వచ్చింది. నన్ను ఆకర్షించి, రమ్మనమని పిలిచింది. ఈ రకం కల వల్ల నాకు తెలిసిన పాఠం ఏమిటంటే, ప్రతివారికి కొన్ని మంచి అలవాట్లు లేక కొన్ని చెడ్డ అలవాట్లు ఉంటాయి. అటువంటప్పుడు, ఆ విధంగా వచ్చిన స్త్రీతో నాకు గల సంబంధం గాని, సంభాషణ గాని కొన్ని నియమాలకి లోబడి ఉండడం చాలా మంచిది. వాటిలో ఆమెకున్న మంచి గుణాల వరకూ మనం సబంధం కలుపుకోవచ్చు. కాని అంతకుమించి ఎట్టి పరిస్థితిలోనూ సబంధం పెంచుకోకూడదు.

ఇంక వామనరావు షిరిడీలో ఉన్నప్పటి పరిస్థితి చెపుతున్నారు. షిరిడిలో ఉన్నప్పుడు ఆకలికి తట్టుకోలేకపోయేవాడు. ఒకరోజు ఆకలిగా ఉందని చెప్పి కూర్చుని చాలా జామికాయలు తినివేసాడు. బాబా ఏమంటారో అన్న భయం కూడా వేసింది. భయం భయంగా ద్వారకామాయికి వెళ్ళి కూర్చున్నాడు. కాని అదృష్టంకొద్దీ బాబా ఏమీ అనలేదు సరికదా అతడి తిండిపోతుతనం గురించి కూడా ఏమీ మాట్లాడలేదు. ఒకసారి వామనరావు కిరాణా సామాన్లు కల్గిన సంచుల్ని కొని తీసుకువచ్చాడు. ఒక సంచి విప్పాడు. దాంట్లో పంచదార ఉంది. వెంటనే రెండు పిడికిళ్ళ పంచదార

తీసుకుని నోట్లో కుక్కుకున్నాడు. ఆ పంచదార పెద్ద గుళికలతో తినడానికి కరకర లాడుతూ ఉంటే సంతోషిస్తూ ఉండేవాడు. ఆ రోజు వామనరావు ద్వారకామాయికి వెళ్ళినప్పుడు బాబా ఒక కథ చెప్పడం ప్రారంభించారు. ఒక మనిషి నాతోబాటు ఉంటూ ఉండేవాడు. అయితే పాపం అతగాడికి క్షయవ్యాధి సోకింది. దాంతో అతడు నానాబాధపడుతూ ఉండేవాడు. ఒకరోజు ఉదయం అతడిని నేను లేపి, పిడికెడు పంచదార తీసుకుని అతడి నోట్లో పోసాను. ఆ తరువాత అతడిని ఒక గదిలో పెట్టి బంధించాను. ఆ గదిలో నుండి బయటపడదామని ప్రయత్నించాడు. ఎందుకంటే అతనికి దాహంగా ఉంది మంచినీళ్ళు త్రాగుదామని చూస్తున్నాడు. గదిలోంచి బయటకు వస్తానని అరుస్తూ తలుపులు బాదుతున్నాడు. కాని నేను కదా అతడ్ని ఆ గదిలో పెట్టింది, అందుచేత తలుపు తియ్యడానికి ఎవరూ సాహసించలేదు. మధ్యాహ్నం అయింది. అప్పుడతడిని బయటకు తీసుకువచ్చి భోజనం పెట్టాను. తరువాత జబ్బు నుండి కోలుకున్నాడు. నిజంగా మీకెవ్వరికైనా పంచదార తినాలనిపిస్తే మాత్రం ఎక్కువుగా తినవద్దు. ఒక చిటికెడు నోట్లో వేసుకోండి, అని చెప్పి కథ ముగించారు.

ఇంతకు పూర్వం వామనరావుకు ఎంత పంచదార తిన్నా తృప్తి ఉండేది కాదు. దానివల్ల తరుచుగా ఎక్కువెక్కువుగా పంచదార తింటూ ఉండేవాడు. అతడి అలవాటు గురించి ఇంకా ఇలా చెపుతున్నాడు. "పంచదార తినే ఆలోచన తప్ప ఇంకొకటి ఉండేది కాదు. నేను షిరిడికి వద్దామనుకున్న రోజుకు ముందు రోజు మా అక్క కొన్ని లడ్డూలు పంపించింది. దారిలో తిందామని నేను వాటిని తీసుకున్నాను."

దీనివల్ల మనకు తెలుస్తున్నదేమిటంటే మన ఆలోచనలన్నీ బాబా పర్యవేక్షణకు లోబడే ఉంటాయి.

(ఇదంతా స్వామి సాయిశరణానంద రచించిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

## 15
# సద్గురువుకు సేవ చేయ్యాలంటే అంకితభావం ఉండాలి

రాధాకృష్ణమాయి మొత్తం జీవితాన్ని తన సద్గురు సేవకు అంకితం చేసిన మనిషి. ఆ సేవా కార్యక్రమంలో ఉదయం నుండి రాత్రి వరకు శ్రమిస్తూ ఉండేది. ఎంతగా శ్రమించినా ఎన్నడూ ఎటువంటి ఆరోపణ చెయ్యలేదు. అయినప్పటికీ ఆమె మాటలు చాలా పదునుగా ఉండేవి. కాని ఆమె హృదయం మాత్రం బంగారం లాంటిది. కొన్ని ఆమెకు నచ్చని విషయాలను వెంటనే వ్యతిరేకించేది. ఇంకా అవుసరం వస్తే కోపం ప్రదర్శించేది.

బాబా వామనరావును రాధాకృష్ణమాయి వద్దకు పంపించేవారు. అందువల్ల కొన్ని పనుల్లో ఆమెకు సహాయపడమని చెప్పేవారు. వామనరావు, బాబా ఆజ్ఞ ప్రకారం నడుచుకునేవాడు. రాధాకృష్ణమాయి చెప్పిన పనులన్నీ చక్కగా చేసి పెట్టేవాడు. ప్రతిరోజు ఉదయం మాయి బాబాకు సంబంధించిన వెండి సామాన్లను శుభ్రపరిచేది. దానివల్ల ఉదయం ఫలహారానికి అవి సిద్ధంగా ఉండేవి. వంటసామాన్లు తోమేటప్పుడు మట్టికి బదులుగా ఆవుపేడను ఉపయోగించేది. వామనరావుకు పనులన్నీ ఎలా చేయాలో చేసి చూపించేది. వామనరావు బయటకెళ్ళి శుభ్రమైన ఆవుపేడను తీసుకువచ్చి సామన్లు మెరిసేటట్లు తోమేవాడు. బాబా లెండిభాగ్‌కు వెళ్ళగానే వామనరావును తన ఇంటికి రమ్మనమని చెప్పేది. అలాగే వామనరావు కూడా బాబా అటువెళ్ళగానే మాయి గుమ్మం ముందు నిలబడేవాడు. ఒక్కోసారి మాయి తలుపు మూసి ఉంటే మాత్రం, వామనరావు తిరిగి ద్వారకామాయికి రావడం ఆలస్యమయ్యేది. అప్పుడప్పుడు మాయి కారణం ఉన్నా, కారణం లేకున్నా వామనరావును తిడుతూ ఉండేది. కాని వామనరావు పట్టించు కునేవాడు కాదు. అతని పనేదో అతను చేసుకుంటూపోయేవాడు. తను చేసే పనుల్లో అంతరాయం కలగకుండా జాగ్రత్తగా ఉండేవాడు. ఏదిఏమైనాప్పటికీ తనకు అప్ప

జెప్పిన పని మాత్రం పూర్తిచేసేవాడు. కొద్దికాలంలోనే గురువుకు సేవచెయ్యడమన్నది సామాన్య విషయం కాదని గ్రహించగలిగాడు. చాలా వినయ విధేయతలతో ఉండడమే కాక, ఎంతో కష్టానికి కూడా ఓర్చుకోవల్సి వచ్చేది.

ప్రతిరోజు ఉదయం 8గంటలకు బాబా లెండీభాగ్‌కు వెళ్ళి, ఒక గంట తరువాత తిరిగి వచ్చేవారు. ఈ సమయంలోనే మాయి, వామనరావు కలిసి బాబా కూర్చునే గద్దెను శుభ్రపరిచి గట్టిపరిచేవారు. మాయికి వామనరావు ఎంత సహాయం చేసినా అప్పుడప్పుడు ఆమె అతనిపై గట్టిగా అరుస్తూ ఉండేది. దానివల్ల ఆ పనిలో కొంత ఆలస్యం జరిగేది. ఇలాంటి సంఘటనలు వామనరావుకు బాధ కలిగించేవి.

ఒకసారి ఎవరో భక్తులు బాబాకు ఆకుపచ్చ రంగు జెండాలను బహుకరించారు. ఇవి చాలా సంఖ్యలో ఉన్నాయి. ఇవి ఎంతో అందంగా ఉండి, చిన్న చిన్న రాటలపై కట్టడానికి వీలుగా ఉన్నాయి. మాయికి ఈ జెండాలు ఎంతగానో నచ్చాయి. వెంటనే ఆమె బాబా నడిచే దారికిరుప్రక్కలా ఆ జెండా రాటలు పాతడానికి వీలుగా గొయ్యల్ని త్రవ్వింది. ఈ త్రవ్వకం గురుస్థానం చివరనున్న మూల నుండే మొదలైంది. అక్కడ నుండి బాబా నడిచి వెళ్ళే లెండీభాగ్ వరకు సాగింది. ఈ పనంతా మాయి చేస్తూ ఉండేది. కొద్ది రోజుల తరువాత వామనరావును చెయ్యమంది. ప్రతిరోజు ఉదయం జెండా రాటలు గొయ్యల్లో పెట్టాలి. ఈ పనంతా బాబా లెండీభాగ్‌కు వెళ్ళకముందే జరగాలి. బాబా తిరిగి వచ్చిన తరువాత మళ్ళీ ఆ గొయ్యలో ఉన్న జెండా రాటలు బయటకు తీసేయాలి. కానీ ఈ పని బాబా దర్బారు నిర్వహించే సమయంలోనే పడుతూ ఉండేది. అందువల్ల దర్బారు సమయంలో ఈ పని చేయడం వామనరావుకు ఇష్టం ఉండేదికాదు. అలాగే ఒకరోజు ఈ పని చేయకుండా దర్బారులో కూర్చున్నాడు. బాబా ఏమీ అనలేదు కానీ అతడిని దర్బారు వదిలిపెట్టి బయటకు పొమ్మన్నారు.

బాబా అలా అనడంతో వామనరావుకు విషయం అర్థమైంది. బహుసా

మాయి, జెండాల కార్యక్రమానికి బాబా అనుమతి తీసుకున్నాది అనుకున్నాడు. కానీ మాయి ప్రత్యక్షంగా ఈ విషయం బాబాకు చెప్పినట్లు లేదు. అయితే మాయికి బాబాకి మధ్య మానసిక సంభాషణ (telepathy) జరుగుతూ ఉంటుంది. ఆ ప్రకారంగా చాలా పనులు వారు కలిసి చేస్తుంటారు. ఈ సంఘటన తరువాత వామనరావు ఇక సాయి దర్బారుకు పోవడం మానుకున్నాడు. జెండా కార్యక్రమాన్ని కొనసాగించేవాడు. అందుకే వామనరావు ఇలా చెప్పాడు. "నాకు అర్థమయ్యిందేమిటంటే దారికిరుప్రక్కలా జెండాలు పెట్టే పనిని మాయి మొదలుపెట్టడానికి ముందుగా ఆమె బాబా అనుమతి తీసుకుని ఉండి ఉంటుంది." కాబట్టి మాయి నాకు అప్పగించిన పనిని వదిలిపెట్టి బాబా దర్బారుకు వెళ్ళడం అనేది నేను చేసిన తప్పే. దాని తరువాత నేనెప్పుడూ దర్బారుకు వెళ్ళే ఆలోచన కూడా చేయలేదు. అప్పుడప్పుడు నాకు అనిపిస్తూ ఉంటుంది, మాయి ఒక దేవతేమోనని.

సాయంకాల సమయంలో బాబా బయటకు నడిచివెళ్ళి, తిరిగి ద్వారకామాయికి వస్తూంటారు. అలా వచ్చిన తరువాత కాళ్ళు కడుక్కుని తన స్థానంలో కూర్చొని ఉంటారు. తాత్యాకోటె, ఎవరో ఇవ్వగా ఎక్కువ పరిమాణంలో గుగ్గిలం పట్టుకొచ్చాడు. బాబా తన స్థానంలో కుదురుగా కూర్చున్న తరువాత తాత్యా గుగ్గిలం వెలిగించేవాడు. ఈ గుగ్గిలం దూపం కొరకు వాడేవారు. ఇది ఒకరకమైన ఔషదమొక్క నుండి వస్తుంది. ఆ మొక్క నుండి కారే జిగురు వంటి ద్రవ్యాన్ని గుగ్గిలం అంటారు. దీన్ని మూలాలు టిబెట్‌లో ఉన్నాయని అంటారు. వెలిగించిన బొగ్గుల కుంపటిపై ఈ గుగ్గిలం గుండను చల్లితే మంచి సువాసన గల పొగ వస్తుంది. అది ఆరోగ్యానికి చాలా మంచిదని అంటారు. ఆ పని మొదట్లో మాయి చేస్తూ ఉండేది. తరువాత వామనరావుకు అప్పగించింది. సద్గురువుకు సంబంధించిన ఇంకొక పని రావడంతో, వామనరావు ఎంతగానో ఆనందించాడు. ఇదేపని చేసే విషయంలో మాయి ఒకసారి వామనరావుతో తగువుపెట్టుకుని, ఇంక ఈ పని చేయవద్దని చెప్పింది. ఇంకో భక్తుడికి అప్పగించింది.

కానీ కొన్నాళ్ళకి బాబా స్వయంగా కలిగించుకొని, ఆ భక్తుడిని గుగ్గిలం వెలిగించే పని నుండి తప్పించేసారు. అదేరోజు సాయంత్రం మాయి, వామనరావును పిలిచి తను తప్పుచేసానని ఒప్పుకొని తిరిగి వామనరావునే గుగ్గిలం దూపం బాబా ఎదుట వెలిగించమని చెప్పింది. మనందరం మాయికి కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే, గుగ్గిలం బాబా ఎదుట వెలిగించే ఆచారం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఈ కాలంలో బాబాకు ఆరతి ఇచ్చే ముందుగా, ఒక అధికారి ద్వారకామాయికి పోయి, ఒక బంగారు పళ్ళెం (దూప్‌దన్) నిండా మండుతున్న బొగ్గులు ధునిమాయి నుండి తీసుకుని వస్తాడు. అప్పుడు అక్కడ పూజారి సాంబ్రాణి మొదలైన సుగంధ ద్రవ్యాల్ని దాని మీద జల్లి బాబా విగ్రహం ముందు పెడతాడు. బాబా ఆరతి పూర్తి అవగానే తిరిగి దూప్‌దన్, ధునిమాయికి చేరుస్తారు.

దీని సారాంశం ఈ విధంగా చెప్పుకోవచ్చు. ఎవ్వరైనా సద్గురువుకు సేవ చెయ్యాలంటే, సహనం, కట్టుబడి ఉండే గుణం, అంకిత భావం చాలా ముఖ్యమైన లక్షణాలుగా తెలుసుకోవాలి. అప్పుడు కఠినతరమైన ఆధ్యాత్మిక ప్రయాణంలో సద్గురువు మనకి చేయూత ఇస్తారు. అన్నింటికన్నా ముఖ్యమైనది, ప్రాధమికమైనది ఏమిటంటే సద్గురువు సేవలో ఉన్న సాధకుడు ఎప్పుడూ నిస్పృహ చెందకూడదు. ఇంకా ఎటువంటి భేదభావానికి చోటివ్వకుండా సేవలందించాలి. ఈ లీలకు సంబంధించిన ఒక ఉదాహరణ చెప్పాలంటే, జెండా కర్రలు తీసివేసే కార్యక్రమంలో మాయికి సహాయపడడం అన్నదేమీ తక్కువ రకం పనికాదు. ఇది కూడా సద్గురువుకు చేసే సేవ క్రిందికే వస్తుంది. బాబా దర్బారుకు వెళ్ళే పనితో సమానమైనదే అని తెలుసుకోవాలి. మనందరం, మన సమీప గురువుతో బాటుగా, సద్గురువైన బాబా పర్యవేక్షణలోనే ఎల్లప్పుడూ ఉంటాం. మాయికి సహాయపడుతూ జెండాలు నిలబెట్టడ మంటే, మనలో వెలుగుతున్న అసలు 'నేనును' నిలబెట్టడమే. ఈ చర్యే మనల్ని బాబా కృపకు పాత్రులుగా చేస్తుంది. అంతేకాని ఈ మాయా ప్రపంచంలో నకిలీ నేను

అనబడే జెండాను నిలబెడితే (అనగా దేహాభిమానంతో ప్రవర్తించడం) మనం ఎప్పటికీ బాబా కృపకు పాత్రులం కాము. ఇలాగే ఇంకొక విషయం. మాయి ఆజ్ఞ ప్రకారం జెండాలు తీసెయ్యడమంటే మనలోని నకిలీ నేనును తొలగించుకోవడమే. ఇదే విషయం బాబా పరోక్షంగా వామనరావుతో చెప్పారు. ఇక్కడ దర్బారులో కూర్చొనే కంటే, మాయి దగ్గరకుపోయి జెండాలు తీసే పని చెయ్యి అన్నారు. మాయి, వామనరావుకు సమీప గురువు. అందుచేత ఆమె సూచించినట్లుగా వామనరావు చెయ్యవలసిన పని జెండాలు తీసెయ్యడం. అంటే పైన చెప్పినట్లుగా తనలోనున్న నకిలి నేనును పారద్రోలడం. అప్పుడు మాత్రమే వామనరావు బాబా దర్బారుకు అర్హత సంపాదించగలడు. ఇంక బాబా దర్బారు విషయానికొస్తే, ఆ దర్బారు మనలను సాధనామార్గం వైపు మళ్లించే మార్గదర్శి. అదే సచ్చిదానంద స్వరూపాన్ని ఆవిష్కరిస్తుంది.

(ఇదంతా స్వామి సాయిశరణానంద రచించిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

# 16

## ద్వారకామాయి అంటే బాబాకు, మాయికి చాలా ఇష్టం

ద్వారకామాయిలో ధుని దగ్గర ఒక స్తంభం ఉంది. ఒకసారి బాబా ఆస్తంభాన్ని వామనరావుకు మిగతా భక్తులకు చూపెడుతూ ఒక కథ చెప్పారు.

చాలాకాలం క్రిందట ఆస్తంభం అడుగున ఒక గుహ ఉండేది. రోజుల తరబడి నేను ఆ గుహలో ఉంటూ, ఎప్పుడో కాని బయటకు వచ్చేవాడిని కాదు. ఆ రోజుల్లో నాకు పొడవైన జట, బాగా పెరిగిన గడ్డం ఉండేవి. ఆ గడ్డం కూడా ఎంత పెద్దదంటే నిల్చుంటే క్రింద నేలకు తగిలి చుట్టలు కట్టేది. నేను బయటకు వచ్చి నడుస్తూ ఉంటే గడ్డం నేలను శుభ్రపరుస్తూ ఉండేది. అయితే ఎవ్వరైనా సాధువుకాని, దైవభక్తి పరాయణుడు కాని వస్తే నేను గుహ బయటకు వచ్చి వారిని కలుసుకునేవాడిని. దైవ సంబంధితమైన కథలు చర్చకు వచ్చేవి. ఆ రోజుల్లోనే నేను కాఫీ త్రాగేవాడిని. అది ఎటువంటి కాఫీ అంటే, అందరూ త్రాగే కాఫీ లాంటిది కాదు. పాలు సగం, నీళ్ళు సగం తీసుకుని, శొంటి గుండ, కాస్త కాఫీ గుండ కల్పి తయారు చేసేది. ఇంకా అలాగే నేను ఒక రకం కూర చేసేవాడిని. దానికి నాకు కావల్సినవి, లేత లేత గడ్డి పరకలు. (వీటిని 'మరాఠీలో గౌతికే బాజి' అంటారు. ఇది ఒక రకం లేత ఆకుపచ్చ ఆకుకూర, పశువులు తినే గడ్డి మధ్యలో పెరుగుతుంది. దీనికి ఒక రకం పిండి ముద్దలు కలిపి ఇంకో రకం మసాలా కూడా కల్పి రుబ్బి, దానితో కూర తయారు చేస్తారు). ఇదీ బాబా చెప్పిన స్తంభం కథ.

రాధాకృష్ణమాయికి బాబాలాగే ద్వారకామాయి అంటే చాలా యిష్టం. ప్రతి పండుగకు ముందుగా ద్వారకామాయిని శుభ్రపరుస్తూ ఉండేది. ఆమెకు వామనరావు, ఇతర భక్తులు సహాయపడుతూ ఉండేవారు. ఆమె ఏ విధంగా ద్వారకామాయిని ముస్తాబు చేసేదో చెపుతున్నారు. మొదటగా పలుచటి మట్టి ముద్దలు తెచ్చి గోడలకున్న కన్నాలు, పగుళ్ళు కప్పేది. తరువాత గోడలన్నీ, మంచిమట్టి, ఆవుపేడ కలిపిన పలుచటి

మిశ్రమంలో ఒక గుడ్డను ముంచి దానితో అలికేది. ఆ విధంగా ద్వారకామాయి గోడలన్నీ ఆవుపేడ ముద్దతో బాగా రంగులు వేసినట్లుండేది. ఇంతవరకూ గోడల ముస్తాబు అయిన తర్వాత, మాయి నేల మీద దృష్టి సారించేది. ముందుగా సభా మండపం, బాబా కూర్చొనే గర్భగుడి స్థానం చక్కగా తుడిచేది. నీళ్ళతో బాగా కడిగేది. ఆ తరువాత ఆవు పేడతో ఆ నేలంతా అలికేది. ఇదే ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది. పండగల ముందు ఇలా శుభ్రపరుస్తారు. కాని ఇప్పుడు గోడలన్నీ అధునాతన పెయింటింగులతో అలంకరిస్తున్నారు. అప్పుడు మాయి నేల మీద కనబడే పగుళ్ళను మట్టితో కప్పి ఆవుపేడతో అలికేది. ఎక్కువ శ్రమతో కూడిన ఈ పనులన్నీ రోజు విడిచి రోజు బాబా లేని సమయాల్లో చేసేవారు. బాబా చావడిలో పడుకొనే రోజుల్లో ముఖ్యంగా చేసేవారు. ఈ పనులన్నింటిలోనూ మాయికి వామనరావు సహాయకుడిగా ఉండేవాడు.

ఒక రోజైతే, బాబా లెండిభాగ్‌కు వెళ్ళినప్పుడు మాయి ఈ పని చెయ్యాలనుకుంది. ఆమె ఒక బకెట్టు నిండా మన్ను, ఆవుపేడ కలిపిన మిశ్రమాన్ని పట్టుకొచ్చింది. దాన్ని సభామండపంలో బాబాకు చెందిన రాయి దగ్గర పెట్టింది. ఇంక నేల అలుకుదామని బకెట్టును వెనకపెట్టి తాను ముందు కూర్చుంది. అక్కడే వామనరావు కూడా ఉన్నాడు. వామనరావుకు బకెట్టు కనపడుతోందికాని మాయికి వెనకనుండడం వల్ల బకెట్టు కనపడదు. ఇంతలో ఆడుకునే పిల్లలు కొంతమంది ఆ ప్రదేశానికి వచ్చి, బకెట్టులోని ఆవుపేడతో ఉండ చుట్టుకుని ఉన్న గుడ్డను బయటకు లాగి, దాంతో బంతాట ఆడుతున్నారు. దానివల్ల ఆమిశ్రమం అంతా చెల్లాచెదురుగా చుట్టుప్రక్కలంతా పడింది. వామనరావు అక్కడే ఉన్నా, ఏదో ఆలోచిస్తూ ఆ పిల్లల్ని వారించకుండా ఉండిపోయాడు. పిల్లలు ఆట చప్పుడు విని మాయి వెనక్కు తిరిగింది. పిల్లల అల్లరిని ఆపకుండా చోద్యం చూస్తున్న వామనరావుని రెండు చెంప దెబ్బలు కొట్టింది. పిల్లలు అలా పాడుచేస్తూ ఉంటే చూస్తూ ఎలా ఊరుకున్నావని కసురుకుంది. వామనరావు ఏం చెయ్యలేక మాట్లాడకుండా ఉండిపోయాడు. మాయి తిరిగి ఇంటికి చేరిన తరువాత, వామనరావుని బుజ్జగించింది. తాను కొట్టినందుకు క్షమాపణ

కోరుకుంది.

**దీని సారాంశం ఇలా చెప్పుకోవచ్చు.**

గురుకులంలో ఒక్కోసారి గురువు శిష్యులను కోపగించుకున్న సందర్భాలు ఉంటాయి. కాని ఇది శిష్యులను సరైన మార్గంలో పెట్టడానికే అని అర్ధం చేసుకోవాలి. ఒకసారి శిష్యులు తమ తప్పుతాము తెలుసుకొంటే గురువు ఆనందపడతాడు. ఇంకా శిష్యులను అనునయంతో దగ్గరకు తీసుకుంటాడు. ఒక తల్లి తన పిల్లలని చేరదీసినట్లు గురువు శిష్యులను చేరదీస్తాడు. మన సద్గురువైన శ్రీ సాయిబాబా మనను మంచి మార్గంలో పెట్టడానికి, మన పనిలో మనకి దీక్ష పట్టుదల పెరగడానికి తగిన పాఠాలు బోధిస్తారు. దీనికంతకూ అత్యంత ముఖ్యమైన ప్రాధమిక అవసరం శ్రద్ధ అని తెలుసుకోవాలి.

(ఇదంతా స్వామి సాయి శరణానంద రచించిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

# 17

## అన్ని వ్యవహారాల్లోనూ ఆరితేరిన మనిషి రాధాకృష్ణమాయి

ప్రతిపనిలోనూ రాధాకృష్ణమాయికి మంచి అనుభవం ఉంది. ఆమెకు తెలియని విషయం అంటూ ఏదీ ఉండదు. అలాగే ఆమె చెయ్యలేనిది కూడా ఏదీలేదు. ఉదాహరణకు కొవ్వొత్తుల సంగతి చూద్దాం. వెలిగి వెలిగి ఆరిపోయిన కొవ్వొత్తి శకలాలను సేకరించి, అన్నింటినీ కల్పి మరిగించి ఒక ప్రమిదలో పోసి వత్తి వేసి ఉంచుతుంది. అప్పుడు అది ఒక క్రొత్త కొవ్వొత్తి అవుతుంది. ఒకసారి బాబాకు ఏదో పార్శలు వచ్చింది. దాంట్లో చాలా రంగు రంగుల కాగితాలున్నాయి. వాటిని పారవెయ్యకుండా మాయి వాటితో చిన్న చిన్న కాగితపు పువ్వులు చేసింది. వామనరావుకు పువ్వులు చేసే పని నేర్పింది. ఖాళీ సమయాల్లో ఇలాంటి పువ్వులు చేస్తూఉండని చెప్పేది. అలా తయారు చేసిన పువ్వులన్నీ దండలుగా కట్టి చావడిని అలంకరించేది.

పంటకాలంలో మొక్కజొన్న కంకులు సేకరించి, గంటలతరబడి వాటిని బాది గింజలు ప్రోగు చేసేది. కొన్ని గంటలసేపు వాటిని ఉడికించి బాబా గుర్రమైన శ్యామ్ కరణ్‌కు తినిపించేది. మాయి చేసే పనులను వామనరావు బాగా మెచ్చుకుని ఇలా అనేవాడు. మాయి ఏఏ పనులు చేస్తుందో, అన్నింటినీ నాకు నేర్పింది. నేను ముంబాయి నుండి వచ్చినప్పుడు, చావడి గుమ్మాలకు కిటికీలకు కర్టెన్లు కుట్టింది. అలాగే నాకు కూడా కర్టెన్లు ఎలా కుట్టాలో నేర్పింది. ఇవేకాక వడ్రంగి పన్లు కూడా చేసేది. నాకు కర్ర ఎలా చెక్కాలో, ఎలా చిత్రిక పట్టాలో చెప్పింది. అన్నింటికన్నా నాకు నచ్చింది, ఆమెలో గల కష్టపడే గుణం. శని మందిరం దగ్గర ఒక నుయ్యి ఉంది. ప్రతిరోజు సాయంత్రం ఆ నూతి నుండి నీళ్ళు తోడి తెచ్చేది. దానికోసం ఒక బిందె, బకెట్టు తెచ్చి ఆ రెండింటినీ నీళ్ళతో మోసుకుంటూ వచ్చేది. ఇది చాలా బరువు పని. మగవాళ్ళు మాత్రమే చెయ్యగలిగేది. నేను ఆమెకు సహాయం చేద్దామని ఒకటి రెండుసార్లు వెళ్ళేను. ఎంత

బరువు పనైనా, మాయి కనురెప్ప వాల్చకుండా చేసేది. ఎప్పుడైనా మా బంధువర్గం వారు షిరిడికి వస్తే నాకు పని అప్పచెప్పేదికాదు. ఒకసారి నేను ఆమెకు చెప్పకుండా నీళ్లు మోసుకు వచ్చాను. కాని నేను చేసిన పని ఆమెకు నచ్చలేదు. కోపంతో నేను తెచ్చిన నీటిని క్రింద పారబోసింది. ఆ తరువాత ఆమె ఒక్కర్తే అర్ధరాత్రి పూట నూతికి పోయి నీళ్ళు తెచ్చింది. ఇలా తెచ్చిన నీళ్ళను, ఆమె కొరకు కొన్ని ఉంచుకొని, మిగతావి బాబా ఉపయోగానికి భద్రపరచేది. ఇలాంటి బరువుపన్లు చేయడం నాకు అలవాటు లేదు కాబట్టి అప్పుడప్పుడు కొన్ని సామాన్లు చేతుల్లోంచి జారి క్రిందపడి పగిలిపోయేవి. ఒకసారి ఇంట్లో ఉన్న అలమారను శుభ్రం చేస్తున్నాను. దాంట్లోమాయి కొన్ని గాజు జాడీలను పెట్టింది. అనుకోకుండా ఆ జాడీలు క్రిందపడి పగిలాయి. అప్పుడు నెవర్కార్‌ను, నా డబ్బులు పెట్టి కొత్త జాడీలు కొనమని చెప్పాను. కాని నెవర్కార్ ఆ విషయం మాయికి చెప్తే, ఆమె వద్దని చెప్పింది. మాయి ఔదార్యానికి నేను ఆమెను పొగిడాను. ఇలాంటి ఎన్నో విషయాల్లో ఆమె పెద్ద మనసుతో ప్రవర్తించేది. నిజంగా ఇటువంటి గొప్ప గుణాలను ఆమె నుండి నేను నేర్చుకుందికి నాకు అనేక అవకాశాలు వచ్చాయి.

ఎన్.వి. గునాజీ ఇలా అంటారు. “రాధాకృష్ణమాయి చేసే గొప్ప పనులు చాలా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి ద్వారకామాయికి సంబంధించినవే. మొత్తం మశీదుకంతా సున్నం వేసేది. నేల భాగమంతా తుడిచి కడిగేది. ధుని పొగవల్ల నల్లగా మారిపోయిన గోడలను ప్రత్యేక శ్రద్ధతో బాగుచేసేది. బాబా రోజు విడిచి రోజు చావడి కెళ్ళి పడుకునేవారు. బాబా లేని రోజు రాత్రి మశీదు పన్లు అన్నీ చేస్తూ ఉండేది. మశీదు సామాన్లన్నీ బయటపెట్టి శుభ్రం చేసిన తరువాత ప్రతి వస్తువూ యధాతదంగా పెట్టి ఉంచేది.” ఈ విషయం అంతా ఎన్.వి. గునాజీ వ్రాసిన ఇంగ్లీషు సాయి సచ్చరిత్ర, అధ్యాయం ఆరులో ఉంది.

కాకా మహాజని కూడా ఇలా అన్నారు. “శ్రీరామనవమి పండుగ ముందు

రాధాకృష్ణమాయి మశీదుకు పూర్తిగా తెల్లసున్నం వేసి, తుడిచి, కడిగి ఉంచేది. ఆ కారణం చేత ధునితో సహా ప్రతి వస్తువును బయటపెట్టి, అనగా సభామండపంలో పెట్టి, పనంతా అయిపోయిన తరువాత ఏవి ఎక్కడ ఉండాలో అవి అక్కడ ఉంచేది." ఆమె ప్రారంభించిన ఈ ఆచారం సాయి సంస్థాన్ వారు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా షిరిడీలో జరిగే మూడు ఉత్సవాల్లో, అన్ని పవిత్ర ప్రదేశాలు పూర్తిగా శుభ్రపరిచి క్రొత్తగా రంగులు వేసి సిద్ధం చేస్తారు.

దీనివల్ల తెలిసేదేమిటంటే, మాయి ఏ పని చేసినా దానికి బాబా అంగీకారం ఉండేది. అస్సలు ధునిని ఉన్న స్థానం నుండి ఇంకొక చోటుకు తరలించడం ఎవ్వరూ చెయ్యలేని, చెయ్యకూడని పని. కాని ఆ పని మాయి చేసేది. అంటే అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఎన్ని జన్మల నుండో బాబాకు, మాయికి దివ్యమైన ఆధ్యాత్మిక సంబంధం ఉండి ఉండాలి. కాబట్టే అది లోతైన, ఎవ్వరికీ అంతుపట్టని విషయం అయింది. రాధాకృష్ణ మాయి యొక్క నిస్వార్థ ప్రేమ భక్తి, యోగాభ్యాసం ఆమెను ఒక మహా యోగినిగా నిలబెట్టాయి. మాయి తన యోగశక్తి చేత పిశాచశక్తుల్ని నాశనం చెయ్యగలదు. అలాగే శాపాల్ని వరాలుగా మార్చెయ్యగలదు. ఇదంతా ఆమెకు బాబా కృపవల్ల లభ్యమైంది. ఇంకా అనేక జన్మలలో ఆమె చేసుకున్న తపస్సుల మూలంగా ఆమెకు బాబా వంటి సద్గురువు లభించారు.

దీని సారాంశమేమిటంటే, మనం ఏ పని చేసినా అది దైవ నిర్ణయం మీదే ఆధారపడి ఉంటుంది. ఇంకా సద్గురువు యొక్క ఆజ్ఞ ప్రకారం జరుగుతుంది. నిజానికి ప్రతి పనికి కర్తలం మనం కాదు. పరబ్రహ్మ స్వరూపుడైన సద్గురు సాయి బాబాయే, ఏ పనికైనా కారణం, కర్త, కార్యం, ఆయనే అయి ఉన్నారు.

(ఇదంతా స్వామి సాయి శరణానంద రచించిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)

## 18

## బాబా, రాధాకృష్ణమాయి తమ కృపను వామనరావుకు పంచి ఇచ్చారు

వామనరావు చెప్పింది ఇలా ఉంది. డిసెంబరు నెల 1916లో చాలామంది భక్తులు దీక్షిత్‌వాడాలో భోజనానికి కూర్చున్నారు. అయితే దీక్షిత్ భార్య వారితో కలవకుండా బయటకు షికారుకు బయలుదేరింది. దారిలో నన్ను చూసి తనతో భోజనానికి రమ్మనమని పిలిచింది. సరే అని చెప్పి ఆమెతో బాటుగ వెళ్ళి భోజనానికి కూర్చున్నాను. భోజనం చేస్తూ ఉండగా, ఒక అణాకాసు నేను కూర్చున్న స్థలానికి ప్రక్కన కనపడింది. నాకు ఆశ్చర్యమేసింది. ఆ కాసు అక్కడికి ఎలా వచ్చింది అని అనుకున్నాను. దీక్షిత్ భార్య దాన్ని అక్కడ పెట్టలేదు. పోనీ ఇంకెవరైనా అక్కడ కూర్చున్నారా? అంటే లేదు అనాలి. ఆ క్షణంలో బాబా కంఠస్వరం నాకు వినపడింది. "ఈ అణాకాసు మరేదోకాదు. సద్గురువు కృపే అని తెలుసుకో".


ఇలాంటిదే మరొక సంఘటన.. కొద్ది సంవత్సరాల క్రిందట నేను మాయి ఇంటి ప్రక్కనే ఒక గదిలో ఉంటూ ఉండే వాడిని. మాయి నాకు లభించిన సమీప గురువు. అందుచేత మా ఇద్దరి మధ్యా అనగా గురుశిష్యుల మధ్య ఒక ప్రత్యేక సంబంధం ఉండేది. ఒక రోజు మధ్యాహ్నం 3 గంటలకు మాయి నన్ను తిట్టడం మొదలుపెట్టింది. ఎందుకని అడిగాను. ఆమె దగ్గర ఉన్న ఒక అణాకాసు నేను దొంగిలించానని ఆరోపించింది. నేను దొంగతనం చెయ్యలేదని చెప్పాను. ఇంకా మీ అణా అస్సలు చూడలేదని చెప్పి నా దగ్గరన్న ఒక అణాను ఇచ్చి వేసాను. ఆమె నవ్వడం మొదలు పెట్టింది. నాకు అర్ధమయ్యింది. ఆమె ఉద్దేశ్యం ఏమిటంటే ఆమె జ్ఞాన ధనాన్ని నేను దొంగిలిస్తున్నాను అని ఆరోపిస్తోంది. అదంతా ఆమె చాలాకాలం నుండి కూడబెట్టుకున్న ఆస్తి అని ఆమె భావన.

ఇలాగే నేనొకసారి బాబాతో కలిసి ద్వారకామాయిలో కూర్చొని ఉన్నాను. బాబా నాపై ఒక విచిత్ర ఆరోపణ చేసారు. అక్కడే ఉన్న శ్యామాతో, ఈ వామనరావు

ఏం చేసాడంటే, నా రెండు కాళ్ళను కత్తిరించి పట్టుకుపోయాడు అన్నారు. బాబా నాకు దైవికమైన ఎన్నో అనుభవాలను ప్రసాదించారు. అలాగే ఎన్నో వింతలు చూపెట్టారు. వాటన్నింటికీ, బాబాకు నేను కృతజ్ఞతలు చెప్పుకున్నాను. బాబా ఏదైనా అన్నారు అంటే, అది ఇప్పటికీ ఎప్పటికీ నిత్యసత్యమై ఉంటుంది. నేను ఎంతగానో ఆనందించే వాడిని, ఎందుకంటే బాబా ఒక ప్రక్క, మాయి ఇంకొక ప్రక్క నిల్చొని నాకు సత్యాన్ని అనుభవానికి వచ్చేటట్లు చేసారు.

దీని సారాంశమేమిటంటే, ఒక్క సాధన మాత్రమే చేస్తూ ఉంటే మనం సద్గురు కృపను పొందగలమా. ఇది అంత సులభమైన పనిగాదు. సమర్థ సద్గురు సాయిబాబా దయ మనపై వర్షించాలంటే, మన శరీరం ఒక అస్థి పంజరం మాదిరి తయ్యారవ్వాలి. అదే చాలదు, మన శరీరంలో ప్రవహించే రక్తం యొక్క స్థిరత్వం నీటితో సమానంగా మారాలి.

(ఇదంతా స్వామి సాయి శరణానంద రచించిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)



# 19

# వామనరావు సందేహాలకు శక్తిపాతం ద్వారా సమాధానం చెప్పిన రాధాకృష్ణమాయి

వామనరావు ఇంటికి తిరిగి వెళ్ళడానికి బాబా ఒప్పుకునేవారు కాదు. 1913లో సుమారు పదకొండు మాసాలు ఎక్కడికీ వెళ్ళనివ్వలేదు. ఈ పదకొండు మాసాల్లో వామనరావు, బాబా మరియు మాయి శిక్షణలో గురుభక్తి గురించి క్షుణ్ణంగా తెలుసుకొన్నాడు. ఒక పతివ్రతకు తన భర్తపై ఎటువంటి ప్రేమ ఉంటుందో, అలాగే భర్త తప్ప తనకి వేరే దైవం ఇంకొకరు లేరని ఎలా తెలుస్తుందో అలాంటి ప్రేమ, భక్తి తత్పరత వామనరావుకు ఇటు బాబాపైన అటు మాయిపైన కూడా ఉండేది. అనగా పతివ్రత పాత్రలో వామనరావు, భర్త పాత్రలో బాబా కాని మాయి కాని ఉండేవారు.

వామనరావు ఇలా చెప్పేవాడు. ఆ రోజుల్లో లోకమాన్య బాల గంగాధరతిలక్ వ్రాసిన 'గీతారహస్యం' అనే గ్రంథం వెలువడింది. నేను దాన్ని అనేకసార్లు చదివేను. కాని నాకు ఆ గ్రంథంలో కొన్ని భాగాలు అర్ధంకాలేదు. నేను వాటి అంతరార్ధం గురించి అసలు ఆలోచించలేకపోయేవాడిని. ఇటువంటి సందర్భాల్లో సాధారణంగా సమాధానం కోసం మాయి దగ్గరకు వెళ్తూ ఉండేవాడిని. అలా నేను రాగానే, మాయి సాదాసీదాగా రా! వామన్యా! ఇలా కూర్చో, అని చెప్పి ఏవో రోజువారీ విషయాల గురించి మాట్లాడేది. అప్పటికీ నేను నా ప్రశ్నని చెప్పకుండానే, దానికి తగిన సమాధానం ఆమె మాటల్లో ప్రస్ఫుటంగా గోచరించేది. ఇంకోసారి నేను వెళ్ళి ఆమె ప్రక్కన నిలబడగానే, నాకు కావల్సిన సమాధానం ఒక వెలుగులాగ కనిపించేది. ఈ ప్రకారం ఒక మెరుపులాంటి దృశ్యం అప్పుడప్పుడు కనపడుతూ ఉండేది. బాబాయే ఈ మెరుపు రూపంలో వచ్చి నా సందేహాలను పోగొడుతున్నారేమో అని అనిపించేది. ఏది ఏమైనప్పటికీ నాకు సమీప గురువైన మాయికి హృదయపూర్వకమైన వందనాలు అర్పించుకుంటున్నాను. ఆమె నాకు ఏది కావాలో అదంతా ఇచ్చారు.

గురువు మనకి శక్తిపాతం ద్వారా సందేహనివృత్తి చేస్తూ ఉంటారు. ఇది మూడురకాలుగా జరగవచ్చు. ఒకటి వారి కృపాదృష్టి ద్వారా కలుగుతుంది. రెండు వారి చేతి స్పర్శ ద్వారా కలుగుతుంది. మూడు వారి మాట ద్వారా కలుగుతుంది. అయితే ఇక్కడ జ్ఞానార్థికి కొన్ని అర్హతలుండాలి. దానిలో అతి ముఖ్యమైనది, గురువుపట్ల అచంచలమైన విశ్వాసం, గురువు చెప్పే విషయాలను ఏకాగ్రతతో శ్రవణం చేయడం.


ఒక విషయం నాకు చాలా ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. నేను మాయి దగ్గరకొచ్చిన మొదటి రోజు నుంచీ గమనిస్తున్నాను, ఆమె నన్ను ఉదయం 6గంటలకు నిద్రలేపేది. నీ కోసం టీ కలిపేను. వేడివేడిగా ఉంది. లేచిరా! అనేది నేను ముంబాయి మా ఇంట్లో ఉన్నప్పుడు మా చిన్న చెల్లి గూడ ఇలాగే నన్ను 6 గంటలకు లేపి టీ పట్టుకుని ఇదేరకంగా మాట్లాడేది. నేను ఎప్పుడూ మా చెల్లి ఇలా పిలిచి టీ ఇచ్చేది అని మాయికి చెప్పలేదు. కాని ముంబాయిలో మా చెల్లి ఎలా నన్ను లేపేదో మాయికి ఎలా తెలుసు అని ఆశ్చర్యపోతూ ఉండేవాడిని. అప్పుడు నాకు అనిపించింది, మాయి సామాన్య స్త్రీకాదు. ఆమె ఒక దేవత. ఎప్పటికీ నేను ఆమెకు ఋణపడి ఉంటాను. బాహ్యంగా అంతరంగంగా నన్ను ప్రక్షాళన చేసిన గురువు రాధాకృష్ణమాయి. ఎప్పటికైనా నేను ఆమె ఋణాన్ని తీర్చుకోగలనా అన్నది సందేహమే.

ఈ లీల ద్వారా బాబా, తన గురుకులంలో ఉన్న మనకు, పదకొండు అనబడే అంకె యొక్క సమర్ధవంతమైన జ్ఞానాన్ని ఇలా అందిస్తున్నారు. ఒకటి అంకెకు ఇంకొకటి కలపగా వచ్చే రెండు అనే అంకె జీవాత్మ, పరమాత్మలను సూచిస్తుంది. అలాగే ఒకటిని, ఇంకొకటి చేత గుణిస్తే వచ్చేది కూడా ఒకటే ఎలాగవుతుందో, అదే పరబ్రహ్మమును సూచిస్తుంది. ఇంక, ఒకటిని ఇంకొకటి చేత భాగించినా కూడా వచ్చేది ఒకటే, మిగిలేది సున్నా ఎలా అవుతుందో, అలాగే పరబ్రహ్మమైన ఒకటిని ఎన్ని రకాలుగా భాగించినా మిగిలేది పరబ్రహ్మమే. అదేవిధంగా ఒకటి నుండి ఇంకొకటి తీసివెయ్యగా కూడా మిగిలేది సున్నా ఎలా అవుతుందో అలాగే పూర్ణం నుండి (పరబ్రహ్మ నుండి) పూర్ణం తీసివేస్తే మిగిలేది కూడా పూర్ణమే. ఇదే శాంతి

మంత్రం. ఓం. పూర్ణమదః పూర్ణమిదం, పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥ఓం శాంతిః శాంతిః శాంతిః॥

దీని సారాంశాన్ని ఈ విధంగా చెప్పవచ్చు. పరబ్రహ్మ స్వరూప స్థితి ఎప్పటికీ ఒక్కటిగానే ఉంటుంది. కాని ప్రకృతి పరంగా మనకు జీవాత్మ పరమాత్మల మధ్య మాయ వల్ల తేడా కనపడుతూ ఉంటుంది. కాబట్టి, పరమాత్మ శాశనం ప్రకారం మనం సాధన చేసి ఈ రెండు ఒకట్లను దగ్గరగా చేరిస్తే అది ముందు పదకొండులాగ కనపడుతుంది. తరువాత సమర్థ సద్గురుసాయి బాబా పాదాల వద్ద శరణాగతి చేసి జ్ఞాన, కర్మేంద్రియాల్ని, అంతఃకరణ చతుష్టయాన్ని సమర్పిస్తే, జీవాత్మ పరమాత్మల మధ్య తేడా మిధ్యగా కనపడి అంతా ఏకం అవుతుంది.

(ఇదంతా స్వామి సాయి శరణానంద వ్రాసిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)



# 20
# బాబా ముగ్గురు సన్యాసుల రూపాల్లో ప్రత్యక్షమగుట

1917మే నెలలో వామనరావు మోతాగాంకు వెళ్ళాడు. అక్కడ తల్లి, చెల్లితో కలిసి ఉండేవాడు. న్యాయవాద వృత్తికి సంబంధించిన పరీక్షలకు చదువుకోవటానికి, ఇంకా దెబ్బతిన్న తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవటానికి మోతాగాంలో ఉండవల్సి వచ్చింది. అదే సమయంలో రామేశ్వర్ దేవాలయంలో ఒక యజ్ఞం చేస్తున్నారు. దానికి సహాయ సహకారాలు అందిస్తున్న పెద్దమనిషి పేరు దేవశంకర్‌హరి జీవన్‌గోఖలే. ఆ యజ్ఞం పేరు మహారుద్ర యజ్ఞం. ఇటువంటి గొప్ప యజ్ఞాన్ని తిలకించడానికి, దానిలో పాలుపంచుకోవడానికి అనేకమంది భక్తులు, యోగులు కూడా వచ్చి చేరారు. ఒకరోజు సాయంకాలం, ఆ రోజున చెయ్యవలసిన యజ్ఞక్రియ పూర్తి అవగానే, యజ్ఞం చూడడానికి వచ్చిన ముగ్గురు సన్యాసులు వామనరావుకు కన్పడ్డారు. వారికి ఉండడానికి బసలేదు. అంతేకాకుండా వారి బిక్షకు సంబంధించిన ప్రయత్నం కూడా ఏదీ జరగలేదు. వెంటనే వామనరావు స్పందించి నీలకంఠ మహదేవ్ మందిరంలో వారికి బస ఏర్పాటు చేసాడు. అలాగే తనతల్లికి చెప్పి ఆసన్యాసులు ముగ్గురికి బిక్ష ఏర్పాట్లు చేసాడు. తల్లి చెప్పిన ప్రకారం, వామనరావు చెల్లి మోఘిబెన్ వంట చెయ్యడానికి, వడ్డించడానికి ఒప్పుకుంది.

ఆ ప్రకారంగా మోఘిబెన్ మంచి రుచికరమైన భోజనం తయారు చేసింది. వామనరావు చేతులు కడుగుకొని, ఆ సన్యాసులను, అక్కడ ఏర్పాటు చేసిన మూడు పీటలపై కూర్చొనమని అర్థించాడు. భోజనాలకు అరిటాకులు ఏర్పాటు చేసారు. మోఘిబెన్ వడ్డించడానికి సిద్ధమయ్యింది. ముగ్గురు సన్యాసుల్లో మధ్యలో కూర్చొన్న వ్యక్తి తప్ప మిగతా ఇద్దరూ నీళ్ళు ముట్టుకొని భోజన మంత్రం చదువుకున్నారు. మధ్యలో కూర్చొన్న సన్యాసి మాత్రం, మంత్రం చదవలేదు. వామనరావు వైపు చూసి, నా చేతుల్లో ఇప్పుడు ఏమీ లేదు చూడు, నేను బిక్ష స్వీకరించేముందు నాలో ఉన్న సాలిగ్రామానికి నైవేద్యం పెడతాను అన్నాడు. (సాలిగ్రామం అంటే భగవంతుడైన విష్ణువు యొక్క ప్రతి రూపం. ఇది శిలా రూపంలో గండకీనదిలో దొరుకుతుంది.

ఈ  గండకీ నది నేపాల్లోని ముక్తిదామ్ దగ్గర ఉంది.) ఆ సన్న్యాసి, ఇంకా వామనరావుతో ఇలా చెపుతున్నాడు. నా నుదిటి భాగంలో ఉన్న ఎమక యొక్క గుల్ల ప్రాంతంలో ఈ సాలిగ్రామం ఉంది. దీన్ని నా సంకల్ప శక్తి చేత నోటి ద్వారా బయటకు తీస్తాను అని చెప్పి, అదే ప్రకారం నల్లటి శిలారూపంలో ఉన్న విష్ణు సాలిగ్రామాన్ని నోటి నుండి తీసి చూపెట్టాడు. దాన్ని అరచేతిలో పెట్టుకుని, దానికి అభిషేకం చేసి పూజ చేసాడు. తనముందున్న అన్నాన్ని ప్రసాదంగా పెట్టాడు. అప్పుడు ప్రక్కన కూర్చున్న సన్న్యాసులు కూడా చేతులు జోడించి సాలిగ్రామానికి నమస్కరించారు.

తరువాత వామనరావుతో తిరిగి ఆ సాలిగ్రామాన్ని యదాస్థితిలో పెడతానని చెప్పి నోట్లో పెట్టుకున్నాడు. ఆ కార్యక్రమం తరువాత ముగ్గురు సన్న్యాసులు బిక్ష స్వీకరించారు. వామనరావుకు జరిగినదంతా ఒక వింతలాగ కనపడింది. తనలో ఇలా అనుకున్నాడు. మధ్యలో కూర్చున్న సన్న్యాసి సాక్షాత్తు విష్ణుమూర్తిలాగే కనపడుతున్నాడు. అతను సాలిగ్రామాన్ని ఆజ్ఞా చక్రస్థానం నుండి బయటకు రప్పించాడు. ఆ సాలిగ్రామం విష్ణు స్వరూపమే. అందుచేత అతనికి ఇరు ప్రక్కల కూర్చున్న వారిద్దరూ బ్రహ్మ, శివుడు అయుంటారు అనుకున్నాడు. ఇంకా మధ్యలో కూర్చున్న సన్న్యాసి యోగ సిద్ధి చేత తన ఇష్టదైవాన్ని ఆజ్ఞా చక్రస్థానంలో ఉంచుకొని, తాను ఎక్కడికి వెళ్ళినా, అక్కడికి తీసుకొని పోగలుగుతున్నాడు. వామనరావు దగ్గర ఇప్పుడు ఋజువుంది. వచ్చి భోజనం చేసిన ఆ ముగ్గురూ త్రిమూర్తులే అనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులే. ఇంక ఈ సంఘటనతో వామనరావు, బాబాయే ఈ ముగ్గురు సన్న్యాసుల రూపంలో వచ్చి ఉంటారని, వారు ముగ్గురూ భగవాన్ దత్తాత్రేయులే అన్న అభిప్రాయానికి వచ్చాడు.

శ్రీపాద శ్రీవల్లభ చరిత్ర, అధ్యాయం 45లో శ్రీపాదులు, హనుమాన్‌తో ఇలా చెప్పారు. కలియుగంలో నేను సాయిబాబాగా జన్మిస్తాను. కాని శ్రీపాదులు అంశావతారంగా ఉండడానికి హనుమ ఇష్టపడకపోవడంతో శ్రీపాదులు తిరిగి ఇలా అన్నారు. నాయొక్క అంశావతారం ఎప్పుడూ నా మూలతత్త్వం కలిసే పనిచేస్తుంది. కాబట్టి మూలతత్త్వానికి ఉన్న శక్తి సామర్థ్యాలు అంశావతారం గూడ కలిగే ఉంటుంది.

తరువాత శ్రీపాదులు కాలపురుషుణ్ని ప్రత్యక్షమవమని ఆజ్ఞాపించారు. వెంటనే కాల పురుషుడు ప్రత్యక్షమయ్యాడు. అతడితో ఇలా అన్నారు. నేను హనుమాన్‌కు నాతో ఐక్యమయ్యే వరాన్ని ఇస్తున్నాను. దాని ప్రకారం హనుమాన్‌కు 'నాథ్' అనే బిరుదును ప్రసాదిస్తున్నాను. కాబట్టి ఇక నుండి హనుమాన్ "సాయినాథ్" అని పిలవబడుతాడు. ఇంకా ఈ పవిత్ర దినాన్ని దత్త జయంతిగా నిర్ణయిస్తున్నాను. ఇక హనుమాన్ యొక్క దివ్య చైతన్యం దత్త స్వరూపంగా మారిపోతుంది. ఈ ప్రకారం శ్రీపాదులు చెప్పగానే, హనుమాన్ మరియు శ్రీపాదులు ఇద్దరూ సమ్మేళనం చెంది, దివ్య రూపంతో శ్రీ సమర్ధ సద్గురు సాయిబాబాగా అవతరించారు. ఈ రకంగా సాయిబాబా అవతార రహస్యాన్ని, వామనరావు మననం చేసుకున్నాడు.

ముగ్గురు సన్యాసులు భోజనం ముగించి సంతృప్తి చెందారు. వామనరావుని, కుటుంబాన్ని హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. తరువాత ఆ ముగ్గురూ రామేశ్వర్ మందిరానికి వెళదామని లేచారు. దానికి ముందు వామనరావును పడుకోవడానికి చాపలు తెచ్చిపెట్టమని అడిగారు. అతడు కొంతసేపటికి, ఒక పని మనిషితో కల్సి చాపలు, తలగడలు పట్టుకుని మందిరానికి వచ్చాడు. అలా వామనరావు మందిరానికి వెళ్ళేసరికి, ముగ్గురు సన్యాసులు భగవంతుడి కీర్తనలు పాడుతున్నారు. వామనరావు కూడా ఆ పాటలు వింటూ కూర్చున్నాడు. ఆ కీర్తనల సారాంశం ఇలా ఉంది. "ధర్మ పతాకం చిరిగి ఉంది. లే! మేలుకుని అది గమనించు." ఇది విన్న వామనరావుకి బాబాయే ఈ మాటలు చెపుతున్నారా అని అనిపించింది. "వామనరావు! అనిత్యమైన ఈ ప్రాపంచిక విషయాలతో నీ జీవితాన్ని ఎందుకు ముడివేసుకుంటున్నావు. నిజానికి ప్రస్తుత పరిస్థితిని చూస్తే ధర్మ పతాకం చిరిగిపోయి ఉంది. అది తెలుసుకో. నువ్వు కూడా సన్యాసివై ధర్మాన్ని ఉద్ధరించు."

దీని సారాంశమేమిటంటే, ఆ ముగ్గురు సన్యాసులు బాబా తప్ప మరెవరో కాదు. దత్తాత్రేయులు అవతారమే సద్గురు సాయిబాబా.

(ఇదంతా స్వామి సాయి శరణానంద రచించిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

# 21

## రహతాలో వామనరావుకు కల్గిన వింత అనుభవం

ఒకరోజు మధ్యాహ్నం జోగ్, వామనరావును తనతో రహతాకు రమ్మనమని పిలిచాడు. ఇంకా ఇలా అన్నాడు, బాబా రహతాలో కుషాల్ చంద్ ఇంటికెళ్ళారు. నువ్వు నాతో వస్తే ఇద్దరం కలిసి వెళదాం. ఒక ఎడ్ల బండి నా కోసం బయట నిలబడి ఉంది. జోగ్, అతని భార్య బండి ఎక్కారు, వామనరావు కూడా వారితో బయలు దేరాడు. బండి సగం దూరం వెళ్ళగానే, ఒక చక్రం బురదలో దిగబడిపోయి బండి ఆగిపోయింది. అప్పుడు జోగ్ ఇలా అన్నాడు, వామనరావు! నీకు సిద్ధులున్నాయని అందరూ చెపుతూ ఉంటారు కదా! అందుచేత క్రిందకు దిగి ఒకసారి బండి చక్రం పట్టుకో. అలా అయితే బండి బయలుదేరుతుంది. అందరూ చెప్పినట్లుగా నీకు సిద్ధులున్నాయని నేను కూడా నమ్ముతాను. జోగ్ చెప్పినట్లుగానే వామనరావు బండి దిగి చక్రం పట్టుకున్నాడు. ఆశ్చర్యంగా బండి బురదలో నుండి ఒక్కసారిగా బయటకు వచ్చింది. జోగ్‌కు ఆనందమనిపించింది. చూసావా వామనరావు! అందరూ చెప్పినట్లుగా నీకు సిద్ధులున్నాయని ఇప్పుడు నమ్మకం కుదిరింది అన్నాడు.

జోగ్ అన్న మాటలకి వామనరావు పొంగిపోలేదు. తనకి సిద్ధులున్నాయా లేదా అన్నది అతని దృష్టిలో పెద్ద సమస్యకాదు. తనయందు జోగ్‌కు ఉన్న నమ్మకం వమ్ముపోలేదు. జోగ్ ఎలా నమ్మాడో అలాగే బురద గుంట నుండి బండి చక్రం కదిలి ముందుకొచ్చింది. నిజానికి ఇది తన గొప్పకాదు. ఇదంతా బాబా కృప. బాబా కృప ఉంటే ఏదైనా, ఎంతైనా సాధించవచ్చు అన్నది తన నమ్మకం. ఆ ప్రకారంగానే బండి చక్రం కదిలి బయటకొచ్చింది.

కొంతసేపటికి వాళ్ళు నదినిదాటి రహతాలో ప్రవేశించారు. కుషాల్ చంద్ ఇంటికి కాస్త దూరంలో బండి ఆగింది. అందరూ బండి దిగారు. జోగ్, అతని భార్య ఇంటిలోకి వెళ్ళారు. వామనరావు మాత్రం వారితో ఇంటిలోకి వెళ్ళలేదు.

ఇప్పుడు వామనరావుకు కల్గిన వింత అనుభవం గురించి చెపుతున్నారు. జోగ్‌తో కల్సి వస్తూ నదిని దాటినప్పుడు వామనరావు కళ్ళకు బాబా, నది ఆవల గట్టున నిలబడి ఉండడం కనిపించింది. వెంటనే వెళ్ళి బాబాను కలుసుకున్నాడు. బాబా, వామనరావు ఇద్దరూ కల్సి కొంతదూరం నడిచారు. అప్పుడు బాబా ఒక పెద్ద హాలులో ప్రవేశించారు. లోపలికి వెళ్తే అది సినిమాథియేటర్‌లాగ కనపడింది. తాను చదువు కున్నప్పటి కాలేజీలో పెద్ద క్లాస్‌రూం లాగ కూడా కనపడింది. హాలు నిండా అందరూ కూర్చొనడానికి చక్కటి ఏర్పాట్లు చేసారు. వరుసలో పొడవాటి బెంచీలు వేసారు. అలాంటి వరుసలు చాలా ఉన్నాయి. ముందువరసలో పెద్ద ఖాళీ స్థలముంది. చాలామంది స్త్రీ పురుషులు కూర్చుని ఉన్నారు. జనం చాలామంది ఉన్నప్పటికీ అంతటా నిశ్శబ్ధ వాతావరణం ఉంది. అందరూ చక్కటి క్రమశిక్షణ కల్గి ఉన్నారు. ముందు ఖాళీ స్థలంలో పెద్ద పంజరం ఉంది. అదంతా ఇత్తడి కడ్డీలతో చేసి ఉంది. పై భాగం మాత్రం తెరచి ఉంది. బాబా ఆ పంజరంలోకి వెళ్ళి నిలబడ్డారు. జనమంతా భక్తి ప్రపత్తులతో బాబాకు నమస్కరిస్తున్నారు. బాబా అక్కడ నిలబడి ఉండే అందరినీ ఆశీర్వదించారు. అక్కడకు చేరిన మనుష్యు లందరూ క్రమశిక్షణ కల్గి ఉండడం వామనరావుకు నచ్చింది. కొంతసేపటికి బాబా హాలు వదలి బయటకు వచ్చారు. వామనరావు బాబాను అనుసరించాడు. తరువాత ఇద్దరూ కల్సి కుషాల్‌చంద్ ఇంటికి వెళ్ళారు.

ఇది జరిగిన తరువాత కొంతకాలానికి వామనరావు తాను చూసిన హాలు ఉన్న ప్రదేశానికి వెళ్ళాడు. ఆశ్చర్యమేసింది అక్కడ తాను అంతకుముందు చూసిన హాలు ఏమీ లేదు. ఈ సంఘటన వామనరావును కుదిపివేసింది. అతడు తరువాత షిరిడి వెళ్ళినప్పుడు ఆ హాలు గురించే చాలామందిని అడిగాడు. అందరూ అటువంటి హాలు ఏదీ రహతాలో లేదని చెప్పారు. అప్పుడు వామనరావు అప్పటి విషయాన్ని గుర్తు తెచ్చుకున్నాడు. జోగ్‌గాని, అతని భార్యకాని అటువంటి హాలును చూడలేదు. తన కొక్కడికే ఆనాటి సంఘటన కళ్ళకు కట్టినట్లు కనపడింది. తాను తప్ప ఇంకెవ్వరూ

ఆ హాలునుకాని, బాబానుకాని, అక్కడ బాబాను చూడడానికి వచ్చిన జనాన్ని కాని చూడలేదు అన్న విషయం బాగా అర్థమయ్యింది. ఇదంతా కలా నిజమా అని అనిపించింది. కాని ఈ మాయను అతను మరచిపోలేకపోతున్నాడు. ఎప్పుడు షిరిడీకి వచ్చినా రహతాకు కూడా వెళ్ళి ఆ హాలు ఉందేమోనని చూసేవాడు. 1957లో తిరిగి ఒకసారి రహతా వెళ్ళాడు. కాని అప్పుడు కూడా ఏ హాలూ అతనికి కనిపించలేదు.

దీని సారాంశమేమిటంటే, మన జీవితాల్లో ఒక్కోసారి మనం మాయ అనే ఊబిలో చిక్కుకుంటాం. కాని మన సమర్థ సద్గురు సాయిబాబా ఆ మాయ నుండి మనల్ని బయటకు రప్పిస్తారు. దానికి కావల్సిన అర్హత ఏమిటంటే మనం సద్గురువును చక్కటి క్రమశిక్షణ ద్వారా అనుసరించాలి. అప్పుడే మనకు బాబా కృప దక్కుతుంది.

(ఇదంతా స్వామి సాయి శరణానంద రచించిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

# (22)

## మాయి పరబ్రహ్మంలో లీనమయ్యింది.

కుషాల్‌చంద్ ఇంటికి వచ్చిన బాబా కొంతసేపటికి బయటకు వచ్చారు. నదికి ఆవల గట్టున నిలబడి ఉన్న బండివైపు నడుస్తున్నారు. వామనరావు బాబాను అనుసరించాడు. బాబా అన్నారు, "వామన్యా నా వెనకనే ఉండి నడుస్తూ ఉండు. నీ రెండు చేతుల్తో నా నడుంభాగం చుట్టి పట్టుకుని ఒక గుర్రంలాగ నడు." బాబా అలా చెప్పగానే వామనరావు ఆ ప్రకారంగానే బాబా వెనుక ప్రక్కనే తన రెండు చేతుల్ని బాబా నడుం చుట్టూ పెట్టి నిలబడ్డాడు. బాబా నడవడం మొదలు పెట్టగానే, వామనరావు బాబా వెనుకనే కాస్త ముందుకొంగి ఒక గుర్రంలాగ నడవడం ప్రారంభించాడు. ఆ విధంగా కొన్ని అడుగులు వేయగానే వామనరావుకి ఒక విచిత్రం కనపడింది. బాబా పాదాల వద్ద ఒక ఫకీరు శవం ఉంది. ఆకుపచ్చరంగు గుడ్డలో తల నుండి పాదాల వరకూ చుట్టబడి ఉంది. వామనరావు ఆ శవాన్ని చూసి బిత్తరపోయాడు. బాబా, ఎవరైనా మాంత్రిక ఫకీర్ను చంపి ఉంటారేమో అనుకున్నాడు. అతడికి భగవాన్ శ్రీకృష్ణుని లీలలు గుర్తుకు వచ్చాయి. ఆవులు మేపే నెపంతో అడవులకు పోయి, ఎంతోమంది రాక్షసులను మట్టుపెట్టాడు శ్రీకృష్ణుడు. ఇక్కడ ఆ సమయంలో దీక్షిత్, నవార్కర్ కూడా ఉన్నారు. కాని ఎందుకో వామనరావుకి కనపడిన దృశ్యం వారికి కనపడలేదు. అప్పుడు వామన రావుతో బాబా ఇలా అన్నారు. నువ్వు ఇక్కడ నుండి ముంబాయికి వెళ్ళిపో, ఎందుకంటే ఈ ఫకీరు రాధా కృష్ణమాయిని చంపివేసాడు. నా పాదాల దగ్గర పడివున్న శవం ఆమెదే. బాబా అలా అనగానే వామనరావు వెంటనే షిరిడీకి చేరుకున్నాడు. అక్కడ అతని స్నేహితుడు వైకుంఠభాయి వచ్చి వామనరావును ముంబాయికి తీసుకువెళదామని చూస్తున్నాడు. తరువాత వారిద్దరూ ముంబాయికి బయలుదేరారు. మూడు వారాల తరువాత, రాధాకృష్ణమాయి మరణవార్త వామనరావుకు

తెలిసింది.

ఈ సందర్భంలో కాకాసాహెబ్ దీక్షిత్ ఇలా అన్నాడు. మాయి అవతారం ముగిసింది. అంటే ఈ భూమి మీద ఆమెతో జరగవలసిన ఆధ్యాత్మిక కార్యక్రమం పూర్తి అయిందని అర్థం. అలాగే ఈ భూమిమీద ఆమె మజిలీ పూర్తి అయ్యింది అని కూడా చెప్పవచ్చు. ఆమె జీవాత్మ పరమాత్మతో సంయోగం చెందింది అంటే పరబ్రహ్మ స్వరూపంలో లీనమయిందని అర్థం. మాయి పాత్రను బాబా తన మాయతోనే సృష్టించారు. కాబట్టి ఆమె రాకపోకలకు బాబా సంకల్పమే ప్రధానం. మాయి కూడా తన పాత్రను బాబా దర్శకత్వంలో చక్కగా పోషించింది. నాటకం పూర్తి అయింది కాబట్టి మాయి తన ఆత్మను పరమాత్మకు సమర్పించింది.

మాయి నిష్క్రమణం గురించి రేగే ఇలా మాట్లాడేడు. ఒకరోజు బాబా లెండీభాగ్ నుండి ద్వారకామాయికి వచ్చారు. అప్పుడే అమ్మ మాయి మశీదు నేలను శుభ్ర పరుస్తోంది. ఎప్పుడూ భగవధ్యానంలో ఉండే మాయి, ఇప్పుడు మరింత ఎక్కువగా మైమరచి ఉంది. అప్పుడే ద్వారకామాయిలో అడుగు పెట్టిన బాబా, మాయి వీపు తట్టి దేనికీ బాధ పడవద్దని హెచ్చరించారు. ఇది జరిగిన రెండు మాసాలకు అమ్మ మరణించింది. తరువాత నేనొకసారి షిరిడికి వెళ్ళాను. నాకు ఎక్కడ బస చెయ్యాలో తెలియలేదు. అప్పుడు తిన్నగా ద్వారకామాయికే వచ్చాను. దీక్షిత్ వాడాకు వెళ్ళి బస చెయ్యమని బాబా అన్నారు. శ్యామా, ఇంకా ఇతర భక్తులు కొంతమంది నన్ను చూసి, అమ్మ పోయిందన్న విచారాన్ని నాతో చెప్పుకుని నన్ను ఓదార్చేరు. అయితే బాబా మా అందరినీ పిలిపించి, ఏమి మాట్లాడుకుంటున్నారు అని అడిగారు. ఈ మూర్ఖులకు ఏం తెలుసు? మాయి నీకే కాదు నాకూ అమ్మే. ఆమె ఈ కర్మ బంధం నుండి విడి పడాలని కోరింది. నేను, అలాగే జరుగుతుందని హామీ కూడా ఇచ్చాను. ఒక రోజు రాత్రి ఆమె నా దగ్గరకు వచ్చి, ఇక నేను ఈ లోకంలో ఉండలేను అంది. నేను సరే అన్నాను. అప్పుడే, ఇదిగో ఇక్కడ నాలో చేరింది అని బాబా తన కఫినీని పైకి ఎత్తి

తన గుండెను చూపించారు. నువ్వు ఎప్పుడు అమ్మను చూద్దామనుకొంటే అప్పుడు ఇక్కడ చూడవచ్చు. రేగే ఇంకా ఇలా చెపుతున్నాడు. దైవసంపన్నురాలైన నా తల్లి బాబాలో చేరిపోయింది. ఎవ్వరు ఎలా అనుకున్నా నాకు చింతలేదు. నేను ఆమెకు ఋణపడి ఉన్నాను. శ్రీ మహల్సాపతి, శ్రీ హెచ్.ఎస్. దీక్షిత్‌లకు అమ్మ అంటే చాలా గౌరవం ఉండేది. ఇటువంటి పెద్దల సంఘంలో నేనున్నందుకు ఎంతో ఆనందిస్తున్నాను అని రేగే చెప్పడం ముగించాడు.

బాబా సంస్థానం ఈనాడు ఇంత చక్కటి యాజమాన్య వ్యవస్థను కలిగి ఉండడానికి, ఆనాడు మాయి అంకితభావంతో చేసిన కృషి ఎంతో ఉంది. ఎంతో శోభ కల్గిన బాబా పల్లకి సేవ, రథసేవలను తిలకించే భాగ్యం, ఇప్పుడు బాబా భక్తులకు కలుగుతున్నదంటే అదంతా మాయి ఎంతో ప్రణాళికాబద్ధంగా చేసిన కృషి అని చెప్పవచ్చు.


దీని సారాంశం ఇప్పుడిలా చెప్పుకోవచ్చు.

జీవాత్మ అన్నది పరమాత్మతో విడదీయరాని సబంధం కల్గి ఉంది. ఇంకా చెప్పాలంటే పరమాత్మ యొక్క అంశారూపమే జీవాత్మ. పరమాత్మ సంకల్పం వల్లే దేహపతనం సంభవిస్తుంది. అయితే అప్పటికే జీవన్ముక్తులైన మహాపురుషులు దేహ పతనానంతరం, విదేహ ముక్తులవుతారు. అనగా అంశారూపంగా ఉన్న వారి జీవాత్మ పరమాత్మలో లీనం అవుతుంది. బాబా గురుకులం ఎప్పుడూ ఆచరణాత్మకంగా ఉంటుంది. ఈ విషయాన్ని బాబా, లీల ద్వారా వామనరావుకు చూపెట్టారు. అలాగే రేగేతో జరిపిన సంభాషణ ద్వారా కూడా తెలియపరచారు. దీనివల్ల చక్రభ్రమణం కల్గిన సృష్టి క్రమాన్ని బాబా విశదీకరించినట్లయింది.

రాధాకృష్ణమాయికి సమర్ధ సద్గురు సాయిబాబాపై ఏకాగ్రతతో కూడిన అత్యంత బలీయమైన ప్రేమ భక్తి ఉండేది. ఆమెకుండే అపూర్వ గుణాలు ఏమిటంటే,

తిరుగులేని విశ్వాసం, స్వార్ధరహితమైన ప్రేమభక్తి, నిస్వార్ధ సేవాతత్త్వం. ఇవే ఆమెను తన సద్గురువులో లీనమయ్యేట్లు చేసాయి. రాధాకృష్ణమాయి జీవితాన్ని క్షుణ్ణంగా చదివి అర్ధం చేసుకున్న మనకు తెలిసిన లేక తెలియవలసిన పాఠం ఏమిటంటే, మనకొచ్చే లాభమేమిటన్న భావన ప్రక్కనబెట్టి, మన గమ్యాన్ని చేరడంలోగల కష్టాలకు లొంగకుండా, సాధనా మార్గాన్ని వదలకుండా పట్టుకోవడమే. దీనికొరకు, అత్యంత వినమ్రులమై సద్గురువు శాశనాన్ని అమలు పరచవలసి ఉంటుంది. అలా చేస్తే రాధాకృష్ణమాయికి పట్టిన అదృష్టమే మనకూ పడుతుంది.

(ఇదంతా స్వామిసాయి శరణానంద రచించిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)



# 23

## మాయి పాఠశాల

మాయి మానసికంగా ఏకనాథ్ మహరాజ్‌ను తనయొక్క ఆధ్యాత్మిక గురువుగా ఎంచుకుంది. మొదట్లో ఆ గురువు ద్వారానే తనకి దైవికంగా పెరుగుదల సాధ్యమయ్యిందని ఆమె భావన. ఏకనాథ్ మహరాజ్, ఆయన గురువైన జనార్ధన స్వామి నుండి ఒక దీక్ష తీసుకున్నారు. దాని ప్రకారంగా తన ఆశ్రమం చుట్టూ తులసివనం పెంచడం, అలాగే తులసికి, శ్రీ మహావిష్ణువుకు, పూజలు క్రమం తప్పకుండా నిర్వహించుటమన్నది దీక్షలో ఒక భాగమైంది. ఇదే దీక్షను మాయి తనంతతాను తీసుకుని తన ఇంటి చుట్టూ ఒక అందమైన తోటను పెంచింది. ఆ తోటలో నిండుగా తులసివనం కూడా పెరిగింది. మొట్టమొదటిగా బాబాయే మాయి ఇంటిని శాల అనీ, బృందావనం అనీ పిలిచారు. బాబాను అనుసరించి గ్రామంలోని వారందరూ కూడా అలాగే పిలిచేవారు.

ఎందుకు బాబా మాయి ఇంటిని శాల అనీ బృందావనమనీ రెండు పేర్లతో పిలిచేవారు?

బాబా తన భక్తుల్లో చాలామందిని భగవత్ సంబంధమైన గ్రంథాలను చదవమని ప్రోత్సహిస్తూ ఉండేవారు. కొంతమందిని భగవద్గీత చదవమనీ, మరికొంతమందిని జ్ఞానేశ్వరి చదవమనీ చెప్పేవారు. ప్రతీరోజు భావార్ధరామాయణం, దాసబోధ, భక్త తుకారాం గాధ, ఇతర గ్రంథాలు ఎవరో ఒకరు చదవడం అలవాటు చేసుకున్నారు. అయితే వీటన్నింటిలోను ఏకనాథ్ భాగవతానికి బాబా ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చేవారు. బాబా ఇలా అనేవారు, ఎవరైతే ఏకనాథ్ భాగవతాన్ని చదువుతున్నారో, వారు తప్పక దాని అర్థాన్ని గ్రహించవలసి ఉంటుంది. తరువాత ఆ అర్ధంపై ధ్యానం చెయ్యవలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే ఆ చదివిన వారు తమతమ జీవితాల్లో ఏకనాథ్ భాగవత సిద్ధాంతాన్ని పండించుకోగల్గుతారు. భాగవత తత్త్వం, వారికి ఒంటపడుతుంది.

ఈ రకమైన గ్రంథ పఠనం అంతా మాయి పాఠశాలలోనే జరుగుతూ ఉండేది. మాయికి ఏకనాథ్ మహరాజ్ గురువు కాబట్టి ఆయన వ్రాసిన భాగవతాన్ని ప్రతినిత్యం మాయి పాఠశాలలోనే పారాయణ చేస్తూ ఉండేవారు. పారాయణ అనంతరం సత్సంగం జరిగేది. భాగవత విషయాలు చర్చకు వచ్చేవి. మాయి అక్కడకు వచ్చిన భక్తులందరినీ భాగవత ధర్మాన్ని పాటించమని చెపుతూ ఉండేది. ఈ కారణం చేతనే కాబోలు, బాబా మాయి ఇంటిని శాల అనీ, బృందావనమనీ పిలుస్తూ ఉండేవారు.

మధురలోని శ్రీకృష్ణుని బృందావనంలో నిధివనం ఉంది. శ్రీకృష్ణునిపై గోపికల ప్రేమ భక్తికి ఆ నిధివనం చిహ్నం. గోపికలందరూ జీవాత్మలైతే శ్రీకృష్ణుడు పరమాత్మ స్వరూపుడు. అదేవిధంగా షిరిడిలోని మాయి పాఠశాల కూడా ఒక నిధివనంగా ఉందని చెపుతున్నారు. జీవాత్మ పరమాత్మల ఐక్యానికి అది ఒక ద్వారంలా ఉండేది. అందుకే బాబా దాన్ని ప్రత్యేకంగా బృందావనమని అనేవారు. ఏకనాథ్ మహరాజ్ తన గ్రంథం ద్వారా సామాన్య ప్రజానీకంలో కూడా అనంతమైన ఆధ్యాత్మిక భావనలను ప్రేరేపించారు. అంతేకాక తన అనుయాయిల దినచర్యల్లో జ్ఞానేశ్వర్ మహరాజ్ వారి ఆధ్యాత్మిక నీతి సూత్రాలు పాటించేలా శ్రద్ధ వహించారు. ఇదేరకమైన జీవితాన్ని మాయి కూడా గడుపుతూ ఉండేది. మిగతా వారందరికీ ఆమె జీవితం ఆదర్శప్రాయంగా ఉండేది.

ఏకనాథ్ మహరాజ్ తన శిష్యులకు ఎప్పుడూ భాగవత ధర్మాలు బోధిస్తూ ఉండేవారు. తమ భౌతిక జీవితాలను ఆ ధర్మాలకు అనుగుణంగా గడుపుకోవాలని, దానికోసం వారి జ్ఞానాన్ని, అంతర్భూతమైన వారి నైతిక బలాన్ని, ఉపయోగించుకోవల్సి ఉంటుందని  చెపుతూ ఉండేవారు. మాయి కూడా ఏకనాథ్ మహరాజ్ గారి నినాదాన్ని తన జీవిత గమ్యంగా ఎంచుకుంది. అదేబాటలో మిగతా భక్తుంలదరూ నడవాలని, నిస్వార్థ జీవన విధానాన్ని అలవరచుకోవాలని, అదే సద్గురు సేవగా భావించాలని, సూచిస్తూ ఉండేది. దీని కొరకు భగవంతుడిచ్చిన వివేక, వైరాగ్యాలను రెండు మూల స్థంభాలుగా చేసుకొని, అప్పటికే సద్గురు కృప వల్ల ప్రోగు చేసుకొన్న నైతిక జీవన

సరళి, జ్ఞాన ధనాన్ని సద్వినియోగం చేసుకోవల్సి ఉంటుందని చెప్పేది.

ఈ మానవదేహం ఎప్పటికైనా నశించేదే. కాని లోనున్న ఆత్మ మాత్రం అవినాశి. ఈ మూల సూత్రాన్ని లేక ఈ పరమ సత్యాన్ని జీవితాంతం గుర్తెరిగి నడుచుకుంటూ, మన జీవితంలోని ప్రతిక్షణం, ప్రతికర్మ, మనదేహంలోని ప్రతి అంగం సద్గురుసేవకు వినియోగపడేలా చూసుకోవాలి. మనం, లోనికి తీసుకొనే ప్రతి ఉచ్వాసం (breath) సద్గురువును గుర్తు చేసేదిగా ఉండాలి. అంతేకాక సద్గురువు సేవకై మనం, ఎంత ఎప్పుడు చెయ్యగలమో, అంత అప్పుడే క్రమం తప్పక చేస్తూ ఉండాలి. మాయి తన పాఠశాలలో బోధించే ముఖ్య విషయం ఇదే. మానవుని అంతరంగం దుర్మార్గపు ఆలోచనలతో ఎప్పుడూ అల్లకల్లోలంగా ఉంటుంది. నీ మనస్సును ఈ విష వలయం నుండి తప్పించాలంటే ముఖ్యంగా కావల్సినవి, సత్యం, ధర్మం, అహింస, నిస్వార్థసేవ, ఇంకా భగవత్ సంబంధమైన గ్రంథపఠనం. ఇవికాక ఇతర సామగ్రి ఏమిటంటే, భక్తి కీర్తనలు పాడుకుంటూ ఉండడం, ధ్యానం, మానసికంగా సద్గురువుని ఆరాధించడం, మౌనం పాటించటం, మనస్సును కూడా నిశ్శబ్ధంగా ఉంచుకొనడం. మాయి ఎక్కువగా నామజపం చేస్తూ ఉండేది. అలాగే నామజపం యొక్క విశిష్ఠతను అందరికీ చాటిచెప్పేది. రేగె ఆమెకు ఎంతో ప్రీతిపాత్రమైన విద్యార్థి అందుకే బాబా, రేగేను ఎప్పుడూ మాయి శాలలోనే ఉండమని, అప్పుడే దైవికంగా నీకు ఎదుగుదల వస్తుందని చెపుతూ ఉండేవారు. కాబట్టి ఆ ప్రకారంగా మాయి, రేగె నామ జపాన్ని తమ ఆధ్యాత్మిక సాధనకు ముఖ్యమైన వస్తువుగా ఎంచుకున్నారు. మాయి, రేగె ఎదుట కూర్చునేది. ఇద్దరూ నిశ్శబ్ధంగా గంటల తరబడి నామ జపాన్ని సాధన చేస్తూ ఉండేవారు. అంత పట్టుదలతో నామజపం చెయ్యడం వల్ల, బాబా నామంలో వారు లీనమైపోయినట్లుండేది. అదే వారిని చివరకు సమాధి స్థితికి తీసుకొని వెళ్ళేది.

ఇదే గాకుండా మాయి పాఠశాలలో, సద్గ్రంథ పఠనం అన్నది రోజువారీ కార్యక్రమంగా ఉండేది. ఈ రకమైన ఆధ్యాత్మిక సాధనలతో బాటుగ, అక్కడ సభ్యుల మధ్య, ఒక రకమైన ప్రేమ తత్త్వం, భక్త జన బంధుప్రీతి, అందరం బాబాకు చెందిన

వారమే అన్న సోదర భావం వెల్లివిరిసే చక్కటి వాతావరణం కనపడేది. ఏ రకమైన సేవ అయినా సరే అది సద్గురువు కొరకే చెయ్యబడుతుంది అనే నినాదంతో మాయి జీవితం గడిపేది. ఆమె ఏ నినాదంతో పని చేసేదో, దాన్నే మిగతావారికి బోధించి, వారి చేత గూడ చేయిస్తూ ఉండేది.

బాబా చేత తన దగ్గరకు పంపబడిన భక్తులందరినీ ఆమె తన సొంత పిల్లల లాగ చూసుకొనేది. ఇంకా, బాబా ఎదుట నిలబడి ఉన్నప్పుడు భక్తుల ప్రవర్తన విషయంలో కొన్ని కఠిన నియమాలను ఏర్పరచేది. వాటిని అతిక్రమించిన వారి పట్ల కాస్త కోపం ప్రదర్శించేది. బాబాయే పరబ్రహ్మ స్వరూపుడని మాయి దృఢంగా ప్రకటించింది. మానవ రూపంలో మన ఎదుట సాక్షాత్కరించిన బాబా పట్ల భక్తులందరూ ఎంతో మర్యాదతో ప్రవర్తించాలని అందరికీ చెపుతూ ఉండేది. బాబా ఎదుట నిలబడే తీరును గూడ సరిదిద్దుతూ, భక్తులు బాబాను ఏదికోరవచ్చు, ఏది కోరకూడదు అన్న విషయాల్ని గూడ అరటిపండు వలిచి పెట్టినట్లుగా అందరికీ నచ్చ చెపుతూ ఉండేది.

అంతేకాకుండా బాబా దర్శనానికి వచ్చే భక్తులు ఏ రకమైన వస్త్రధారణ కల్గి ఉండాలో నేర్పేది. ఇదంతా ఆమెకున్న సొంత పరిజ్ఞానంతోను, ఆత్మ ప్రభోదంతోను చేస్తూ ఉండేది. భక్తులారా! జాగ్రత్తగా వినండి. మీరు ఇప్పుడు ప్రవేశిస్తున్న దర్బారు, రాజాదిరాజు, పరబ్రహ్మ స్వరూపుడు, అయిన శ్రీ సద్గురు సాయినాథ్ మహరాజ్ వారిది అన్న విషయం మరిచిపోకండి. అందుచేత ప్రతి ఒక్కరు తలపాగాను కాని టోపీని కాని పెట్టుకుని ఉండాలి. మీ తలభాగం ఏదో ఒక వస్త్రంతో కప్పబడి ఉండాలి. ఈ రకమైన అలుపెరగని మాయి సూక్తి బోధల వల్లనే బాబా యొక్క సంస్థానం ఆవిర్భవించింది.

ఈ ప్రకారంగా మాయి తన దగ్గరకు పంపబడిన భక్తులకు శిక్షణ ఇచ్చేది. నిజానికి మాయి శిక్షణలోని భక్తులు వారి ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక్కొక్కమెట్టు ఎక్కుతూ మంచి పురోగతి సాధించేవారు. మొదట్లో ఆ భక్తులందరూ వేరువేరు భావాలతో చెల్లా చెదురై ఉండేవారు. నవ విధ భక్తి మార్గాల్లో ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా

ప్రవర్తిస్తూ ఉండేవారు. ఏదెలాఉన్నా మాయి మాత్రం చాలా ఓపికగా ప్రతివారిని తీర్చిదిద్దుతూ, ఆత్మజ్ఞాన శూన్యులైన వారిని, నెమ్మదిగా ఆత్మజ్ఞాన నిష్ఠులుగా తయారు చేస్తూ వారు వారి గమ్యాన్ని చేరడానికి ఎంతగానో కృషి చేస్తూ ఉండేది. ఇంక బాబా కూడా వారి పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండేవారు. ఎవ్వరికైనా ఆధ్యాత్మిక పురోగతిలో తారసపడే అత్యంత ప్రమాదకరమైన అవరోధాలు రెండే రెండు. ఒకటి కాంతా రెండవది కనకం. ఈ కాంతా కనకాలు రెండూ (స్త్రీలు మరియు బంగారం, లేక సంపద) భగవంతుని సృష్టిలో భాగాలే. బాబా తన భక్తులకు ఈ రెండు అంశాల మీద పరీక్షలు పెట్టేవారు. ఒకటి పెద్దపెద్ద మొత్తాల్లో డబ్బు దక్షిణగా ఇవ్వమనేవారు. రెండవది వారిని అద్భుతమైన అందంతో ఉండే రాధాకృష్ణమాయి దగ్గరకు పాఠాలు నేర్చుకోమని పంపేవారు. రాధాకృష్ణమాయి నిజంగా బాబా మాయాశక్తే. భక్తుడు ఈ ప్రాథమిక పరీక్షను నెగ్గవలసి ఉంటుంది. ఒకవేళ ఏ భక్తుడైనా తప్పుదారిని నడిచినట్లు కనబడిందా, బాబా అతని ముందు ప్రత్యక్షమై మందలించేవారు. అందుచేత మాయి పాఠశాలకు భక్తుడిని పంపించారు అంటే, అతడిని పరీక్షకు పెట్టారు అని అర్థం వచ్చేది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారందరూ బాబా కృపవల్ల, దైవ బలం తోడు రాగా వారి గమ్యాన్ని చేరడానికి ఉత్సాహంతో సాధన చేసేవారు. బాబా తనదైన శైలిలో వారికి మార్గదర్శిగా ఉండేవారు. భక్తులు కూడా బాబా అడుగుజాడల్లో ఒక్కొక్కమెట్టు ఎక్కుతూ పురోగతి సాధించేవారు. తప్పులు చేసిన భక్తులను క్షమించడానికి బాబా ఇష్టపడే వారు కాదు.

యోగా అన్న మాట యుగ్ అనే ధాతువు నుండి పుట్టింది. యోగా అంటే కలియుట అని సామాన్య అర్థం. జీవుడు శివుడిలో ఐక్యమవడానికి తోడ్పడేది యోగం. ఈ యోగానికి మారు పేరు మాయి పాఠశాల. అది ఒక ముక్తిధామంగా ఉండేది. ఇక్కడ రోజువారీ కార్యక్రమంగా ఆత్మజ్ఞానం బోధింపబడుతూ ఉండేది. దానివల్ల అక్కడి వాతావరణం ప్రేమభక్తితో పునీతమై మనస్సుకు ఆహ్లాదాన్ని ఇస్తూ ఉండేది.

రేగే ఇలా అనేవాడు. నేను మొదటిసారి షిరిడీ వచ్చినప్పుడు బాబా నన్ను,

అమ్మ రాధాకృష్ణమాయి దగ్గరకు పంపించారు. బాబా ఎప్పుడూ ఇలా అనేవారు. "మాయి రేగేకు అమ్మ, నాకూ అమ్మే." నేను అమ్మ మాయికి చాలా ఋణపడి ఉన్నాను. నా ఆధ్మాత్మిక జీవితం మొత్తం ఆవిడ సొంతం. నన్ను పుత్రప్రేమతో ఎప్పుడూ చూసేది. అమ్మ, మాయి నిజంగా యోగమాయి. ఈ విషయంలో నాకు ఎటువంటి సందేహం లేదు. శ్రీరామకృష్ణ పరమహంసకు ఒక యోగిని తంత్ర శాస్త్రంలో శిక్షణ ఇచ్చినట్లుగా, అమ్మ మాయి కూడా నా విషయంలో అలా చేసింది అనిపిస్తుంది. ఒకసారి మాయి నా గుండెల మీద ఒక దెబ్బవేసి, నువ్వు ప్రాపంచిక వాసనలతో ఉన్నావు. ఇది ఖాళీగా ఉందా? అని అడిగింది. ఇంకా తను నా కంటే ధైర్యస్తురాలిని, బలవంతురాలిని అని చెప్పేది. నేను నీ దగ్గర ఒక చంటి పిల్లాడిని అమ్మా! అన్నాను. కాని మాయి ఊరుకోలేదు. మనిద్దరం ఒక పరీక్ష పెట్టుకుందాం అంది. నాకు ఇష్టం లేకపోయినా, మాయి బలవంతం చేసింది. మధ్యాహ్న సమయంలో రహతాకు వెళ్ళేదారి నిర్మానుష్యంగా ఉంటుంది. మనద్దిరిలో ఒకరు ఇంకొకరిని వీపుపై ఎక్కించుకుని పరుగెట్టాలి అంది. నేను వెంటనే అమ్మను నా వీపు మీద ఎక్కించుకుని పరుగెట్టాను. అలా రెండు ఫర్లాంగులు పరుగెట్టాను. దానికి అమ్మ సంతోషించి, ఇక ఆగు అంది. తరువాత నన్ను తన వీపు మీద ఎక్కించుకుని రెండు కంటే ఎక్కువ ఫర్లాంగుల దూరం పరుగెట్టింది. నేను నీ కంటే బలవంతురాలిని కదా! అని అడిగింది. దాన్లో ఏమాత్రం అనుమానం లేదని నేను అన్నాను. అప్పుడు తన వీపు నుండి నన్ను దిగమని చెప్పింది. అమ్మా! మీ వీపుపై నన్ను మోసినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది అన్నాను. ఇలా నేను అనగానే ఎందుకో అమ్మ, నేను నిన్ను క్రిందకి త్రోసివేస్తాను అంది. అమ్మ ఎక్కడైనా తన కొడుకుని క్రిందికి త్రోసివేస్తుందా? అందరూ అది చూసి నవ్వరా? అని అడిగాను. చివరికి నేను ఆమె దగ్గర నుండి ఒక వరం పొందగలిగాను. ఆధ్యాత్మిక ప్రయాణంలో నన్ను ఆమె వెనుక పెట్టుకుని మోయవలసి ఉంటుంది. నేను అడిగిన దానికి అమ్మ ఒప్పుకుంది. అయితే ఈ సంఘటన అంతా సద్గురువు ఆదేశంతో జరిగిందని నాకు అనిపించింది. ఎందుకంటే అమ్మ, నేను

ఇంటికి తిరిగి రాగానే, బాబా నుండి నాకు పిలుపు వచ్చింది. నేను బాబా ముందుకు వెళ్ళి నిలబడ్డాను. మీరిద్దరూ ఏం చేస్తున్నారు? అని బాబా అడిగారు. నేను జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాను. అప్పుడు బాబా ఎంతో దయతో, ఆమె ఖచ్చితంగా నిన్ను వెనుక పెట్టుకుని నడుస్తుంది. నేనూ అలానే చేస్తాను అన్నారు. ఇది నిజంగా ఒక సద్గురువు ద్వారా మాయి పొందిన దివ్యమైన అభినందన. ఇంకా ఆమె ఆధ్యాత్మిక ప్రగతికి ఇది ఒక నివాళి అని కూడా చెప్పవచ్చు.

ఇప్పుడు మాయి పాఠశాలను దివ్యజ్ఞాన సమాజంగా వర్ణిస్తూ, ఆ సమాజంలో సభ్యత్వం పొందిన కొంతమంది ప్రముఖుల పేర్లను చెపుతున్నారు. లక్ష్మణ్ కె.నూల్కర్, విశ్వనాథ్, ఎల్. నూల్కర్, బాపుసాహెబ్ జోగ్, నానా సాహెబ్ చందోర్కర్, కాకా దీక్షిత్, డాక్టరు పిళ్ళై, స్వామి సాయి శరణానంద, రఘువీర్, బి. పురందరె, బాలాసాహెబ్ భాటె, హరి వినాయక్‌సాథ్, తారాభాయి తార్కడ్, బాబా సాహెబ్ తార్కడ్, అతని కుటుంబం మొత్తం, గోపాలరావు ఎం.బుట్టి, అన్నా సాహెబ్ దబోల్కర్, మోరేశ్వర్ ప్రధాన్, మేఘశ్యామ్ రేగే, సాధు భయ్యా నాయిక్, చొట్టు భయ్య పరుల్కర్, కాకాసాహెబ్ అవస్థి, కాకామహాజని మొదలైనవారు చాలామంది ఉన్నారు. వీరందరూ ఎంతో అదృష్టవంతులని చెప్పాలి. ఎందుకంటే మాయి వంటి యోగిని శిక్షణలో ఆధ్యాత్మిక ప్రావీణ్యత సంపాదించారు. అంతేకాక బాబా వంటి సద్గురువు యొక్క పర్యవేక్షణలో తమతమ జీవితాలను కొనసాగించారు.

ఇంతవరకూ చెప్పిన దాని సారాంశం ఇలా ఉంటుంది. బాబా మనకు అత్యంత విలువైన ఆధ్యాత్మిక తత్త్వాన్ని, శ్రీకృష్ణ పరమాత్మ గోపికలతో సలిపిన రాసలీలను దృష్టాంతంగా చూపెట్టి బోధ చేస్తున్నారు. బృందావనంలో జరిగిన రాసలీలలో పరమాత్మ, జీవాత్మలనబడే గోపికలతో కలిసి నాట్యం చేసాడు. పరమాత్మ వేణుగానానికి పరవశులైన గోపికలు అతని కొరకు ప్రేమ భక్తితో తపించి, వేణుగాన బాణీకి సరితూగే నృత్యం చేశారు.

ఇక్కడ బాబా భక్తులకు మాయి చూపించే సూచనలను పాటించి, తద్వారా బాబా అనుగ్రహం పొందడాన్నే నృత్యంతో పోల్చారు. అందుచేత మాయి తన పాఠశాలలో చేరిన భక్తులకు బాబా అనుగ్రహం పొందే అర్హతను ఈ క్రింది సూచనల ద్వారా తెలియజేస్తోంది.

బాబా దర్బారులో భక్తులు ప్రవర్తించవలసిన తీరుతెన్నులు.

భక్తులు తమతమ కోరికలను, సమస్యలను బాబాకు నివేదించే విధానాలు.

బాబాను ప్రార్థించే క్రమపద్ధతులు.

బాబా ద్వారా వచ్చే ఆజ్ఞలను, ఎటువంటి సందేహాలు లేకుండా అమలుపరచడం.

సద్గురు బాబాను హృదయపూర్వకంగా ప్రేమభక్తితో ఆరాధించడం.

భౌతిక, ఆధ్యాత్మిక సంపదనంతా సద్గురువుకు అర్పణ చేసి, శరణాగతి చేసే మార్గాన్ని అన్వేషించడం.

బాబా పెట్టే కఠిన పరీక్షలకు తట్టుకునే శక్తిని కూడగట్టుకొనడం.

మాయి ఈ పాఠాల ద్వారా తన విద్యార్థుల్లో గోపికలకుండే మధుర భక్తిని పెంచిపోషించేది. దానివల్ల వారందరూ భక్తి సంగీతాన్ని ఆలకించి (సూచనలన్నీ పాటించి) బాబా చుట్టూ చేరి తదనుగుణమైన నృత్యాన్ని (దర్బారులో క్రమశిక్షణతో కూడిన నడవడికను) ప్రదర్శించగలరని మాయి నమ్మకం. అంతేకాక ఆమె కోరుకునేది, నృత్యం తీవ్రస్థాయికి చేరితే బాబాలో వారందరూ లయమవడమే. మాయి పాఠశాలకు ఇంత ప్రాముఖ్యత ఉంది కాబట్టి, బాబా ఆ పాఠశాలను ఆధ్యాత్మిక విద్యాకేంద్రంగా కొనియాడేరు. ఇంక, మాయి ఇల్లు బృందావనమే అనడానికి ఎటువంటి సందేహం లేదు. శ్రీకృష్ణునకు రాధాదేవి ఏ విధంగా శక్తి స్వరూపిణిగా ఉన్నదో, అదే ప్రకారం రాధాకృష్ణమాయి కూడా పరమాత్మ స్వరూపుడైన బాబాకు శక్తి స్వరూపిణిగా ఉండేది. సద్గురువు కృపవల్ల మాత్రమే మాయి పాఠశాలలో ప్రవేశం దొరుకుతుంది.

(ఇదంతా స్వామి సాయి శరణానంద వ్రాసిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

## 24

# సద్గురు సాయినాథ్ అనశ్వరమైన ఆత్మస్వరూపులు

1916లో జరిగిన ఒక సంఘటన గురించి చెపుతున్నారు. ఒకరోజు ఉదయం పూట వామనరావు ద్వారకామాయి దిశగా నడచి వెళుతున్నాడు. అప్పుడతడికి దివ్యమైన బాబా కంఠస్వరం లాంటిది వినపడింది. "చూసావా వామన్యా! వారేం చేసారో, నన్ను బట్టలు ఆరవేసుకొనే దండానికి తగిలించి ఎండ బెడుతున్నారు." వామనరావు ఆ మాటలు విని వెనక్కు తిరిగి చూసాడు. మాటలు వినపడే దిక్కుగా చూస్తూ వుంటే, ముక్తారం అనే చాకలి మనిషి, బాబా కఫినీని ఉతికి దండెంపై ఆరవేసిన దృశ్యం కనపడింది. వామనరావు ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. ఎండలో ఆరబెట్టిన బాబా కఫినీ నుండేనా యీ మాటలు వస్తున్నది. ప్రాణం లేని ఆ వస్త్రం ఎలా మాట్లాడగలదు? వినడానికి అవి బాబా మాటలు లాగే ఉన్నాయి. ఈ రకంగా ఆలోచిస్తూ, ఇదంతా నా భ్రమ అన్న నిర్ణయానికి వచ్చాడు. తను అనవసరంగా ఆభ్రమలో చిక్కుకోక, ఆ విషయాన్ని అలా విడిచిపెట్టడమే మంచిది అనుకున్నాడు. కాని మళ్ళీ మళ్ళీ ఆ మాటలే గుర్తుకొస్తున్నాయి. దీనిలో నిజం ఎంత ఉందో వెతికి పట్టుకోవాలా? వద్దా? అనుకున్నాడు. బాబా ప్రత్యక్షంగా తనతో చెప్పిన మాటలు అయితే తను తప్పక వినాలి. కాని ఈ విధంగా అనేక రకాలుగా చెవులకు సోకే మాటలు వినవలసిన పనిలేదు. ఎందుకంటే విన్నవన్నీ మంచి మాటలే అవవు. ఇంకా, ఇటువంటి అనేక శబ్ధాలు కాని మాటలుకాని తనలో నిగూఢంగా దాగివున్న కొన్ని చెడు గుణాల ప్రోద్భలం వల్ల భ్రమరూపంగా బయటపడినవి అయి ఉండవచ్చు. దీనికి కారణం తన మనస్సు ఇంకా ఆరోగ్యకరమైన ప్రక్షాళన కాకుండాపోవడమే. దానివల్ల గతజన్మల చెడు వాసనలు మనస్సుపై ప్రభావం చూపెడుతూ ఉంటాయి. కాబట్టి వామనరావు, తను ఇక నుండి జాగ్రర్తగా మసులుకోవాలని, మనస్సు పన్నే కుట్రల్లో తను చిక్కుకోకుండా ఉండాలని, అలాకాని పక్షంలో తన జీవితం గతి తప్పి

నడిచి ప్రయోజనం శూన్యం అవుతుందని ఆలోచిస్తున్నాడు.

చివరకు వామనరావు ఆలోచనలు ఒక ముగింపుకు దారితీసాయి. బాబా ధరించిన వస్త్రం కూడ, ఆయన యొక్క దైవీశక్తితో మిళితమయ్యే ఉండి ఉంటుంది. అదే నిజమైతే ముక్తారాం ఆరవేసిన కఫినీ నుండే బాబా మాటలు ఉద్భవించి ఉండాలి. "వామన్యా! చూడు! వారేం చేసారో. నన్ను బట్టలు ఆరవేసుకొనే దండానికి తగిలించి ఎండబెడుతున్నారు." ఈ మాటలు బాబావే. కాబట్టి వామనరావు చాలాకాలం దీని గురించే ఆలోచించాడు. బాబా ఈ సంఘటన ద్వారా నాకు ఏం చెపుదామను కుంటున్నారు? ఈ ప్రశ్నకు సమాధానం దొరికింది. అదేమిటంటే బాబా అంటున్నారు, "వామన్యా! చూడు, నుదురు, తల, నోరు, కడుపు, గుండెలు ఇంకా అనేక భాగాలు వాటి వాటి పనులు చేసుకుంటూ పోతున్నాయి. ఇవన్నీ నేను కాదు. అలాగే ఈ శరీరం ధరించిన కఫినీ, ఇంకా తలకు తగిలించిన గుడ్డ కూడా నేనుకాదు. కాబట్టి ఈ ఇంద్రియాలు చేసే పనులన్నీ అనగా తినడం, త్రాగడం, నిద్రపోవడం, మాట్లాడటం, నడవటం మొదలైన కర్మలన్నీ యాంత్రికంగా జరిగిపోతూ ఉంటాయి. నిజానికి నా స్వస్వరూపం అన్నది వీటన్నింటి కంటే మీదన ఉన్నది. ఈ విషయం నీకు చెప్పానంటే, అంతా చెప్పినట్లు కాదు. నీకెంత వరకూ జ్ఞానం అవుసరమో అంతే చెప్పానని తెలుసుకో. అలాగే నేను చూపెట్టిన వింతలు కూడ, నీకెంత అవుసరమో అదే చూపెట్టాను. నువ్వు అంతకంటే ఎక్కువ చూడలేవు. అందుచేత నువ్వు నీ అనుభవాల్ని, భావోద్వేగాలను ఇక్కడ వదిలివెళ్ళు, ఇదంతా యోగమాయ ఆడించే నాటకం అని తెలుసుకో. ఈ ప్రపంచం అంతా మాయామయం. దీంట్లోనే నీ జీవితం గడపవలసి ఉంటుంది. ఈ ప్రపంచాన్ని ఒక ప్రక్క గమనిస్తూ, నీ కర్తవ్యాలను తెలివిగా నిర్వహిస్తూ ఉండాలి. ప్రస్తుతం నీ మనస్సు ఇంకా పరిపక్వ స్థితికి రాలేదు. కాబట్టే నా నిజస్వరూపాన్ని నువ్వు చూడలేకపోతున్నావు. నా స్వరూపం అంతటా పరివ్యాప్తమై ఉంది. సర్వమూ అదే అయి ఉంది. సర్వశక్తివంతమై ఉంది, సర్వజ్ఞత్వాన్ని కల్గి వుంది(అంతా తెలిసినదై ఉంది). ఇంకా అన్ని జీవరాశుల్లోనూ అంతర్యామిగా

ఉంది. సృష్టిలో జరిగే అన్ని క్రియలకూ సాక్షిగా ఉంది. కాబట్టి నీ మనస్సులో నన్ను ప్రతిష్ట చేసుకొని, యధాలాపంగా కర్తవ్య కర్మల్ని ఆచరిస్తూ ఉండు.”

ఇలాగే ఒకరోజు మధ్యాహ్న ఆరతి అయిపోగానే, వామనరావుకు ఒక ఆలోచన వచ్చింది. ఇక్కడ అందరూ బాబాకు పూజకాని, ఆరాధన కాని ప్రతిరోజూక్రమం తప్పకుండా చేస్తూ ఉంటారు. కాని నేను, సాంప్రదాయబద్ధమైన పూజలను, ఒక్క పండగలు, ప్రత్యేక దినాల్లో మాత్రమే చేస్తున్నాను. కాని ఈ రకంగా ప్రతిరోజూ నేను ఎందుకు చేయలేకపోతున్నాను. ఈ రకమైన ఆలోచన రాగానే, వామనరావు పూజా సామగ్రి పట్టుకుని ద్వారకామాయికి వచ్చి, ఎంతో ఆనందంగా గంధం పూతను బాబాకు పూసాడు. అయితే వామనరావుకు ఇంకొక ఆలోచన వచ్చింది. ఈ రోజుకైతే పూజకానిచ్చాను. ఇది ఎంతో బాగుంది. అయితే, బాబా స్వయంగా ఇలా కనపడనప్పుడు అనగా దేహధారిగా లేనప్పుడు, పూజను ఎలా చెయ్యడం. అప్పుడు నిస్సహాయ స్థితిలో క్షమాపణ వేడుకోవడమేనా?

వామనరావు ఆలోచనకు బాబా నవ్వుకున్నారు. వెంటనే ఇలా అన్నారు. అరే! నువ్వెందుకు అలా అనుకుంటున్నావు? నేను ఈ దేహాన్ననా నీ అభిప్రాయం అంటే నన్ను ఈ దేహానికే పరిమితం చేస్తావా? కాదు. నేను అమరుడను, సర్వవ్యాపిని, అనంతుణ్ణి. నేను అన్నది మరణిస్తుందని, నీతో కలిసి ఉండదని నువ్వు ఎందుకు అపోహపడుతున్నావు?

దీని సారాంశం ఇలా చెప్పుకోవచ్చు.

భౌతిక దేహమన్నది మరణిస్తుంది. కాని అంతవరకూ దేహంలో ఉన్న జీవాత్మకు మరణం లేదు. అది పరబ్రహ్మం యొక్క అంశ, అనశ్వరమైనది. అలాగే సమర్థ సద్గురు సాయినాథ్‌గా మనలను ఆదుకుంటున్నది అదే..

(ఇదంతా స్వామి సాయిశరణానంద వ్రాసిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)

## (25)

# ఈ విశ్వమంతటికీ కారణం ఓంకారం

1923లో వామనరావు, న్యాయవాద వృత్తికి సంబంధించిన డిగ్రీ పరీక్షలకు చదువుకోడానికి మోతాగాం వెళ్ళాడు. అతడి దినచర్య బాబా ప్రార్థనతో మొదలయ్యేది. తెల్లవారుజామునే లేవడం, ధ్యానం చెయ్యడం, బాబా ఉపదేశించిన మంత్రాన్ని జపించడం చేసేవాడు. ఈ కార్యక్రమమంతా బాబా ఫోటో ఒకదాన్ని తన ముందుంచుకొని, హృదయ పూర్వక ధ్యానంతో కాసేపుండి తరువాత మిగతావన్నీ చదివేవాడు. వామనరావుకిచ్చిన ఫోటో, బాబా ప్రత్యేకంగా ఆశీర్వదించి 1911లోనే ఇచ్చింది. ఇలా మోతాగాంలో సుమారు ఒక నెలపాటు ఉన్న తరువాత, అక్కడి నుండి బయలుదేరవలసి వచ్చింది.

వామనరావు చెప్పింది ఇలా ఉంది. మోతాగాం నుండి బయలుదేరడానికి సుమారు పది రోజుల ముందు నాకు ఒక అద్భుతమైన అపరోక్షానుభూతి కల్గింది. రోజూలాగే ఉదయాన్నే లేచాను. బాబా ఫోటో ముందు పెట్టుకుని ధ్యానం చేస్తున్నాను. అకస్మాత్తుగా, ప్రకాశవంతమైన వెలుగుతో ఓం అక్షరం బాబా ఫోటోనంతా వ్యాపించింది. బాబా ముఖమంతా దానితో నిండిపోయింది. ఆ ఫోటో క్రింది భాగంలో బాబాపేరు వ్రాయబడి ఉంది. ఆ పేరు పై భాగంలో ఓం స్పష్టంగా కనపడుతోంది. ఇంకో విశేషమేమిటంటే, ఓం ఒక్క బాబా ఫోటోపైనే కాకుండా నేను ఎక్కడ చూస్తే అక్కడ కనపడింది. ఇంకా కొంతసేపటికి, అదే ఓం ప్రతిచోటా దర్శనమిచ్చింది. అంటే ఆకాశంలో, నేల మీద, చెట్లమీద, రాళ్ళమీద ఎక్కడపడితే అక్కడ కనపడుతూ వచ్చింది. ఇలా కనపడే వింత గురించి ఆలోచించాను. ఈ దృశ్యం నాకు ఇచ్చే ఆధ్యాత్మిక సందేశం ఏమై ఉంటుందని నాలో నేనే ప్రశ్నించుకోవల్సి వచ్చింది. చివరకు నేనే అనుకొన్నాను. బాబా నన్ను ఓంకార జపం చెయ్యమంటున్నారు. కాబట్టే ఓం ఇలా నాకు దర్శన

మిస్తున్నాది. నాకు అర్థమైన ఇంకొక విషయం ఏమిటంటే, బాబా మహాసమాధి చెందిన తరువాత సచ్చిదానంద స్వరూపులై అంతటా నిండి ఉన్నారు. కాబట్టి ఇప్పుడు ఓంకార రూపంగా నాకు దర్శన మిస్తున్నారు. ఈ ఆలోచన వచ్చిన తరువాత ఇక ఓం నాకు కనపడలేదు.


ఈ సంఘటన జరిగిన తరువాత కూడా వెంటనే వామనరావు ఓంకార మంత్రాన్ని జపించడం చెయ్యలేదు. అతడికి బాబా ఆజ్ఞ ప్రకారం మంత్రం జపించ వలసి ఉన్నదని తెలుసు. ఈ సందర్భంలో అతడింకొక విషయం చెపుతున్నాడు. చాలాకాలం నుండీ అతడు శ్రీరామ, శ్రీకృష్ణ మంత్రాలను జపిస్తూ వచ్చాడు. 1942లో అతడికి ఒక కల వచ్చింది. దాంట్లో శ్రీకృష్ణ మంత్రం జపించమన్న ఆజ్ఞ ప్రకారం అతడు చేస్తున్నాడు. మంత్రం మొదలుపెట్టిన కొద్ది రోజుల్లోనే అతడికి ఒక వింత దృశ్యం కనపడింది. దైవీశక్తి స్వరూపం, బొటనవ్రేలు ఆకారంలో అతడి హృదయం నుండి బయటపడి, చూస్తూ ఉండగానే పైకిపోయింది. ఇదే ఆత్మ అని భావించాడు. అప్పుడు అతడు భక్తతుకారాంను గుర్తు తెచ్చుకున్నాడు. తుకారం ఆత్మను బొటనవ్రేలు ఆకారంతో పోల్చాడు. ఇంకా తన్మయత్వంలో, తుకారాం ఏమన్నాడంటే మనం మన బొటన వ్రేలును తదేకంగా చూసినట్లయితే అది పాండురంగ విఠల్‌గా దర్శనమిస్తుందని కూడా చెప్పాడు. ఇంకా తుకారాం చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి. మన అరచేతిని ముడిచి పిడికిలిగా చేసి చూస్తే బొటనవ్రేలు భాగం కూడా ముడవబడి పైన కనబడుతుంది. ఇప్పుడు మొత్తం పిడికిలి మన మన హృదయం అని ఊహించుకొంటే, పైన బొటన వ్రేలు ఆత్మను సూచిస్తుంది. దాంట్లోనే పరమాత్మ అయిన పాండురంగ విఠలుడు నివసిస్తాడు.

ఇలా వామనరావు తన గురించి చెపుతూ, నేను శ్రీకృష్ణ మంత్రాన్ని చాలా కాలం నుండీ జపిస్తున్నాను. కాని నేను సన్యాసం తీసుకున్న తరువాత, ఇక దేని గురించీ ఆలోచించడం మానివేసాను. ఆధ్యాత్మిక సాధనలో భాగంగా ఏకాక్షర మంత్రమైన ఓంకారాన్ని జపించేవాడిని. భగవంతుడి పట్ల ఉన్న శ్రద్ధాభక్తులతోను, ఆత్మ తృప్తి

కొరకుగాను క్రమం తప్పక ఆ సాధన చేసేవాడిని. అదే సమయంలో బాబా ఆజ్ఞ ఆకాశవాణి ద్వారా నాకు వినిపించింది. గర్వాంధకారాన్ని పారద్రోలే విష్ణు సహస్ర నామ జపం చెయ్యమని బాబా చెప్పినట్లయింది. వెంటనే ఆ ఆజ్ఞను పాఠించడం మొదలు పెట్టాను. బాబా సర్వాంతర్యామిగా ఉంటూ నన్ను నడిపిస్తున్నారని నాకు తెలుసు.

దీని సారాంశాన్ని ఈ విధంగా చెప్పుకోవచ్చు. ఈ విశ్వమంతటికీ మూల కారణం ఓంకారమే. అదే పరబ్రహ్మ స్వరూపం. అదే సమర్థ సద్గురు శ్రీ సాయిబాబా.

(ఇదంతా స్వామి సాయిశరణానంద వ్రాసిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)



## 26

## వామనరావు, సాయినాథ్ అనగానే బాబా ప్రత్యక్షమయ్యారు

వామనరావుకు, బాబాతోనూ, రాధాకృష్ణమాయితోనూ ఒక ప్రత్యేకమైన సంబంధం ఉండేది. ఎందుకంటే, వారిద్దరూ అతడికి ఒకరు సద్గురువు, ఇంకొకరు గురువుగాను ఉన్నారు. బాబా నామ జపం చేయడంలో ఎంత నిష్ణాతుడంటే, అతడు పిలవగానే బాబా పలికేవారు. అంతేకాకుండా అతడి ఎదుట ప్రత్యక్షమయ్యేవారు. ఇటువంటివి రెండు సందర్భాలు జరిగాయి. అందుచేత వామనరావు ఇలా చెప్పాడు, బాబా అన్న పేరులోనే ఒక అద్వితీయమైన శక్తి ఉంది. అది ఎంతటి పరిమాణం కల్గిందో నాకు బాగా అనుభవం ఉంది. బాబా మహాసమాధికి ఒకింత ముందు జరిగిన సంఘటన చెప్తాను. ఆ సమయంలో నేను ముంబాయిలోని 'విల్లేపార్లే' లో ఉంటున్నాను. అది మధ్యాహ్నపువేళ, నేను నా గదిలో ఒంటరిగా ఉన్నాను. అప్పుడు నాకొక ఆలోచన వచ్చింది. అది నిజానికి ఆలోచనకాదు. ప్రేమనిండిన తపన, బాబా కొరకై నిరీక్షణ. అప్పుడు నాలో నేను ఇలా అనుకున్నాను. బాబా! మిమ్మల్ని తప్పించి చూస్తే, ఈ ప్రపంచం అంతా శూన్యంగా కనపడుతోంది. ఇదంతా ఒక పెద్ద సున్నా ఆకారంలో ఉంది. ఈ ఖాళీలో ఎక్కడా జీవమూలేదు, జనం కూడా లేరు. అందుచేత నేను చాలా దుఃఖంతోను, నిరాశతోను బ్రతుకుతున్నాను. వామనరావు ఆలోచనలు ఈ విధంగా సాగుతూ ఉంటే, ఒక మనిషి, తెల్లని పంచె కట్టుకుని, తల మీద ఒక టోపీని పెట్టుకుని నా గదిలోకి వచ్చి, ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. నాకు దాహంగా ఉంది, కాస్త మంచినీళ్ళు ఇయ్యి అన్నాడు. వెంటనే నేను లేచి వెళ్ళి ఒక గ్లాసు మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాను. అతను, మంచినీళ్ళు త్రాగిన తరువాత, నా టేబులు పైనున్న ఉపనిషత్తు పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు. సరిగ్గా బాబా చేసినట్లుగానే, ఆ ఉపనిషత్తులోని కొన్ని పేజీలను త్రిప్పి చూసాడు. వాహ్! నీ దగ్గర చాలా గొప్ప పుస్తకం ఉందోయ్. ఇదంతా ఒక జ్ఞానఖని అని, ఆ పుస్తకాన్ని తిరిగి టేబులు మీద

పెట్టి వెళ్ళిపోయాడు. ఆ మనిషి అలా వెళ్ళిన తరువాత, నాకు అనిపించింది, బాబాయే నా బాధ చూసి ఇలా ప్రత్యక్షమయ్యారా? మనస్సు యొక్క గొప్పతనం గురించి నాకు గుర్తుకొచ్చింది. బాబా కోసం నా మనస్సు పడే ఆరాటం చాలా తీక్షణమైంది. ఇంకా అది ఒక తపస్సు లాంటిది.కాబట్టే అది బాబాను కదిపి నా దగ్గరకు తీసుకుని వచ్చింది. బాబా చెప్పిన మాట చాలా విలువైంది. ఉపనిషత్తు ఒక జ్ఞానఖనే. ఆ జ్ఞానాన్ని పొందమని బాబా నాకు బోధించారు. కాబట్టి నేను తప్పకుండా ఉపనిషత్తులు అధ్యయనం చెయ్యాలి అనుకున్నాను.

నేను వెంటనే ఇంటి బయటకు వెళ్ళి ఆ మనిషి గురించి చూసాను. కాని అతను నాకు ఎక్కడా కనపడలేదు. మేము ఆ ఇంటిలో చాలా కాలం నుండే ఉంటున్నాము. కాని ఎప్పుడూ అటువంటి వ్యక్తిని చూసినట్లులేదు. ఈ అనుభవం వల్ల నాకు మనస్సు యొక్క గొప్పతనం మరింతగా తెలిసింది. భగవంతుడు గురించి గాని, సద్గురువు గురించిగాని మన ఆలోచన ఎంత తీవ్రమైనదైతే, అదే విధంగా వారు కూడా మనల్ని కరుణించి అనుగ్రహిస్తారు.

షిరిడిలో ఉన్నప్పుడు కూడా, ఒకరోజు ఉదయం నేను ద్వారకామాయి గుండా నడచి వెళ్తున్నప్పుడు, నాకు దివ్యమైన కంఠస్వరం వినబడింది. “ఇక్కడే నిలబడు. సాయినాథ్ అని గట్టిగా పిలువు”. అనగానే నేను నిలబడి పోయాను. గట్టిగా గొంతు ఎత్తి సాయినాథ్ అని పిలిచాను. కొద్దిక్షణాల్లోనే ద్వారకామాయిలో తన స్థానం నుండి బాబాలేచి వచ్చి, తులసి బృందావనం వరకూ నడచి అక్కడున్న పెద్ద తీనెపై కూర్చున్నారు. నేను కూడా ఆయన ఎదుటనే నిలబడి ఉన్నాను. కాని బాబా నన్ను ఏదో హెచ్చరిస్తూ చూస్తున్నట్లు అనిపించింది. వెంటనే నేను కొంత ముందుకు వెళ్ళి బాబా పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసాను. బాబా లేచి ద్వారకామాయికి వెళ్ళిపోయారు.

ఇంకొకసారి నేను నా గది బయట ఒక మంచం మీద కూర్చొన్నాను. క్రింది భాగంలో చూస్తే ఆ వీధి అంతా కనబడుతుంది. ఆ సమయంలో నేను అనుకోకుండానే

ఎందుకో నా నోటి నుండి 'సాయినాధ్' అన్న పిలుపు గట్టిగా వచ్చేసింది. అదే క్షణంలో ఒక ఫకీరు వీధిలో నిలబడి భిక్ష అడుగుతున్నాడు. నేను అనవసరంగా బాబాను కష్టపెడుతున్నానేమో నని అప్పుడు నాకు తెలిసింది. ఎందుకంటే బాబా అని పిలిచిన వెంటనే దేహరూపంలో ప్రత్యక్షమవ్వలసి వస్తోంది. నేను ఆయన చేసే అద్భుతమైన పనులకు ఒక ఆటంకంగా మారాను. కాబట్టి నేను ఇక నుండి కారణం లేకుండా బాబాను పిలువ కూడదని నిశ్చయించుకున్నాను.

దీని సారాంశం ఇలా ఉంది. భగవత్ స్వరూపమైన సద్గురువు మనకి పలకాలంటే, మన పిలుపు, ఆ పిలుపు వెనక మనం సద్గురువు కోసం పడే తీవ్రమైన తపన, అత్యంత శక్తివంతమైనదిగా ఉండాలి.

(ఇదంతా స్వామి సాయి శరణానంద వ్రాసిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)

## 27

# ఆత్మ సాక్షాత్కారం కోసం తపించే వాడే నిజమైన బ్రాహ్మణుడు

1913వ సంవత్సరం, డిశంబరు నెల నుండి పదకొండు నెలలు వామనరావు షిరిడీలో ఉండవల్సి వచ్చింది. అప్పుడు జరిగిన కొన్ని సంఘటనలు గురించి ఇప్పుడు చర్చిస్తున్నాడు. ఒకరోజు ఉదయం సుమారు 9 గంటల ప్రాంతంలో నేను షిరిడి ఊరుకు బయటనున్న వ్యవసాయ క్షేత్రాల్లో తిరుగుతున్నాను. అప్పుడు నాకు ఆకాశవాణి ద్వారా ఒక సందేశం వినపడింది. “ఇది మా క్షేత్రం. అందుచేత ఇక్కడ కాసేపు కూర్చో. తరువాత ఇక్కడున్న పొలం పన్లు చెయ్యి”. ఆప్రకారంగానే నేను అక్కడ కూర్చుందామని అను కున్నాను. అయితే ఎవరో ఒక రైతు నాగలి పట్టుకుని పొలం దున్నుతున్నాడు. ఇంకొక మనిషి, అతడి వెనక నడుస్తూ దున్నిన ప్రాంతంలో విత్తనాలు జల్లుతున్నాడు. కాని నాకు నాగలి పట్టుకుని నిలబడడం రాదు. విత్తనాలు కూడా జల్లలేను. అందుచేత అక్కడ పని చెయ్యడానికి వీలుపడదు అనుకున్నాను. కొంతసేపు అలా కూర్చుండి పోయాను. అది ఉదయం ఫలహారం తీసుకునే సమయం. కొంతసేపటికి ఒక ఫకీరు బాబా నా వైపుగా నడిచి వస్తున్నట్లు కనపడింది. ఆ ఫకీరు వెనక ఒక పనివాడు నెత్తిన ఒక బుట్ట పెట్టుకుని వస్తున్నాడు. ఇద్దరూ వచ్చి నా దగ్గర కూర్చున్నారు. ఫకీరు బాబా ఆ బుట్టలో నుండి ఒక భక్రి తీసి పనివాడికిచ్చాడు. తాను కూడా తీసుకున్నాడు. నన్ను చూసి, నువ్వు కూడా వచ్చి ఒక భక్రి తిను. ఇవి ఇప్పుడే తయారు చేసినవి అన్నాడు.

నేను ఇలా అనుకొన్నాను, నేను బ్రాహ్మణుడిని కదా! ఎవరో ముస్లిములు తయారుచేసిన పదార్థాలు ఎలా తింటాను? ఈ ఆలోచనతో నేను అతడికి జవాబు చెప్పలేకపోయాను. నేను భక్రి తీసుకోకపోవడంతో ఆ ఫకీరు నన్ను చూసి, ఫరవాలేదులే, నేను సగుణమేరుకు నీకోసం వంట చెయ్యమని చెప్తానులే అన్నాడు. దానికి కూడా నేను సమాధానం ఇవ్వలేదు. ఎందుకంటే నా భోజనం మాయి, దీక్షిత్‌లతో చేస్తాను. సరే అని ఫకీరు వెళ్ళిపోయాడు. నేను కూడా షిరిడికి వచ్చేసాను. ఆ తరువాత

ఫకీరు నన్ను కలిసినట్లు, నా భోజనం సంగతి అడిగినట్లు లేదు.

ఒక రోజు సాయంకాలం వామనరావు తన గది బయట ఉన్న వరండాలో కూర్చుని ఉన్నాడు. అప్పుడు ఒక మనిషి పంచకట్టుకుని, పైన ఏరకమైన ఆచ్ఛాదన లేకుండా నా దగ్గరకు వచ్చాడు. ఈ మనిషిని బాబా దగ్గర ఉండగా వామనరావు అంతకు ముందు ఒకసారి చూసి ఉన్నాడు. తరువాత ఆ మనిషి ఉపాశినీ మహరాజ్ అని తెల్సింది. ఆయన వామనరావును చూసి, బాబా నీకు చెప్పమని నన్ను పంపించారు. రంజాన్ ఉపవాసం నిన్ను చెయ్యమన్నారు. ముస్లింలు రోజాస్ పాటించినట్లు నిన్ను కూడా పాటించమన్నారు అని చెప్పాడు. వెంటనే వామనరావు ఇలా అనుకున్నాడు. నేను బ్రాహ్మణుడిని కదా! నేనెందుకు ముస్లింలులాగ ఉపవాసం ఉండడం.

వామనరావుకు అంతవరకూ ఉపాశినీ మహరాజ్‌తో పరిచయం లేదు. అందుచేత ఆయన చెప్పిన మాటలు మాత్రం విన్నాడు కాని సమాధానం ఏదీ చెప్పలేదు. ఎందుకో ఉపాశినీ మహరాజ్ తనకు బాబాపై ఉన్న నమ్మకాన్ని పోగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారా అని అనిపించింది. ఆకారణం చేత ఆయన చెప్పిన మాటలను పెద్దగా పట్టించుకోలేదు. కొంతసేపు అయిన తరువాత బాబా తనకు పంపిన సందేశం మీద తిరిగి ఆలోచించడం మొదలుపెట్టాడు. వామనరావు చెప్పింది ఇలా ఉంది. "నేను ఆ సందేశం గురించి ఆలోచించకుండా ఉండలేకపోతున్నాను. ముస్లింలు చేసినట్లుగా ఉపవాసం, రోజాస్ పాటించడం ఎందుకు చెయ్యాలి? అప్పుడు నాకు ఇదేరకమైన సంప్రదాయం హిందువుల్లో కూడా ఉండడం గుర్తుకొచ్చింది. దాన్ని 'నక్తా భోజనం' అంటారు. ఇలా జైనులు కూడా పాటిస్తూ ఉంటారు. నేను హిందూ మత గ్రంథాల్లో కూడా ఇలాంటి ఆచారాల గురించి చదివేను. సాయంకాలం మాత్రం భోజనం చేస్తూ ఉంటారు. ఇదంతా పాప ప్రక్షాళన నిమిత్తం చేస్తూ ఉంటారని ఆ గ్రంథాల్లో ఉంది. అదీకాక ఆరోగ్యం కాపాడుకోవడానికి కూడా ఇది ఒక చిట్కాగా పనికి వస్తుంది. తరువాత నేను ఉపాశినీ మహరాజ్ గురించి తెలుసుకున్నాను. కొన్ని సంవత్సరాల క్రిందట అతను ఇదే ప్రక్రియ కొనసాగించేవాడు. పగటి పూట ఉపవాసం చేసేవాడు.

కాస్త టీ కాని కాఫీ కాని త్రాగేవాడు. తరువాత బాబా ప్రసాదం సాయంకాలం తినేవాడు. ఒక్కోసారి భక్రి తయారుచేసి, దాంట్లో ఒక ముక్క మాత్రమే తినేవాడు.

రంజాన్ రోజాస్ అంటే ఉదయం మొదలు సాయంకాలం వరకూ గల కాలపరిమితి, సాయంకాలం కుటుంబంతో కల్సి భోజనం చెయ్యడం, ఉపవాసం ఉన్న పగటి పూటంతా దైవచింతన తోటి, ప్రార్థనల తోటి, సోదరభావంతో మెలుగుతూ సేవా కార్యక్రమాల తోటి కాలం గడుపుతారు. సాధారణంగా ఎవ్వరికైనా బాగా ఆకలిగా ఉన్నప్పుడే, ఎదుటివారి ఆకలి బాధను అర్థం చేసుకోగలరు. ఆహారం కోసం పరితపించే అన్నార్తుల వేదన అర్థం కావాలంటే ఆకలిని అనుభవానికి తెచ్చుకుని తీరాలి. అప్పుడే ఆహారం యొక్క విలువ కూడా తెలుస్తుంది. అంతేకాక ఆహారం కోసం అలమటించే వారి పట్ల సానుభూతి కల్గుతుంది. ఇదంతా 'మానవసేవయే మాధవ సేవ' అనే సూత్రాన్ని కార్యరూపంగా మలుచుకునే ప్రక్రియ కాబట్టి, భగవంతుని కృప, సద్గురువు కృప పుష్కలంగా లభిస్తుంది. తద్వారా సంచిత పాప కర్మలు కాలి బూడిద అవుతాయి. వామనరావుకు సహజంగా తాను అగ్రవర్ణానికి చెందిన బ్రాహ్మణుడ నని గర్వంగా ఉండేది. ఈ భావన అతడి గుండె లోతుల్లో బాగా పాతుకుపోయింది. ఆత్మకు అంటరానితనం గానీ, ఉచ్ఛ నీచ భేదం గాని లేవని అతడు సరిగా గ్రహించలేక పోయాడు. జాతి, కుల, మత ప్రసక్తి లేకుండా ఆత్మరూపులుగా మానవులందరూ సమానమే అన్నది అతడి అవగాహనకు రాలేదు. ఈ కారణం చేతనే అతడిలో పక్షపాత రహిత బుద్ధిని ప్రేరేపించడానికి గాను, బాబా ప్రయత్నం చేస్తున్నారు.

శ్రీపాద శ్రీవల్లభ చరిత్ర, అధ్యాయం 8 లో తిరుమలదాసుకు, శంకరభట్‌కు మధ్య జరిగిన సంవాదంలో శుద్ధ బ్రాహ్మణుడనగా ఎవరు? అతడి లక్షణాలు ఎలా ఉంటాయి? అన్న విషయం చర్చకు వచ్చింది. "బ్రహ్మ జ్ఞానం పొందడమే జీవితాశయంగా కలవాడే బ్రాహ్మణుడు. అతడే తన కృషి ద్వారా సద్బ్రాహ్మణుడనిపించుకొంటాడు. సత్ ప్రవర్తన, మంచి గుణాలు కల్గి ఉండటాన్నే బ్రాహ్మణత్వం అనవచ్చు. దీనికి విరుద్ధమైన జీవన విధానం అవలంభించిన వారు అనగా, కర్తవ్య నిర్వహణ పట్ల

అలసత్వం వహించేవారు, పరస్త్రీల పట్ల అసభ్యప్రవర్తన కలిగి ఉండేవారు, హింసను ప్రోత్సహించేవారు, గోవధ చేసేవారు, ఎద్దుమాంసం తినేవారు, బ్రాహ్మణత్వానికి ఎంతమాత్రం సరిపోరు. ఏ మనిషికైనా సద్గుణ సంపత్తి మాత్రం చేతనే ముఖవర్చస్సు, గౌరవ మర్యాదలు పెరుగుతాయి. మంచి గుణాలు లేశమైనా లేనివాని బ్రతుకు నిష్ప్రయోజనమవుతుంది. అతడి ఆకారవికారాల్లో చాలా మార్పు కనపడుతుంది. బ్రాహ్మణత్వం మచ్చుకి కూడా కనపడదు. క్షత్రియ కులానికి చెందినవాడు కూడా బ్రహ్మజ్ఞానం సంపాదించగలిగితే, అతడు చేసిన తపస్సుకు ఫలితంగా బ్రాహ్మణత్వం సిద్ధిస్తుంది. ఆకారంలో కూడా తేజస్సు ప్రకాశిస్తుంది. ఉదాహరణకు విశ్వామిత్ర మహర్షినే చెప్పుకోవచ్చు.

ఈ రకంగా శంకర్‌భట్‌కు తిరుమలదాసుకు చర్చ జరుగుతూ ఉండగా, తిరుమల దాసు ముఖం దేదీప్యమానంగా వెలిగిపోతూ ఉండడం కనబడింది. అదంతా ఆత్మజ్ఞాన ప్రకాశమే అయ్యుంటుందని శంకర్‌భట్ అనుకున్నాడు. అప్పుడతడికి తిరుమలదాసు జీవితం గుర్తుకొచ్చింది. అతడు చాకలి కులంలో పుట్టాడు. మురికి బట్టలు ఉతకడం అతని కులవృత్తి. కాని బ్రహ్మజ్ఞానం సంపాదించి నిజమైన బ్రాహ్మణుడనిపించుకున్నాడు. తనైతే పుట్టుకతో బ్రాహ్మణుడైనా ఆత్మజ్ఞాన సంబంధం లేక తక్కువకులం అని పిలువబడే చాకలి అయ్యాను అనుకున్నాడు.

దీని సారాంశం ఇలాఉంది. ఈ లీల ద్వారా బాబా మనకు చెపుతున్న విషయం ఏమిటి? ఒక కులంలో పుట్టినంత మాత్రం చేత, మనిషిని ఆ కులస్థుడే అని నిర్ణయించడం పొరపాటే అవుతుంది. అయితే ఆ మనిషికుండే జ్ఞానాన్ని అనగా ఆధ్యాత్మిక సంబంధమైన జ్ఞానాన్ని, అతడి నడవడికను, మాట తీరును పరిగణలోనికి తీసుకుంటే నిజంగా అతడు ఏ వర్ణానికి చెందినవాడో చెప్పవచ్చు. కాబట్టి ఆత్మ సాక్షాత్కారం కోసం తపించేవాడే నిజమైన బ్రాహ్మణుడు.

(ఇదంతా స్వామిసాయి శరణానంద వ్రాసిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)

(28)

# మీ ఆధ్యాత్మిక సంపద చుట్టూ ఒక దడి కట్టండి

బాబా పలికే ప్రతి మాట వెనుక, లోతైన ఆధ్యాత్మిక తత్త్వం ఇమిడి ఉంటుందని వామనరావుకు బాగా తెలుసు. అందుకే బాబా ఎప్పుడు తనకు ఏది చెప్పినా సరే, ఆ మాటను పరిపరి విధాల విశ్లేషించుకుని దాని అంతరార్థాన్ని గ్రహించడానికి ప్రయత్నం చేస్తూ ఉంటాడు. అంతేకాక అది తనకొక పాఠంగా ఎంచుకుని, దాన్ని నిజ జీవితంలో అమలుపరిచే కృషి కూడా చేస్తాడు.

1911 డిశంబరు నెలలో వామనరావు ఒక పుస్తకం చదివాడు. దానిపేరు "అర్వాచీన భక్తి లీలామృతం" ఇది దాసగణు మహరాజ్ వ్రాసింది. దీంట్లో నాలుగు అధ్యాయాలున్నాయి. అవన్నీ బాబా లీలలకు సంబంధించినవే. అది చదివిన తరువాత అతడికి ఒక చిత్రమైన కల వచ్చింది. ఆ కలలో బాబా అంటారు.. "అరె! నువ్వు నీ పంట పొలానికి సరైన దడి కట్టకపోతే, గొర్రెలు వచ్చి మేసిపోతాయి. ఆ తరువాత చూస్తే ఇంకేమీ మిగలదు." వామనరావుకు బాబా చెప్పింది అర్థం కాలేదు. అతడికి తెలిసి, దాసగణు పుస్తకంలో కూడా దానికి సంబంధించిన వివరణ లేదు.

సరే, వామనరావు చాలాసేపు బాబా మాటలు గురించే ఆలోచించాడు. కాని సమాధానం దొరకలేదు. చివరకు, బాబా కృపవల్లనే విషయం బోధపడింది. ఎంతో కష్టపడి సాధనలు చేసి అనగా శ్రవణాలు, నామ జపాలు, ధ్యానాలు, స్వాధ్యాయాలు మొదలైనవి చేసి సంపాదించిన ఆధ్యాత్మిక సంపదను కాపాడుకోవల్సిన బాధ్యత కూడా మనదే. ఐతే దీన్ని ఎలా కాపాడుకోవాలి? దానిచుట్టూ ధార్మికపరమైన దడికట్టాలి. అంటే క్రమశిక్షణతో ప్రలోభాలకు లొంగకుండా ఉండాలి. అటువంటి దడి లేకపోతే ఏమౌతుంది? గొర్రెలు వచ్చి పొలాన్ని తినిపాడుచేసినట్లుగా కామ క్రోధ లోభ మోహ మద మాత్సార్యాలనే అరిషడ్వర్గ శత్రువులు లేక గొర్రెలు అదును చూసి దాడి చేసి

ఆధ్యాత్మిక సంపదను కొల్లగొడతాయి. మనిషిని మంచిదారిలో నడవ నియ్యకుండా పాడు చేసేవి ఇవే.

స్థిరత్వంతోకూడిన ఇట్టి ఆలోచన రాగానే వామనరావు మనస్సు గురువుపై మళ్ళింది. అప్పుడు ఇలా అనుకున్నాడు. నాకు గురువు కృప ఉన్నట్లయితే ఆయన తప్పకుండా ఇటువంటి రక్షణ నాకివ్వ గలడు. సాధారణంగా మనం గురువును ఈ విధంగా స్తుతిస్తూ ఉంటాం. **"గురుబ్రహ్మ గురుర్‌విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుసాక్షాత్ పరఃబ్రహ్మ తస్మై శ్రీ గురువేనమః"** బ్రహ్మ విష్ణు మహేశ్వరులుగా ఉన్నది మన గురువే. అట్లే పరబ్రహ్మ స్వరూపంగా ఉన్నది కూడా మన గురువే. అటువంటి గురువుకు నమస్కరిస్తున్నాను. ఇదీ దీని అర్థం. కాని గురుకృప కల్గడానికి ముందుగా హృదయ క్షేత్రాన్ని మలిన రహితంగా సిద్ధపరచవల్సిన బాధ్యత నీదే. క్షేత్రం శుభ్రం చేసి దున్ని ఉంచితే గురువు వచ్చి తగిన విత్తనాలు జల్లుతాడు. ఆ విత్తనాలే ధర్మం, నీతి, న్యాయం. రక్షకుడిగా విష్ణువు, ఆపదలను నిర్మూలించే వాడుగా మహేశ్వరుడు ఉండి నీ హృదయక్షేత్రంలో ఆధ్యాత్మిక పంట పండేటట్లు చేస్తారు. కాబట్టి వామనరావు ఇలా అంటున్నాడు. సద్గురువైన సాయిబాబాయే బ్రహ్మ విష్ణు శివ రూపాల్లో వచ్చి దైవీ సంపత్తి అనబడే పంటను పండించగలరు కాబట్టి అట్టి త్రిమూర్తి రూపాత్మకమైన, పరబ్రహ్మ స్వరూపమైన బాబాకు తలవంచి నమస్కరిస్తున్నాను.

దీని సారాంశాన్ని ఇలా చెప్పుకోవచ్చు..

వ్రత నియమం అనగా ఆధ్యాత్మిక క్రమశిక్షణను పెంపొందించుకోమని బాబా మనకు సూచిస్తున్నారు. అదే మనలను రక్షించే దడిగా తయారై ప్రాపంచిక వాసనల వైపుపోకుండా మనస్సును అదుపు చేస్తుంది.

బాబా గురుకులంలో ఈ రకమైన లీల ద్వారా మనకు బోధించే విషయమిదే. సరైన రక్షణ కల్గించే దడి గాని లేకపోతే అప్పుడే నాటిన మొక్కలను గొర్రెలు వచ్చి పాడు చేస్తాయి. అదే విధంగా మనం ఆత్మజ్ఞానం పొందే విషయలో గురుకృప కోసం

పాటుపడేటప్పుడు, క్రమశిక్షణ అనబడే దడిని తప్పక నిర్మించాలి. అది మన అంతఃకరణ చతుష్టయాన్ని అరిషడ్వర్గాల బారి నుండి కాపాడుతుంది. సద్గురువు పట్ల మనకు అచంచలమైన విశ్వాసం ఉన్నప్పుడు మాత్రమే ఇటువంటి రక్షణ కవచాన్ని మనం నిర్మించగలం.

గురుస్తుతిని బాబా ఇలా వివరిస్తున్నారు. గురువే బ్రహ్మ రూపంగా మనలో ఆత్మజ్ఞానం మొలకెత్తేటట్లు చెయ్యగలరు. అలాగే గురువే విష్ణురూపంగా రక్షణ వల్ల మనకు రక్షణ కల్పిస్తాడు. అటువంటి మనలో క్రమశిక్షణ అనబడే దడి కట్టబడుతుంది. ఇదే అరిషడ్వర్గాల బారి నుండి, అలాగే ఇంద్రియాల ప్రకోపం నుండి, మాయలో పడకుండా కాపాడుతుంది. అయితే ఎంత రక్షణ ఉన్నప్పటికీ, చిరు మొక్కలు చుట్టూ చీడపురుగుల్లా కలుపు మొక్కలు తయారవుతాయి. ఈ చీడపీడల బారి నుండి కూడా పంటను కాపాడుకోవల్సి ఉంటుంది. అప్పుడే మన గురువు త్రిశూలధారియై, మాయ అనే చీడపీడల బారి నుండి రక్షిస్తాడు. అనగా మాయను అతిక్రమించేటట్లు చేస్తాడు. ఈ విధంగా హృదయక్షేత్రం కల్మష రహితమవగానే గురువే పరబ్రహ్మస్వరూపుడై సాక్షాత్కరిస్తాడు. అటువంటి సద్గురు సాయిబాబాకు నమస్కారములు.

(ఇదంతా స్వామి సాయి శరణానంద వ్రాసిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)

# 29

## భక్తులపై గల బాబా ప్రేమకు ప్రతిఫలాపేక్షలేదు.

1916 డిశంబరు నెలలో వామనరావుకు ఆకలి మందగించటం ప్రారంభ మయ్యింది. దానివల్ల అతడు ఆహారం సరిగా ముట్టక, కొన్నిరోజులకి శరీర బరువు బాగా కోల్పోయాడు. అందువల్ల ఇంటికి చేరుకుని ఆరోగ్యం కుదుట పడడం కోసం ప్రయత్నాలు మొదలెట్టాడు. అలా ఉండగా ఒక రోజు ఉదయం ఒక ఫకీరు వాళ్ళ ఇంటి ముందుకు వచ్చి వామనరావు ఎల్.ఎల్.బి. నువ్వేనా అని అడిగాడు. అవును నేనే, ఏంకావాలి మీకు అన్నాడు వామనరావు. అప్పుడా ఫకీరు చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి. నన్ను సాయిబాబా పంపించారు. విషయం ఏమిటంటే, బాబా నాకు ఒక రూపాయిచ్చారు. ఇక్కడున్న అనేక దర్గాలకు వెళ్ళి, వామనరావు ఎల్.ఎల్.బి. యొక్క ఆరోగ్యం బాగుపడాలని ప్రార్థించమన్నారు.

ఫకీరు మాటలు విన్న వామనరావు మహదానంద పడిపోయాడు. తనలో ఇలా అనుకున్నాడు. బాబాకు తన భక్తుల పట్ల ఎంతోగాఢమైన ప్రేమానుబంధం ఉంది. నేను ఇప్పుడు షిరిడీకి చాలాదూరంలో ఉన్నాను. నాకు ఆకలి లేమి అనే వ్యాధి ఉన్నట్లుగా బాబాకు, ఈ ఫకీరుకు తప్ప ఇంకెవరికీ తెలీదు. ఇప్పుడు బాబా నా గురించి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని మనిషిని పంపడమన్నది, బాబాకు భక్తులపై గల ప్రతిఫలాపేక్షలేని ప్రేమను ధృవీకరిస్తోంది. నిజం చెప్పాలంటే భక్తుల ఆర్తిని తీర్చేటప్పుడు, వీడు గొప్పవాడా, వీడు పేదవాడా అన్న భేదభావన సద్గురువుకు ఉండదు. బాబా నాపై దయతలచేటప్పుడు, నాగుణగణాలను పరిగణలోనికి తీసుకోలేదు. ఎందుకంటే బాబాయే అలా చేస్తే, నేను ఆయన కృపను పొందడానికి అర్హుడను కాదేమో అనిపిస్తోంది. బాబా సర్వాంతర్యామి కాబట్టి అన్ని విషయాలు ఆయనకు తెలుసు. ఏదిఏమైనప్పటికీ, బాబా నా అనర్హత గురించి విచారించలేదు. ఒక తండ్రిలాగ, ఈ ఫకీరును నా ఆరోగ్యం గురించి ప్రార్థనలు చెయ్యమని పంపించారు. దీనికి నా కృతజ్ఞతలు బాబాకు ఎలా

తెలపడమో తెలియటం లేదు. పై వాళ్ళెవరైనా, బాబాకు వామనరావు చాలా కానుకలు సమర్పించాడు కాబట్టి, ఇలా దయ చూపెడుతున్నారు అని అనుకోవచ్చు. కాని వాళ్ళెవరైనా అలా అనుకుంటే దాంట్లో ఏ మాత్రం నిజం లేదని చెప్పవచ్చు. నిజానికి కానుకల విషయమే మాట్లాడితే  ఎంతో మంది భక్తులు నేను యిచ్చిన దానికంటే, పదిరెట్లు, వందరెట్లు ఇచ్చిన వారున్నారు.

ఒకసారి నెవర్కర్ విపరీతమైన జ్వరంతో బాధపడుతున్నాడు. అప్పుడు అతడి కొడుకు బాబాకు ఐదువందల రూపాయల దక్షణ సమర్పించాడు. అయితే జరిగిందే మిటంటే, బాబా ఆ డబ్బును తీసుకోగానే, నెవర్కర్‌కున్న జ్వరమంతా బాబా శరీరం మీదకు వచ్చేసింది. ఆ విధంగా నెవర్కర్ రక్షించబడ్డాడు. నెవర్కర్‌లాగ చాలా మంది ధనవంతులైన భక్తులు ఎంతోమంది ఉన్నారు. వారితో పోలిస్తే నేను ఏపాటివాడిని. అయినప్పటికీ బాబా ఇదేమీ పట్టించుకోకుండా నాపట్ల అపారమైన కరుణ చూపెట్టారు. పరమదయాళువైన బాబా, నాపై లెక్కకు మించిన దయను చూపెట్టారు. అందుకుగాను నేను బాబాకు ఎప్పటికీ ఋణపడే ఉంటాను. ఈ విషయం ఇలా ఉంచితే, ఇంతకు పూర్వం బాబా ఎన్నోసార్లు, ఎన్నో రకాలుగా నన్ను కాపాడిన సందర్భాలున్నాయి. అవన్నీ లెక్క పెట్టలేనివి. అవి లెక్క పెట్టడానికి, కాలానికి కూడా శక్తి చాలదు.

దీని సారాంశం ఇలా ఉంటుంది.

మన సద్గురువు శ్రీసాయిబాబా, ఆయన సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపమే. బాబా సర్వాంతర్యామి, సర్వవ్యాపి, సర్వశక్తి సంపన్నులు, సర్వజ్ఞులు, అందువల్ల ఈ విశ్వంలో ఆయన దృష్టిని తప్పించుకొని తిరిగేది అణుమాత్రం కూడా ఏదీలేదు.

సద్గురుసాయిబాబా అందరిపట్ల ఒకే విధమైన దృష్టిని కల్గి ఉంటారు. ఆ విషయంలో చిన్న పెద్ద, గొప్ప పేద అన్న తేడా లేవీ ఆయనకు కనపడవు. ఇటువంటి సమదృష్టి, ఆయన లీలల్లో మనకు చాలాచోట్ల కనపడుతుంది.

(ఇదంతా స్వామి సాయి శరణానంద వ్రాసిన సాయిశరణం అనే పుస్తకంలో ఉంది)

# 30
## పరబ్రహ్మ స్వరూపుడైన బాబాకు శరణాగతులవండి

ఒకరోజు సాయంకాలం బాబా, వామనరావుకు ఒక రూపాయి నాణెం ఇచ్చి చిల్లర తెమ్మనమని చెప్పారు. వెంటనే వామనరావు ఆ నాణాన్ని పట్టుకుని గ్రామంలోకి వెళ్ళాడు. కాని అతడు ఎన్నిచోట్లకు తిరిగినా రూపాయి చిల్లర దొరకలేదు. ఆఖరుకు ఒక గ్రామస్తుడు అతడి అవస్థ చూసి జాలిపడి, వామనరావు! చాలాసేపటి నుండి చూస్తున్నాను. నువ్వు ఇక్కడికీ అక్కడికీ తిరుగుతున్నావు. ఇంతకీ దేనిగురించి నువ్వు ఆరాటపడుతున్నావు అని అడిగాడు. వామనరావు అసలు విషయం చెప్పి రూపాయి చిల్లర కావాలని అడిగాడు. అప్పుడామనిషి వామనరావును భయ్యాజీ కోతేపాటిల్ దగ్గరకు పంపించాడు.

ఆ ప్రకారం వామనరావు పాటిల్ ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు. రూపాయి చిల్లర దొరికింది. అది తీసుకువచ్చి బాబాకు అందజేసాడు. దాని తరువాత వామనరావు ఆ సంఘటన గురించి తీవ్రంగా ఆలోచించాడు. దీనిద్వారా బాబా ఇచ్చే సందేశం ఏమయివుంటుందన్నది అతని ప్రశ్న. చివరికి అతనికి అర్థమైన విషయం ఇది. “బాబా ఇచ్చిన ఒక రూపాయి మాయను సూచిస్తోంది. అది ఒకటిగా ఉంటే శక్తివంతమై మనసు చెదరగొడుతూ ఉంటుంది. అప్పుడు ఏం చెయ్యాలి. దాన్ని చిద్రం చేసి ముక్కముక్కలయ్యేటట్లు ప్రయత్నించాలి. అదే బాబా చిల్లర పట్టుకురా అన్న మాటలోని అంతరార్థం. మాయ ఆడే నాటకం అర్థం కావాలంటే, దాన్ని విడగొట్టగా వచ్చిన ముక్కల్ని బాబాకు సమర్పించాలి. అంతేకాని ‘అహంబ్రహ్మాస్మి’ అనే వాక్యాన్ని జపిస్తూ కూర్చోవడం కాదు. తెలివిగా ప్రవర్తించి, మాయను భేదించి, దానిశక్తిని నిర్వీర్యం చేసి బాబాను ఆశ్రయించాలి. తరువాత జరుగవలసిన పని సద్గురువుకు అప్పచెప్పి సాక్షిమాత్రంగా నిలబడాలి. ఆ విధంగా చేస్తే పరబ్రహ్మ స్వరూపుడైన సద్గురువుతో చక్కటి సంబంధాన్ని నిర్వహించవచ్చు.

దీని సారాంశం ఇంకా ఈ విధంగా చెప్పుకోవచ్చు. మనందరం సృష్టిలో వేరువేరు జీవులుగా కనపడుతున్నప్పటికీ మనందరి స్వరూపం ఒకటే అదే పరబ్రహ్మం. జీవులు శరీరాలు ధరించి వేరువేరుగా ఉండడమే కాక, ప్రతి శరీరం ఇంకా అనేక భాగాలైన ప్రాణం, మనస్సు, ఇంద్రియాలు, అంతఃకరణ చతుష్టయం, ఇంకా ఉపాధి, చర్మ, రక్త, అస్థిమాంసాదులైన సప్త ధాతువులుగా ముక్కముక్కలై ఉంది. ఇంతేకాక మనస్సు గూడా సత్వరజోతమో గుణాలుగా విడగొట్టబడి ఉంది. ఈ మొత్తం చిల్లరనే బాబా అడుగుతున్నారు. ఇంకా మన స్వస్వరూపం అర్ధం కావాలంటే, చిల్లర భాగాన్ని బాబా వశం చేయవల్సి ఉంటుంది. ఇదంతా అహంబ్రహ్మాస్మి యొక్క తాత్పర్యమే, బాబా మనకందరకూ అతి సులువుగా బోధపడేటట్లు చేసారు. కాబట్టి పరబ్రహ్మ స్వరూపుడైన బాబాకు శరణాగతులవడమే మనం చెయ్యవలసిన పని.

(ఇదంతా స్వామి సాయి శరణానంద వ్రాసిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

# 31

## నువ్వు ఎక్కడ నుండి వచ్చావు?

వామనరావు రెండవసారి షిరిడి వచ్చినప్పుడు బాబా ఇలా ప్రశ్నించారు. "నువ్వు ఎక్కడ నుండి వచ్చావు?"

దానికి వామనరావు, నేను ముంబాయి నుండి వచ్చాను అన్నాడు. అయితే వామనరావుకి, బాబా తనని ఎందుకలా అడిగారో తెలీలేదు. బాబా సర్వాంతర్యామి అని అతడికి తెలుసు. అయినా తనను ఎక్కడ నుండి వచ్చావు అని ఎందుకన్నారు. ఇదంతా విచారిస్తే గాని తెలియని విషయం అనుకున్నాడు. బాబా వేసిన ప్రశ్న సామాన్యమైందికాదు అని అతడికి అర్ధమయ్యింది. కాబట్టి దానికతడు, ముంబాయి నుండి వచ్చేను అనడం చాలా సాధారణమైన సమాధానం. బాబా అడిగింది శాశ్వితానికి సంబంధించిన ప్రశ్న దాన్ని శోధిస్తేనే, ఎక్కడ నుండి వచ్చావు, ఎక్కడికి పోతున్నావు అన్న ప్రశ్నలకు వేదాంతపరమైన సమాధానాలు దొరుకుతాయి.

వామనరావు ఇలా అంటున్నాడు. నేను బాబా వేసిన ప్రశ్న గురించి, షిరిడీ వీధుల్లో తిరుగుతూ ఆలోచించాను. బాబా చాలాసార్లు నన్ను 'నేను ఎవరును? (who am I) అన్న ప్రశ్నపై ధ్యానం చెయ్యమని చెపుతూ ఉండేవారు. అందుచేత, బాబా చెప్పినట్లుగానే నా గురించి నేను ప్రశ్నించుకోవడం మొదలుపెట్టాను. దాంతో ఒక్కొక్క విషయం అవగాహనకు రావడం ప్రారంభమయ్యింది. మొట్టమొదటిగా నేను ఈ శరీరాన్ని కాదని తెల్సింది. నేనే శరీరమైతే దాన్ని నేను ఎలా చూడగల్గుతున్నాను? అలాగే శరీరంలో గల సప్త ధాతువులను నేను కాదని తెల్సింది. సప్తధాతువులంటే రసం, రక్తం, మాంసం, మేథస్సు, అస్థి, మజ్జ, శుక్రం. అలాగే నేను జ్ఞానేంద్రియ పంచకాన్ని కాదు, కర్మేంద్రియ పంచకాన్ని కాదు. జ్ఞానేంద్రియాలు అంటే చూపు, వినికిడి, రుచి, వాసన, స్పర్శలు. కర్మేంద్రియ పంచకమంటే కాళ్ళు, చేతులు, నోరు, మలమూత్ర ద్వారాలు. అదే విధంగా నేను పంచ ప్రాణాలను కూడా కాదు. పంచ

ప్రాణాలంటే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలు. అలాగే నేను ఆలోచనలు చేసే మనస్సునూ కాదు. ఈ నామ రూపాత్మకమైన జగత్తు, పరబ్రహ్మ స్వరూపం యొక్క విభూతులుగా, ఆభాసగా గోచరించడానికి బదులుగా వాస్తవమనుకొనడానికి కారణమైన అజ్ఞానాన్ని కూడా నేను కాదు. అజ్ఞానాన్ని నేను కానప్పుడు తన్మూలంగా కనపడుతున్న వస్తు సముదాయం కాని, వాటి మధ్యన జరిగే వ్యవహారాలు కాని లేనివే అవుతున్నాయి. అనగా మిధ్య లేక మాయగా ఉన్నాయి. ఆ స్థితిని కూడా నేను కాదు. (ఇదంతా శంకర భగవత్పాదుల నిర్వాణాష్టకం యొక్క తాత్పర్యం.) ఈ విధంగా నేనును విచారణ చేస్తూ ఉంటే చివరకు తేలేది "చిదానంద రూపః శివోహం, శివోహం" అంటారు శంకరులు. వామనరావు ఆలోచనలు ఈ విధంగా సాగుతూ ఉండేవి.

అప్పుడు అతడు షిరిడీలో చాలాకాలం ఉన్నాడు. బాబా, నువ్వు ఎక్కడ నుండి వచ్చావు అని ప్రశ్నించిన మరునాడే అతడికి చిత్రమైన అనుభవం కల్గింది. ఇప్పుడు వామనరావు దాని గురించి చెపుతున్నాడు. దీక్షిత్ నన్ను ఆరోజు వాడాలో నిద్రించడానికి రమ్మనమన్నాడు. ఎందుకంటే అప్పటికి నాకంటూ ఒక గదిలేదు. నేను దీక్షిత్ ఆహ్వానానికి సంతోషించాను. అతడి వాడాలో మొదటి అంతస్తులో ఒక గది నాకిచ్చాడు. నా పరుపు కిటికీ ప్రక్కనే వేసుకున్నాను. తలవైపు పై భాగంలో బాబా చిత్రపటం ఉంది. నేను క్రింద పడుకుని ఉన్నాను. కాని నిద్రపోలేదు. తెలివిగానే ఉన్నాను. ఉన్నట్టుండి నాలో నుండి ప్రాణశక్తి, దేహం నుండి తప్పుకుని బయటకు పోయినట్లు నా కనిపించింది. అంతేకాకుండా అలా బయటకు వచ్చిన ప్రాణశక్తి తెల్లటి కాంతి రూపంలో ఎందురుగా ఉన్న గోడకు అంటుకుని ఉన్నట్లు నా కళ్ళకు ప్రత్యక్షంగా కనపడింది. వెంటనే నేను చనిపోయాను అనుకున్నాను. వామనరావు ఇప్పుడు చనిపోయాడు. ఇంక ఈ దేహమనే నేను, వామనరావు కాక ఇంకెవరో అయి ఉంటారు.

సరే ఆ రోజు రాత్రి అలా జరిగింది. మరునాడు ఉదయం లేచాను. కాని

రాత్రి జరిగిన సంఘటన, దాని అనుభవం అలానే ఉంది. అంటే నేను చనిపోయాను. ఇప్పుడు కనపడుతున్న ఈ శరీరం క్రొత్తది. ఈ రకమైన ఆలోచనలు మనస్సును కట్టిపడేసాయి. అవి ఎంత మరచిపోదామనుకున్నా పోవడంలేదు. ఎవరో భక్తుడు కూడా నా పరిస్థితి అర్థం చేసుకోలేక, మరి వామనరావు ఉన్నట్లా లేనట్లా? అని అడిగాడు. దానికి నేను, అరె! వామనరావు కొద్దిసేపటిక్రితం చనిపోయాడు. అయితే ఎక్కడికి పోయాడో ఎవరికి తెలుసు? అన్నాను.

చివరికి ఈ విషయం గురించి నేను చాలాకాలం ఆలోచించాను. బాబా నాకు ఇలాంటి అనుభవాన్ని ఎందుకు కలిగించారు? దీని నుండి నేను నేర్చుకోబోయే పాఠం ఏమిటి? బాబా దయవల్లే జవాబు దొరికింది. ప్రాణశక్తి అన్నది ఎప్పుడు కావాలంటే అప్పుడు వస్తుంది, పోతుంది. ఈ క్రియ ఇలా ఎప్పటికీ జరుగుతూనే ఉంటుంది. దీనినంతటినీ గమనించే నేను (ఆత్మ) మాత్రం శాశ్వితం. అది ఎక్కడికీ పోదు, రాదు. అది అంతటా నిండి ఉంటుంది. ఇదేసాక్షి ఇదే సత్‌చిత్ ఆనంద స్వరూపం. కారణ కార్యరూపమైన ఈ జగత్తునంతా గమనించేది ఇదే. దీని స్వభావం శుద్ధం, బుద్ధం, ముక్తం. ఇంకా ఇది అవినాశి, అవ్యయం. ఇదే సంపూర్ణ జ్ఞాన స్వరూపం. మాయకు లొంగనిది, మాయను లోబరుచుకున్నది కూడా ఇదే. అందుకే సచ్చిదానందం అన్నారు.

శ్రీసాయి సచ్చరిత్ర, మూడవ అధ్యాయంలో హేమాద్రిపంత్ ఇలా అంటారు. కోరికలన్నవి మనస్సు చేతనే సంకల్పించబడుతున్నాయి. వాటికీ, ఆత్మకు ఎట్టి సంబంధం లేదు. సద్గురు సాయినాథ్ మహరాజ్ ఆత్మస్వరూపులు. అటువంటప్పుడు ఆయనకు కోరికలు ఎలా పుడుతాయి? కోరికలు చాలా రకాలుగా ఉంటాయి. కాని "నేను ఎవరను' అన్న ప్రశ్నకు సరైన సమాధానం పొంది, దాని సారం అనుభవానికి వచ్చినట్లైతే, ఈ కోరికలన్నవి, సూర్యుని వేడికి వడగళ్ళు కరిగి పోయినట్లు కరిగిపోతాయి.

నేను ఎవరను? అని తెలుసుకోవడానికి ముందుగా నేను ఎవరును కానో తెలుసుకొనమని మన శాస్త్రాలు బోధిస్తున్నాయి. ఆ విధంగా నేను మనసును కాదు,

శరీరాన్ని కాదు అని గుర్తెరగమంటారు. సృష్టికి కారణమని చెప్పబడుతున్న హిరణ్య గర్భుడను కూడా నేను కాదు. అలా అన్నీ పోగాపోగా చివరకు మిగిలిన సనాతనమైన సాక్షిని, దేనికి ఆది లేదు అట్టి పరబ్రహ్మ స్వరూపాన్ని నేను అనే ఆ పరోక్ష జ్ఞానాన్ని పొందగల్గుతాం. (దీన్నే 'తదేకోఅవశిష్టః శివః కేవలోహం' అని అంటారు.)

ఈ విధంగా మన శరీరం మొదలుకొని, ఇంద్రియ వ్యవస్థ, మనస్సు, బుద్ధి వరకూ అన్నీ కూడా జడ పదార్థాలని అవగాహనకు వచ్చినట్లైతే, అప్పుడు మాయా మోహితమైన ఆవరణ శక్తి నశించి, ఆత్మజ్ఞానం బయటపడుతుంది.

దీనిసారాంశం ఇలా ఉంటుంది. బాబా ఈ విధంగా బోధిస్తున్నారు. మన ఆలోచనా వ్యవస్థ గాని, మన మాటలధోరణి గాని ఎలా ఉంటుందంటే, నేను అనగా ఈ దేహమే, అంతకుమించి ఇంకొకటి ఏదీలేదు అన్నట్లు ఉంటుంది. కాని ఇది శుద్ధ అబద్ధం. వ్యవహారంలో ఈ మాటలు చెల్లుబాటు అయినా శాస్త్రం మాత్రం ఒప్పుకోదు. దీన్ని శోధించడానికే నేను అన్నది ఎక్కడ నుండి పుట్టింది? అన్న విచారణ సాగించమంటారు. వేదాంత పరిభాషలో ఈ విచారణనే విమర్శ అని కూడా అంటారు. నిన్ను నువ్వు విమర్శించుకొంటేే తప్ప నిజం బయటపడదు అన్నది శాస్త్రోక్తి. మనం మాయలో పడి మ్రగ్గుతున్నప్పుడు బాబా చేయూతనిచ్చి రక్షిస్తూ ఉంటారు. మన మనస్సులో ఆత్మజ్ఞానాన్ని నిక్షిప్తం చెయ్యడానికి, పరమాత్మ రూపాన్ని ముద్రించడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు. నా స్వస్వరూపం పరబ్రహ్మయే. అలాగే నేను నేను అని పలికే మాట మన నిజస్వరూపాన్నే గుర్తెరగమని చెప్పడమే. ఆ నేనే సచ్చిదానంద రూపం తప్ప వేరొకటి కాదు.

(ఇదంతా స్వామి సాయి శరణానంద వ్రాసిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

# 32

## సీతాఫలం - రామాఫలం

ఒకరోజు ఉదయం వామనరావు ద్వారకామాయి గోడ దగ్గర నిల్చుని ఉన్నాడు. అదే సమయంలో దీక్షిత్ ద్వారకామాయి లోపల నుండి బయటకు వచ్చి, బాబా ఇమ్మనమని చెప్పారని ఒక సీతాఫలం ముక్క వామనరావు చేతిలో పెట్టాడు. బాబా ఇచ్చిన ఆ ప్రసాదాన్ని దీక్షిత్ దగ్గర నుండి తీసుకున్నాడు వామనరావు. అతడి మనస్సు ఎందుకో ఆందోళనతో ఉంది. ప్రసాదాన్ని హృదయ పూర్వకంగా స్వీకరించలేక పోయాడు. ఆ కారణం చేత దాన్ని ద్వారకామాయి గోడపై పెట్టి షిరిడి గ్రామంలోకి బయలుదేరాడు. అతడి ఆలోచన ఈ విధంగా సాగింది. బాబా ఎందుకు ఆ సీతాఫలం ముక్క దీక్షిత్ ద్వారా నాకు పంపించారు. సీతాఫలం అన్న మాట నా చెవుల్లో మ్రోగుతోంది. భగవంతుడైన శ్రీరాముని పట్ల, పతివ్రత అయిన సీతాదేవికి ఉండే ప్రేమను, భక్తిని నాకు గుర్తు చేస్తూ, అటువంటి భక్తినే నేను కూడా బాబా పట్ల కల్గి ఉండాలని చెపుతున్నట్లుంది. సీతమ్మవారికి ఎన్నడూ ఏ రకమైన సందేహం గాని, మనసుకు నచ్చని ఆలోచన గాని వచ్చేది కాదు. ఆమె ఎటువంటి కష్ట సమయంలో ఉన్నప్పటికీ మనో నిశ్చలతను, ధైర్యాన్ని కోల్పోలేదు. బహుసా బాబా కూడా నన్ను సీతమ్మవారి అడుగుజాడల్లోనే నడిచి మనో నిశ్చలతను, ధైర్యాన్ని కూడగట్టుకుని ఉండమని అనుకుంటున్నారేమో. కాని ఏం చెయ్యడం, నా మనస్సు కుదురుగా ఉండటం లేదు. ఎందుకు నా మనస్సు స్థిరమైన భక్తితత్త్వాన్ని అందుకోలేకపోతోంది. కొంచం లోతుగా ఆలోచిస్తే, నా మనస్సు అహంకార పూరితమైనట్లు కనపడుతోంది. నేను బాగా చదువుకున్నవాడిని, అన్ని విషయాలు తెలిసిన జ్ఞానిని అనే భావన నన్ను తప్పుదారి పట్టిస్తున్నదా? ఇదే సమయంలో నాకు ఒక విషయం బలీయంగా స్ఫురిస్తోంది. ఒక్క ఆత్మజ్ఞానంతో మాత్రమే ఎవ్వరైనా ఈ జనన మరణ సంసార చక్రభ్రమణం నుండి తప్పించుకోగలరు. ఇప్పుడు నా పరిస్థితిని బట్టి నేను ఆత్మజ్ఞానాన్ని అందుకుందికి సమర్థుడనని అనుకుంటున్నాను. ఆ విధంగా జ్ఞానమార్గంలో పోగల్గినప్పుడిక భక్తిమార్గం యొక్క అవుసరం ఏముంటుంది? ఇంతకూ

నా సద్గురువు నాకు అవసరమయ్యే మార్గమేదో బోధించడానికి సిద్ధంగా ఉన్నవారే కదా! నాకున్న బలహీనతలను గాని, అపోహలను గాని, లోటుపాట్లను గాని, నా సద్గురువు సరిదిద్ది నన్ను సత్యమార్గం వైపు మళ్లించగలరు. నేను దురాశాపరుడనుగానని నా సద్గురువుకు తెలుసు. ఒకవేళ నాకున్న సమర్థత ఒక అణాకాసు పాటిదై, నేను కోరే ప్రతిఫలం మాత్రం ఒక రూపాయిదైతే, ఆయన ప్రయత్నం ఫలించదని కూడా నాకు తెలుసు.

బాబా పంపిన ప్రసాదాన్ని అగౌరవపరచి నేను పెద్ద తప్పే చేసాను. ఈ ఆలోచన నాకు రాగానే, వెంటనే నా పాదాలు వెనక్కు నడిచాయి. ద్వారకామాయి గోడ దగ్గరకు వచ్చాను. ఆ సీతాఫలం ముక్క నేను ఎక్కడ పెట్టానో అక్కడే ఉంది. నాకు ఎంతో ఆనందమనిపించింది. దానిని అక్కడ వదిలిపెట్టి నేను ఎక్కడెక్కడో తిరిగాను. అయినప్పటికీ ఎవ్వరూ దానిని తీసుకోలేదు. నాకు నిజంగా ఆశ్చర్యమేసింది. మనుషులు కాకపోతే పక్షులైనా దానిని తాకలేదు ఎందుకని? ఏది ఏమైనప్పటికీ, నేను సీతాఫలాన్ని ఎంతో భక్తితో తిన్నాను.

శ్రీ సాయి సచ్చరిత్ర 19వ అధ్యాయంలో హేమాధిపంత్ ఇలా అంటారు. బాబా జ్ఞాన మార్గం యొక్క గొప్పతనం గురించి మనస్సుకు హత్తుకునేటట్లు చెపుతూ, దాన్ని రామాఫలంతో పోల్చేవారు. అలాగే భక్తి మార్గాన్ని సీతాఫలంతో పోల్చేవారు. సీతాఫలాన్ని చప్పరిస్తూ ఉంటే ఎంత బాగుంటుందో భక్తిమార్గం కూడా అంత మధురంగా ఉంటుంది. అలాగే భక్తిమార్గంలో కృషి కూడా సీతాఫలం తినడంలాగ ఎంతో సులువుగా ఉంటుంది. ఇంకా ఆ ఫలంలాగే తియ్యగాను, రుచికరంగానూ ఉంటుంది. భక్తికి సీతాఫలాన్ని, తద్వారా ప్రాప్తించిన జ్ఞానానికి రామాఫలాన్ని గుర్తుగా చెప్పేవారు. రసం విషయంలో ఒకదానిని మించి ఇంకొకటి ఉండడం, రుచికి సువాసనకు, ఇంకా చూడడానికి అందం విషయంలో కూడా రెండు ఫలాలు వాటికి అవే సాటి.

రామాఫలం పూర్తిగా పండకుండా కోసి, కృత్రిమంగా కాని పండిస్తే, దాని లోపలి గుజ్జు పసరుగా ఉండి తిని ఆనందించడానికి కష్టంగా ఉంటుంది. కాని

ఎవరైతే ఓపికగా ఉండి, చెట్టు మీదే పండిన తరువాత తింటారో వారు ఆ పండు యొక్క రుచి, సువాసన, మాధుర్యాన్ని చవి చూడగలరు. అయితే సీతాఫలానికి ఇంత శ్రమ అవసరం లేదు. దానికి రామాఫలమంత ప్రసిద్ధత లేకపోయినా చాలా ముఖ్యమైంది, అందరికీ అందుబాటులో ఉండేది అయింది.

ఇంకొక విషయం, రామాఫలం చెట్టునుండి జారి క్రిందపడే అవకాశమున్నది. అలాగే జ్ఞాన సాధకుడు అయినవాడు కూడా ఇంద్రియాతీతమైన విషయాల్లో సరైన పట్టు సాధించకపోతే సాధనలో క్రిందపడడానికి అవకాశం ఉంది. ఈ విషయంలో అతడు బహు జాగరూకుడై మెలగాలి.

బాబా తన భక్తులందరినీ భక్తిమార్గంలోనే నడవమని చెప్పేవారు. ఎందుకంటే భక్తిమార్గం చాలా సులువైన ప్రక్రియ. దానికి తగినంత శిక్షణ లేకపోయినా కూడా ఏ ప్రమాదమూ రాదు. దీనికి భిన్నంగా ఉంటుంది జ్ఞానమార్గం. జ్ఞాన సాధకుడికి చాలా క్రమశిక్షణ అవుసరముంటుంది. అతడెల్లప్పుడూ గురువు సమక్షంలో ఉండి తీరాలి. తన జీవితాంతం ఏకాగ్రత కల్గి ఉండి, గురువుపై అచంచలమైన విశ్వాసంతో ఉండాలి. అతడికి సబూరి అన్నది అతిముఖ్యమైన సాధనం. సబూరి అనగా సహనం, ధైర్యం. రామాఫలం పూర్తిగా చెట్టుకుపండేటంత వరకూ ఓర్పు వహించాలి. అయితే రామాఫలం పండిన వెంటనే చెట్టు నుండి రాలి క్రిందపడే ప్రమాదం ఉంది. ఒకవేళ క్రిందనే పడితే, అది పగిలిపోతుంది. తరువాత పనికిరాకుండా పోయే అవకాశం ఎక్కువ. అదే విధంగా జ్ఞానమార్గ సాధకుడు తన జ్ఞాన ఫలాన్ని క్రింద జార్చకుండా చూసుకుంటూ ఉండాలి. భక్తిమార్గంలో అయితే ఇన్ని జాగ్రత్తలు పాటించనవుసరం లేదు.

ఏ చెట్టుకైతే రామాఫలం పండుతుందో అది సద్గురువుకు చిహ్నం. సాధకుడు చెట్టును వదిలిపెట్టి బయట తిరుగుతున్నట్లయితే, అతడు తన గమ్యాన్ని చేరకుండా పోయే ప్రమాదముంది. అతడికి జ్ఞాన విషయంలో ఎంత ఎక్కువ ప్రవేశమున్నప్పటికీ, సద్గురు కృపను పొందకపోతే అతడి సాధన ప్రయోజన శూన్యమవుతుంది. తన మార్గంలో, అంతవరకూ చేసిన ప్రయాణం వల్ల కొన్ని సిద్ధులు కలిగి అతడిని ప్రలోభ

పెడుతూ ఉంటాయి. ఆ సిద్ధుల వలలోపడితే ఇక ముందుకు సాగడం ఉండదు సరికదా, అంతవరకూ కల్గిన జ్ఞానం కూడా సాధకుడిని విడిచిపెట్టిపోయే ప్రమాదముంది. కాబట్టి సాధకుడు చాలా జాగ్రత్తతో ఉండవల్సిన అవుసరం ఉంది. అందువల్లనే బాబా తన భక్తులను, భక్తి మార్గంలోనే సాధన చెయ్యమని చెప్పేవారు. బాబా నామ జపం భక్తి మార్గంలో ప్రయాణించే వారందరికీ దివ్యమైన రక్షణ కల్పిస్తుంది.

పైన చెప్పిన విషయాలన్నీ వామనరావు బాగా ఆలోచించి, తనకు బాబా సీతాఫల ప్రసాదాన్ని ఎందుకు పంపించారో అర్థం చేసుకున్నాడు. బాబా సంపూర్ణ జ్ఞాన స్వరూపులు కాబట్టి, ఎంతో దయతో సీతాఫలాన్ని దీక్షిత్ ద్వారా పంపించారు అని తెలుసుకున్నాడు. అప్పటి నుండి బాబా నామ జపాన్ని వదలకుండా, ఇంకా ఎక్కువ శ్రద్ధతోనూ, ఎక్కువ ఉత్సాహంగానూ చేయడం మొదలుపెట్టాడు.

ఈ కథ ముగింపు సందర్భంగా, సీతాఫలం గురించి మరింత వ్యాఖ్యానం క్రింద ఇవ్వడం జరిగింది. సీతాఫలం ఒక ప్రత్యేకమైన పండు. దాంట్లో చాలా పిక్క లుంటాయి. ప్రతి పిక్కకీ అంటుకుని దాని గుజురు ఒక పొరలాగ ఉంటుంది. అందుచేత దాన్ని తింటున్నప్పుడు మిగతా పళ్ళకీ దానికీ మధ్య తేడా బాగా తెలుస్తూ ఉంటుంది.

బాబా, దీక్షిత్ ద్వారా ఈ సీతాఫలాన్ని వామనరావుకు పంపించారు. అలా పంపించడంలో గల అంతరార్థం అందరికీ ఒక పాఠమయ్యింది. సీతాఫలం యొక్క రుచి అది తిన్న వారికి బాగా తెలుస్తుంది. ఆ గుజురులో ఉన్నటువంటి తియ్యదనం, వగరు మన జీవితాల్లోని సుఖదుఃఖాలను పోలి ఉంటాయి. సుఖం గాని దుఃఖం గాని, సందర్భాన్ని బట్టి కలుగుతూ ఉంటాయి. ఇదంతా సంచితంలో చేసుకున్న కర్మఫలాన్ని బట్టి కలుగుతూ ఉంటాయి. వాటినే మనం ప్రారబ్ధంగా అనుభవిస్తూ ఉంటాం.

సీతాఫలం తిన్న తరువాత మనం దాని పిక్కల్ని బయటపడవేస్తాం. అవే కదా భవిష్యత్‌లో మొక్కలుగా ఏర్పడుతూ ఉంటాయి. అలాగే మనం కూడా సుఖ దుఃఖాలను అనుభవించిన తరువాత, యదావిధి కర్మలు ఆచరిస్తూ జీవితం గడుపుతాం.

బాబా ఇచ్చిన సీతాఫలాన్ని మొదట తీసుకోకుండా వామనరావు ద్వారకామాయి గోడమీద పెట్టాడు. చాలాసేపు తిరిగి వచ్చిన తరువాత చూస్తే ఆశ్చర్యంగా ఆ ఫలం అలాగే గోడ మీదనే ఉంది. ఎవరూ దాన్ని తీసుకోలేదు. ఎవరు చేసుకున్న కర్మఫలాలను వారే అనుభవించవలసి ఉంది. కాని మనం సద్గురువును ఆశ్రయిస్తే కర్మఫలం అనే విత్తనాలను తిరిగి మొలకెత్తకుండా చెయ్యగలరు. దానివల్ల జనన మరణ చక్రం నుండి, సద్గురువు మనలను రక్షించుకుంటారు. ఆయన పాదాలను ఆశ్రయించి శరణువేడిన పక్షంలో, కరుణార్ధ హృదయుడై మన కర్మఫలంలో 2/3 వంతు తాను భరించి మనలను సేద దీరుస్తారు. దానివల్ల ఇంక 1/3వంతు మాత్రమే మనకు మిగుల్తుంది. కాని కొంతకాలానికి ఈపాటి బరువు కూడా మనకి కొండంత భారంగా కనపడుతుంది.

మన పరిస్థితిని గమనించిన బాబా, సాధన మొదలుపెట్టమంటారు. మనందరం హృదయపూర్వకంగా బాబా అడుగుజాడల్లో నడుస్తూ ఆధ్యాత్మిక ప్రయాణం సాగిస్తాం. మన సాధనలు పరిపక్వ స్థితికి చేరుకునే సమయానికి, బాబా దయవల్ల మనలో సమతాభావన గట్టిపడుతుంది. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పినట్లు సమత్వం యోగఉచ్యతే (2-48) అనబడే స్థితిలో మన సాధన సాగుతుండగా, భేద భావం క్రమంగా ప్రక్కకు తప్పుకుంటుంది. కష్టసుఖాల్ని ఋజుమార్గంలో అర్ధం చేసుకుని తేలికపడతాము. దయాసముద్రుడైన బాబా మనకు అభయం ఇస్తున్నారు. జీవితంలో మీకు ఎదురయ్యే బరువు బాధ్యతలను నేను మోస్తాను. ఇది ఒక జన్మవరకే కాదు ఎప్పటికీ, అంటే మీకు మోక్ష పురుషార్ధం లభించేటంతవరకూ, అలా కానిపక్షంలో నేను ఇచ్చే ఈ వాగ్ధానం అసత్యమౌవుతుంది. బాబా అలా అంటే అన్నారు గాని, పరబ్రహ్మ స్వరూపులైన సద్గురు సాయినాధుని నోటి వెంట అసత్యం అన్నమాటేరాదు. అందుచేత నా మాట ముమ్మాటికీ నిజం అని చెప్పడమే ఆ మాట యొక్క అసలైన అర్ధంగా మనం భావించాలి.

(ఇదంతా స్వామిసాయి శరణానంద వ్రాసిన సాయి శరణం అనే పుస్తకంలో ఉంది)

## (33)

## బడెమియ్యా షిరిడి పర్యటన

ఈ లీల బడేమియ్యా అనబడే ఒక ముస్లిం భక్తుడి అనుభవం. 1942లో శాంతారాం డి. దెత్తె ద్వారకామాయిలో బడేమియ్యాను కలిసాడు. ఇద్దరి మధ్య కొంత సంభాషణ నడిచింది. అప్పుడు బడెమియ్యా బాబాను 1917వ సంవత్సరంలో కలిసినట్లు తెలిసింది. దెత్తెకు ఎంతో ఆనందమనిపించింది. బాబాను ప్రత్యక్షంగా దర్శించిన మనిషితో మాట్లాడుతున్నానా అని ఆశ్చర్యపోయాడు. అతడి అనుభవాన్ని, ఇంకా బాబా యొక్క దివ్యత్వాన్ని వివరించమని కోరాడు.

అప్పుడు బడేమియ్యా ఇలా చెప్పడం ప్రారంభించాడు. బాబా ఒక గొప్ప వల్లీ అన్నాడు. వల్లీ అంటే ముస్లిం యోగి అని అర్థం. బాబా ఒక మహాసముద్రం లాంటివారు. అలా అయినప్పుడు సాధారణ కుటుంబీకుడనైన నేను ఆ మహాసముద్రం లోతును ఎలా వర్ణించగలను? నేను పేదవాడిని కాబట్టి నా కూతురు వివాహం ఎలా చెయ్యాలా అని బాధపడేవాడిని. నా గ్రామం షిరిడీకి దగ్గరలోని మారాట్వాడా. నేను బాబా గొప్పతనం గురించి, ఆయన దయాగుణం, పరోపకారత్వం గురించి చాలా విన్నాను. ఆవిధంగా బాబా దర్శనం చేసుకుందామని షిరిడి బయలుదేరాను. ద్వారకామాయిలో బాబా ఆయన స్థానంలో కూర్చుని ఉన్నారు. ఆయన చుట్టూ కొద్దిమంది భక్తులు కూర్చున్నారు. వెళ్ళగానే బాబాకు సాష్టాంగ నమస్కారం చేసి ఎదురుగా కూర్చున్నాను.

అదే సమయంలో ఒక గ్రామపెద్ద వచ్చి మూడు రూపాయలు బాబా ముందు పెట్టాడు. బాబా ఆగ్రామ పెద్దని చూసి అతడి బాగోగులు అడిగారు. మీ కుటుంబంలో అందరూ క్షేమమా అన్నారు. అప్పుడు ఆ గ్రామపెద్ద ఇలా చెప్పడం ప్రారంభించాడు. నా కూతురుకి పెళ్ళి చెయ్యాలని సంకల్పించాను. దానికి తగిన ధనం నా దగ్గర లేదు. ఇప్పటికే పీకల్లోతు అప్పుల్లో ఉన్నాను. ఇంకా ఈ పెళ్ళికి కూడా అప్పు చేసానంటే,

నాకు ఇక తీర్చేశక్తి లేదు. కాని కూతురు పెళ్ళి, ఒక గ్రామ పెద్దగా, బాగా చెయ్యవలసి ఉంటుంది. అలా కాకపోతే నన్ను చూసి అందరూ నవ్విపోతారు. ఈ వివాహానికి కనీసం నాకు మూడువేల రూపాయలు అవుసరం ఉంటాయి. ఇలా గ్రామపెద్ద చెప్పిన కథనంతా బాబా విన్నారు. నువ్వు పెద్దగా దీని గురించి చింతించకు. భగవంతుడే నీ కార్యం నెర వేరుస్తాడు. నువ్వు నీ భారాన్నంతా భగవంతుడిపై నుంచి నిశ్చింతగా ఉండు. భగవంతుడు చేసే లీల గమనించు. ఆయన తలుచుకుంటే నీ పని సులువుగానే అయిపోతుంది. గ్రామ పెద్ద బాబా ఉపదేశం విన్నాడు. బాబా! మీరు చెప్పింది అక్షరాలా నిజం. కాని నేను గ్రామపెద్దను ఇంకా ఈ సంసారిక ప్రపంచంలో ఒక కుటుంబ పెద్దను. భగవంతుడిపై భారముంచి కూర్చుంటే నలుగురికి ఏం సమాధానం చెప్పాలి. అదీ నా బాధ అన్నాడు. బాబా అప్పుడన్నారు, అనవసరంగా బాధపడకయ్యా, నేను నీకు కావల్సిన మూడువేల రూపాయలు ఇస్తానులే. దాంతో నీ సమస్య తీరిపోతుంది.

ఇంక అక్కడే కూర్చున్న బడే మియ్యా ఆ సంభాషణంతా విన్నాడు. ఆశ్చర్య పోయాడు. బాబా అంత పెద్ద సొమ్ము గ్రామపెద్దకు ఎలా ఇవ్వగలరు? అనుకున్నాడు. బాబావైపు చూసాడు. బాబా చిరిగిపోయిన ఒక కఫినీ కట్టుకుని ఉన్నారు. ఇంకా మాసిపోయిన ఒక తెల్లగుడ్డ తలకి చుట్టుకున్నారు. దగ్గర్లో ఎక్కడా ఒక పెట్టెకాని, గోడకు అల్మారాలాంటిదిగాని లేదు. మరి అంత డబ్బు ఎక్కడ పెట్టి ఉంచారు? ఎలా ఇవ్వగలరు? అనుకొంటూ బాబా వైపే చూస్తున్నాడు. అదేక్షణంలో బాబా చినిగిపోయి ఉన్న తన కఫినీ జేబులో చెయ్యిపెట్టి రూపాయినోట్ల కట్ట ఒకటి తీసి గ్రామపెద్దకిచ్చారు. ఇక్కడే దీన్ని లెక్కపెట్టు అని ఆదేశించారు. గ్రామపెద్ద బాబా చెప్పినట్లే ఆ నోట్లన్నీ లెక్కించాడు. అవన్ని సరిగ్గా మూడువేల రూపాయిలున్నాయి. ఇప్పుడు నీ పని అయ్యింది కదా! వెళ్ళి పెళ్ళి పనులు చూసుకో అని గ్రామపెద్దను పంపించివేసారు.

ఆశ్చర్యం ఆనందంతో, బడేమియ్యా ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. బాబా

పాదాలకు సాష్టాంగం చేసి ఇంటికి తిరుగు ముఖం పట్టాడు. (ఇంతవరకూ చదివిన తరువాత, ఇంతకీ బడేమియ్యా సంగతి ఏమైంది అన్న ప్రశ్న ఉదయించవచ్చు. దానికి సమాధానం వచ్చే లీలలో దొరుకుతుంది.)

దీని సారాంశం ఇలా ఉంది. బాబా చెప్పిన ప్రకారంగా, ప్రతి భక్తుడూ లేక సాధకుడూ పరమాత్మపై అచంచలమైన విశ్వాసాన్ని కల్గి ఉండాలి. ఈ విశ్వాసం ఎలా ఉండాలంటే ఒక చిన్న పిల్లాడు తన తల్లిని నమ్మి ఎలా ఊరుకుంటాడో అలాంటి నమ్మకాన్ని కల్గి ఉండాలని బాబా బోధిస్తున్నారు. అదే ప్రకారం తన సద్గురువుపై గూడ భక్తితోకూడిన సంపూర్ణ విశ్వాసాన్ని కల్గి ఉండాలి. తన బరువు బాధ్యతలను సద్గురువుకు అప్ప చెప్పితాను నిశ్చింతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి.

(ఇదంతా శ్రీసాయి సాగర్ పత్రిక 2009, దీపావళి సంచికలో ఉంది)

## 34

# బడేమియ్యా కుమార్తె వివాహం జరిగింది

బాబా దర్శనం తరువాత బడేమియ్యా ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ రాత్రి అతడికి నిద్రపట్ట లేదు. ద్వారకామాయిలో బాబాకు, గ్రామపెద్దకు జరిగిన సంభాషణ, బాబా హితబోధ, తరువాత బాబా తన కఫినీ జేబులో నుండి డబ్బుతీసి, గ్రామ పెద్దకు ఇవ్వడం, అతడికి పదే పదే గుర్తుకు వస్తున్నాయి. తన కూతురుకి కూడా పెళ్ళి యీడు వచ్చింది. తొందరలోనే ఆమె పెళ్ళి జరిపించవలసిన బాధ్యత తనకుంది. అందు నిమిత్తం కనీసం వెయ్యి రూపాయిలు తనకు కావలసి ఉంది. తనా బీదవాడు, బాబా సాయం కోసం షిరిడీ వెళ్ళాడు. అయితే బాబా గ్రామ పెద్దకు ధన సహాయం చేసినట్లు తనకు కూడా ఇవ్వగలరా? ఇదీ అతడి ఆలోచన. మరొకసారి బాబాని దర్శించుకోవాలని నిశ్చయించుకొని మరునాడు ఉదయాన్నే బయలుదేరి ద్వారకామాయి చేరుకున్నాడు.

బాబా పాదాలకు నమస్కరించి ఒక రూపాయి బాబా పాదాల దగ్గర ఉంచాడు. తన కూతురు వివాహం జరగవల్సి ఉందని, దానికి వెయ్యి రూపాయిలు అవసరం పడుతుందని విన్నవించుకున్నాడు. అతడి ప్రార్ధన విన్న బాబా, అలాగా! వెయ్యి రూపాయలు కావాలా! అని చెప్పి, తన కఫినీ జేబులో చెయ్యిపెట్టి ఒక పిడికెడు రూపాయి నాణాలను బయటకు తీసి, ఇవి నీ ధోవతిలో మూట కట్టుకో అన్నారు. బడేమియ్యా ఆ నాణాల శబ్ధం కూడా విన్నాడు. ఇంక నువ్వు ఇంటికిపోయిన తరువాత లెక్కపెట్టి చూసుకో అన్నారు. బాబా చెప్పినట్లుగానే బడేమియ్యా ఇంటికి వెళ్ళాడు. బాబా ఇచ్చిన నాణాలను క్రిందపోసి లెక్కపెట్టాడు. అవి మొత్తం 68 రాగి పైసలున్నాయి.

ఆ రాగి పైసలు చూసి ఆశ్చర్యపోయాడు. బాబా తనతో వేళాకోళంగా ప్రవర్తించారేమో అని భావించి వెంటనే తిరిగి షిరిడీకి వెళ్ళాడు. బాబాను కలిసి

ఇలా చెప్పుకున్నాడు. బాబా! ఆ రోజు గ్రామ పెద్ద గొప్పవాడు కాబట్టి తమకు మూడు రూపాయలు సమర్పించాడు. కాని నేను బీదవాడిని మరాట్వాడా నుండి మీ దర్శనార్థం వచ్చాను. నా కూతురు వివాహానికి, నాకు వెయ్యి రూపాయల ఖర్చు ఉంది. కాని మీరు ఇచ్చినది లెక్క చూస్తే 68 రాగి పైసలున్నాయి. నేను మీకు ఒక రూపాయి సమర్పించుకున్నాను. బాబా! నన్ను మీరు ఆట పట్టించారా? అని అడిగాడు.

బడేమియ్యా మాటలు విన్న బాబాకు నవ్వు వచ్చింది. నువ్వు నా పాదాల దగ్గర ఒక రూపాయి పెట్టగానే, నువ్వు వెయ్యి రూపాయలు సహాయం కోసం వచ్చావని తెలిసింది అన్నారు. అప్పుడు బడేమియ్యా, నిజంగానే బాబా! నా కూతురుకు త్వరలోనే వివాహం చెయ్యవలసి ఉంది అన్నాడు. బాబా అతడికి అసలు విషయం చెప్పదలచారు. అరె! నీ కూతురు వివాహం వచ్చే సంవత్సరమే జరుగుతుంది. దానికి నీకు ఎందుకింత బాధ. అది నిశ్చయం కాగానే నీకు డబ్బు అందేటట్లు నేను చేస్తాను అన్నారు.

బడేమియ్యా ఇంటికి తిరిగి వచ్చాడు. బాబా ఆశీర్వాదంతో, ఆ సంవత్సరం ఫలసాయం సాధారణం కంటె నాలుగైదు రెట్లు ఎక్కువగా వచ్చింది. ఎవ్వరినీ అప్పు అడగకుండానే బడెమియ్యాకు కూతురు వివాహానికి కావల్సిన డబ్బు అందింది. దాంతో ఘనంగా వివాహం జరిపించాడు.

దీని సారాంశం ఇలా ఉంది.. మనకు ఏది, ఎప్పుడు, ఎంత ఇవ్వాలి అన్నది పరమాత్మకు తెలుసు. అంతా పరమాత్మ దయతోనే జరుగుతుంది.

(ఇదంతా శ్రీసాయి సాగర్ పత్రిక 2009 దీపావళి సంచికలో ఉంది)

## 35

## బాబాపై మహాలికి గల వింతప్రేమ

ఇది మహాలి అని బాబాచేత పిలువబడే ఒక భక్తురాలి కథ. ఈమెను చిన్నతనంలో 'రావు' అని పిలచేవారు. వివాహం తరువాత ఆమెను అత్తగారు రాథే అని పిలిచేవారు. ఈమె షిరిడికి రాకపూర్వం చాలా తీర్థప్రదేశాలు తిరిగింది. వాటిలో కొన్ని జెజూరి, నెవాసా, పండరిపూర్, అలండి మొదలైనవి ఉన్నాయి. తరువాత బాబాపై గల అపారప్రేమ వల్ల ఆమె షిరిడీకి వచ్చి అక్కడే ఉండిపోయిది.

మహాలికి చిన్నతనంలో పెళ్ళిచేసారు. ఆమె భర్తపేరు నామదేవ్ అబ్బా సవంత్. కాని భర్తతో కలిసి ఆమె జీవించలేదు. ఆ కారణంగా ఆమె బ్రహ్మచారిణిగానే ఉండిపోయింది. దానివల్లనే ఆమెకు పిల్లలు, కుటుంబం లేకుండాపోయింది. ఆమె పుట్టిన ఊరు కాసర్‌వాడి అనే గ్రామం. మరాటా కులానికి చెందిన మహాలి షిరిడికి వచ్చేసరికి 75సంవత్సరాల వయస్సు గలదై ఉంది.

షిరిడి గ్రామస్థులందరూ ఆమెను పిచ్చిదానిలా చూసేవారు. ఎందుకంటే ఎప్పుడూ బట్టసరిగా కట్టుకోక వింత ప్రవర్తనతో తిరుగుతూ ఉండేది. మనిషి కూడ పొట్టిగా, లావుగా ఉండి చేతిలో ఊతకి ఒక కర్ర పట్టుకుని నడిచేది. తలపై జుత్తు కూడా సరైన సంస్కారం లేక చిందరవందరగా బిగుసుకుపోయి ఉండేది. ఇంకా ఆమె నిరక్షరాస్యురాలు కాబట్టి, అర్థంలేని మాటలు మాట్లాడుతూ ఉండేది. కాలికి రెండు గుడ్డముక్కలు కట్టుకునేది. సందర్భం లేకపోయినా నవ్వుతూ ఉండేది. ఎక్కడ ఆమెకు నచ్చితే అక్కడ కూర్చుంటూ ఉండేది. అలాగే నేలమీద వెల్లకిలా పడుకునేది. తనకు కనపడిన మగవాళ్ళందరినీ బాబా అని, ఆడవాళ్ళను మాయి అని పిలిచేది.

షిరిడీకి వచ్చే భక్తులు మహాలి తినడానికి ఏదో ఒక బిక్షపెడుతూ ఉండేవారు. దాంతోటి ఆమె జీవనం సాగుతూ ఉండేది. "బాబా! ఓ బాబా! నాకు ఆకలిగా ఉంది ఏదైనా పెట్టు. కాస్త నాకు ఏవైనా డబ్బులియ్యి. నా బాగోగులు పట్టించుకో" అని

కేకలు పెట్టేది. మగవాళ్ళందరినీ బాబా! అంటూ పిలుస్తూ ఉండడంతో చాలామంది ఆమెకు దగ్గరగా వచ్చేవారు. అలా వచ్చిన వారిని ఆమె దీవిస్తూ ఉండేది. "మీరు ఆనందంగా వివాహ జీవితం గడపండి. మీకు పిల్లలు పుడతారు, మనమలు పుడతారు. మీరు సుఖంగా ఉంటారు. నా సాయిబాబా మిమ్మల్ని దీవిస్తారు. నాకు కట్టుకుందికి బట్టలు ఇవ్వండి, డబ్బులు ఇవ్వండి అని అడుగుతూ ఉండేది. సాయిబాబాని, సాహిబాబా అని పిలిచేది. ఇక్కడ సాహి అంటే పోషకుడు లేక ఉపకారి అని అర్థం. ఇంక బాబా అంటే తండ్రి అని అర్థం. ఇంత అందమైన విశేషణాలతో బాబాను పిలుస్తూ ఉండేది.

మహాలికి తెలిసింది ఒక్కటే. అదే 'సాహిబాబా! సాహిబాబా!" అని నామ జపం చెయ్యడం. ఇది ఆమెకున్న సహజమైన అలవాటు. ఒక్కోసారి నేలమీద పడి దొర్లుతూ నామజపం చేసేది. వెల్లకిలా పడుకుని ఆకాశం చూస్తూ బాబా పేరు జపించేది. ఆమె బాబా పేరు నోటితో పలకకుండా ఒక్కక్షణం ఉండేది కాదు.

ఆ కాలంలో షిరిడిలో నీటి ఎద్దడి చాలా ఎక్కువగా ఉండేది. ఆకారణంచేత పువ్వులతోటల్లో పువ్వులు ఉండేవికాదు. మహాలి పువ్వుల కోసం దూరంగా ఉన్న అడవి ప్రాంతానికిపోతూ ఉండేది. అక్కడ నుండి అడవి పువ్వులు కోసి తెచ్చి 'సాహిబాబా! సాహిబాబా! అని పిలుస్తూ ద్వారకామాయిలో ఉన్న బాబాకు సమర్పిస్తూ ఉండేది. అడవికిపోయి ఆవిధంగా పువ్వులు కోసుకురావడం, పెద్ద దండలుగా చెయ్యడం ఆమెకు పరిపాటి అయిపోయింది. ఆ దండలు పట్టుకుని, బాబా నామాన్ని జపిస్తూ ఉండేది. ఏ రంగుపువ్వులు కలిసి దండకట్టాలో, ఏ వాసన గల పువ్వులు ఏరితేవాలో, ఈ వివరాలు ఆమెకు తెలియదు. ఆమెకు తెలిసింది ఒక్కటే. పెద్దపూలదండ బాబాకు సమర్పించాలి. అదే ఆమె దృష్టి. ఆమె దృష్టికి తగ్గట్టే బాబా కూడా ప్రవర్తించేవారు. ఆమె తెచ్చిన పూలదండనే మెడలోవేసుకుని, ఆ రోజంతా ఉండేవారు. ఇంకొకసారి మహాలి, అడవి నుండి కొన్నికొన్ని పళ్ళు ఏరుకువచ్చి బాబాకిచ్చేది. బాబా కూడా ఆమె తెచ్చిన ప్రసాదాన్ని తప్పక తీసుకొనేవారు. ఎందుకంటే ఆమె బాబా పేరును నిరంతరం

ఉచ్ఛరిస్తూ ఉండేది. ఆమె చదువురాని మనిషి అయినప్పటికీ, కొన్ని కొన్ని మాటలు నోటితో సరిగా పలుకలేకపోయినప్పటికీ, బాబా పాటలు పాడుతూ ఉండేది. బాబా యొక్క దివ్యత్వాన్ని, ప్రేమతత్వాన్ని, దయాగుణాన్ని కీర్తిస్తూ ఉండేది. ఆమె పాడే పాటలన్నీ గొప్ప గొప్ప సంత్‌లైన, భక్తతుకారాం మొదలైనవారు రచించి గానం చేసిన అభంగాల్లాగ ఉండేవి. చదువురాని మహాలికి ఇంత గొప్ప ప్రక్రియ ఎలా అబ్బిందంటే, ఆమె బాబా నామాన్ని నిత్యం తలుచుకుంటూ ఉండడమే అని చెప్పాలి. దీనివల్ల మనం గ్రహించ వలసిందేమిటంటే, బాబా నామానికున్న అంతులేని శక్తి సామర్థ్యాలు. బాబా తనకు వచ్చిన బిక్షలోనే కొంతభాగాన్ని ఆమెను పిలిపించి ఇస్తూ ఉండేవారు.

ఒకసారి బాబా ఆమెకు స్వప్నానుభవాన్ని కల్పించారు. దాని గురించి ఆమె అందరికీ చెపుతూ ఉండేది. ఆ స్వప్నంలో బాబా ఆమె దగ్గరకు వచ్చి, బుగ్గలు ముద్దుపెట్టుకుని దీవించారు. మహాలి! నీకు ఆధ్యాత్మిక ఉన్నతి కలగాలని నేను దీవిస్తున్నాను. నిన్ను కసురుకుని, తిట్టేవారిని నేను కలవను. నీకు డబ్బు, నగలు ఇస్తాను. రూపాయలు ఒకటి, రెండు, ఐదు తరుచుగా ఇస్తూ ఉంటాను. నేను నీతోనే కలిసి ఉంటాను అని చెప్పి బాబా నా ఎదురుగా నిలబడి, నన్ను సాహిబాబా! సాహిబాబా! అని చెప్పి రాత్రి, పగలు స్మరిస్తూ ఉండు అని అన్నారు.

ఈ స్వప్న వృత్తాంతం అర్థం చేసుకోవడం కొంచం కష్టం. బాబా పలికిన మాట 'కాలియన్' అన్నది 'దయ' అనే మాటకు సమానంగా ఉంటుంది. నా దయే నీకు దైవీపరంగా ముందుకు సాగడానికి ఉపయోగపడుతుంది అని దాని పూర్తి అర్థం. బాబా ఆమెకు ప్రేమ భక్తి యొక్క రహస్యాన్ని తెలియజేసారు. ఈ ప్రేమ భక్తితత్వంలో, సాధకుడి ప్రేమకు హద్దులుండవు. అంతేకాక భక్తి పరాకాష్టకు చేరుకుని అధిష్టానంలో లయవడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. సాధారణ భక్తుడికుండే కోరికలు గాని, ఉద్దేశ్యాలుకాని ప్రేమ భక్తుడికి ఉండవు. ఈ కారణం వల్ల తనకు ప్రియమైన భగవత్ స్వరూపం (బాబా), తన మనస్సు నుండి ఒక్క క్షణం కూడా ప్రక్కకు తప్పుకోదు. ఈ విషయంలో రాత్రి పగలు తేడాలేదు. ఇంక మహాలి విషయానికొస్తే, ఆమె దేముడైన

సాహిబాబా నామం, గుండె చప్పుడుతో సమానంగా లయకల్పి నడుస్తూ ఉంటుంది. స్వప్నంలో బాబా, నగలు డబ్బు ఇస్తానన్న మాట, పుణ్యాన్ని కాని, దానికి విశిష్టమైన ఇంకొక స్థితినిగాని ప్రసాదిస్తానని చెప్పడం లాంటిది. ఇటువంటి భగవత్ ప్రసాదమే నిజమైన ఆభరణం లేక నిజమైన సంపదగా పరిగణించవచ్చు. ఎప్పటికైనా మనం ప్రోగు చేసుకోవలసినది ఇటువంటి సంపదనే. ఈ సందర్భంలోనే, ద్వైత అద్వైతాల గురించి వివరిస్తున్నారు. ఒక రూపాయి నాణెం అద్వైతాన్ని సూచిస్తుంది. బాషాపరంగా కూడా అద్వైతమంటే ద్వైతం కానిది అని అర్థం. అంటే రెండు కానిది. ద్వైత సిద్ధాంతం పరమాత్మను, జీవుడిని వేరువేరుగా చూస్తుంది. ఒకడే అయిన పరమాత్మ జీవుడిని సృష్టించాడని వారి వాదం. దీన్నే ఆరంభవాదం అంటారు. దీని ప్రకారం జీవుడు పరమాత్మ నుండి వచ్చాడు. ఆ పరమాత్మే, శివుడుగా, సత్యస్వరూపంగా లేక సాయిబాబాగా వర్ణించారు. కలలో మహాలికి చెప్పిన ఒక రూపాయి అంటే అద్వైతపరం, రెండు రూపాయలంటే ద్వైతపరం, ఐదు రూపాయలంటే పంచ భూతాత్మకమైన సృష్టిపరంగా ఊహించవచ్చు. ద్వైతం తూర్పుదిక్కున కనపడే ఉదయం లాంటిది. ఉదయం తోటే రోజు ఆరంభ మవుతుంది. అలాగే సృష్టి కూడా పరమాత్మవల్ల ఆరంభించబడి నడుస్తోంది అని వారి వాదం. జీవాత్మను సృష్టించడంలో పరమాత్మకు లీల తప్ప వేరే ఉద్దేశ్యం లేదు. ఆ జీవాత్మనే ద్వైతులు పురుషుడని అంటారు. అలాగే జీవుడుకాక కనపడే ప్రపంచాన్నంతా ప్రకృతని అంటారు. జీవుడి స్వభావాన్ని నిర్ణయించేది కూడా ప్రకృతే. దేహాభిమానాన్ని సూచించే అహం కూడా ప్రకృతిలో భాగమే. ఇంక ఒక రూపాయి రెండు రూపాయిల తర్వాత, మిగిలింది ఐదురూపాయల భావన. ఇక్కడ చెప్పబడే ఐదు రూపాయలు అనగా ఐదు పంచభూతాలు, ఐదు భూతతన్మాత్రలు లేక వాటి గుణాలు. భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశములు కల్పి ఐదు భూతాలు. ఇంక వాటి తన్మాత్రలు వరుసగా గంధం, రసం, రూపం, స్పర్శ, మరియు శబ్దాలు. ఈ ఐదు తన్మాత్రలనే మనకుండే ఐదు జ్ఞానేంద్రియాలు ఆకర్షిస్తూ ఉంటాయి. ఎలాగంటే ముక్కు గంధాన్ని, నాలుక రసాన్ని, కన్ను రూపాన్ని, చర్మం స్పర్శను, చెవి శబ్దాన్ని ఆకర్షిస్తూ ఉంటాయి. ఈ విధంగా మహాలికి కల్గిన స్వప్న వృత్తాంతం యొక్క అంతరార్థం చెప్పబడింది.

మహాలికి తెలిసిన విషయమేమిటని అడిగితే, ఒకే ఒక్కటి అని చెప్తారు. అదే సర్వకాల సర్వావస్థల్లోనూ సాహిబాబా, సాహిబాబా అంటూ జపించడమే. ఇంకో గొప్ప విషయమేమిటంటే, ఎడ తెరిపిలేకుండా నామ జపం తాను చేస్తున్నట్లు కూడా ఆమెకు తెలీదు. అంటే అది ఒక అసంకల్పిత చర్యగా జరిగిపోతూ ఉండేది. మహాలి పరిస్థితి అలా ఉన్నప్పుడింక బాబా ఆమెను అనుగ్రహించారు అనడంలో వింత ఏముటుంది? భాగ్యశాలిని అయిన ఈ భక్తురాలు, బయట ప్రపంచానికి కనపడే ఆమె రూపాన్ని బట్టి ప్రవర్తన బట్టి, పిచ్చి మనిషి అని అనుకొనేటట్లు ఉండేది. కాని సందేహించవలసిన పనిలేదు. ఆమె ఒక మహాయోగిని. ఇంకా చెప్పాలంటే ఆమె ఒక అవదూత. వదిలించుటకు అత్యంత కష్టమైన దేహాభిమానాన్ని, ఆమె అధిగమించింది. స్థిత ప్రజ్ఞుడికి మాత్రమే సాధ్యమైన ద్వందాతీత స్థితిని కూడా పొందింది. చివరగా జీవన్ముక్తురాలై ప్రాపంచిక వ్యవహారాల్ని తృణప్రాయంగా తిరస్కరించింది. అహంకారం ఆమెను గెలవలేక తలదించుకుంది. ఒక చిన్న పిల్లవాడిలాగ షిరిడి వీధుల్లో తిరిగేది. ఆమె తన శరీరాన్ని, మనసును, భావోద్వేగాలను, తనవిగా ఎప్పుడూ చూడలేదు. ఆకారణం చేత ఆమెను మానవరూపంలో కనబడే శుద్ధ చైతన్యమూర్తి అని చెప్పవచ్చు.

దీని సారాంశం ఇలాఉంది.

నామ జప ప్రక్రియ అన్నది ప్రేమతోను, విశ్వాసంతోను, ఇంకా అత్యంత భక్తి తన్మయత్వంతోనూ జరపవలసి ఉంటుంది. ఈ అభ్యాసం నిరంతరం సాగుతున్నప్పుడు, స్థూల శరీరం దాని ఇంద్రియ వ్యవస్థతో బాటుగా సాధనకు సహకరిస్తుంది. అప్పుడు అద్వైత భావన నెమ్మదిగా స్థిరపడి నువ్వు – నేను అన్న భేద భావన మసకబారుతుంది. అరిషడ్వర్గాలైన కామక్రోదాదులు అదుపులోకి వస్తాయి. అప్పుడు ఈ క్రియ అంతా ఆత్మ జ్ఞానానికి మార్గం సుగమం చేస్తుంది.

(ఇదంతా డా॥ కె.బి. గవాన్కర్ వ్రాసిన షిరిడీ సాయిబాబా అనే పుస్తకంలో ఉంది)

# 36

# బస్తాలకొద్దీ బంగారం

## నీతికథ

భాను సాహెబ్ ప్రధాన్‌కు ఇంకొక పేరు లక్ష్మణ్. ఇతడు ముంబాయిలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ ఉండేవాడు. ఒకసారి చిత్రకూట్ సంస్థానానికి చెందిన మాధవనాథ్ మహరాజ్‌ను కలుసుకున్నాడు. అయితే మాధవనాథ్, ప్రధాన్‌ను షిరిడీకి పంపించి, అతని ద్వారా ఒక సందేశాన్ని బాబాకు నివేదించమని చెప్పాడు. ఆ సందేశం ఇలా ఉంది. “బాబాకు చెప్పు, ఏమనంటే, అతడు నాతో ముఖాముఖి ప్రస్తుతం గురించి ఏమీ మాట్లాడలేదు.”

బాబా అప్పుడు ద్వారకామాయిలో కూర్చుని ఉన్నారు. చుట్టూ భక్తులు కూర్చున్నారు. బాబా ఇలా అన్నారు. మాధవనాథ్ కొడుకు వచ్చాడు. మనం అతడి కోసం ఒక విందు ఏర్పాటు చెయ్యాలి. అంతేకాక ఇక్కడ అతడికి మనం అన్ని సౌకర్యాలు కల్పించాలి. అందరూ బాబా మాటలు విన్నారు. వారికి విషయం అర్థంకాలేదు. కాని బాబా ఏమాటలు పలికినా దాంట్లో ఏదో అంతరార్థం ఉంటుందని వారి అభిప్రాయం. ఇంతలో ప్రధాన్ ద్వారకామాయిలో ప్రవేశించాడు. మాధవనాథ్ పంపిన సందేశాన్ని అందజేసాడు. బాబా, ప్రధాన్‌ను తనకు దగ్గరగా కూర్చోబెట్టుకుని ఇలా అన్నారు. “నా దగ్గర బంగారంతో నిండిన బస్తాలు చాలా ఉన్నాయి. అవన్నీ ఒక గాడిద మీద పెట్టాను. అయితే దారిలో దొంగలు వచ్చి ఆ బంగారాన్ని దోచుకుపోయారు. అందుచేత  దొంగలుండే ఈ ప్రాంతంలో బ్రతకడం చాలా కష్టంగా ఉంది. ఇదంతా నీకు చెప్పాలనే మా అన్నదమ్ముడు నిన్ను పంపించాడు. ఈరోజు మనందరం నాథ్ ప్రసాదాన్ని తీసుకుందాం.”

తరువాత ప్రధాన్‌కు భోజనం పెట్టారు. బాబా అతడిని తన ప్రక్కనే కూర్చో బెట్టుకున్నారు. భోజనం తరువాత ప్రధాన్ తను బయలుదేరడానికి బాబా అనుమతి కోరాడు. మా అన్నదమ్ముడుతో చెప్పు, ఈ పాడులోకంలో బ్రతకడం చాలా కష్టం అని

చెప్పు. ఈ రకమైన ఉపదేశాన్ని నాకు బాబా యిచ్చారని కూడా చెప్పు అన్నారు. బాబా పలికిన మాటలన్నీ ప్రధాన్ శ్రద్ధగా ఆలకించాడు. తరువాత మాధవనాథ్ సంస్థానానికి బయలుదేరాడు.

దీని సారాంశం ఇలా ఉంది..

నేను అనబడేది పరబ్రహ్మం. అదే సంపూర్ణ జ్ఞాన స్వరూపం. ఈ నేనే అందరిలోనూ జ్ఞానంగా ఉంది. బస్తాలకొద్దీ బంగారం ఉన్నది అంటే బంగారంలాంటి జ్ఞానం నేను నిండా ఉందని అర్థం. కాని జన్మ ఎత్తడం వల్ల, ప్రాపంచిక విషయాలు అనబడే గాడిద బరువును మనం నిత్యం మోస్తూనే ఉన్నాం. అనగా జ్ఞానం (బంగారం) మన దగ్గరే ఉంది. పనికిరాని గాడిద బరువూ మన దగ్గరే ఉంది. ఇలా జీవితం నడుస్తూ ఉండగా, మాయ అనబడే దొంగలనాయకుడు తన బృందంతో అనగా అరిషడ్వర్గాలతో (కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలతో) దాడి చేసి బంగారంలాంటి జ్ఞాన సంపదను కొల్లగొట్టారు. మాయకు లోబడిన మనం, ఆధ్యాత్మిక సాధన కొనసాగించ లేకపోతున్నాం. ఈ పరిస్థితుల్లో ఒక్క సద్గురువు కృప వల్ల మాత్రమే దొంగలు దోచుకున్న ఆత్మజ్ఞానాన్ని తిరిగి పొందగలం.

(ఇదంతా డా॥ కె.బి. గవాన్కర్ వ్రాసిన షిరిడీ సాయిబాబా అనేక పుస్తంలో ఉంది)

## 37
# బాబా గోధుమల్ని పిండి చేసారు అనే లీల

ఈ లీల శ్రీసాయి సచ్చరిత్ర మొదటి అధ్యాయంలోనే ఉంది. ఇది ఒక గొప్ప లీల. ఒకరోజు ఉదయం బాబా పళ్ళు తోముకుని, ముఖం కడుక్కుని, గోధుమలు విసిరే పని నిమిత్తం కావల్సిన వస్తువులు సేకరించడం ప్రారంభించారు. ఒక మూత ఉన్న బకెట్టుని చెత్తో పట్టుకున్నారు. గోధుముల బస్తా నుండి ఆ బకెట్టుతో నాలుగు శేర్లు గోధుమలు తీసుకున్నారు (నాలుగుశేర్లు అంటే సుమారు 3.700కె.జీలు). ఖాళీ బస్తాను క్రిందపరచి, దానిమీద ఒక తిరుగలిని పెట్టారు. ఇలా అన్నీ సమకూర్చుకుని, గోధుమలు తిరుగలిలో పోసి విసరడం ప్రారంభించారు. బాబా గోధుమలు విసురు తున్నారు అన్న వార్త అందరికీ తెలిసింది. గ్రామస్థులందరూ ఆ లీలను చూడడానికి ద్వారకామాయికి పరుగులు తీసారు.

నలుగురు ఆడవాళ్ళు ముందుకొచ్చి, బాబా చేతిలో నుండి తిరగలి పిడిని లాక్కుని విసరడం మొదలుపెట్టారు. ఆ సంఘటన చూసి బాబా వారి మీద కోపంతో అరిచారు. కాని ఆడవారు బాబా పాటలు పాడుకుంటూ పని చేసుకుని పోతున్నారు. నెమ్మదిగా బాబా కోపం తగ్గింది. పాపం ఆడవాళ్ళ అమాయకత్వం, ప్రేమ, భక్తి చూసి బాబా ముఖంలో నవ్వు కనబడింది.

ఆ నలుగురు ఆడవాళ్ళు ఇలా అనుకుంటున్నారు. బాబాకి బంధువులంటూ ఎవ్వరూలేరు కదా! అలాగే ఆయనకి దేన్నీ తన దగ్గర దాచుకొనే అలవాటు కూడా లేదు. తన బిక్ష కోసం గ్రామంలో తిరుగుతూ ఉంటారు. అలా అయినప్పుడు గోధుమలు ఎందుకు పిండి చేస్తున్నారు? బహుసా మనకందరికీ గోధుమపిండి ఇస్తారేమో, అని ఆలోచిస్తున్నారు. కొద్దిసేపటికి గోధుమలు పిండి చెయ్యడం పూర్తి అయ్యింది. తిరగలిని గోడకు ఆనించి పెట్టారు. ఇక పిండి విసరడం పని అయింది, మన నలుగురం

నాలుగు భాగాలు చేసుకుని ఇంటికి పట్టుకుపోదాం, అనుకుంటూ పంచుకోవడం ప్రారంభించారు. వాళ్ళు అలా పిండి భాగాలు చేయడం చూసిన బాబా ఉగ్రులైపోయారు. ఎవరి అబ్బ సొమ్మని మీరు దాన్ని పట్టుకుపోదామనుకుంటున్నారు. లేక మీకు నేనేమైనా అప్పు ఉన్నాననుకుని గుట్టుచప్పుడు కాకుండా తీసుకుపోదామని చూస్తున్నారా? అని గట్టిగా అరిచారు. బాబా కోపం చూసి భయపడిన ఆడవాళ్ళు ఏం చెయ్యాలో తోచక అలా నిలబడిపోయారు. తరువాత బాబా నెమ్మదిగా వారితో ఇలా అన్నారు. మీరు ఆ గోధుమ పిండిని షిరిడి పొలిమేర చుట్టూ చల్లండి. ఇంకా అక్కడున్న కాలువలో కూడా చల్లండి.

ఇప్పుడు ఈ గోధుమపిండి లీలను జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది. ఆ విదంగా దాన్ని విశ్లేషణ చేస్తే, దాని అర్థం అనేక రకాలుగా బోధపడుతుంది. సాధకుడు తనకు తగిన అర్థాన్ని స్వీకరించి, జీవితంలో అమలు చెయ్యడానికి కృషి చెయ్యవలసి ఉంటుంది. 'షిరిడి సాయిబాబా' అనే పుస్తకంలో డా॥కేశవ్ బి. గవాన్కర్ ఇలా అంటారు. "ఆ కాలంలో కలరా మహమ్మారి షిరిడి గ్రామంపై విరుచుకుపడింది. ఏడుగురు మరణించారు. అయితే గోధుమపిండిని ఊరిచుట్టూ జల్లించడం ద్వారా బాబా వ్యాధిని అరికట్టారు. ప్రక్క గ్రామాల్లో కలరా ఉన్నా షిరిడి మాత్రం రక్షించ బడింది. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే గోధుమపిండికి, కలరాకు గల సంబంధం ఏమిటి అని? మహమ్మారి అంటే మీదపడి ప్రాణాలు తీసేది అని అర్థం. మరణం అంటే భయం లేని వారుండరు. అంతకంటే పెద్ద భయం ఇంకొకటి లేదు. ఏ ప్రాణైనా పుట్టింది అంటే, ఎప్పుడో ఒకప్పుడు మరణించక తప్పదు. అయితే ఎవరైతే మరణాన్ని అధిగమిస్తారో వారు ముక్తులవుతున్నారు. అంటే అట్టి వారికిక జన్మించడం జరగదు. ఇదే చివరి పురుషార్థం. ధర్మ అర్థ కామమోక్షాల్లో చివరిది మోక్షం.

కాని మనిషిని ఈ గమ్యం చేరనివ్వకుండా అడ్డుపడుతున్నది ఏది? ఇది చాలాపెద్ద ప్రశ్న. దీనికి శాస్త్రం చెప్పే సమాధానం కర్మ బంధం. బంధాన్ని కల్గించే

కర్మకు మాయకారణంగా ఉంది. ఈ రెండూ వేరువేరా? లేక రెండూ ఒకటేనా? ప్రారబ్ధం అనుభవించడానికి మనిషి జన్మ ఎత్తుతున్నాడని ఉపనిషత్తులు చెపుతాయి. మనిషి జన్మ ఎత్తడానికి కూడా నోచుకోని జీవాలు, చెట్టు, పుట్ట, క్రిమికీటకాదుల యోనుల్లో పుడుతున్నాయి. సత్వం, రజస్సు, తమస్సులనబడే మూడు గుణాలకు సంబంధించిన కర్మల కారణంగా ఉత్తమ, మధ్యమ, నీచ జన్మలు ప్రాప్తిస్తూ ఉంటాయి. గడచిన జన్మలలో చేసుకున్న కర్మఫలాల మూటనే సంచితం అంటారు. దీన్నే ఇక్కడ గోధుమల బస్తాగా చూపెడుతున్నారు. దాంట్లో నుండి లెక్కపెట్టి తీసిన నాలుగుశేర్లు గోధుమలు ప్రారబ్ధంగా ప్రస్తుత జన్మలో అనుభవించవలసినవి. అనగా జన్మ నుండి మరణం వరకూ సుఖదుఃఖాల రూపంలో అనుభవించేవి. ఇవేకాక వర్తమానంలో కూడా క్రొత్త కర్మలు చేస్తూ ఉంటాం. ఇవన్నీ భవిష్యత్ జన్మలకు సంచితకర్మలగా మారుతూ ఉంటాయి. ఈ విధంగా సంచితం అనబడే మూట ఒక ప్రక్క తరుగుతూ ఉంటే వేరొక ప్రక్క నిండుతూ ఉంటుంది.

ఇప్పుడు తిరుగలిలో పడి నలిగిన గోధుమలు, తిరుగలి యొక్క ప్రాధాన్యత తెలుసుకుందాం. చాలాకాలం క్రిందట మహానుభావుడైన కబీర్‌దాసు ఒకపాట పాడుతూ ఉండేవాడట. అది రెండు తిరుగలిరాళ్ళకు మధ్యపడి నలుగుతున్న పదార్థాన్ని పోలికగా చూపెట్టి, ద్వంద్వాల మధ్యపడి కొట్టుకుంటున్న మనిషి జీవితాన్ని వర్ణించేవాడు. ఆ ద్వంద్వాలు జీవితంలో తారసపడే సుఖదుఃఖాలు. ఒకసారి కబీర్‌దాస్, జొన్నగింజలను తిరుగలిలో వేసి విసురుతున్న ఒక స్త్రీని చూసాడు. అతడికి ఒకవింత అనుభూతి కల్గింది. ప్రాపంచిక విషయాలనే తిరుగలిలో తాను నుగ్గునుగ్గు అవుతున్న భావన కల్గి ఏడవటం మొదలు పెట్టాడు. అతడి పరిస్థితిని గ్రహించిన అతడి గురువు నిపాతిరంజన స్వామి (వేరే పుస్తకాల్లో రామానంద స్వామి అని కూడా ఉంది) ధైర్యం చెపుతూ ఇలా అన్నాడు. భయపడకు, జ్ఞానమనే రాటను అంటిపెట్టుకుని ఉండు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ రాటను వదలి రావద్దు. వచ్చావా నుగ్గునుగ్గు అవడం ఖాయం. ఇది తిరుగలి

విసురుతున్న వారికి కనపడే దృశ్యమే. ఎలాగంటే తిరుగలిలో వేసిన గింజలు పిండిపిండిగా మారుతూ ఉంటాయి. కాని త్రిప్పడం ఆపివేసి పై రాయిని ఎత్తి చూస్తే కొన్ని గింజలు, క్రిందరాయి మధ్యభాగంలో స్థిరంగా ఉండే చిన్న రాటకి అంటుకుని ఉండిపోతాయి. తిరుగలి ఎంత త్రిప్పినా ఇవి నలగవు. ఈ రాటనే జ్ఞానంతో పోల్చేరు గురువుగారు. జ్ఞానమనే ఈ రాటని అంటుకుని ఉంటే ప్రాపంచిక విషయాలనే తిరుగలి ఎంత తిరిగినా మనకు ప్రమాదం లేదు అంటున్నారు.

శ్రీసాయి సచ్చరిత్ర మొదటి అధ్యాయంలో నాగేష్ వి.గున్నాజీ ఇలా అంటారు. బాబా షిరిడీలో అరవై సంవత్సరాలున్నారు. ప్రతిరోజు ఆయన దగ్గరకొచ్చే అనేకమంది భక్తుల జీవితాలను పరిశుభ్రం చేసేవారు. వారి హృదయాల్లో బాబా వేసిన ఆధ్యాత్మిక పునాది, వారి జీవితాలను మార్చివేసింది. ఈ మార్పు వారిని మానసికంగా, శారీరకంగా బలవంతులనుగావించి కష్టాలను, బాధలను సులువుగా ఎదుర్కొనేటట్లు చేసింది. పిండి విసిరే తిరుగలికి రెండు రాళ్ళుంటాయి. క్రిందరాయి కదలకుండా స్థిరంగా ఉంటుంది. ఇది కర్మను సూచిస్తుంది. తిరిగే పైరాయి భక్తిని సూచిస్తుంది. ఇక్కడ జ్ఞానానికి సూచనగా పైరాతిలో స్థిరంగా ఉండే చేతి పిడిని చూపిస్తున్నారు. మనం ముందుగా, త్రిగుణాల ద్వారా సంక్రమించిన అనేక వాసనలను, కోరికలను, పాపాలను, కర్మభక్తి అనబడే రాళ్ళ మధ్యనవేసి పిండి చెయ్యవలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే ఆత్మజ్ఞానం అభ్యసించడానికి అవకాశముంటుంది. త్రిగుణాలు అనగా సత్త్వం, రజస్సు, తమస్సులు. ఇవి సహజంగా ప్రకృతి ద్వారా జీవుడికి సంక్రమిస్తాయి. ఈ మూడు గుణాలలో మొదటిదైన సత్త్వం, జ్ఞానాశక్తి చేత, సుఖాశక్తి చేత దేహిని బంధిస్తుంది. రెండవది రజస్సు, ఆశ, ఆసక్తి, మమకారాల చేత బంధిస్తుంది. మూడవది తమస్సు అజ్ఞానమయం. ఇది నిద్ర, సోమరితనం, పరాకులచేత బంధిస్తుంది. ఈ మూడు గుణాలే కాకుండా జీవుడికి జన్మతః వచ్చినటువంటి అహంకారం (Ego) చాలా సూక్ష్మమై, చాలా శక్తింవతమై జీవుడిని అంటిపెట్టుకుని ఉంటుంది. దీనిని వదిలించుకోవడం చాలా కష్టమైనపని.

ఇంకా ఈ లీలకు సంబంధించిన వివరణ డా॥కేశవ్ బి. గవాన్కర్ ఇస్తున్నారు. పుట్టిన ప్రతిమనిషి కర్మచెయ్యక తప్పదు. కర్మ జరిగితే ఫలితం రాక తప్పదు. కాని ఆ ఫలితం నాది అని మనం నెత్తిన పెట్టుకుంటేనే పునర్జన్మ కలుగుతోంది. కాబట్టి తెలివిగా కర్మను నిష్కామంగా ఆచరించి ఫలితాన్ని దృష్టికి రానివ్వకుండా ఉండాలి. అప్పుడు మాత్రమే కర్మబీజం మాడిపోయి మళ్ళీ చిగురించకుండా ఉంటుంది. చిగురించడమంటే మళ్ళీ జన్మఎత్తడం.

దీనికి సంబంధించిన ఒక ఉపాయాన్ని జ్ఞానేశ్వరి, అధ్యాయం 18, పాదం 205లో ఈ విధంగా చెప్పబడింది. భగవానుడైన శ్రీకృష్ణుడు అర్జునుడితో చెపుతున్నాడు. కర్తృత్వం, భోక్తృత్వం అని రెండు మాటలున్నాయి. ప్రతి పనీ నేను చేస్తున్నాను అని అనుకోవడం కర్తృత్వం. అనగా కర్తను నేనే అన్న భావన. అలాగే ఆ పని యొక్క ఫలితాన్ని నేనే అనుభవిస్తాను అని అనుకోవడం భోక్తృత్వం. అనగా భోక్తను నేనే అన్న భావన. ఈ రెండు క్రియలు మనిషిని బద్ధుడుగా చేస్తున్నాయి.

మరి పరిస్థితి ఇలా ఉన్నప్పుడు, మనిషి ఈ కర్మబంధం నుండి తప్పించుకునే మార్గమేమిటి అన్నది పెద్ద ప్రశ్న.

దీనికి సమాధానంగా భక్తిమార్గమే సరైనదని చెపుతున్నారు. ఈ విషయంలో కూడా తిరుగలినే ఉదహరిస్తున్నారు. దీనికి క్రిందనొకటి, పైన ఒకటి రెండు రాళ్ళు ఉన్నాయి. క్రింద స్థిరంగా కదలకుండా ఉండే రాయి సబూరిని సూచిస్తుంది. ఇంక పైన తిరిగే రాయి నిష్ఠకు సూచన. బాబా అంటారు సబూరి అంటే సంతోషం, ధైర్యం, సహనం మరియు క్షమాగుణాలకు సంకేతం. ఈ సబూరి మనిషిని రక్షిస్తూ ఉంటుంది. దీనివల్ల సాధకుడు పాపాలనుండి, బాధల నుండి, ప్రతికూలతల నుండి, విపత్తుల నుండి రక్షించబడి, భయవిముక్తుడౌతాడు.

నిష్ఠ అంటే అచంచలమైన విశ్వాసం. దీనిలో నుండి జన్మించినదే ప్రేమ

భక్తి. ఒక్కొక్కసారి ఈ స్థితిలో ఉన్న భక్తుడు నిద్రాహారాలు మానివేసి కూడా గడుపుతూ ఉంటాడు. అలాగే తిరుగలి పైరాయి కూడా తదేక నిష్ఠతో తిరుగుతూ లక్ష్యాన్ని సాధిస్తుంది. ఇక్కడ లక్ష్యమంటే గోధుమలు పిండి అవడమే. ఎప్పుడైతే గింజ చితక కొట్టబడి పిండి క్రింద మారిందో, ఇంక తిరిగి మొలకెత్తే అవకాశం ఉండదు. అలాగే కర్మ అనబడే విత్తనం కూడా మొలకెత్తే శక్తిని కోల్పోతుంది. తిరుగలికి ఆధారమైనవి రెండు ఉన్నాయి. ఒకటి క్రింది రాతికి మధ్యన స్థిరంగా ఉండే కర్రసీల. రెండవది పై రాతికి దిగ గొట్టబడిన కర్రపిడి ఈ రెండు ఆధారాలు లేకుండా తిరుగలి పని చెయ్యలేదు. మొదటిదైన కర్రసీలను స్థిరమైన జ్ఞానంగా వర్ణించారు కబీర్‌దాస్ గురువు. ఇక పై రాతికి అమర్చిన కర్రపిడి, రాయి తిరుగుదలకు ఉపయోగపడుతుంది. దీన్నే సద్గురువుతో పోలుస్తున్నారు. అదే జీవిత గమ్యానికి మార్గదర్శి అయిన శ్రీసాయిబాబా. కష్టమైన ఆధ్యాత్మిక మార్గంలో దారి చూపే వెలుగు రేఖ. ఆ వెలుగులోనే నిష్ఠ అనబడే పై రాతిని త్రిప్ప గలుగుతాం. ఆ క్రియకు సబూరి సహాయపడుతూ ఉంటుంది. ఈ కార్యక్రమంలోనే ప్రారబ్ధమనే గోధుమలు పిండిగా మారుతూ ఉంటాయి. ప్రతి వారికి ప్రారబ్ధం అనుభవించడానికి సిద్ధంగా ఉంటూనే ఉంటుంది. ఈ అనుభవం తోటే కర్మ బీజం నశిస్తుంది. జన్మ పరంపర ఆగిపోతుంది. మహమ్మారికి అడ్డుకట్ట కట్టినట్లు అవుతుంది. ఎప్పుడు జన్మ పరంపర అనే మహమ్మారి నశించిందో అప్పుడు మోక్షం సిద్ధిస్తుంది.

బాబా అంటున్నారు, వ్యభిచారులు పరుగెట్టుకుంటూ వస్తున్నారు. ఎందుకు? మీ ఆస్థిని కొల్లగొట్టడానికి. ఏమిటి ఆ ఆస్థి? మీకుండే వివేకం, హేతువాదశక్తి, న్యాయ నిర్ణయం, ఆరోగ్యం, సంపద, శాంతి, ఇంకా మీ కుటుంబంలో ఉండే సుఖసంతోషాలు. ఈ వ్యభిచారే తప్పింప శక్యంకాని మాయ అయివుంది. ఆమె పన్నిన వలలో మీరు చిక్కుబడిపోతున్నారు. ఆమె విసిరిన సంకెళ్ళను తెగగొట్టడానికి మీరే పూనుకోవల్సి ఉంటుంది.

ఈ ప్రపంచంలో మూడు రకాలైన మనుష్యులు ఉన్నారు. మొదటి రకంవారు జ్ఞానులు. జ్ఞాని శాంతమూర్తిగా ఉంటాడు. మనస్సు చలించకుండా స్థిరంగా ఉంటుంది. ఎప్పుడూ సమతాభావనతో ఉంటాడు. అద్వైత సిద్ధాంతపరంగా చెప్పాలంటే అట్టివాడు జీవన్ముక్తుడనిపించుకుంటాడు. జీవన్ముక్తుడంటే బ్రతికుండగానే ముక్తా వస్థను రుచి చూసినవాడు. అంటే ఇహలోక పరలోక భోగాపేక్షలేనివాడై, రాగద్వేషాలకు అతీతుడై, సమబుద్ధి కల్గి రాగము, భయము, క్రోధము అనబడే ఉద్రేకాలను వాటి కారణాలను వర్జించిన ధీరుడై ఉంటాడు. ఈ మాయా ప్రపంచంలో మనతోబాటే నివసిస్తున్నాసరే మాయకు లోబడక ఉంటాడు.

రెండవ రకం వారు అజ్ఞానులు. వీరి పేరులోనే ఉంది జ్ఞానంలేని వారని. వీరు మాయలో దిగబడి ఉంటారు. కాబట్టి జ్ఞానమార్గం వీరికి ఎంత బోధించినా వృధాయే అవుతుంది. ఇంకా చెప్పాలంటే ఒక గాడిద ముందు నిలబడి గీతను చదివితే ఎంతో, వీరి ముందు చదివినా కూడా అంతే.

మూడవ రకం వారు ముముక్షువులు. వీరి పేరును బట్టి వీరు మోక్షాన్ని ఆకాంక్షించేవారని అర్ధమవుతున్నది. భక్తి, జ్ఞాన, యోగ మార్గాల్లో ఏదో ఒక దానిని సాధన చేసి పట్టుకుంటారు. వీరి పట్టుదలే భగవదనుగ్రహాన్ని పొందేటట్లు చేస్తుంది. వ్యభిచారిణి అయిన మాయ వీరిని అనేక ప్రలోభాలకు గురిచేస్తుంది. కాని సాధనా పటిమ చేత వీరు ప్రక్కదారి పట్టక మాయకు లొంగని వారై ఉంటారు. వారి దృష్టంతా మోక్షంపైనే నిలబడి ఉంటుంది. వారు కృషి వల్ల మహాయోగులు అవుతారు. ఆ స్థితికి చేరిన తరువాత కూడా సిద్ధులు అనబడే ప్రమాదం తొంగి చూస్తూ ఉంటుంది. సిద్ధులంటే అతీంద్రియశక్తులు. ఇంతవరకూ చేసిన కృషి వల్ల ఇవి వీరికి పిలవకుండానే దొరుకుతాయి. వీటిని ఉపయోగించి ఎంతటి గొప్ప కార్యాలయినా యోగి క్షణకాలంలో సాధించగలడు. కాని ఈ శక్తుల వల్ల, వాటిని ఉపయోగించటం వల్ల అతని తపశ్శక్తి నిర్వీర్యమైపోతూ ఉంటుంది. తద్వారా అతడు తనకు తెలియకుండానే పతనావస్థకు

చేరుకుంటాడు.

ఇంక ఈ లీల యొక్క ప్రథమ భాగానికి మళ్ళీవెళ్ళి చూస్తే, బాబా గోధుమలు విసురుతున్నప్పుడు నలుగురు స్త్రీలు పరుగుపరుగున వచ్చి బాబాకు సహాయం చేద్దామనుకున్నారు కదా! ఆ నలుగురూ మొట్టమొదట యోగికి తారసపడే దేహసిద్ధులకు ప్రతీకలు. ఈ నాలుగు సిద్ధుల్లో మొదటిది అణిమ. ఇది దేహాన్ని అణుమాత్రంగా మార్చేశక్తి గలది. రెండవది గరిమ. ఇది దేహాన్ని అణు స్థితి నుండి తిరిగి పెద్దదిగా చేసే శక్తి గలది. మూడవది మహిమ. ఇది దేహాన్ని కొండంత చేసి చూపెట్టగలిగేది. నాల్గవది లఘిమ. ఇది దేహాన్ని తేలికపరిచి, చిన్నదిగా చేసి చివరకు కంటికి కనుపించక మాయమయ్యేట్లు చేసే శక్తి గలది. ఇవి అష్టసిద్ధుల్లో మొదటి నాలుగు సిద్ధులు. ఇలాగే మొత్తం సిద్ధులు 24 ఉన్నాయి. ఇలాంటి సిద్ధులకు కఠినతరమైన సాధనలు అవుసర ముంటాయి. ఏ సాధకుడైతే ఆత్మ జ్ఞాన స్థితికి చేరుకుని, దేహవాసన సంపూర్ణంగా వదిలిపెట్టి నేను నాది అనబడే దేహాభిమానాన్ని కూడా వదిలిపెట్టగలడో, అట్టివాడికి మాత్రమే ఈ సిద్ధులు వశమవుతాయి. కాని అవి వచ్చి పడినప్పుడు వాటిని వదిలించు కొన్నవాడే ధీరుడైన యోగి అనబడతాడు. అందువల్లనే బాబా ఆస్త్రీలను అనరాని మాటలతో వ్యభిచారులని తిట్టడం జరిగింది.

ఒకసారి బాబా వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని, గోధుమపిండిని పట్టుకుపోదామనుకున్నవారి ఆలోచనను త్రిప్పికొట్టి, అనగా తన తపశ్శక్తిని దొంగిలిద్దా మనుకున్న ప్రయత్నాన్ని ఎదుర్కొని, తన సాధనా ఫలితమైన గోధుమ పిండిని తిరిగి తన సొంతం చేసుకున్నారు.

ఇదేమీ మీ అబ్బ సొమ్ముకాదు పట్టుకుపోవడానికి అని బాబా అరిచారు కదా! దీని అర్థం, అబ్బ అంటే తండ్రి, సిద్ధులకు తండ్రి తమస్సు(దేహాంకారము) అని బాబా ఉద్దేశ్యం. తిరిగి యదాస్థితికి వచ్చిన బాబా నవ్వుతూ ఆ స్త్రీలను చూసి, పిండి వారు పట్టుకుపోవడానికి కాదని చెప్పి, ఊరి పొలిమేరల్లో దాన్ని జల్లమని చెప్పి

పంపించారు. అనగా తన తపశ్శక్తిని ఊరిచుట్టూ జల్లించారు. ఈ ఘటనతో మోక్షపర్వం ముగుస్తుంది. బాబా గోధుమల్ని విసరడం (పిండి చేయడం) అనే లీల యొక్క అంతరార్థాన్ని డా॥గవాన్కర్ పై విధంగా వ్యాఖ్యానించారు.

ఈ లీల యొక్క అంతరార్థాన్ని వేరే కోణంలో పరిశీలించారు దిలీప్ పవార్ (పవార్ కాకా). ఇదంతా ఆయన వ్రాసిన మరాఠీ భావార్థ శ్రీసాయి సచ్చరిత్రలో ఉంది. పవార్ కాకా ఈ లీలకి సంబంధించిన చాలా ప్రశ్నలను లేవనెత్తారు. చివరకూ ఆయనే వాటన్నింటికి ఎతో మనోహరమైన సమాధానాలను కూడా ఇవ్వడం జరిగింది. భక్తులందరూ వీటిని శ్రద్ధగా చదివి అర్థం చేసుకుని, వారికి నచ్చిన భావాన్ని స్వీకరించవచ్చు.

ఈ లీల గురించి ఆలోచిస్తున్నకొద్దీ అనేక రకాల భావాలు ఉత్పన్నమవుతాయి. వాటినన్నింటినీ జల్లెడపట్టగా చివరకు మనం లీల యొక్క గూడార్థం దగ్గరకు చేరుకుంటాం.

* దబోల్కర్ ఈ లీల గురించి మాట్లాడుతూ, గోధుమలు పిండిగా చేయటం అన్నది ఒక నాటకీయ సన్నివేశం అని ఎందుకన్నారు?
* ఈ లీలను ప్రదర్శించడంలో బాబా తిరుగలిని ఎందుకు ఉపయోగించారు?
* ఈ లీల మొదటిభాగంలో నలుగురు స్త్రీలు వచ్చి బాబాతో ఒకరకంగా సంవాదం పెట్టుకున్నారు. బాబానే ప్రశ్నిస్తూ మాట్లాడగలిగిన ఆ స్త్రీలు ఎవరు?
* ఆ స్త్రీలు వచ్చి బాబాను ప్రక్కకు లాగి, ఆయన చేతిలోని తిరుగలి పిడిని అందుకుని గోధుమలు విసరడం ప్రారంభించారు. ఎందువల్ల వారు అలా ప్రవర్తించవలసి వచ్చింది?
* ఇంకొక విషయం స్పష్టంగా తెలుస్తోంది. బాబా స్వయంగా ఆ నలుగురు

స్త్రీలను రప్పించి ఈ లీలలో పాత్రధారులుగా చేసారా?

* ఆ నలుగురు స్త్రీలు బాబాకు అతి సన్నిహితులుగా మెలుగుతున్నవారే. లక్ష్మీభాయి షిండే, భాయిజామాయి ఆయె, తార్కడ్ ఆయె, లక్ష్మీభాయి కపర్దే. ఈ నలుగురికీ బాబాపై అమితమైన భక్తి ప్రపత్తులున్నాయి. కాబట్టి కలలో కూడా బాబాను అలా ప్రక్కకునెట్టే ప్రయత్నం ఎన్నడూ చెయ్యరు. అలాగే బాబా అనుమతి లేకుండా తిరుగలి త్రిప్పరు. ఈ రకంగా చూస్తే పై నలుగురిలో ఏ ఒక్కరూ అలా చెయ్యరు. అలాగైతే అలా చేసిన వారెవ్వరు?

* సాధారణంగా తిరుగలి వాడుతున్నప్పుడు, ఇద్దరు మాత్రమే ఆ పిడి పట్టుకుని త్రిప్పడానికి వీలుపడుతుంది. కాని అదేపని ఇక్కడ నలుగరు ఎందుకు చేసినట్లు?

* ఈ లీల మొదలైనప్పుడు బాబా స్త్రీలపై గట్టిగా అరుస్తూ, కోపం ప్రదర్శించారు. కాని వెనువెంటనే ఆ కోపం పోయి ప్రేమతో వారితో మాట్లాడి నవ్వినట్లు కనపడింది. ఇదంతా చూస్తే ఈ నాటకం ముందుగానే అనుకొని, ఎవరి పాత్రను వారు పోషించినట్లు తెలుస్తోంది.

* గోధుమలన్నీ పిండిగా చేసిన తరువాత, ఆ నలుగురు స్త్రీలు పిండిని నాలుగు భాగాలుగా చేసారు. ఒక్కొక్కరూ ఒక భాగం తీసుకున్నారు. వారి భాగాలతో వారు వెళ్ళడానికి సిద్ధపడ్డారు. వారు ఆ పిండిని ఎలా పంచుకుంటున్నారో బాబాకు తెలిసింది. అయితే ఆయన వారిని ఇలా ఆజ్ఞాపించారు. మీరు మీ భాగాలను తీసుకువెళ్ళి షిరిడీ పొలిమేరల్లో జల్లండి అన్నారు.

గ్రామస్థులు దబోల్కర్‌తో ఈలీల యొక్క అర్థం ఏమైయుంటుందో వివరిస్తూ ఇలా అన్నారు, షిరిడీ గ్రామమంతా కలరా మహమ్మారి గుప్పెట్లో చిక్కుకుని

ఉంది. చాలామంది ప్రజలు దానివల్ల ప్రాణాలు కోల్పోయారు. ఈ లీల మహమ్మారి నాశనానికి సంకల్పించిన ఒక దివ్య ఔషధం. బాబా తిరుగలిలో వేసి త్రిప్పినది గోధుమలు కావు. ఈ కలరా మహమ్మారినే తిరుగలిలో వేసి పిండిపిండి చేసారు. తరువాత బాబా ఆ పిండిని షిరిడీ పొలిమేరల్లో జల్లించారు. అంతేకాక ఊరికాలవలో కూడా వేయించారు. ఆ విధంగా మహమ్మారిని ఊరి నుండి తరిమి వేశారు. ఈ విధంగా చెప్పిన వివరణ సరైనదే అనుకుంటే మాత్రం, కొన్ని ప్రశ్నలు అడగవలసి వస్తున్నది. బాబా సద్గురువుగా ఉన్నారు. అంతేకాక పరబ్రహ్మ స్వరూపులుగా విశ్వవ్యాప్తమై యున్నారు. సంపూర్ణ దివ్యత్వం ఆయన సొంతం. అటువంటి పరిస్థితుల్లో ఆయన ఆలోచించేది ఒక్క షిరిడీ గ్రామం గురించేనా? మిగతా ప్రపంచం గురించి కాదా? పిండిగా చేసిన కలరా బ్యాక్టీరియా గ్రామ పొలిమేరల్లో జల్లినప్పుడు గాని, కాలువలో కలిపినప్పుడు గాని, గాలిద్వారా, నీటి ద్వారా మిగతా గ్రామాలకు సోకదా? దానివల్ల ఎంతమంది ప్రజలు కలరా బారినపడతారో చెప్పలేముగదా. బాబా ప్రతి జీవిలోనూ అంతర్యామిగా ఉన్నారు కదా. దయామయుడైన భగవంతుడు బాబా ఒక్క షిరిడి గ్రామస్థులను మాత్రము కాపాడడానికి నిశ్చయించుకున్నాడా? మరి ఇతర గ్రామస్థులు కలరా బారినిపడవలసినదేనా? ఈ రకంగా ఆలోచిస్తే ఇదంతా సమంజసంగా కనపడటం లేదు. అయితే బాబా ఆ స్త్రీలను ఎందుకలా ఆజ్ఞాపించారు? పిండిని షిరిడీ పొలిమేరల్లోనూ కాలువలోనూ జల్లమని ఎందుకు చెప్పినట్టు.?ఇప్పుడు పై ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడానికి ప్రయత్నిద్దాం. దబోల్కర్ శ్రీసాయి సచ్చరిత్రలో ఏం చెపుతున్నారంటే, ఈ లీల నాటకీయంగానే నడిచింది. ఇదంతా బాబా యొక్క ముందస్తు, ప్రణాళికలో ఒక భాగమే. అలా బాబాకి తెలిసి జరిగినది కాకపోతే, బాబా సమక్షంలో ఎవ్వరూ కూడా ఆ విధంగా ప్రవర్తించే వారు కాదు. నాటకంలోని పాత్రదారులు బాబా చెప్పినట్లే తమతమ పాత్రలను పోషించారు.

ఈ లీలలో బాబా ఉపయోగించిన తిరుగలికి కూడా ప్రాధాన్యత ఉంది.

* తిరుగలిలో ఉపయోగించే క్రిందిరాతిని భక్తితో పోలుస్తున్నారు. ఇది స్థిరంగా చలించకుండా ఉంటుంది.
* రెండవది, పైభాగంలో ఉండే రాతిని సేవా సాధనతో పోలుస్తున్నారు. ఇది గుండ్రంగా క్రింది రాతి మీద తిరుగుతూ ఉంటుంది.
* తిరుగలికి పై భాగంలో గుండ్రంగా ఉండే రంధ్రం ఉంటుంది. దీనిగుండానే గోధుమలు వేస్తారు. ఇది తిరుగలి కన్ను అని కూడా అంటారు. ఈ కన్నే సద్గురువుకు ప్రతీకగా ఉంటుంది.
* పై రాతి మీద తిరుగలి త్రిప్పడానికి వీలుగా కర్రపిడి అమర్చబడి ఉంటుంది. దీన్ని పట్టుకుని పైరాతిని త్రిప్పుతారు. ఈ పిడినే కర్మకు ప్రతీకగా చెపుతారు.
* ఇంక గోధుమల విషయానికి వస్తే, అవి దేహంలో కలిగే షడ్వికారాలకు ప్రతీకలు. ఇవే జన్మించటం, ఉండటం, మారటం, పెరగటం, క్షీణించటం నశించటం. వీటినే శాస్త్రీయంగా జాయతే అస్థి విపరిణమతే వర్ధతే ఉపక్షయతే వినశ్యతి అంటారు.
* తిరుగలి త్రిప్పగా గోధుమలు నలిగి పిండి క్రిందపడుతుంది. దీన్నే భక్తి మార్గంలో ఐదవ మెట్టుగా వర్ణిస్తున్నారు. ఇది భగవంతుడిని చేరడానికి ఉపయోపడుతుంది.

గోధుమలు పిండి చేయడం అనే లీల ద్వారా బాబా మనకు ఒక నీతి కథని బోధిస్తున్నారు. పూర్వకాలంలో ప్రతి యింటిలోనూ ఒక తిరుగలి ఉండేది. గృహిణులు ఉదయం పూట దానితో గోధుమలు విసిరి పిండి చేసేవారు. దాంతో కుటుంబానికి మధ్యాహ్న భోజన నిమిత్తం చపాతీలు చేసుకొనేవారు. బాబా ఈ లీలలో తిరుగలి ద్వారా ముఖ్య సందేశాన్ని ఇస్తున్నారు.

ప్రతి భక్తుడు గోధుమలు విసిరే కార్యక్రమం ద్వారా జీవితాల్ని గడపవల్సి

ఉంటుంది. భక్తి ద్వారా సద్గురు కృపను పొందవచ్చు. అదే ప్రకారం నిస్వార్థ సేవాతత్త్వాన్ని అలవర్చు కోవచ్చు. చేతిపిడితో తిరుగలిని త్రిప్పినట్లుగా కర్మలను ఆచరించవచ్చు. ఈ భావన గట్టిపడగా, అహంకారం అనే గోధుమలు దానికి సంబంధించిన షడ్వికారాలతో సహా, భక్తి సేవలనే రాళ్ళ మధ్య నలిగి పిండిగా కొట్టబడతాయి. అప్పుడు మన లక్ష్యాన్ని సాధించిన వారమవుతాము.

ఇప్పుడు ఆ నలుగురు స్త్రీల గురించి అర్థాన్ని వివరిస్తున్నారు. బాహ్యంగా వారు చేసిన పని హర్షించదగింది కాదు. కాని ఆ స్త్రీలు నిజమైన స్త్రీలు కారు. ఇంద్రి యాతీతశక్తులు. ఈ శక్తులు కొన్ని సందర్భాల్లో తమ పాత్ర పోషించవలసి వచ్చింది. అందుచే అవి బాబా తలచినట్లుగానే ప్రత్యక్షమవడం తిరిగి అదృశ్యమవడం జరిగింది.

ఆ నలుగురు స్త్రీలు బాబా నుండి తిరుగలి పిడిని లాక్కుని, ఆనందంగా బాబా పాటలు పాడుకుంటూ గోధుమలు పిండి చేసారు. నలుగురు స్త్రీలు నాలుగు రకాలైన ఆధ్యాత్మిక వాఙ్మయానికి ప్రతీకలు. అవే వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు. అంతేకాక నాలుగురకాలైన వర్ణాశ్రమ ధర్మాలకు కూడా ప్రతీకలు. అవే బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాస ధర్మాలు. ఇంకా మానవ జీవితానికి, మన సనాతధర్మం ఏర్పరిచిన నాలుగు పురుషార్థాలు. అవే ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. ప్రతి మనిషి శాస్త్ర రీత్యా తమతమ జీవితాల్ని గడుపుతూ, అతి ముఖ్యమైన పురుషార్థాలను ఆచరించవలసి ఉంటుంది. దాంట్లో మొట్టమొదటిది, ధర్మాచరణగానే పేర్కొన్నారు. ధర్మంగా ప్రవర్తిస్తూ సంపద పెంచుకుని, దాన్ని స్వార్థానికే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడేటట్లు వినియోగించి, తమ కోరికలను ధర్మ ప్రకారంగా తీర్చుకుంటూ ఉండాలి. ఈ విధంగా మూడు పురుషార్థాలను సాధించి, చివర మోక్ష పురుషార్థంపై దృష్టి సారించాలి.

ఇంకా ఆ నలుగురు స్త్రీలనబడే శక్తుల యొక్క ప్రాధాన్యత గురించే చెపుతున్నారు.

ఆత్మజ్ఞాన సముపార్జన విషయంలో కూడా పొందుపరచబడిన నాలుగు ముఖ్యమైన మార్గాలకు ఈ శక్తులే ప్రతీకలు. దాంట్లో మొదటిది జ్ఞానమార్గం, రెండవది కర్మమార్గం, మూడవది యోగమార్గం, నాల్గవది భక్తిమార్గం. అదే ప్రకారం ముక్తి మార్గంలో మహాత్ముల బోధనలననుసరించి పాటించే నాలుగు విధాలైన స్థితులను వీరే ప్రతి బింబిస్తున్నారు. ఆ స్థితులు ఏవనగా ఒకటి సాలోక్యం, భగవత్ సంబంధమైన అవగాహన కల్గడం, రెండవది సామీప్యం, భక్తి ప్రపత్తులతో భగవత్ సాన్నిధ్యాన్ని పొందడం, మూడవది సారూప్యం, భగవత్ స్వరూపంతో ఏకమయ్యే భావన కల్గడం. నాల్గవది సాయుజ్యం. ఈ స్థితిలో సాధకుడు ప్రపంచం మొత్తాన్ని భగవత్ స్వరూపంగా గ్రహిస్తాడు. మరొక విధంగా చెప్పాలంటే పరబ్రహ్మ స్వరూపంలో మానసికంగా లీనమయిపోతాడు. ఈ స్థితిలో భగవంతుడికి భక్తుడికి మధ్య వ్యత్యాసం కనుమరుగవుతుంది.

దీని ప్రకారం చూస్తే బాబా దగ్గరకు వచ్చినవి నాలుగు దివ్యశక్తులని తేలి పోయింది. తిరుగలి త్రిప్పుతున్నప్పుడు సాధారణంగా ఇద్దరు మనుష్యులే చేతిపిడిని పట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇద్దరు స్త్రీలు ఎదురెదురుగా కూర్చొని, పిడిని ఒకరి తరువాత ఇంకొకరు అందుకుంటూ త్రిప్పుతారు. దాంట్లో పైరాతిని పూర్తిగా త్రిప్పటానికి కావల్సిన శక్తిని ఇద్దరూ సమానంగా ఖర్చు చేసినట్లవుతుంది. ఇక్కడ మూడవ, నాల్గవ స్త్రీలకు అసలు పనిలేదు అని చెప్పవల్సి వస్తుంది. లేకపోతే మూడవ మనిషి గోధుమలు, పై రాతికున్న కన్ను భాగంలో వేస్తూ ఉండే పనికి సహాయపడవచ్చు. అలాగైతే ఈ లీలలో నలుగురి పాత్ర ఎందుకుంది అన్నది కూడా ఒక ప్రశ్న అవుతుంది. అలాగే బాబా ఆ స్త్రీలపై కోపంతో అరచిన పరిస్థితి ఒకటుంది. వారు గోధుమపిండిని నాలుగు బాగాలు చేసి పట్టుకుపోదామన్న ఆలోచనలో ఉండగా బాబా ఉగ్రరూపం దాల్చారు. కాబట్టి బాబాకు అంతకోపం ఎందుకు వచ్చింది అన్నది కూడా ఒక ప్రశ్నే.

ప్రస్తుత ప్రపంచంలో ప్రధానమైన మతాలు నాలుగున్నాయని అంటారు.

అవే హిందుమతం, ఇస్లాము మతం, క్రిష్టియన్ మతం, బౌద్ధమతం. ఇవన్నీ వేరువేరు సిద్ధాంతాల్ని కల్గి ఉన్నప్పటికీ మనిషికి చివరకు కావల్సిన మోక్షం విషయంలో సమానంగానే ఆలోచిస్తాయి. అయితే అన్ని మతాల గమ్యం ఒకటే అయినప్పుడు అన్నీ ఒకేదారిలో నడవవచ్చు కదా! అనిపిస్తుంది. ఇక్కడే మనుష్యుల స్వభావాలు, దేశకాల పరిస్థితులు ప్రభావం చూపెడతాయి. ఆ విధంగా అభిప్రాయ భేదాలతో ప్రతివారికి తమ మతమే గొప్పదన్న భావం పాతుకుపోయి ఉంది. ఆ కారణంగా ప్రజలందరూ ఒకే దైవానికి సంబంధించిన పిల్లలు అన్న సత్యాన్ని మరచిపోయారు. బాబా ఎప్పుడూ పరమత సహనాన్ని పాటించమని చెప్తూ 'సబకా మాలిక్ ఏక్‌హై' అన్న నినాదాన్ని అందరి హృదయాల్లోనూ ప్రవేశపెట్టారు. ఆ కారణం చేత ఇదినాది, అదినీది అని ఆ స్త్రీలు, అందరికీ సంబంధించిన గోధుమ పిండిని పంచుకోవటం చూసి మండిపడ్డారు.

ఆ కాలంలో గ్రామాల్లో రెండు రకాల తిరుగళ్ళు వాడేవారు. ఒకటి బాగా పెద్దది. ఇంకొకటి చిన్నది. పెద్ద తిరుగలికి క్రింద నుండే రాయి నేల మీద పాతి పెట్టబడి ఉండేది. అది ఇంక అటూ ఇటూ కదపలేనిది. దాని మీద విసిరిన గోధమపిండి బాగా మెత్తగా ఉండి అంటుకునే గుణాన్ని కల్గి ఉంటుంది. రెండవది చిన్న తిరుగలి, అటూ ఇటూ అవుసరాన్ని బట్టి జరుపుకొనేది. దీనిమీద విసిరిన పిండి పెద్ద తిరుగలిలో వచ్చినంత మెత్తగా రాదు. నిజానికి తిరుగలి విసరడానికి నలుగురు స్త్రీలు అవసరం లేనప్పటికీ, బాబా ముందస్తు ప్రణాళిక ద్వారా వారిని ప్రవేశపెట్టారు. బాబా అభిప్రాయాన్నను సరించి వారు కూడా తమ పాత్రలను దివ్యంగా పోషించారు.

అక్కడ గ్రామస్థులు వారికి తెలిసిన రీతిలో ఈ లీల గురించి వివరణ ఇచ్చిన ప్పటికీ, హేమాధిపంత్ శ్రీ సాయి సచ్చరిత్ర మొదటి అధ్యాయం, పాదం 137-138లో తనకు వ్యక్తిగతంగా కల్గిన కొన్ని సందేహాలను ఇలా వ్రాసారు.

"తిరుగలిలో బాబా గోధుమలు విసిరే లీలను చూసిన తరువాత నేను ఏదో తెలియని ఆనందం, ఆశ్చర్యంతో పొంగిపోయాను. నాకు తెలిసి ఎవ్వరైనా

సరే దీనికి తగిన కార్యకారణ సంబంధం కనిపెట్టలేరు. అలాగే ఈ రెండింటినీ సమన్వయం చేసి చెప్పడం కూడా కష్టమే.

మొదటి సందేహం, గోధుమలకి కలరాకి ఏమిటి సంబంధం? గ్రహించడానికి శక్యంగాని ఈ సంఘటన చూసిన తరువాతనే, నాకు ఈ పుస్తకం వ్రాయాలని బుద్ధి పుట్టింది.

ఈ లీలను చూసిన తరువాత హేమాధిపంత్ వ్యక్తిత్వంలో, ఆలోచనల్లో అనేక మార్పులొచ్చాయి. ఒక దగ్గర అతను అంటాడు, "సముద్రంలో నుండి పొంగి పొరలే తరంగాల్లాగ ప్రేమభావనలు నాలో ఉప్పొంగుతున్నాయి. అతి మధురమైన బాబా కథలను నాలో నేను పాడుకుంటూ నా హృదయాన్ని తృప్తి పరిచాను" (మొదటి అధ్యాయం పాదం 139). సాగర ఘోషలాంటి ప్రేమ హోరుతో మిళితమైన భక్తి పారవశ్యంవల్ల అతడు సంపూర్ణ ఆనందాన్ని అనుభవించాడు. ఆ ఆనందం కట్టలు త్రెంచుకుని శ్రీసాయి సచ్చరిత్రగా అతని కలం నుండి ప్రవహించింది. ఇంకా చెప్పాలంటే శ్రీసాయి భక్తులందరికీ ఇది వేదంతో సమానమై శ్రీసాయి వేదంగా మారింది. బహుశా హేమాధిపంత్‌కు ప్రేరణ ఇవ్వడానికే బాబా ఈ లీలని జరిపించి ఉంటారు. ఆ ప్రేరణతో అతడు సచ్చరిత్ర రచించడానికి పూనుకుంటాడని బాబా భావించి ఉండవచ్చు అన్నది ఇంకొక వాదన. ఏదిఏమైనప్పటికీ ఈ లీల యావత్తూ నాటక రంగాన్ని తలపిస్తోంది.

ఈశ్వర సాక్షాత్కారానికి చెందినమార్గంలో హేమాధిపంత్ యొక్క భక్తితత్పరత ఐదవ ప్రస్థానంగా ఉంది. సచ్చరిత్రకు సంబంధించిన బాబా తీర్పు ఇలా ఉంది. "హేమాధిపంత్! నా యొక్క సచ్చరిత్ర రచించడమన్నది నీ విధి అని తెలుసుకో. నా చరిత్ర భక్తికి విశ్వాసానికి సంబంధించిన ఒక సువార్త. దీన్ని ప్రతి మారుమూల గ్రామాల దగ్గర నుండి మొదలుపెట్టి, పట్టణాలు, నగరాలు, దేశాలతో కూడిన ప్రాంతాల జనులందరూ చదువుతారు. దీనికి ఎల్లలు ఉండవు. ప్రపంచం అన్ని

మూలలా ఇది చదువబడుతుంది.” ఇది బాబా తీర్పుకాబట్టి అలాగే జరిగింది. ఈ సచ్చరిత్ర ప్రపంచ ప్రజలందరూ జాతి మత కుల భేదం లేకుండా చదువుతున్నారు. ఇది ఒక పుస్తకమే కాకుండా ఒక మార్గదర్శిగా జీవితాలకు వెలుగునిచ్చేదిగా ప్రసిద్ధికెక్కింది. ఇదే ప్రపంచంలోని సాయి భక్తులందరినీ కల్పి ఒకే కుటుంబంగా తీర్చిదిద్దింది. అలాగే ఈనాడు సాయి ఆరాధన అత్యున్నత స్థానానికి చేరుకుంది. దాని ఉన్నతిని అడ్డుకునే శక్తి ఎవ్వరికీ లేదు.

దానికి బదులుగా ప్రతిక్షణం అది ఉన్నతోన్నత శిఖరాలకు చేరుకోవడానికే పోతోంది. అది ఒక సుడిగాలిలా మానవ జాతిని చుట్టుముట్టి, సాయి ధర్మాన్ని లేక సాయి విశ్వాసాన్ని తెలియజేసే సరికొత్త మత స్థాపనకు పునాది వేసింది. ఈ సాయి విశ్వాసమే దీనజనోద్ధరణకు నడుం బిగించింది. ఇదే నిజమైన మానవత్వానికి, ప్రేమకు, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తోంది.

ఇప్పుడు ఈ లీలకు ముగింపు పలుకుతున్నారు. బాబా ఆజ్ఞ ప్రకారం ఆ నలుగురు స్త్రీలు షిరిడి పొలిమేరల్లో జల్లిన పిండి గాలికి ఎగిరి ప్రపంచం నలుమూలలా చేరుతుంది. అలాగే కాలువలో జల్లిన పిండి కూడా నీటి ప్రవాహంతో కలిసి తద్వారా సముద్ర పర్యంతం ప్రయాణించి ప్రపంచం మొత్తం చేరినదవుతోంది. ఇంక సాయి ధర్మం విశ్వమతంగా వర్ధిల్లడానికి శ్రీసాయి సచ్చరిత్ర ఆధారంగా ఉంది. ఈ సచ్చరిత్ర సాయిభక్తులకు ఇచ్చే ఒక ఆదేశం, శాశనం. ఎందుకంటే దీని నిండా పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీసాయి బాబా నోటి నుండి వెలువడిన మాటలున్నాయి. అందుచేత సచ్చరిత్ర ఒక్కటే ప్రపంచమంతా నిండివున్న బాబా భక్తులందరూ పలుమార్లు చదువవలసిన సద్గ్రంథం.

(ఇదంతా డా॥కె.బి. గవాస్కర్ వ్రాసిన షిరిడి సాయిబాబా అనే పుస్తకంలో ఉంది)

**38**

# గురువు యొక్క గొప్పతనం

ఇది ఒక నీతి కథ. శ్రీసాయి సచ్చరిత్ర, అధ్యాయం 32లో ఉంది. ఒకసారి నలుగురు పండితులు శాస్త్ర జ్ఞానంలో ఆరితేరినవారు పరబ్రహ్మం గురించి చర్చించడం మొదలుపెట్టారు. ఈ చర్చలో వారు భగవద్గీతా సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని, ఆత్మోద్ధరణకు గాను ఎవరి మట్టుకువారు కృషి చెయ్యవలసి ఉంటుందని వారివారి అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. బాబా, ఈ నలుగురు యువ పండితుల కథను అనగా బ్రహ్మం గురించి వారి చర్చను భక్తులకు చెప్పేవారు. ఈ చర్చలో పండితులు తమకు నచ్చిన మార్గం గురించి, లేక సిద్ధాంతం గురించి, మాట్లాడుతూ ఆత్మ సాక్షాత్కారానికి వారి వాదన ఎలా సరిపోతుందో వివరిస్తున్నారు. కాని వారి వాదనలు ఒక నిర్ధిష్టమైన అవగాహనకు రాలేకపోయాయి. అందుచేత ఆ నలుగురూ దట్టమైన ఒక అడవిలోకి ప్రవేశించారు. ఆ అడవి చాలా పెద్దది కాబట్టి వారు దారితప్పి నిలబడిపోయారు.

ఆ సమయంలో వారికి ఒక వర్తకుడు తారసపడ్డాడు. దిక్కుతోచక నిలబడి వున్న పండితులను చూచి వారి సమస్య ఏమిటని అడిగాడు. వారు అతడికి సరైన సమాధానం చెప్పకుండా దాటవేసారు. అప్పుడా వర్తకుడు వారి పరిస్థితిని చూసి, ఈ అరణ్యం చాలా అభేద్యమైనది కాబట్టి, వారు ఒక మార్గదర్శి సహాయం తీసుకుంటే మంచిదని సలహా ఇచ్చాడు. కాని ఆ పండితులకి వర్తకుడిచ్చిన సలహా నచ్చలేదు. ముందుకు పోదామని నిశ్చయించుకుని మరింత లోపలకిపోయి అగమ్యగోచరంగాని పరిస్థితుల్లో నిలబడి పోయారు. వెనక్కు మరలడమే మేలనుకుని వచ్చి అంతకుముందు వారికి కనబడిన వర్తకుడిని కలిశారు. అతడు దయతో మాట్లాడుతున్నాడు. అయితే మీరు మళ్ళీ దారి తప్పేరన్నమాట చూడండి! సమస్య పెద్దదైనా లేక చిన్నదైనా ఒక మార్గదర్శి సహాయం ఎప్పటికైనా మంచిది. ఏ పనైనా మనం ఖాళీ కడుపుతో చెయ్యలేం. భగవంతుడి

ప్రమేయం లేనిదే మనం దారిలో ఎవ్వరినీ కలువలేం. ఎప్పుడైనా ఎవ్వరైనా ఆహారం కాని మంచినీళ్ళు కాని ఇచ్చినట్లైతే వద్దని చెప్పడం సరికాదు. ఎందుకంటే అవి కార్య సాధనకు శుభ సూచకాలు. ఇలా చెప్పి ఆ వర్తకుడు వారికి ఆహారం ఇవ్వబోయాడు. కాని ఆ నలుగురిలో ముగ్గురు వర్తకుడిచ్చిన ఆహారం వద్దని చెప్పి ఎటో వెళ్ళిపోయారు. ఇక వర్తకుడి దగ్గర మిగిలింది ఒక్క పండితుడు మాత్రమే. బాబా ఇంతవరకూ కథ చెప్పి ఆ మిగిలిన పండితుడిని నేనే అని, జరుగుతున్న కథ కూడా నాదే అని రహస్యం విప్పి చెప్పేరు. తిరిగి కథలోకి వస్తే, బాబా వర్తకుడి ప్రేమకు, దయకు చలించిపోయారు. అతడిచ్చిన భక్రిని తిన్నారు. వెంటనే ఆయన ముందు ఒక గురువు సాక్షాత్కరించారు. బాబాను తన శిష్యుడిగా స్వీకరించారు.

ఆ గురువు బాబాను ఒక నూతి దగ్గరకు తీసుకుని వెళ్ళారు. దాని ప్రక్కన ఒక చెట్టు ఉంది. అక్కడ బాబా పాదాలను చెట్టు కొమ్మకు గట్టిగా కట్టివేసి నూతిలోకి వ్రేళ్ళాడదీసారు. అప్పుడు బాబా తల చేతులు క్రిందకుండగా కాళ్ళు పైకి ఉన్నాయి. ఈ విధంగా నాలుగైదు గంటల కాలం గడిచింది. గురువు తిరిగి నూతి దగ్గరకు వచ్చారు. బాబాను నూతి నుండి బయటకు లాగి కాళ్ళకున్న బంధాలు తొలగించారు. ఇలా తల క్రిందులుగా ఉన్న అనుభవం ఎలా ఉందని బాబాని అడిగారు. బాబా జవాబు చెప్పారు. "నేను బ్రహ్మానందాన్ని అనుభవించాను. ఆ ఆనందాన్ని నేను మాటలతో చెప్పలేను." ఆ మాటలతో గురువు ఎంతో సంతోషించారు. వెంటనే బాబాను దగ్గరకు తీసుకుని, ప్రేమతో దేహాన్ని నిమిరారు. ఆ తరువాత గురువు బాబాను తన గురుకులంలో చేర్చుకున్నారు. బాబా ఇలా చెపుతున్నారు. ఒక పక్షి తన పిల్లలను రెక్కల క్రింద పెట్టుకుని ఏ విధంగా రక్షిస్తుందో, ఆ విధంగా గురువు కూడా నన్ను చేరదీసి నా బాగోగులను చూసేవారు. నేను చేరిన గురుకులం ఎంతో బాగుండేది. అక్కడ ఉండగా నేను నా ఆత్మీయులను కూడా మరిచిపోయేవాడిని. దానివల్లనే నాకు అద్భుతమైన నిర్లిప్తత వైరాగ్యభావన అలవాటయ్యింది. అదే మోక్షానికి దారి

తీసింది. నాలో అణగారి ఉన్న అసుర భావాలన్నీ మాయమైపోయాయి. ఆ కారణంగా సంచిత కర్మ ఫలాలు దగ్ధమయ్యాయి. అప్పుడు నా భావన ఎలా ఉండేదంటే, నేను నా గురువును ఎప్పుడూ ఆలింగనం చేసుకుని ఉన్నట్లుగానూ, ఆయన కళ్ళల్లోకే ఎప్పుడూ చూస్తున్నట్లు గాను ఉండేది. నా గురువే నాకు తల్లి, తండ్రి, ధనం, సంపద, ఇంకా నా గురువే సర్వస్వంలా ఉండేది. నా ధ్యానానికి లక్ష్యం కూడా గురువే. ఎందుకంటే నా ఇంద్రియశక్తులన్నీ ఆయనపై కేంద్రీకృతమై ఉన్నాయి. కాబట్టి గురువు తప్ప నాకు ఇతర వస్తువేదీ కనపడేదికాదు. అందుచేత చివరగా నేను చేయగల్గింది, ఆయనకు ఒక నమస్కారము మాత్రమే.

ఈ కథకు ఇప్పుడు అంతరార్థం చెపుతున్నారు. ఈ కథలో చెప్పిన నలుగురు పండితులు. నాలుగు విధాలైన సాధనా మార్గాలకు ప్రతీకలు. మొదటి పండితుడు జ్ఞాన మార్గాన్ని సూచిస్తున్నాడు. రెండవవాడు యోగ మార్గాన్ని, మూడవ వాడు కర్మ మార్గాన్ని సూచిస్తున్నాడు. ఇంక నాలుగవ పండితుడు (బాబా) భక్తిమార్గాన్ని ఎంచుకున్నారు. భగవంతుడిని చేరే విషయంలో ఎదురయ్యే కష్టాలు, బాధలు, అరణ్యంగా చెప్పబడ్డాయి. బాబా కాళ్ళకు కట్టబడిన త్రాడు గురుకృపకు సంకేతం. నూతి దగ్గర ఉన్న చెట్టు భక్తిని సూచిస్తుంది. నుయ్యి, జీవితంలో పేరుకుపోయిన కర్మఫలాల గొయ్యి. ఇంక ఆ నూతి నిండా ఉన్న నీరు సంసార సాగరం. పాంచభౌతికంగా గోచరిస్తున్న ప్రపంచం కూడా అదే.

దారిలో కనబడిన వర్తకుడు ఆధ్యాత్మిక మార్గదర్శి. అతడు ఇవ్వజూచిన ఆహారం దివ్యత్వాన్ని రుచి చూపించే పదార్థం. దాన్ని కడుపునిండా తింటే కలిగే తృప్తే, జ్ఞానం కలిగిందనడానికి నిదర్శనం. వర్తకుడు మార్గదర్శి మాత్రంగానే ఉన్నాడు కాని గురువుకాదు. అతడి ఉద్దేశ్యం జ్ఞానాన్ని రుచి చూపించడమే కాని బోధించడం కాదు. అటువంటి మార్గదర్శి కూడా గురుబోధ నందుకున్నవాడే అయుంటాడు. ఆధ్యాత్మిక లోతుల్ని క్షుణ్ణంగా పరిశీలించిన వాడైయుంటాడు. అంతేకాక గురువు

యొక్క ప్రణాళికల్ని అమలుపరచటంలో దిట్టమైన వాడై ఉంటాడు.

కాళ్ళకు కట్టబడిన త్రాళ్ళు గురుకృపకు, గురు ఆశీర్వాదానికి నిదర్శనమైతే, దానివల్ల శిష్యుడికి కల్గిన బాధగాని, ఇబ్బంది గాని, శిష్యుడిని ఆనందపూర్వకమైన నిర్లిప్తత స్థితికి చేరవేసే వరమనే భావించవలసి వస్తుంది. ఇదే ప్రకారం గురువులిచ్చిన అనేక శాపాలు శిష్యుల పాలిట వరాలుగా మారిన పరిస్థితులు మనకు కనపడుతూ ఉంటాయి. నిర్లిప్తత (detachment) అన్ని సాధకుల్ని సంసారబాధలు అంటుకోకుండా రక్షిస్తుంది. తామరాకు మీద నీటి బొట్టులా సంసారానికి తగులుకోకుండా సంసారం చేస్తూ ఉంటాడు. ఈ నీతికథలో భక్తి అనబడే చెట్టుకి శిష్యుడిని కట్టివేసిన గురుకృప అనే త్రాడు చేతనే అతడికి వైరాగ్యం సంభవించింది. ఇటువంటి వైరాగ్యభావనలో ఆత్మానందాన్ని రుచి చూసిన సాధకుడినే గురువు శిష్యుడిగా ఎంచుకుని తనతో పాటుగా ప్రయాణం సాగించమని చెప్తాడు. చివరకు అతడు గమ్యాన్ని చేరి మోక్షాన్ని గ్రహించేటంత వరకూ గురు అనుగ్రహం తోడుగా నిలుస్తూనే ఉంటుంది.

(ఈ వ్యాఖ్యానమంతా దిలీప్ పవార్ గారి చేత వ్రాయబడిన మరాఠీ భావార్థ శ్రీసాయి సచ్చరిత్రలో ఉంది)

# రెండవ భాగం - ముగింపు

ఈ విధంగా సాధకుడి యొక్క ఆధ్యాత్మిక ప్రయాణం, అనేక అవాంతరాలను దాటుకుంటూ షిరిడీ దిక్కుగా సాగింది. ఈ ప్రయాణంలో సాధకుడికి భగవంతుని కృపవల్ల తనలోని దైవీశక్తులైన ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు బాసటగా నిలిచాయి. అంతేకాక అతడి అంతఃకరణ చతుష్టయం కూడా దైవప్రేరణ చేత పరిణితి చెంది సహకరించింది.

అయితే ఈ ప్రయాణం నడచిన తీరు తెన్నులు పరిశీలిస్తే, సాధకుడుకి లక్ష్యసాధనలో తోడ్పడినవి, బాబా పదకొండు వాగ్ధానాలు, పదకొండు మెట్లు, పదకొండు రంగాలు. సాధకుడు వీటన్నింటిని బాబా కృపవల్ల అధ్యయనం చెయ్యడానికి తగిన అర్హతలను సంపాదించుకుని, బాబా మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించ గలుగుతాడు. దీనివల్ల అతడికి లోతైన ఆధ్యాత్మిక రహస్యాలు అవగాహనకు వస్తాయి. దానివల్లనే బాబా వాగ్ధానంలోని ప్రతిపదాన్ని విడదీసి, దాని పరమార్థాన్ని మనసుకు పట్టించు కుంటాడు. పాఠకుడికి ఈ పాటికి ఒక విషయం బాగా అర్థమయ్యే ఉంటుంది. అదే ఒక్క వాక్యార్థాన్నే పట్టుకుని తృప్తి పడక, లోతైన భావార్థాన్ని గ్రహించటానికి శ్రమించాలి. అప్పుడే షిరిడి యాత్ర సంపూర్ణమవుతుంది.

పై వివరణ వల్ల మనకు తెలిసిందేమిటంటే మన ఆధ్యాత్మిక ప్రయాణం బాబా మొదటి వాగ్ధానంతో మొదలవుతోంది. “మీ పాదాలు షిరిడీనేలను ఎప్పుడు తాకుతాయో, అప్పుడే మీ బాధలన్నీ అరికట్టబడుతున్నాయి.” అలాగే పదకొండవ వాగ్ధానం ఇలా ఉంది. “ఎవరైతే అమితమైన భక్తి యోగాన్ని సాధన చేస్తారో, ఎవరికైతే నా పాదాల దగ్గర చెక్కుచెదరని విశ్వాసాన్ని స్థిరపరచుకొనే బుద్ధి ఉంటుందో, ఎవరు ఎడతెగని సాయి నామజపం చేస్తారో, ఎవరిలో అయితే ఇసుమంతైనా భేదభావం కనపడక నాతో ఏకత్వాన్ని సాధించే సంకల్పం కలుగుతుందో, అట్టి వారు నా యొక్క సంపూర్ణ కృపను ఆశీస్సులను పొందిన వారగుతున్నారు.” ఈ విధంగా మన

షిరిడి ప్రయాణంలో మొదటి భాగం బాబా పాదాల చెంతకు చేరి ముగుస్తుంది.

ఒకసారి మనం గట్టిగా భగవాన్ సాయినాథుని పాదాలను మన మనస్సులో ప్రతిష్ఠించుకోగలిగితే అమృత తుల్యమైన ఆయన కృపను, ఇంద్రజాల మహిమ కల్గిన ఆయన చిలుం గొట్టం నుండి కాని, ఆయన పెదవుల నుండి గాని పొందటానికి అర్హులమవుతాము. ఇంకా బాబా వేసిన ప్రశ్నలు, ఎక్కడ నుండి నువ్వు వచ్చావు? మొదలైనవి మన ఆలోచనలను మనస్సులోతుల్లోకి తీసుకువెళతాయి. దాంతో నేను ఎవరు? అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఆ విధంగా ప్రయాణంలో రెండవ భాగం మొదల వుతుంది. బాబా పలికిన ప్రతిమాటను శబ్ధపరంగానే కాక అర్థపరంగా వెతకడానికి పూనుకుంటాము. దానివల్లనే మనకు తెలియని నిజాలు కొన్ని బయటపడుతూ ఉంటాయి.

బాబా, రాధాకృష్ణమాయి, స్వామి సాయి శరణానందల అడుగు జాడల్లో నడిచిన వారికి బాబా జ్ఞాన సంపద నుండి ఆణిముత్యాల్లాంటి అనుభవాలు వస్తూనే ఉంటాయి. ఇటువంటి అమూల్యమైన జ్ఞాన ధనరాశుల్ని మన హృదయాల్లో పదిలంగా భద్రపరచుకోవాలి. అంతేకాక వాటి విలువల్ని నిజ జీవితంలో ఆభరణాల మాదిరి ధరించి (పాటించి) బ్రతకాలి. మన ఈ ప్రయాణంలో అడుగడుగునా గురువు కోసం వెదుకుతూనే ఉన్నాం. గురువు యొక్క గొప్పదనాన్ని పెద్దల నుండి గ్రహిస్తూనే ఉన్నాం. ఇంకా ఎంతో ఆశతో గురువు మనల్ని సాకాలని, మనల్ని ఆశీర్వదించాలని కోరుకుంటూనే ఉన్నాం.

"బాబా! దయచేసి మాకు కరావలంబం ఇవ్వండి. ప్రతి జన్మలోనూ మాతో కలసిఉండి, ఈ ప్రయాణం శుభప్రదమై మీ దివ్యధామాన్ని మేము చేరేటట్లు అనుగ్రహించండి.

**శుభం**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

శీ సాయినాధుని "ఏకాదశ సూత్రములు" ప్రతి భక్తుడు మనసులో పదిలముగ దాచుకొనును. ఇవి విశ్వమంతయు ఉదహరింపబడుచున్నవి మరియు పాడబడుచున్నవి.

ఈ పుస్తకము ప్రధమ భాగమున ఈ ఏకాదశ వచనముల యొక్క వాస్తవమైన మరియు గూఢమైన అర్ధములు యివ్వబడియున్నవి. శ్రీ సాయి సచ్చరిత్ర నుండి లీలలు మరియు పద్యములు వీటితో పరిపూరితమై యున్నది. ఈ పుస్తకము రెండవ భాగము సాయిబాబా జ్ఞాన రత్నములను ప్రతిపాదించుచున్నది. రాధాకృష్ణమాయి "శాల" కేంద్రముగ వుండెను. బాబా పెక్కు భక్తులను "శాల"కు పంపుచుండిరి. మాయి ప్రతి భక్తునికి గురుసేవ చేయుటను బోధించి ప్రవర్ధమానము చేయుచుండెను. సాయిబాబా మరియు మాయి, స్వామి శరణానందులతో ప్రతిరోజూ జరిపిన సంభాషణలు "ఆత్మ విచారణము"నకు మరియు అనుభవము గడించుటకు వొక పద్ధతి నేర్పరచెను.

ఈ పుస్తకము వొక "నీతి గ్రంధము మరియు ఆధ్యాత్మిక దిక్సూచి". ఇది మనలను శిరిడీకి కఠినమైన ప్రయాణమును సులభము చేసి మరియు చివరకు "సమర్ధ సద్గురు సాయినాధుని" పాదారవిందములను చేరుటకు సహాయపడును.

ఈ పుస్తకము సాయిబాబా సూక్తులు మరియు బోధనల కూర్పు. భక్తులు బాబాతో ప్రతిస్పందించునపుడు, వారికి కలిగిన అనుభవములు, ప్రధానాంశములుగా యిందు పేర్కొనబడియున్నవి. సాయిబాబా తన భక్తుల జీవితములలో నేరుగా జోక్యం కలుగజేసికొని, చిన్న చిన్న పిట్ట కథలు, నీతి బోధల ద్వారా, వారు ఆధ్యాత్మికముగ యెదుగుటకు సహాయపడిరి. భక్తులు శాస్త్రీయమైన మరియు ఆధ్యాత్మిక భావములు/బోధలు, అర్థము చేసికొనుటకు, సాయిబాబా ప్రేమను మరియు హాస్యమును ఉపయోగించెడివారు. సాయిబాబా యొక్క భావములు/ బోధలు, భక్తులు వారి నిత్య జీవితములలో గడించెడి అనుభవములలో తెలియవచ్చెడివి. భక్తులు, బోధ పద్ధతిలో తాము నేర్చుకొనుచన్నామను భావన చెందలేదు. బోధయనగా ఉపదేశము లేక అనుభూతి మరియు పద్ధతి యనగా గ్రంథములలో సూచించిన వాటిని అనుసరించుట లేక ఆచార సంబంధిత విధులు. విన్ని చిట్లూరి అరవంగాడు, (నీలగిరి)లో జన్మించిరి. మధ్యప్రదేశ్‌లోని జబ్బల్‌పూర్‌లో విద్య గడించిరి. ఢిల్లీలో వున్న సరెన్ హాస్పిటలులో శిశు వైద్యమును గూర్చిపై చదువులు చదివిరి. తరువాత ఆమె అమెరికాకు పయనించిరి. అచ్చట వైద్య శాస్త్ర పరీక్షలో ఉత్తీర్ణులైరి అమెరికన్ అకాడమి శిశు చికిత్సలో నిపుణురాలు యను బిరుదును గడించిరి.

అమెరికాలో నివసించునపుడు, తన కుటుంబములో గల కర్మ బంధములను గురించి చింతింపనారంభించెను. ఈమె తండ్రి సాయిబాబాను పూజించుచుండెను. కావున ఈమె కూడా చిన్న ప్రాయము నుండి సాయిబాబాను సేవించుచుండెను. సాయిబాబాను 60 సం॥లు సేవించెను. ఈమె సాయిబాబాను మంచి స్నేహితుడు యను భావనతో పరిగణించుచుండెను. ఎందులకనగ, ఈమె ఏ కార్యమును చేసినను, సాయిబాబా ఈమె యెడ అనురాగము చూపుచుండెను.

ఈమె వైద్య వృత్తి నుంచి 50వ సం॥న విరమించి, 1994 సం॥న శిరిడీకి వచ్చి స్థిరపడెను. సాయిబాబాను గురించి ఎక్కువగ తెలిసికొనుటకు ప్రయత్నించుచుండెను. సాయిబాబాను గూర్చి ఎంత తెలిసికొన్నను, యింకను తాను అజ్ఞానిగానే వుండుటకు గ్రహించెను. ఆహా, అతి గూఢమైన భగవంతుడగు, సాయిబాబాను గురించి కొంచెము తెలిసికొన వలెనన్నను, ఆమె పెక్కు జన్మలు పొందవలెను. కాని ఆమె అన్వేషణము యింకను కొనసాగుచునే యున్నది.